# నల్లంచు-తెల్లచీర

**-యండమూరి వీరేంద్రనాథ్**

**ప్రొలోగ్ : 1971.**

**మే నెల, విజయవాడ.**

**మధ్యాహ్నం 12-45.**

**సత్యనారాయణపురం.**

**"చీరలు....చీరలు....పిఠాపురం, ధర్మవరం చేనేత చీరలు".**

ఓ కుర్రవాడు గొంతు పగిలేలా అరుస్తున్నాడు. అతడికి పధ్నాలుగు నుండి పదహారు మధ్య వయసుంటుంది. వాడి నెత్తి మీద మూట వుంది. తెల్లగా సన్నగా వున్నాడు. ఇంకా మీసాలు (కూడా) సరిగ్గా రాలేదు.

"చీరలమ్మా చీరలు..... నారాయణపేట నేత చీరలు...." అతడితోపాటే నడుస్తూన్న మధ్యవయస్కుడు మధ్య మధ్యలో తనూ గొంతు కలుపుతున్నాడు. అతడు వయసుకన్నా ముసలిగా కనపడుతున్నాడు. బలహీనంగా వున్నాడు. అతడి తలమీద కూడా చిన్న మూట వుంది.

బరువుతో చాలాసేపట్నుంచీ నడుస్తూ వుండటంవల్ల ఇద్దరి తలల మీదనుంచీ చెమట ధారాపాతంగా కారుతూంది. బరువు కృంగతీస్తున్నా గుండెల్లో శక్తినంతా గొంతులోకి తీసుకుని అరుస్తున్నారు ఇద్దరూ.

"అమ్మా చీరలు కావాలా?" ఓ ఇంటిముందు నిలబడి అడిగారు.

"చెయ్యి ఖాళీ లేదు వెళ్ళు" లోపల్నుంచి వినబడింది.

"చీరలమ్మా శుద్ధమైన నేత చీరలు....." బిచ్చగాళ్ళం కాదు అన్న బాధ ధ్వనించేటట్టు అన్నాడు ముసలివాడు.

ఆవిడ బయటకొచ్చి "నెలాఖర్లో చీరలేమిటి? ఇప్పుడుకాదు" అని తలుపు వేసేసింది.

మళ్ళీ నడక.

పైన ఎండ మాడ్చేస్తూంది. చెప్పుల్లోంచి ఆవిర్లు పైకి తంతున్నాయి. ఎండకి భయపడి రోడ్డుమీద మనుషులు కూడా ఎవరూ లేరు. దూరంగా రైల్వే ట్రాక్ మీద ట్రైన్ పెద్ద శబ్దం చేసుకుంటూ వెళుతూంది. "లాభం లేదురా అబ్బీ, ఈ పట్నంలో ఎవరూ మన చీరలు కొనరు. సాయంత్రం పూట అద్దాల మధ్య కొనటానికి షాపుల కెళతారుగానీ, మన దగ్గర ఎవరు కొంటార్రా?"

కుర్రవాడు మాట్లాడలేదు.

"ఇక నేను నడవలేనురా గొంతు ఆర్చుకుపోతోంది."

వీధి పంపులో ఒక్కో చుక్కనీరు పడుతూంది. వాటితో నోరు తడుపుకుని చిన్న ఇంటిముందు అరుగుమీద కూర్చున్నారు.

"పల్లెటూర్లోనే బావుండేదిరా. రోజుకో చీరన్నా అమ్ముడుపోయేది" నిస్త్రాణగా అన్నాడు. కుర్రవాడు దీనిక్కూడా సమాధానం చెప్పలేదు.

బయట అరుగుమీద మాటలు వినిపించి 'ఎవరదీ' అని ఒకావిడ వచ్చి వీళ్ళని తొంగిచూసి లోపలి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం వేళే కాబట్టి ఇరుగమ్మలు-పొరుగమ్మలు ఆ ఇంట్లోనే చేరినట్టున్నారు. నలుగురూ కలిసి, అక్కడలేని అయిదో ఆవిడ గురించి మాట్లాడుకుంటున్నారు.

"ఎవరో బట్టలవాళ్ళమ్మా" చూసి వెళ్ళినావిడ చెపుతోంది. లోపల సంభాషణ దానిమీదకు మళ్ళింది.

"వీధిలోకి వచ్చేవాళ్ళ దగ్గర చీరలు అసలు కొనకూడదట. మొన్న మా ఆడపడుచు చెప్పింది. ఒకే రకం చీరలు వాళ్ళ దగ్గర రెండేసి వుంటాయట. మొదటి చీర చూపించేటప్పుడు బాగానే అయిదు మీటర్లుంటుంది. చూపించింది నలిగిందంటూ మడత విప్పని మరో చీర అదే డిజైన్ ది తీసుకుని, అతడు వెళ్ళిపోయాక విప్పి కట్టుకుందామనుకుంటే ఆ చీర రెండున్నర మీటర్లు, మూడు మీటర్లు మినహా ఎక్కువ వుండలేదట-"

"అప్పటికి వాడి అడ్రస్ కూడా వుండదు."ఇంకో ఆవిడ అందించింది. ఇద్దరు ముగ్గురు నవ్వినా ధ్వని- "అసలు వీళ్ళందర్నీ పోలీసులకి పట్టించాలండీ."

అరుగుమీద కూర్చున్న కుర్రవాడి మొహం ఎర్రగా మారింది. అసలే ఎండవల్ల కంది వున్నదేమో- మరింత స్పష్టంగా అది కనపడుతోంది. తల పక్కకి తిప్పి మేనమామవైపు చూశాడు. ఆ ముసలతను అప్పటికే కళ్ళు మూసుకున్నాడు. ఈ మాటలకి కళ్ళు తెరిచాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

"ఒరేయ్! మన ఊరు వెళ్ళిపోదాంరా పదిరూపాయలొచ్చేట్టు ఒక చీర అమ్మినా చాలు. ఇక్కడ అదీలేదు."

కుర్రవాడు ఓడిపోయినట్టు తలొంచుకున్నాడు. మేనమామ వద్దంటున్నా బలవంతంగా బయల్దేరతీసింది అతడే. దాదాపు పది సంవత్సరాల్నుంచీ ఆ పల్లెటూల్లో ప్రతీ సందూ తిరిగారు. అన్నేళ్లనుంచీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు వుండిపోయింది. ఏదో ఒకటి చెయ్యాలి. ఫలితమే ఈ ప్రయాణం!

కేవలం తనమాట తీసెయ్యలేక తనతోపాటూ పట్నంవచ్చిన మావని ఆ కుర్రవాడు జాలిగా చూశాడు. పెద్దాయన చెప్పిన మాటలు కూడా నిజమే అనిపించాయి. అద్దాల గదుల్లో కల్తీ చీరలు కొనటానికి అలవాటుపడిన వాళ్ళు ఈ నాణ్యతని ఎలా గుర్తిస్తారు?

"మావయ్యా! నువ్విక్కడే పడుకో ఎండ ఎక్కువగా వుంది. నేనో రెండు వీధులు తిరిగొస్తాను."

మగతగా కళ్ళు విప్పాడు ముసలాడు. "ఒరేయ్ ఇక్కడ నొప్పిగా వుందిరా" అంటూ కడుపుపైన రొమ్ము దగ్గిర చూపించాడు. ఆ కుర్రవాడు అతడి ఒంటిమీద చెయ్యివేస్తూ, "ఒళ్ళు కూడా వేడిగా వుంది మావయ్యా! వడదెబ్బ తగిలినట్టుంది. నీడనే పడుకో- నేను ఓ గంటలో వస్తాను. నీ మూట జాగ్రత్త" అన్నాడు. ముసలాడు తిరిగి కళ్ళు మూసుకుంటూ, 'వెళ్ళిరా' అన్నట్టు తలూపాడు.

కుర్రవాడు తలమీద తన మూట పెట్టుకుని సాగిపోయాడు.

* * *

"చీరలూ - చీరలూ - నారాయణపేట చీరలు - స్వంత మగ్గాల మీద నేసిన చీరలమ్మా..."

అరగంట నుంచీ అరుస్తూ తిరుగుతున్నాడు. ఒకళ్ళిద్దరు పిలిచి చూశారు. ఏదో ఉబుసుపోక చూసినట్టు ఓ పది నిముషాలు చూసి పంపించారు తప్ప కొనే ఉద్దేశ్యం వారిలో కనబడలేదు.

ఆ కుర్రవడిలో కూడా శక్తీ ఓపికా నశించాయి. బాగా ఆకలేస్తూంది. తెచ్చిన డబ్బులు కూడా క్రితంరోజే అయిపోయాయి. పళ్ళబిగువున నిస్సత్తువ. అదిమిపెట్టి అరవసాగాడు. కొంచంసేపటికి అరవటానికి కూడా శక్తి మిగల్లేదు.

కొమ్మూరి వేణుగోపాల్రావు క్లినిక్ పక్కనుంచి సందులోకి తిరిగి, మూలమీదున్న కిళ్ళీషాపులో ఓ సోడా తాగాడు. కాస్త సత్తువ వచ్చినట్టుంది. దూరంగా ఎవరింట్లోంచో సుమన్ కళ్యాణ్ పూర్ గజల్ వస్తూంది. చాలా నెమ్మదిగా-మంద్రస్థాయిలో....

"షరాబీ.... షరాబీ....
ఏ సావన్ కి మోసమ్-
గులాబీ.... గులాబీ... ఏ పూలోంకె చెహరే-
కుచ్ ఐసీ బహారాగయీా హై చమన్ మే
ఏమెహకీ నషిలీ హవవోంకి పరిచయ్
ఖూబ్ సూరత్ నహోతా-అగర్ ఇస్ మె
రంగే మొహబ్బత్ నహోతా"

(మత్తుగొలిపే వర్షాకాలపు సాయంత్రం....అందమైన గులాబీ పూలతోట మీదనుంచి వచ్చే పిల్లగాలి పరిమళం....ఏదీ అందంగా వుండదు. వీటిలో ప్రేమ తాలూకు కొసమెరుపు లేకపోతే!)

ఆ కుర్రవాడు తన చీరల అమ్మకం గురించి కూడా మర్చిపోయి ఆ పాట తాలూకు అందాన్నీ అర్థాన్నీ ఆస్వాదిస్తూ అలాగే పాత పూర్తయ్యేవరకూ వుండిపోయాడు. తెలంగాణలో పెరగటం వల్ల అతడికి హిందీ బాగా తెలుసు. అది కూడా పూర్తి కారణం కాదు. చీరలకీ భావుకతకీ దగ్గిర సంబంధం వుంది.

.....అతడు నేసిన చీరలకి అంచులు కత్తిరించేవాడు. ఒకోసారి చీరలకి ప్రింటింగు కూడా చేయవలసి వచ్చేది. నేతమీద అతడి వేళ్ళు అపురూపంగా జారేవి. నూలుని ముట్టుకోకుమ్మనే కొమ్ము చెప్పగలిగేవాడు. నారాయణపేటలో వృద్ధులు కూడా ఆ కుర్రవాడి పనితనానికి అబ్బురపడేవారు. పదో తరగతి తెలుగు మాస్టారంటే అతడికి చాలా అభిమానం - క్లాసులో ఒకసారి ఆయన రాజస్థాన్ గురించి చెప్పాడు.

"రాజస్థాన్ లో 'మల్వోరీ' అనే ప్రాంతం పెళ్ళి చీరలకు ప్రసిద్ధి! అక్కడ ఒక్కొక్క చీరని ఒక్కరే పూర్తిగా నేస్తారుట. ఒక పెళ్ళి చీరెను నేస్తూ ఆ చీరె ఏ పెళ్ళికూతురి ఒంటిని అలరిస్తుందో ఊహించుకుంటూ, తన పెళ్ళి గురించి కలలుకంటూ, ఒక్కో కన్నెపిల్లా కూనిరాగాలు తీస్తూ చీరను పూర్తిచేసింది. ఆ పాటలని 'లోరీ' లంటారు. పూర్తిగా ఒక కన్నెపిల్ల చేతిమీద తయారయిన ఆ రాజస్థాన్ చీరెలు దేశంలో ఎంతో ప్రసిద్ధి...."

పదో తరగతి ప్రధమ శ్రేణిలో పాసయినప్పుడు- తను స్వయంగా నేసిన చీరనే మాస్టారింటికి తీసుకువెళ్ళి ఇచ్చాడు. మబ్బు రంగుమీద మల్లె అంచు ఎవరి హృదయాన్నైనా యిట్టే ఆకట్టుకుంటుంది. దాన్ని చూసి మాస్టారు గారి భార్య ఎంతో మురిసిపోయింది. "ఇప్పుడెందుకురా ఇవన్నీ-" అన్నారు మాస్టారు మందలిస్తున్నట్టు. "నేనూ నా భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ఈ చీరె నేసాను మాస్టారూ" పైకి అనలేదు, అతడు - మనసులో అనుకున్నాడు.

"చాలా బావుందిరా" అంది ఆయన భార్య చీరని చేతుల్లోకి తీసుకుంటూ. కుర్రవాడు నవ్వి తల దించుకున్నాడు. మళ్ళీ ఆవిడే అంది- "ఒరేయ్! నీ పనితనం చూస్తూంటే ఎప్పటికయినా నువ్వు గొప్పవాడివి అవుతావని అనిపిస్తుందిరా."

వింటూన్న మాస్టారు ఆ కుర్రవాడివైపు సానుభూతితో చూశాడు. కాపిటలిస్టుల కబంధహస్తాలు నారాయణపేట కార్మికుల హస్తనైపుణ్యాన్ని కబళించినంత కాలమూ గొప్పవాడు అయ్యే ప్రసక్తి లేదని అతడికి తెలుసు. "నేను పదోక్లాసు పాసవటానికి మాస్టారు కారణమమ్మా ఇంతకన్నా పెద్దది యిచ్చుకోలేను."

"అంత మాటనకురా. నువ్వింకా చదవాలి. ఎంత కష్టపాడయినాసరే! శలవుల్లో ఇక్కడికేరా రోజూ ఓ గంట చదువు చెపుతాను."

"శలవుల్లో పట్నం వెళ్ళామనుకుంటున్నాం మాస్టారూ. ఈ పల్లెల్లో ఎంత అమ్మినా ఏముంది! నాలుగు చీరలు పట్నంలో అమ్మగలిగితేచాలు."

"పట్నంలో ఈ చీరలు ఎవరు కొంటార్రా?"

"దిగితేగానీ లోతు తెలీదుగా మాస్టారూ."

మాస్టారు ఆ కుర్రవాడివైపు చిత్రంగా చూసేడు. ఆయన చూపుల కందని లోతేదో ఆ కుర్రాడి మొహంలో కనపడింది.

"ఒకవైపు చదువుకుంటూ మీ మావకి ఇంత సాయం చేస్తున్నావంటే నిన్ను కన్నవాళ్ళెవరో గానీ చాలా అదృష్టవంతుల్రా."

"ఒక్క చదువేకాదు వీడు బాగా పాడతాడు కూడా. ఒరేయ్ అమ్మగారు వింటారు ఒక పాత పాడరా."

రెండోసారి అడిగించుకోకుండానే ఆ కుర్రవాడు తలదించుకుని నెమ్మదిగా పాడటం ప్రారంభించాడు. ఆ హిందీ పాత అర్ధం గమ్మత్తుగా వుంది.

"వెన్నెల్లో కూర్చుని భావాన్ని నేస్తే-
పాట చీర తయారైంది.
జరీ పల్లవికి చరణం అంచు - రంగు పొగమంచు.
పై పైకి రాకు సూర్యుడా! పొద్దంటే మాకు చేదురా!
కంటిచూపు చీర కట్టాలి ఒంటిని
కంచిపట్టు చీర జారాలి నేలని.
వేళ్ళు నేసే నేతకి - కుచ్చిళ్ళు పాడే పల్లవి.

తుఫాను రేగే ముందర - ముస్తాబులేల దండగ."

మాస్టారుగారి భార్యకి అర్థంకాలేదు. పాటలోనూ, గొంతులోనూ వున్నా మాధుర్యాన్ని ఆస్వాదించింది. అంతే మాస్టారు మాత్రం ఈ అద్భుతమైన భావానికి విస్మయం చెందారు.

"ఎవర్రాశార్రా ఈ పాటని?"

ఈ కుర్రవాడు మరింత సిగ్గుతో తల వంచుకుని "నేనే మాస్టారూ" అన్నాడు. ఆయన కన్నార్పకుండా అతడివైపు చూశాడు. యవ్వనం క్రమక్రమంగా తొంగి చూడటానికి ప్రయత్నిస్తూన్న మొహంలో అమాయకత్వం పారిపోకుండా వుండటానికి ఆఖరి యుద్ధం చేస్తూంది. బుగ్గమీద చిన్న మొటిమ ఉద్భవించిన మొదటి సైనికుడిలా వుంది.

'ఇతడి పూర్వీకులెవరో గొప్ప కవులో గాయకులో అయివుంటారు. లేకపోతే అంత భావాన్ని ఇంత చిన్న పదాల్లో ఇరికించే నేర్పు ఇంత చిన్న వయసులో ఈ కుర్రవాడికి రాదు' అనుకున్నారాయన. ఆయనకి తెలీదు-

చీర నేసేవాడికి ఆడవాళ్ళ హృదయం అద్దంలా చదివే నేర్పుండాలనీ - ఏ రంగుమీద ఏ అద్దకం అందం యిస్తుందో తెలుసుకోవాలంటే యే పువ్వు ఏ భావానికి అర్థమో చెప్పగలిగే భావుకత్వం వుండాలనీ, అది కుర్రవాడిలో ఒక పిసరు ఎక్కువేవుందనీ - అందుకే ఆ కుర్రవాడికి -

చీర నేసే కళతోపాటు, ఏ చీర ఎవరికీ నప్పుతుందో చెప్పగల అద్భుతమైన వరాన్ని కూడా దేవుడు ప్రసాదించాడని.

..........

రేడియో పాట పూర్తయింది. ఆ కుర్రవాడు తెప్పరిల్లి అక్కన్నుంచి కదిలాడు. అయితే ఈసారి అతడు చీరలు చీరలని అరవలేదు. అందువల్ల ఏమీ లాభం లేదని తెలిసిపోయింది.

ఒక పెద్ద భవంతి - ముందు తోట ఉన్నాయి. గేటు తెరిచే వుంది. గేటు దగ్గిర ఎవరూలేరు. నేరుగా లోపలి ప్రవేశించాడు.

దారి కిరువైపులా చెట్లు గాలికి వూగుతున్నాయి. పూలు అందంగా కదులుతున్నాయి. ఆ ఇల్లు ఎమ్మెల్యేగారిది. కానీ మిట్ట మధ్యాహ్నాం అవటం వల్ల బయట నిర్మానుష్యంగా వుంది.

* * *

ఎమ్మెల్యేగారి భార్య విసుగ్గా అటూ ఇటూ పచార్లు చేస్తూంది. ఇంకొక నలభై ఏళ్ళావిడ ఆవిడనే చూస్తూంది. ఆవిడో డాక్టరుగారి భార్య. ఆవిడ చాలా ఇబ్బందిలో ఉన్నట్టు కనపడుతూంది. దానికి కారణం కూడా వుంది. ఆ సాయంత్రం 'మిస్ విజయవాడ' ఎన్నిక జరుగుతూంది. దానికి ఆమె ముగ్గురు జడ్జీల్లో ఒకరు.

అంతవరకూ బాగానే వుంది.

వచ్చిన చిక్కల్లా, ఎమ్మెల్యేగారి కూతురు ఆ పోటీల్లో పాల్గొనటంతోనే వచ్చింది.

ఎమ్మెల్యేగారి భార్య తన కూతురు ఎలాగైనా ఈసంవత్సరం 'మిస్ విజయవాడ'గా ఎన్నికవ్వాలని పట్టుబట్టి కూర్చుంది. డాక్టర్ గారి భార్యకి ఆ విషయం కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పింది.

తనొక్కతే జడ్జీ అయితే అసలు పోటీ అని కూడా చూడకుండా ఆమె బహుమతి ఇచ్చేదేగానీ, ఆమెతోగానీ, ఆమెతోపాటు మరిద్దరు న్యాయనిర్ణేతలున్నారు. అందులో ఒకామె మరీ స్ట్రిక్టు.

"నేను నూటికి నూరు మార్కులిచ్చినా, మిగతా ఇద్దరివీ కలిపి మొత్తం ఎవరికెక్కువ వొస్తే వారికిస్తారు బహుమతి" అంది డాక్టర్ గారి భార్య.

"......మిగతా ఇద్దరూ కనీసం యాభై వేస్తేగానీ ఫస్టు ప్రైజ్ రాదు."

అప్పుడు ప్రారంభమయింది ఇంట్లో రిహార్సిల్.

రకరకాలుగా కూతురి బొట్టుమార్చి, కట్టుమార్చి, హెయిర్ స్టయిల్ మార్చి, మరింత మేకప్ చేసి తీసుకొచ్చి చూపిస్తోంది కానీ డాక్టర్ గారి భార్యకి అది నచ్చటం లేదు. ఎలా మార్చి తీసుకొచ్చినా, "ఇలా అయితే వాళ్ళు యాభై వెయ్యరు" అంటోంది. గంటనుంచీ ఇదే తతంగం జరుగుతుంది.

ఎమ్మెల్యేగారి కూతురు అంద వికారేమీ కాదు. కానీ మిస్ విజయవాడగా ఎన్నికవ్వాలంటే అదేమీ సులభమైన విజయంకాదు. పాపం ఆ అమ్మాయి కూడా ఓపిగ్గా రకరకాలుగా స్టయిల్స్ మారుస్తూ గంటనుంచీ తిప్పలు పడుతోంది. సరిగ్గా అప్పుడు వినిపించింది బయట్నుంచీ 'అమ్మా' అన్న కేక.

* * *

ఎమ్మెల్యేగారి భార్య బయటకొచ్చి మెట్లమీద నిలబడి వున్న కుర్రవాడిని చూసి, "ఎవరూ" అంది.

"ఎండ మండిపోతోందమ్మా కాస్త మంచి నీరిప్పిస్తారా" అని అడిగాడు. ఆవిడ ఏమనుకుంటుందోగాని, లోపలికి తిరిగి, "ఒరేయ్ రాముడూ ఈ అబ్బాయికి నీళ్ళు కాస్త తెచ్చివ్వు" అంది.

ఆవిడ లోపలికి వెళ్ళిపోబోతూంటే "మంచి చీరలున్నాయి.....చూస్తారా అమ్మా" అని అడిగాడు.

"అవునమ్మా స్వంతంగా నేసినవి....."

నేత చీరలనగానే ఆవిడలో ఇంటరెస్ట్ పోయినట్టు స్పష్టంగా కనిపించింది. "ఇప్పుడు ఖాళీ లేదు. వెళ్ళు" అంది, ఇంతలో లోపల్నుంచి ఆవిడ కూతురొచ్చింది.

కృత్రిమ వేషధారణలో వున్న ఆ అమ్మాయిని చూడగానే ఆ కుర్రవాడు అదోలా ఫీలయ్యాడు. ఆమె మేకప్ చాలా అసహజంగా కనిపించింది. ఆ అమ్మాయి వయసు అతడికన్నా అయిదారు సంవత్సారాలు ఎక్కువ వుంటుంది. కాని మేకప్ వల్లా, హెయిర్ స్టయిల్ వల్లా మరో మూడు నాలుగు సంవత్సరాలు ఎక్కువ వయసున్నదాన్లా కనిపిస్తూంది.

తన కూతుర్ని చూడగానే ఆ చీరలమ్ముకునేవాడి మొహంలో కనపడిన ఆశ్చర్యాన్ని ఆవిడ మరోలా అర్థం చేసుకుని-

"ఈ రోజు 'మిస్ విజయవాడ' పోటీ వుంది. అంటే అందాల పోటీ అన్నమాట" అంది కాస్త గర్వంగా.

అప్పుడతడు మరింత పరీక్షగా ఆ అమ్మాయివైపు చూశాడు.

నేతని చూడగానే గుణం కనిపెట్టగలిగే కళ్ళు అతనివి! అంచు క్రింద కాళ్ళనిబట్టి పై శరీరచ్ఛాయని అంచనా వేయగలిగే నేర్పున్న కళ్ళు!! ఆ అమ్మాయి సహజమైన అందాన్ని ఎక్కడో ఏదో లోటు పాడుచేస్తూంది- అని గ్రహించటానికి అతడికి అరక్షణం కన్నా తక్కువ పట్టింది.

ఈ లోపులో ఆ అమ్మాయి విసుగ్గా, "మమ్మీ! ఇక నేనీ వేషాలు మార్చలేను. ఎన్నిసార్లు మార్చినా ఆంటీకి నచ్చటంలేదు.

నాకు ప్రైజ్ రాకపోయినా ఫర్లేదు" అంది.

"అదేమిటమ్మా పద నేను అడుగుతాను" అందావిడ లోపలికి కూతురితో సహా వెళ్తూ.

ఆ కుర్రావాడు వెనుకనుంచి "అమ్మగారూ" అన్నాడు.

"ఇప్పుడు మాకు చీరలేమీ అక్కర్లేదయ్యా".

"చీరల గురించి కాదమ్మా."

"మరి?"

"మీ అమ్మాయి కట్టుకున్న చీర ఆ ఒంటికి నప్పలేదమ్మగారు."

ఆవిడ మొహంలో ఆశ్చర్యం కనిపించింది. "అంటే.....? నీ చీర కట్టుకుంటే బావుంటుందంటావా?" ఎగతాళిగా అంది.

"కాదమ్మగారు బరువైన చీరెలు చూడటానికీ కొనటానికీ బావుంటాయి తప్ప, కట్టుకుంటే లావుగా కనిపించేట్టు చేస్తాయి."

ఆ మాటలకి వెళ్ళబోతున్న అమ్మాయి ఆగింది. అంతదూరం నుంచే తన చీర బరువు గురించి అతడు ఎలా కనుక్కున్నాడా అని ఆమె ఆశ్చర్యం చెందింది. అందులోనూ అంత చిన్న కుర్రవాడు.....

"గులాబీరంగు చీర.....ఇది బావుంది కదా" అంది అప్రయత్నంగా, సాధారణంగా గులాబీరంగు ఏ ఛాయకైనా నప్పుతుంది.

ఆ కుర్రవాడు చిరునవ్వుతో, "లేదమ్మాయిగారు" అన్నాడు. "మీ శరీరచ్ఛాయకి గులాబీ కంటే ఆకుపచ్చ బావుంటుంది. అందులోనూ మీ అంత ఎత్తున్న, లావున్న అమ్మాయికి అంత చిన్న బోర్డరు సరిపోదు. బోర్డరు మీదనుంచి పువ్వులు పైపైకి వెళ్ళి క్రమంగా మాయమవుతే బావుంటుంది. అసలే పోటీ అంటున్నారాయె. ఏమాత్రం కాస్త తేడావున్నా అది ఎంతో లెక్కకి వస్తుంది."

"ఒహో నీ దగ్గిరున్న యిలాంటి చీరొకటి మా కంటగట్టే ప్రయత్నమా ఇది?" ఎగతాళిగా అంది తల్లి.

కుర్రవాడు నవ్వేడు.

"నా దగ్గిర అలాంటి చీరలేదమ్మా అమ్మాయిగారు అలాంటి చీరలేదమ్మా. అమ్మాయిగారు ఎలాంటి చీరకడితే బావుంటుందో చెప్పానంతే..."

ఆ అమ్మాయి అతడివైపే విస్మయంతో చూస్తోంది. తన కన్నా అయిదారేళ్ళు చిన్న వయసుంటుంది అతడికి. కానీ చీరల మీద కమాండ్ వున్నవాడిలా మాట్లాడుతున్నాడు.

"మీరేమీ అనుకోకపోతే ఒక్కమాట అమ్మగారు! చాలా మంది షాపుకెళ్ళి ఏ చీర బావుందా అని ఎన్నుకుంటారు. ఏ చీర 'తమకి' బావుంటుందా అని ఎన్నుకోరు" అన్నాడు. "....అలాగే, మీ అమ్మాయిగారి గెడ్డం మీదున్న పెట్టుడుమచ్చ మరికాస్త పక్కకి జరుపుతే బావుంటుంది కుడివైపుకి-"

సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం అక్కడ వ్యాపించింది ఇప్పుడు ఆ తల్లికి కూడా అతడిమీద నమ్మకం కుదిరినట్టుంది. ఏదో మానవాతీత శక్తి లాంటిది లేకపోతే తప్ప ఆ మచ్చ "పెట్టుడుదని" తెలీదు. నాలుగు సంవత్సరాల్నుంచీ ఆ మచ్చని అక్కడే చూసిన వారికి కూడా అది ఇంకాస్త పక్కన వుంటే బావుండేది అన్న అభిప్రాయం కలగలేదు.

ఇంతలో ఆ అమ్మాయి అడుగు ముందుకువేసి కుతూహలంగా "ఇంకా ఏం చెయ్యాలి?" అని అడిగింది. ఆ కుర్రవాడు ఇప్పుడు కాసింత ధీమాగా, మరింత పరిశీలనగా ఆ అమ్మాయివైపు చూశాడు. ఆ అమ్మాయి శరీరఛాయ గులాబీ రంగుతో పోటీపడుతూంది. దానికి ఆ రంగులో వున్నవాళ్ళకి ఏ రంగు చీరైన బానే వుంటుంది. చామనఛాయ గలవారైతే పసుపు, నారింజ గులాబి రంగులు ఎలాగో తప్పవు బాగానే వుంటుందికదా అని తెల్లగా వున్నవాళ్ళు కూడా అవే వేస్తే వాళ్ళకీ మిగతావాళ్ళకీ తేడా వుండదు. దేవుడిచ్చిన తెలుపుదనపు వరానికీ, మరింత కొట్టొచ్చినట్టు కనబడే ఆకుపచ్చ నీలపు అలంకారాలు అద్దవచ్చు.

ఆ అమ్మాయిలో వున్న చిన్న లోపం... ఆమె పొడుగు మామూలు కన్నా ఎత్తు రెండు అంగుళాలు ఎక్కువ. దాన్నే ఆమె 'హుందాగా' మార్చుకోవచ్చు. కానీ ఆ చీరకట్టులో అటువంటి ప్రయత్నమేమీ ఆమె చేసినట్టు కనిపించలేదు. ఒకదానికి ఒకటి పొసగని వస్త్రము (కాంట్రాస్ట్) ధరించి వుంటే ఆమెలో ఆ 'హుందా' కనిపించి వుండేది. కానీ ఆమెకూడా ఫేషన్ పేరిట 'మ్యాచింగ్' వరదలో కొట్టుకుపోయింది. కనీసం ఆమె కట్టిన పసుపు రంగు చీరమీద వేరే రంగు జాకెట్టు ధరించినా బావుండేది.

"......ఆ లోలకులు మార్చండమ్మాయ్ గారు. పొడుగ్గా వున్న వాళ్ళు లోలకులు వేసుకుంటే బావోదు. అలాగే క్రిందికి వేలాడే నగలకన్నా, మెడచుట్టూతా వుండే నగయితే బావుంటుంది....." అతడు నవ్వేడు. "మీ చెప్పులు కూడా మారాలి."

"ఇవి హైహిల్స్ కావు".

"ఎత్తు సంగతికాదు నేను చెప్పేది. పొడుగ్గా వున్నవాళ్ళు సాదా చెప్పులు వేసుకోకపోతే, భూమికీ శరీరానికీ మధ్య ఆ డిజైను కళ్ళకి కొట్టొచ్చినట్టు కనపడి, మరింత ఎత్తుగా కనపడతారు."

ఆ అమ్మాయి చప్పున తన చెప్పుల వంక చూసుకుంది. ఇంతకాలం అసలా కోణంలో ఆలోచన రానందుకు సిగ్గుపడ్డట్టు మరింకేమీ ఆలోచించకుండా, అతడి శక్తి సామర్ధ్యాల మీద నమ్మకాన్ని వెలిబుచ్చుతూ "నాకేం చీర బావుంటుందో కాస్త చూసి చెప్పు" అంది.

ఇప్పటివరకు అతడి మాటల్ని వప్పుకొంటున్న తల్లి. కూతురి ఈ చివరి మాటలకి ఉలిక్కిపడి చూసింది. ఆ అమ్మాయి ఎగ్జయిట్ మెంటు చూస్తుంటే ఆ కుర్రవాడిని తిన్నగా పడగ్గదిలోకి తీసుకుపోయి, బీరువాలో చీరలన్నీ చూపించేట్టూ కనపడింది.

"ఏమిటమ్మాయ్, వాడు చూసి చెప్పటమేమిటి? నీకేమైనా మతిపోయిందా?" అని అడ్డుకుంది. ఆ అమ్మాయి నిర్లక్ష్యంగా "ఫర్లేదులే అమ్మా" అని లోపలికి దారితీసింది. తల్లి కుర్రవాడివైపు తిరిగి, "అబ్బాయ్ నీ దగ్గరేమన్నా చీరలుంటే చూపించు." అంది, అతడిని లోపలి వెళ్ళకుండా ఆపుచేసే ఉద్దేశ్యంతో.

ఆ అమ్మాయితోపాటు లోపలికి వెళ్ళాలా వద్దా అని తటపటాయిస్తున్న ఆ అబ్బాయి ఈ మాటలకు తెలిపిన పడ్డట్టు తేరుకుని, "నేనొక చీర ఇస్తానమ్మగారూ, దీనికి మీరేమీ డబ్బు ముందు ఇవ్వనవసరం లేదు. కట్టుకుని, బావుంటేనే అమ్మాయిగార్ని డబ్బు ఇవ్వమనండి" అన్నాడు.

ఆ అమ్మాయి వెనక్కు వచ్చి, "ఏదీ చీర చూపించు-డబ్బులదే ముందిలే" అంది.

అప్పుడా అబ్బాయి మూట విప్పి అందులోని చీరలని అటూ ఇటూ జరిపి, మధ్య నుంచి ఒక చీరను బయటకు తీశాడు.

నల్లంచు తెల్ల చీర!!

ఆ అమ్మాయి చీర తీసుకుని లోపలికి వెళ్తూ "దీనికి మ్యాచింగ్ బ్లౌజు వుందో లేదో" అనుకుంది స్వాగతంగా.

"మాచింగ్ వద్దమ్మగారూ. బోర్డరు కొట్టొచ్చినట్టు కనపడే బ్లౌజ్ వుంటే వేసుకోండి" అని వెనుకనుంచి అన్నాడు. పొడుగ్గా వున్నవాళ్ళు పాటించవలసిన మరో నియయం.

చీర తీసుకుని ఆ అమ్మాయి లోపలికి వెళ్ళిపోయింది.

"ఎంతబ్బాయ్ ఆ చీర?" కూతురు వెళ్ళేక తల్లి అడిగింది.

"నూటపాతిక అమ్మగారూ-"

"నూ.....ట.....పా.....తి.....కా?" మరీ అంత చౌక చీర నా కూతురుతో కట్టిస్తావా అన్నట్టు అందావిడ.

ఆ అబ్బాయి మాట్లాడలేదు.

ఓ ఆడవాళ్ళలారా! మీరెప్పుడు తెలుసుకుంటారు. వెయ్యి రూపాయల చీరని ఎనిమిది సంవత్సరాలు దాచి దాచి కట్టుకోవడం కంటే, ఎనిమిది వేర్వేరు చీరెలు, నూటపాతికవి కొని కట్టుకుంటే మీరు మరింత ఆకర్షణీయంగా కనపడతారనీ? పైగా-మీరు ఆకర్షణీయంగా కనపడాల్సింది పెళ్ళిళ్ళలోనూ, ఫంక్షన్ లలోనూ మాత్రమే కాదు..... ఇంట్లో భర్తకి కూడా అనీ!! అందరూ వెయ్యి రూపాయల చీరెలు కట్టుకొని వచ్చిన పెళ్ళిలో మీరు ప్రత్యేకంగా కనపడాలంటే, అందుకు మొదటి మార్గం మీరు పదివేల రూపాయల చీర కట్టటమనీ, లేదా రెండోమార్గం నూటపాతిక రూపాయల్దికట్టటమనీ!!! ఖరీదు కాదు ముఖ్యం- కొట్టొచ్చేటట్టు కనపడటం అనీ, అలా కనబడటానికి తమ తమ శరీరతత్వాన్ని అర్థం చేసుకోవటం అన్నిటికన్నా ముఖ్యం అనీ, అలా చేయని పక్షంలో అందరిలో మీరూ ఒకరిగా కలిసిపోతారనీ!! అన్నిటికన్నా చివరగా, చీర అందంగా కట్టుకోవటం ఎంత గొప్ప కళో, అందమైన చీరని ఎన్నిక చేసుకుని దాన్ని సరైన కాలంలో (వేసవికాలం పగలులో లేతరంగు, వర్షాకాలం మబ్బుల్లో ముదురురంగు), సరైన సమయంలో (లైటు వెలుగుల రాత్రిళ్ళైతే ఒక రంగు, సూరీడు వెలిగే పగలైతే ఒక రంగు) ధరించటం కూడా అంత గొప్ప కళే అనీ - చీర అనేది వంటిని కప్పే సాధనం కాదనీ, వంటికి అందం తెచ్చే ఆయుధమనీ...... ఓ ఆడవాళ్ళలారా, మీరెప్పుడు తెలుసుకుంటారు?

"ఏమిటబ్బాయ్ ఆలోచిస్తున్నావ్?"

అతడు ఉలిక్కిపడి "ఏమీ లేదమ్మగారూ" అన్నాడు. ఈ లోపులో ఆ అమ్మాయి గదిలోంచి కిటికీ దగ్గిరకొచ్చి, "ఇదిగో, చుక్క ఇక్కడ పెట్టుకోనా?" అని అడిగింది.

తల్లికి వళ్ళు మండిపోతోంది. పక్కన డాక్టరుగారి భార్య లేకపోతే సంస్కారం గింస్కారం మర్చిపోయి కూతుర్ని నాలుగుతిట్టి ఆ కుర్రాడ్ని తన్ని తగలేసేదే! మింగలేకా కక్కలేకా చూస్తోంది. ఈ లోపులో ఆ కుర్రవాడు ఇవ్వవలసిన మిగతా నాలుగు సూచన్లూ యిచ్చేసేడు.

సరిగ్గా పదినిమిషాల తర్వాత ఆ అమ్మాయి బయటికొచ్చింది.

ఒక్కక్షణం అక్కడున్న ఆడవాళ్లిద్దరికీ మతిపోయింది. తల్లికైతే తను చూస్తున్నది స్వంత కూతుర్నేనా అని అనుమానం కలిగింది.

సరైన చీరెతో, కొద్ది కొద్ది మార్పుల్తో, ఆ అమ్మాయి పూర్తిగా మారిపోయింది. పొడుగుస్థానే హుందాతనం వచ్చింది. లోలకులు తీసేసి దుద్దులు పెట్టి, మెళ్ళో హారం బదులు నెక్లెస్ మార్చేసరికి అందం ద్విగుణీకృతం అయింది. గెడ్డంమీద పుట్టుమచ్చ కాస్తా స్థానం మారేసరికి ఆ వదనం, కేవలం చిత్రకారుడు మాత్రమే గుర్తించగల సౌందర్యాన్ని సంతరించుకుంది.

హెయిర్ స్టయిల్ నుంచి చెప్పుల వరకూ అన్నీ మారిపోయాయి. మార్పు అంటే మేకప్ కాదు. దట్టమైన పౌడరు పూతలూ, ఎర్రటి లిప్ స్టిక్ లూ కావు ఒక శాస్త్రజ్ఞుడు ఎన్నాళ్ళో శ్రమించి, ఎన్నో రసాయనాల్ని ఇటూ అటూ మార్చి సమ్మేళనం జరిపినట్టు, ఒక్కొక్క సౌందర్య స్థానాన్ని పరిగణనలోకి తీసుకుని, జాగ్రత్తగా దాని అందాన్ని ఇనుమడింపజేసిన ఏకాగ్రత, నేర్పు, అవస్థ-ఆ అలంకరింపులో కనబడ్డాయి. అది కేవలం అభ్యాసం వల్ల రాదు, పూర్వజన్మ సుకృతం కూడా వుండాలి. తల్లి కూడా కూతుర్ని - మొదటిసారే చూసినట్టు విభ్రాంతి చెందిందంటే, దాన్నిబట్టే అర్థం చేసుకోవచ్చు - ఎంత మార్పొచ్చిందో!

"గుడ్! వెరీగుడ్!!" అంది జడ్జిగావున్న డాక్టర్ గారి భార్య. ఆమెకిప్పుడా అమ్మాయిని చూస్తుంటే ప్రైజు వస్తుందని నమ్మకం కుదురుతోంది.

ఆ అమ్మాయి అతడివైపు చూసి నవ్వింది.

ఆ కుర్రవాడు ఆ అమ్మాయివైపే చూస్తున్నాడు - ఇంకా ఏదో సరిగ్గా కుదరనట్టు.

"పదమ్మా పద టైమైపోతోంది" అంటూ హడావుడి పెట్టింది తల్లి ఈ లోపులో డ్రైవరు కారుతీసి బయట పెట్టి రెడీగా నిల్చున్నాడు.

"ఇదిగోనయ్యా నీ డబ్బులు, మొత్తానికి చీరె మాకు అంటగట్టావ్" అంటూ నూటపాతికా అతడి చేతిలో పెట్టింది తల్లి.

"నీళ్ళలో పెడితే వుంటుందా?" డాక్టర్ గారి భార్య అడిగింది. ఆ కుర్రవాడు హర్ట్ అయినట్టు కనిపించాడు. నిజానికి ఆ అమ్మాయి వంటికి ఆ చీరె ఎంత బాగా నప్పిందంటే చెపితేగాని అది నేత చీరె అని తెలీదు. అసలా చీరె ఒక్కసారి కట్టుకున్నందుకే నూటపాతికా ఇవ్వొచ్చు అన్నంత బావుంది.

"ఇక పదండి" అంటూ వాళ్ళని బయల్దేరతీసి, "ఇదిగో రాములూ ఇతనెళ్ళాక తలుపేసుకో-" అని పనివాడికి చెప్పి ఆమె ముందుకు నడిచింది.

అప్పటికింకా ఈ కుర్రవాడు చీరెలమూట సర్దుకోలేదు. ఆఖరి నిముషంలో ఆ అమ్మాయి కదలబోతుంటే అప్పుడు తెలిసింది ఆ అమ్మాయి మేకప్ లో ఆఖరిలోపం ఏమిటో. "అమ్మాయిగారూ!" అన్నాడు హఠాత్తుగా నిద్రలోంచి మేల్కొన్నట్టు. ఆ అమ్మాయి కళ్ళు తిప్పి అతనివైపు చూసింది.

ఆ కళ్ళనే అతను చూస్తున్నాడు. దాని గురించే ఆ అమ్మాయికి ఒక సలహా ఇచ్చాడు.

.... కళ్ళు చాలా రకాలు..... మీనలోచనాలు, తీక్షణమైనవి, డ్రూపింగ్ ఐస్, మత్తయిన కళ్ళు, రెప్పలు జారినవి, కోలకళ్ళు- ఇలా ఎన్నో! ప్రపంచంలో అన్నింటికన్నా అందమైన కళ్ళు 'ఆల్మండ్'షేపున్న కళ్ళు! విశాల నేత్రాలు ఎటువంటి అమ్మాయికయినా అందాన్నిస్తాయి.

ఆల్మండ్ కళ్ళున్న అదృష్టవంతురాలు ఆ అమ్మాయి!

సాధారణంగా పెద్ద కళ్ళున్న అమ్మాయిని చూడగానే బావుంది అనేస్తాం. మిగతా లోపాలన్నీ కళ్ళవల్ల కప్పబడిపోతాయి. పెద్ద కళ్ళున్న అమ్మాయిలు ఆ పొగడ్తలకి లొంగిపోయి, మిగతా విషయాలు పట్టించుకోరు. ఆ కళ్ళ అందానికి ఆ కుర్రవాడు కూడా సహజంగానే పడిపోయాడు. కానీ అతడి సునిశితమైన దృష్టికి లోపం ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది.

ఆ అమ్మాయి రెండు కళ్ళమధ్య దూరం స్వాభావికంకన్నా గోరంత ఎక్కువ వుంది. అందాన్ని ఆస్వాదించటం వేరు- ఆస్వాదించగలిగే అందాన్ని అంచెలంచెలుగా తయారుచేసుకోవటం వేరు! చాలామంది పురుషులు కేవలం ఆస్వాదిస్తారు. అనలిటికల్ గా చూడరు. కేవలం అందానికే వర్తించదు ఈ నీతి! జీవితంలో ప్రతీస్టేజీకి వర్తిస్తుంది. నారాయణ పేట లాటి చిన్న పల్లెలో నేతమగ్గం ముందు కూర్చునే ఒక కుర్రవాడిలో, మొగ్గ విచ్చుకుంటున్నట్టు ఆ అనలిటికల్ నాలెడ్జి విచ్చుకుంటున్నదని ఎవరికీ తెలీదు.

కూతురుకళ్ళు పెద్దవి కాబట్టి కాటుక నిండుగా పెట్టి, వాటిని మరింత పెద్దవిగా కనబడేట్టూ చేసి మురిసిపోవటం చిన్నప్పటినుంచి ఆ అమ్మాయి తల్లికి అలవాటు అయివుంటుంది. అదే అలవాటుని పెద్దయ్యాక కూడా ఆ అమ్మాయి కొనసాగించింది. పెద్ద కళ్ళున్నవాళ్ళు కంటినిండా కాటుక పెట్టుకుంటే నిండుగా వుంటుందన్నది సర్వజనీనమైన విషయమైతే అయి వుండవచ్చునేమో కానీ, అన్ని సందర్భాల్లోనూ కాదు. కళ్ళు దూరంగా వున్నప్పుడు ప్రారంభంలో దట్టంగా వున్న కాటుకరేఖ, కంటి చివర్లకు చేరుకునే కొద్దీ పలుచనైతే, కళ్ళు దగ్గిరగా వున్న భావం కలుగుతుంది. అలాగే కనుబొమ్మలు కోలగా కాకుండా అర్ధచంద్రాకారంగా వంపు తిరుగుతే కొత్త అందం వస్తుంది. కనురెప్పల పైభాగపు షేడ్ కి కూడా ఇది వర్తిస్తుంది. ఆ కుర్రవాడికి టెక్నికల్ టర్మ్స్ తెలీదు. హంపీ శిల్పాన్ని చెక్కిన శిల్పికి కూడా తెలిసి వుండదు. అందానికి సైన్సు పరిధిలేదు. తనకు తోచింది చెప్పాడంతే.

ఆ అమ్మాయి లోపలికి పరిగెత్తింది మళ్ళీ.

"ఇక ఈ రోజు మనం పోటీకి వెళ్ళినట్టే" అంది తల్లి. "అబ్బాయ్, చేసినంతవరకూ చాలు ఇక వెళ్ళు" అంది. ఇంతలో బయట హారన్ నివిపించింది. అప్పటికీ కార్లో కూర్చున్న జడ్జీగారికి మరింత తొందరగా వుంది. మరోసారి హారన్ మ్రోగింది.

"వస్తున్నా వస్తున్నా" హడావుడిగా అని, "అమ్మాయ్! రా!!.....రాములూ- తలుపేసుకో" అంటూ కారు దగ్గిర కెళ్ళింది.

ఆ కుర్రవాడు బట్టలు సర్దేసి మూట కట్టేసేడు. ఈలోపులో లోపలి గుమ్మం దగ్గిర్నుంచి "ఎలా వున్నాను" అని వినిపించింది. తలెత్తి చూశాడు.

అపరంజిబొమ్మలా వుందా అమ్మాయి. ఎత్తు, ఎత్తుకి తగిన చీరె మొహానికి అందాన్నిచ్చే కళ్ళు.

తనలో వచ్చిన మార్పు తనకే తెలిసినట్టు ఆ అమ్మాయ్ మొహం వింత వెలుగులో ప్రకాశిస్తుంది.

"అమ్మ డబ్బులిచ్చేసింది కదూ."

"ఇచ్చారమ్మగారూ."

ఇంతలో బయట్నుంచి హారన్ వినిపించింది. ఆ అమ్మాయి గుమ్మం వరకూ వెళ్ళి, బయటకు నడవబోయి, తలతిప్పి ఆ అబ్బాయి వంక చూసి, వెనుక రాములు లేడని నిర్ధారించుకుని, తూనీగలా పరుగెత్తుకొచ్చి అతడి మొహాన్ని రెండు చేతులు మధ్యా తీసుకుని పెదవులమీద గాఢంగా ముద్దు పెట్టుకుని "థాంక్యూ" అనేసి క్షణంలో అదృశ్యమైంది.

అంతా రెప్పపాటులో జరిగిపోయింది.

ఆ కుర్రవాడో క్షణంపాటు నిర్విణ్ణుడయ్యాడు. ఊహించని సంఘటనకి బిత్తరపోయాడు. అతడి జీవితపు తొలిముద్దు అది. అతడికి ఆ అమ్మాయి పేరు కూడా తెలీదు.

అంత అందమైన అమ్మాయికి ఈపాటికే అసంఖ్యాకంగా ప్రేమలేఖలు వచ్చి వుండవచ్చు. ఎందర్నో తిరస్కరించి వుండవచ్చు. కానీ వేలూ, లక్షలూ ఇచ్చికూడా తెలుపుకోలేని కృతజ్ఞతని ఆ విధంగా తెలుపుకుంది. మనసులోంచి పెల్లుబికే ఆనందాన్ని ఆ విధంగా ప్రకటించి ఋణం తీర్చుకుంది.

**నిబిడీకృతమైన తెలివితేటలకి నీరాజనం పట్టే ముద్దు అది! పొంగిపొరలే ఎగ్జయిట్ మెంట్ కి పరాకాష్ట అది!!**

ఆ తరువాత పదిహేను సంవత్సరాలకి దేశంలో, ఆంధ్రదేశంలో....దాదాపు ప్రతీ అమ్మాయి ఇటువంటి ఎగ్జయిట్ మెంట్ ఫీలయింది అతడిపట్ల కాదు. వస్త్ర ప్రపంచంలో మకుటంలేని మహారాజులా దూసుకొచ్చిన రవి తేజా టెక్స్ టైల్స్ వారి చీరెల ఫ్యాషన్ వెల్లువలో కొట్టుకుపోతూ.....

* * *

ఆ కుర్రవాడు తిరిగి మామ దగ్గిరకొచ్చేసరికి మూడు కావొస్తూంది, ఎండ కాస్త తగ్గింది. ఆ కుర్రవాడి మొహం ఒక వింత కాంతితో మెరిసిపోతోంది. అయితే ఆ కాంతి తొలిముద్దు వల్ల వచ్చింది కాదు.

"మావయ్యా, ఒక చీర అమ్మేను మావయ్యా! వంద రూపాయల చీర నూటపాతిక్కి అమ్మాను మావయ్యా!"

అనుకున్న దానికన్నా పాతిక ఎక్కువొచ్చిన ఉద్వేగం అది!

పట్నంలో రెండొందల చీర నాల్గొందలకి అమ్ముతారని తెలియని ఆ కుర్రవాడు అసలు ధరకన్నా పాతిక ఎక్కువ రావటమే ఆనందంగా ఫీలవుతున్నాడు. ఆ పాతికా అతడి నేర్పరితనానికి నిదర్శనం. ఆ క్షణం అతడు ఆ చీర ఖరీదు రెండొందలు అని చెప్పినా వాళ్ళు కొనేవారే! నిజాయితీకీ, నేర్పరితనానికీ వ్యాపార భాషలో చుక్కెదురు.

మధ్యవర్తికి చీరలిచ్చేస్తే లాభంలేదు. "కష్టమో నష్టమో మనమే స్వయంగా పట్నం వెళ్ళి అమ్ముకుంటే మంచిది" అన్న ఆలోచన వచ్చింది అతడికే! మామని బలవంతపెట్టి బయల్దేరతీసింది అతడే!! చీరలు - చీరలు అని రోడ్డువెంట తిరిగితె లాభం లేదని, మంచినీళ్ళు నెపంమీద ముందు ప్రవేశించి అక్కడ పరిస్థితిని అర్థం చేసుకుని క్రమక్రమంగా అందులోకి చొచ్చుకుపోయేటంత తెలివితేటలు ప్రదర్శించింది అతడే!

మెట్టు తరువాత మెట్టులాంటి వ్యాపార లక్షణాలు ఇవి. ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్నాడు. ఆయాసం రావటంలేదు. పైకి వెళ్ళేకొద్దీ క్రింద కనపడే దృశ్యం ఆనందాన్ని కలుగజేస్తూంది. ఆ విజయోత్సాహంతోనే ఈ విషయం మావయ్యకు చెప్పాడు. అయితే ఆ మాటలు ఆ వృద్ధుడికి వినపడ్డాయో లేదో తెలీదు. బలహీనంగా కళ్ళు విప్పాడు.

దా....దా....దాహం అన్నట్టు సైగచేశాడు. అతడి వళ్ళు పెనంలా మాడిపోతోంది. కుర్రవాడు వణికిపోయాడు. అతడికి తను చేసినతప్పు అర్థమైంది. వడదెబ్బ కొట్టిన మామని అరుగుమీద అజాగ్రత్తగా వదిలేసి, చీరల అమ్మకానికి బయల్దేరాడు. ఇక్కడ, ఈ ఎండలో తన మామ దాహంతో గొంతు ఆర్చుకుపోయి, అరవటానికి శక్తిలేక, రోడ్డుమీద నడిచే ఏ ఒక్కరినీ పిలిచే శక్తిరాక, పాపం ఎంతసేపటి నుంచి దాహంతో కొట్టుకుంటున్నాడో-ఆర్చుకుపోయిన గొంతుతో కొట్టుకుంటున్న ప్రాణం ఎంత అల్లల్లాడిందో.

ఆ కుర్రవాడు పరుగెత్తుకెళ్ళి పంపులో నీళ్ళు తెచ్చి మొహం మీద జల్లాడు. అతడి తల వళ్ళోకి తీసుకుని నోటిలో పోశాడు. నిముషం తరువాత అతడి మొహంలోకి కాస్త కళ తిరగి వచ్చింది. అయితే అది చాలా తాత్కాలికమైంది.....చావుకళ! ఆ విషయం ఆ వృద్ధుడికి తెలిసినట్టుంది. కళ్ళువిప్పి మేనల్లుడివైపు చూశాడు. 'అయిపోయిందిరా- నా పని అయిపోయింది' అన్నట్టుంది ఆ చూపు. ఇల్లు గుర్తొచ్చింది. భౌతిక బంధాలు తెగిపోయినా భవబంధాలు తెగిపోవు. పోతున్న ప్రాణం తెగని బంధాలకోసం చివరివరకూ ప్రాకులాడుతుంది.

"మావయ్యా..... మావయ్యా ...." అన్నాడు ఆ కుర్రవాడు రుద్దకంఠంతో. అతడికి భయంవేసింది. ఏడుపొచ్చింది. ఊరుకాని వూళ్ళో ఇంత విపత్తుని వూహించలేదు. ఇదంతా తనవల్లనే. వడదెబ్బ కొట్టిన మనిషిని అజాగ్రత్తగా వదిలెయ్యటం వల్ల.

"అయిపోయిందిరా.....అ...యి....పోయింది" మావయ్య కంఠం నూతిలోంచి వచ్చినట్టు వుంది. వణికే చేతుల్తో ఆ కుర్రవాడి చేతిని తన గుప్పిట్లోకి తీసుకున్నాడు. 'నాకు.....నాకో వాగ్దానం చెయ్యాల్రా'.

గాలి స్థంభించింది. మబ్బు వెనుకనుంచి సూర్యుడు బయటికి రావటంతో ఎండ ఒక్కసారిగా ఫెళ్ళున కొట్టింది.

"చెప్పు మావయ్యా నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను చెప్పు."

"మాధవిని చేసుకోవాల్రా నువ్వు....."

స్థంభించిన గాలి ఒక్కసారి పెనుగాలిలా మారి మొహం మీదకొట్టినట్టయింది ఆ కుర్రవాడికి.

వెన్నెల్లో కూర్చుని భావాన్ని నేస్తే
పాట చీర తయారైంది
జరీ పల్లవికి - చరణం అంచు.

-అని తను వ్రాసుకున్న పాటని నవ్వుతూ 'ఇదేం పాట బావా-తలా తోకాలేని పాట-' అని ఎగతాళి చేసే మాధవి!

నెత్తిమీద చీరెల మూట పెట్టుకొని రోడ్డు రోడ్డు తిరిగి బట్టలు అమ్ముతావా అని హేళన చేసే మాధవి!

ప్రత్యూషకాదుల్నీ సంధ్యాదీపపు వెలుగుల్నీ ఆస్వాదించలేని మాధవి!

ముగ్గేయటం తెలియని మాధవి - పదమూడేళ్ళొచ్చినా గోళీలాడే మాధవి......

"ఇప్పుడు కాదురా కానీ ఎప్పటికైనా నువ్వే చేసుకోవాలి. అది అమాయకప్పిల్ల. ఇంకో ఇంట్లో కోడలిగా బ్రతకలేదు. దాన్ని, దాని తల్లిని నువ్వే పోషించాలి. నా కొడుకుని కూడా నువ్వే పైకి తీసుకురావాలి. మాధవి మంచిదిరా! చాలా మంచిదిరా! మాటివ్వరా....మా....ట.....ఇ....వ్వ....రా."

సందిగ్ధం మనసుని వూపేస్తుంది.

ఎదుటి మనిషి ప్రాణం కూడా కొద్దికొద్దిగా పోతోంది.

"ఒరే! నువ్వు కాదంటే నా కుటుంబం చెట్టుకొక పిట్ట అయిపోతుంది. ఇన్నాళ్ళు పెంచినదానికి బదులుగా అడగటం లేదురా, మావయ్యగా అర్థిస్తున్నాను. మాధవి.... మా...ధ.....వి.....ని..."

ఆ కుర్రవాడు అప్రయత్నంగా అతని చేతిలో చెయ్యివేసి "చేసుకుంటాను మావయ్యా" అన్నాడు. "మాధవిని చేసుకుంటాను" వృద్ధుడి మొహం ఆఖరిసారి ఆనందంతో వెలిగింది. సంతృప్తితో నిండింది.

"చాల్రా..... చా....." మాట పూర్తవకుండా ప్రాణం పోయింది. తల వాలిపోయింది.

ఆ కుర్రవాడికి దుఃఖం రాలేదు. దానికన్నా పెద్దభావం- స్థబ్దంగా చూశాడు.

తనకి నేతని నేర్పిన వేళ్ళు..... అచేతనంగా....

తన నేతని పరీక్షించిన కళ్ళు....నిస్తేజంగా.....

తన పనిని అభినందించిన స్పర్శ.... నిర్జీవంగా.....

ఆఖరి కోర్కె తీరిన ఆనందంతో ఆత్మ సంతృప్తిగా వెళ్ళి పోయింది. దాన్ని సంతృప్తిపర్చటానికి ఇచ్చిన మాట.....

**ఒరే!! మాధవి మంచిదిరా. అమాయకప్పిల్ల.**

మంచితనం-అమాయకత్వం-ఈ రెండేనా భార్యాభర్తల మధ్య ఉండాల్సింది.

నడిరోడ్డులో మరణించిన మనిషి కోసం అతడేడుస్తున్నాడు. ఇచ్చిన వాగ్దానం గురించి ఆలోచించటంలేదు.

మనిషి ఏదో ఒక బలహీనమైన క్షణం ఒక తప్పు చేస్తాడు. దాని పరిణామంతో జీవితాంతం రోదిస్తాడు.

అతడప్పుడు చేసిన తప్పు అలాటిదే!

## 2

**1986 జూన్ నెల,**

**సాయంత్రం 5-30.**

**హైద్రాబాద్, అబిడ్స్.**

రవితేజా టెక్స్ టైల్స్ మానేజింగ్ డైరెక్టర్ టయోటా కారు ఆవరణలోకి ప్రవేశించగానే ఆ ఆవరణలో చైతఃన్యం మొదలైంది.

నిండైన, అందమైన విగ్రహం కార్లోంచి దిగింది.

అతడంటే ఆ మిల్స్ లో కూలీ నుంచి మానేజర్ వరకూ అందరికీ ఇష్టమే. తన స్థాయికూడా చూసుకోకుండా అతడు అందరితో కలిసిపోతాడు. నవ్వుతూ నవ్విస్తూ వుంటాడు. అసలు పని చేసినట్టే కనిపించదు.

అయినా రోజుకి పదహారు గంటలు పనిచేస్తాడు.

అందుకే ఈ రోజు ఆంధ్రదేశాన్ని తన చీరల్తో ఒక ఊపు వూపుతున్నాడు.

రవితేజ చీరలు కట్టుకోవడమే ఒక ఫ్యాషన్ గా భావించే స్థాయికి ఆంధ్రదేశంలో ప్రతీ ఆడపిల్లనీ తీసుకెళ్ళాడు.

అతని కంపెనీ చీరల్ని కట్టనిది అతని భార్య ఒక్కతే.

ఆవిడ పేరు మాధవి.

ఆమెదో చిత్రమైన మనస్తత్వం.

ఒకరోజామె ఏదో ఫంక్షన్ కి నిండుగా అలంకరించుకుని వెళ్ళింది. ఫంక్షన్ కి వచ్చిన ఒకావిడ మాధవి మొహంమీదే "నీకీ చీర నప్పలేదమ్మా" అనేసింది. పక్కనున్న మరొకావిడ ఆ మాట అందుకుని, "ఆమె కేమిటమ్మా.... మొగుడు చీరాల

కంపెనీ ప్రొప్రైటరు. చీరలు ఫ్రీగా వస్తాయి-" అంది. "ఫ్రీగా వచ్చిన చీరలు అంతకన్నా ఏం బావుంటాయిలే" అన్న ఉద్దేశ్యం ధ్వనించేట్టు.

అంతే!

ఆ రోజునుంచీ మాధవి - రవితేజ టెక్స్ టైల్స్ చీరలు కట్టటం మానేసింది.

రవికి మొదట్లో అర్థంకాలేదు. దేశమంతా అంత క్రేజ్ తో ఉంటే, ఇంట్లో భార్యకి తమ చీరలు నచ్చకపోవటం....

"మీ చీరలు నాకు నప్పవు-" అందామె ఒక్కమాటగా.

అతడికి షాక్ తగిలినట్టయింది. న....ప్ప....వు!

అతడి కంపెనీలో రీసెర్చి డిపార్ట్ మెంట్ ఖర్చు, సంవత్సరానికి పాతిక లక్షలుంటుంది. ఒక కొత్త రకం డిజైను మార్కెట్ లోకి వచ్చి ఫెయిల్ అయిందంటే నష్టం లక్షల్లో వుంటుంది. అందువల్ల నిరంతర శోధన జరుగుతూనే వుంటుంది. డిపార్ట్ మెంట్ లో కొందరి పని ఎప్పుడూ సినిమాలు చూసి శ్రీదేవి చీరలు, హేమమాలిని చీరలు లాటి కొత్త ఫాషన్లు కనిపెట్టటమే.

ప్రేమనగర్ లో వాణిశ్రీ కట్టుకున్న ఛాందినీ చీర* ఆ తరువాత ఎంతో పాపులర్ అయింది. మరికొందరు అజంతా ఎల్లోరాలకి వెళ్ళి ఆ శిల్పాల డిజైన్లు కూడా చూస్తూ వుంటారు. ఆడవాళ్ళ ఫాషన్లు రోజురోజుకీ మారిపోతూ వుంటాయి. **వాళ్ళ మారబోయే కోర్కెలని ఆరు నెలల ముందుగా పట్టుకోగలిగినవాడే నిజమైన బట్టల వ్యాపారి!** అందుకే రీసెర్చి డిపార్ట్ మెంట్ మీద అంత ఖర్చు! కాబట్టి.......

'నప్పవు' అన్న ప్రశ్న లేదు. భారతదేశంలో ప్రతి స్త్రీకి నప్పే చీర కనీసం ఒకటన్నా వుండాలి. లేకపోతే ఇన్ని లక్షల ఖర్చు రీసెర్చి మీద అనవసరం. రవితేజ అహం దెబ్బతిన్నది.

***ఛాందినీ చీరలు** ఇవి రాజస్థాన్ కి సంబంధించిన చీరలు. ఒక రాష్ట్రానికి సంబంధించిన చీరలు మరో రాష్ట్రంలో కట్టటం సాధారణమే అయినా - ఎక్కువ పాపులర్ అవటం అరుదు. బెంగాల్ కాటన్స్, కలకత్తా నేత చీరలు, బెంగుళూరు సిల్క్ మాత్రం ఇలా పాపులర్ అయ్యాయి.

ఎక్కువ ప్రత్యేకత లేకుండానే ఛాందినీ చీరలు పాపులర్ అవటానికి కారణం ఒక తెలుగు సినిమా 'ప్రేమనగర్'! చక్కటి పెర్సనాలిటీతో హీరోయిన్ అందులో చీర కట్టుకున్న విధానం ఆ రోజుల్లో ఒక క్రేజ్ కెరటాన్ని సృష్టించింది. జనం కేవలం ఆ చీరల్ని చూడటానికే ఆ చిత్రానికి వెళ్ళారన్నా అతిశయోక్తి కాదు.

వీటిని TIE & DIE చీరలని కూడా అంటారు.

బట్టలో రాయిపెట్టి కట్టేసి, రంగు అవసరం లేనిచోట రాయి మీద పాలితిన్ కవర్ పెట్టి రంగులో ముంచటం వల్ల వీటికి టై అండ్ డై చీరలని పేరొచ్చింది.

ఒక మోస్తరు షిఫాను మీద ప్రారంభమైన యీ చీరలు, వాణిశ్రీ పుణ్యమా అని పాపులర్ అయ్యి, ఇతరములైన కాటన్, సిల్క్ ల మీద కూడా ప్రింట్ చేయబడ్డాయి.

చివరికి అన్ని ఫాషన్ లలాగే కాలగర్భంలో కలిసిపోయాయి.

"ఎందుకు నప్పవు? నాతో రా నేను సెలెక్టు చేస్తాను. విమల్, గార్డెన్ వెరైటీల్లో ఎన్ని రకాలున్నాయో, మన కంపెనీలోనూ అన్ని వెరైటీలున్నాయి."

"ఏమక్కర్లేదు ఫ్రీగా వచ్చినాయని అందరూ దెప్పి పొడవటానికా?"

"ఫ్రీ ఏమిటి?"

ఆమెకి అసలు విషయం చెప్పక తప్పలేదు. వింటూంటే అతడికి నవ్వొచ్చింది.

"చూడు మాధవీ! నువ్వు పొట్టిగా వుంటావు. కుచ్చిళ్ళు ఎక్కువ పెట్టుకోవద్దని లక్షసార్లు చెప్పాను, నువ్వు విన్లేదు. పెద్ద పూసలు, ఎక్కువ నగలు పెట్టుకోకూడదని చెప్పాను.....అంత వరకూ ఎందుకు? లావుగా వున్నవాళ్ళు చిన్నసైజు హాండ్ బ్యాగ్ ఉపయోగించాలని చెప్పాను. అదికూడా నీకు పట్టలేదు. అన్నిటికన్నా ముఖ్యంగా పొట్టిగా వున్నవాళ్ళు కూర్చునేటప్పుడు కాళ్ళు రెండూ దగ్గిరగా పెట్టుకుని కూర్చోవాలని ఎన్నిసార్లు చెప్పాను నీకు?.... ఈ తప్పులన్నీ నీలో పెట్టుకుని... మా చీరలని అంటావేం?"

అప్పటికే ఆమె ఏడుపు ప్రారంభించింది. "నేను లావుగా వున్నాననేగా.....పొట్టిదాన్ననేగా...."

"చూడు మాధవీ! పొట్టి అనేది దేముడిచ్చిన శాపం. దానికి నువ్వేం చేయలేవు. కేవలం పొడుగు-పొట్టి వల్లే మనిషి ఆనందం ఆగిపోదు. కనీసం నువ్వు చేయగలిగింది కూడా చెయ్యవెందుకని?"

"ఏమిటి? ఏం చెయ్యాలి?"

"రోజుకి ఎనిమిది గంటలు నిరర్థకంగా గడిపే బదులు ఒక్క అరగంట వ్యాయామం చెయ్యవచ్చు."

"ఇంకానయం సర్కస్ లో చేరమన్నారు కాదు."

అతడికి విసుగేసింది. చాలామంది బ్రతకటంకోసం జీవిస్తారు. కొద్దిమందే బ్రతకటంలో ఆనందాన్ని ఆస్వాదిస్తారు. ఆమె మొదటి టైపు. పెళ్ళయిన మొదటిరోజునుంచీ చెపుతూనే వున్నాడు - పక్క మీదకు వచ్చేటప్పుడు నోట్లో ఒక యాలక్కాయ వేసుకొమ్మని. ఆమె అర్థం చేసుకోదు. అంతవరకూ ఎందుకు పొడరు వేసుకోవలసింది మొహంమీదే కాదు- సగం అందం మెడవల్ల వస్తుంది. మెడ వెనుక కూడా మొహమంత బాగా అద్దంలా వుండాలి అన్నంత చిన్న విషయం కూడా ఆమెకి తెలీదు. చెప్పినా వినదు.

అతడికి జీవితంలో ప్రతీ సెకనూ అర్థవంతంగా వుండాలి. ఏదో కొత్తదనం ఆలోచించాలి. మరో కొత్త డిజైను కనిపెట్టాలి...... అవే ఆలోచన్లు కొంతకాలానికి మెదడు అలసిపోతోంది. అలసిన మెదడుకు విశ్రాంతి కావాలి. అది మాత్రం ఇంట్లో దొరకదు. శారీరక సుఖం ముఖ్యం కాదు, ప్రేమ కావాలి. ప్రేమకి మొదటి స్టెప్పు అర్థం చేసుకోవటం. ఎక్కడుందో తప్పు? అని మాత్రం తెలియటం లేదు. ఏది ఏమైనా ఒకటి మాత్రం నిజం.

గులాబీ...... గులాబీ...... ఏ సావన్ కి ఖుష్ బూ
ఖూబ్ సూరత్ నహోత్ - అగర్
ఇస్ మె రంగె మొహబ్బత్ నహోత......

(వర్షాకాలపు గులాబీతోట కూడా- ప్రేమ అంశ లేకపోతే అందంగా వుండదు.)

చిన్నప్పుడు విన్న పాత అతడిని వెంటాడుతుంది.

## 3

**రవితేజ** కంపెనీ డైరెక్టర్ల అతి ముఖ్యమైన సమావేశం ఆ రోజు జరుగుతూంది. ఒక ప్రధానమైన నిర్ణయం ఆ రోజు తీసుకోవాలి. వస్త్రాల వ్యాపారంలో ఒక కంపెనీ మిగతా కంపెనీల నుంచి నిరంతరం చాలా గట్టి పోటీని ఎదుర్కోవలసి వస్తుంది.

రవితేజ టెక్స్ టైల్స్ కి పోటీగా చెంచురామయ్య అండ్ కో చాలా హడావుడి చేస్తోంది. దాదాపు పాతిక సంవత్సరాలుగా రంగంలోవున్న ఆ సంస్థ పునాదులు-రవితేజ కంపెనీ రావటంతో కదిలిపోయాయి. చివరి ప్రయత్నంగా చెంచురామయ్య ఒక వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టాడు. లాటరీ తీసి మారుతీకారు ప్రెజెంటు అన్నాడు. ప్రతీ నగరంలోనూ అది ఏర్పాటు చేశాడు.

అద్దాల్లోంచి రిబ్బను కట్టిన మారుతీకారు ఆహ్వానిస్తూ వుంటుంది. నెలరోజులే టైము...... అదృష్టం ఎవరి తలుపన్నా తట్టవచ్చు.

ఎవరాగ్గలరు?

జనం గుంపులు గుంపులుగా చెంచురామయ్య షోరూమ్ ల మీద పడ్డారు.

క్యూల్లో నిలబడ్డారు.

ఇది ఒకవైపు నుంచి తాకిడి.

రిడక్షన్ సేల్స్ మరొకవైపు.

**"వీధిన పడ్డాము"**

**అకస్మాత్తుగా అప్పులవాళ్ళు వత్తిడి చేయటంతో, వున్న ఆస్తులన్నీ అమ్మి వీధిన పడ్డాము. సరుకంతా ఏ ధరకైనా అమ్మివేయటానికి నిశ్చయించుకుని మీ వూరు వచ్చాము- మూడు రోజులు మాత్రమే. 175 రూ. షర్టు పీసు 1-75 పైసలు...**

... లాటి ప్రకటనలు, షాపులు.

ముఫ్ఫై అయిదు రూపాయలకే చీర అయిదు రూపాయలకే నైటీ ఏదో ఒకటి చేస్తే తప్ప లాభంలేదు.

రవితేజ ఏం చేస్తాడు?

డైరెక్టర్లందరూ ఆసక్తిగా మీటింగ్ లో కూర్చుని వున్నారు.

"డియర్ సర్స్...." అన్నాడు రవితేజ. ".....మనమిక్కడ సమావేశమైంది ఒక ముఖ్య విషయం చర్చించటానికి మన సమస్య మీకు తెలుసు. తాకిడి రెండువైపుల్నుంచి వుంది. ఆకర్షణీయమైన బహుమతులు పెట్టి కస్టమర్లని ఆకర్షిస్తూన్న కంపెనీలొకవైపు, రిడక్షన్ అమ్మకాల పేరిట చౌక సరుకు అంటగడుతూన్న చిన్న షాపులొకవైపు. ఈ రెంటినీ మనం ఎదుర్కోకపోతే గత అయిదేళ్ళుగా మనం సాగిస్తున్న అభివృద్ధి ఆగిపోతుందని మీ అందరికీ తెలుసు. ఈ విషయమై మన ప్లానింగ్ డిపార్ట్ మెంట్ ఎన్నో పథకాల్ని నాకు గత కొన్ని వారాలుగా సమర్పిస్తూ వుంది. అలాగే మన

మార్కెటింగ్ సెక్షన్ తో ఎన్నో సుదీర్ఘమైన చర్చలు జరిపాను. నేను ఈ రెంటితోనూ చర్చించిన విషయాన్ని మన చైర్మన్ కి ఈ రోజే క్లుప్తంగా వివరించి, నేను అమలు జరపబోయే విషయాలకు ఆయన అనుమతి తీసుకున్నాను. ఈ పథకాల్లో మీకేమైనా అనుమానాలుంటే చర్చించటం కోసమే ఈరోజు ఈ సమావేశం" అంటూ ఆగేడు.

రవితేజ టెక్స్ టైల్స్ చైర్మన్ శర్మ నవ్వుతూ చూస్తున్నాడు. ఆయనకి యాభై సంవత్సరాల వయసుంటుంది. లక్షాధికారి పిల్లలు లేరు.

"సర్స్...... మన పోటీదార్లని ఎదుర్కోవటానికి మనం ఏదైనా చేయాలంటే ఇంకా ఆకర్షణీయమైన బహుమతులు పెట్టాలి. ఏం పెడతాం? ఓడలు? హెలికాప్టర్స్!! మా చీర కొంటె చంద్రమండలానికి ఉచిత యాత్ర???"

నవ్వులు.

"ఇవేమీ మనం ఇవ్వలేం. అందుకే...." రవితేజ ఆగి, నెమ్మదిగా అన్నాడు."......మనం ఏమీ ఇవ్వం."

ఎవరో మంత్రించినట్టు నవ్వులు ఆగిపోయాయి. ఇప్పుడు రవితేజ నవ్వాడు. నవ్వి అన్నాడు --

"అవును అంత పెద్ద బహుమతులు ఏమీ ఇవ్వం. ప్రతీ చీరతో రెండు భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్లు ఇస్తాం..."

"ఏమిటీ....?" ఎవరో అన్నారు.

"అవును రెండు లాటరీ టిక్కెట్లద్వారా లక్ష రూపాయల బహుమతి పొందటానికి ఎంత తక్కువ ఛాన్సు వుందో, ఒక చీర కొనటంద్వారా మారుతీకారు పొందటానికి అంతే ఛాన్సు వుందన్న భావాన్ని ఈవిధంగా మన కొనుగోలుదార్ల మనసుల్లో చొప్పిస్తాం. సర్స్... ఏ పథకమైనా పెట్టిన కొత్తలోనే అందర్నీ ఆకర్షిస్తుంది. తరువాత జనం కూడా అందులో లొసుగు గుర్తిస్తారు. నా ఊహ నిజమైతే ఈ పథకం ఎక్కువకాలం సాగదు. మనం చేయవలసిందల్లా ఈ పథకాన్ని వాళ్ళు అనుకున్నదానికన్నా తక్కువ కాలంలో ముగించేట్టు చేయటమే...." ఆగేడు.

"ఒక షాపు చీర ధర పెంచకుండా, కేవలం తన వ్యాపారాభివృద్ధి కోసం కేటాయించిన డబ్బులోంచి మారుతీకారు బహుమతిగా ఇవ్వాలంటే కనీసం యాభై లక్షలు అమ్మకాలు చెయ్యాలి. ఇదెంతవరకూ సాధ్యం? కాబట్టి చీర ధర పెంచక తప్పదు. "చీరమీద పది రూపాయలు ఎక్కువ పెడతారా- మా చీర మామూలు ధరకి కొని రెండు లాటరీ టిక్కెట్లు పొందుతారా?...." ఈ భావాన్ని కస్టమర్ల మనసులోకి ఇంజెక్ట్ చేస్తాం. మనం చేసే ఈ పనిని చూసి మొదట్లో చాలామంది నవ్వుకుంటారు. కానీ మారుతీ కారుకోసం వెళ్ళేవారిని చూసి, మనం ఈ పని చేయటం గుర్తొచ్చి ఇంకా నవ్వుకుంటారు. ఈ గిల్టీ ఫీలింగ్ ని వారిలోకి ప్రవేశపెట్టడమే మనం చేసే పని...."

చప్పట్లు- ఆగకుండా చప్పట్లు కొట్టారు. డైరెక్టరు శర్మ రవితేజని అభినందిస్తున్నట్టు చూశాడు.

"మన రెండో పోటీదారు బోంబే సేల్స్, రిడక్షన్ అమ్మకాలు, డిస్కౌంట్స్.....! మన ధరలతో పోల్చుకుంటే ఇవి చాలా తక్కువ. కానీ వస్తువులో నాణ్యత కూడా తక్కువే. ఈ విషయం అందరూ వప్పుకుంటారు. కానీ, మనం కూడా వప్పుకోవలసిన విషయం ఒకటుంది. ఈ ప్రపంచంలో ఏ వస్తువైనా తీసుకోండి. దాన్ని తయారుచేయటానికి అయ్యేఖర్చు పది రూపాయలైతే, దాన్ని పన్నెండు రూపాయలకి, మహా అయితే పధ్నాలుగు రూపాయలకి అమ్ముతారు. ఒక్క చీరల విషయంలోనే, తయారీ ఖర్చు వంద అయితే దాన్ని మూడొందలకి అమ్ముతారు. ముఖ్యంగా పట్టుచీరలైతే, పదిహేనొందలు పెట్టి సంబరపడి కొనుక్కుని వెళ్ళేవాళ్ళకి తెలీదు. దాన్ని తయారు చేయటానికయ్యే ఖర్చు అయిదొందలకన్నా ఎక్కువ వుండదని...."

అతడు ఆగి అందరివైపు చూసి నవ్వేడు.

"....దీన్లో మన తప్పు కూడా లేదు. ఎన్నో చీరలు సంవత్సరాల తరబడి షాపుల్లో వుండిపోతాయి. కొన్ని వెరైటీ రంగులు ఎవరూ కొనకపోయినా మనం షాపుల్లో వుంచాలి. వీటి వడ్డీ లక్షల్లో వుంటుంది. అదీగాక ప్రొద్దున్న పదింటికొచ్చి సాయంత్రం వరకూ అన్నీ తిరగేసి, బేరం చేసి, ఏమీ కొనకుండా వెళ్ళిపోతారు. మధ్యాహ్నం పూట 'సరదాగా' షాపింగ్ వచ్చిన ఆడవాళ్ళు కొందరు వీళ్ళ ఎయిర్ కండిషన్ ఖర్చు, సేల్స్ మేన్ జీతాలూ అన్నీ మనం మన అమ్మకాల్లోనే సర్దుకోవాలి. అందుకే చీరల ధరలు ఇంతగా పెరిగిపోతున్నాయి. మనం అమ్మకాల్ని పెంచగలిగితే ధరలు తగ్గించవచ్చు."

"ఇక్కడ నేనో విషయంలో అడ్డుపడదల్చుకున్నాను" అన్నాడు శర్మ. ".....ధరలు తగ్గించనవసరం లేదని నా అభిప్రాయం. మిగతా వస్తువులు వేరు, చీరల విషయం వేరు. తక్కువ ధర చీరలయితే ఏమోకానీ, ఖరీదు ఎక్కువగా వున్న చీరలు కొనేవాళ్ళు ధర పెద్ద పట్టించుకోరు. ఆ మాటకొస్తే, ధర ఎక్కువ చెప్తే ఇంకా మంచి చీరేమో అని ముచ్చట పడతారు. కాస్త కంటికి నజరుగా కనిపించే చీర ఎక్కువ ధరైతే, పదిమందికీ చెప్పుకోవచ్చుగా ఇంకోలా చెప్పాలంటే నగల్లాగే ఖరీదైన చీరలు కూడా స్టేటస్ సింబల్. ఒకోసారి ధరలు తగ్గించటం కూడా ప్రమాదకరం. రవితేజ సూచించినట్టు పట్టుచీర యాభై రూపాయల కిస్తామంటే ఎవరూ కొనరు. మాకంతే ఖర్చయింది అని చెప్పినా నమ్మరు. ఎప్పుడూ లేనిది ఇదేమిటి అని అంటారు. ఇదేదో మోసం అనుకుంటారు...."

రవితేజ నవ్వేడు. "అవును. మన రీసెర్చి డిపార్ట్ మెంట్ ఇదికూడా ఆలోచించింది. అందుకే మనం ధరలు తగ్గించం. అలా అని, మిగతావాళ్ళలా తాహతుకి మించి మారుతీకార్లు ఇచ్చి చేతులు కాల్చుకోం...."

"మరి..."

రవితేజ వెంటనే సమాధానం చెప్పలేదు. ఇప్పుడు అసలు విషయానికి వచ్చాడు. జాగ్రత్తగా వాళ్ళని వప్పించాలి.

తాము తీసుకోబోయే నిర్ణయాలమీదే కంపెనీ భవిష్యత్తు ఆధారపడి వుంటుంది.

అతడు బల్లమీదున్న కాగితాల్ని చేతుల్లోకి తీసుకుని కంఠం సవరించుకున్నాడు.

"సర్స్! దాదాపు పాతిక సంవత్సరాల క్రితం బ్రాసరీలు మార్కెట్ లో కొత్తగా ప్రవేశపెట్టబడ్డాయి. ఆ రోజుల్లో 'బాడీ'లకు బదులుగా బ్రాసరీలు ధరించే స్త్రీలని 'ఫాషన్ మరిగిన వాళ్ళు'గా చెవులు కొరుక్కునేవాళ్ళు అప్పుడు! ఇప్పుడు పొలంలో పనిచేసే కూలీ కూడా బ్రా ధరిస్తోంది."

"అవును. భూతద్దం పెట్టి వెతికినా బాడీలు కనిపించటం లేదు" వెనుకనుంచి ఎవరో అన్నారు. నవ్వులు.

రవితేజ కూడా నవ్వి అన్నాడు. "దాదాపు పాతిక సంవత్సరాల్నించీ భారతదేశపు స్త్రీల శరీరాలమీద బ్రాలు మకుటంలేని మహారాజుల్లా వెలిగాయి. నా అంచనా నిజమైతే - వాటికాలం చెల్లిపోయే రోజు వచ్చింది. చాలా తొందర్లో ఫాషన్ మారబోతూంది."

మీటింగ్ హాల్లో సూదిపడితే వినబడేటంత నిశ్శబ్దం వ్యాపించింది. అతడు కొనసాగించాడు. "బ్రాల్లో వుండే ముఖ్యమైన లోపం ఏమిటంటే- అవి కేవలం స్ట్రాప్స్ దగ్గిరే సాగదీయబడే గుణం కలిగి వుంటాయి."

"అవసరమైతే చోట" అన్నారు వెనుకనుంచి ఎవరో నిశ్శబ్దం బ్రద్దలైంది. మళ్ళీ నవ్వులు.

"అవును అవసరమైనచోట - అనవసరంగా! దీనివల్ల ఒక రకమైన 'బిగుతు' ఫీలింగ్ కలుగుతుంది. అలా కాకుండా కేవలం అవసరమైనచోట మాత్రమే తోడ్పడే ఒక కొత్త రకమైన ఫాబ్రిక్ కనుక్కోబడింది. దీని పేరు లిక్రా (Lycra). వంగినా, కదిలినా, తిరిగినా, చివరికి నాట్యం చేసినా - అదసలు శరీరంమీద వున్నట్టు ఉనికే తెలియని ఈ కొత్తరకం ఫిటింగ్, తొందర్లో బ్రాసరీ స్థానాన్ని ఆక్రమించబోతోంది. బనియన్లు, అండర్ వేర్లు తయారుచేసే వి.ఐ.పి. సంస్థ ఈ కొత్తతరాన్ని 'పెటల్స్' అన్న పేరుతో మార్కెట్ లో విడుదల చేసింది. దీని ఖరీదు 45 రూపాయలు. AS YOU FIOWER INTO WOMAN... DIS COVER PETALS అన్నది వీరి స్లోగన్." అతడు ఆగి నెమ్మదిగా అన్నాడు.

"....ఈ కంపెనీతో అగ్రిమెంట్ ద్వారా మూడొందల రూపాయల పైగా చీర కొన్నవారికి మనం ఒక జత పెటల్స్ ఉచితంగా ఇస్తాం. అదీ మన బహుమతి" అతడు ఊపిరి పీల్చుకున్నాడు. "....ఒకసారి ఈ పెటల్స్ ధరించిన స్త్రీ తిరిగి మామూలు బ్రా వైపు వెళ్ళదు. ఇది పూర్తిగా మార్కెట్ లోకి వచ్చి వ్యాప్తమయ్యే లోపులో మన అమ్మకాలు రికార్డు స్థాయి దాటతాయని నా నమ్మకం. ఏది ఏమైనా ఒకటి మాత్రం నిజం. పెటల్స్ ని "స్త్రీ" కన్నా, పెటల్స్ ధరించిన స్త్రీని పురుషుడు ఎక్కువ ఇష్టపడతాడు."

"స్వానుభవమా?" వెనుకనుంచి ఎవరో సన్నగా అన్నారు.

ఈసారి ఎవ్వరూ నవ్వలేదు.

అతడికున్న స్టయిల్ కీ, హుందాకీ, అతడు 'కో' అంటే కోటి మంది క్యూలో నిలబడతారనీ, డిజైన్స్ గీయటంలో, కలర్ మ్యాచింగ్ లో అతడిని మించినవాడు భారతదేశంలో మరొకరు లేరనీ, అన్నిటికీ మించి ఆడవాళ్ళ శరీర తత్వాన్నీ, ఫాషన్స్ నీ అంచనా వేయటంలో అతడు నిష్ణాతుడనీ వారందరికీ తెలుసు. కానీ ఒక శాస్త్రజ్ఞుడు పరీక్ష నాళికని ఎలా చూస్తాడో అంతే ఆసక్తి తప్ప మరే విధంగానూ అతడు పరాయి స్త్రీని చూడడని అతనితో పరిచయమున్న వారందరికీ తెలుసు.

అందుకే ఎవరూ నవ్వలేదు.

ఈ లోపులో రవితేజ చేతిలో కాగితం బల్లమీద పడేసి రెండో ప్రపోజల్ తీసుకున్నాడు.

"ఒక చీర కొంటే దానితోపాటు బ్లౌజుపీసు ఉచితంగా ఇస్తున్నారు కొంత మంది."

"ఫాల్స్ కూడా...."

"ఫాల్స్ ఇస్తున్నారో లేదో నాకు తెలీదు. నేను ఇప్పుడు మీ ముందు చర్చకు పెట్టబోయేదేమిటంటే చీరతోపాటు బ్లౌజుపీసు మనం కూడా ఉచితంగా ఇస్తాం. అయితే అందర్లాగ చీరలోనే దాన్ని మడతపెట్టి ఇవ్వడం కాకుండా, కొనుగోలుదార్లు మన షాపులో వుండే ఏ బ్లౌజు గుడ్డనన్నా ఎన్నిక చేసుకునే హక్కు కల్పిస్తాం. మనం ఇందుకోసం పెట్టే జాకెట్టుపీసులు మాత్రం మన లాభం కన్నా తక్కువ వుండేటట్టు చూసుకుంటాం. దీనివల్ల కస్టమరు మన షాపులో ఎక్కువసేపు వుంటారు. మన షాపుల్లో 'రద్దీ' పెరుగుతుంది. ఐ మీన్ పెరిగినట్టు కనిపిస్తుంది. వ్యాపారం యొక్క ముఖ్య లక్షణం... అన్నిటికన్నా ముందు షాపు కళకళలాడేట్టు కనిపించేలా చేసుకోవటం. మన మిత్రుడైన ఒక డైరెక్టర్ ఫాల్స్ గురించి చెప్పారు. మనం కూడా ఫాల్స్ ఇస్తాం- అయితే అందర్లాగా ఇవ్వం. అక్కడికక్కడ కుట్టించి ఇచ్చేస్తాం. ఇలా కుట్టిచ్చే సమయంలో ఆడవాళ్ళ చేతులు వూరుకోవు. మరో చీరని వెతుకుతాయి....."

చప్పట్లు ఆగకుండా వినిపించాయి. రవితేజ సెక్రటరీ వైపు చూసి నవ్వేడు. ఈ చివరి సలహా ఇచ్చింది ఆమే! ఆమెకి నలభై అయిదేళ్ళుంటాయి. అతడికి కుడిభుజంలా పనిచేస్తుంది. అతడు కొనసాగించాడు.

".....మన అమ్మకాల అభివృద్ధి పథకం క్రింద ఒక పదహారు పేజీల చిన్న పుస్తకాన్ని ప్రచురిస్తున్నాం. ఏ శరీరాకృతికి ఏ చీర బావుంటుంది- ఏ కాలంలో ఏ రంగు బావుంటుంది- కేశాలంకరణ... వగైరా అన్నీ అందులో వుంటాయి. సాధారణంగా 'టై'లు కొన్నవారికి ఇలాటి చిన్న పుస్తకాన్ని ఇస్తారు. మన చీరకొన్న ప్రతీవారికి ఈ పుస్తకం ఉచితంగా ఇస్తాం. అంతేకాదు...." ఆగి నెమ్మదిగా అన్నాడు- "అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణం చేసేవారికి చిన్న టూత్ పేస్టు,

బ్రష్, సేవింగ్ సెట్ బహుమతిగా ఇస్తారు. కోటీశ్వరులు కూడా ఇలాటి చిన్న ప్రెజెంట్స్ ని చాలా ఇష్టపడతారు. ఫ్రెండ్స్! మన దగ్గిర రెండొందల పైగా ఖరీదున్న చీర కొన్నవారికి, ఆ చీర రంగుకి మ్యాచ్ అయ్యే గాజులు, మేకప్ బాక్సు కాంప్లిమెంటరీగా ఇస్తాం. చీర రంగుకి సరిపోయే బొట్టు, లిప్ స్టిక్, చిన్న పౌడర్ పాకెట్ ఐ లైనర్ లాటివి వుంటాయి. మూడొందలు దాటిన చీరకి దుద్దులు కూడా ఇస్తాం - అఫ్ కోర్స్! ఆర్టిఫీషియల్ వి."

"మనకేంమిగులుతుందా అసలు-" ఒక వృద్ధ డైరెక్టర్ అడిగాడు. రవితేజ గుండెల్నిండా ఊపిరి తీసుకున్నాడు. ఇక అసలు విషయం చెప్పవలసిన సమయం వచ్చేసింది.

"సర్స్, మీ అందరి అనుమతితో - ఈ రోజునుంచి మన చీరల ధర పాతిక శాతం పెంచుతున్నాను."

బాంబు పేలింది.

అప్పటివరకూ ఆసక్తితో వింటూన్న డైరెక్టర్లందరూ ఒక్కసారిగా మాట్లాడటం మొదలుపెట్టారు. కొందరు 'నో' అని అరిచారు. కొందరు తమలో తాము చర్చించుకోవడం ప్రారంభించారు. అతడు మౌనంగా అందర్నీ పరిశీలిస్తున్నాడు. తన ఆలోచన్లమీద నమ్మకం వుంది అతడికి. డైరెక్టర్లే ఇక వప్పుకోవాలి. ధర గురించి ఆడవాళ్ళు పెద్ద పట్టించుకోరని అతడికి తెలుసు. నూనె కిలో పాతికయితే ఎంతో బాధపడే స్త్రీ, చీర వంద పెరిగినా కొనేస్తుంది.

**"రవితేజ టెక్స్ టైల్స్ వారి చీరలు శరీరాలకి కాదు. మనసులకి చుట్టుకుంటాయి."**

ఇదీ వాళ్ళ స్లోగన్. అది నిజమైనంతకాలమూ ధర గురించి ఆలోచించనవసరంలేదు. కానీ వాళ్ళు ఇలా ఆలోచించటంలేదు. ఒకసారి మార్కెట్ పడిపోతే నష్టం. అందుకే ఇంత చర్చ!

ఈ లోపులో డైరెక్టర్లు ఒక నిర్ణయానికి వచ్చారు.

అమ్మకాలు ఎప్పటికప్పుడు తమకి తెలియజేసేలా, ఆర్నెల్ల పాటు ధరలు పెంచేటట్టు!!

సో.....

హి ఎచీవ్డ్ ఇట్.

ధర పెంచి, ప్రోత్సహాకరమైన బహుమతులు ఇవ్వాలనే చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని ఆ విధంగా తీసుకున్న దేశపు మొట్టమొదటి బట్టల కంపెనీ - రవితేజా టెక్స్ టైల్స్ అయింది. ఏ చీర కొన్నా ఏదో విధంగా ఒక బహుమతి ఖాయం!.....మీటింగ్ పూర్తయింది. డైరెక్టర్లు- పార్టీకోసం లేస్తూ వుండగా రవితేజ అన్నాడు.

"సర్స్! ఇప్పటివరకూ కస్టమర్లకు ఇచ్చే రాయితీలని కొన్ని మీముందుంచాం. మీరు వాటి నన్నిటినీ వప్పుకున్నందుకు నా తరపునా, నా రిసెర్చి డిపార్ట్ మెంట్ తరపునా కృతజ్ఞతలు. నేను మీటింగ్ లో చెప్పటానికి సిగ్గుపడ్డ, ఐ మీన్ - మొహమాటపడ్డ ఆఖరి అంశాన్ని ఇప్పుడు వెల్లడి చేస్తున్నాను ఇది చెప్పగానే మీరు నవ్వుతారు. కానీ నేనూ మా డిపార్ట్ మెంటు మా స్వంత బాధ్యత మీద ఈ బహుమతి కస్టమర్లకి ఇవ్వబోతున్నాం-"

"ఇంతకీ ఏమిటది?"

"మన షాపులో చీర కొనటానికి వచ్చే స్త్రీ తనతోపాటు ఎంతమంది స్నేహితురాండ్రని తీసుకువస్తే - నూటికి అన్ని రూపాయలు కన్సెషన్ ఇస్తాం" అని వూరుకున్నాడు. ఇరుగుపొరుగు వారిని ఇంటర్ - డిపెండెంట్ చేసే ఆ పథకం వెనుకర్థం - ఒక్క క్షణం అక్కడున్న వారికి ఎవరికీ వెంటనే అర్థంకాలేదు. షాపింగ్ కి, అందులోనూ బట్టల కొట్టుకొచ్చి ఆడవాళ్ళు వూరుకోరు అని అర్థం కాగానే ముందర ఎవరో సన్నగా విజిల్ వేసేరు. తరువాత అందరి ఆమోదాన్ని తెలుపుతున్నట్టు వెంటనే నవ్వులు వినపడ్డాయి. ఎప్పుడూ ఎగ్జయిట్ అవని ఛైర్మన్ కూడా రవితేజ భుజం తడ్తూ "గుడ్, వెరీగుడ్...." అన్నాడు అని, పార్టీవైపు నడుస్తూ వుండగా "నీ చివరి పథకం బాగానే వుంది. పదిమంది స్నేహితురాండ్ర వరకే పరిమితం అని పెట్టు. లేకపోతే మరీ కక్కుర్తిపడే ఆడవాళ్ళెవరైనా వుంటే వందమందిని తీసుకొచ్చి మొత్తం షాపంతా పట్టుకుపోతారు" అంటూ నవ్వేడు.

ఆ రోజు పార్టీ చాలా బాగా జరిగింది. ముఖ్యంగా రవితేజ బాగా ఉల్లాసంగా వున్నాడు. అతడి నిర్ణయాలు తొందర్లోనే అమలు జరపబడి అవి సఫలీకృతమైతే, రవితేజ టెక్స్ టైల్స్ భారతదేశపు నెం. 1 కంపెనీ అవుతుంది. అతడికి నమ్మకం వుంది. కొత్త డిజైన్స్ విషయంలో తన నెవరూ కొట్టలేరని అతడికి తెలుసు.

రవితేజ టెక్స్ టైల్స్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ! కానీ నలభై శాతం షేర్లు శర్మవే! ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అంతా ఆయనే చూసుకుంటాడు. ఇవిగాక మరి నాలుగు డిపార్ట్ మెంట్ లున్నాయి. రవితేజ ఉత్పత్తి, మార్కెటింగ్, డిజైన్, రిసెర్చి విభాగాలు చూసుకుంటాడు. ఇంకో ముగ్గురు డైరెక్టర్లు మిగతా మూడు డిపార్ట్ మెంట్ లూ చూసుకుంటారు. ఒకరి విషయాల్లో మరొకరు కల్పించుకోరు. అందుకే ఆ రోజు రవితేజ అంత ఆనందంగా వున్నాడు. అతడి పథకాలన్నీ ఆమోదించబడ్డాయి.

.....అతడింటికి వెళ్ళేసరికి పదకొండున్నరయింది. వంటవాడు తలుపు తీశాడు. బట్టలు మార్చుకుని పక్కమీద పడుకుని భార్యమీద చెయ్యి వేశాడు. ఆమె నిద్రపోవటంలేదు. ఒక్కసారిగా అతడి చేతిని విదిలించికొడుతూ, "వచ్చారా? ఇప్పుడెందుకు రావటం? తెల్లారేక రావల్సింది" అంది విసురుగా.

అతడిమీద చన్నీళ్ళు జల్లినట్టయింది. అతడి ఉత్సాహమూ, ఆ రోజు గెలుపూ అంత ఒక దెబ్బతో పోయాయి. అతడి మనసు ఎప్పుడోగాని అంత ఆనందంగా వుండదు. అదంతా ఎగిరిపోయింది. తమాయించుకుంటూ "అదికాదు

మాధవీ-" అంటూ ఏదో చెప్పబోయాడు.

ఆమె కళ్ళు చిట్లించి అతడివైపు చూస్తూ "ఈ రోజు కూడా తాగి వచ్చాడు కదూ-" అంది అసహ్యం ధ్వనించేలా! వినేవాళ్ళకి అతడో పెద్ద తాగుబోతూ, రోజూ అర్ధరాత్రి దాటాక ఇంటికి చేరుకునేవాడిలా కనిపిస్తాడు ఆ మాటలు వింటే. నిజానికి అతడు ఎప్పుడూ కంపెనీ కోసమే తాగుతాడు. అందులోనూ ఆ 'స్థానం' లో వుంటూ అసలు గ్లాసు పట్టుకోకపోతే బాగోదు. కొత్తలో ఆమెని వప్పించటానికి ప్రయత్నించాడు- "తాగినవాళ్ళు అసలు ఇలా వుండరు మాధవీ. నువ్వు చెప్పేది తాగుబోతుల గురించి! ఒక పెగ్గు తాగినా పది పెగ్గులు తాగినా ఒకేతా వాసన రావటం మొగవైడ్కి దేవుడిచ్చిన శాపం" నవ్వించటానికి అతడు చేసిన ప్రయత్నాన్ని అర్థం చేసుకునేటంత సెన్సాఫ్ హోమర్ లేదు ఆమెకి.

ఆ రోజు కూడా కార్లో వస్తూ అనుకున్నాడు- ఆమె అలా అడుగుతుందని, ఆమెకు చాలా చెప్పాలనుకున్నాడు. ఈ రోజు సాధించింది తక్కువ విజయమేమీ కాదు. కానీ మొగవాడు సాధించే విజయాల్ని అందరికన్నా ముందు భార్య గుర్తించాలి. లేకపోతే ఇంత కష్టపడటంలో అర్థంలేదు. ఎందుకింత కష్టపడటం?

తనని తాను కంట్రోల్ చేసుకుంటూ ఆమెకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. "చూడు మాధవీ, మీటింగ్ అయ్యేసరికి పది అయింది. తరువాత డిన్నర్ అన్నారు. ఈ రోజు అటెన్షన్ అంతా నా మీదనే అలాటిది వదిలేసి నేనెలా రాగలను?"

"నన్నెందుకు కట్టుకున్నారు? ఆ ఫ్యాక్టరీనే కట్టుకోలేకపోయారా?"

అతడు నవ్వేడు. "రెంటినీ ఒకేసారి కట్టుకున్నాను. మన పాతరోజులు మర్చిపోయావా మాధవీ? రాత్రింబవళ్ళు నేతమగ్గాల మీద బ్రతుకులు గడిపిన రోజులు అవి. కష్టపడకపోతే పైకి రావటం కష్టం. ఇప్పుడు మనం ఇంత సుఖం అనుభవిస్తున్నా మంటే- కష్టపడటం వల్లే కదా!"

"చాల్లెండి. రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని-ఎన్నైనా చెపుతారు." నిశ్చేష్టుడయ్యాడు. సున్నితమైన తీగ ఏదో తెగి గుండె గీరుకున్న బాధ. అతడికి జీవితంలో మొదటిసారి కోపం వచ్చింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "అంటే....నేనబద్దం చెపుతున్నా నంటావా?"

"అబద్ధమే చెపుతున్నారో- నిజమే చెపుతున్నారో-ఏం చెపుతే ఏం లాభం? భార్యని సుఖపెట్టలేకపోయాక."

"ఏం? ఇప్పుడు నీకేం కష్టం వచ్చింది?"

"ఏం? సుఖముందే అనండీ?"

"ఏం లేదు? మహిళామండలి మీటింగుల కెళ్ళటానికి కారుంది. రాత్రి నిద్రపోవటానికి ఎయిర్ కండిషన్డ్ బెడ్ రూమ్ వుంది. పనిచేయటానికి నలుగురు మనుష్యులున్నారు. ఇంకేం సుఖం కావాలి?"

"ఇంతేనా? ఇదేనా సుఖమంటే?"

"మరింకేమిటి?"

"ఒక అచ్చటా లేదు, ముచ్చటా లేదు."

అతడు తెల్లబోయి "నెలకు నాలుగుసార్లు డిన్నర్ కి తీసుకెళ్తున్నాను. ఫ్యామిలీ పార్టీలకెళ్తున్నాం. ఇంకా ఏమిటి ముచ్చట?"

"డిన్నర్లకీ, పార్టీలకీ వెళ్ళటమేనా ముచ్చటంటే? ప్రొద్దున్న వెళ్ళి అర్ధరాత్రెప్పుడో వస్తారు. ఇంట్లో వంట చెయ్యటానికే పెళ్ళామున్నది. ఏదో రాత్రి పడుకోవాలి కాబట్టి ఇంటికి రావటం-"

అతడికి విసుగేసింది. తమాయించుకుని అన్నాడు - "చూడు మాధవీ! కొంతమంది జీవిస్తారు. మరికొందరు జీవితాన్ని ఛాలెంజిగా తీసుకుని కష్టపడతారు."

"కష్టం! కష్టం! కష్టం! మీరొక్కరేనా కష్టపడుతూంది. ఇంకెవరూ లేరా?"

"లేరు. చూడు! నిజంగా కష్టపడేవాళ్ళు చాలా తక్కువమంది వుంటారు. లేకపోతే ఇన్ని సినిమాహాళ్ళు, రేసులూ, బార్లూ ఇంతఫుల్ గా వుండవు. దురదృష్టం ఏమిటంటే ఈ కష్టాన్ని కూడా అర్ధం చేసుకోవలసిన వాళ్ళు అర్ధం చేసుకోరు వాళ్ళని కూడా అందరితో కలిపేస్తారు."

"మిమ్మల్ని మీరు సమర్ధించుకోవటానికి ఎన్నైనా చెపుతారు?"

"ఛీ- నీతో వాదించటం, నీకు అర్ధమయ్యేలా చెప్పటం- నాదే బుద్ది తక్కువ."

"ఆ మాట నేనూ అనగలను. అసలీ తప్పంతా నాన్నది. మీకు మాటివ్వటం ఏమిటి? మీకు బదులు ఏ గుమాస్తాని కట్టుకున్నా అంతకన్నా సుఖంగా వుండేది ప్రాణం-"

మొహంమీద అగ్నిపర్వతం బ్రద్దలైనట్టు కదిలిపోయాడు అతడు. మనం పడే కష్టానికీ, దాన్ని మనవాళ్ళు

అనుకున్నవాళ్ళు అర్థం చేసుకునే విధానానికీ, ఇంత వ్యత్యాసం వుంటుందనుకోలేదు అతడు.

* * *

రవితేజ కారొచ్చి L.I.C. క్వార్టర్ల ముందు ఆగింది. అందులోంచి అతడూ, మాధవీ దిగారు. ఈ లోపులో లోపల్నుంచి మాధవరావు బయటకు వచ్చాడు. అతడు రెవెన్యూ డిపార్టుమెంట్ లో గుమాస్తా.

ఇంటిముందు కారు ఆగటంతో తల్లీ, అతడి ముగ్గురు చెల్లెళ్ళూ కిటికీల్లోంచి చూస్తున్నారు. రవితేజ కార్లోంచి రెండు పెద్ద పెద్ద దండలు తీసి చేత్తో పట్టుకుని, లోపలికి నడిచేడు. హాల్లో నిలబడి ఇద్దరివైపూ చూశాడు. ఇద్దరికీ చెరో దండ ఇచ్చాడు. ఈ లోపులో చెల్లెళ్ళు, తల్లి ఆ గదిలోకి వచ్చారు.

మాధవరావు, మాధవి దండలు మార్చుకున్నారు. తల్లి హారతి ఇచ్చింది. రవితేజ పళ్ళెంలో పదివేలు వేశాడు. తరువాత మాధవరావుకి షేక్ హాండిస్తూ, "నిండు మనసుతో నా భార్యని పునర్వివాహం చేసుకున్నందుకు అభినందనలు" అన్నాడు. తరువాత మాధవివైపు తిరిగి, "నీ కోర్కె కూడా నెరవేరింది కదూ మాధవి. ఇక హాయిగా వుండు-" అన్నాడు.

చేతులు రెండూ కోటు జేబుల్లో పెట్టుకుని తాపీగా బయటకొచ్చి కారు స్టార్ట్ చేశాడు. దంపతులిద్దరూ కారు వద్దకు వచ్చారు.

"నా పెద్ద చెల్లెలి పెళ్ళి మీరు చేస్తారనే ఆశతో మీ భార్యని నేను చేసుకున్నాను" అన్నాడు మాధవరావు.

రవితేజ నవ్వాడు. "పెద్ద చెల్లెలే కాదు, మిగతా చెల్లెళ్ళ పెళ్ళికూడా చేస్తాను. డబ్బు పెద్ద సమస్య కాదు. మా ఆవిడైతే..... సారీ......మాజీభార్య అయితే, అసలు డబ్బెందుకు అంటుంది. అంతేనా మాధవీ..... ఇప్పుడు నీ కోర్కె తీరింది. ఆఫీసు, ఇల్లు తప్ప మూడో విషయం తెలియని మాధవరావు నీకు భర్తగా వచ్చాడు. ఒకరి కష్టాల్లో ఒకరు పాలు పంచుకోవచ్చు. ఆఫీసునించి రాగానే షికార్లు వెళ్ళవచ్చు. పాలునీళ్ళులాగా కలిసిపోవచ్చు. నువ్వు కోరుకున్నదీ అదేగా! నా వాళ్ళందరూ సుఖంగా వుండాలన్నదే నా కోర్కె బెస్టాఫ్ లక్!" అంటూ కారు ముందుకి పోనిచ్చాడు.

* * *

ఎన్నిరోజులు గడిచాయో తెలీదు. ఒక వర్షం కురిసిన రాత్రి తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. రవితేజ తలుపులు తీశాడు.

ఎదురుగా మాధవి వుంది. "వొచ్చేసానండీ అక్కడ వుండలేక వచ్చేశాను" అంది.

"ఏమైంది మాధవీ? సాయంత్రప్పూట పార్కులకి వెళ్ళటం లేదా? ఒకళ్ళ కష్టాలు మరొకరు పాలు పంచుకోలేకపోయారా?" ఆత్రంగా అడిగాడు.

"రాత్రి రెండింటికి లేచి ఆ పంపులో నీళ్ళు పట్టలేనండీ.....ఆ రెండో ఆడపడుచు పైకి అలా కనపడుతూంది కానీ నంగనాచి. ఆయన జీతంలో నేనేదో కాస్త తీసి చీరకోసం వుంచుకున్నానని తెలిసి, తనకీ ఓ చీర కావాలని తల్లి దగ్గిర చేరి ఒకటే నసుగుడు. అబ్బబ్బ..... ఆ ఇంట్లో నేనో క్షణం వుండలేకపోయాను."

"ఇంటి సంగతి సరే! ఆయన ప్రేమగా చూసుకుంటున్నాడా? అది చెప్పు!"

"ఆ! చూసుకుంటారు. ఏం లాభం! పెద్దోడి కీసారి క్లాసులో మార్కులు సరిగ్గా రాలేదు. రెండోవాడికి అజీర్తి. దాంతో ఇంతకు ముందులా ఆయన ఇంటిక్కూడా పెందరాళే రావటంలేదు. స్నేహితుల్తో తిరిగి ఏ ఎనిమిదింటికో వస్తారు. ఈ మధ్య సిగరెట్లు కూడ తెగ కాలుస్తున్నారు. కాని సిగరెట్టు పొగ అసలు పడదు. మీకు తెలుసుగా!"

"వొద్దనీ చెప్పలేకపోయావా?"

"చెప్పానండీ... పెళ్ళయిన మొదట్లో కొంతకాలం మానేసారు. మళ్ళీ ఇప్పుడు మొదలుపెట్టారు. ఎందుకని అడిగితే, బాధలూ, టెన్షన్ మర్చిపోవటానికి అన్నారు."

"మరిప్పుడేం చేస్తావు?"

"ఆయన్నొదిలేసి, ఏదైనా ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోదామనుకుంటున్నాను. ఏ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లోనో వుంటాను."

"అదే మంచిదనుకుంటాను మాధవీ! నీ మనస్తత్వానికి ఎలాంటి మొగవాడూ సరిపోడు."

"అదేమిటండీ?"

"తను కొన్న చీరకన్నా, తన తోటికోడలు కొనుక్కున్న చీరే బావున్నట్టు తోచటం సహజం! చీరలవరకూ అయితే ఫర్వాలేదు కానీ, అది జీవితానికి కూడా అన్వయించుకుంటే కష్టం. నీ మొగుడూ, నీ కాపురం కన్నా, ఎదురింటి కాపురం బావున్నట్టు అనిపించిన మరుక్షణం నీకు సుఖశాంతులు కరువైనట్లే. ఇది తెలుసుకోగలిగావు... చాలు."

రవితేజకి చప్పున మెలకువ వచ్చింది. వళ్ళంతా చెమట పట్టింది. చాలా సుదీర్ఘమైన కల..... తల పక్కకి తిప్పి చూశాడు. మాధవి నిద్రపోతోంది. వెల్లకిలా, కాళ్ళు కాస్త ఎడంగా, రైల్వే ప్లాట్ ఫాం మీద కూలీలు పడుకునేటట్టు! -

భార్యని ఆపోశ్చర్ తో చూడలేక మరోపక్కకి తిరిగి పడుకున్నాడు.

వచ్చిన కలే అతడిని వెంటాడుతుంది. అతడికి సిగ్గుకూడా వేసింది. ఏమిటా కలకి అర్ధం!

తనునుంచి తన భార్య దూరంగా వెళ్ళిపోవాలని మనసులో కోరుకుంటున్నాడా? లేదు ఆమె చేసే పనులకి, ఆమె వాదించే దానికీ - ఒకోసారి చెంప బ్రద్దలు కొట్టాలన్నంత కోపం వచ్చే మాట నిజమే. అంతమాత్రం చేత విడిపోవాలనుకోలేదు ఎప్పుడూ తన దురదృష్టానికి తనలోనే ఏడ్చేవాడు అంతే!

పెళ్ళయిన కొత్తలో ఇప్పటికన్నా ఎక్కువ కష్టపడేవాడు. దాన్ని అర్ధం చేసుకునేది కాదు. "ఎందుకింత కష్టపడటం.... ఎవరు కష్టపడమన్నారు?" లాటి మాటలనేది. ఏ మనిషైనా గుర్తింపు కోసమే చాలా పనులు చేస్తాడు. అలాటి గుర్తింపు ఇంట్లో జీవిత భాగస్వామి దగ్గిరే దొరక్కపోతే ఏం లాభం?

పోనీ డబ్బంటే ఇష్టంలేదా...... అంటే.....

"చాఛా......ఫంక్షన్ కి వెళ్ళటానికి ఒక్క చీరలేదు" అంటుంది తయారవుతూ.

"అదేమిటి మాధవీ? బీరువాలో 350 చీరలు పెట్టుకుని..."

ఆమెకి 350 చీరలున్నాయని అతడికి తెలుసు. లెక్కపెట్టలేదు. కానీ మెదడులో ముద్రితమై పోయింది. 60 ఫారిన్ చీరలు, 80 పట్టుసిల్క్ చీరలు (32 బెనారస్, 3 గద్వాల్, 10 ధర్మవరం, 1 కుంభకోణం, 24 కాంచీపురం, 2 ఆరణి, (8 కాశ్మీరి), మధుర, వెంకటగిరి, పోచంపల్లి వగైరా చీరెలు 120, ఇవిగాక షిఫాను, జార్జెటు, ఆర్గండీ, చందేరీ ఫుల్ వాయిల్, హాఫ్ వాయిల్ మరో 90.

"బాగా లెక్కపెట్టి వుంచుకున్నారే."

"లెక్కకాహ్డు, మూడొందల యాభై చీరలు పెట్టుకుని, ఫంక్షన్ కి వెళ్ళటానికి ఒక్క చీర లేదంటావేం?"

"ఒక్కసారి వచ్చి చూడండి. అందరూ కొత్త కొత్త డిజైన్లు కట్టుకుని వస్తే- నేనేమో దేభ్యం మొహం వేసుకుని వెళ్ళాలి- ఛీ..... దేనికైనా పెట్టిపుట్టాలి. ఎప్పుడూ ఇవే చీరలు కట్టుకొస్తుందని అందరూ నవ్వుకోరూ?"

"మరి వున్న చీరలన్నీ ఏం చేస్తావు?" ఆశ్చర్యం గొంతులో నిండుతుంది.

"ఎన్నున్నాయి? అదేమీ జనరల్ మేనేజర్ గారి నడగండి. ఎన్ని చీరలున్నాయో వాళ్ళావిడకి."

"ఆవిడ కూడా ఈ ఫంక్షన్ కొస్తుందా?"

"వస్తుంది. ఏం?"

"ఇప్పుడు వాళ్ళింట్లో కూడా ఇదే వాదన జరుగుతూ వుంటుందని నా వుద్దేశ్యం. ఆవిడ నీ గురించి వాళ్ళాయనకి చెప్తూ వుంటుంది ఇలాగే-"

"చాల్లెండి ఇదో తర్కం నేర్చుకున్నారు."

"అవును తర్కమే! రాత్రింబవళ్ళు కష్టపడితే, ఎవరు పడమన్నారు- మిమ్మల్ని చేసుకోవటంకన్నా గుమాస్తాని చేసుకోవటం సుఖం అంటావు. మళ్ళీ ఫంక్షన్ కి వెళ్ళాల్సివస్తే ఒకసారి కట్టిన చీర మరోసారి కట్టనంటావు. ఎలా నీతో?"

"ఛీ ఛీ- పెళ్ళానికి ఎవరన్నా మంచి చీర కొనిపెడ్దామనుకుంటారు కానీ - ఇలా వాదనలతో కడుపు నింపుదామనుకోరు." అతనికి విసుగేస్తుంది, ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని భార్యని చూసి. ఫంక్షన్ కి వెళ్ళగానే పదిమంది కళ్ళూ తనమీదా, తన చీరమీదా పడాలి. తను- సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అవ్వాలి. అదీ కోర్కె!..... జీవితంలో మరే అఛీవ్ మెంటూ లేని స్త్రీలకి ఇంతకన్నా పెద్ద కోర్కెలేమిటుంటాయి?

అతడికింకా ఆ కలే గుర్తొస్తూంది! ఎందుకొచ్చిందా కల? అందుకే పురుషులు రేసులు, క్లబ్బులు పట్టుకు తిరుగుతారనుకుంట. మరి తనేం చెయ్యాలి!

ఆ రాత్రి అతడికి మరి నిద్ర పట్టలేదు. పక్కమీద చాలాసేపు అటూ ఇటూ పొర్లాడాడు.

అతడికి తన గతం గుర్తొచ్చింది. ఒకప్పుడు కటిక నేల మీద పడుకుని భవిష్యత్తు గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు వర్తమానం గురించిన ఆలోచన. భవిష్యత్తును గురించిన ఆలోచనల్లో ఆనందం వుంది. మనిషి వర్తమానం గురించి ఆలోచిస్తున్నాడంటే, బాధలో వుంటాడన్నమాట.

తనతో వచ్చిన పెద్ద చిక్కేమిటంటే, ఏమాత్రం అభిప్రాయ భేదం వచ్చినా వెంటనే సర్దుకుపోలేడు. ఒకరోజు ఏదో పెళ్ళికి పక్కింటావిడ చీర కట్టుకొని, ఆవిడ నగలే వేసుకుని తయారైంది. మళ్ళీ మామూలు గొడవే. "ఇన్ని నగలు, చీరలు వుండగా వేరే వాళ్ళవి వాడటం ఏమిటని" అతడు చిరాకుపడ్డాడు. ఇంకొకరి చీరలో ఆమె కనబడటం చాలా ఇరిటేటింగ్ గా అనిపించింది. అందులోనూ అన్ని చీరలు, నగలు వుండగా! ఇదంతా ఆడాళ్ళకి మామూలే అంటుంది. తను చిరాగ్గా పడుకుంటే, "ఛీ! ఏ మొగుడైనా పెళ్ళాన్ని బ్రతిమాలి మంచి చేసుకుంటాడు. అదికూడా తెలీదు. ఖర్మ!"

అంటుంది. ఎందుకు చేసుకుంటాడు? రాత్రయ్యేసరికి ఆమె కావాలి కాబట్టి!! తప్పు తనదే అనిపిస్తే పగలే చేసుకోవచ్చుగా, 'అవసరం' వచ్చినప్పుడే ఎందుకు చేసుకుంటాడు? ఈ విషయం గుర్తించి కూడా గుర్తించనట్టు కనబడటం ఆడవాళ్ళ అజ్ఞానమా? లేక తెలివా?

ఏదేమైనా ఈరకమైన 'దూరం' తమ మధ్యనుంచి పోదు.

ఆమెవైపు నుంచి కూడా ఆలోచించడానికి ప్రయత్నించాడు.

పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్ళటం, పెళ్ళాంతో కలిసి కూరగాయల మార్కెట్ కి వెళ్ళటం, ప్రొద్దున్నే పదింటికి ఆఫీసుకి వెళ్ళి సాయంత్రం అయిదింటి కొచ్చేయటం...చాలా మంచి విషయాలు. ప్రతి స్త్రీ కోరుకునేది అదే. కానీ రోజురోజుకీ మనిషి జీవితం సంక్లిష్టమవుతున్న రోజుల్లో, జీవన వ్యయం పెరుగుతున్న రోజుల్లో, ఇది సాధ్యమేనా? అసలేమీ సాధించని వాళ్ళుకూడా అయిదింటికి రావటంలేదు అని గ్రహించదే! "పక్కింటాయన్ని చూడండి. భార్యనెంత ప్రేమగా చూసుకుంటాడో" అంటుంది. ఈ పక్కింటి వాళ్ళందర్నీ మిషన్ గన్ తో కాల్చి చంపెయ్యాలి. తన సంసారం తప్ప ప్రపంచంలో మిగతా సంసారాలన్నీ హాయిగా వున్నట్టు ఆడవాళ్ళందరికీ అనిపిస్తుందెందుకో?

"......పదిసంవత్సరాల క్రితంలాగే బట్టలమూట మోస్తూవుంటే ఏమి వుండేది? శర్మగారు తనని కలుసుకోకపోతే ఎలా వుండేది!" అనుకున్నాడు. గతం గుర్తొచ్చింది.

.....పట్నంలో వీధి వీధి తిరుగుతూ అతడో విషయం గుర్తించాడు. రోడ్డున పోయేవాడి బట్టలు సాయంత్రమయ్యాక ఎవరూ కొనరు. భర్తలు ఇంట్లో లేనప్పుడే కాలక్షేపంకోసం పిలుస్తారు. ఒకటీ అరా కొంటారు. కాబట్టి ఆ సమయంలోనే అమ్మటం మంచిది. మిగతా వేళల్లో తిరగడం అనవసరం.

అందువల్ల సాయంత్రం పూట పని చేయటానికి అతడో బట్టల షాపులో చేరాడు.

ఒకరోజు ఒకాయన వచ్చాడు. దాదాపు యాభై ఏళ్ళుంటాయి. షాపులో యజమానితో సహా అందరూ ఆయన రాగానే లేచి నిలబడ్డారు. "బయట అద్దాల్లో మోడల్ బొమ్మకి కట్టిన చీర చాలా బావుంది. కార్లో వెళుతుంటే అట్రాక్ట్ చేసింది అదివ్వండి" అన్నాడు. హడావుడిగా యజమాని రవివైపు తిరిగి "ఆ చీర ఇవ్వు" అని, కూల్ డ్రింక్ తెప్పించటం కోసం వెళ్ళాడు.

రవి ఒక చీర తీసి యిచ్చాడు. ఆయన దానివైపు పరీక్షగా చూసి, "ఇదికాదు బయట బొమ్మకు కట్టింది" అన్నాడు.

"అదే ఇది. ఒకటే శారీ సర్!"

"కానీ అది బావుంది!"

రవి ఆయనవైపు చూసి నవ్వేడు. "-ఎంత బావున్నా, షోకేస్ లో కట్టిన చీరలు ఎప్పుడూ కొనకండి సర్. రోజుల తరబడి ఎండకి అవి కలర్ షేడ్ తప్పిపోయి ఉంటాయి." ఆయన మొహంలో ఆశ్చర్యం కనిపించింది, "కానీ ఈ చీరకీ దానికీ తేడా ఉన్నట్టుందే."

"చీరలో లేదు సర్. కట్టడంలో వుంది."

ఆయన ఈసారి అతడివైపో క్షణం కన్నార్పకుండా చూసి "సరే, పాక్ చెయ్యి" అన్నాడు. అని యజమాని దగ్గరికి వెళ్ళి కూల్ డ్రింక్స్ తీసుకున్నాడు. ఇద్దరూ కౌంటర్ దగ్గిర మాట్లాడుతూ వుండగా, "ఎవరా కుర్రాడు?" దూరంగా చీరని ప్యాక్ చేస్తున్న రవివంక చూస్తూ అన్నాడు.

"సాయంత్రం పూట పార్ట్ టైం చేస్తూ వుంటాడు సర్!"

"సాయంత్రం పూటా? ఇంతకు ముందీ సిస్టమ్ లేదే!"

"పగలంతా ఎక్కువ రష్ ఉండదు. సాయంత్రం పూట ఓ రెండు మూడు గంటలు నలుగురైదుగుర్ని పెట్టుకుంటే బావుంటుంది. ఎక్కువ జీతం ఇవ్వనవసరం లేదు."

"ఈ సలహా కూడా ఆ కుర్రవాడే యిచ్చాడా?" అంటూ కారువైపు నడిచాడు.

-ఈ లోపులో రవి చీర ప్యాకెట్టుతో వచ్చాడు. "అయ్యగారి కార్లో పెట్టు" అన్నాడు యజమాని.

ఆయన కార్లో కూర్చుని స్టార్టు చేస్తూ వుండగా, రవి ప్యాకెట్టు అందజేశాడు.

ఆయన చీర అందుకుంటూ, "ఎప్పుడూ కస్టమర్లకి 'ఈ చీర కొనకండీ!' అని చెప్పకూడదు" అన్నాడు క్లుప్తంగా.

"మన దగ్గిర రెండో చీర అలాంటిదే ఉన్నప్పుడు మొదటి చీరలో లోపం చెప్పటం ద్వారా కస్టమర్ కి నమ్మకం పెరుగుతుంది. రెండో చీర ఎలాగూ అమ్ముడవుతుంది...... సర్!"

కారు కదిలి వెళ్ళిపోయింది. రవి లోపలికి వచ్చి, పక్కనున్న సేల్స్ మన్ ని అడిగాడు ఆయన ఎవరని.

"శర్మగారు తెలీదా? తేజా టెక్స్ టైల్స్....." రవికి షాక్ తగిలినట్టయింది. తేజా టెక్ టైల్స్ చైర్మన్ తో తను

మాట్లాడాడు. ఆయనకీ 'తఃను' చీరాల గురించి చెప్పాడు.

* * *

....ఒకప్పుడు తేజా టెక్స్ టైల్స్ ఎంతో ప్రసిద్ధి. కానీ అది గతం శర్మగారికి గుర్రప్పందాల అలవాటు వుంది. దాంట్లో లక్షలు పోయాయి, తాగుడు అలవాటయింది. వ్యాపారంమీదా ఉత్సాహం పోయింది. క్రమంగా ఆ కంపెనీ మూతపడే స్థితికి వచ్చింది. ఇది వర్తమానం.

ఆ మరుసటిరోజు మధ్యాహ్నం మూడింటికి ఒక అమ్మాయి వచ్చింది షాప్ కి. ఆమెకి పాతికేళ్ళుంటాయి. యవ్వనంతో మెరిసి పోతోంది. లోపలికి రాలేదు. షోకేస్ దగ్గరే నిలబడి బొమ్మని చూస్తూ, "అందుకే నేను కట్టుకుంటే ఆయనకి నచ్చలేదు" అనుకుంది స్వగతంగా.

షాపు యజమాని పరుగెత్తుకుంటూ వచ్చి, "ఏమయింది మేడం?" అన్నాడు కంగారుగా.

"నిన్న ఆయన ఇక్కడే కొన్నారటగా ఇలాంటి చీర!"

"అవును మేడమ్!"

"ఈ బొమ్మలో వున్న అందం-నేను కట్టుకుంటే సగంకూడా రాలేదన్నారు. అదేమిటో చూద్దామని వచ్చాను" నవ్వింది. ".....ఎవరు దానికి కట్టింది?"

"రవి అని కుర్రాడు మేడమ్!"

ఆమె కారు దగ్గరకు నడిచి, కార్లో కూర్చుంది; ఆమె కెందుకనో నవ్వొచ్చింది. బహుశా భర్త మాటలకి కాబోలు.

ఆడవాళ్ళు షోకేసుల్లో బొమ్మల్లా వుండాలని ఏ భర్తయినా కోరుకుంటాడు. కుదరకపోతే విసుక్కుంటాడు.

"ఆ కుర్రవాడెవరో కట్టాడు. అది ఒక ఆర్ట్!" వెనుకే వచ్చిన షాపు యజమానితో చిరునవ్వుతో అంది. ఆమె మొహంలో ఎప్పుడూ చిరునవ్వు చెరగకుండా వుంది. అదో అందాన్ని ఇస్తుంది.

"రవి అని సాయంత్రం పూట వస్తాడు మేడమ్. పగలంతా స్వంతంగా వీధుల్లో అమ్ముకుంటాడు."

ఆ అమ్మాయి నవ్వుతూనే తలూపి, కారు స్టార్ట్ చేసింది. యజమాని లోపలికి వెళ్ళిపోయాడు. కారు పోనిస్తూ

యధాలాపంగా తల పక్కకి తిప్పి సడెన్ గా ఆపింది.

అప్పుడే రవి షాప్ మెట్లెక్కి లోపలికి వెళుతున్నాడు. ఆమె చేతులు స్టీరింగ్ మీద బిగుసుకున్నాయి.

అతడే.....

అయిదు సంవత్సరాల క్రితం -

మిస్ విజయవాడగా ఎన్నికవటానికి సరిగ్గా రెండు గంటల ముందు-అతడు అమర్చిన అలంకారంతో తనని తాను అద్దంలో చూసుకుని - ఆపుకోలేని ఎగ్జయిట్ మెంట్ తో ఎవర్నయితే ముద్దు పెట్టుకుందో - ఆ 'కుర్రవాడు'!

ఆమె లోపలికి తిరిగి వెళ్ళలేదు. కారు ముందుకు సాగిపోయింది. అతడిని కలుసుకునే ప్రయత్నమేమీ చేయలేదు. ఆమె మొహంమీద ఏదో ఉద్వేగభావం మాత్రం కదలాడుతున్నది.

ఆ రోజు సాయంత్రం షాపులో గొడవ జరిగింది. అందులోనే గోపీమాధుర్ అని ఇంకో సేల్స్ మాన్ పని చేస్తున్నాడు. అతడు చాలా సంవత్సరాలనుంచి ఆ షాపులో పని చేస్తున్నాడు. కొనటానికి వచ్చే ఆడవాళ్ళతో జోక్స్ వేసి మాట్లాడుతూ వుంటాడు. చీరలు చూపించేటప్పుడు కావాలని చెయ్యి తగిలించటం, ఈ చీర మీ వంటి రంగుకి చాలా బావుంటుంది అనటం, మీ స్ట్రక్చర్ కి ఏ చీరయినా సరిపోతుంది- లాంటి కామెంట్స్ చేయటం చేస్తూ వుంటాడు. అవతలివారి వైపునుంచి కాస్త ప్రోత్సాహకరమైన నవ్వు కనపడగానే, మరింత ముందుకు సాగుతాడు. "షోకేసులో బొమ్మకి చీర కట్టిన విధానం చూశారుగా- అలా కట్టుకోండి. బావుంటుంది- నేనే కట్టాను. కావాలంటే.." అని నవ్వి, సగంలో అర్ధవంతంగా నవ్వు ఆపుచేస్తాడు.

చాలామంది ఆడవాళ్ళు ఇలాంటివి ఇష్టపడరు. ఆ రోజు జరిగిన సంఘటన ఇలాంటిదే. ఆ షాపులోనే రెడీమేడ్-గార్మెంట్స్ విభాగం ఉంది. ఫాస్ట్ గా వున్నవాళ్ళు కాలేజీ అమ్మాయిలు అయితే, నంబర్ చెప్పి 'బ్రా వుందా?' అని అడుగుతారు. కొంతమంది బాగా మొహమాట పడతారు. అటువంటి అమ్మాయే ఒకామె వచ్చి, తల దించుకొని సన్నటి స్వరంతో చెప్పి, 'థర్టీ' వుందా? అని అడిగింది. గోపీమాధుర్ ప్యాకెట్ విప్పి, "థర్టీ టులో ఈ వెరైటీ అయితే...." అసభ్యంగా ఏదో మాట్లాడాడు. ఆ అమ్మాయి ఏమీ అనకుండా వెళ్ళిపోయాక, "ఎందుకలా అని కస్టమర్ని పోగొడతావు?" అన్నాడు రవి.

"నీ పనేదో నువ్వు చూసుకోరాదూ! నా సంగతెందుకు?" అన్నాడు మాధుర్. ఇద్దరికీ గొడవ జరిగింది. ఆ సాయంత్రం రవిని ఇద్దరు రౌడీలతో వచ్చి గోపీమాధుర్ తన్నబోయాడు. రవి తిరగబడ్డాడు. అతడు పల్లెల్లో పెరిగినవాడు, ముగ్గురినీ కొట్టాడు. మొత్తంమీద నలుగురూ ఆస్పత్రిలో చేరారు.

వారంరోజుల తరువాత రవి ఆస్పత్రినుంచి విడుదలయ్యే సరికి - అతడికి షాపులో ఉద్యోగం పోయినట్లు తెలిసింది. రెండు రోజులముందే డిశ్చార్జి అయి వచ్చేసిన మాధుర్, రవి గురించి నాలుగు కల్పించి చెప్పాడు. అతడెంతో కాలం నుంచి పనిచేస్తున్న వాడవటంచేత, యజమాని అతడి మాటనే నమ్మాడు.

రవి పెద్దగా బాధపడలేదు.

అతడికి అప్పటికే ఈ ఉద్యోగం బోర్ కొట్టింది. నిరర్ధకంగా తోచింది. ఎంతకాలం చేసినా ఈ పని ఇంతే. అప్పటికతడు ఒక వేయి రూపాయలదాకా జమచేశాడు కానీ వేయి రూపాయలతో ఏ పనికాదు. ఏదో ఒకటి చేయకపోతే చొచ్చుకుపోవడం కష్టం. ఆలోచించసాగాడు... రెండురోజుల తర్వాత అతడికో ఆలోచన తట్టింది.

పై సంఘటన జరిగిన వారంరోజులకి తేజా డైరెక్టర్ శర్మ తిరిగి ఆ షాప్ కొచ్చి రవి గురించి వాకబు చేశాడు.

"అతడిని తీసేశాం సార్!"

ఆశ్చర్యంగా, "ఎందుకు?" అని అడిగాడు. "ఏవో గుడ్డ ముక్కలు కొట్టేస్తున్నాడట. మా మాధుర్ చెప్పాడు."

"దొంగతనమా? ఆ కుర్రవాడు వప్పుకున్నాడా?"

"ఎందుకొప్పుకుంటాడు సర్? అతడేదో మాధుర్ మీద చెప్పాడు, ఆడవాళ్ళతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని కానీ మాధుర్ మా దగ్గర చాల సంవత్సరాలనుంచి పనిచేస్తున్నాడు" అన్నాడు యజమాని. ఆ వివరాలన్నీ కనుక్కున్నాక, శర్మ ఇంటికెళ్ళి భార్యతో జరిగిన సంగతి అంతా చెప్పాడు. "ఏదో మంచి ఉద్యోగం ఇద్దామని వెళితే, ఆ షాపులోనే తీసేశారట. నువ్వు గొప్ప పనిమంతుడన్నట్టు రికమెండ్ చేశావు. చూడు ఎలా చేశాడో?" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు.

మరుసటిరోజు సాయంత్రం షాపింగ్ కి ఆ షాప్ కే వెళ్ళిందామె. మధుర దగ్గరకెళ్ళి నిల్చుంది. వెనుతిరిగి బట్టలు సర్దుతున్న మాధుర్ వెనక్కి తిరిగి ఆమెను చూశాడు. ఒక్కక్షణం ఆమె అందాన్ని చూసి మతిపోయింది.

"ఏమి చూపించమంటారు మేడమ్?"

ఆమె వెంటనే జవాబు చెప్పకుండా నవ్వింది.

అయిదు సంవత్సారాల క్రితం లయోలా కాలేజీ కుర్రాళ్ళనంతా మజ్నూలని చేసి సత్యనారాయణపురం చుట్టూరా తిప్పిన నవ్వు అది.

"బ్రాసరీ లున్నాయా?" అని అడిగింది, నవ్వుతూనే "....36 నంబర్!"

ఆమె నెంబర్ చెప్పగానే మాధుర్ మొహంలో వెకిలినవ్వుతో కూడిన అదోలాటి భావం కదలాడింది. అదేదో మామూలుగా చూసినట్టు ఆమె బ్రెస్ట్ మీద రెండు క్షణాలు చూపు నిలిపి, తరువాత ఆమె మొహంలోకి చూశాడు. ఒక రకమైన ప్రొఫెషన్ ఇచ్చే 'పాస్' అది. ఆమె మొహంమీద నవ్వు అలాగే వుంది.

అతడు వెనుదిరిగి, వెనుకవున్నా బీరువాలోంచి ప్యాకెట్టు బయటకు తీయసాగాడు. తీస్తూ ఆలోచించాడు. ఆమె తన చూపుని గమనించి కూడా అలాగే చిరునవ్వుతో వుండటం అతడికి అదోలాటి ధైర్యాన్నిచ్చింది. అంతకు ముందయితే ఆమెలోని హుందా అతడిని భయపెట్టింది.

అతడు అన్నిరకాల బ్రాలని చూపుతూ, "ఈ హుక్స్ కొత్తగా వచ్చాయి మేడమ్ విప్పటానికి సులభంగా వుంటాయి" అన్నాడు. అలా అంటూ అతడు ఆ బ్రాని ఎత్తిపట్టుకున్న భంగిమ అసహ్యంగానూ, ప్రవొకేటింగ్ గానూ వుంది.

ఆమె తలెత్తి చూసింది. అతడు నవ్వేడు.

"ఎవరికి? నాకా? ఆయనకా-?" అందామె సన్నటి స్వరంతో పక్కనే వున్న సేల్స్ మెన్ కి కూడా వినిపించనంత నెమ్మదిగా దాంతో అతడికి పూర్తిగా ధైర్యం వచ్చింది. అతడికి తన అందం మీద చాలా నమ్మకం వుంది.

ఈ లోపులో ఆమె ప్యాకెట్ లోంచి మరొకటి తియ్యటానికి చెయ్యి వేసింది. అదే సమయానికి అతడు, తన చేత్తో పట్టుకున్న దాన్ని వదిలేశాడు. అది ఆమె చెయ్యిమీద పడగానే, మరొకటి తీసి ఆమెకి చూపెట్టే నెపంమీద తనూ వాటిమీద చెయ్యిపట్టి, బట్టలక్రింద వున్న ఆమె చేతిని నెమ్మదిగా స్పృశించాడు. ఆమె చెయ్యి తీయకపోవడంతో, చిటికెన వేలిని గట్టిగా వత్తాడు.

అప్పుడు పేలింది అతడి చెంప.

అద్దాలు కదిలిపోయేలా వినబడిన ఆ చప్పుడికి, ఒక్కసారి ఆ షాపు హాలంతా మార్మోగింది.

మాట్లాడుతున్న కస్టమర్లందరూ తలతిప్పి చూశారు.

అక్కడ శ్మశాన నిశ్శబ్దం ఆవరించింది కొద్దిసేపు.

కౌంటర్ దగ్గిరున్న యజమాని పరుగెత్తుకు వచ్చాడు.

అతడికి చెమటలు పట్టినయ్. "ఏమైంది మేడమ్? ఏమైంది మేడమ్?" అన్నాడు కంగారుగా.

ఆమె చెయ్యి ఇంకా మంట పెడుతూనే వుంది. ఇంతకుముందు నాలుగైదుసార్లు, చదువుకునే రోజుల్లో ఇలా కొట్టిందిగానీ, అప్పుడు సాధారణంగా అబ్బాయిలు సైకిల్ మీద కూర్చుని ఉత్తరం అందించిన వాళ్ళు, లేదా దూరం నుంచి ఏవో వెకిలి మాటలన్న వాళ్ళు అయివుండేవారు. ఇప్పుడలా కాదు. నిలబడి వున్నా మనిషిని, పది నిముషాలముందే కొట్టేటందుకు ప్రిపేరయి వుండి, సాచిపెట్టి కొట్టటం.

గోపీమాధుర్ కళ్ళు బైర్లు కమ్మాయి. అతడు ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ఊహించనంత వేగంతో జరిగిపోయిందంతా.

.....మాధుర్ దగ్గరికి ఆడవాళ్ళు రాగానే తాము ఎంతపనిలో ఉన్నా అతడి ప్రవర్తనని గమనించటం పక్క సేల్స్ మెన్ కి అలవాటు. అతడు 'టాకిల్' చేసే విధానాన్ని గమనిస్తూ వుండేవాడు. ఆ రోజు అంత అందమైన స్త్రీ అతడితో నవ్వుతూ మాట్లాడుతూ వుండటాన్ని ఒకరిద్దరు ఈర్ష్యతో చూస్తున్నారు. ఆమె చేతిమీద అతడు చెయ్యికూడా వెయ్యటం చూశారు. ఆమె సన్నటి స్వరంతో మాట్లాడటం చూసి, ఎక్కడ కలుసుకోవాలో చెప్పుతూ వుంది అనుకున్నారు. అంతలో ఆమె చాచిపెట్టి కొట్టింది. వాళ్ళుకూడా ఓ క్షణం నిశ్చేష్టులయ్యారు. కానీ వాళ్ళలో ఏదో ఆనందం పొంగిపొర్లింది. అతడిమీద ఈర్ష్యతో వాళ్ళ మనసుల్లో తగిన శాస్తి జరిగింది అనిపించింది. చూచిన దానికి నాలుగైదు కల్పించి పక్కవాళ్ళకి చెప్పసాగారు. గాలిలా పాకిపోయింది అది.

ఈ లోపులో ఆమె విసవిసా బయటికి నడిచింది.

యజమాని ఆమె వెనుకే చేతులు నులుముకుంటూ పరుగెత్తాడు. ఆమె ఏమీ మాట్లాడకుండా కారులో కూర్చుని పోనిచ్చింది.

ఆమె ఇంటికి చేరుకునేసరికి, అప్పటికే నాలుగైదుసార్లు ఫోన్ వచ్చింది. ఆమె ఫోన్ అందుకుంది. షాపు యజమాని "మాడమ్, సారీ మాడమ్ సారీ" అంటున్నాడు. ఈ సంఘటన షాపు అమ్మకాల్ని ఎంత తగ్గిస్తుందో అతడికి తెలుసు.

"సర్లెండి. అయిపోయిందేదో అయింది-"

యజమాని గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, థాంక్స్ మాడమ్-" అని ఆగి, ప్రాధేయపడుతున్నట్టు "-ఈ విషయం శర్మగారికి......" అని అర్ధోక్తిలో ఆపుచేశాడు.

"చెప్పన్లెండి. అయినా ఆడవాళ్ళొచ్చే షాపుల్లో అలాటి వాళ్ళుంటే అమ్మకాలు...." ఆమె మాటలు పూర్తి కాకుండానే

అతడు అందుకుని- "అవును మాడమ్- చాలా డేంజర్" అన్నాడు.

"ఇంతకీ వాడినేం చేశారు?"

"అప్పుడే తీసేశాను మాడమ్. రావల్సిన జీతం కూడా ఇచ్చి వెంటనే పంపేశాను."

"గుడ్..... అన్నట్టు వీడి సంగతి ఇంతకుముందే మీకో సేల్స్ మాన్ చెప్పినట్టున్నాడు కదూ. అనవసరంగా అతనిమీద దొంగతనం నేరం మోపి తీసేశారు."

"అవును మాడమ్ పొరపాటయిపోయింది. వీడు చాలాకాలం నుంచీ చేస్తున్నాడు కదా అని వీడి మాటలు నమ్మాము."

"పాపం అతనెక్కడున్నాడు?"

"తె.....తెలీదు మాడమ్."

"కనపడితే వెంటనే తిరిగి తీసుకోండి."

"తప్పకుండా మాడమ్.... ఈ విషయం శర్మగారి వరకూ...."

"నేను మర్చిపోతున్నాను. మీరూ మర్చిపోండి."

"థాంక్స్ మాడమ్."

"ఉంటాను."

## 4

**అయితే** రవి తిరిగి ఆ షాపు ఛాయలకి ఎన్నడూ వెళ్ళలేదు.

ఉద్యోగం పోయాక ఏం చెయ్యాలా అని ఆలోచించాడు.

మామూలుగా అయితే భారతదేశంలో చీరలమ్మేవాళ్ళు లక్షలమంది వున్నారు. దానివల్ల లాభం లేదు. పెద్ద ఎత్తున

చేయటానికి పెట్టుబడి లేదు. ఉన్నంతలో ఏదో చేయాలి.

తన దగ్గిరున్న వెయ్యి రూపాయల్తో వర్తకం చేయలేనని అతడికి తెలుసు. కొద్దిగా అప్పు తీసుకున్నా, మహా అయితే ఓ ఇరవై చీరలొస్తాయి. వాటిలో ఎన్నని అమ్మగలడు?

రవి ఆలోచించాడు.

ఏదో ఒకటి కొత్తగా చేస్తే తప్ప లాభంలేదు.

షాపులో ఉద్యోగం మానెయ్యటంవల్ల - ఇంట్లో డబ్బు కూడా లేదు. మాధవి, మాధవి తల్లి (తన అత్తగారు) గొణుక్కోవటం ప్రారంభించి చాలాకాలమైంది. బావమరిది రోడ్డుపట్టుకు తిరగటం తప్ప పనేమీ చేయడు. బయటకు వెళ్ళటానికి పాంటు కూడా లేదు. ఉన్న ఒక్క పాంటూ చిరిగిపోయింది. "ఎన్ని సార్లు కుట్టాలి బాబూ - కుట్టుకూడా నిలబడటం లేదు" అన్న తిరస్కారంతో, తనకా పని ఇష్టంలేదని అన్యాపదేశంగా మాధవి అతడికి తెలియచేసింది.

మోకాళ్ళ దగ్గిర చిరుగుని, మరో గుడ్డ వెనుకపెట్టి తనే కుట్టుకోవడం ప్రారంభించాడు అతడు! ఇటువంటి తిరస్కారాలు అతడికి అలవాటే.

చేతికుట్టు పైకి కనపడకుండా పాంటు కుట్టుకుంటూ వుండగా-

-అప్పుడు స్ఫురించింది అతడికి. ఆప్లిక్ వర్క్,

సాదా చీరమీద వేరే గుడ్డతో డిజైను కుట్టి, దాన్నే ఒక అద్భుతమైన చీరగా మార్చటాన్ని ఆప్లిక్ వర్క్ అంటారు. ఎంబ్రాయిడరీ అంత బాగోదు అని చాలామంది అనుకుంటారు. కానీ అది కేవలం కుట్టటం చేతకాక! చీర రంగు, పైన వేసే గుడ్డ రంగు సరిగ్గా మ్యాచ్ అవ్వాలి. మళ్ళీ మ్యాచ్ అవటం అంటే తెలుపుకి నలుపు, నలుపుకి తెలుపు ఇలాంటి గుడ్డ మ్యాచింగు కాదు. అది పుస్తకాల్లో చదివితే రాదు. కుట్టవలసిన ఆకృతి (డిజైన్) బట్టరంగు ఎన్నుకోవటం కూడా ఒక కళ. ఆలోచనంటూ రావాలేగానీ అలాంటి ఆర్టు అతడి చేతిలోనే వుంది.

రవి ముందునుంచీ ఆలోచించేది ఒకటే! షాపువాళ్ళు 'జనరల్'గా ఇచ్చేదీ ప్రత్యేకంగా ఇవ్వలేనిదీ తను ఇవ్వాలి. షాపువాళ్ళు వేసిన ఆప్లిక్ వర్క్ లో మంచిగుడ్డ వాడరు. చీరకన్నా ముందు అది వెలిసిపోతుంది. పల్చటి చీరకు మందపాటి బట్టవేస్తే డిజైను కనిపించకపోగా, చీర క్రుంగిపోతుంది. షాపుల్లో దొరికేవి అన్నీ ఒకే రకంగా వుంటాయి. ఇక్కడే అతడు తన పథకం అమలులో పెట్టదల్చుకున్నది.

ప్రింటింగ్ చీరలకి దీనికి తేడా ఏమిటి, ప్రింట్ చేయించుకోవచ్చుగా అనేవాళ్ళకి దీని అందం తెలీదు. దీని అందం

అంతా డిజైను అందంగా కత్తిరించటంలోను, వాడే దారాల రంగుల్లోనూ వుంటుంది. అందులో అతడు ఎలాగూ నిష్ణాతుడు.

పెట్టుబడి వెయ్యికీ-మరో వెయ్యి అప్పుతో ఇరవై చీరలు తీసుకున్నాడు. పది జార్జెట్, పది ఆర్గండీ అందులో చెరో ఐదు మీదా పది రోజులు కూర్చుని అప్లిక్ వర్క్ చేశాడు.

మొత్తం ఇరవై చీరల్నీ పట్టుకుని ఓ గవర్నమెంటు ఆఫీసుకి వెళ్ళాడు.

ఇక్కడ ఆఫీసుల్లో చీరల అమ్మకం గురించి కొంచెం చెప్పాలి. అడవుల్లో లేళ్ళగుంపు వెళ్తూ వుంటుంది. ముందు వెళ్తున్న లేడి కాస్త తలపైకెత్తి- తడిసిన గడ్డి వాసన పసిగట్టి పరుగెడుతుంది. వెనుక లేళ్ళన్నీ దాని వెనుక అక్కడికి చేరుకుంటాయి.

చీరలవాళ్ళు మూటలు తీసుకుని మెల్లగా ఆఫీసులోకి ప్రవేశించి బాగా తెలిసినవాళ్ళకి తాము వచ్చిన సంగతి మెల్లగా తెలియజేస్తారు. ఎక్స్ టెన్షన్ ఫోన్లోనో, లేక చిన్న చిరునవ్వు సైగతోనో ఈ వార్త క్షణాల్లో ఆఫీసంతా పాకిపోతుంది. ఇదంతా రహస్యంగా జరుగుతున్నట్టు వుంటుంది. కానీ అందరికీ తెలిసే జరుగుతూ వుంటుంది. ఆఫీసరు స్ట్రిక్టు అయితే మంచినీళ్ళతో, టాయిలెట్ కనో బయల్దేరతారు. లంచ్ రూమ్ లు తాత్కాలికమైన చీరల షాపుల్లాగా మారతాయి. ఈ చీరలు సాధారణంగా ఇన్ స్టాల్ మెంట్ పద్ధతిలో అమ్మబడతాయి. ఎక్కువ వెరైటీలు లేకపోయినా పక్క ఆడది కొంటూందే అన్న ఆరాటం "మాస్ మెంటాలిటీ" మనస్తత్వం మీద బాగా ప్రభావితమై, బజార్లో దొరికే మామూలు చీరల్నే ఎక్కువ ధరకి కొనేలా చేస్తుంది. ఆఫీసుల్లో ప్రతిరోజు ఎంతో కష్టపడి పనిచేసే ఆడవాళ్ళకి ఇలా మధ్యమధ్యలో చీరల బేరం చేయటం, ఎంతో మానసిక శ్రమని తగ్గించి ఉత్సాహపరుస్తున్దిల్. ఎవరైనా సెక్షన్ ఆఫీసరు దీనికి అభ్యంతరం పెడితే అతడు యముడుగా చూడబడటంలో తప్పేముంది?

(ఒక రచయిత మిత్రుడిని చూడటానికి ఎ.జి. ఆఫీసుకు వెళ్ళినప్పుడు ముగ్గురాడవాళ్ళు అగ్నిమాపక సిబ్బంది స్థాయిలో వరండాలో పరుగెడ్తూంటే కంగారుపడి విషయం ఏమిటి అని కనుక్కుంటే... అప్పుడే చీరలవాడు వచ్చాడని తెలిసింది. రచనలవల్ల సమాజంలో మార్పు ఎందుకు తీసుకురారు అనే వారికి.....అంత మార్పెందుకు.....కనీసం ఈ నవల చదివి, ఒక్క ఉద్యోగిని అయినా ఆ గొర్రెల్లో కలవకుండా వ్యక్తిత్వం నిలుపుకుంటుందా అని ఎదురుప్రశ్న వేస్తే మరి సమాధానం ఏమిటో? వాయిదా పద్ధతి మీద చీరల్ని కొనుక్కునే అధికారం స్వంతంత్ర భారతదేశంలో ఎవరికైనా వుంది. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆఫీసు టైమ్ అయ్యాకే మా ఆఫీసు ఆడవాళ్ళని ఎంగేజ్ చెయ్యి అని చీరల వాడిని శాసించే అధికారం ఈ ప్రజాస్వామ్యంలో ఎవరికీ లేదు.)

రవి తన ఇరవై చీరల్నీ తీసుకెళ్ళి ఆఫీసులో ప్రదర్శన ప్రారంభించినప్పుడు ఆడవాళ్ళయితే మూగారుగానీ, మామూలు బడ్జెట్ చీరల్ని చూసి పెదవి విరిచారు. మరీ ఎక్కువ నెలసరి వాయిదాలు ఇచ్చే షరతు మీద రెండు చీరలు మాత్రం తీసుకున్నారు. అవీ మామూలువి అప్లిక్ చేయనివి.

ఒక దశాబ్దం ముందు ఆప్లిక్ వర్క్ కి అంత గుర్తింపు లేదు. అతడు చేసిన దెవరూ అంతగా పట్టించుకోలేదు. ఒక లావుగా వున్నావిడ మాత్రం దాన్ని తీసుకుంది.

అయితే రవి వెంటనే దాన్ని ఆమెకు అమ్మలేదు. ఇలాటి చీర మరొకటి కుట్టి తీసుకొస్తానమ్మా అని వెళ్ళిపోయి, మరుసటి రోజు రాత్రంతా కూర్చొని కుట్టి తీసుకొచ్చాడు.

మామూలుగా చూసేవాళ్ళకి ఆ రెంటికీ తేడా తెలీదు. ఆప్లిక్ లో విశిష్టత 'కట్టుకుంటేనే' తెలుస్తుంది. మొదటిరోజు ఎన్నిక చేస్తున్నప్పుడే ఆమె శరీరతత్వాన్ని కళ్ళతో అంచనా వేశాడు అతడు. అతడు రెండో చీరమీద కుడుతున్నప్పుడు.... ఆ శరీరానికి సరిపోయేలా....

....గుండె దగ్గర్లో పువ్వు

.....కొంగు చివర ఒకటి

.....నడుము దగ్గిర నుంచి కొంగు వేసుకొనే వంపు దగ్గిర ఒక పువ్వు.

.....కాళ్ళ దగ్గిర, కుడిచేతి కుచ్చిళ్ళలోకి వెళ్ళిపోతూ ఒకటి.

మొత్తం అయిదు పువ్వులు, చీరంతా సన్నటిలైను, మధ్య మధ్యలో చిన్న చిన్న ముక్కలు..... ఆమె కట్టుకుంటే.. సరిగ్గా సరిపోయేలా కుట్టాడు.

చిలకాకు పచ్చ రంగుమీద ఆప్లిక్ ఎంత బాగా కుదిరిందంటే,. రెండ్రోజులు తరువాత ఆమె దాన్ని కట్టుకుని ఆఫీసుకు వచ్చిన రోజు సచివాలయంలో స్ట్రయికు కన్నా ఎక్కువ సంచలనం సృష్టించింది.

పువ్వులు అమర్చటంలోనే ఆ "ట్రిక్" వుందని తెలుసుకోలేని ఆడవాళ్ళు......మొత్తం చీరలన్నిటినీ ఎగబడి కొనుక్కున్నారు. ఆడవాళ్ళు ముచ్చటపడితే మరి ధర సంగతి చూడరని అతడికి తెలుసు. వెయ్యికీ మరో వెయ్యి లాభం వచ్చింది.

అదీ ప్రారంభం.

ఆ తరువాత రెండు సంవత్సరాలకి.... అంటే 1978, 79 ప్రాంతాల్లో సాదా అమెరికన్ జార్జెట్ చీరలకి చిన్న చిన్న పువ్వులు వున్న గుడ్డని అంచుగా వేసి, అదే కలర్ బ్లౌజు వేసుకోవటం ఆంధ్రప్రదేశంలో ఒక రకమైన వేలం వెర్రిగా కూడా

మారిన సంగతి, పదేళ్ళ క్రితం విషయాలు జ్ఞాపకం వున్నవాళ్ళకి - ఇప్పటికీ గుర్తుండే వుంటుంది.

ఆ తరువాత అతడు ఎక్కడా ఆగలేదు. దాదాపు పది పన్నెండు షాపులకి ఆప్లిక్స్ సరఫరా చేసేవాడు. హైద్రాబాద్ లో కనీసం ఆరు ఆఫీసుల్లో ప్రతీ స్త్రీ అతడి దగ్గిర ఖాతా తెరిచింది. మొదటి ఆర్నెల్లలో అమ్మకాలు అరలక్ష దాటినయ్.

అప్పుడు కలిశాడు శర్మ అతడిని.....

## 5

**ఏదో** ఆఫీసులో చీరెల అమ్మకం విషయం మాట్లాడి అతడు మెట్లు దిగుతూ వుండగా, ఎదురుగా వస్తూ, శర్మ అతడిని ఆపుచేశాడు. 'ఫలానా షాపులో నాకు చీరమ్మింది నువ్వేకదూ' అని రవిని అన్నాడు. "ఆ రోజునుంచి నీ గురించి చూస్తున్నాము. పాపం నీ ఉద్యోగం పోయిందటగా నీ మీద అబద్దాలు చెప్పినవాడి ఉద్యోగం కూడా పోయిందటలే, మా ఆవిడ చెప్పింది. ఇంతకీ ఇప్పుడేం చేస్తున్నావు?"

"వాయిదాల పద్ధతిమీద చీరెలమ్ముతున్నాను, గవర్నమెంటు ఆఫీసుల్లో."

"నీ చేతిలో గొప్ప ఆర్టుంది....మా కంపెనీలో చేరకూడదూ?" రవి నవ్వి, "జీతం ఎంతిస్తారు?" అని అడిగాడు.

"అయిదొందలు. ఓ.కే...."

"ప్రస్తుతం నాకు డిజైన్స్ కత్తిరించే వాడికి నేను అంతే ఇస్తున్నాను. క్షమించండి. మిమ్మల్ని హర్ట్ చేయటం నా వుద్దేశ్యం కాదు. ఇప్పుడు నేను చేస్తున్న ఆప్లిక్ పని బాగానే వుంది. దాన్ని వదిలి రాలేను."

"ఎంతుంటాయి నీ అమ్మకాలు?"

"క్రితం నెల దాదాపు లక్ష..."

శర్మ విస్తుబోయి అతడివైపు చూశాడు. తేజ టెక్స్ టైల్స్ హైదరాబాద్ విభాగం అమ్మకాలకన్నా అది ఎక్కువ.

శర్మవ్యాపారవేత్త! తన ముఖ భంగిమ అవతలి మనిషికి కనపడనీయకుండా, "పోనీ నీకు నీ వ్యాపారంలో ఎంత లాభం వస్తుందో, అంతా ఇస్తాను. నీ ఆప్లిక్ వర్క్ అంతా మా కంపెనీకే చెయ్యకూడదూ?" అని అన్నాడు. దాదాపు ఆర్నెల్ల క్రితమైతే రవి ఎగిరి గంతేసి దానికి వప్పుకునేవాడే! అప్పుడు ఇతడు కేవలం ఒక బట్టల షాపులో సేల్స్ మెన్ కానీ.....ఇప్పుడు 'అమ్మకాల రుచి' చూచిన మనిషి! ఆ నిచ్చెన ఎక్కడికి తీసుకువెళ్తుందో తెలియనివాడు. రిస్కుకి

అలవాటు పడ్డవాడు.

"దానికెంత ఇస్తారు?"

"నెలకి పదివేలు."

అంటే సంవత్సరానికి లక్షా ఇరవై వేలు. ఫుట్ పాత్ ల మీద పడుకునే రోజుల్లో అందులో ఒక సున్నా తీసేసినా - అది కలలో కూడా ఊహించలేనంత పెద్ద రొక్కం.

తను చెప్పిన సంఖ్య, రవి మొహంలో తెచ్చే భావాల మార్పుని శర్మ మరోలా అర్ధం చేసుకుని, తను పొరపాటున ఎక్కువ చెప్పానేమో అనుకున్నాడు. "నువ్వు అన్నట్టు క్రితం నెల నీ అమ్మకాలు లక్షవుంటేనే సుమా" అని చివర్లో కలిపాడు.

శర్మ పదివేలు అనగానే వప్పుకోబోతున్న రవి, ఈ మాటలకి హర్ట్ అయ్యాడు. మొట్టమొదట, షాపులో ఆయన్ని చూడగానే గౌరవభావం కల్గింది. తేజా టెక్స్ టైల్స్ ఎమ్. డి. అనగానే, అనవసరంగా సలహా యిచ్చానా అని భయపడ్డాడు. కానీ యిప్పుడు ఈయన పూర్తి వ్యాపారవేత్తలాగే మాట్లాడటంతో, అతడూ అలాగే జవాబు చెప్పసాగాడు. అవును మరి. ఎప్పుడైతే వ్యాపారం రంగంలోకి దిగిందో ఇక అక్కడనుంచి మిగతావన్నీ పారిపోతాయి. తన చేతిలోని 'కళ' విలువ తెలిసినవాడు అతడు. తన వ్యాపారంలో యిప్పటికే పదివేలు లాభం సంపాదిస్తున్నవాడు అతడు. "సంవత్సరానికి లక్షా ఇరవైవేలు యిస్తామంటున్నారు. నాకు అంత అవసరంలేదు. మీ కంపెనీలో అయిదు శాతం షేర్లు ఇప్పించండి చాలు."

"నీకేమైనా మతిపోయిందా? మా కంపెనీ కోటిరూపాయల్ది."

"అయ్యుండచ్చు. కానీ, గత పది సంవత్సరాలుగా ఒక రూపాయి కూడా సభ్యులకి లాభం పంచలేదు. షేరు ధర పదోవంతు కూడా లేదు మార్కెట్ లో-"

శర్మ ఆలోచనలో పడ్డాడు. ఇందులో ఏదైనా తిరకాసు వుందా అని రవి అన్నాడు- "చూడండి నిజానికి నెలకి పదివేలు అంటే నేను ఎగిరి గంతేసి వప్పుకోవాలి. కానీ మీ షేర్లు ఎందుకు అడుగుతున్నాను? మీలో ఒకడిగా కలిసిపోవటానికి! అప్పుడే నాకూ పనిచేయాలన్న తపన వుంటుంది. అయిదు శాతం షేర్లవల్ల నాకు తిండికి సరిపోయే డబ్బుకూడా వస్తుందని నేను అనుకోను." రవి తన కంపెనీ గురించి ఇంత స్టడీ ఎప్పుడు చేశాడో అర్థంకాలేదు. అతడు అన్ని కంపెనీలనీ అలాగే స్టడీ చేస్తున్నాడని మాత్రం తెలీదు. ఏమైతేనేం, వర్మ కొంచెం ఆలోచించి, వప్పుకున్నాడు మొత్తానికి.

అలా రవి తేజా టెక్స్ టైల్స్ లో షేర్ హోల్డర్ అయ్యాడు.

ఆ రోజునుంచీ తేక కంపెనీ పరుగు మొదలు పెట్టింది. మొత్తం కంపెనీ అంతా కాదు. కేవలం ఆప్లిక్ విభాగం దానికి అధిపతి రవి. ఆ ఒక్క విభాగం లాభాలే మొత్తం కంపెనీ పోషించవలసిన స్టేజి వచ్చింది. ముందెక్కడో చెప్పినట్టు 1978-79 లో ఈ ఆప్లిక్ వర్క్ ఆంధ్రదేశాన్ని వూపేసింది.

తేజా టెక్స్ టైల్స్ కంపెనీలో అరవై శాతం పైగా షేర్లు శర్మవే. ఆయనకీ వున్న గుర్రప్పందేల పిచ్చి మిగతా డైరెక్టర్లకి తలనొప్పిగా వుండేది. కంపెనీ మూలధనాన్ని ముట్టుకునేవాడు కాదు. కానీ లాభాలన్నీ గుర్రాలమీద పెట్టేవాడు. అందువల్ల అభివృద్ధి కుంటుపడింది. ఎన్నో సంవత్సరాల్నుంచీ ఇది జరుగుతూ వుంది. రవి, తన బాధ్యతని ఒక యజ్ఞంలా నిర్వహిస్తూ వచ్చాడు. ఆర్నెల్లలో అతడు మొత్తం మార్కెట్టు చదివాడు. బోంబేడైయింగ్, విమల్ లాంటి కంపెనీల షేర్లు రోజురోజుకీ ధర పెరుగుతున్నాయి. కేవలం తమ కంపెనీదే పెరగటం లేదు. దీనికి కారణం అందరికీ తెలుసు. కానీ ఎవరూ ఏమీ చెయ్యలేరు. సంవత్సరం గడిచింది. ఈ లోపులో అతడు తేజా టెక్స్ టైల్స్ వెనుక ఒక బలమైన శక్తిగా రూపొందాడు.

ఇలా వుండగా ఒకరోజు చిత్రమైన సంఘటన జరిగింది.

'ప్రేమ మంజరి' అనే గుర్రం గెలుస్తుందని శర్మకి నిశ్చయంగా తెలిసింది. దానిమీద ఇరవై లక్షలు కాద్దామని దృఢనిశ్చయంతో వున్నాడు. కానీ డబ్బులేదు. ఎన్ని విధాలో ట్రై చేశాడు. షేర్లు కుదువపెడదామనుకున్నాడు కూడా. కానీ మార్కెట్ లో ఆ షేర్లని తనఖా పెట్టుకోవటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. కాలు గాలిన పిల్లిలా తిరగసాగాడు.

సరీగ్గా అప్పుడు మిగతా డైరెక్టర్లతో కలిసి రవి అతడికో పరిష్కారం సూచించాడు.

తేజా టెక్స్ టైల్స్ 'ఒక్కరోజు' కోసం శర్మకి ఇరవై లక్షలు అనధికారంగా అప్పు ఇచ్చేటట్టూ, ఆ గుర్రం ఓడిపోయిన పక్షంలో శర్మ తన షేర్లన్నీ వదిలేసుకొనేట్టూ, గెల్చిన పక్షంలో ఇరవైశాతం కంపెనీకి దానంగా ఇచ్చేటట్టూ....

శర్మకి ఈ ప్రపోజల్ అర్థంకాలేదు. డైరెక్టర్లందరూ కూర్చున్నారు. వాళ్ళ ఇంటిలో, క్రిందహాల్లో ఈ సమావేశం జరిగింది. "మీరేం చెపుతున్నారో నాకు అర్థంకావడంలేదు. ఇరవై లక్షలకి నా అరవై శాతం వదులుకుని, మొత్తం తేజా టెక్స్ టైల్స్... నేను స్థాపించింది దాంతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలా?"

"గుర్రం ఓడిపోతే అంతే" అన్నాడు రవి. "....అసలు గుర్రం ఓడిపోతే 'తేజ' అన్న కంపెనీయే వుండదు, ఇక తెగతెంపులు ప్రసక్తి ఏముంది?"

"అదేమిటి?"

"అవును బట్టల తయారీకి స్థాపించిన ఫ్యాక్టరీ తాలూకు డబ్బుని ఈ విధంగా గుర్రప్పందాల్లో పోగొట్టుకున్నామని ఏ ఒక్క సభ్యుడు పోలీసు కంప్లెయింటు యిచ్చినా అంతా జైల్లో వుంటాం. ఎవరికీ ఏడు సంవత్సరాలకి తక్కువ శిక్ష పడదు. ఇక తేజా కంపెనీ ఏముంటుంది?"

శర్మకి అతడు చెపుతున్నది అర్ధం అయింది.

"ఒకవేళ గెలిస్తే?"

"గెలిస్తే ఆ ఇరవై లక్షల మీదా మీకో ముప్పై లక్షలు లాభం వస్తుంది. లాభం మీరుంచుకోండి. మీకీ సాయం చేసినందుకు మాకు ఇరవై శాతం షేరు 'దానం' 'చేస్తున్నారు. అంతే!"

"అంటే 60% నుంచి నా షేరు 40% తగ్గిపోతుంది. కంపెనీ వ్యవహారాల్లో నాకే మాత్రం పలుకుబడి వుండదు. అంతేగా." ఎవరూ మాట్లాడలేదు. తన గుర్రాల బలహీనతని అవతలివాళ్ళు ఉపయోగించుకుంటున్నారేమో అన్న అనుమానం కలిగింది శర్మకి దాన్ని ఖండిస్తూ రవి అన్నాడు -

"మీరు మాకిచ్చిన షేర్ల ని కూడా మేము మీ పేర ట్రస్ట్ లోనే వుంచుతాం. అంటే దానిమీద వచ్చే లాభాలు కూడా మీకే చెందుతాయి."

"అంటే కేవలం ఒక్కరోజు మీరు నాకు ఇరవై లక్షలు చేబదులు ఇచ్చినందుకు - నేను నా కంపెనీ మీద అధికారాలు మీకు వప్పగించి, లాభాలు మాత్రం తీసుకోవాలి..... అవునా."

"కేవలం ఒక్కరోజు అప్పు ఇచ్చినందుకు కాదు. మా ఆరుగురు డైరెక్టర్ల భవిష్యత్తు జైల్లో గడపడం - అనే రిస్కు తీసుకున్నందుకు..."

శర్మ ఆలోచించాడు. "సరే, మీరు చెప్పినట్టే చేద్దాం. ఇరవై లక్షలు యివ్వండి. కానీ ఈ డబ్బు నా కిచ్చినట్టు ఏ రికార్డులోనూ వుండకూడదు. అదీ నా తరపునుంచి షరతు."

అతడు చెపుతున్న దేమిటో అక్కడున్న వారందరికీ అర్ధమయింది. గుర్రం ఓడిపోతే ఇరవై లక్షలూ పోతాయి. తేజా టెక్స్ టైల్స్ డైరెక్టర్లందరూ అరెస్టవుతారు. శర్మ మాత్రం అవడు (కంపెనీ డబ్బులేక మూతపడుతుంది. అది వేరే సంగతి) తుమ్మితే వూడే ముక్కు వున్నా ఒకటే లేకున్నా ఒకటే.

గుర్రం గెలిస్తే, మరుసటిరోజు డబ్బు జమ అవుతుంది. శర్మ షేర్లు శర్మకే వుంటాయి. అధికారం మాత్రం వుండదు.

అతడికేమీ నష్టంలేదు.....డైరెక్టర్లు ఆలోచనలో పడ్డారు. అందరూ దాన్ని రవి మీదకు తోసేశారు. శర్మ లేకుండా ఈ రిస్కు తీసుకోవటం వారికి ఇష్టంలేదు. చివరికి ఆ బాధ్యత తానొక్కడూ తీసుకోవటానికి రవి ఒప్పుకున్నాడు. అంటే - ఒకవేళ ఈ విషయం బయటపడితే రవే, ఆ డబ్బు కంపెనీ నుంచి తీసి ఇచ్చినట్టు పోలీసుల ముందు వప్పుకోవాలి. అలా అగ్రిమెంటు కుదిరింది.

ఒకరికి జీవితంలో ఆనందం ఇచ్చే వ్యసనం-

మరొకరికి నిచ్చెన మెట్లమీద జీవన్మరణ సమస్య

ఆ రాత్రి రవికి నిద్ర పట్టలేదు - టెన్షన్ తో-

పై గదిలోంచి ఇదంతా విన్న మరొకామెకి కూడా!

## 6

**ఆ మరుసటిరోజు** మూడింటికి, శర్మ తప్ప - మిగతా వాళ్ళంతా తేజ టెక్స్ టైల్స్ బోర్డ్ రూమ్ లో కూర్చుని వున్నారు. అందరి మొహాల్లోనూ టెన్షన్ కనపడుతూంది.

"మనం ఈ ఏర్పాటువల్ల శర్మగారితో శాశ్వతంగా మనస్పర్ధలు కొని తెచ్చుకుంటున్నామేమో" అన్నాడు డైరెక్టరు. "ఇప్పటివరకూ ఈ కంపెనీలో ఆయన చెప్పింది వేదం."

"అది గుర్రం గెలిస్తే సంగతి, ఓడిపోతే ఏమవుతుందో ఆలోచించండి. కంపెనీ శాశ్వతంగా మూతపడుతుంది."

"రవి జైలుకి వెళతాడు" పూర్తిచేశారు మరొకరు. సమయం మూడుగంటలా పది నిముషాలు అయి వుంటుంది.

ఇంతలో ఒక డైరెక్టర్ అన్నాడు. "శర్మ... మనిషి మంచివారే కానీ ఆయనకీ గుర్రాల పిచ్చి పోకపోతే ఆ కంపెనీ బాగుపడదు. ఇంకొంతకాలం ఇలాగే సాగుతే మనలో మనమాట-నేనింతవరకూ ఎవరికీ చెప్పలేదు. ఈ షేర్లన్నీ అమ్మేసి కంపెనీ నుంచి తప్పించుకుందామనుకున్నాను."

"నేనూ అంతే కేవలం ఆయనమీద గౌరవంతో ఆయనేం చేసినా వప్పుకుంటూ వచ్చాను. కానీ ఎంతకాలం? కానీ దానికీ ఒక హద్దు వుందిగా కంపెనీ ముఖ్యం".

రవి మాట్లాడకుండా వాళ్ళ సంభాషణ వింటున్నాడు. నిజానికి సమస్య వాళ్ళెవరిదీ కాదు, తనది. మనసులో మాత్రం

అనుకున్నాడు- ఈపాటికి గుర్రం పరుగెత్తటం ప్రారంభించి వుంటుంది.

అందరూ తమ తమ ఆలోచనల్లో వుండగా 3.20కి ఫోన్ మ్రోగింది. ఒక డైరెక్టర్ రిసీవర్ ఎత్తాడు.

రవి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

అవతలి వైపు నుంచి ఫోన్ పది సెకన్లు విని- పెట్టేస్తూ "డియర్ ఫ్రెండ్స్! "ప్రేమమంజరి" గుర్రం నాలుగు లెంగ్తుల్లో గెలిచిందట" అని ప్రకటించాడు చిరునవ్వుతో.

ఒక్కసారిగా హాల్లో చప్పట్లు ప్రతిధ్వనించాయి. అందరూ కరచాలనం చేసుకుంటున్నారు. ఏ సంతోషమూ ప్రకటించనివాడు రవి ఒకడే. అసలు సమస్య ఇప్పటినుంచీ ప్రారంభం అయిందని తెలుసు. ఎప్పుడైతే శర్మగారి ఏకఛత్రాధిపత్యం పోయిందని తెలిసిందో ఇక ప్రతివాడూ తనే ఆ కంపెనీ వ్యవహారాలు సరిదిద్దటానికి ప్రయత్నం చేస్తాడు.

....అరగంట తరువాత శర్మ కారు రివ్వున దూసుకొచ్చింది. అంత ముసలాయనా కుర్రాడిలా పరుగెత్తుకుంటూ మెట్లెక్కాడు. రవిని పట్టుకుని వూపేశాడు. "ప్రేమమంజరి గెల్చింది. ప్రేమ మంజరి గెల్చింది. ముఫ్పై లక్షలు" అని అరిచాడు. ఆయన మొహం వెయ్యి కాండిల్ బల్బులా వెలిగిపోతుంది. పది నిముషాలపాటు ఏకధాటిగా ఆ గుర్రపు గొప్పతనాన్ని వివరించాడు. చివరికి అసలు విషయానికి వచ్చాడు.

"నేను మన పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ఇరవైశాతం షేర్లు మన ట్రస్టుకిచ్చి అధికారం వదులుకోవాలి. కానీ నేనలా చేస్తానని వ్రాతపూర్వకమైన ఒప్పందం ఏమీ ఎల్దు. నేను వప్పుకోనన్నా ఎవరూ చేసేదేమీ లేదు" అందరివైపు చూసి నవ్వేడు. "నేను నా ఇరవైశాతం వదులుకోబోవటం లేదు" అని ఆపేడు. అక్కడ సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దంలోంచి ఆయన కంఠం తిరిగి వినిపించింది.

"మొత్తం అరవైశాతం షేర్లనీ ట్రస్టుగా పెట్టి రవిని ట్రస్టీగా వుంచుతున్నాను. తేజా టెక్స్ టైల్స్ నుంచి వెలువడే ప్రతీదీ ఈ రోజునుంచి 'రవితేజ'గా వ్యవహరించబడుతుంది".

ఒక్కసారిగా హాల్లో తిరిగి చప్పట్లు వినపడ్డాయి.

ఆ చప్పట్లు కొడుతున్న డైరెక్టర్ల వైపు సాలోచనగా చూశాడు. ఇందులో ఎందరు మనస్ఫూర్తిగా కొడుతున్నారో తెలీదు. శర్మగారు అధికారం వదులుకుంటే దాన్ని తమ చేతిలోకి తీసుకుందామని ఎందరు ఉవ్విళ్ళూరారో తనకు తెలీదు. రేపు తను తీసుకోబోయే నిర్ణయాలని ఎంతమంది సపోర్ట్ చేస్తారో తెలీదు. మొన్న మొన్న వచ్చినవాడు తను.

అతడు తలత్రిప్పి శర్మగారివైపు చూశాడు. ఈ ముసలాయన జీవితంలో మొట్టమొదటిసారిగా గెల్చిన ఆనందంలో ఏవేవో పిచ్చి పిచ్చి వాగ్దానాలు చేస్తున్నాడు. దీనిమీద ఎంతవరకూ నిలబడతాడో చూడాలి. ఏ క్షణమైనా కోపమొస్తే "ట్రస్టూ లేదు- గాడిద గుడ్డూ లేదూ, పొమ్మ" ని అనొచ్చు. ఈ వేడి తగ్గాక మాట్లాడాలి" అనుకున్నాడు. కానీ రవికన్నా ముందే శర్మే అతడితో రెండ్రోజుల తర్వాత మాట్లాడాడు.

రవి ఊహించిన దానికన్నా పెద్ద వ్యాపారవేత్త ఆయన.

"నేనేం తెలివితక్కువ వాడినికాను నిన్ను మేనేజర్ గా చెయ్యటానికి నాకా ఓపిక లేదు. నాక్కావలసిన నెలకి రెండు లక్షల ఖర్చు ఈ కంపెనీ భరించలేకపోతోంది. నా షేరుకి అంత లాభం వచ్చేలా చెయ్యి నిన్ను శాశ్వతంగా ఎమ్.డి.ని చేస్తాను. నేను ఇలా గుర్రప్పందేలాడుకుంటూ, వైన్ తాగుతూ గడిపేస్తాను శేషజీవితం" అన్నాడు.

ఇంకెవరయినా అయితే ఎగిరిగంతేసి వప్పుకునేవారే కానీ రవి భవిష్యత్తు ఆలోచించాడు.

నేను నా ప్రాణం ధారపోసి కంపెనీని లాభాల్లోకి తీసుకొస్తాను. ఆ తరువాత నన్ను తీసేస్తే?" అని ఎదురుప్రశ్న వేశాడు.

"మరేం చెయ్యాలి? షేర్లన్నీ నీ పేరుమీద మార్చాలా?"

"అక్కర్లేదు పదవి నాకివ్వండి, లాభాలు మీరు తీసుకోండి. కానీ నేను కోరేది IRRIVOCABLE గా వుండాలి. అంతే నా ఆప్లిక్ విభాగం మీద వచ్చే డబ్బు నేను బ్రతకటానికి చాలు. నేనేమిటో చూపించాలంటే అన్ని అధికారాలూ నాకు కావాలి. లాభాలు అవసరం లేదు".

"నా కిష్టమే" అన్నాడు శర్మ.

అలా ప్రారంభమయింది రవితేజ టెక్స్ టైల్స్ కంపెనీ.

ఆ రోజునుంచీ రోజుకి పద్దెనిమిది గంటలు కష్టపడేవాడు రవి! రవితేజ.

* * *

అప్పటికే అతడు కామర్స్ లో డిప్లమా పాసయ్యాడు. మొత్తమంతా ఒక కొలిక్కి తీసుకువచ్చాడు. సంవత్సరం తిరిగేసరికి బ్రేక్ ఈవెన్ అయింది కంపెనీ. అప్పుడే వచ్చినయ్ ఛాందినీ ఆ తరువాత క్రాస్ స్టిచ్ ఆర్గండీ లో కొత్తరకం పెద్ద అంచులున్నవి, ఫారిన్ కలర్లు.....

రెండో సంవత్సరం కంపెనీ లాభాల్ని చూసి "మైగాడ్, తేజా టెక్స్ టైల్స్ తిరిగి ఇన్ని లాభాలు కళ్ళజూస్తుంది అని నేను కలలో కూడా అనుకోలేదు" అన్నాడు శర్మ.

అప్పటివరకు కాస్తో కూస్తో గొణుగుతున్న డైరెక్టర్లు ఎవరైనా వుంటే (మొన్న మొన్న వచ్చినవాడిని అందలం ఎక్కించటం ఏమిటా అని) మూడో సంవత్సరం తిరిగేసరికి సంతృప్తులయ్యారు.

అంచెలంచెలుగా పెరుగుతున్న రవితేజ టెక్స్ టైల్స్ అభివృద్ధి పట్ల అసంతృప్తులైనవారు కొందరు లేకపోలేదు.

వారిలో ప్రముఖులు చెంచురామయ్య అండ్ కంపెనీ.

తగిన రోజుకోసం జాగ్రత్తగా వేచి వున్నారు.

1985 సెప్టెంబర్ లో ఆ రోజు వచ్చింది.

అప్పటికి రవితేజ టెక్స్ టైల్స్ వస్త్ర ప్రపంచంలో మకుటంలేని మహారాజులా వెలుగుతోంది. వంద రూపాయల షేరు వెయ్యి పలుకుతోంది. కంపెనీని విస్తరించటం కోసం మార్కెట్ లోకి వెళ్ళాడు రవి. పెట్టుబడిగా కోటిరూపాయలు తీసుకురావాలని అతడి ఆశయం.

దేశంలోని నాలుగు పెద్ద బ్యాంకుల చైర్మన్ లని కలుసుకున్నాడు. విరివిగా పార్టీ లిచ్చాడు.

అతడి షేర్లని కొనటానికి... చిన్న చిన్న కంపెనీలకి ఆ నాలుగు బ్యాంకులూ అప్పిచ్చేటట్టూ అంగీకారం కుదిరింది.

మంచో.... చెడో తెలీదుగానీ భారతదేశపు కామర్సు చరిత్రలో ఒక నూతనాధ్యాయం ప్రారంభానికి అతడు ఆ విధంగా నాందీ పలికాడు. కొందరే వుంటారు చరిత్రని సృష్టించేవాళ్ళు.

అతడికి తెలియనిదల్లా, తన ప్రతీ చర్యనీ రహస్యంగా చెంచురామయ్య అండ్ కో పరిశీలిస్తూ౦దని.

ఒక ప్రముఖ దినపత్రిక ఈ వార్తని రెడీ చేసుకొని, బాంబులా పేల్చటానికి సిద్దంగా వుందని...

ఆ బాంబుగానీ సరిగ్గా పేలితే, వస్త్ర ప్రపంచంలోంచి రవితేజ పేరు శాశ్వతంగా తొలిగిపోతుంది.

ఈ రంగాలన్నీ సిద్దమైన పదిహేను రోజులకి....

రవితేజ షేర్లు..... కోటిరూపాయలు విలువగలవి - మార్కెట్ లో విడుదలయ్యాయి.

రవితేజ కంపెనీ కాపిటల్ మార్కెట్ లోకి రాగానే, ముందు అనుకున్న ప్రకారం, చిన్న చిన్న కంపెనీలన్నీ ఆ షేర్లు కొన్నాయి. కోటిరూపాయలు పదోరోజుల్లో జమ అయ్యాయి. అది గొప్ప సంచలన వార్తగా పాకిపోయింది. అప్పటికీ 'ఆర్టీ' చీరెల గురించి అందరికీ తెలుసుకాబట్టి - అది ఎవరికీ అంతగా అనుమానం కలిగించలేదు. రవితేజ షేర్లు కనీసం ఓ పది అయినా తమవద్ద వున్నాయని చెప్పుకోవటం ఫ్యాషన్ అయింది. ఎక్కడ పెరుగుదల వుంటుందో అక్కడ శతృత్వం కూడా వుంటుంది.

చెంచురామయ్య అండ్ కో వారికి, కేంద్ర ఆర్థికమంత్రితో దగ్గర సంబంధాలున్నాయి. కేంద్రంలో వున్న పార్టీ తాలూకు దినపత్రిక ఆ విధంగా చెంచురామయ్యకి దగ్గరైంది.

వేటగాడు వల పరచుకుని కూర్చున్నట్టు ఈ పత్రిక తాలూకు మనుష్యులు రవితేజా చుట్టూ వేచి వున్నారన్న సంగతి మూడో కంటికి తెలీదు. అంత పకడ్బందీగా జరిగింది. రవితేజ కంపెనీ ఫైనాన్స్ డిపార్టుమెంటులో చెంచురామయ్య మనుష్యులు 'ప్లాంట్' చేయబడ్డారు.

మొత్తం రంగం అంతా సిద్ధం చేసుకొని ఆ పత్రిక దీన్నంతా ఒక వార్తగా ప్రచురించింది. ఆ తరువాత యీ కోటి రూఅపయాల వెనుకవున్న వ్యవహారమంతా, బ్యాంకుల పేర్లతో సహా ఎక్కడెక్కడ ఏ యే స్థాయిలో ఎవరెవరు సమావేశమైందీ, ఎవరెవర్ని ఎలా సంతృప్తి పరిచిందీ వివరంగా నెల రోజులపాటు వ్యాసాలుగా ప్రచురించింది. సి.బి.ఐ. దీనికోసమే ఎదురు చూస్తున్నట్టు రంగంలోకి దిగింది. వస్త్ర ప్రపంచంలోకి ధృవతారలా దూసుకువస్తున్న రవితేజా టెక్స్ టైల్స్ కి ఇది పిడుగుపాటులా తగిలింది.

శర్మ బేజారెత్తిపోయాడు. ఒకానొక స్టేజిలో మొత్తం షేర్లన్నీ అమ్మేసి, వ్యాపారం నుంచి తప్పుకుందామా అనికూడా ఆలోచించాడు. రవితేజ, మరి ముగ్గురు డైరెక్టర్లే ధైర్యంగా వున్నారు. ఏదొచ్చినా ఎదుర్కోవటానికి సిద్ధంగా నిలబడ్డారు వారు.

వ్యాపారంలో ఇది నైతికం - ఇది అన్యాయం అని ఏమీ లేదు. కోర్టు...ఇది చట్టవిరుద్ధం అని తేల్చేవరకూ దోషి కాదు. మూడు నెలల పాటు షేరు మార్కెట్టు కదిలిపోయింది. రిజర్వ్ బ్యాంక్ నోటీసులమీద నోటీసులు యిచ్చింది. అందరి దృష్టి ఈ కంపెనీ మీదే పడింది. అయినా కేసుపెట్టబడలేదు- కారణం రవితేజ కంపెనీ చేసింది చట్టవిరుద్ధం కాదు. నైతికంగా తప్పయితే అయి వుండవచ్చు. అది వేరే సంగతి. ఒక నేరంగా దీన్ని చట్టపరిధిలోకి తీసుకురావటానికి చెంచురామయ్య ఆర్థిక మంత్రి ద్వారా చాలా ప్రయత్నించాడు. ఒకవైపు ఇది చేస్తూ, రెండోవైపు ప్రజలకి ఆర్. టి. చీరెల మీద సానుభూతి (ఈ పదం కరక్టేనా?) పోయేలా ప్రోపగండా చేయించాడు. ప్రజల సొమ్ము తినేసిన కంపెనీ అనే భావం ప్రజల్లో కలిగించటానికి ప్రయత్నం చేశాడు.

మల్టీ నేషనల్ కంపెనీల మధ్య పోరాటాలు ఈ విధంగానే సాగుతాయి. ఈ పోరాటం కూడా మూడు నెలలపాటు ఈ విధంగానే సాగింది.

చెంచురామయ్య అంచనా ఎక్కడ తప్పిందంటే-ప్రజలు వ్యక్తుల్నీ, సంస్థల్నీ చూడరు. ప్రొడక్టు చూస్తారు. రెలియన్స్ అంటే తెలీదు. 'విమల్' అంటే తెలుస్తుంది. గార్డెన్ కన్నా వెరైటీ అంటే తెలుస్తుంది.

అలాగే రవితేజ ఆర్థిక సంక్షోభం-తాత్కాలికంగా పురోగతిని ఆటంకపరచినా, ఆర్టీ చీరెలు, ఆప్లిక్ చీరెలు- వీటిని ప్రజలు ఎగబడి కొంటూనే వున్నారు. ఒకవైపు నుంచి మబ్బులు మూసుకుంటున్నాయని, ఏ క్షణమైనా పిడుగు పడవచ్చని అనుకుంటున్న సమయాన, ప్రధానమంత్రికీ, ఆర్థికమంత్రికీ మధ్య పొరపొచ్చాలు రావటం, కాబినేట్ మార్పుల్లో అతడికి పదవిపోయి, తూర్పు దిక్కుగా తోసివేయబడటం జరిగింది. ఒక్కసారి ముఖ్యమైన మనిషి పదవినుంచి తొలగిపోయాక, చిన్న చిన్న శత్రువుల్ని సరిదిద్దటం తేజా టెక్స్ టైల్స్ లాంటి మల్టీక్రోర్ సంస్థకి పెద్ద సమస్య కాలేదు.

చెంచురామయ్య మీద ఈ విజయంతో రవితేజ పేరు ఒక్కసారిగా పైకి దూసుకుపోయింది.

ఒక స్టేజి వచ్చాక మనం చేసేది ఏమీ వుండదు. ఆయా రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులు ఇచ్చే సలహాల మీద మన తెలివితేటలు ప్రయోగించి నిర్ణయాలు తీసుకుంటే చాలు. ఈ గొడవల్తో మానసికంగా బెదిరిపోయి, శర్మ షేర్లు అమ్మేసి వుంటే జీవితాంతం విచారించి వుండేవాడు. అలా కాకుండా ఆపింది రవితేజా! షేర్ల అమ్మకంపై ఆర్థిక నిపుణుల సలహాలు అనుక్షణం అతడు తీసుకుంటూ వచ్చాడు. అది లాభించింది.

ఆ రాత్రి పూర్తిగా తాగేసి, శర్మ ఏడ్చాడు. అంత పెద్దవాడూ రవితేజ చేతులు పట్టుకుని "రవీ! ఎక్కడో గాలిలోంచి వచ్చి ఈ కంపెనీ వ్యవహారాలన్నీ నీ చేతుల్లోకి తీసుకొని నన్ను కట్టి పారేశావని నాకు నీ మీద కోపం ఉన్నమాట నిజమేనయ్యా! కానీ ఈ రోజు అది పోయింది" అన్నాడు.

"ఫర్వాలేదండీ" అనలేదు రవితేజ. ఆశ్చర్యంగా శర్మవైపు చూశాడు. ఈయన ఎమ్.డి.గా ఉన్నప్పుడు ఒక్క నిర్ణయం తీసుకునేవాడు కాడు. ప్రస్తుతం ఎప్పుడూ తాగుతూనే వున్నాడు. ఏ లాభాపేక్ష లేకుండా తను ఇంత భారాన్ని వేసుకుని చేస్తుంటే, ఆయనకి ఇప్పటివరకూ తనమీద కోపంగా వుండేదిట.

ఆ రాత్రి అతడు డైరీలో వ్రాసుకున్నాడు- "నేనిదంతా ఎందుకు చేస్తున్నాను? ఎత్తులు, పైఎత్తులు, ఘర్షణలు వీటి మధ్య ఒకప్పుడు నాలో వుండే భావుకుడు ఏమయ్యాడు? వెన్నెల్లో కూర్చుని భావపు అంచుమీద జరీపాత నేసినవాడు ఏమయ్యాడు? కాలే కడుపుతో నెత్తిక్రింద బట్టలమూట పెట్టుకుని ఫుట్ పాత్ లమీద పడుకున్నప్పుడు లోపల్నుంచి పారిపోయాడా? నాలో ఈ దాహం ఎప్పటికి తీరుతుంది? జీవితాన్ని ఆనందంగా అనుభవించటం పోయి ఇంకా

ఇంకా ఏదో సాధించాలన్న తపనే ఎందుకు ఎక్కువ అవుతోంది? కేవలం యింట్లో సంసార సుఖం లేకపోవటం వల్లేనా? ఇంట్లో సుఖంలేని వాళ్ళే బయట రంగాల్లో చాలా పైకి వస్తారన్నది సత్యమేనా? చిన్నతనం నుంచీ ప్రేమ లేకపోవటంవల్ల నేనిలా 'పనిదాహం'తో తయారయ్యానా? సెన్స్ ఆఫ్ అచీవ్ మెంట్ రుచి చూసిన మనిషికి ఇక దేన్లోనూ ఉత్సాహం వుండదా? ఏది ఏమైనా నాకొక్కొద్దిగా ఆటవిడుపు కావాలి. లేకపోతే ఎక్కువకాలం పని చెయ్యలేను...."

డైరీ మూసేశాడు. బయట వర్షం మొదలైంది కిటికీ తలుపు వేయటానికి వెళ్ళాడు. పైన ఆకాశంలో మబ్బులు ముంచుకొస్తున్నాయి.

అతడి భవిష్యత్తు మీదకి-విధిలా-దట్టంగా.

## 7

**బయట** వర్షం ఎక్కువైంది. గట్టిగా ఉరిమిన శబ్దం వినిపించింది. తన గతం తాలూకు ఆలోచన్లనుంచి రవి ఆ రాత్రి బయట పడలేకపోతున్నాడు. ఎందుకో అతడి మనసంతా ఎగోనీతో నిండి పోయింది. ఎందుకీ జీవితం? అనిపిస్తూంది. కొంతకాలం ఏ స్విట్జర్లాండో వెళ్ళిరావాలి. వెళ్ళినా లాభం వుంటుందా? ..... తన మనసులో బాధనంతా ఎవరికయినా చెప్పుకోవాలన్న తపన ఈ మధ్య బాగా పెరుగుతోంది. బాధంటే మళ్ళీ ఏమీ ఉండదు. ఎప్పుడూ ఆహ్లాదంగా నవ్వే చిన్నపిల్లల కంపెనీలో ఎక్కువసేపు గడపాలని వుంటుంది లేకపోతే ప్రకృతి దృశ్యాలని చూడాలని ఉంటుంది. ఇలాటివే చిన్న చిన్న కోర్కెలు.

నేతచీరెల మధ్య భావుకత్వపు అద్దకాన్ని అతడు హృదయం మీద హత్తుకుని పెరిగి పెద్దవాడయ్యాడు. ప్రొద్దున్నించి సాయంత్రం వరకూ అతడిది చీరెల ప్రపంచమే. ఎంతో అందమైన మోడల్స్ - రకరకాల చీరెల్లో, డిజైన్లలో, మత్తు గొలుపుతూ- 'ఏ వంపు దగ్గిర చీరె ఎలా మడత పడాలి- అన్న విషయం దగ్గిర్నుంచి ఏ పువ్వు అద్దకం ఎక్కడ ఇమడాలి' వరకూ అతడితో చర్చించే అందమైన అసిస్టెంట్లు- అది ఓ రంగుల ప్రపంచం.

-ఇవేమీ అతడిని కదిలించలేదు. వాంఛాపరమైన కోరికలు అతడికి పెద్దగా లేవు. అతడివి చాలా చిన్న కోర్కెలు. విసుగు, కోపం, నిర్లిప్తత ఇలాంటి భావాలు... అవసరమైనప్పుడు తప్ప..... మిగతా సమయమంతా ఒక చిన్న చిరునవ్వు మొహంమీద కదలాడుతూ వుంటే స్త్రీకి చీరెగానీ, నగగానీ అంతకన్నా ఎక్కువ అందం ఇవ్వదని అతడి అభిప్రాయం కొంతమంది ఎప్పుడూ చిరునవ్వుతో పలకరిస్తూ వుంటారు. ఇలాంటివారిని ఎక్కువగా జపాన్, థాయ్ లాండ్ దేశాల్లో చూశాడు. నిజానికి అతడి భార్య స్థానంలో వున్న ఏ స్త్రీకయినా- విసుగు కోపం వచ్చే సందర్భాలు చాలా తక్కువగా వుండాలి. అతడికేమీ అలవాట్లు లేవు. ముఖ్యంగా...... అతడికి "వేధించే గుణం" లేదు చాలామంది మొగవారిలాగా- భార్యల పుట్టిళ్ళ గురించే ఎద్దేవా చేస్తూ మాట్లాడటం గానీ, జోకులు వెయ్యటంగానీ చెయ్యడు. ప్రతీ విషయాన్నీ అనలైజ్ చేస్తూ ఆలోచించడంవల్ల అతడికి కోపం, ఉద్వేగం లాటివి కూడా రావు. మాధవి కాకుండా ఇంకే

స్త్రీ అయినా- ఆ ఇంట్లో నిశ్చయంగా ఎక్కువ సుఖపడి ఉండేది. ఎప్పుడైతే 'నెగిటివ్ థింకింగ్' వస్తుందో- తాము 'సుఖపడరు' ఎదుటివారిని సుఖపెట్టలేరు. చిన్న చిన్న విషయాలకే విపరీతంగా కంగారు పడిపోవటం, తమ భయాలతో, అనుమానాలతో అవతలివారిని వేధించటం, అవతలివారి చిన్న తప్పులన్ ఐ కూడా భూతద్దాల్లో ఎత్తి చూపటం, నేను కాబట్టి ఈ సంసారం చేయగలుగుతున్నాను, నేను కాబట్టి మీతో ఉండగలుగుతున్నాను. నేను కాబట్టి, నేను కాబట్టి అనుకోవటం- ఇవన్నీ 'నెగిటివ్ థింకింగ్' వున్నవారి అలవాట్లు. ఎప్పుడైనా అడుగుతాడు- 'ఎందుకు మాధవీ ఎప్పుడూ నవ్వుతూ వుండవు?' 'ఆ... నా మొహానికి ఇక నవ్వుకూడానా' అంటుంది. మొగ్వాడికి అంతకన్నా శూన్యత ఏముంటుంది? ఇంతకాలం అహర్నిశలు పనిధ్యాసలో వుండటంవల్ల మిగతా విషయాల్ని పట్టించుకొనే స్థితిలోలేడు. ఇప్పుడు జీవితంలో ఒక అత్యున్నతమైన స్థానంలో నిలబడి వెనుదిరిగి చూసుకుంటే- సాధించినదాన్ని భార్యే గుర్తించడం లేదు....

బయట వర్షం ఎక్కువైంది. అతడు పక్కమీంచి లేచి బెడ్ రూమ్ కిటికీ వర్షాన్ని చూడబోయేడు. ఎలాగూ ఈ రాత్రికి ఇక నిద్ర రాదు. వర్షానికి బిగుసుకు పోయిన తలుపు ఒక పట్టాన తెరచుకోలేదు అతడి మనసులాగే.

ఈ చప్పుడికి మాధవి నిద్రలోనే అట్నుంచి ఇటు వత్తిగిలి, "అర్ధరాత్రి అంకమ్మ శివాలన్నట్టు-పడుకోరు. పడుకోనివ్వరేమితి? మీకేం, రేపు ఎనిమిదింటికి లేస్తారు. తెల్లవార్నే లేచే వాళ్ళకి తెలుస్తుంది బాధ" అంది. అతడు మాట్లాడకుండా కిటికీలోంచి బయటకు చూడటం సాగించాడు. ఆమె తెల్లవారుజామునే లేవకపోయినా కొంప మునిగిపోదు అని అతడికి తెలుసు. ఆమెకి నిద్రాభంగం కలిగించటం తప్పే అదే, ఆమెకు నిద్రాభంగం కలిగించకుండా, బైట వరండాలోకి వెళ్ళి చాలాసేపు నిలబడితే, నిద్రకళ్ళతో బయటకు వచ్చి, "లోపలికొచ్చి పడుకోకూడదూ, మళ్ళీ జలుబుచేస్తే నేనేం చెయ్యాలి- ఖర్మ" అని సాధిస్తుంది. ఏ పనిచేసినా దాన్ని వ్యతిరేకించటానికి రెడీమేడ్ గా ఒక వాదనని పెట్టుకున్న వాళ్ళకి ఏం చెప్పగలం?

జీవితంలో తనేం కోల్పోయాడు అన్నది అతడికి ఒక విదేశీయానంలో తెలిసింది. రవితేజ టెక్స్ టైల్స్ తరఫున ఆర్నెల్లు ట్రైనింగ్ కి వెళ్ళవలసి వచ్చింది. అప్పటికి అతడికి మాధవితో వివాహమై నాలుగు సంవత్సరాలు కావస్తూంది. బయల్దేరుతూంటే మాధవి చెప్పింది- 'మర్చిపోరుగా, నాకో వాచీ- బంగారు చెయిన్ ది" అని. అతడు నవ్వుతూ తలూపాడు. కంపెనీ కారు విమానాశ్రయానికి తీసుకువెళ్ళటం కోసం వచ్చి యింటిముందు ఆగింది. అతడు అన్ని వస్తువులూ సరిగ్గా వున్నాయో లేదో చూసుకుంటున్నాడు.

"ఆర్నెల్లుండాలి. ఆరోగ్యం అదీ జాగ్రత్త, ఎక్కువ తాక్కండి".

అతడు నవ్వుతూ, "నాతో ఇన్ని సంవత్సరాలు కాపురం చేశావు. ఇంకెంత కాలానికి నామీద నమ్మకం ఏర్పర్చుకుంటావు మాధవీ?" అని అడిగాడు.

"కవిత్వం చాలుగానీ, బయల్దేరండి".

ఇద్దరూ కారు దగ్గరకొచ్చారు.

"వాచి సంగతి మర్చిపోకండి. రీకో-"

కారు విమానాశ్రయానికి వచ్చింది. బొంబాయి వెళ్ళే విమానం! విదేశాలకు వెళ్ళే ఎంతోమందిని తనతో తీసుకువెళుతుంది. అతడు రెండు మూడు పుస్తకాలు కొనుక్కొని వచ్చి కూర్చున్నాడు. ఇంకా అరగంటుంది బయల్దేరటానికి. అతడు అప్పుడు చూశాడు ఆ జంటని. ఇద్దరు పిల్లలనుకుంటా! బిక్కమొహంతో పక్కన నిలబడి చూస్తున్నారు. ఆమె వయసు ముప్ఫై అయిదు పైనే వుంటుంది. కళ్ళు రెండూ ఎర్రబడగా తలదించుకుని పైటతో వత్తుకుంటూంది. అతడు ఆమెచెంపలు తుడుస్తున్నాడు. అయితే అందులో ఏదీ కృత్రిమంగా లేదు. అది ఎంత స్వాభావికంగా వుందంటే- నత పెద్ద విమానాశ్రయంలో ఒక్కరు కూడా ఆ దృశ్యాన్ని చూసి మొహం ప్రక్కకి తిప్పుకుని నవ్వుకోలేదు. మనసంతా ఒక ఆర్ద్రభావాన్ని నింపేలా వుంది. ఆ దృశ్యం మనుష్యులకీ, జంతువులకీ తేడా ఏమిటో తెలియచెప్పేలా వుంది. ఇద్దరు పిల్లలు, ఆమె వెనుకనుంచి చేతులు ఊపుతూ వుండగా అతడు కౌంటరు వైపు సాగిపోయాడు- వెనక్కి తిరిగి తిరిగి చూసుకుంటూ.

రవికి ఇదంతా ఎంతో అపురూపంగా తోచింది. వీడ్కోలు సంగతి సరే. ఆగమనం కూడా అంతే. రాగానే సూట్కేసు విప్పి చూడాలన్న ఆత్రతే ఎక్కువ. ఒక్కోసారి కాంప్ నుంచి తిరిగి రావటం నాల్గాయిదురోజులు ఆలస్యం అవుతూ వుంటుంది. ఇంట్లోకి అడుగు పెట్టగానే "ఇంకో నాలుగు రోజులు అక్కడే ఉండలేక పోయారా? ఇంటికన్నా గుడి పదిలం అని..." అని మొదలు పెడుతుంది- వచ్చిన సంతోషం అంతా పోతుంది. పోనీ ఈ విసుగంతా, నాల్రోజులు ఎక్కువైన వంటరితనంవల్ల వచ్చినదైతే, అలా నిష్ఠూరంగా, అసహ్యం కలిగేలా చెప్పటంకన్నా మామూలు భాషలో చెప్పొచ్చుగా! భాషలో చెప్పలేకపోతే స్పర్సతో- లేదా కనుచూపులతో.

"నేనక్కడేం ఆడుకోవటానికి వెళ్ళలేదు మాధవీ. పని వుండే వుండిపోయాను" అనాలనిపిస్తుంది. అనడు అంటే తిరిగి, "పని- పని- ఎవడు పెట్టుకొమ్మన్నాడు అంత పని?" అంటుంది. మళ్ళీ తిరిగి తిరిగి అక్కడికే వస్తుంది సంభాషణ. అందుకే మాటలు అనవసరం.

తను గొప్పవాడు మెకెన్రో, పికాసో, బలరాజ్ సాహ్నీ అంత గొప్పవాడు కాకపోయినా తన రంగంలో గొప్పవాడు! తాగి వచ్చి భార్యని చావబాదేవాడు, మామని స్కూటరిమ్మని వేధించేవాడు, పేకాట్లో జీతమంతా పోగొట్టుకునేవాడూ, లంచాలు పట్టి సంపాదించేవాడు. కొడుకుల్ని చావబాదేవాడు, ప్రొద్దస్తమానం పేపరు చదువుతూ పక్కమీద పడుకునేవాడు- వీళ్ళందరి కన్నా తన దృష్టిలో తను గొప్పవాడు.

తన భార్య దృష్టిలో కాదు! నెలకొకటో- లేక కనీసం ఆర్నెల్లకొకటో కొత్తచీర తీసుకొచ్చి భార్యతో ఆనందం పంచుకునేవాడు. సరదాగా నెలకొక సినిమాకైనా తీసుకెళ్ళేవాడు, కొడుకుల చదువు గురించి పట్టించుకునేవాడు,

పక్కింటావిడ మొగుడులా ఇంటిపట్టున వుండేవాడు, భార్యకి కాస్త తలనొప్పి వస్తే ఎంతో హడావుడి చేసేవాడు- వీళ్ళందరికన్నా ఆవిడ దృష్టిలో తను అధముడు. చివరికి తేలినదేమంటే ఈ రెండూ ఎక్కడా కలవవు.

ఈ ప్రపంచంలో పది రైళ్ళు ఒకేసారి పరుగెడ్తే బ్రిడ్జినైనా వెల్డింగ్ చేసే పరికరం వుందేమోగానీ, అతకని రెండు మనసుల్ని అతికే ఆయుధం లేదు.

* * *

బయటా వర్షం తగ్గింది. అతడొచ్చి పక్కమీద పడుకుని ఆలోచిస్తున్నాడు. నెమ్మదిగా తెల్లవారుతూంది.

సరిగ్గా ఆ సమయానికి, వర్షం వెలుస్తున్న తొలి ఉషస్సులో కూర్చుని ఒకామె పదిహేను సంవత్సారాల క్రితం తను ముద్దుపెట్టుకున్న ఒక కుర్రవాడికి ఒక సుదీర్ఘమైన ఉత్తరం వ్రాస్తూంది.

పది సంవత్సరాల్నుంచీ అతడి అభివృద్ధిని దినదినం చూస్తూ- తన ఉనికి విషయం ఇన్నాళ్ళూ చెప్పకుండా కంట్రోలు చేసుకుంటూ, మరి చేసుకోలేక.... తను ఎవరో, అతడిని మొట్టమొదటిసారి ఎక్కడ కలుసుకుందో, ఇదంతా ఎంత చిత్రంగా జరిగిందో వ్రాస్తూంది. ప్రత్యూషపు వెలుగులో మోకాళ్ళమీద ముగ్ధగా కూర్చుని ఆమె వ్రాస్తూన్న ఆ ఉత్తరం-

-అతడి భవిష్యత్ జీవితపు తెల్లచీరె మీద, విధి నల్లంచు నేతకి ఆయత్తమవుతూందని ఆ క్షణం వారిద్దరికీ తెలీదు.

## 8

**షాపుల్లో** కొనే ఒక చీర వెనుక చాలా చరిత్ర వుంటుంది. ఖర్చులన్నీ కలపటం వల్లనే నూట ఇరవై రూపాయల చీర మూడొందలు అమ్ముతుంది. చీర బేరం చేసే వాళ్ళకి తెలీదు- పది చీరలు తీయిస్తే, వాటిని తిరిగి మడతబెట్టి లోపల పెట్టటం వల్ల జరిగే రాపిడికి రెండు శాతం చీరలు డెడ్ స్టాక్ అవుతాయని ఆ ఖరీదు కూడా తాము కొనే చీర ధరలోకే వచ్చి చేరుతుంది నాయి. పట్టుచీర కొనేవారికి తెలీదు తాము ఉచితంగా తాగే కూల్ డ్రింక్ ఖరీదుకి పదిరెట్లు తాము చెల్లించే ధరకి కలపబడిందనీ, కేవలం చీరమీద అంటించిన కాగితం ముక్కమీద వున్న ధర, FIXED PRICES అని వ్రాసి వున్న బోర్డు చూసి తాము మోసపోతున్నామనీ, ఆ ధర ఫ్యాక్టరీ నుంచి వచ్చింది కాదని, ఆ క్రితం రాత్రి సేల్స్ మెన్ అయినా వేసి వుండవచ్చని....

-ఇలా ఆలోచిస్తూ వుండగా రవితేజకి ఒక ఆలోచన స్ఫురించింది. ఈ విషయాలన్నీ తామే ఎందుకు కస్టమర్లకు చెప్పకూడదు. శర్మగారితో పరిచయం కాకముందు అన్నాడు- "....ముందు్య కస్టమర్ మనమీద నమ్మకం పెంచుకోవాలి" అని.

ఇప్పుడు అదే ఎందుకు ఉపయోగించుకోకూడదు? మంచి ఆలోచన.

ఆ ఆలోచన వచ్చాక అతడు ఆగలేదు. సెక్రటరీని పిలిచాడు. ఆమె పేరు సరస్వతి. ముప్ఫై ఏడేళ్ళుంటాయి. మంచిది తెలివైనది. "కూర్చోండి" అన్నాడు.

కూర్చుంది.

"చాలాకాలం క్రితం, ఈ కంపెనీలోకి రాకముందు, శర్మగారితో మొదటి పరిచయంలో నేనేం మాట్లాడానో తెలుసా?"

అతడు కూర్చోపెట్టి అకస్మాత్తుగా ఇలా అడిగేసరికి ఆమెకేమీ అర్థంకాలేదు. రవితేజ నవ్వేడు.

"షోకేసులో వున్న చీర ఎప్పుడూ కొనకండి. ఫేడ్ అయిపోయి వుంటుంది. అలాటిదే ఇంకొకటి లోపల్నుంచి తీసుకోండి అని!" నవ్వి అన్నాడు-"ఇలాంటి సలహాలే మనం ఎందుకు మనవైపునుంచి కస్టమర్లకు ఇవ్వకూడదు?"

ఆమె దిగ్భ్రాంతితో చూసింది. రవితేజ చెప్పుకుపోతున్నాడు. "ప్రతీచీరకీ మనం ఒక ధర ఫిక్సు చేస్తాం. మన రిటైలర్స్ ఆ ధరకే దాన్ని అమ్ముతూ వుండవచ్చు. కానీ ఇప్పట్నుంచి ఆ పట్టికని కొనేవాళ్ళకి మనమే డైరెక్టుగా అందజేస్తాం. లోకల్ టాక్సేస్ ఎకస్ట్రా అన్నది ఎలాగూ వుంటుంది. చీరల్లో ఎవరూ ఇంతవరకూ యిలా చేయలేదు కాబట్టి, కొనుగోలుదార్లకీ విశ్వాసం ఏర్పడుతుంది. వ్యాపారంలో మొదటి మెట్టు విశ్వాసం...." అతడు చేతిలోని కాగితాలు ఆమెకి అందించాడు. "మొన్న ఉపన్యాసంలో నేను కస్టమర్లకి యిచ్చే ఉచిత బహుమతుల గురించి తయారు చేసిన స్కీమ్స్ ఇవి! అలాగే మేకప్ అందాల గురించి, ఏ యే చీరె ఎవరికీ నప్పుతుంది అన్న విషయాల గురించి చిన్న పుస్తకం కూడా ఉచితంగా ఇద్దామనుకున్నాం గుర్తుంది కదా! ఆ పుస్తకంలో- ఆ సలహాలు కూడా చేరుద్దాం. వాటిని వ్రాసి పట్టుకురండి. మీరు కస్టమర్లయితే ఏ యే జాగ్రత్తలు తీసుకోవాలి అనేది".

ఆమె కిప్పుడు అర్థమైంది నవ్వి, ఆ కాగితాలు తీసుకువెళ్ళి అరగంట తరువాత తయారుచేయించి తీసుకువచ్చింది. అతడు చదువుతూ వుంటే, తను వ్రాసింది తన యజమానికి నచ్చిందోలేదో అని ఆత్రంగా అతడివైపే చూస్తూవుంది. అతడు చదవటం ప్రారంభించాడు. ఆమె అన్నీ పాయింట్లుగా వ్రాసింది.

1. A Womam Express her self in many ways. ప్రపంచంలో అన్ని రకాల దుస్తుల్లోనూ చీరకి ఒక ప్రత్యేకత వుంది. విదేశీ దుస్తులతో పోలిస్తే ఇన్ని గజాల గుడ్డని శరీరానికి చుట్టబెట్టడం వృథా అనిపించవచ్చు. కానీ ఇప్పుడది విదేశీయుల్ని కూడా బాగా ఆకర్షిస్తోంది. బహుశ ఆ రోజుల్లో పత్తిపంట పుష్కలంగా పండే దేశం కాబట్టి ఈ అలవాటు వచ్చి వుండవచ్చు.

2. కొంగు పొడవుగా తీసి భుజాలచుట్టూ వేసుకోవటం, కొప్పు పెట్టుకోవటం ముసలమ్మ ఫాషన్ గా ఒకప్పుడు భావించబడేది. జయబాధురీ ఈ విధంగా ఒక సినిమాలో తయారవ్వగానే, కాలేజీ అమ్మాయిలందరూ అలా అలంకరించుకుని, ఉన్నట్టుండి నమ్రత, గౌరవప్రదమైన ఒద్దిక తెచ్చేసుకున్నారు. కాబట్టి ఫాషన్ కి హద్దులు లేవు.

3. తమిళనాడు అమ్మాయిలు చీరె కొంగుని నడుముచుట్టు తిప్పి ముందువైపు అంచంతా క్రిందికి పరుచుకునేలా దోపుతారు. ఈ రకమైన కట్టులో ఒక అందం వుంటుంది. చీరె మొత్తంలో పైట చెరుగుకి ఒక ప్రాధాన్యత వుంటుంది. దీన్ని చాలామంది నిర్లక్ష్యం చేస్తూ వుంటారు.

4. బాగా గంజిపెట్టిన చీరెలయితే చూడముచ్చటగా వుండేమాట నిజమేగానీ, రోజువారీ పనికి, ముఖ్యంగా ఆఫీసుల్లో.... ఇస్త్రీ అవసరంలేదని 'వాష్ అండ్ వేర్' చీరలయితే ఎక్కువ శ్రమ వుండదు. అలాగే తెల్లటి చీరెలు తప్ప మిగతావి నీడపట్టున ఆరెయ్యటం మంచిది.

అతడు సంతృప్తి చెందలేదు. మిగతాది చదవకుండానే తలెత్తి "ఇదంతా బాగానే వుంది. కానీ, నేను చెప్పింది మీరు సరిగ్గా అర్థంచేసుకో లేదనుకుంటాను. మన బుక్-లెట్ లో ఈ వివరాలన్నీ మొదటి చాప్టర్ లో ఎలాగూ వస్తాయి. షాపుల్లో కస్టమర్లు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్రాయమన్నాను. పోనీలెండి నేను చెపుతాను వ్రాసుకోండి" అంటూ డిక్టేషన్ మొదలు పెట్టాడు. ఆమె వ్రాసుకుంటూంది.

> ఏ చీరయినా మీకు నచ్చితే దాన్ని వెంటనే కొనెయ్యాలన్న ఆతృతని దుకాణదారుని ముందు ప్రదర్శించకండి.

> ఏ చీరె మీదయినా మీ దృష్టి రెండు సెకన్లు ఎక్కువ నిలబడితే వెంటనే దుకాణందారు "ఇది లేటెస్ట్ డిజైనమ్మా, చాలా ఫాస్టు కలరు. మొన్నే వచ్చింది మార్కెట్ లోకి...." అంటాడు. నమ్మకండి. మీ దృష్టి దానిమీద కొద్దిగా ఎక్కువసేపు ఆగటంతో మీరు దానిపట్ల కొద్దిగా ఆకర్షితులయ్యారనీ, అటూ ఇటూ వూగుతున్నారనీ అతడు గ్రహించాడు. మిమ్మల్ని కన్విన్స్ చేయటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కేవలం మీకు నచ్చితేనే తీసుకోండి. అతడి మాటలవల్ల కాదు.

> చీరెలు కొనేటప్పుడు పొడవు వెడల్పు కొలవమని అడగటంలో మొహమాటపడకండి. అలాగే ఫాస్ట్ కలర్ అన్న ముద్ర వున్న చీరెలు బెటరు. అయిదు మీటర్లకన్నా పొడవైన చీరెలు వంటికి అందాన్నిస్తాయి.

> కళ్ళు చెదిరే రంగుల్తో పెద్ద ప్రింటులున్న చీరెల్ని భారీకాయం వున్నవాళ్ళు కట్టుకుంటే మంచి ఎత్తైన ముఖద్వారానికి బరువుగా వేలాగే కర్టెన్లలా వుంటారు. అలాగే, పొట్టివాళ్ళు ఎక్కువ నగలేసుకుంటే భూమిలో సగం వరకూ పాతి పెట్టిన మొక్కజొన్న పొత్తులా వుంటారు.

సరస్వతి వ్రాయటం ఆపి, కాస్త తటపటాయించి, "ఈ చివరిసలహా తీసేద్దాం సార్. కొనుగోలుకీ దానికీ

సంబంధంలేదు" అంది. ఆమె అలా చెప్పటంతో అతడు కాస్త ఆలోచించి, తలూపుతూ, "అవును తీసెయ్యండి" అన్నాడు ఆమెవైపు మెచ్చుకోలుగా చూస్తూ "నేను చెప్పాననని కాదుకదా" మొహమాటపడుతూ అడిగింది. "కాదు కాదు. మీరు చెప్పింది కరెక్టే మిగతావి వ్రాసుకోండి" అని చెప్పటం ప్రారంభించాడు.

> "గొప్ప తగ్గింపు ధరలు-" అన్న బోర్డు చూసి ఎప్పుడూ మోసపోకండి- అసలు ఎవరైనా ధర ఎందుకు తగ్గించాలి? అని ఒక క్షణం ఆలోచించండి. కేవలం చీరె కంటించిన కాగితంమీద, 'తన కలం' తో వ్రాసిన ధరలోనే తగ్గింపు ఇస్తున్నాడన్న విషయం మర్చిపోకండి. లేకపోతే మిగిలిపోయిన సరుకంతా వదుల్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాడని గ్రహించండి. ఏ విధంగానైనా మీకే నష్టం.

> రవితేజ వారి ధరలలిస్టు దుకాణదారు దగ్గిర ఉచితంగా పొందండి. మీరు కొనే చీరె ధర, దానితో పోల్చి సరిచూసుకోండి. చీరె ధరలను కరెక్టుగా కొనుగోలుదార్లకి చెప్పే సంస్థ- రవితేజ టెక్స్ టైల్స్ ఒకటే. "దట్సాల్" అంటూ పూర్తిచేసి, "ఎలా వుంది?" అని అడిగాడు నవ్వుతూ.

"నాకు తెలియని విషయాలే చాలా వున్నాయి సర్" అంది అలా, అంత తొందరగా పాయింట్ మీద పాయింట్ చెప్పటం ఆమెకి ఎంతో ఆశ్చర్యంగా అనిపించింది. అందుకే అతడు 'ఆర్టీ' అయ్యాడు అనుకుంది మనసులో.

"ఇలా ఇవ్వండి. సంతకం పెడతాను. డైరెక్ట్ గా కంపోజింగ్ కి ఇచ్చెయ్యండి-" అన్నాడు చెయ్యి చాచుతూ. ఆమె కాగితం అందిస్తూవుంటే అది జారి బల్లక్రిందకు వెళ్ళింది. ఆమె తియ్యబోతూంటే "నేను తీస్తాను" అంటూ అతడూ వంగాడు.

సరీగ్గా అప్పుడు తలుపు చప్పుడయింది. ఇద్దరూ బల్ల వెనుకనుంచి ఒకేసారి తలెత్తారు.

స్ప్రింగ్ డోర్ దగ్గిర మాధవి నిలబడి వుంది. సరస్వతి కాగితం తీసుకుని వెళ్ళిపోయింది. ఆమె వెళ్తున్నంతసేపూ నిప్పులు కక్కే కళ్ళతో ఆమెవైపు చూస్తూ ఆమె బయటకు నడిచిన తరువాత, "ఇందుకే నన్నమాట ఇరవై నాలుగ్గంటలూ ఆఫీసూ ఆఫీసూ అని పడి చచ్చేది" అంది. అతడు విస్తుబోయాడు. కొంచెంసేపు పాటు ఆమె ఏం మాట్లాడుతూ వుందో అర్ధంకాలేదు. అర్ధమయ్యాక, ఇంకేమీ అనలేక "మా.....ధ....వీ" అన్నాడు.

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు తహగుతూ ఎవరూ చూడటంలేదనుకుంటుందట" వెటకారంగా అంది. అతడికెప్పుడూ రానంత కోపం వచ్చింది.

"నీకేమైనా మతిపోయిందా? ఆవిడ నాకన్నా పదేళ్ళు పెద్దది-" అన్నాడు ఆవేశాన్ని అణుచుకుంటూ.

"ఆ వయసులోనే బుద్ది వెయ్యి వేషాలు వేసేది. దాన్ని లోపలికి పిలవండి తేలుస్తాను".

"ఏమిటి నువ్వు తేల్చేది అసలు నువ్విక్కడికెందుకొచ్చావు?"

"మీ కృష్ణలీలలు చూద్దామని!"

-దాదాపు ఐదు నిముషాలు ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఏమీ అర్థంకాలేదు. అతడు చాలా ఇరిటేటింగ్ గా వున్నాడు. చాలా సున్నితమైన చోట దెబ్బకొట్టిందామె. తన భార్యకి తనమీద ఇంత అపనమ్మకం వుందని అప్పుడే తెలిసిందతడికి. అతడు కాపాడుకుంటూ వచ్చిన విలువలన్నిటినీ ఒక్కమాటతో తోసేసింది. అతడికి మనుష్యుల గురించి బాగా తెలుసు. ఒక మనిషిమీద మరొక మనిషికి వుండే అభిప్రాయం థర్మాస్ ఫ్లాస్క్ లాటిదని ఏ క్షణమైనా చాలా చిన్న చిన్న సంఘటనలద్వారా కూడా దాని ఆకృతి మారిపోతుందని, అంత ఫ్రైగైల్ అనీ అతడికి తెలుసు. కానీ భార్యాభర్తల మధ్యకూడా అలాటి బంధమే వుంటుందనీ, తమ ఎన్నాళ్ళనుంచో పెంచుకుంటూ వచ్చిన 'కారెక్టర్' ఒక అద్దాలమేడ వంటిదని అతడికి అర్థమైంది. చిన్నమాట అనే రాయి విసిరి అతడి భార్య ఆ అద్దాల మేడని కుప్పకూల్చేసింది.

మాధవితో అతడి సంబంధం, ఒక సగటు మొగవాడికి కావలసిన శారీరక సంతృప్తిని ఇస్తూనే వచ్చింది. కానీ ఇద్దరూ కాలక్రమేణా మానసికంగా దూరమవటంతో అది ఒక చిన్న అఫైర్ గా మాత్రమే మారింది.

తరువాత అతడు తన వ్యాపకాల్లో నిమగ్నమై ఇక పూర్తిగా ఆ అవసరాన్ని దాదాపు మర్చిపోయాడు. ఆ 'మర్చిపోవటాన్ని' భార్య ఇలా ఊహిస్తుందని అతడు కలలోకూడా అనుకోలేదు.

తనని తాను కంట్రోలు చేసుకుంటూ "వెళ్ళు మాధవీ! ఇది ఆఫీసు, అందరూ వింటారు" అన్నాడు.

"మీ గురించి ఎవరో చెపితే ఏమో అనుకున్నాను. ఇప్పుడు కళ్ళారా చూసి నమ్మాల్సి వస్తోంది".

రవితేజ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"ఎవరు?" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. అతడు అది ఆఫీసు అనికూడా మర్చిపోయి, ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని గద్దిస్తున్నట్టు "ఎవరు?" అని అడిగాడు.

"ఎవరో మీకెందుకు చెప్పాలి? నా శ్రేయోభిలాషి".

రవితేజ గట్టిగా ఏదో అనబోయాడు. అంతలో అద్దాల అవతల్నుంచి నీడలా కదలిక కనిపించింది. అందరికీ తమ మాటలు వినిపించే అవకాశం వుందని, అతడు స్వరం తగ్గించి, "సర్లే-ఇంతకీ ఇప్పుడెందు కొచ్చినట్టు" అన్నాడు.

"కేవలం మీ శృంగారం చూద్దామనే" వెటకారంగా అని తలుపు దగ్గిరకు వెళ్ళి వెనుదిరిగి, "ఒకటి మాత్రం గుర్తుంచుకోండి. ఇవాల్టినుంచీ మీరేం చేసినా నాకు తెలిసిపోతూ వుంటుంది" అని, మరి అతడు మాట్లాడటానికి వీల్లేకుండా అక్కన్నుంచి వెళ్ళిపోయింది.

అతడొక్కడే ఆ రూమ్ లో అలా చాలా సేపు కూర్చుండి పోయాడు-బయట చాలామంది తమ గొడవ విన్నారని, లోపలి రావటానికి అందుకే తటపటాయిస్తున్నారనీ అతడికి తెలుసు.

అతడికిప్పుడు మాధవి మీద కోపం కన్నా, ఆమె మనసులో ఆ విషబీజం నాటిందెవరో తెలుసుకోవాలన్న దుగ్ధ ఎక్కువైంది. ముందే ఒక అభిప్రాయంతో ఆమె ప్రవేశించింది. దానికి తగ్గట్టుగా ఈ దృశ్యాన్ని చూసేసరికి బి.పి. పేషెంటైన ఆమె సహజంగానే రెచ్చిపోయింది. బహుశ ఆ స్థితిలో వున్న ఏ ఆడదైనా అలాగే చేస్తుందేమో తను అంత గట్టిగా అరవకుండా వుండవల్సింది.

రవితేజ కుర్చీలోంచి లేవబోతూవుంటే సరస్వతి లోపలికి వచ్చింది. ఆమె మొహం పాలిపోయి వుంది. వాళ్ళ మాటలు ఆమె విన్నదని ఆమె మొహమే చెపుతూంది.

అతడు చెప్పిన మాటలు కంపోజు చేయించి తీసుకొచ్చింది. అతడు దాన్ని చూసి ఆమె కిచ్చేసి, ఆమె వెళ్ళబోతూ వుంటే, "సరస్వతిగారూ" అన్నాడు. ఆమె ఆగింది.

"ఐ యామ్ సారీ!"

ఆమె తల వంచుకుని "నేనూ ఆ మాటే చెపుదామనుకున్నాను సార్" అని అక్కన్నించి వెళ్ళిపోయింది.

అతడు కిటికీ దగ్గిర నిలబడ్డాడు. సాయంత్రం అయిదున్నర అయింది. ఒకరొక్కరే ఆఫీసునుంచి బయటపడటం పై అంతస్థునుంచి స్పష్టంగా కనిపిస్తూంది. బ్యాగ్ తీసుకుని సరస్వతి బస్ స్టాప్ వైపు నడుస్తూంది. ఆమె చెవుల దగ్గిర తెల్లజుట్టు మీద సూర్యరశ్మి మెరుస్తూంది. ఈమెకీ తనకీ మధ్య తన భార్య సంబంధం అంటకట్టిందని అనుకుంటేనే చిత్రంగా వుంది.

సాయంత్రం అవటంతో రోడ్డులు చాలా రద్దీగా వుంటాయి. కానీ అతడి కార్యాలయం పక్కగా వుండటంవల్ల, రష్ లేదు.

సరస్వతి రోడ్డు క్రాస్ చేస్తోంది.

అతడు చూస్తూ వుండగానే, మలుపులోంచి ఒక కారు వేగంగా వచ్చింది. అతడి మనసేదో కీడు శంకించింది. కారు డ్రైవరు బ్రేకు వేయలేకపోయాడు. ఆ శబ్దానికి సరస్వతి వెనుదిరిగి చూసింది. కానీ అప్పటికే ఆలస్యం అవటం ఆమె కెవ్వున అరవటం, కారు ఆమెను గుద్దుకోవటం ఒక్కసారిగా జరిగిపోయాయి.

అతడు చేష్టలుడిగి నిలబడ్డాడు.

కారు ఆగకుండా వెళ్ళిపోయింది. ఆమె చుట్టూ జనం మూగుతున్నారు అతడు అప్పుడే స్పృహలోకి వచ్చినవాడిలా కోలుకుని క్రిందికి పరుగెత్తాడు.

* * *

దాదాపు గంట తరువాత డాక్టర్లు ఆమెకేం ప్రమాదం లేదని, ఫ్రాక్చరైన కాలి ఎముక అతుక్కోవటానికి మాత్రం రెండు నెలలు పడుతుందని చెప్పాక, అతడు తేలిగ్గా శ్వాస పీల్చుకున్నాడు. ఆ రెండు నెలల ఖర్చూ కంపెనీకే వ్రాయమని అతడు అకౌంటెంట్ తో చెప్పాడు.

ఈ లోపులో ఆమె భర్తకూడా వచ్చాడు. అతడికి ధైర్యం చెప్పి రవి ఇంటికి బయల్దేరాడు.

ఆ రోజు జరిగిన సంఘటనలతో అతడు చాలా అలసిపోయాడు. ఇంకేమీ ఆలోచించకుండా స్నానంచేసి నిద్రపోయాడు. మాధవి ఇంట్లో లేదు.

సరిగ్గా ఆ సమయానికి ఒక ఎయిర్ కండిషన్డ్ గదిలో-చిన్న రూమ్ లో ఒక వ్యక్తి తన ముందున్న కాగితంమీద "ఒకటి" అని వ్రాసివున్న దానిని కలంతో కొట్టేశాడు- ఒక పని పూర్తయినట్టు.

## 9

**నాలుగు** రోజులు గడిచాయి. ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం పేరుకుంది. ఇద్దర్లో ఎవరూ మాట్లాడటానికి ప్రయత్నించటం లేదు. ఆమె చేసిన ఈ కొత్త ఆరోపణతో అతడి మనసు ఒక రకంగా విరిగిపోయింది. రవితేజ మార్కెట్ లో విడుదల చేసిన పుస్తకం అనుకున్న ఫలితాన్ని తెచ్చిపెట్టలేదు. కస్టమర్లు షాపులు...రెండువైపుల్నుంచీ రిజల్ట్సు నిరాశాజనకంగానే వున్నాయి. చాలామంది కస్టమర్లు "ఇందులో మాకు తెలియని పాయింట్లేమున్నాయి? అంతా మాకు తెలిసిందే కదా" అన్నారు ఆ పుస్తకాన్ని చూసి.

ఇంకొకవైపు చీరెల ధరలు కంపెనీయే ప్రకటించటం- షాపు వాళ్ళు గాఢంగా వ్యతిరేకించారు. చాలా చీరలు సంవత్సరాల తరబడీ షాపుల్లో చాలా సందర్భాల్లో వుంచాలి. స్టాక్ టేకింగ్ సమయంలో వాటి ధర పెంచాలి.....అంతా మాకు తెలిసిందే కదా అన్న కస్టమర్ల విషయమై రవితేజ అంచనా తప్పయింది. నిజానికి వారిలో చాలామంది స్త్రీలకి చీరల గురించి అసలేమీ తెలీదు.

ఎప్పుడూ విమల్ చీరలుకట్టే వాళ్ళకే విమల్ పాలియెస్టర్ చీరల్లో డివైన్, జోవెల్ సిల్కీ, హాట్రిక్, మోనలిసా, శుభలక్ష్మి, లాపర్షియన్ - ఇన్ని రకాలు కేవలం టిష్యూల్లోనే వున్నాయనీ, ఇక క్రేప్ సంగతి తీసుకుంటే మళ్ళీ అందులో, స్వీట్ మెమొరీస్-రాయల్ పాలెస్, క్రిస్టల్ సిల్క్ లున్నాయనీ ఇవిగాక మళ్ళీ జార్జెట్, షిఫాన్ వున్నాయనీ తెలీదు. షాపుకెళ్ళి "గార్డెన్ చీరలు చూపించండి" అంటారు. చైనా సిల్కో, గార్డెన్ టిష్యూనో చెప్పరు. అలాగే 'ఖటావ్' లో అంబర్-మోరికా- ఇంటిమేట్-చందేరీ-కంచన్ లలో ఏది కావాలో చెప్పలేదు. వాళ్ళ ఇంటిపక్కవాళ్ళో లేక స్నేహితులో చెప్పిన ధరకంటే ఇది కొంచం ఎక్కువ వెల వుంటే షాపువాళ్ళని అనుమానిస్తారు.

సేల్సు మెన్ కూడా ఈ రకాల్లో వున్న సున్నితమైన తేడాని వీళ్ళకి తెలియజెప్పటానికి ప్రయత్నించరు. గార్డెన్ అనగానే ఒక న్యూచైనా, పి.జి.చైనా, ఒక సెల్ఫ్ డిజైన్ చూపిస్తారు. అందులో ముచ్చటపడినదానిలో మిగతావి వరుసగా చూపించటం మొదలు పెడతారు. ఈ విషయం తెలియని ఆడవాళ్ళు ఒకేరకం (గా కనిపించిన) చీరె, తన స్నేహితులు కొన్న చీరెకంటే ఒక 5 రూపాయలు ఎక్కువ ధర వున్నా అది అవమానకరంగా భావిస్తారు. "వాడెవడో నీకు బాగా టోపీ వేశాడు. ఇదే చీరె నేను సన్యాసి వస్త్రాలయంలో తక్కువకి కొన్నాను" అని పక్కవాళ్ళు కూడా ఎక్కిరిస్తారు.

ఇన్ని రకాల చీరెల్లో దేని ధర ఏదో కస్టమర్లు గుర్తించటం అసాధ్యమైన పని అని తెలుసుకోవడంలో రవి తప్పటడుగు వేశాడు.

ఏదో ఒక కొత్తదనాన్ని ఆశించి, లేదా కొత్త మార్పు ప్రవేశపెడదామనుకున్నప్పుడు ఇలాంటి ఎదురుదెబ్బలు తప్పవు. వ్యాపారంలో ఇదంతా మామూలే అయితే ఇంతకన్నా పెద్ద ప్రమాదం- అనుకోని కోణంలోంచి వచ్చిపడింది.

ఆ రోజు అతడు ఆఫీసుకు వచ్చి కూర్చున్న రెండు నిముషాలకి ఇంటర్ కమ్ లో పిలుపొచ్చింది. "నీ కోసం అరగంటనుంచీ ప్రయత్నిస్తున్నాను. ఇంటికి ఫోన్ చేస్తే బయల్దేరావన్నారు. అర్జెంటుగా నా గదికి రా". రవితేజ హడావుడిగా వెళ్ళాడు. శర్మతో పాటు, ఒక మధ్యవయస్కుడు కూర్చుని వున్నాడు.

"ఈయన ఎల్.సి.రావు. సెంట్రల్ ఇంటెలిజెన్సు నుంచి-"రవికి అర్థంకాలేదు.

సి.ఐ.డి. వాళ్ళకి తమతో ఏం పనుందా అనుకున్నాడు.

ఈ లోపులో రావు-"మిస్టర్ రవితేజా! ఈ చీరెలు మీ ఫ్యాక్టరీ నుంచి తయారైనవేనా" అంటూ ఒక ప్యాకెట్ అతడి

ముందుకు తోశాడు. రవి ఆ ప్యాకెట్ లోనుంచి బయటకు కనబడుతున్న చీరల వైపొకసారి చూసి, "మావే-" అన్నాడు.

"ఒకసారి పరిశీలనగా చూడండి".

"అక్కర్లేదు. మా కంపెనీనుంచి తయారైన చీరల్ని ఎక్కడున్నా గుర్తుపట్టగలను" ప్యాకెట్ విప్పకుండానే చీరలవైపు చూస్తూ అన్నాడు. శర్మ చూపుల్లో అందిస్తున్న సందేశాల్నిగానీ, శర్మమొహంలో అలజడిని గానీ అతడు గమనించలేదు.

"మళ్ళీ ఇంకొక్కసారి చెప్పండి- కావాలంటే విప్పిచూసి".

"అక్కర్లేదు".

"మీ చీరెలు ఏ యే దేశాలకు ఎగుమతి చేస్తున్నారు?"

"పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, చైనా-" రవి తేలిగ్గా అన్నాడు. "అన్నిటికీ మాకు లైసెన్సులున్నాయి".

అతడి మాటలు పూర్తికాకముందే రావు ప్యాకెట్ విప్పి అందులోంచి చీరెను నిలువుగా పట్టుకున్నాడు.

చీర డిజైన్ ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది.

గీతాలు- వలయాలు- బోర్డరు.....

రవికి షాక్ తగిలినట్టయింది.

ఆ చీర తమ తయారీయే. డిజైన్ మాత్రం తమది కాదు.

రవితేజా టెక్స్ టైల్స్ వారు వాడే సిల్క్- వారు వాడే పాలియెస్టర్- వారు వాడే బోర్డరు- అంతా అదే.... కానీ లోపల డిజైన్ మాత్రం వేరే....

అందుకే అతడు బైటనుంచి చూసి గుర్తుపట్టలేకపోయాడు.

"ఏ.....ఏమిటవి?" అని అడిగాడు.

"చాలా తెలివిగా దేశ రహస్యాల్ని విదేశాలకు పంపుతున్నారు. చీర మీద డిజైన్ గ వేస్తే మూడోకంటికి అనుమానం రాదు. ఈ తెలివితేటలకు నా జోహార్లు".

"నాన్సెన్స్" అనుకున్నాడు మనసులో కోపాన్నీ, ఉద్వేగాన్నీ అణచుకుంటూ "ఎక్కడ దొరికాయి మీకీ చీరెలు?" అని అడిగాడు.

"షిప్ లో పాకిస్తాన్ వెళ్తున్న కన్ సైన్ మెంట్ లో" అన్నాడు.

అని, రవితేజ చీరలవైపు పరీక్షగా చూడటం గమనించి అతడు కొనసాగించాడు- "ఇది ఆవడి ఫ్యాక్టరీ డిజైను. ఇది దిండిగల్ ఏరియా. ఇది శ్రీహరికోట వివరాలు చెప్పే డిజైను...."

రవితేజ మనసులోనే శత్రువుని అభినందించాడు. కేవలం తమని ఇరికించటానికే ఈ ప్లాను వేస్తే సరే, లేకపోయినా కూడా ఈ ప్లాను గొప్పది. చీరెలమీద డిజైన్లు వేసి శత్రుదేశాలకి పంపటం...

శర్మ, రవి మొహాలు చూసుకున్నారు.

"ఇప్పుడేం చేస్తారు?"

"మిమ్మల్నీ, ఈ సంస్థ చైర్మన్ నీ, మిగతా డైరెక్టర్లునీ అరెస్టు చేయటానికి వారెంట్లు తెచ్చాను మిస్టర్ రవితేజ!"

"మేమూ మా లాయర్ని సంప్రదించవచ్చా?"

"దేశరక్షణకి సంబంధించిన విషయాల్లో లాయర్లు ఏమైనా చేస్తారని నేను అనుకోను-"

"బెయిల్?"

"ఆ విషయమైతే మీరు నిరభ్యంతరంగా మీ లాయర్లని సంప్రదించవచ్చు-"

"ఈ చీరెలు మావే. కానీ డిజైన్లు మావి కావు. సాదాచీరెలు కొనుక్కుని వాటిమీద ఈ డిజైన్లు ఎవరయినా వేయించి వుండవచ్చు. అక్కడ పాకిస్తాన్ కి ఈ కన్ సైన్ మెంటు చేరుకోగానే వాళ్ళ ఏజెంట్లు వీటిని తీసుకునే ఏర్పాట్లు చేసుకుని వుండవచ్చు. మీరు ఈ చీరెల్ని రసాయనిక పరీక్ష కిచ్చినా, "డిజైన్, ఇంక్" మేము వాడేది కాదని అర్థమవుతుంది ఇదంతా ఒక విధంగా ఆలోచిస్తే! మరోరకంగా ఆలోచిస్తే అసలీ ఉత్తుత్తి ప్లాన్ లు మమ్మల్ని ఇరికించటానికి అయివుండవచ్చు".

"అలాటి ప్రత్యర్థులు మీ కెవరైనా వున్నారా?"

"చెంచురామయ్య అండ్ కో".

"మీ రవి అన్నట్టు ఈ డిజైన్లు మీ ఫ్యాక్టరీలో ముద్రించబడి వుండకపోవచ్చు. ఇంకులు కూడా తేడా వుండవచ్చు. కానీ అదంతా ఎంక్వయిరీలో తరువాత తేలుతుంది".

"ఆ తరువాతే మమ్మల్ని అరెస్టు చెయ్యాలి మీరు" శర్మ అన్నాడు. ఆయనకప్పుడే బి.పి. పెరుగుతూంది.

ఎల్.సి. రావు నవ్వాడు. "ఎంక్వయిరీ అయిపోయాక ఇక అరెస్టు లెందుకు? మీరు మా ఎంక్వయిరీలో అడ్డుపడకుండా వుండటం కోసమే కదా అరెస్టు చేసేది". అతడు  చెప్పేది నిజమే! ఈ వాదనలన్నీ ఇక అనవసరం. రవితేజ వీళ్ళ మాటలు వినటంలేదు. ఆలోచిస్తున్నాడు. రేప్రొద్దున్నే ఈ వార్త పెద్ద అక్షరాలతో పేపర్లో వస్తుంది. దేశంలో అత్యుత్తమ వస్త్రోత్పత్తి సంస్థ డైరెక్టర్లు దేశ ద్రోహం క్రింద అరెస్టు అని పడుతుంది. ఎల్లుండి బెయిల్ మీద వదిలిపెట్టబడ్డారని వస్తుంది.

రెండు సంవత్సరాల తరువాత నిర్దోషులుగా ఋజువు అయినట్టు తెలుస్తుంది. కానీ ఏం లాభం, మొదటిరోజు వార్తతోనే షేరుధర టప్ మని పడిపోతుంది. జనానికి జ్ఞాపకశక్తి తక్కువ అని ఇంగ్లీషులో సామెత కూడా వుంది.

చెంచురామయ్యా! సరి అయినచోట దెబ్బకొట్టావ్.

రవితేజ ఈ విధమైన ఆలోచనలో వుండగా శర్మ ఇన్ స్పెక్టర్ తో బేరం మొదలు పెట్టాడు. పాతిక వేలిస్తాం వదిలెయ్యండి- టైప్ లో.

రావు నవ్వేడు- "మీకు మా డిపార్ట్ మెంట్ మీదా, ప్రభుత్వం మీదా చాలా చిన్నచూపు వున్నట్టుంది! అందరూ లంచగొండులే వుండరు. మామూలుగా అయితే రాగానే మిమ్మల్ని అరెస్ట్ చేసి తీసుకెళ్ళి అక్కడ చెప్పాలి ఈ వివరాలన్నీ కానీ ఇది మీ మీద కక్షగట్టి ఎవరో చేస్తున్నట్టు నాకే అనిపించింది. అందుకే ఇలా మామూలుగా మాట్లాడుతున్నాను. కానీ అరెస్ట్ మాత్రం తప్పదు. దేశరక్షణ అనేసరికి ఎవరూ స్వంత నిర్ణయాలు తీసుకోవటానికి ముందుకు రారు. బెయిల్ దొరకుతుందో- లేదో కూడా అనుమానమే! నేనిలా మామూలుగా మాట్లాడుతున్నాను కదా అని, దీన్నేదో డబ్బు దాహంలా మీరు భావించటం దురదృష్టకరం".

"సారీ...సారీ" అంటున్నాడు శర్మ.

ఈ లోపులో రవితేజ కల్పించుకుని అన్నాడు. "మేమేగానీ ఈ చీరెల్ని విదేశాలకు పంపాలనుకుంటే 'మా' బేళ్ళలో

కట్టి ఎందుకు? మామూలుగా విమానంలో ఏ సూట్ కేసులోనో పెట్టి పంపవచ్చుగా?"

"అవును, అదే నేనూ ఆలోచించాను. పాకిస్తాన్ కి ఎవరూ ఇలాటివి ఓడలో పంపరు. అందుకే ఇది మీమీద కక్షగట్టి ఎవరో చేస్తున్న పని అనిపించింది. అందులో వారు గెల్చారు".

"ఒకసారి అరెస్ట్ అవగానే, తరువాత గంటలో విడుదలయినా, ఆ వార్త పేపర్లో తాటికాయలంత అక్షరాల్తో పడుతుంది" నిస్సహాయంగా అన్నాడు శర్మ. ఆయన ఆ మాటలు అంటుంటే రవితేజ మెదడులో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. "ఒక రకంగా మనం దీన్ని - ఐ మీన్- ఈ ప్రభావాన్ని తగ్గించవచ్చు".

"ఎలా?"

"ఈ ఇన్ స్పెక్టర్ సాయం చేస్తే-"

"ఎలా?" ఈసారి రావు అడిగాడు.

"నిజంగా మీరు మమ్మల్ని నమ్మిన పక్షంలో, మమ్మల్ని అరెస్ట్ చేయటానికి రేపొస్తారు రేపు అరెస్టు చేస్తారు మమ్మల్ని".

"నా కర్థం కావటంలేదు".

"ఇంకో గంటలో మేము నలుగురం మా డైరెక్టరు పదవికి రాజీనామా ఇచ్చేస్తాం.... డైరెక్టర్ రవితేజని అరెస్ట్ చేస్తే వున్నంత సెన్సేషను మాజీ డైరెక్టర్ ని చేస్తే వుండదు. మిగతాది పేపరువాళ్ళతో మనం ఏర్పాటు చేసుకోవచ్చు- వార్తయొక్క సాంద్రత తగ్గించటంద్వారా".

ఇన్ స్పెక్టరు అయోమయంగా చూశాడు. ఇదంతా బయటికి పొక్కితే తన ఉద్యోగానికే ప్రమాదం. కానీ ఇలాటివి జరక్కూడదు అనలేదు. అసలు ఇలాంటి వ్యవహారాలు ఇలా జరుగుతాయని చాలామందికి తెలీదు. ఇక్కడ 'నేరం' కాదు ముఖ్యం. వీళ్ళ ప్రతిష్ట వాళ్ళు పోగొట్టాలి, అది పోగొట్టుకోకుండా వుండటానికి వీళ్ళు ఎదురు పథకం వేయాలి.

రెండు మల్టీ క్రోర్ కంపెనీలమధ్య జరిగే ప్రచ్ఛన్న యుద్ధం అది. ఒక్కరోజు పేపరు వార్తకోసం లక్ష రూపాయలు ఖర్చు పెట్టినది ఒక కంపెనీ అయితే, ఒకరోజు దాన్ని వాయిదా వేయటం కోసం ఇంకో లక్ష ఖర్చు పెట్టటానికి మరో కంపెనీ సిద్ధపడుతూ వుంది. రావుగానీ డబ్బు తీసుకోవటానికి సిద్ధపడే మనిషయితే, ఆ క్షణం లక్షా ఇవ్వటానికి శర్మ సిద్దంగా వున్నాడు.

"ఈ విషయం మూడోకంటికి తెలీకూడదు. మన మధ్యే వుండాలి" ఇన్ స్పెక్టర్ అన్నాడు. "....రేప్రొద్దున్న వచ్చి అరెస్టు

చేస్తాను. ఈ లోపులోనే మీరు బెయిల్ ప్రయత్నాలు చేసుకోండి".

"మేము జైల్లో వుండటంకాదు మా ప్రత్యర్థులకి కావల్సింది. మేము అరెస్టయ్యామన్న వార్త చాలు".

రవితేజ అన్నాడు. ఇన్ స్పెక్టర్ వెళ్ళిపోయాడు. చాలా సాధారణంగా, మామూలుగా జరిగిపోయింది.

చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "ఇంత బ్రతుకూ బ్రతికి చివరికి అరెస్టుదాకా వచ్చాం" అన్నాడొక డైరెక్టరు. "ఇప్పుడు ఈ వార్త తెలిసిందంటే నా భార్య గుండె ఆగిపోతుంది".

"ఈ వార్త చివరివరకూ మనకు తెలీదంటే వాళ్ళు జాగ్రత్తగా ప్లానువేసి చేసిందే ఇది" ఇంకో డైరెక్టరు అంటున్నాడు. శర్మ రవిని సలహా అడుగుతున్నట్టు "ఫైనాన్స్ మినిష్టర్ తో మాట్లాడితే...?" అన్నాడు.

ఒక డైరెక్టర్ కల్పించుకుని, "లాభంలేదు. ఇది మామూలు కేసు కాదు. ఎవ్వరైనా భయపడతారు. అసలీ ఇన్ స్పెక్టర్ ధైర్యాన్నే మెచ్చుకోవాలి" అన్నాడు.

అప్పటివరకూ నిశ్శబ్దంగా వున్న రవితేజ, "నాకో ఆలోచన వస్తోంది" అన్నాడు. అందరూ అతడివైపు చూశారు. రవితేజ ఫోన్ దగ్గిరకు లాక్కొన్నాడు.

అతడు దాదాపు మూడుగంటలసేపు వరుసగా ఫోన్లు చేస్తూనే వున్నాడు. అరగంటసేపు ఢిల్లీ మాట్లాడాడు. తరువాత ముంబాయి షిప్పింగ్ కంపెనీ వాళ్ళతో మాట్లాడాడు. తనకి తెలిసిన మిత్రుడు హోం డిపార్టుమెంట్ లో ఉన్నత పదవిలో వుంటే, అతడిద్వారా ఇంటెలిజెన్స్ డిపార్టుమెంట్ లో మరో ఉన్నతాధికారిని పట్టుకొని, అసలు ఫైలు ఏ స్థాయిలో వుందో కనుక్కున్నాడు.

ఈ లోపలే శర్మ బి.పి. ఎక్కువైందని వెళ్ళిపోయాడు. రేప్రొద్దున పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తే, అందర్నీ ఒకే లాకప్పులో పెట్టే ఏర్పాటు చేయమని మాత్రం కోరాడు.

బెయిల్ కోసం ప్రయత్నించారు. అదీ లాభం లేకపోయింది. రేపు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిస్తేగానీ అసలు విషయం తేలదు. చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. రేపెవరో వచ్చి అరెస్టు చేస్తారని ఈ రోజునుంచీ ఏదో అవుతుందని ఎదురు చూడటం దానికన్నా 'అయిపోవటం' మంచిది. ఈ టెన్షన్ భరించలేక శర్మ వెళ్ళిపోయాడు.

రవితేజ ఆఖరి నిముషం వరకూ దీన్ని ఆపుచేయతానికి తన శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాడు. అరెస్టు అవటం ప్రెస్టేజికి సంబంధించినది. ఏదో ఇన్ స్పెక్టర్ ముందు సాకు చెప్పారు కానీ, రాజీనామాలు ఈ రోజు సమర్పించినా, రేపు పోయేపరువులో దాని ప్రభావం ఏమీ వుండదు. షేరు ధరలోను మార్పు మామూలుగానే

వుంటుంది. కానీ ఇటువంటి కేసుల్లో Purchasing Time చాలా ముఖ్యం.

రవితేజకి అంత టెన్షన్ లోనూ నవ్వొస్తూంది. ఎవరో ఎక్కడో మనని ఇరికించటానికి ఏదో చేస్తారు. దాంతో ఈ రూల్సూ వ్యవహారాలు....చివరికి ఏమీ అవదు. షేరు ధరలో మార్పులతో కొంతమంది నష్టపోతారు. లేకపోతే ఎక్కడో ఒక ఓడలో తమ సరుకుతోపాటు మ్యాపు డిజైన్లు దొరకటం ఏమిటి? దానికి ఈ అరెస్టులూ, పబ్లిసిటీ ఏమిటి? నాలుగురోజుల పాటు హడావుడి ఏమిటి? రూల్స్.....రూల్స్...

రాత్రి పదకొండున్నర వరకూ మొత్తం అంతా కలిసి, తమకున్న పరిధుల్లో రకరకాల పలుకుబడులు ఉపయోగించి ప్రయత్నించారు. ఈ రకమైన పరిస్థితుల్ని స్వయంగా పరిశీలిస్తే తప్ప, వర్ణిస్తే అర్ధంకావు. అప్పటివరకూ కోట్లమీద వ్యాపారం చేసేవాళ్ళు, ఈ క్షణం ఎవరు దొరికితే వాళ్ళ సహాయం తీసుకోవటానికి, దేన్నైనా వదులుకోవటానికి సిద్ధంగా వున్నారు. రేపు పోలీసుస్టేషన్ లో ఒకగంట, ఆ తరువాత కోర్టులో మరో రెండుగంటలు....

ఇంతదానికి, రేపు పేపర్లో ఈ చిన్న వార్త రాకుండా వుండటానికి లక్షలు ఖర్చు పెట్టటానికి సిద్ధంగా వున్నారు.

సమాజంలో (కృత్రిమమయిన) గౌరవానికి మనిషి ఎంత విలువ నిస్తాడో చెప్పటానికి ఇదో ఉదాహరణ. ముఖ్యంగా వ్యాపార రంగాల్లో, నలుగురి దృష్టి తమమీద పడకూడదు అని భావిస్తాడు. రాత్రి పదకొండింటికి, ఒక స్నేహితుడిని పట్టుకుని, అతడికి తెలిసిన మరో మిత్రుడిద్వారా, మేజిస్ట్రేటుని కదిలించారు. రేపు కోర్టులో హాజరు పర్చగానే బెయిలు లభించేలా వాగ్దానం తీసుకున్నారు. అదొక రిలీఫ్ గుడ్డిలో మెల్ల.

ఇంక ఆ రాత్రికి చేసేదేమీ లేదని నిర్ణయించుకుని డైరెక్టర్లు ఇళ్ళకి కదిలారు. రవి మాత్రం ఇంకేదైనా మార్గం వుందా అని ఆలోచిస్తూనే వున్నాడు. అతడింటికి వెళ్ళేసరికి రాత్రి పావుతక్కువ పన్నెండయింది. మాధవి మెలకువగానే వుంది.

"అయినాయా అర్ధరాత్రి వరకూ పార్టీలు, స్నేహితులు-" నాయి తగులుకుంది రాగానే రవితేజ నిశ్చేష్టుడయ్యాడు. అతనెంత టెన్షన్ తో వున్నాడంటే, ఈ తాకిడిని అసలు వూహించలేదు. అతడి మౌనాన్ని మరోలా అర్ధం చేసుకుని, "అసలు ఇంట్లో భార్య అనేది ఒకతుందని గుర్తుంటుందా మీకు బయటకు వెళ్తే?' లేకపోతే వంటమనిషిగా పడివుంటుంది అనుకుంటున్నారా? మీకేం? ప్రొద్దున్న ఎనిమిదింటి వరకూ పడుకుంటారు. తెల్లారేసరికి లేవాల్సింది నేనేగా మళ్ళీ! ప్రతిరోజూ ఇలా పదకొండు దాటాకరావటం, మాకు బయట ఎన్ని పనులుంటాయో నీకేం తెలుసు అని డబాయించటం".

"నేను రాత్రి వచ్చేవరకూ నిన్ను మేలుకుని వుండమని అనలేదు. లేకపోతే ప్రొద్దున్నే లేచి ఇల్లు వూడవమనలేదు. ఈ రెంటిలో ఏది చేయకపోయినా నాకు పర్లేదు".

"అంతేగానీ ఇంటికి మాత్రం తొందరగా రానంటారు".

"ఈ రోజు చాలా వర్రీస్ లో వున్నాము మాధవీ-"

"చెప్పాగా, అదే సమాధానం అలా మీరు లేనిదెప్పుడు? ఎవరైనా నెలకి కనీసం ఒకరోజు భార్యని తీసుకుని అలా బయటకు వెళ్దామనుకుంటారు. ఖర్మ, ఒక అచ్చటా లేదు ముచ్చటా లేదు".

"మొన్నేగా ఏదో పెళ్ళి కెళ్ళి అట్నుంచి హోటల్ కి వెళ్ళాము" తన సమస్యని మర్చిపోయి అతడు వాదనలోకి దిగాడు.

"ఆ- వెళ్ళాం... మాట్లాడితే ఎప్పుడో తాతయ్య తద్దినం నాటి సంగతే చెపుతారు".

"నువ్వు ఒక్కరోజు మా స్థానంలో వుంటే తెలుస్తుంది మా టెన్షన్ ఏమిటో-"

"ఎవడు పడమన్నాడండీ టెన్షన్?" వెటకారంగా అంది. "అందరూ సంపాదించటంలే- అందరూ మీలాగే భార్యల్ని నిర్లక్ష్యం చేస్తున్నారా?"

'చేస్తున్నారు'- పైకి అనలేదు, మనసులో అనుకున్నాడు. రోజు రోజుకీ జీవితం ఖరీదైన వస్తువుగా మారిపోతున్న ఈ రోజుల్లో, ఒక మామూలు గృహస్తుకి తన కుటుంబానికి సామాన్య సుఖాలు కల్పించటం కూడా గగన కుసుమమైపోతున్న ఈ రోజుల్లో - ఏడేళ్ళ క్రితం కన్నా ఇప్పుడు మనిషి పదిరెట్లు ఎక్కువ కష్టపడాల్సి వస్తున్న ఈ కాలంలో - జీవితంలో, ముఖ్యంగా మొగవాడి జీవితంలో 'టెన్షన్' క్రితం కన్నా ఎక్కువభాగం ఆక్రమించుకుంటూందనీ, అతడేం చేసినా తన కుటుంబం కోసమేననీ ఈ భార్యలు ఎప్పుడు గుర్తిస్తారు? బహుశ వాళ్ళ తప్పుకూడా ఏమీ లేదేమో... తాగుడు, పేకాట, రేసులు ఇవన్నీ కలిసి మొగవాడి మీద ఆడదానికి నమ్మకం పోగొట్టినాయేమో...

మొన్న మొన్నటివరకూ పక్కింటి ప్రభాకర్ అతని పాలిట విలన్! అతడికి ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. ఏదో బ్యాంకీలో సబ్- మేనేజర్, ముగ్గురు పిల్లలు. అయిదయ్యేసరికి స్కూటర్ మీద ఇంటి కొచ్చేస్తాడు. రాత్రి ఏడయ్యేసరికి, ఒక గ్రూపు ఫోటోలో కూర్చున్నట్టు కూర్చుని, అందరూ టీ.వీ. చూస్తారు. పదింటికి ఠంచనుగా లైట్లారిపోతాయి. ప్రొద్దున్న తిరిగి అదే కార్యక్రమం.

మాధవి దృష్టిలో కుటుంబం అంటే అది! ఎన్ని జన్మల పుణ్యం చేసుకుంటేనో ఆవిడకి అటువంటి భర్త లభించాడు. తనకా అదృష్టం లేదు.

కానీ ప్రభాకర్ ప్రపంచంలో అతడి కుటుంబం తప్ప మరేమీలేదు. తన ప్రపంచం, రోజు రోజుకీ పెద్దదవుతూ వుంది. కొన్ని వందలమంది కార్మికులు కొన్ని వందల కొత్త డిజైన్లు- అది ఒక 'ఎంటిటీ' ప్రపంచం. విస్తీర్ణమయ్యే కొద్దీ భార్య

స్థానం తక్కువ అవటం సహజమే! రాజీవ్గాంధీని సోనియాగాంధీ- మీరు నన్నెందుకు చేసుకున్నారు! రాజకీయాల్నే కట్టుకోలేకపోయారా అని అడగటం ఎంత హాస్యాస్పదమో, పని- రిస్కు-టెన్షన్ ల కలవాటు పడ్డ మనిషిని ప్రశాంతంగా జీవితం గడపమని అడగటం అంతే హాస్యాస్పాదం. పెళ్ళి చేసుకునేముందు ఇవన్నీ ఆలోచించవలసింది- అన్న ప్రశ్న అర్ధరహితం.

ఎదుటివాళ్ళ లోపాల్ని మాటిమాటికీ ఎత్తిచూపకుండా, ఎదుటివాళ్ళని విమర్శించకుండా, అవతలివాళ్ళని తన ఖర్మకొద్దీ కట్టుకున్నారని జీవితంలో ఒకసారైనా అనుకోకుండా, ఒక భార్యగానీ, భర్తగానీ వుండలేరా? "మా ఆయన మంచివాడే కానీ అదిగో అక్కడే వస్తుంది నాకు వళ్ళుమంట" అని ఏదో ఒక విషయం ఎత్తిచూపకుండా, కేవలం మంచినే గ్రహించి సుఖప్రదంగా గడపలేరా? నూటికి నూరుపాళ్ళు ఒకరిమీద ఒకరు ఆధారపడటం అందువల్ల మనస్పర్ధలు రావటం- ఇలా కాకుండా మరింత స్నేహితుల్లా వుండలేరా? బహుశా మాధవికూడా తన గురించి అలాగే ఆలోచిస్తూ వుంటుందేమో ఒక మానసిక విభేదం వచ్చిన తరువాత అంతే.....ఎవరికీ వాళ్ళు తమ మార్గమే కరెక్టని అనుకుంటూ వుంటారు.

అతడి ఆలోచనని మాధవి మాటలు భంగం చేశాయి. "ఇదొకటి ప్రతిదానికీ మౌనంగా వుండిపోవటం నేర్చుకున్నారు. పదండి భోజనానికి -"

"నాకు ఆకలి లేదు".

"ఎందుకు లేదు. బైట తాగి తినొచ్చారా?"

అతడు మొహం చిట్లించి, "మాధవీ నన్ను విసిగించకు" అన్నాడు.

"అర్ధరాత్రి ఇంటికొచ్చి, పైగా నేను విసిగించానంటారా?"

"నా మనసేం బాగోలేదని చెప్పాను".

"ఒకప్పుడు బావుంది గనకా".

అతడి కెన్నడూ లేనంత కోపం వచ్చింది. అతడికున్న టెన్షన్ కి ఈ గొడవ తోడై పిచ్చివాడిని చేస్తోంది. విసురుగా ఆమె రెక్కపట్టుకుని "మాట్లాడకు" అన్నాడు.

"అవును, మీరేం చేసినా నేను మాట్లాడకపోవటం వల్లనే అవుతోంది ఇదంతా".

"ఏమిటి, ఏమైంది?" గద్దించి అడిగాడు.

"ఏమవ్వాలి? ఒక్క సుఖం లేదు. అది చాలదూ!"

"రేపట్నుంచీ అన్నీ సుఖాలే. ఒక్కదానివీ హాయిగా వుందూగానీ"

"అంటే-"

"రేపు పోలీసులు నన్ను అరెస్టు చేస్తున్నారు".

ఆ ఇంట్లో...సరిగ్గా రెండు నిముషాల తరువాత ఆమె బిగ్గరగా "ఎందుకొచ్చిన వ్యాపారాలు- ఎందుకొచ్చిన అరెస్టులు. నేను చెబుతే విన్నారా?" అంటూ రోదించసాగింది.

"ఎక్కడో ఎవరో ఏదో చేస్తే దానికి నేనేం చెయ్యను?"

"అందరూ వ్యాపారాలు చేసుకోవటం లేదా? అందరూ ఇలాగే అరెస్టులవుతూ వున్నారా? లక్షసార్లు చెప్పాను ఇవన్నీ వద్దని..."

ప్రభాకర్ స్కూటర్ క్రిందపడి, ఆ చొట్టలుపడ్డ స్కూటర్ తో ఇంటికి వస్తే వెంటనే భార్య ఏమంటుంది? ...." ఎందుకంత ఫాస్ట్ గా నడపటం లక్షసార్లు చెప్పాను అలా నడపొద్దని" అంటుందా? - నాలుగు సంవత్సరాల్నించీ దానిమీదే ఫాస్ట్ లా సినిమాలకెళ్ళిన విషయం మర్చిపోయి-

ప్రభాకర్ బాత్ రూంలో జారిపడితే, వెంటనే భార్యనై "ఎన్నిసార్లు చెప్పాను బాత్ రూంను బాగా కదగమని" తిడతాడా? లేక "సారీ నోయ్. సరిగ్గా చూసుకోలేదు.....ఈ రోజు టీవీ చూడటం మానేసి బాత్ రూమ్ నేనే కడుగుతాన్లే" అంటాడా?

మనుష్యులు - ఏదైనా ఒకటి జరిగితే, దానిపట్ల వెంటనే నిర్ణయాలకి వచ్చేసి ఎవర్నో ఒకర్ని దానికి బాధ్యుల్ని వెంటనే చేసెయ్యటం ఎప్పుడు మానతారు? ఇక ఆలోచించటం అనవసరం అన్నట్టుగా అతడు పైకి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు పది గంటలకి జరగబోయే సంఘటన అతడి మనసులో తొలుస్తూనే వుంది.

అన్యమనస్కంగానే ఆ రోజు వచ్చిన పోస్టు చూడటం మొదలుపెట్టాడు. ఒక లావుపాటి కవరు అతడ్ని ఆకర్షించింది. ఎక్కడ్నుంచి వచ్చిందో అడ్రస్సులేదు. విప్పి చూశాడు. లోపల కూడా అడ్రస్సు లేదు. సంతకం చూశాడు. -మిస్ విజయవాడ అని వుంది. అతడికి అర్థంకాలేదు.

పదిహేనేళ్ళ క్రితం నాటి సంఘటన అతడు మర్చిపోయి చాలాకాలమైంది.

## 10

**రవీ,**

ఈ ఉత్తరం చూడటానికి ముందు నువ్వు, ఇంత పెద్ద ఉత్తరం వ్రాసిందెవరా అని, క్రింద సంతకం చూసి, అదీ గుర్తుపట్టలేక ఆశ్చర్యపోతావని నాకు తెలుసు. పదిహేను సంవత్సరాలక్రితం జరిగిన సంఘనట నీకు గుర్తుండవలసినంత అవసరంలేదు. ఒకరికి తమ జీవితంలో ఎంతో గొప్పగా గుర్తుంచుకోవలసిన సంఘటన, మరొకరికి చాలా మామూలుగా గడిచిపోయినదై వుండవచ్చు. అలాంటిదే యిదీ అని నేను భావిస్తున్నాను.

ముందు నిన్ను 'రవితేజా' అని సంబోధిద్దామనుకున్నాను. కానీ నాకు ముందు నువ్వు తెలిసింది రావిగానే. నిరంతర కృషితో 'తేజ'ని బిరుదుగా తెచ్చుకున్నావు. ఇన్ని సంవత్సరాల నీ కృషిని నేను గమనిస్తూనే వున్నాను సుమా. నువ్విప్పుడు ఇంత పై అంతస్తుమీద వున్నా నాకు తెలిసింది రవిగానే కాబట్టి, ఏకవచనంలోనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను ఏమనుకోవు కదూ.

ఇంకా నీ సందిగ్ధం ఏమీ లేదని తెలుస్తూనే వుంది. మరింత వివరించనా?

-దాదాపు పదిహేను సంవత్సరాలక్రితం ఒకమ్మాయి వుండేది. జీవితపు ఒడుదుడుకులు, కష్టనష్టాలూ ఏమీ తెలియని ఆ అమ్మాయి జీవితంలో హుషారు అమాయకమైన అల్లరి తప్ప మరేమీ లేదు. తనలోని కొత్త అందాల్ని వెలికితెచ్చి, తనకే సంభ్రమం కలిగించేలా తీర్చిదిద్దిన ఒక కుర్రవాడిని, తనకన్నా కాస్త చిన్నవాడిని- హఠాత్తుగా దగ్గిరకి తీఉస్కుని గట్టిగా ముద్దు పెట్టుకుంది. ప్రపంచాన్ని గెలిచిన ఆనందంలో తనేం చేస్తున్నది ఆ సమయంలో ఆ అమ్మాయికి తెలియలేదు. కానీ రోజులు గడిచేకొద్దీ తన జీవితపు మొదటి ముద్దు ఆ అమ్మాయికి తెలియలేదు. కానీ రోజులు గడిచే కొద్దీ తన జీవితపు మొదటి ముద్దు ఆ అమ్మాయి మనసంతా ఆక్రమించుకుంది. కలవరపెట్టింది. ఒక అలజడి సృష్టించింది.

తన గెడ్డం క్రింద ఆ అబ్బాయి కొత్తచోటున అమర్చిన పుట్టుమచ్చ "అప్పటికన్నా ఇప్పుడు నీలో ఏదో గమ్మత్తైన మార్పు వచ్చిందే- అప్పటిమీద మరీ అందంగా కనపడుతున్నావు" అని ఎవరు ప్రశంసించినా, ఆ ఖ్యాతి అంతా నీకే దక్కాలన్నట్టు- "నువ్వు చెక్కుకున్న శిల్పాన్ని నేను" అనే భావం నాకు కలిగేది. చాలా అపురూపమైన, సున్నితమైన భావం కదూ.

-ఇదంతా నీకు అయోమయంగానూ, లేక సెంటిమెంటల్ ఫూలిష్ నెస్ గానూ కనపడుతూ వుండవచ్చు కానీ

చెప్పానుగా. కొన్ని అభిప్రాయాలకీ పునాదులే ఉంటాయి. నిర్మాణాలు వాటిష్టం. నేను గోదావరిని చూడలేదు. వేదాలు చదవలేదు. కానీ "వేదంలా ఘోషించే గోదావరీ" అనే పాటంటే ఇష్టం ఎందుకిష్టం అంటే నేనేం చెప్పను. చూరుమీదనుంచి జారే వానచుక్క మెర్క్యురీలైటు వెలుగులో ఏడురంగుల్ని సంతరించుకునే సమయాన, రోడ్ మీద నిలిచిన వాననీటిలో ఒక చిన్న పాప పట్టులంగా జాగ్రత్తగా ఎత్తి పట్టుకుని ఏదో తెలియని ఫీలింగ్ ని మొహంలో దాచుకుని నడచి వస్తూంటే ఆ అమాయక పాదాలని మరీ మరీ చూడాలని ఎందుకు అనిపిస్తుంది అంటే దానికి రేషనల్ గా సమాధానం ఏముంటుంది? నా గుండెల్లో నీ మొదటి ముద్దు ఆ విధంగా హత్తుకు పోయింది.

భావం, లేక అనుభూతి అనేదాన్ని మాటల్లో వెలువరించటం అనే అతి పురాతనమైన పద్ధతిలో తప్ప నేను ఏ రకంగా నీకు ఈ వివశత్వాన్ని తెలుపగలను?

పెళ్ళికాని అమ్మాయిగా ఈ ఫీలింగ్స్ అన్నీ సహజమే! నా వివాహం మామూలుగా జరిగిపోయినా నువ్వు మళ్ళీ నాకు కనపడకపోయినా-ఆ ముద్దు ఒక తీపి జ్ఞాపకంగా మనసుపుటల్లో నిలిచి పోయేది. రాజకీయాల్లో పూర్తిగా నశించిపోయిన నాన్నగారు ఆఖరి ఎత్తుగా, వయసు ఎక్కువగా వున్న శర్మగారితో - వివాహం జరిపించకపోయినా, శర్మగారి మొగతనమంతా గుర్రాలకీ, తాగుడికీ అంకితం కాకపోయినా పరాయి పురుషుడికి అలా మనస్సు విప్పి వ్రాసి చులకన అయ్యే స్థితి నాకు కలిగేది కాదేమో!

నా మీద నీకు అసహ్యం కలిగితే క్షమించు దాహంతో వున్న మనసు నైతిక విలువల్ని గుర్తించదు.

ఎవరో ఒక కుర్రవాడు షోకేసులో బొమ్మకి అద్భుతంగా చీర కట్టాడు అని మా ఆయన చెప్తే, ఒక టెక్స్ టైల్స్ యజమానినే అంతగా స్పందింపజేసిన ఆ కుర్రవాడు ఎవరా అని నేనే స్వయంగా వచ్చి మళ్ళీ రెండోసారి నిన్ను చూసిన క్షణం...

మనిషి తను పొందిన అనుభూతిని, లేక అతను అనుభవించిన ఉద్వేగాన్ని తనకు చేతనైన ఛానెల్స్ లో వెల్లడించటానికి చేసే ప్రయత్నంలో 'మాటలు' తప్ప మరే దాన్నీ ఉపయోగించటానికి వీలు కల్పించలేకపోవటం మనిషికి దేవుడిచ్చిన పెద్ద శాపం. ఈ 15 సంవత్సరాల్లోనూ నువ్వు పెద్దవాడవయ్యావు. (నాకు నవ్వొస్తూంది. ఈ టైమ్ లోనే మొట్టమొదటిసారి నువ్వు కనిపించి వుంటే అప్పుడు చేసినంత సాహసం చెయ్యగలిగేదాన్నికాదేమో) ఇన్నాళ్ళూ నా మనసులో గూడు కట్టుకున్న భావాలకి నిన్ను చూడటం సముద్రం మధ్యలో అగ్నిపర్వతం బ్రద్దలైన ఫీలింగ్ నైతిక విలువలు నీళ్ళలా ఆవిరయిపోకుండా ఉంచటానికి నేను చాలా కష్టపడవలసి వచ్చింది.

అప్పటినుంచీ ప్రారంభమైంది నరకం!

అంచెలంచెలుగా నువ్వు పెరిగిపోవటాన్ని-తెరచాటు నుంచి ప్రేక్షకురాలిగా గమనిస్తూ వచ్చాను. శిథిలమయిపోతున్న మా కుటుంబ ఆర్థిక వ్యవస్థని నువ్వే నిలబెట్టావని నాకు తెలుస్తూనే వుంది. అన్నిటికన్నా నాకు

విస్మయాన్నీ, ఆనందాన్నీ కలిగించిన విషయం- నువ్వుకూడా భావుకత్వాన్ని ఆస్వాదిస్తావని తెలియటం! భావుకత్వాన్ని ప్రదర్శించేవాళ్ళు చాలా తప్పుదార్లో లోకాన్ని అప్రోచ్ అవుతున్నారనీ, జీవితం వాళ్ళకి పూలపానుపు కాదనీ నేను అనుకుంటూ వుండేదాన్ని నా అభిప్రాయం తప్పు అని నాకు తెలియజెప్పావు. క్రమక్రమంగా నా ఆలోచనల్లన్నీ నీ చుట్టూ తిరగసాగాయి. ఎన్నో సంవత్సరాలు కంట్రోలు చేసుకున్నాను. ఇక చేసుకోలేక ఈ ఉత్తరం!

నేను తప్పు చేస్తున్నానా?

లేదనే నా అభిప్రాయం. ఇన్నాళ్ళ మానసిక ఘర్షణ తరువాత నేను చివరికి ఈ నిర్ణయానికి వచ్చాను. ఇక నిన్ను కలుసుకోకుండా వుండలేను. ముద్దుతో ప్రారంభమైన మొక్క- ఆయన నిరాసక్తతతో మహావృక్షమై- మనసంతా ఆక్రమించుకున్న ఈ క్షణాన- ఇంకా నైతిక విలువల్ని పట్టుకుని వేలాడటం- నా నిస్సారమైన జీవితానికి పరాకాష్టగా, నరకంగా అవుతుంది నిజం!

నిన్ను రెండోసారి చూసినప్పుడు నా డైరీలో- 'మలయమారుత తూగుటుయ్యాలలో పులకించు పుష్పాలు..... అంచెలంచెలుగా సొగసు చిలకరించు మంచు భాష్పాలు'.

అని వ్రాసుకున్నాను. ఒక వివాహిత యిలా వ్రాసుకోవటం మన సమాజం హర్షించదు. డబ్బుకోసం కూతుర్ని ముసలివాడికిచ్చిన సమాజం.....వ్యసనంలో భార్యని నిర్లక్ష్యం చేసిన సమాజం.....దీన్ని గౌరవించే ఓపిక నాకు పోయింది ఈ ఉత్తరం ఇలా వ్రాయటం నాకు ఒకవైపు భయంగానే వుంది. నన్ను నువ్వెలా అర్థం చేసుకుంటావో అని, మళ్ళీ ఇంకోవైపు అనిపిస్తోంది.

పొగలెక్కిన అగరు తెరలెత్తి - పొగరెక్కిన వగలు మరులొత్తి పెదవుల నదిమి, ముద్దును చిదిమి- చైత్రం సుగంధ వీచిక.... చిత్తం ప్రబంధ మాలిక-

అని.

"మెత్తని సిల్కుచీరె శరీరాన్ని చుట్టేసినట్టు, ఏదో మధుర భావన. జీవ దర్శనంతోపాటు ఒక తాదాత్మ్యత కావాలి మనిషికి. వేణువులో దూరిన ప్రతి వెర్రిగాలీ ఒక పాటగా మారినట్టు- నాలో కదిలే ప్రతీ భావం ఇప్పుడు మృదుమంజుల భావం అవుతోంది. నవ్వితే సిరిమల్లి- నడిస్తే పిల్లగాలి- పలికితే పాలవెల్లి- నీ తలపు నా మనసంతా వెదజల్లి... మనసుకు మించిన కళాఖండం లేదు గదూ రవీ! ఇదంతా అసలు నీకు ఆగమ్య గోచరంగా వుండవచ్చు. నిచలంగా వున్న నీ మనోతటాకంలోకి ఈ ఉత్తరం ఒక అవసరమైన రాయి అవ్వొచ్చు కానీ అయిదారు సంవత్సరాలు ఈ అంతర్ సంఘర్షణతో విసిగిపోయాను. నువ్వు మా ఇంటికి వచ్చినప్పుడు, ఆయన కాఫీ ఇమ్మన్నా నేను బయటకు రాలేకపోవటానికీ, రవితేజా టెక్స్ టైల్స్ వారు కుటుంబాల్తో సహా ఏర్పాటు చేసిన ఫంక్షన్ లని నేను ఉద్దేశపూర్వకంగా ఎవాయిడ్ చేయటానికీ వెనుక యింత సంఘర్షణ వుందని నువ్వు గ్రహిస్తే చాలు. నన్నొక లేకి

స్త్రీగా మాత్రం చూడకు. నన్ను నేను బంధించుకోవటానికీ, సామాజిక న్యాయలకి విలువ నివ్వటానికీ ఎంత కష్టపడ్డానో నువ్వు గుర్తిస్తే చాలు. ఈ భావాలన్నీ వెకిలిగానూ, నా కోర్కె అర్ధరహితంగానూ కనిపిస్తే ఈ ఉత్తరం సంగతి మర్చిపో. మనసు మాత్రమే కోరుతుంది. శరీరానికి కోర్కె వుండదు అనుకోవటం హిపోక్రసీ నీకేం గమ్మత్తుగా లేదుకదూ నేనిలా వ్రాయటం. నాకు నువ్వే మీ కొత్త కాదు అన్న భావన నన్ను ఇలా తోచింది తోచినట్టు వ్రాయటానికే పురిగొల్పుతుంది. పదిహేను సంవత్సరాల క్రితం ఆ రోజు ఇంకా నీకు గుర్తుంటే- నన్ను కలుసుకోవటం నైతిక విలువలని అగౌరపర్చటం కాదని నువ్వు అనుకుంటే-మనం కలుసుకుందాం. ఇక ఈ సంఘర్షణని నేను భరించలేను. ఎల్లుండి ప్రొద్దున్న తాజ్ లో పదింటికి నీ కోసం ఎదురు చూస్తూ వుంటాను. నువ్వు చెక్కిన శిల్పం నీకు గుర్తులేకపోతే, నా యీ భావాలన్నీ నీకు అర్ధరహితంగా కనిపిస్తే, కట్టుబాట్లనుంచి బయటపడటానికి నేను పడిన బాధ నీకు బరితెగింపుగా కనిపిస్తే- ఈ ఉత్తరం చింపెయ్యి.

ఇంకేం వ్రాయను?

గుండె గోదార్రై, హృదయం కావేర్రై, సముద్రాన్ని కంటి చివర చుక్కగా మిగుల్చుకుని ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాననీ, ఇది క్షణికావేశం కాదనీ నువ్వు గ్రహిస్తే చాలు నాకు కలుసుకోకపోయినా ఫర్వాలేదు-తేలిక భావాల్ని మాత్రం ఏర్పర్చుకోకు ఒకప్పటి....

**-మిస్ విజయవాడ.**

ఉత్తరం చదవటం పూర్తిచేసి అతడు శిలాప్రతిమలా చాలా సేపు అలాగే కూర్చుండిపోయాడు. మనసంతా ఏదో మంచు ముద్ద మధ్య పెట్టినట్టు ఘనీభవించింది. అతడు ఏం ఆలోచిస్తున్నాడో అతడికే తెలియదు. అర్ధరాత్రి కావొస్తూంది.

ఆ చీకటి నిశ్శబ్దంగా, అతడి ఆలోచనాతరంగాల్ని పరిశీలిస్తున్నట్టు స్థబ్దంగా వుంది. సోఫా వెనక్కివాలి, నుదుటిమీద చెయ్యిఆన్చి కళ్ళు మూసుకుని వున్నాడు అతడు.

అతడా అమ్మాయిని మర్చిపోలేదు. పదిహేనేళ్ళక్రితపు స్త్రీమూర్తి ఒక సజీవాకృతిలా అతడి మనోఫలకం మీద చిత్రించబడే వుంది. అయితే ఒక అనూహ్యమైన మలుపులో ఆకస్మికంగా ఇలా బయటపడుతుందని మాత్రం అనుకోలేదు. అతఃడికి సంబందించినంత వరకూ అదొక జ్ఞాపకం. అంతే అంతకు మించేమీ లేదు. కానీ ఈ ఉత్తరం వచ్చిన తరువాత...

అప్పటివరకూ ప్రశాంతంగా వున్న తటాకంలో ఒక హంస ఇట్నుంచి అటు కదలగా ఏర్పడిన వయ్యారపు తరంగాలు....

అతఃడికి బాధ వుంది. కానీ ఐదేళ్ళుగా ఆ బాధని అలవాటుగా మార్చుకుని సహజీవనం చేస్తున్నాడు. ఇంటిలో సుఖంలేని మొగవాళ్ళు బయట వ్యసనాలకు దాసులవ్వొచ్చు. అతడు అలా 'పని'కి దాసుడయ్యాడు. అతడికి సుఖాలకు కొనుక్కోవటంగానీ, జీవితాన్ని అనుభవించటం గానీ తెలీదు. ఇంటిలో లేని ప్రశాంతత అతడికి పనిలో దొరికేది.

అతడు ఆ ఉత్తరాన్ని అప్పటికే పదిసార్లు చదివాడు. ఆమె అక్షర శిల్పం, మనో సంచలనాన్ని బహిర్గత పరిచిన విధానం, అతడిని కదిలించి వేసింది. శూన్యత ఎలా వుంటుందో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. ఆమె ఎంత మధనపడి, ఎంతకాలం కొట్టుమిట్టులాడి ఆ నిర్ణయానికి వచ్చిందో ఆ ఉత్తరం చెపుతూంది.

-బట్టల కొట్టులో గోపీమాధుర్ కి ఉద్యోగం ఎందుకుపోయిందో ఇప్పుడు అర్థమైంది. శర్మగారితో మాట్లాడుతూ వుంటే తెర వెనుకే కదలికల కర్థం ఇప్పుడు తెలిసింది.

ఎడారిలో ఎంత ఎండ కాసినా ఫర్వాలేదు. కానీ కాస్త వర్షం వచ్చి నాలుగు చినుకులు పడ్డాక తిరిగి ఎండా భరించటం కష్టం. అప్పటివరకూ ఎండకు సిద్ధపడి ఎడారిలో ప్రయాణం చేస్తున్న వాడికి అనుకోని విధంగా మబ్బుతునక కనపడ్డట్టు అయింది. అది వర్షమే కురిపిస్తుందో- తుఫానే రేపుతుందో, లేక గాలికి తేలిపోతుందో కాలమే నిర్ణయించాలి.

## 11

**'ఎల్లుండి** పది గంటలకి'అని ఆమె వ్రాసింది. ఆ ఉత్తరం వ్రాసిన తారీఖు అతడికి పిడుగుపాటులా తోచింది.....రేపే!

రేపు సరిగ్గా ఈ సమయానికి తను అరెస్ట్ చేయబడతానని అతడికి తెలుసు. ఎంత లేదన్నా సాయంత్రం వరకూ పోలీస్ స్టేషన్ లో, కోర్టులో గడపాలి.

అతడికేం చేయాలో తోచలేదు.

తనకోసం ఆమె అక్కడ ఎదురుచూస్తున్న సమయానికి ఇక్కడతనని అరెస్ట్ చేయటానికి ఇన్ స్పెక్టర్ వస్తాడు. ఇది ఇలా జరక్కుండా, ఆమెకి దీని సంగతి ముందే తెలియాలి. అంటే....శర్మ చెప్పాలి.

కానీ ఆయన చెప్పుతాడని తను అనుకోవటం లేదు. ప్రొద్దున్నే ఆఫీసుకు బయల్దేరినట్టు వెళ్ళి, సాయంత్రం కోర్టునుంచి తిరిగొస్తాడు. ఆమె ఇదంతా పేపర్లో చదివి తెల్సుకోవాల్సిందే.

ఏది ఏమైనా రేపామె తనకోసం ఎదురుచూస్తుంది.

తను కలుసుకోవాలి.

లేదా ఫోన్ చేసి ప్రోగ్రాం ఎల్లుండికి మార్చుకొమ్మని చెప్పాలి. అతడి చెయ్యి ఫోన్ వరకూ వెళ్ళి ఆగిపోయింది.

శర్మగారు తీస్తే...?

ఏదో తప్పు చేస్తున్న భావన.

ఒకవేళ ఆమె ఎత్తినా కూడా-ఏం మాట్లాడతాడు? రేపు కాదు. రేపు అరెస్ట్ అవబోతున్నాం. ఎల్లుండి కలుసుకుందాం- అని చెపుతాడా? అసలు కలుసుకున్న కొద్దిసేపటివరకూ, లేక మాట్లాడవలసిన సందర్భం వచ్చిన కొద్దిసేపటివరకూ తను మాట్లాడగలడా?

శర్మగారి భార్య చాలా అందంగా వుంటుంది అని అందరూ అనుకోవటం అతడు చాలాసార్లు విన్నాడు. మాధవే రకరకాలుగా అసూయపడింది. కానీ ఇప్పుడు అతడు ఈ అలౌకికమైన స్థితిలో వున్నది ఆమె అందాన్ని తల్చుకుని కాదు, జీవితపు మెటాఫిజికల్ ఎమ్జినెస్ ని భాషలోకి ఆమె అనువదించిన వైనాన్ని తలుచుకుని! తన శూన్యతను గురించి ఎవరికైనా ఉత్తరం వ్రాయవలసి వస్తే తను అచ్చు యిలాగే వ్రాసేవాడు!

ఒక గుడ్డివాడికి మరో మూగవాడు తోడైన భావం.

అయినా తోడున్నాడనే అభయం.

రకరకాల ఆలోచనల్లో అతడు చాలాసేపు నిద్ర లేకుండా గడిపాడు.

రేపేం చేయాలన్నదే ప్రశ్న.

ఎటువంటి పరిస్థితుల్లోనైనా "తాజ్" కి వెళ్ళాలి ఆమెని చూడాలి. కలుసు కోవాలి. మాట్లాడాలి.

అప్పుడొచ్చింది అతడికి ఆలోచన..... మొత్తం డైరెక్టర్లందర్నీ బయట పడెయ్యగల ఆలోచన.

అతడు మరి ఆలస్యం చేయలేదు.

రాత్రి రెండవుతూంది.

ఫోన్ దగ్గిరకి లాక్కొని వరుసగా ఫోన్ లు చేయడం ప్రారంభించాడు.

## 12

**డిప్రెషన్** అనేది ఒక మేఘం లాంటిది. చుట్టూ కమ్ముకుని వుంటుంది. అదీ మానసికమైనది.... డిప్రెషన్ లో వున్నప్పుడు ఏమీ తోచదు. ఆలోచన సాగదు. డిప్రెషన్ రావటానికి ప్రాణాలు పోయేటంత సమస్యకూడా అవసరం లేదు. చిన్న చిన్న కారణాలు చాలు. అయితే చిన్న సూర్యకిరణం మబ్బుల్ని చెదరకొట్టినట్టు, డిప్రెషన్ ని (తాత్కాలికంగానైనా కనీసం) పోగొట్టటానికి చిన్న సంఘటన చాలు. అతడి విషయంలో అదే జరిగింది.

తనను ఒక స్త్రీ గమనిస్తూ వుంది.

ఇంతకాలం తన వెనుక వుండి తన విజయాన్ని గమనిస్తూంది.

ఆమె గురించి అతడికేమీ తెలియదు. సౌందర్యవతి అని తెలుసు. అప్పటి అందం లీలగా జ్ఞాపకం వుంది. ఈ ఉత్తరంలో అణువణువునా భావుకత తొణికిసలాడుతూ వుంది.

వాన గుంటలో నీరైనా చాలనుకునేటంత దాహంతో కొట్టుకుంటున్న మనిషిని అకస్మాత్తుగా నారికేళ జాలం దొరికిన ఉద్వేగం. ఉహూ, ఇది సరియైన ఉపమానం కాదు..... అతడెప్పుడూ పరాయి స్త్రీని కోరలేదు. తన దురదృష్టం స్వభావికమైనది.

అది ఎవరూ బాగుపర్చలేనిది అనుకుంటూ వచ్చాడు ఇప్పటివరకూ! ముందే చెప్పినట్టు పనిలో స్వాంతన పొందాడు, కానీ ఇప్పుడు హఠాత్తుగా ఏదో కొత్తద్వారాలు తెరుచుకున్నట్టు అనిపించింది. షోకేస్ లో తన చీరెకట్టు చూడటానికి పనికట్టుకొచ్చిన అమ్మాయి ఈమే! గోపీమాధుర్ చెంప బ్రద్దలు కొట్టింది ఈమే!

...మనసు విహంగమై ఎగిరిపోతున్న భావన. ఆ నాలుగు పేజీల ఉత్తరం, అతడిని నిలువునా వూపేస్తుంది. రవ్వంత ఆప్యాయతకు నోచుకోనివాళ్ళకూ, జీవితంలో ప్రేమకోసం తహతహలాడే వాళ్ళకూ, తాము చేసిన పనికి దొరకనివాళ్ళకూ-

వాళ్ళకే తెలుస్తుంది దాని విలువ.

ఎక్కడో సుదీర తీరాలనుంచి వేణునాదం అస్పష్టంగా వినిపించి మనసుని పరవశం చేస్తున్నట్టు వుంది.

ఈ పదిహేను సంవత్సరాల్లో ఆమె మొహం మశూచివల్ల అంధ విహీనమైపోయి వుండవచ్చు. లేదా వృద్ధాప్యం

ఆమెని ముప్ఫై అయిదేళ్ళకే మింగేసి వుండవచ్చు. అతడి ఆలోచన ఆ కారణంతో సాగలేదు. పరిచయానికి వాంఛ క్లైమాక్స్ కావచ్చు. కానీ వాంఛ పరిచయానికి నాంది కాదు. ముఖ్యంగా అతడి విషయం.... చిన్న పిల్లవాడి మనస్తత్వం. గోలు కొట్టగానే స్టిక్ గాలిలోకి ఎగరేసి పిచ్చెక్కినట్టు వూగిపోయే క్రీడాకారుడికి తెలుస్తుంది ఒక చిన్న అభినందన.....ప్రేక్షకుల్లోంచి చప్పట్ల పొగడ్త.....వెన్ను నిమిరి, నిన్ను నేను గమనిస్తున్నాను సుమా అన్న చిన్న సూచన.....అని ఇచ్చే ఆనందం ఏమిటో....

ఆ ఆనందం ఇచ్చిన కొత్త శక్తితో, రాత్రి రెండింటివరకూ ఫోన్ లు చేస్తూనే వున్నాడు దాదాపు యాభైవేళా రూపాయలకి ఒక చిన్న సైజు మాఫియా లీడరుతో అగ్రిమెంటు కుదిరింది. మిగతాదంతా వాళ్ళు చూసుకుంటామని హామీ ఇచ్చారు.

వాళ్ళు సరిగ్గా ఆ పని నిర్వర్తిస్తారా లేదా అన్న ఆలోచన కన్నా, రేపు పదింటికి జరగబోయే సంఘటన తాలూకు ఆలోచన్లతో మరి నిద్రపట్టలేదు. ఏడింటికీ లేచి తయారయ్యాడు.

ఎనిమిది..... ఎనిమిదిన్నర ఒక్కొక్క డైరెక్టర్ నుంచే ఫోన్ రాసాగింది. 'ఇంకా ఇన్ స్పెక్టర్ రాలేదేమిటి' అని.

తన పథకం ఫలిస్తున్నట్లు తోచింది. 'నేనిప్పుడే ఆఫీసుకి వస్తున్నాను. మీరూ అక్కడికే వచ్చేయండి. అక్కడ చెపుతాను వివరాలు" అన్నాడు.

తొమ్మిదింటికల్లా డైరెక్టర్లందరూ ఆఫీసులో సమావేశమయ్యారు. అందరి మొహాల్లోనూ ప్రశ్నార్థకం స్పష్టంగా కనిపిస్తోంది. అతడు పోలీసు స్టేషన్ కి ఫోన్ చేశాడు. అట్నుంచి ఇన్ స్పెక్టర్ "మీరా? ఇప్పుడే మీకు ఫోన్ చేద్దామని అనుకుంటున్నాను. ఐ యామ్ సారీ నిన్న మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు".

"ఏమిటి, ఏమయింది?"

"ఈ చీరెల మీద డిజైన్లు ప్రింటుచేసే పరికరాలున్న ఇల్లువూరికి ఇరవైమైళ్ళు అవతల దొరికింది. ఎవరో ఇన్ఫార్మెంట్ ద్వారా తెలిసింది ఈ విషయం. తెల్లవారు జామున నాలుగింటికి దాడి చేశాం".

"ఎవరైనా దొరికారా?"

"ఒకడు దొరికాడు. కానీ వాడికేమీ తెలీదు. కేవలం అచ్చులొత్తేవాడు మాత్రమే. మిగతావాళ్ళకోసం వెతుకుతున్నాం. ఈ రాకెట్ త్వరలోనే బయటపడుతుందని మాకు విశ్వాసం వుంది. ఆ ఇంట్లోనే ముంబాయి రైల్వే టిక్కెట్లు కూడా దొరికాయి. ఈ చీరెలు పట్టుకుని వాళ్ళ యజమాని తరచు ముంబాయి వెళ్ళేవాడని ఆ దొరికినవాడు చెప్పాడు. వాడికింతకన్న ఎక్కువ తెలీదు-"

"మొత్తానికి మమ్మల్ని అరెస్టు చేయటంలేదు. అంతేనా!"

"ఇన్ని వివరాలు తెలిశాక కూడా మిమ్మల్ని అరెస్టు చేస్తే ఐదు లక్షలకి తక్కువ కాకుండా పరువునష్టం దావా వెయ్యరూ?"

"ఛాఛా, అలాంటిదేమీ లేదు కానీ వాళ్ళని తొందరగా పట్టుకోండి ఇన్ స్పెక్టర్!"

"తప్పకుండా!"

ఫోన్ పెట్టేసి, రవితేజ తనవైపే ఆతృతతో చూస్తున్న డైరెక్టర్లకి జరిగిన సంగతంతా చెప్పాడు. తనుచేసిన ఏర్పాట్ల విషయం కూడా.

రెండు నిముషాలపాటు ఆ గదిలో తుఫానులాటి అలజడితో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. పరస్పరాభినందనల్తో మార్మోగింది. అందరి మొహాల్లోనూ అప్పటివరకూ వున్న టెన్షన్ ఎవరో చేత్తో తీసేసినట్టు పోయింది. ముంచేస్తుందనుకున్న కెరటం వెనక్కి వెళ్ళిపోయినట్టు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

రవితేజకి వచ్చిన ఆలోచనకి అందరూ అతడిని అభినందించారు. చట్టం పరిధి ఎంత చిన్నదో తల్చుకుంటుంటే అతడిక్కూడా ఆశ్చర్యంగానే వుంది......అయినా సాధించాడు. అదీ సంతోషం. ఈ రోజు సాధించిన విషయం తక్కువేమీ కాదు.

## 13

**సమయం 9-30 కావొస్తూంది.**

ఆ సాయంత్రం ప్రెస్ మీటింగ్ కి ఏర్పాటు చేస్తున్నాడు ఒక డైరెక్టరు. దేశద్రోహుల కార్యకలాపాలకు రవితేజ టెక్స్ టైల్స్ ని వాడుకోవటం తమకు చాలా మనస్తాపం కలిగిందని పేపర్ స్టేట్ మెంట్ ఇస్తాడు సాయంత్రం. అరగంట క్రితం వరకూ తామెలా దీన్నించి తప్పించుకోవాలా అన్న ఆలోచనలో వున్నవారు, ఇప్పుడు దీన్ని ఖండిస్తూ మాట్లాడతారు. అదీ సొసైటీ.

ఒక చిన్న వార్త పేపర్లో రాకుండా వుండటానికయ్యే ఖర్చు యాభైవేలు అది సామాజిక గౌరవం విలువ!

టైమ్ 9-45 అయింది.

ఈ విజయాన్ని పంచుకోవటం కోసం సాయంత్రం పార్టీ ఏర్పాటు చేస్తున్నాడు మరో డైరెక్టర్. అంతా హడావుడిగా వుంది.

పది అవుతున్నకొద్దీ రవితేజకి టెన్షన్ ఎక్కువ అవుతూంది. సాధించినది ఒకవైపు, జరగబోయేది మరొకవైపు.

పదికి ఇంకో పది నిమిషాలుండనగా అతడు హోటల్ కి బయలుదేరాడు. కారు పార్కింగ్ లో ఆపి, రిసెప్షన్ దగ్గరికి వెళ్ళి, లాంజ్ లో కూర్చున్నాడు. అయిదు నిమిషాలు గడిచాయి. అతడు అసహనంగా వాచీ చూసుకున్నాడు.

సరిగ్గా పది అయింది.

ఆమె ఎక్కడకు వస్తానని వ్రాసింది? రిసెప్షన్ దగ్గరకా? కాఫీ బార్ కా? లంచ్ రూమ్ కా?

అతడు వడివడిగా అన్నీ వెతికాడు.

10 - 10 అయింది.

ఈ లోపులో ఆమె రిసెప్షన్ దగ్గరికి వచ్చి ఎదురు చూస్తుందేమో అన్న అనుమానం కలిగింది. మళ్ళీ హడావుడిగా అక్కడికొచ్చాడు. అక్కడ నలుగురైదుగురు మొగవాళ్ళు తప్ప ఎవరూ లేరు. క్షణాలు గడుస్తున్నకొద్దీ అతడికి ఆతృత ఎక్కువవుతూంది.

పదింపావు...

పదిన్నర...

అతడు ఉత్తరం మరోసారి చదువుకున్నాడు. మరోసారి అన్నిచోట్లకీ వెళ్ళి చూశాడు. ఆమె జాడలేదు.

సమయం నెమ్మదిగా కదులుతూంది. అతడికి ముళ్ళమీద కూర్చున్నట్టు వుంది. వాళ్ళ కార్ల నెంబర్లు అతడికి తెలీదు. పార్కింగ్ ప్లేస్ కి వెళ్ళి చూశాడు. కారేదీ లేదు. తిరిగి రిసెప్షన్ కి వచ్చాడు. ఆమె జాడలేదు.

అతడికి పిచ్చెక్కుతున్నట్టు అనిపించింది.

పదకొండున్నర....పన్నెండు.

అతడు ఫోన్ చేద్దామనుకున్నాడు. ఆమె వచ్చి తను కనపడక తిరిగి వెళ్ళిపోయిందేమో అన్న అనుమానం. ఆమెమీద కాస్త కోపం కూడా వచ్చింది. ఉట్టి 'తాజ్' అని వ్రాయక- సరిగ్గా చోటు కూడా వ్రాయొచ్చుగా, అనుకున్నాడు.

ఏదో చేతివరకూ వచ్చి ఆగిపోయిన ఫీలింగు! ఊరించింది ఊహించుకున్న తరువాత నిజం కాకపోతే కలిగే ఉక్రోషం ఎవరిమీదో తెలియని కోపం. అసహనంగా చాలాసేపు అటూ ఇటూ కదిలాడు.

పన్నెండున్నరకి ఇక లాభం లేదనుకుని ఇంటికి బయల్దేరాడు.

కొద్దిసేపు తటపటాయించి, రిసీవర్ తీసి నెంబర్ డయల్ చేశాడు. అవతలివైపు నుంచి ఫోన్ రింగవుతున్న ధ్వని, దాన్ని మించి అతడి గుండెలు కొట్టుకుంటున్న ధ్వని.

అర నిముషం తరువాత అట్నుంచి ఎవరో రిసీవర్ ఎత్తారు.

అతడు ఊపిరి బిగపట్టాడు.

"హల్లో-" అట్నుంచి తీయటి కంఠం వినపడింది.

"హలో" అన్నాడు.

"మిసెస్ శర్మ హియర్ ఎవరు కావాలండీ?"

"నేనూ-రవిని..."

అతడింకా ఏదో చెప్పబోతూ వుంటే ఫోన్ కట్ అయింది. అతడు చేతిలోని రిసీవర్ వేపు చూసుకున్నాడు. ఆమె ఫోన్ కట్ చేసిందన్న వాస్తవం అతడిని మరింత ఉక్రోషంతో నింపింది. మళ్ళీ డయల్ చేశాడు- ఈసారి మొగ కంఠం "శర్మని మాట్లాడుతున్నాను" అని వినిపించింది.

ఫోన్ పెట్టేశాడు.

మరో గంటవరకూ అతడికి ఏం చెయ్యాలో తోచలేదు. బహుశా ఆయన పక్కనుండబట్టి ఫోన్ లో మాట్లాడటం ఇష్టంలేక పోయి వుండవచ్చు.

మాధవి ఇంట్లో లేదు. ఎక్కడో 'ఫ్లవర్ షో' వుందంటే వెళ్ళింది. ఇల్లంతా నిర్మానుష్యంగా వుంది. అతడు బెడ్ రూమ్ వరకూ కూడా వెళ్ళే ఓపికలేనట్టు ముందు హాల్లోనే సోఫాలో పడుకున్నాడు.

పదిహేను సంవత్సరాల క్రితం ఆ సంఘటనని మననం చేస్తూ పడుకున్నాడు. అది నిద్రకూడా కాదు. ఊరికే కళ్ళు మూసుకున్నాడు.

రెండున్నర అవుతూ వుండగా ఫోన్ మ్రోగింది. చటుక్కున ఎత్తాడు శర్మగారు.

"ఏమయ్యావ్ ప్రొద్దున్నించీ?"

అతడు మాట్లాడలేదు.

"నీ కెలా  థాంక్స్ చెప్పాలో అర్ధంకావటం లేదోయ్. రాత్రంతా నిద్రలేదు. తొమ్మిదిన్నరకి మన డైరెక్టర్లు చెప్పేదాకా నాకు తెలీదు. నీ కోసం అడుగుతే ఇప్పుడే వెళ్ళిపోయావన్నారు. నువ్వే స్వయంగా చెప్పి వుంటే బావుండేది. చాలా గొప్పగా ప్లాన్ వేసావ్...."

అతడు వినటం లేదు. ఆమె తప్ప మిగతా ఏ ఆలోచనయినా నిరాసక్తంగానే ఉంది.

".....ఏమిటి ఫోన్ సరీగ్గా పని చేయటంలేదా?"

"ఏ.....ఏమి.....టి?"

"నేను చెప్పేది వినపడుతుందా?"

"ఆ!"

"ఏడింటికి వెళ్ళిపోయావు హడావుడిగా అన్నారు. ఇంకేమైనా ప్రాబ్లెమ్మా."

"అబ్బే అటువంటిదేమీలేదు. మీరెక్కన్నించి?"

"ఆఫీసునుంచి, వస్తావా?"

"ఇంకో గంటలో వస్తాను."

ఆయన ఫోన్ పెట్టేశాడు. రవితేజ వెంటనే ఇంటికి డయల్ చేశాడు. ఆమే ఎత్తింది. "హలో...." అంది.

"నేనూ రవితేజని."

వెంటనే కట్ అయింది ఫోన్.

ఆ విషయం తెలుసుకుని, పెద్ద చప్పుడుతో తనూ పెట్టేశాడు. అతడికి కసిగా వుంది. ఆమె ఎందుకిలా చేస్తుందో అతడికి అర్థంకాలేదు.

ఆ క్షణాన డ్రైవ్ చేసుకుంటూ ఆమె ఇంటికి స్వయంగా వెళ్ళి ఎందుకు ఇలా నాతో ఆడుకుంటున్నావు అని ఆడగాలనిపించింది. ఎందుకిలా వూరించి, తిరిగి ఏమీ తెలియనట్టు వూరుకుంటున్నావు అని నిలదీయాలనుకున్నాడు.

అసలా ఉత్తరం ఆమె వ్రాయలేదేమో అన్న అనుమానం వచ్చింది. కానీ, ఇంత వివరంగా ఆనాటి సంగతులు తెలిసినవారు ఎవరూ లేరు. అదీగాక శర్మగారి రెండో భార్య తండ్రి ఒకప్పుడు ఎమ్మెల్యే అనీ, బాగా చితికిపోయాడనీ కూడా ఎవరో చెప్పుకుంటూ వుండగా విన్నాడు.

మరెందుకామె ఇలా ఫోన్ కట్ చేస్తూంది. తనతో మాట్లాడటానికి ఎందుకు నిరాకరిస్తోంది?

రెండ్రోజులపాటూ ఈ మధనతోనే గడిపాడు. ఎప్పుడూ అదే ఆలోచన. ఆఫీసు విషయాల్లో నిర్లక్ష్యం ఎక్కువైంది. ఆమెని బలవంతంగానైనా కలుసుకోవాలన్న కోర్కెని నిగ్రహించుకోవటం కష్టమైంది. ఇలా వుండగా ఆ మరుసటిరోజు పోస్టులో ఉత్తరం వచ్చింది. అదే చేతి వ్రాత.

వణికే చేతుల్తో గబగబా దాన్ని విప్పేడు. అతడు తన జీవితంలో ఎప్పుడూ అంత అలజడీ, ఆతృత ఫీలవలేదు.

ఉత్తరంతో పాటూ గులాబీ పూరేకులు పడినయ్ మొదట. రవి ఆత్రంగా ఆ ఉత్తరాన్ని విప్పి చదవటం ప్రారంభించాడు.

రవీ,

ఈ ఉత్తరం చదివి నువ్వు నన్ను అసహ్యించుకుంటావనీ, నా మీద అమితమైన కోపం వస్తుందని నాకు తెలుసు. "ఏమిటి ఈమె! మాటమీద అసలు నిలబడలేదు" అని తిట్టుకుంటావని కూడా తెలుసు. కాని అశక్తురాలిని, క్షమించు.

ప్రతి స్త్రీ చుట్టూ ఒక నైతిక విలువల లక్షణరేఖ వుంటుందనుకుంటున్నాను. దీన్ని పురుషుడుగానీ, సమాజంగానీ నిర్మించలేదు. స్త్రీ తన చుట్టూ తనే ఏర్పరచుకుంటుంది. దీన్నించి బయటపడటం అంత సులభం కాదు. ఎన్నో సంవత్సరాలుగా మనసుతో సత్సంబంధాలు లేక, ఇంట్లో సుఖంలేక - ఈ గీత దాటదామనుకున్నాను. ఉహు కాదు. కేవలం అదొక్కటే కారణం కాదు నువ్వు కూడా నా అలజడికి కారణమే.

లోపల్నుంచి ఉబికి వచ్చే లావా- అగ్నిపర్వతాన్ని ఛేదించుకుని బైటపడినట్టు ఈ విలువల వలయాన్ని ఛేదించుకుని కోర్కె బయటపడి నాచేత నీకు ఉత్తరం వ్రాయించింది.

కాని తీరా ఆ సమయం వచ్చేసరికి ఇంటినుంచి బయటపడలేకపోయాను. భయంకాదు రవీ, నన్ను నమ్ము నేనేదో ఎవరికో భయపడి వుండిపోలేదు. సందిగ్ధంతో ఆగిపోయాను. ఇన్నాళ్ళు ఆగగలిగాను. ఇంకో పది సంవత్సరాలు ఆగితే ఈ కట్టె వెళ్ళిపోతుంది. వెళ్లకపోయినా కోర్కె నశిస్తుంది. నువ్వు అడగవచ్చు మరి ఈ ఆలోచనంతా నాకు ఉత్తరం వ్రాసే ముందే వుండొచ్చు కదా - అని. కొన్ని చర్యలకి తర్కం వుండదు రవీ! నువ్వు అర్థం చేసుకోగలవు, చేసుకుంటావనే ఈ ఉత్తరం క్షమాపణలతో!

నువ్వు ఫోన్ చేసినప్పుడు వెంటనే పెట్టేసినందుకు కూడా నన్ను క్షమించాలి. నీతో మాట్లాడితే, ఇప్పుడిప్పుడే పునర్నిర్మించుకుంటున్న ఈ స్థైర్యం తిరిగి కుప్పకూలిపోతుందనే భయం.

దయచేసి నన్ను పరికించటానికి ప్రయత్నించకు. నన్ను నేను కూడగట్టుకోనివ్వు, ఇదొక్కటే నేను మిమ్మల్ని కోరేది. వాస్తవం కన్నా ఊహ బావుంటుంది. ఊహని వాస్తవం చేసుకోవాలనుకుని, కానీ మళ్ళీ వర్తమానాన్ని భవిష్యత్తులో ఊహించుకొని, అడుగు వెనక్కి తీసుకున్న నీ స్నేహితురాలు......

క్రింద సంతకం లేదు.

అతడు ఉత్తరాన్ని నలిపి విసిరికొట్టాడు.

మొహాన్ని చేతుల్లో పెట్టుకుని అలాగే చాలాసేపు వుండిపోయాడు. దాదాపు పది నిముషాల తరువాత తేరుకున్నాడు. పడివున్న ఉత్తరాన్ని తీసి కాగితాన్ని తిరిగి సాపు చేశాడు. మళ్ళీ చదివాడు. మళ్ళీ..

అతడి మనసంతా ఒక విధమైన కోపంతో నిండిపోయింది ఆమె మీద. తనమీద......ఎంత దూరం. కానీ ఎంత దగ్గిర......ఆమె పేరుకూడా తెలీదు. ఎంత వ్యధ అనుభవించో ఆమె ఈ నిర్ణయం తీసుకుని వుండవచ్చు. కానీ తనవైపునుంచి ఆలోచిస్తే...

మామూలుగా వెళుతున్న పడవని సుడిగుండంలోకి తోసినట్టు చేసింది. కష్టమో నష్టమో తన బ్రతుకు తను బ్రతుకుతున్నాడు. అటువంటివాడిని తట్టి లేపింది. ఒక రోజంతా ఆతృతతో, తరువాత జీవితమంతా నిరాశతో గడిపేలా చేసింది. ఆమెకేం? ఒక చిన్న ఉత్తరం వ్రాసి 'నేను మనసు మార్చుకున్నాను'- అని అనేస్తే సరిపోతుందా? ఈ ఆడవాళ్ళంతా ఇంతే. వెనుకనుంచి భుజం తట్టి, వెనుదిరిగేసరికి మాయమవుతారు. దానికి అందంగా 'భయం' అని పేరు పెట్టుకుంటారు. మరికొంచెం తెలివైన వాళ్ళయితే 'నైతికం' అని నాజూగ్గా అంటారు.

అయిదు సంవత్సరాలు తన గురించి ఆలోచిస్తే లేని తప్పు- అయిదు నిముషాలు తనని కలుస్తేనే వస్తుందా? దేనికింత అనాలిసిస్, ఇంత మధనం దేనికి? అసలేమనుకుంటుంది ఆవిడ తన గురించి? ఎందుకు ఈ విలువలకి ఇంత ప్రాముఖ్యత ఇవ్వటం? తన భార్య గుర్తించని విలువలు.... ఆవిడ భర్త పట్టించుకోని విలువలు? అసలు మనిషి ఎందుకు కట్టుబాట్ల మధ్య పెరగాలి? సమాజం కోసమా? సమాజం అంటే ఏమిటి? భార్యా, స్నేహితులూ వీళ్ళేగా! సెక్రటరీతో మాట్లాడుతూ వుంటేనే తనకీ ఆమెకీ మధ్య సంబంధం అంటగట్టిన భార్య.....ఆమె దృష్టిలో తనెప్పుడూ గొప్పవాడు కాలేడు. మరిక దేనికి వీటికి విలువ ఇవ్వటం....అతడు పిడికిలితో అరచెయ్యి కొట్టుకున్నాడు.

కొంచెంసేపు పచార్లు చేశాడు.

తరువాత ఆగి, తన జ్ఞాపకాలనుంచి ఆ విషయం చెరిపేస్తున్నట్లుగా అగ్గిపుల్లతో ఆ ఉత్తరాన్ని అంటించి, పూర్తిగా కాలే వరకూ చూశాడు.

## 14

**కాగితాన్నైతే** కాల్చేశాడు. జ్ఞాపకాల్ని తుడిచెయ్యాలనుకున్నాడు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ అంత సులభం కాదనిపించింది. ఎప్పుడు ఫోన్ మ్రోగినా ఆమె దగ్గిర్నుంచే అన్న ఆత్రంతో చప్పున ఫోన్ అందుకునేవాడు. ఎన్నోసార్లు ఫోన్ చేద్దామని చెయ్యి అక్కడివరకూ వెళ్ళి ఆగిపోయేది. కష్టంమీద నిభాయించుకునేవాడు.

అతడి హృదయంలో ఒక భాగం నిరంతరం దీన్ని గురించే ఆలోచిస్తూ వుండిపోయింది. క్రమక్రమంగా అది పూర్తిగా ఆక్రమించుకుంది. ఆమెమీద కోపంతో తనేదో చేసి ఆమెకు అన్యాపదేశంగా అది తెలియజేయాలన్న తపన ఎక్కువయింది. కొన్ని ఆలోచన్లకి అర్థం వుండదు. నువ్వొక్కదానివేనా ఈ ప్రపంచంలో... 'కో'అంటే కోటిమంది అన్న ఫీలింగ్ నీ ఒక్కదానికేనా ఈ విలువలన్నీ? అందరికీ వుంటాయి. కానీ ఏదో బాధవుండబట్టేగదా, దాన్నించి బయటపడటానికి అందరూ ఇలా చేసేది. దీన్ని ఎత్తి చూపించే హక్కు నీకేముంది?

ఆ తరువాత అతడి ఆలోచన్లు మరో విధంగా సాగేవి. ఆ రోజు తను హోటల్లో ఎదురుచూస్తూ వుండగా ఆవిడ ఇంట్లో ఏమని ఆలోచిస్తూ వుండివుంటుంది? తన పట్ల జాలితో అయ్యో పాపం వీడు లక్ష్మణరేఖదాటి వచ్చేసేడే అనుకుని వుంటుందా? నాకున్నపాటి నిబ్బరంకూడా లేకపోయిందే అని నవ్వుకుని వుంటుందా? ఆడది అనగానే ముక్కు

మొహం హేలియకపోయినా పరుగెత్తాడు అని తేలిక అభిప్రాయం ఏర్పర్చుకుని వుంటుందా?

రవితేజకి ఇటువంటి మధనతో పనిమీద ఆసక్తి తగ్గింది. వారంరోజులు గడిచాయి.

కాలమే గాయాల్ని మాన్పుతుందంటారు.

అదీ అతడి విషయంలో నిజం కావొచ్చు. నెమ్మదిగా అతడు తేరుకుంటున్నాడు. ఇలా వుండగా ఆ రోజు అతడికి ఇంటర్ కమ్ లో పెర్సనల్ ఆఫీసరు ఫోన్ చేశాడు.

"సార్! మన పాత సెక్రటరీ కోలుకోవటానికి మూడునెలలు పడుతుందట. టెంపరరీగా మరో సెక్రటరీని తీసుకొమ్మని చెప్పారు."

"అవును."

"మీరు ఇంటర్వ్యూ చేస్తారా?"

"అక్కర్లేదు, మీరు చేయండి. తొందరగా జాయిన్ అవ్వాలని మాత్రం చెప్పండి."

"అలాగే సార్!" ఆ తరువాత రెండ్రోజులకి జాయిన్ అయింది. ఆమె పేరు ప్రియంవద!

* * *

"మే ఐ కమిన్ సర్"

టేబిల్ డ్రాయర్ లోంచి కాగితాలు తీసుకుంటున్న రవితేజ తలెత్తి చూశాడు. గుమ్మం దగ్గిర నిలబడి వుంది ఆమె.

చిన్నపిల్లలా, అప్పుడే కాలేజీనుంచి వచ్చిన అమ్మాయిలా వుంది. "పిల్చారుట-"

ఆ అమ్మాయి చేతిలో వున్న షార్ట్ హేండ్ పుస్తకం బట్టి కొత్తగా చేరిన స్టెనో అని తెలుసుకున్నాడు.

"రండి. కూర్చోండి."

ఆమె కళ్ళలో భయం కన్నా, అదో రకమైన ఎగ్జయిట్ మెంటు కనపడుతూంది.

"మీ పేరు?"

"ప్రియంవద."

"ఇదే మొదటి ఉద్యోగమా?"

"అవును సర్ మొన్న మార్చిలోనే బి.యస్సీ పాసయ్యాను. అప్పుడే స్టెనో గ్రఫీ కూడా..... ఇదే మొదటి ఉద్యోగం. టెంపరరీ అన్నారు. మూడు నెలలే అట...." ఆమె గడగడా చెప్పుకుపోతుంది.

"డిక్టేషన్ తీసుకుంటారా?"

ఆమె వాక్ ప్రవాహం ఆపి పెన్సిల్ తీసుకుంది.

అతడు అడ్రసు చెప్పి "డియర్ సర్స్" అని ఉత్తరం ప్రారంభించాడు. "మీరు కోరినట్టు అనంతపురం రిటైల్ ఏజెన్సీ విషయం పరిశీలించాం. హేమమాలిని చీరెలమీద పదిశాతం, శ్రీదేవి చీరెలమీద ఐదు శాతం రిబేటు ఇవ్వటానికి మాకు అభ్యంతరం లేదు పోతే...." అతడు ఆపై, ఏమిటన్నట్టు చూశాడు.

"హేమమాలిని చీరలకు ఇప్పుడు డిమాండ్ లేదు సార్. శ్రీదేవి చీరలకే డిమాండ్. వాటికి కన్సెషన్ అనవసరం."

"నేను చెప్పింది వ్రాస్తారా? మీరు చెప్పిన సలహా నేను వినాలా?"

"సారీ సర్" అని ఆమె తిరిగి వ్రాయటం ప్రారంభించింది. అతడు చెప్పటం పూర్తిచేశాడు. పూర్తిచేసి తలెత్తేసరికి ఆమె పెన్సిల్ చెక్కుతూ కనిపించింది. "ముల్లు సరీగ్గా వుందో లేదో లోపలి కొచ్చేముందు చూసుకోనక్కర్లేదా".

"వచ్చేవరకూ బాగానే వుంది సార్. వ్రాస్తూంటే విరిగిపోయింది."

"అలాటప్పుడు - ఆగమని నాతో చెప్పాలి-?"

"అక్కర్లేద్సార్ ఉత్తరం నాకు కంఠతా వచ్చేసింది" అంటూ అతడు చెప్పినదాన్ని తిరిగి పొల్లుపోకుండా చెప్పింది. అతడు ఆశ్చర్యపోయాడు. అయితే దాన్ని బయట పెట్టకుండా, 'గుడ్' అన్నాడు. "వెళ్ళి టైపు చేసి పంపించండి."

ఆమె కుర్చీలోంచి లేవకుండా, "మిమ్మల్ని ఒకటి అడగొచ్చా-" అంది. "ఏమిటి" అన్నాడు విస్మయంతో.

"మేం కాలేజీలో చదువుకునే రోజుల్లో ఆర్.టి. చీరెలంటే అందరికీ క్రేజ్ సార్. రవితేజా టెక్స్ టైల్స్ లో ఉద్యోగం అనగానే గమ్మత్తుగా అనిపించింది. కానీ ఇక్కడికొచ్చాక సాక్షాత్తు రవితేజకే స్టెనో అంటే భలే థ్రిల్లింగ్ గా అనిపించింది.. సార్."

అతడికి నవ్వొచ్చింది. ఆమె 'సాక్షాత్తు' అనే పదం ఉపయోగించటం చూసి.

"సార్.....ఏ బాడీ స్ట్రక్చర్ కి ఏ చీర బావుంటుందో మీకు బాగా తెలుసు. ప్లీజ్ - నేనెలాంటి చీర కట్టుకుంటే బావుంటుందో చెప్పరా?"

ఈ తరం కాలేజి అమ్మాయిలు ఫాస్టని తెలుసుగానీ, మరీ ఇంత అని తెలీదు. అదిరిపోయి చూశాడు. కానీ వెంటనే సర్దుకుని--

"చీరకన్నా ముఖ్య విషయం చెప్పనా?" అన్నాడు.

"ఏమిటి సార్-"

"ఇది కాలేజీ కాదు. ఆఫీసు. కాలేజ్ లో లెక్చరర్లని ఏడిపించినట్టు, స్నేహితుల్తో మాట్లాడినట్టు మాట్లాడితే ఇక్కడ ఉద్యోగం పోతుంది." ఆ అమ్మాయి మొహం వాడిపోయింది, తలదించుకుని "సారీ సర్" అంది.

"ఇక మీరు వెళ్ళవచ్చు."

ఆమె మౌనంగా పుస్తకం పట్టుకుని లేచి, తలుపువైపు నడిచింది. అతడికి జాలేసింది. అప్పటివరకూ ఫస్ట్ మార్క్ వచ్చి ఒక పరీక్షలో అది రాకపోతే పిల్లలు తల్లిదండ్రుల దగ్గర మొహం ఎలా చాటేస్తారో, అలా వెళ్తుంది ఆమె మాట అన్నాడు. ఆమె ఆగి వెనుదిరిగింది.

"కనకాంబరం రంగు జార్జెట్ మీద తెలుపు జాకెట్, ఎడమవైపు భుజం దగ్గిర గులాబీ అంత పువ్వు అదే రంగులో రెండు జెళ్ళు మానేస్తే మంచిది" అన్నాడు.

ఆమె మొహం విప్పారింది. చిన్నపిల్లలు మిస్చువస్ గా నవ్వినట్టు నవ్వేసి "థాంక్స్ సార్" అంది.

అతడు తిరిగి తన పనిలో మునిగిపోయాడు.

# 15

**మరో** వారం రోజులు గడిచాయి.

మామూలుగా అయితే ఆమె జ్ఞాపకం స్మృతుల పుటల్లో ఎక్కడో మారుమూలలకు క్రమక్రమంగా వెళ్ళిపోవలసిందే. కానీ ఇంట్లో తాండవించే శ్మశాన నిశ్శబ్దం అతడికి ఆమెనే గుర్తుకు తెస్తూంది.

తమ జీవితంలో ఏదో కోల్పోయిన భావం ఈ మధ్య కొత్తగా వచ్చి చేరింది. అది రోజురోజుకీ ఎక్కువ అవుతూంది.

ఇంతకు ముందయితే, రోజంతా ఆఫీసులో అలిసి - ఇంటికి ఏ పదింటికో వచ్చి కాసింత తిని నిద్రపోయేవాడు.

ఇప్పుడు నిద్ర పట్టటంలేదు. నిర్ద్రాణమైన కోర్కె ఏదో తొలిచేస్తూంది. దానికి స్పష్టమైన రూపురేఖ లేదు.

ఆ రోజు మరో ఉపద్రవం వచ్చిపడింది. ఆ ఇంట్లో చేసే పనిమనిషికీ, బావమరిదికీ ఎన్నాళ్ళనుంచి సంబంధం వుందో తెలీదు. ఆ రోజే బయటపడింది. దానికి నాలుగో నెల. అలగాజనాన్ని ఇంటిమీదకు తీసుకొచ్చింది. అదృష్టవశాత్తు ప్రెస్ కి పొక్కలేదు ఈ విషయం. పదివేలు ఇస్తేగానీ వదల్లేదు.

డబ్బు పోయినందుకు కాదు బాధ. మాధవి తమ్ముణ్ణి వెనకేసుకు రావటం! అక్కా తమ్ముళ్ళిద్దరూ కలిసి చివరికి తప్పు తన మీదకు తోసేశారు. "మీకు తెలీదండి! బాగా డబ్బున్నవాడు కదా అని తమ్ముణ్ణి పట్టింది. మీరేమో బెదిరిపోయి పదివేలు వదుల్చుకున్నారు" అంది.

అతడు తెల్లబోయి, "లేకపోతే ఏం చెయ్యాలి?" అన్నాడు.

"ఈ విషయం నాకు వదిలేసివుంటే నేను చూసుకుని వుండేవాణ్ణి బావా-"

"అవునండీ! అదేదో నాలుగు వగలుచూపి వీణ్ణి బుట్టలో వేసుకుంది. అమాయకుణ్ణి చేసి ఆడిద్దామనుకుంది. మీరు మరీ భయపడేసరికి వాళ్ళు రేటు పెంచేశారు?"

అతఃడికి అసహ్యమేసింది......ఇక్కడ తప్పెవరిది అని కాదు ప్రశ్న. తప్పు చేసినవారు తన వాడయ్యేసరికి మారిపోయిన వాదనా విధానం. తను ఒకరోజు ఒక్క పెగ్గు డ్రింకు తీసుకొస్తే నానా హడావుడి చేసే తన భార్య, ఆవిడ తమ్ముడు ఒక పని మనిషితో కులికినా, దానికి అమాయకత్వం అని పేరు పెట్టేసి సర్ది చెపుతోంది. ఇంకేముంది విలువలకి విలువ.

అంతర్ సంఘర్షణ అనేది మొదలవనే కూడదు. ఒకసారి అది అయితే ఇక శాంతి వుండదు.

ఆ మరుసటిరోజు అతడు ఆఫీసుకి వెళ్ళేసరికి ఒక చిన్న మంచి వార్త తెలిసింది. కోటి రూపాయల టెండరు తమకి వచ్చిందని....

చాలా ప్రిస్టేజికి సంబంధించిన టెండరు అది. ముఖ్య పోటీదారు చెంచు రామయ్యకి రాకుండా తమకి రావడం సంతోషదాయకం ఆ టెండరు తయారుచేసింది అతడి సెక్రటరీ.

ఆమె గుర్తుకు రావటంతో అతడు ఆమె ఆరోగ్య విషయం వాకబు చేశాడు. ఇంకో నెలరోజులు బెడ్ మీదే వుండాలన్నారని తెలిసింది. అతడి కొత్త సెక్రటరీ కూడా సంతృప్తికరంగానే పనిచేస్తూంది. కానీ కాలేజీనుంచి కొత్తగా వచ్చిన అమ్మాయి అవటం వల్ల, ఇంకా ఒద్దిక, నమ్రత వంటబట్టలేదు. క్లాసులో వేసినట్టే జోకులు అవీ వేసి నాలుక్కర్చుకుంటూ వుంటుంది. కానీ తెలివైనదే. చేరిన మూడోరోజు ఓ పది ఆటోగ్రాఫ్ పుస్తకాలు పట్టుకొచ్చి, "మా స్నేహితురాళ్ళది సార్. సంతకం చేయండి" అంది.

అతడు ఆశ్చర్యపోయి, "ఆటగాళ్ళవీ, సినిమా యాక్టర్లవీ పెట్టించుకుంటారు గానీ బట్టల కంపెనీవాడివి ఏమిటి?" అన్నాడు.

"మీ పాపులారిటీ మీకు తెలీదు సర్. ఆర్.టి. టెక్స్ టైల్స్ లో పని చేస్తున్నానని తెలియగానే రవితేజ నీకు తెలుసా అని మా ఫ్రెండ్స్ అందరూ అడగటమే. ఆయన దగ్గిరే పని అనగానే ఈ పుస్తకాలన్నీ ఇచ్చారు."

అతడు నవ్వుతూ సంతకాలు పెట్టాడు. ఎంత కాదనుకున్నా చిన్న గుర్తింపు ఫీలింగు, కొత్తరకమైన అనుభవం.

'నేనే చీర కట్టుకుంటే బావుంటాను' అని అడిగి తెలుసుకుని వెళ్ళిన మూడు రోజులకి ఆమె ఆ రకం చీరె కొనుక్కుంది. రావటం రావటమే గాలిలా వస్తూ, "థాంక్స్ సార్! మా వాళ్ళందరూ పిచ్చెక్కిపోయారు. నాలో ఇంత అందం ఇంతకు ముందెప్పుడూ కనిపించనేలేదట! ఇడియెట్స్! అయినా మొత్తం బ్యూటీ అంతా ఇదిగో ఈ పువ్వు దగ్గిర వచ్చింది సార్" అంటూ మొదలు పెట్టబోయింది.

అతడు విసుగ్గా "చూడు ప్రియంవదా! ఇలా ఎప్పుడు పడితే అప్పుడు క్యాబిన్ లోకి వచ్చెయ్యకూడదు. నేను పిల్చినప్పుడే రావాలి" అన్నాడు.

ఆమె బిక్కమొహం పెట్టి, "సారీ సర్" అంది.

అంత చిన్నపిల్లని హర్ట్ చేశానే అని అతడు నొచ్చుకుని "సర్లే - ఎలాగూ వచ్చావు కాబట్టి డిక్టేషన్ తీసుకో" అని తన

దగ్గిర వున్న పాడ్ ఆమె ముందుకు తోస్తూ, "నిజంగా ఈ చీరె నీకు బాగా నప్పింది-" అన్నాడు ఆమెని తిరిగి తన మూడ్ లోకి తీసుకురావటానికి. ఆ చిన్న కాంప్లిమెంట్ కే ఆ అమ్మాయి మొహం విప్పారింది. పాతదంతా మర్చిపోయి, "నిజమా సార్ నేను చెప్పానుకదా ఈ పువ్వు".

"డిక్టేషన్ తీసుకుంటావా?"

ఆమె సర్దుకుని "చెప్పండి సర్" అంది.

"డియర్ సర్! దీపావళి సీజన్ వస్తుంది కాబట్టి వీలైనంత ఎక్కువ స్టాకులు మీరు పెట్టుకోవాలి. కానీ మీ ఆర్డర్లు సంతృప్తికరంగా లేవు. మన పోటీదార్లు కార్లని బహుమతిగా ఇస్తున్నమాట నిజమే! కానీ ప్రజలు త్వరలోనే, ఈ కార్ల ఖరీదు కూడా తమ చీరెల ధరలోనే కలిపి వుందని గ్రహిస్తారని నా వుద్దేశ్యం త్వరలోనే సంక్రాంతి కూడా వస్తోంది. ఉయ్ అప్రోచ్..."

"కాక్రోచ్" అందామె.

"కాక్రోచ్ కాదు, అప్రోచ్" అన్నాడు.

ఆమె కళ్ళు భయంతో పెద్దవయ్యాయి. లేచి నిలబడింది, "కాక్రోచ్" అంది మళ్ళీ.

ఆమె నిలబడటం అతడు చూడలేదు. తన ధోరణిలో తనున్నాడు.

"కాదని చెప్పటంలే...." అన్నాడు ఆ మాటలు ఇంకా పూర్తికాలేదు. ఆమె చిన్నగా అరిచి అతడి మీదపడి, అతడి వెనగ్గా వెళ్ళి, బల్లక్రిందికి భయంగా చూడసాగింది. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఈ హఠాత్ చర్యకి నిశ్చేష్టుడై "ఏమిటి" అన్నాడు.

"బొ....బొద్దింక" అంది ఆమె దాదాపు కళ్ళనీళ్ళ పర్యంతమై "బొద్దింకంటే నాకు చచ్చేటంత భయం." అతడు తేరుకుని "సర్లే, కూర్చో" అన్నాడు. ఆమె చేతులు ఇంకా వణుకుతూనే వున్నాయి. ఆ పరిస్థితిలో ఆమె డిక్టేషన్ తీసుకోవటం అసాధ్యమని గ్రహించి "కొంచెం సేపయ్యాక మళ్ళీ పిలుస్తాన్లే" అన్నాడు.

బ్రతుకుజీవుడా అన్నట్టు ఆమె ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. అప్పుడే అతఃడికి స్ఫురణకు వచ్చింది- ఆమెని ఏకవచనంలో సంబోధిస్తున్నానని ఎప్పట్నుంచి ఇలా జరిగిందో మాత్రం గుర్తుకు రాలేదు.

రవితేజ డిక్టేట్ చేసిన ఉత్తరం పట్టుకుని తీసుకొచ్చి ఇస్తూ ప్రియంవధ అక్కన్నుంచి వెళ్ళిపోకుండా, "సార్, నాకో ఆలోచన వచ్చింది రాత్రి" అంది.

"ఏమిటి?"

"నిన్నటి మీ ఉత్తరం టైప్ చేస్తూ వుంటే..."

"విషయం తొందరగా చెప్పు."

"మన ప్రత్యర్థులు కార్లూ, స్కూటర్లూ ఇస్తున్నారు కదా-"

"అవును-"

"మనం మన షాపుల్లోనే ఫారిన్ చీరెల విభాగం పెడదాం. ఆడవాళ్ళకి ఈ ఫారిన్ చీరెలమీద చాలా మోజు సార్. కస్టమ్స్ వారితో మనం ఒప్పందం చేసుకుని కొన్ని చీరెలు మాత్రమే అలా పెడతాం. ఆ విభాగంలో కొన్ని మాత్రమే అలాటి చీరలు వుంటాయి. మిగతావి మనవే వుంటాయి. చాలామందికి రెండింటికీ తేడా తెలీదు. అమ్మకాలు పెరుగుతాయి-"

"-కాని అది మోసం."

"అప్పటికి మనమేమీ మోసం చెయ్యనట్టు..... నిజానికి వాటికన్నా మన చీరలే మంచివి. ఈ విషయం వాళ్ళకి తెలీదు కాబట్టి ఆ పేరుమీద మనమే అమ్ముతాం వీటిని కూడా".

రవితేజకి ఈ ఆలోచన బావున్నట్టు అనిపించింది.

ఎవరికైనా బంధువులుగానీ, దగ్గర స్నేహితులుగానీ విదేశాల్లో వుంటే అక్కడినుంచి చీరెలు తెప్పించుకోవటం సాధారణంగా అందరూ చేసేపని. అలాటి వాళ్ళెవరూ లేరే అని కొందరు నిరాశ చెందుతూ వుంటారు. బ్రోకర్లద్వారా, ముఖ్యంగా ముస్లిందేశాలనుంచి అన్ని వస్తువులతోపాటు వీటి స్మగ్లింగ్ జరుగుతుంది. స్మగుల్డు అనగానే సాధారణంగా మోజు ఎక్కువ. ఎంత ఖరీదైనా ఇచ్చి కొంటూ వుంటారు. ఖరీదు కేవలం 'క్రేజ్' మీద ఆధారపడి వుంటుంది. ఫారిన్ చీరల రంగు ఆకర్షణీయంగా వుంటుంది. బట్ట మన్నిక నాజూగ్గా వుంటుంది. అది కాదనలేని విషయం. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. 'కొత్త' తప్ప ఇందులో ఏ ప్రత్యేకథా లేదు. వాళ్ళ రంగులు మనకి ఎలా ఆకర్షణీయంగా వుంటాయో మన పట్టుచీరల రంగులు కూడా విదేశీయులకి ఆ విధంగానే ఆకర్షణీయంగా వుంటాయి. చలిదేశాల్లో వాళ్ళ శరీరతత్వాలకి సరిపోయేటట్టు తయారుచేసిన ఈ బట్టలు ఒకసారి మనకి సూట్ కావు కూడా. మనదేశపు

ఉష్ణోగ్రతకి ఈ మెటీరియల్ అప్పుడప్పుడు సరిపోదు. అక్కడ 'చీరలు' అందరూ కట్టుకునేవికావు కాబట్టి. అక్కడి బట్టని మనవాళ్ళు గజాల లెక్కన కొనుక్కుని వచ్చి ఇక్కడ చీరెలుగా చింపి అమ్ముతారు. అందుకే ఎక్కువ బోర్డరు అవీ వుండవు. వాటికి సరిపోయే బ్లౌజు పీసులు దొరకటం కూడా కష్టమే. మన్నిక, రంగు, డిజైన్ విషయాల్లో మంచి స్థాయిలో వుంటాయి. కాబట్టి ఆడవాళ్ళు ముచ్చటపడడం సహజమే. కానీ అవి దొరికే వీలు లేనప్పుడు ఎక్కువ ధర ఇచ్చి కొండం అవివేకం. తెల్లటి శరీరం వుండే విదేశీయుల కోసం తయారుచేసిన ఈ చీరెలు ఒక్కోసారి మనకి నప్పవు. కస్టమ్స్ అధికారులు రెయిడ్ చేసి పట్టుకున్న వస్తువులతోపాటు ఈ చీరెల్ని కూడా కొన్ని ప్రత్యేకమైన షాపుల్లో వుంచి అమ్ముతారు. కొన్నిటికి మాత్రమే 'డ్యూటీ' కట్టి చాలా వాటిని వాటితో కలిపి అమ్మేస్తూ వుంటారు.

రవితేజ టెక్స్ టైల్స్ కూడా ఆ పంథాలోనే చెయ్యాలా? ఈమె చెప్పినట్టు వ్యాపారంలో రోజురోజుకీ విలువలు తగ్గిపోతున్నాయా?

"నువ్వు చెప్పినదాన్ని గురించి ఆలోచిస్తాను" అన్నాడు రవి ఆమె మొహం విప్పారింది. "థాంక్స్ సర్" అంది లేస్తూ.

"ఇంట్లో కూడా నువ్వు కంపెనీ వ్యవహారాల గురించే ఆలోచిస్తున్నావంటే నీకీ కంపెనీలో పర్మెనెంటు అయ్యే అవకాశాలూ, ఆలోచన్లు వున్నాయన్నమాట."

"పర్మెనెంటు చేస్తే సంతోషమే సార్! కానీ నిజం చెప్పమంటారా? నేను ఇంటికి వెళ్ళి కంపెనీ గురించి ఆలోచించను."

"మరి?"

"మీ గురించి ఆలోచిస్తాను."

ఎవరో కొట్టినట్లు అతడు తలెత్తాడు. ఆమె మాత్రం తన ధోరణిలో చెప్పుకుపోతుంది.

"నిజంసార్! ఈ కంపెనీలో చేరకముందు ఇలాంటి కంపెనీల గురించి పెద్ద పెద్ద డైరెక్టర్ల గురించి ఏమేమో ఊహించుకునేదాన్ని ఎప్పుడూ డిన్నర్లు, ఎయిర్ కండిషన్లు కార్లు - ఇవే అనుకునేదాన్ని కానీ ఇక్కడ చేరాక మీ ప్రాబ్లెమ్స్, రోజూ టెన్షన్లూ చూస్తూంటే... మీమీద ఇంకా గౌరవం పెరిగింది. సినిమాలు చూడటంవల్ల, నవలలు చదవటంవల్ల వచ్చిన తప్పు అభిప్రాయం సార్ అది. అందులో హీరోల సమస్యలు అన్నీ కేవలం ప్రేమల వల్లే వస్తాయి సార్. కానీ అప్పుడు తెలుస్తూంది నిజ జీవితంలో హీరో అవటం ఎంత కష్టమో ప్రతిరోజూ సాయంత్రం మా ఫ్రెండ్స్ అందరం కలుసుకున్నాక మేము ఏం మాట్లాడతామో తెలుసా సార్..... ఉహు వద్దు. ఆఫీసు సీక్రెట్స్ అన్నీ బయట చెపుతున్నావా అని తిడతారు మీరు. అభిమానం అనేది ఎప్పుడు ఎందుకు ప్రారంభం అవుతుందో చెప్పటం కష్టం సార్. ఇది ఆటోగ్రాఫ్ ల అభిమానం కాదు. దీన్ని మాత్రం నమ్మాలి మీరు అంతవరకూ ఎందుకు? మొన్న మీరు "నీ చీరె

బావుంది" అనగానే ఇక ఆ రాత్రంతా దానిగురించే ఆలోచించాను-" ఆమె ఆగింది.

మతిపోవటానికి కాస్త అటు ఇటూగా వున్న స్థితిలో అతడు అవాక్కయి ఆమెవైపే చూస్తూ వుండిపోయాడు. ఆమె చిన్నపిల్లో పెద్దదో కూడా అర్థంకావటంలేదు. ఒక మానేజింగ్ డైరెక్టర్ దగ్గిర సెక్రటరీ అలా మాట్లాడకూడదని కూడా ఆమెకు చెప్పాలో లేదో తెలియని స్థితి. చెప్పినా వినిపించుకోదు.....చెప్పలేడు. అది వేరే సంగతి. "ఏమి ఆలోచించావు?" అని అడిగాడు.

అప్పటివరకూ లొడలొడా వాగుతున్నదల్లా అతడి ప్రశ్నకి సిగ్గుపడి, "మీరు నవ్వుతారు, నన్ను తిడతారు" అంది గోళ్ళరంగుకేసి చూసుకుంటూ.

"నవ్వుతే నవ్వుతానేమో గానీ, తిట్టన్లే చెప్పు."

ఆమె చెప్పబోయి ఆగి, తటపటాయించి, "ఆ రాత్రి వరుసగా పాయింట్లు వ్రాశాను" అంది. తలా తోకాలేని ఆ సమాధానానికి అతడు అర్థంకాక 'పాయింట్లేమిటి?" అన్నాడు.

ఆమె హాండ్ బ్యాగ్ లోంచి కాగితంతీసి అతడి ముందుకు తోస్తూ "తిట్టద్దేం" అంది. అతడు కాగితం అందుకుని చూశాడు. అందులో ఇలా వుంది.

"మొగవాళ్ళు ఆడవాళ్ళని ఇంప్రెస్ చేసే ప్రయత్నంలో చీరె పునాదిగా ఉపయోగపడే పలు రకాల డైలాగులు:

- మీరు కట్టుకున్న చీర చాలా బావుంది.

- మీరీ చీరలో చాలా బావున్నారు.

- ఈ చీర రంగు మీకు సరీగ్గా సరిపోయింది. మీ చర్మం రంగులో కలిసిపోయింది.

- చీరలు కొంతమందికి అందాన్ని తెస్తాయి. మీ వల్ల చీరకి అందం వచ్చింది.

- మీరే చీర కట్టుకున్నా బావుంటారు.

- మీలా తెల్లగా వున్నవాళ్ళకి ముదురు రంగుచీరెలు బావుంటాయి.

- ఈ రంగు చాలామందికి సూట్ కాదు. కానీ మీకు సరీగ్గా సరిపోయింది.

- మీది మంచి సెలెక్షన్. అసలు మీ సెలెక్షన్ మీ మనస్తత్వాన్ని తెలియజేస్తుంది.

పి.యస్ : "నల్లరంగు చీరె కట్టుకున్నప్పుడు పైనుంచి మూడో డైలాగు వాడరాదు."

అతడికి ఒకవైపు నవ్వు, ఒకవైపు కోపం వచ్చాయి. నవ్వు కనపడకుండా "రాత్రిళ్ళు నువ్వు చేస్తున్నది యిలా చీరలమీద రీసెర్చా" అని అడిగాడు.

"చీరలమీద కాద్సార్! మీ మాటలమీద.."

"నేనా వుద్దేశ్యంతో మాట్లాడలేదు."

"ఈ మాటల గురించే ఆలోచిస్తున్నాను. ప్రక్కనే కాగితం కలం వున్నాయి వ్రాసాను.... ఏం తప్పా?" డబాయించింది. ఇది కాలేజీ కాదు ఆఫీసు అని అందామనుకున్నాడు. కానీ ఆ మాట ఇప్పటికే యాభైసార్లు చెప్పాడు. అందువల్ల ఇక అది లాభంలేదు. అనుకుని 'సర్లే, వెళ్ళిరా' అన్నాడు. ఆమె వెళ్ళబోయి ఆగి -

"సార్ రేపు మా క్లాస్ మేట్స్ నలుగురు వస్తామన్నారు. తీసుకురానా?" అని అడిగింది.

"దేనికి?"

"మీతో సరదాగా మాట్లాడటానికి అలాగే, వాళ్ళకే చీరెలు మ్యాచ్ అవుతాయో చెప్పి-"

"వాడ్డూయూ మీన్.... నేను..."

కోపంతో ఎర్రబడ్డ అతడి మొహంచూసి ఆమె బెదిరిపోయి, 'సారీ సర్' అని బయటకు వచ్చేసింది. అయితే, బయటకు రాగానే, లోపలున్నంతసేపూ వున్న భయం పోయి, ఆ స్థానే నవ్వు చోటు చేసుకుంది.

తన సీట్లోకి వెళ్ళబోతూ, సూపర్నెంటు దగ్గిర ఆగి, "మన పాత సెక్రటరీ ఎప్పుడు చేరుతున్నారు సార్" అని అడిగింది.

"ఇంకో నెలలో ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ అవుతుందట."

ఆమె మనసులో అనుకుంది. 'మైగాడ్ టైమ్ చాలా తక్కువుందే-'

# 16

**మరో** రోజు గడిచింది.

ఈ మధ్య రవితేజ మూడీగా వుండటం ఎక్కువైంది. తన జీవితంలోకి చిన్న సంఘటనలా ప్రవేశించి వెళ్ళిపోయిన స్త్రీ తాలూకు ఆలోచన్లూ ఆమె ఎలా వుంటుందో చూడాలన్న కోర్కెవల్ల కలిగిన విసుగూ, ఇంట్లో ఒంటరితనం!

...... వీటన్నిటికన్నా తన పోటీదార్లు అతడికి ఎక్కువ మనస్తాపం కలిగిస్తున్నారు. పోటీ ఎప్పుడూ మంచిదే. అవతలివారి కన్నా తాను 'మంచి సరుకు' ఎలా ఇవ్వాలా అన్న పోటీ అయితే అది ప్రగతికి సూచన. అలా కాకుండా తను మంచి సరుకు గురించి ఆలోచించటం మానేసి, తన పోటీదార్ల గురించి ఆలోచించటం మొదలుపెడితే, ఇక పతనమే. ఆ స్టేజి వచ్చాక మనిషి తన అభివృద్ధి గురించి ఆలోచించటం మానేసి, పోటీదార్ల ఉన్నతి గురించి రోధించటం మొదలు పెడతాడు. ఎప్పుడూ, వాళ్ళేం చేస్తున్నారు? వాళ్ళు చేసినదాన్లో తప్పేమిటి? పైకి వాళ్ళు అంత గొప్పగా చెప్పుకుంటున్నారు కానీ అదంతా కృత్రిమమయిన అభివృద్దే అని నలుగుర్నీ పోగేసి చెప్పటం చేస్తూ వుంటాడు - అతడి మనసుకి మాత్రం తన పతనం, పక్కవాడి అభివృద్ధి నిజమని తెలుస్తూ వుంటే ఇంతవరకూ వచ్చాక ఇక అతడిలో క్రమక్రమంగా క్రియేటివిటీ తగ్గిపోతుంది. కేవలం ఒక సినికల్ క్రిటిక్ గా మిగిలిపోతాడు. ఏ రంగంలోనైనా జరిగేది ఇదే.

ఇదంతా అతడికి తెలుసు.

అందుకే అతడు ఇప్పుడు చెంచురామయ్య అండ్ కో గురించి ఆలోచించటం లేదు. తన కంపెనీ గురించి ఆలోచిస్తున్నాడు. ఇప్పటివరకూ రవితేజ చీరలు మకుటంలేని మహారాజులు. వాటి స్థానానికి కొద్దిగా కదలిక ఏర్పడే సూచన్లు కనపడుతున్నాయి. ఏదైనా చేయాలి. అవతలివాళ్ళ లాగా బహుమతులు ఇవ్వటం కాదు. మరేదో చెయ్యాలి. నిరంతరం ఈ ఆలోచనలోనే మునిగి తేలుతున్నాడు. ఇప్పుడు అతడి వయసు కూడా ముప్పై దాటింది. ఆ వయసు వరకూ మనిషి యంత్రంలా పనిచేస్తాడు. ఈ తరువాత పని చేయటానికి ప్రేరణ కావాలి. ఈ ప్రేరణ అనేది చాలా రకాలుగా మనిషికిలభిస్తూ వుంటుంది ఇంట్లో ఆహ్లాద వాతావరణం, తమ విజయం పట్ల కుటుంబ సభ్యుల మొహాల్లో అభినందన, తోటి వ్యాపారస్తుల మధ్య గౌరవం, ఇవన్నీ ఆ ప్రేరణకి మూలాదారాలు దురదృష్టవశాత్తు మొదటి రెండు అతఃడికి లభ్యం కావు. అందుకే చిన్న వయసులోనే అతడు చాలా అలసిపోయినట్టు కనిపిస్తున్నాడు. చాలామంది వ్యాపారస్తులూ, ఉన్నత ఉద్యోగులూ అందుకే ఒక వయసు దాటాక ఇంటి సభ్యులతో గడపటం మానేసి, వారినుంచి మానసికంగా దూరమై, వ్యాపారస్తులైతే డబ్బునీ, ఎగ్జిక్యూటివ్స్ అయితే పనినీ హోదానీ ప్రేమిస్తారు.

ఇప్పుడు అతడు రెంటికీ మధ్య రేవడిలా వున్నాడు.

ప్రియంవద ఇచ్చిన ఫారెన్ చీరాల అమ్మకం సలహా బాగానే వుంటుంది. కానీ, ఒక్కసారిగా అమ్మకాలు పెరగవు.

చెంచురామయ్యలాగా ప్రజల బలహీనత మీద క్యాష్ చేసుకోలేడు. ఏదైనా మరింత బలమైనది ఆలోచించాలి.

ప్రియంవద కూడా, పాత సెక్రటరీ లాగానే ఈ వ్యవహారాల పట్ల ఆఫీసు పరంగానే కాకుండా మామూలుగా కూడా ఆసక్తి చూపించటం అతడికి కాస్త రిలీఫ్ గా వుంది. పాత సెక్రటరీ వయసులో మరీ పెద్దది. ప్రియంవద ఫ్రెష్ ఫ్రమ్ కాలేజీ. ఆ అమ్మాయికి రకరకాల ఫాషన్లు తెలుసు. ఎక్కడెక్కడి సమాచారమూ తీసుకొచ్చి చెప్పేది. అతడికి చాలా చిత్రంగా వుండేవి కొన్ని విషయాలు. ఏది ఏమైతేనేం, ఆమె డిక్టేషన్ తీసుకోగానే వెళ్ళిపోయే స్టేజినుంచి, కొంచెంసేపు కూర్చుని మామూలు విషయాలు కూడా మాట్లాడే స్టేజికి వచ్చింది.

"ఒక్కప్రశ్న అడుగుతాను జవాబు చెప్పగలరా?" అని అడిగింది ఒకరోజు.

"ఏమిటి?"

"చాలా సింపుల్ ప్రశ్న".

"ఏమిటది?"

"ఆడవాళ్ళు ఎందుకు ఎక్కువ చీరెలపట్ల మోజు కలిగి వుంటారు?"

అతడు తెల్లబోయి చూశాడు. ఏదో సమాధానం వెంటనే చెప్పటానికి ప్రయత్నించాడుగానీ తనకే సంతృప్తికరంగా అనిపించలేదు. ఎంతో చిన్న ప్రశ్నగా కనిపించినా సమాధానం వెంటనే దొరకలేదు. అవును రేడియో, టీ.వీ., బ్యాంకు బాలెన్స్, విహారయాత్ర, స్థిరాస్తులూ-వీటిమీద లేని ఉత్సాహం స్త్రీ చీరెల మీద ఎందుకు చూపిస్తుంది? బంగారం, చీరెలు...ఇవే ఎందుకు స్త్రీని ఉత్తేజపరుస్తాయి?

ఇంటికి వెళ్ళిన తరువాత కూడా ఇదే ప్రశ్న అతడిని వెంటాడింది. ప్రియంవద వూరికనే అడిగిందో, లేక తనూ ఆలోచించి సమాధానం చేతకాక అడిగిందో తెలీదుకానీ అతడిని మాత్రం ఆలోచనలో పడేసింది.

మరుసటిరోజు ఆఫీసులో ఆమెతో అన్నాడు. "నిన్న నువ్వడిగిన ప్రశ్నకి కొంతవరకూ సమాధానం దొరికింది."

"ఏమిటి?" నవ్వుతూ అడిగింది.

"మొదటి కారణం ఆడవాళ్ళు అలంకార ప్రియులు అలంకరణలో మొదటిది చీరకట్టు. మొగవాడు సౌఖ్యాలకీ, స్నేహితులకీ, వ్యసనాలకీ ప్రాముఖ్యత ఇస్తాడు. స్త్రీ అలాకాదు. ఆమె ప్రపంచం చాలా చిన్నది. కొత్త చీరవల్ల ఆనందం ఇనుమడిస్తుందని చాలామంది అనుకుంటారు. నిజంకాదు. కానీ నిశ్చయంగా కొత్త చీరె కట్టుకోవడంవల్ల స్త్రీ కొత్తగా

కనపడుతుంది. అది చూసి మొగవాడి కళ్ళల్లో మెచ్చుకోలు కనబడుతుంది. ఇది మొదటి కారణం.

మొగవాడి సెన్స్ ఆఫ్ అఛీవ్ మెంట్స్ చాలా వుంటాయి. చివరికి పేకాటలో డబ్బు ఒకరోజు గెలవటం కూడా అతడు అచీవ్ మెంట్ గానే భావిస్తాడు. స్త్రీ తోటి స్త్రీల దగ్గిర తన గెలుపుని బంగారం, చీరెల ద్వారా చూపించి సంతృప్తిపడుతుంది. చీరెల గురించి ఆలోచించటం, చీరెల గురించి మాట్లాడటం, చీరెల విషయంలో పోట్లాడటం, చీరకోసం డబ్బు దాచుకోవటం, సినిమాకి వెళ్ళినా పుస్తకాలు చదువుతున్నా అందులో వచ్చే చీర ప్రసక్తిని ఆసక్తితో గమనించటం, చీరెల కోసం భర్తని వేధించటం, తోటి ఆడవాళ్ళు ఏం చీర కట్టుకున్నారా అని గమనించటం ఇదంతా మామూలు ఆడవాళ్ళ దినచర్యలో ఒక భాగం.

పైకి విసుక్కున్నట్టు కనిపిస్తారు కానీ, ఆడవాళ్ళ తాలూకు ఈ మనస్తత్వాన్ని మొగవాళ్ళు బాగా ఆనందిస్తారనిపిస్తుంది. ఎంతోమంది మగవాళ్ళు ఆడవాళ్ళకి చీరలు నగలు కొనిపెట్టటంలో గర్వాన్ని పొందుతూ వుంటారంటే అబద్ధం కాదు. పైకి వెక్కిరించినా, భార్యకి చీరెలు, నగలు కొనిపెట్టటం తన మొగతనానికి చిహ్నంగా భావిస్తాడు భర్త. ఈ రకంగా చీర మనుష్యుల జీవితంలో ఒక భాగం అయిపోయింది కాబట్టి చీరెలపట్ల అంత మోజు చూపిస్తారు వాళ్ళు."

ఆమె అతడివైపు విప్పారిన కళ్ళతో చూసింది ఆ చూపు నిండా అభినందన వుంది. అప్పుడేమీ మాట్లాడలేదు గానీ ఐదు నిముషాల తరువాత వచ్చినప్పుడు ఒక కార్డు తీసుకొచ్చి ఇచ్చింది.

చేత్తో వేసిన బొమ్మ అది. ఒక పురుషుడికి అందమైన అమ్మాయి గులాబి అందిస్తున్నట్టు వుంది.

"ఏమిటిది ప్రియంవదా?"

"అభినందన కార్డు సర్!"

"ఈ బొమ్మ-"

"నేనే వేశాను."

"నువ్వింత బాగా వేస్తావని నాకు తెలీదే - థాంక్స్"

ఆమె నవ్వేసి, అక్కన్నుంచి వెళ్ళిపోయిద్ది్్. అతడు కార్డు మధ్యకి విప్పాడు. లోపల నాలుగు వాక్యాలున్నాయి.

"పదహారేళ్ళ అమ్మాయి- మాటకారి అబ్బాయంటే ముచ్చట పడుతుంది.

ఇరవై రెండేళ్ళ అమ్మాయి-ఆస్థి అంతస్తువైపు కూడా ఓరగా చూస్తుంది.

ఇరవై ఎనిమిదొచ్చిన అమ్మాయి- కాస్త స్నేహంగా మాట్లాడితే చాలనుకుంటుంది.

నిజమైన అమ్మాయెప్పుడూ తెలివితేటలకే పడిపోతుంది-"

అతఃడికి మతిపోయింది. ముందర్థం కాలేదు. రెండోసారి చదివితే నిజమే ననిపించింది. మూడోసారి నవ్వొచ్చింది. నాలుగోసారి మళ్ళీ నిజమేననిపించింది. ఇరవై అయిదోసారి ఎందుకో కాస్త గర్వంగా అనిపించింది. దేశం మొత్తాన్ని తన చీరెల డిజైనుతో పిచ్చెక్కిస్తున్న ఆ ఎగ్జిక్యూటివ్, ఆ క్షణం ఆ నాలుగులైన్లూ చిన్న పిల్లవాడిలా అన్నిసార్లు చదువుకున్నాడంటే ఒకటే కారణం-

అవధిలేని ఆత్మానుభూతికి మూలాధారాలు ఎంతో గొప్పవి. పెద్దవి అయివుండనవసరంలేదు.

సరీగ్గా ఆ సమయంలోనే అతడికి ఫ్లాష్ లాటి ఆలోచన వచ్చింది. అయిదు నిముషాల్లో అది ఒక రూపుదిద్దుకుంది. అదికాని సరీగ్గా అమలు జరిగి విజయవంతమైతే, భారతదేశంలో వస్త్ర వ్యాపారం ఒక సరికొత్త మలుపు తిరగబోతుంది. రవితేజ టెక్స్ టైల్స్ ఒక అనూహ్యమైన విజయం సాధిస్తుంది.

అరగంట తరువాత అతడి క్యాబిన్ లో ఆ కంపెనీ తాలూకు అన్ని డిపార్టుమెంట్ల ముఖ్యాధికారులూ సమావేశమయ్యారు. ఒకరిద్దరు డైరెక్టర్లు కూడా కూర్చొని వున్నారు. రవితేజ తన ఆలోచనని వారికి వివరించసాగాడు. ఆ గదిలో సూదిపడితే వినపడేంత నిశ్శబ్దం ఆవరించుకుని వుంది. అతడు చెప్పేదాన్ని అందరూ విస్మయంగా వింటున్నారు.

సరిగ్గా అదే సమయానికి ప్రియంవద బయట ఎవరికో ఫోన్ చేస్తూంది.

రవితేజ తన అధికారులతో సమావేశాన్ని మొదలుపెట్టాడు. "బోంబేడయింగ్ వెరైటీకన్నా ఈ అమ్మకాలే ఎక్కువుంటాయి. ఉదాహరణకి కోటీ, బడీ చౌడీ ప్రాంతాల్లో ఈ చిన్న చీరల వ్యాపారం పెద్ద పెద్ద షాపుల వాళ్ళ అమ్మకాల్ని కూడా దెబ్బతీస్తూంది. దీనికి కారణం- 'తక్కువ ధరలో మూడు నెలల కొకసారి ఫాషన్ మారుస్తూ ఇక్కడ చీరలు అమ్మటం', కాలేజీకి వెళ్ళే అమ్మాయిలు, ఆఫీసులకెళ్ళే ఆడవాళ్ళు ఇక్కడ చీరల్ని ఎక్కువకొంటూ వుంటారు. చీర వంద రూపాయిలలోపే వుంటుంది. చీరెల మీద చమ్కీలు, అద్దకాలు కూడా కుట్టి అమ్ముతారు. బట్ట ఎక్కువ మన్నిక వుండదు. గంజిపెట్టి ఇస్త్రీ చేయాలి. అందరూ దీన్ని ఇష్టపడటానికి కారణం మూడు నెలలకొకసారి మారే డిజైన్లు - కేవలం వంద రూపాయలకి దొరకటం పదిసార్లు కట్టి పడెయ్యటానికి వీలుగా.

గత ఐదు సంవత్సరాల్లో ఈ వ్యాపారం నాలుగింతలుగా పెరిగింది. ఒకోసారి మోసం కూడా జరగొచ్చు. ఒక్క ఉతుక్కే చీర పాడయిపోవటం జరగవచ్చు. అయినా ఈ వ్యాపారానికి నష్టం వుండటంలేదు. 1957లో దీన్ని ప్రారంభించారు. అప్పుడు 'మల్లు' అనే బట్ట పాపులర్ గా వుండేది. చీరెబట్ట మొత్తం 7 రూపాయలకి వచ్చేది. దానిమీద ప్రింటువేసి 11 రూపాయలకి అమ్మేవారు. అప్పుడు వంద రూపాయలు వుండే రంగు ధర ఇప్పుడు 800 అయింది. అప్పటి హాండ్ ప్రింటింగ్ మానేసి, ఇప్పుడు స్క్రీన్ ప్రింటింగ్ వాడుతున్నారు. ప్యూర్ సిల్క్ మీద కూడా ఈ ప్రింటింగ్ కావచ్చు. విదేశాల్లో దీనికి విపరీతమైన డిమాండు వుంది. కానీ ఇది ఆశించినంతగా ఎగుమతి కాకపోవటానికి లంచాలు కారణం. 50, 000 కన్ సైన్ మెంట్ కి 5 నుంచి 10 వేల వరకూ లంచం ఇవ్వాల్సి వుంటుంది. డబ్బివ్వకపోతే ఏదో ఒక వంకన వెనక్కి తిరగ్గొట్టేస్తారు. ఈ ఆఫీసర్లు పెట్టె ఇబ్బందుల్ని చిన్న వ్యాపారస్తులు తట్టుకోలేరు."

రవితేజ తన వాళ్ళతో చర్చిస్తున్నది ఈ మార్కెట్ లోకి ప్రవేశించటం ఎలా అని....

ప్రియంవద, తొందర తొందరగా డిజైన్లు మార్చే ఆడవారి ప్రసక్తి తీసుకొచ్చినప్పుడు అతడికో ఆలోచన వచ్చింది.

షోరూమ్ ల ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా అమ్మకం సాగిస్తే ఎలా వుంటుంది- అని!

ఈ స్కీమ్ గానీ సఫలం అవుతే, ఈ చౌక రకం చీరెలు దేశాన్ని కనీసం నాల్గయిదు సంవత్సరాలపాటు ఊపేస్తాయనటంలో అనుమానం లేదు. మిల్లు ధరకీ అమ్మకం ధరకీ కనీసం నూటికి నలభై రూపాయలు తేడా వుంటుంది. అతడి స్కీము ప్రకారం, రకరకాల చీరెలు కట్టుకున్న ఆడవాళ్ళ బొమ్మలు ప్రకటనలో ఇవ్వాలి. టీ.వీ.ని బాగా ఉపయోగించుకోవాలి. ప్రతీ చీరెకీ ఒక నెంబరు, ప్రతీ రంగుకీ ఒక అక్షరం (A, B, C, D, ల్లాగా) ప్రతీ డిజైనుకి ఒక కోడ్ వుంటుంది. కావల్సిన కస్టమరు, పత్రికలోగానీ, టీ. వీ. లో గానీ తనకి నచ్చిన చీరె చూడగానే, ఆ కోడ్ నెంబర్ వ్రాస్తూ వందరూపాయలు పంపాలి. చీరె పోస్టులో వస్తుంది. వారం వారం కస్టమర్లని ఉక్కిరిబిక్కిరి చేసే డిజైన్లు ఒకదాని తరువాత ఒకటి వచ్చి పడుతుంటాయి. చౌక ధర - మారే ఫాషన్లు - కొత్తదానం - అన్నిటికన్నా ముఖ్యంగా షాపు ఖర్చులు లేకపోవటం - క్విక్ టర్నోవరు - ఇవన్నీ ఈ స్కీమ్ యొక్క ప్రత్యేకతలు చొక్కాల మీద ఎలా "డబుల్ బుల్ సి.డి." అని ముద్ర వుంటుందో, ఈ రకం ప్రతి చీరకీ అలా ఆర్.టి. అని వుంటుంది.

రవి ఈ ఆలోచన చెప్పగానే అధికారుల్లో అన్ని స్థాయిల్లోనూ ఆమోదం లభించింది. ఇక ఈ ప్రతిపాదన డైరెక్టర్లకి వెళ్ళాలి. అక్కడ కొంత వ్యతిరేకథ వస్తుందని అతడికి తెలుసు. ముఖ్యంగా ఈ స్కీమ్ అనుకున్నట్టు విజయవంతం అవుతే, రవితేజ టెక్స్ టైల్స్, వస్త్ర ప్రపంచంలో శిఖరాగ్రం మీద నిలబడటం, ఒక తుఫానులాగా ఈ ఫాషను జనాల్ని వూపేయటం నిజమైతే అవ్వొచ్చేమోకాని, సోల్ డిస్ట్రిబ్యూటర్స్, షాప్స్ కొంతవరకూ దెబ్బతినవచ్చు. దీనివల్ల రవితేజ కంపెనీ ఉనికికే మోసం రావొచ్చు. అదీగాక దూరదర్శన్, పత్రికల్లో చీరెల్ని జనాలకి పరిచయం చేసి, వాటిమీద మోజు కలిగించటానికి లక్షలమీద ఖర్చు కావొచ్చు, స్కీమ్ దెబ్బతింటే ఇంత ఖర్చు పెట్టినదీ వృధా కావొచ్చు.

కానీ ఏదో ఒకటి చెయ్యకపోతే ఎలా? చీరలు ధరలు ఆకాశానికి అంటుతున్నాయి. చాలామంది వీటిమీద బ్రతుకుతున్నమాట నిజమేగానీ, పోటీ మార్కెట్ లో కొత్తదనం లేకపోతే కష్టం. ప్రతీ ఇంట్లోనూ కనీసం ఒక రవితేజ చీరె వుండాలని అనుకుంటే ధరలు తగ్గించాలి. బాగా 'పరిచయం' చెయ్యాలి.

సమావేశం ముగిసింది.

రవితేజ సంతృప్తుడయ్యాడు. మిగతా డైరెక్టర్లని ఒప్పించటం కొంచెం కష్టమయినా అసాధ్యం కాకపోవచ్చు.

ఆ తరువాత ప్రియంవదతో మాట్లాడుతూ "థాంక్స్ ప్రియంవదా! నీతో మాట్లాడుతూ వుండగా వచ్చిన ఆలోచన మన కంపెనీ భవిష్యత్తుని నిర్ణయించబోతూంది" అన్నాడు.

"మరి ఇంత ఆలోచన వచ్చినందుకు నా ఉద్యోగం పెర్మినెంట్ అవుతుందా?"

"చూద్దాం" నవ్వేడు రవి. "స్కీమ్ సక్సెస్ అవుతే మాత్రం తప్పక చేయిస్తాను."

"తప్పకుండా అవుతుంది సార్. ఒకటి మాత్రం నిజం. మీకు చెప్పగలిగేటంతదాన్ని కాదు కానీ, ఎప్పుడూ లాభాలు కాదు. మనిషికి సంతృప్తి కూడా ముఖ్యం. దేశంలో ఎంతోమంది తక్కువ ఆదాయం గల వాళ్ళున్నారు. వాళ్ళ భార్యలకి నాలుగయిదు చీరెలకన్నా ఎక్కువ వుండవు. అలాటి వారికి కూడా రవితేజ చీరెలు చేరుతున్నాయి- అంటే అంతకన్నా కావలసింది ఏముంది? మన్నికలేని వాటితో మోసపోయేవాళ్ళకి ఈ స్కీమ్ సాయం చేస్తుంది. దానికన్నా ముఖ్యంగా, తన భార్య ఓ పది కొత్త చీరలు కట్టుకుంటే చూడగలిగే అవకాశం లోవర్ ఇన్ కమ్ గ్రూప్ వారికి కలిగిస్తుంది. అది చాలదా?"

"థాంక్స్ ప్రియంవదా! నేనా కోణంలోంచి ఆలోచించలేదు. నువ్వు చెప్పింది నిజమే. "మనస్ఫూర్తిగా అన్నాడు.

"అదేమిటి సార్" అతడి చేతిలో కార్డు చూస్తూ ప్రశ్నించింది.

"రేపు రావల్సింది ఈ రోజు వచ్చింది నా బర్తడే కార్డు" పక్కన పడేస్తూ అన్నాడు.

"రేపు డైరెక్టర్స్ మీటింగ్ కి నేను వుండాలా? ఆదివారం కదా."

"అవసరంలేదు. వస్తేరా ఎల్లుండి మాత్రం సాయంత్రం ఎక్కువసేపు వుండాల్సి వుంటుంది."

ఆమె తలూపి, వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం వరకూ అతడు తన స్కీమ్ గురించి ఆలోచిస్తూనే వున్నాడు. సాయంత్రం ఇంటికొచ్చేసరికి మాధవి కొత్త చీర నొకదాన్ని పట్టుకుని ఎదురొచ్చింది. "ఎలా వుంది? రేపు కట్టుకోవటానికి కొన్నాను" అంది నవ్వుతూ.

రవితేజకి ఎందుకో తెలియని సంతోషమేసింది.

"మా కంపెనీ చీరలు ఏవైనా బాగానే వుంటాయి మాధవీ" అన్నాడు తనుకూడా నవ్వుతూ.

"నేను కట్టుకుంటే-"

"బ్రహ్మాండంగా వుంటుంది."

"రేపు చాలామంది వస్తారు. అందుకని ప్రత్యేకంగా కొన్నాను." "చాలామందిని పిలిచావా?"

"ఆ....మీరుకూడా రాకూడదూ?"

ఏదో అనుమానం అతడిలో చిన్నగా ప్రవేశించి "ఎక్కడికి?" అని అడిగాడు.

"కార్తీకమాసం కదా, రాత్రికే వెళ్తున్నాం అందరం. అఫ్ కోర్స్ ఆడవాళ్ళే ఎక్కువ అనుకోండి. కానీ మిమ్మల్ని అడిగినా మీరెలాగూ రారని అడగలేదు. మీకు భార్యకన్నా మీ కంపెనీయే ముఖ్యం కదా-"ఆమె మామూలుగా చెప్పుకుపోయింది.

అతడు మ్లానమైన వదనంతో అక్కన్నుంచి తొలగిపోయాడు.

* * *

రాత్రి పదకొండున్నర దాటింది.

తన బెడ్ రూమ్ లో అతడు పడుకుని వున్నాడు. ఇంట్లో ఎవరూ లేరు. అంతా నిశ్శబ్దంగా వుంది.

అతడి మనసు కూడా ఆ గదిలాగే స్థబ్దంగా వుంది. ఏమీ ఆలోచన్లు లేవు. నిద్రకూడా పట్టటంలేదు.

సరిగ్గా 12-01 గంటలకి ఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ ఎత్తి- 'హల్లో' అన్నాడు.

"సారీ సర్. నేనూ ప్రియంవదని రిటర్న్స్ ఆఫ్ ది డే...."

అంత అర్ధరాత్రి అలా ఊహించని రీతిలో వచ్చిన ఫోను అతడిని కొంచెంసేపుపాటు ఆలోచనారహితుడ్ని చేసింది.

".....ఈ రోజు మీ బర్త్ డే అని చెప్పారుగా అందరికన్నా ముందు నేనే విష్ చెయ్యాలని సరీగ్గా పన్నెండు దాటగానే ఫోన్ చేశాను! మీ నిద్ర డిస్టర్బ్ చేస్తే సారీ సర్".

అతడు కదిలిపోయాడు. అతడి అన్నేళ్ళ జీవితంలో ఆ విధమైన అనుభూతి అదే మొదటిసారి.

"ఎక్కడనుంచి చేస్తున్నావు ప్రియంవదా?"

"మా ఇంటికి ఎదురుగా ఇరానీ హోటల్ వుంది సార్. అక్కన్నుంచి కాల్ కి రూపాయన్నమాట. అందరూ నావైపే చిత్రంగా చూస్తున్నారు సార్. అర్ధరాత్రి ఇలా వచ్చి చేస్తున్నందుకు... వుంటాను సార్. మెనీమెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే....." ఫోన్ పెట్టేసింది.

అతడూ రిసీవర్ పెట్టేసి - మంచంమీద పైకప్పుకేసి చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు.

గుండెల్లో చిలికినట్టు వుంది.

ఆ రాత్రంతా అతడు నిద్రపోలేదు. ఏవేవో ఆలోచనల్తో గడిపాడు. అతడి ఆలోచనల్లో మిస్ విజయవాడ కూడా చోటుచేసుకుంది. ఆమెమీద ఒక రకమైన విజయం సాధించినట్టుగా వుంది అతడికి! తనని రెచ్చగొట్టి, అవమానం చేసిన ఆమెకి, తనంటే అభిమానం పెంచుకుంటూన్న ఆమె ద్వారా, తను సమాధానం చెపుతున్నట్టు భావించాడు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే మామూలు బలహీనతలకి అతడు అతీతుడేమీ కాదు. ఆప్యాయత పట్ల నిద్రాణమై వున్న దాహం మొదట ఒక స్త్రీ చేత మేల్కొలపబడింది. మరొక స్త్రీ చేత ఉరకలు వేయిస్తూంది. అది పూర్తిగా సెక్స్ కూడా కాదు. స్త్రీ పురుషులకి అవతలివారి దగ్గిర దొరికే ఓదార్పు, గుర్తింపు అంతే.

ఆ మరుసటిరోజు అతడు తన డైరెక్టర్స్ ఈ పథకం వివరాలు చెప్పాడు. ఒకరిద్దరు డైరెక్టర్సు తప్ప మిగతా అందరూ వెంటనే హర్షామోదాలు తెలియజేసారు. అంత సపోర్టు వారినుంచి లభిస్తుందని అతడు అనుకోలేదు. వారు కూడా అతడిలాగే "ఏదో ఒకటి చెయ్యకపోతే లాభంలేదు" అన్న ఆలోచనలో వున్నారు.

ఈ పథకాన్ని మనస్ఫూర్తిగా మెచ్చుకొని ఇద్దరు డైరెక్టర్లలో శర్మ కూడా ఒకరు.

"ఇప్పుడు బాగానే వుంది కంపెనీ! లాభాలు కూడా బాగానే వస్తున్నాయి. ఎందుకింత రిస్కు తీసుకోవటం?" అని వాదించాడా పెద్దాయన. "ఇప్పుడు ఈ కొత్త పద్ధతిలో కోటి రూపాయలదాకా ఖర్చుపెట్టాలి. రెండు మూడు సంవత్సరాల దాకా డివిడెండ్స్ ఉండవు. ఇంత చేశాక మన ప్రయత్నం విఫలమవుతే అంతా వృధా నా కెందుకో ఆడవాళ్ళు చీరల్ని షాపుల్లో కొంటానికే ఇష్టపడతారు తప్ప ప్రకటనలు చూసి కొనరు-"

"నిజమే కానీ, తక్కువ ధరల చీరలద్వారా మనం జనంలో విపరీతంగా పాపులర్ అవుతాం. మనకేమీ నష్టం లేకుండా కొందరికి సేవచేసిన వాళ్ళమవుతాం. ఏమతఃరం విజయవంతమయినా ఇక మనల్ని ఎవరూ ఆపలేరు."

"సరే, నీ ఇష్టం" అన్నాడాయన క్లుప్తంగా. "నాక్కావల్సిందల్లా నా ఖర్చులకి సరిపోయేవన్ని డివిడెండ్లు రావటమే" నవ్వాడు.

రవితేజ కూడా నవ్వి - "తప్పకుండా" అన్నాడు. శర్మ వెళ్ళిపోయాడు. వీళ్ళిలా మాట్లాడుకుంటున్న సమయానికి అదే గది బయట తన గదిలో ప్రియంవద ఎవరికో ఫోన్ ప్రయత్నిస్తూంది. అవతలివ్యక్తి ఫోన్ లోకి రాగానే "అయిదు నిముషాల నుంచి ప్రయత్నిస్తున్నాను" అంది.

"ఏమిటి సంగతి!"

"ఈ రోజు ఆఫీసులో ఆలస్యం అయ్యేట్టూ వుంది."

"ఎందుకూ?"

"రవి ఏదో పని వుందన్నారు, ఇంటికి ఆలస్యంగా వస్తాను."

"ఎంతసేపవ్వొచ్చు రావటానికి?"

"ఎనిమిదవొచ్చేమో-"

"వీలయితే ఇంకో గంట ఆలస్యంగా రా."

ఫోన్ కట్ అయింది.

* * *

దాదాపు రెండు గంటలసేపు రవి ఊపిరి సలపనంత పనిలో మునిగిపోయాడు. ఒక్కసారి డైరెక్టర్లు పథకాన్ని వప్పుకున్నాక అతడు మరి ఆలస్యం చేయదల్చుకోలేదు. పోటీదార్లు కూడా ఈ పథకం గురించి ఆలోచించే లోపులో తాము మార్కెట్ లోకి వెళ్ళిపోవటం ఉత్తమ వ్యాపారస్థుల లక్షణం మొత్తం అన్ని డిపార్ట్ మెంట్ ల వాళ్ళనీ చక్రాలమీద పరుగెత్తించాడు.

ఒంటిగంట అయ్యేసరికి అనుకున్న పనులన్నీ పూర్తి చేశాడు. ఇక లంచ్ తీసుకుందామనుకుంటూ వుండగా ఫోన్ మోగింది.

"హలో, ఎవరూ?"

"నేను మీ శ్రేయోభిలాషిని."

అతడు మొహం చిట్లించి "ఏం కావాలి?" అని అడిగాడు.

"నాకేమీ అవసరంలేదు. మీకే అవసరమైన విషయాన్ని ఒకదాన్ని చెపుదామని ఫోన్ చేశాను".

"ఏమిటది?"

"నిన్న రాత్రి మీ శ్రీమతిగారు కార్తీకమాసం పిక్నిక్ అని బయల్దేరారు."

"అవును, అయితే.."

"ఇరవైమంది ఆడవాళ్ళూ, పదిమంది మొగవాళ్ళు చాలా హుషారుగా వెళ్ళారు. అఫ్ కోర్స్, అందరూ పెళ్ళయినవాళ్ళూ, దంపతులే అనుకోండి. పాపం మీ భార్య ఒక్కతే భర్త లేకుండా వచ్చింది. అయినా ఆమెకి అదంతా సమస్య కాలేదు. సుధాకర్ అని ఆ బ్యాచ్ లోనే ఒక కుర్రవాడు కూడా వున్నాడు. రాత్రంతా పేకాట, తుళ్ళింతలూ, జోకులూ... నిజంగా మీరు రాకపోవటం..."

"వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్".

"పెద్దగా శృతిమించలేదు.....అందరూ వున్నారు కాబట్టి! సాయంత్రం తిరిగొస్తారు బహుశ! ఈ పరిచయం పెద్దది కాకుండా చూసుకోవటం.....భర్తగా మీ బాధ్యత. శ్రేయోభిలాషిగా హెచ్చరించటం నా బాధ్యత."

ఫోన్ పెట్టేసి, కుర్చీలో చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు రవితేజ.

అవతలివ్యక్తి మాటలే అతని చెవుల్లో మార్మోగుతున్నాయి.

ఇంతలో తలుపు తెరుచుకుని ప్రియంవద వచ్చింది. "ప్రొద్దున్నించి మీరు చాలా బిజీగా వున్నారు. అందుకే రాలేదు మీ కోసం" అంది. కేక్ పెట్టింది బల్లమీద "...మెనీ హాపీ రిటర్న్స్."

"నా మూడ్ ఏమీ బాగోలేదు ప్రియంవదా! డిస్టర్బ్ చేయకు" ఆమె ముఖం వాడిపోయింది. "సారీ సర్" అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళాక అతడు బాధపడ్డాడు - అలా ఎందుకు అన్నానా అని. కానీ దానిగురించి ఎక్కువ ఆలోచించలేదు. అతడికి ఎందుకో ఇంటికి వెళ్ళాలని వుంది. ఇంటర్ కమ్ లో ప్రియంవదతో ఒక గంటలో వస్తానని చెప్పి, బయలుదేరాడు.

కార్లో వస్తూ అతడు ఆలోచించాడు.

ఎవరీ సుధాకర్? తనకి తెలిసిన వాళ్ళలో ఎవరూ లేరు. బహుశా వచ్చిన ఆడవాళ్ళలో ఎవరికో తమ్ముడై వుండాలి. సాధారణంగా ఇలాటివాళ్ళే ఇంత సమయాన్ని వృధా పర్చటానికి వీలుగా వుంటారు.

తన భార్య తప్పు చేస్తుందా లేదా అని అతడు ఆలోచించటంలేదు. ఆవిడ ఆ యువకుడితో కాస్త చనువుగా మాట్లాడి వుండవచ్చు. దాన్ని చూసి ఎవరో తనకి ఫోన్ చేసి వుండవచ్చు లేదా, తన దగ్గిర దొరకని 'దగ్గిరతనం' అతడి దగ్గిర దొరికి వుండవచ్చు. అది కొంతకాలానికి శారీరకమయినదిగా మారవచ్చు లేదా, స్నేహంతో ఆగిపోవచ్చు ఇవేమీ ఆలోచించటం లేదు అతడు.

తన దగ్గిర లేనిది ఆ సుధాకర్ లో ఏం చూసిందా? అని ఆలోచిస్తున్నాడు. డబ్బు సంపాదించటంలో ఇల్లు పట్టకుండా తిరిగే భర్త నిర్లక్ష్యంచేస్తూ వుంటే, తినటం తప్ప మరేపనీ లేక ఇంట్లో ఏమీ తోచని కొందరు ఆడవాళ్ళు....సరీగ్గా ఆ సమయంలో మరొక యువకుడు కాస్త చనువుగా మాట్లాడితే అదే ప్రేమనుకుని, భర్త దగ్గిర దొరకని ఆప్యాయత ఆ చీకట్లో అతడి దగ్గిర పొందాలని అనుకోవటం- కొన్ని కుటుంబాల్లో జరుగుతూ వుంటుందని అతడు కథలుగా విన్నాడు. ఇప్పుడు తనుకూడా ఆ కుటుంబాల్లో ఒకడుగా అయిపోతున్నాడా?

అతడికి ప్రియంవద వ్రాసిన వాక్యాలు గుర్తొచ్చాయి. ".....పదహారేళ్ళ అమ్మాయి మాటకారి అబ్బాయంటే ముచ్చట పడుతుంది-"అని ముచ్చట పడటానికి వయసుతో సంబంధం లేదని తన భార్య నిరూపించింది. ఇక మధ్యాహ్నం పూట వాళ్ళు ఒకరికొకరు ఫోన్ లు చేసుకుని గంటల హరబడి మాట్లాడుకోవటం ప్రారంభం కావొచ్చు.

అతడి మనసు వాసిలేటింగ్ గా వుంది. అది మేల్ ఈగో క్లాష్. కావాలనుకుంటే తను సుధాకర్ కంటే వందరెట్లు

ముచ్చటగా మాట్లాడగలడు. కానీ జీవితాంతం మాట్లాడటం వేరు. ఒక కార్తీక పౌర్ణమి రోజు రెండు గంటలు మాట్లాడటం వేరు.

అకస్మాత్తుగా అతడికి మబ్బులు విడిపోతున్నట్టు అనిపించింది. తను మాత్రం చేసిందేమిటి- అన్న ఆలోచన రాగానే!......ఒకామె తనకు ఉత్తరం వ్రాసిన విషయం తన భార్యకు చెప్పలేదు. పైగా పిచ్చివాడిలా ఒక మధ్యాహ్నమంతా ఆ తాజ్ రిసెప్షన్ దగ్గిర తిరిగాడు. మరొక అమ్మాయి అర్ధరాత్రి ఫోన్ చేస్తే అదొక మధురానుభూతిగా రాత్రంగా నిద్రపోలేదు.

అలాటి తనకి, తన భార్యని నిలదీసే హక్కు ఏముంది? ఒకే పని యిద్దరు చేసినప్పుడు ఒకరిది తప్పు, మరొకరిది ఒప్పు ఎలా అవుతుంది? తమా జీవితాల్లో ఎలాగూ పరస్పర ఆకర్షణ లేనప్పుడు, ఆమె తనకున్న చిన్న పరిధిలో ఆనందించటానికి ప్రయత్నిస్తే అందులో తప్పేముంది?

ఈ రకమైన ఆలోచన వచ్చేసరికి అతడు మామూలుగా అయిపోయాడు. ఇది వేదాంతమా, చేతకానితనమూ కాదు. అవతలి వైపునుంచి ఆలోచించటం వేదాంతంకన్నా గొప్పది. అతడు దైవాంశ సంభూతుడేమీ కాదు. కానీ నిజాయితీగా ఆలోచించగలగటం దైవాంశ కన్నా గొప్ప విషయం.

అతడు కారు వెనక్కి తిప్పి ఆఫీసుకి వెళ్ళిపోదామా అనుకున్నాడు కానీ అప్పటికే ఇల్లు రావటంవల్ల కాస్త రిఫ్రెష్ అయి వెళ్ళవచ్చుకదా అని కారు ఇంటిలోకే పోనిచ్చాడు.

బయట తోటమాలి చెట్లకి నీళ్ళు పోస్తున్నాడు. వంటమనిషి వరండాలోనే కనిపిస్తే, ఒక కప్పు టీ తన గదిలోకి తీసుకురమ్మని చెప్పి, ముందు హాలులోకి ప్రవేశించాడు.

పక్క పక్క సోఫాల్లో కూర్చొని వున్నారు తన భార్యా, అతడు మాధవి ముందుకు చేయిసాచి ఆసక్తిగా అతడు చెప్పేది వింటూంది. అతడు ఆమె చెయ్యిచూసి భవిష్యత్తు చెపుతున్నట్టున్నాడు! ఒక చేత్తో ఆమె చేతిని పట్టుకుని, మరొక చూపుడు వేలుతో గీతల్ని వివరిస్తున్నాడు. ఎందుకో రవి మనసు ఆ దృశ్యాన్ని చూడగానే చివుక్కుమంది. మళ్ళీ అంతలోనే 'ఇదేమిటి - ఇపుడేగా ఇంత ఆలోచించాను దీని గురించి' అనుకున్నాడు.

అంతలో రవిని చూసి మాధవి లేచి నిలబడి, "రండి, రండి" అంది. "ఈయన సుధాకర్ అని మన వనజ తమ్ముడు."

"హలో" అన్నాడు రవి. వనజ భర్తకి పొగాకు వ్యాపారం వుంది. బాగా డబ్బున్నవాళ్ళు సుధాకర్ మొహంలో అదోరకమైన తత్తరపాటుని గమనించాడు అతడు. వేళకాని వేళలో తన రాకని అతడు వూహించి వుండడు.

"హలో" అన్నాడు అతడు.

"ఏం చేస్తూ వుంటారు మీరు-"

"చదువు పూర్తిచేసి ప్రస్తుతం ఖాళీగా వున్నాను."

ఒక యువకుడి నుంచి వచ్చే జవాబుల్లో అన్నిటికన్నా హీనమైన జవాబు అది. ప్రస్తుతం ఖాళీగా వున్నానన్నది.

"ఆయన బాగా జ్యోతిష్యం చెపుతారు" అంది మాధవి. "ఉండండి ఇద్దరికీ 'టీ' తీసుకొస్తాను" అని లోపలికి వెళ్ళింది.

"జ్యోతిష్యం అంటే పామిస్ట్రీనా? ఆస్ట్రాలజీయా?" భార్య లోపలి వెళ్ళాక అడిగాడు - సోఫాలోకి వెనక్కి జారబడుతూ.

"పా..... పామిస్ట్రీ".

"ఏదీ, నాకు చెప్పండి. మేము ఒక కొత్త స్కీమ్ పెట్టబోతున్నాం. మా భవిష్యత్తంతా దానిమీదే ఆధారపడి వుంటుంది. దాంట్లో మేము సక్సెస్ అవుతామా?"

సుధాకర్ అతడి చెయ్యి తీసుకుని చాలాసేపు గీతల్ని పరీక్షించి, కొంచెం సేపు కళ్ళు మూసుకుని తెరిచి, "అదృష్టరేఖ చాలా బ్రైట్ గా వుంది. తప్పక విజయం సాధిస్తారు" అన్నాడు.

"కానీ గర్డిల్ ఆఫ్ వీనస్ మీద స్టార్ తయారవుతూంది కొత్తగా. అది అశుభ సూచకం కదా" సుధాకర్ విస్తుబోయి మొహంలో ఆ భావం కనిపించకుండా జాగ్రత్తపడటం గమనిస్తూ అన్నాడు. "అది నిజమే అనుకోండి, కాని ఫర్వాలేదు. హెడ్ లైన్ బావుంది కదా."

"మౌంట్ ఆఫ్ మూన్ మీద స్పాట్ చూడండి. అక్కడ కాదు. మౌంట్ ఆఫ్ మూన్ ఎక్కడో మీకు తెలీయదల్లే వుంది. పోన్లెండి, ఇక ఆ సంగతి వదిలెయ్యండి." రవితేజ అతడి మొహంలోకి చూస్తూ అన్నాడు. వాడిపోయిన మొహంతో సుధాకర్ పేలవంగా నవ్వి, "ఇపుడిప్పుడే నేర్చుకుంటున్నాను" అన్నాడు.

అంతలో మాధవి రెండు కప్పులతో వచ్చింది.

"టీ తీసుకోండి."

రవి టీతాగి, లోపలికి వెళ్ళాడు. "నేను వెళ్లొస్తాను" అని సుధాకర్ అనటం వినిపించింది. "ఫర్వాలేదు కూర్చోండి" అంటూంది మాధవి ఐదు నిమిషాల తర్వాత రవి వచ్చాడు. వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు. సుధాకర్ ఏదో

ఇబ్బందిగా ఫీలవుతున్నాడు.

"అదేమిటి అల అమౌనంగా కూర్చున్నారు?" అన్నాడు రవితేజ వస్తూ అంతలో అతడి దృష్టి టేబుల్ మీద వున్న చిన్న ప్యాకెట్ మీద పడింది. "అదేమిటి?" అడిగాడు.

"చిన్న గిఫ్ట్ మాధవిగారి కోసం-" అన్నాడు.

"నిన్న మీరుకూడా పిక్నిక్ వెళ్ళారా?" వాచీ పెట్టుకుంటూ అడిగాడు. "అక్కడే మాధవిగారు పరిచయం అయ్యారు" అన్నాడు సుధాకర్ నిన్న పరిచయమైతే, ఈ రోజే గిఫ్ట్ పట్టుకురావటం చీప్ ట్రిక్ - కేవలం హెడ్ లైన్, లైఫ్ లైన్ లాటి రెండు మూడు పదాలు నేర్చుకుని ఆడవాళ్ళకి జ్యోతిష్యం చెప్పటం అంతకన్నా చౌకబారు ట్రిక్. ఆడవాళ్ళకి ఈ సంగతి తెలీదో, లేక తెలిసీ తెలియనట్టు నటిస్తారో అర్థంకాదు. "నేను వెళ్తాను ఆఫీసులో పనుంది-" అంటూ బయల్దేరాడు రవితేజ.

మాధవి పోర్టికోవరకూ వచ్చి, "సాయంత్రం తొందరగా వస్తారా?" అంది.

"నాకు చాలా ఆశ్చర్యంగా వుంది సుమా!"

"ఏమిటి?"

"పెళ్ళయిన ఇన్నాళ్ళకి మొట్టమొదటిసారి నువ్వీ ప్రశ్న అడగటం".

ఆమె మొహం చిట్లించి, "ఏమిటి మీ ఉద్దేశ్యం?" అంది.

అతడు కారు స్టార్ట్ చేసి వెళ్ళిపోతూ, తనలో తాను అనుకున్నాడు. "గిల్టీ ఫీలింగ్ మనిషిని కొద్దిగా మారుస్తుందేమో సుమా" అని.

* * *

అతడు ఆఫీసుకి వెళ్ళేసరికి ఆఫీసు కట్టేసే టైమైంది. చాలామంది వెళ్ళిపోయారు. ప్రియంవద అతడికోసం ఎదురుచూస్తూ వుంది. "ఈ రోజు ఆలస్యమావుతుద్నీ వుండమన్నారు" అంది.

"అవును చాలా పని వుంది. ఇంట్లో చెప్పొచ్చావా?"

"చెప్పానండీ!"

అతడు వరుసగా ఉత్తరాలు డిక్టేషన్ ఇవ్వటం ప్రారంభించాడు. ఎనిమిదింటి వరకూ ఆమె టైప్ చేసిన ఉత్తరాలమీద సంతకం పెట్టాడు. ఆఖరి ఉత్తరం టైప్ డిక్టేషన్ చేస్తూ వుండగా ఫోన్ మ్రోగింది.

ఆఫీసంతా నిర్మానుష్యంగా వుంది.

"హల్లో".

"నేను మాధవిని".

"ఏమిటి చెప్పు."

"నాకు కారు కావాలి."

"అదేమిటి, ఫియట్ వుందిగా?"

"అది స్టార్ట్ అయి చావటంలేదు. లక్షసార్లు చెప్పాను. దాన్ని అమ్మెయ్యమని మీరసలు నా మాట...."

"సర్లే సర్లే - మళ్ళీ పంపిస్తావా? నేను ఇంకో గంటసేపు వుంటానిక్కడ. ఇంతకీ ఎక్కడికి వెళ్తున్నావు?"

"సెకెండ్ షోకి".

"నువ్వు దిగి, నాకు పంపించు."

"మీ కసలే మతిమరుపు. మీ రింటిదగ్గర దిగాక మళ్ళీ హాలుకి పంపకపోతే వాళ్ళ ముందు నవ్వులపాలు కావాల్సి వస్తుంది."

"ఎవరితో వెళ్తున్నావు? వాళ్ళకి కారు లేదా?"

"మిసెస్ పాండేతో? వాళ్ళముందు దేభ్యం మొహం పెట్టుకుని మీ కారులో వస్తానని చెప్పమంటారా?"

"అక్కర్లేదులే, పంపుతున్నాను?" అతడు ఫోన్ పెట్టేసి, బెల్ కొట్టి డ్రైవర్ ని ఇంటికి వెళ్ళమని చెప్పాడు. ప్రియంవద

పుస్తకం మీద పిచ్చిగీతలు గీస్తూంది అంతసేపూ.

అతడు తిరిగి డిక్టేషన్ మొదలు పెట్టాడు. మరో పది నిమిషాలు డిక్టేషన్ ఇచ్చాడు. ఆ ఉత్తరాలు ఆమె టైప్ చేసి తీసుకొచ్చేసరికి అరగంట పట్టింది. టైమ్ తొమ్మిదిన్నర కావొస్తూంది.

కారు రాలేదు. అతడు విసుగ్గా టైమ్ చూసుకున్నాడు. ఈపాటికి సినిమా కూడా ప్రారంభించి వుంటారు. ఇంకా వీళ్ళ మేకప్ లు పూర్తి అయ్యాయో లేదో.

"నేను వెళ్ళొచ్చా సార్" అని అడిగింది.

"బాగా రాత్రయింది. నేను డ్రాప్ చేస్తానుండు" అని అతడు ఇంటికి ఫోన్ చేశాడు. వంటమనిషి ఎత్తి 'అమ్మగారు సినిమాకి వెళ్ళారు సార్' అన్నాడు.

"కారు పంపించాను, వచ్చిందా?"

"వచ్చింది సార్ అందులోనే వెళ్ళారు. అరగంట అయింది".

అతడు విసుగ్గా ఫోన్ పెట్టేశాడు. మరో పదినిముషాలు గడిచాయి. అద్దాలవతల నుంచి ప్రియంవధ టైప్ మిషన్ ముందు కూర్చొని గోళ్ళమీద చిన్న గుడ్డతో పాలిష్ చేస్తుంది. హాలంతా నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వుంది. బయట తలుపు కవతల బోయ ఇంకా ఎంతసేపు అన్నట్టు ఆవలిస్తూన్నాడు.

అతఃడు ఇంటర్ కమ్ లో ఆమెని పిలిచి, "నువ్వు వెళ్ళిపో, నాకు కారు రావటం ఆలస్యం అయ్యేట్టూ వుంది" అన్నాడు. ఫర్వాలేదు వుంటానంది ఆమె.

సమయం పావుతక్కువ పది కావొస్తుంది.

అతఃడు రిసీవర్ ఎత్తి మిసెస్ పాండే ఇంటికి ఫోన్ చేశాడు. ఆమె లేదు. పాండే ఎత్తాడు ఫోన్. "ఏమిటి విశేషం? ఇంత రాత్రి ఫోన్ చేశారు?" అని అడిగాడు.

"మాధవి కారు పంపుతాననంది. ఇంకా రాలేదు. అసలు తయారై బయల్దేరారో లేదో అని."

పాండే బిగ్గరగా నవ్వాడు. "ఇంకా మేకప్ లోనే వుంటారేమో అన్న అనుమానం వచ్చిందా? అదీ నిజమేలే అరగంట ఆలస్యంగా బయల్దేరారు. కానీ మొత్తంమీద బయల్దేరారు వనజావాళ్ళు రావటమే ఆలస్యం అయింది-"

రవితేజ చేతిలో రిసీవర్ అప్రయత్నంగా బిగుసుకుంది.

"వ...న....జా... వాళ్ళు.....

"హల్లో"

........

"ఆ చెప్పండి-"

"నా కారు పంపనా?"

"వద్దు వద్దు బహుశ హోల్ కి వెళ్ళి పంపుతుందేమో" అన్నాడు రవితేజ- అనవసరంగా ఆయనకీ శ్రమ ఇవ్వటం దేనికన్న ఉద్దేశ్యం ధ్వనించేటట్టూ అతడి ఆలోచన్లు మాత్రం ఎక్కడో వున్నాయి. వనజా - వాళ్ళు.

"ఇంట్లో ఎవరూ లేరుగా, ఇక్కడికే రాకూడదూ ఓ గంట కూర్చుని వెళ్ళవచ్చు..." అట్నుంచి పాండే అన్నాడు.

"లేదు మళ్ళీ ఇంకెప్పుడైనా వస్తాను."

"సరే మీ ఇష్టం అన్నట్టు మీ కంపెనీ ఈ సంవత్సరం బోనస్ షేర్లు ఇస్తూందటగా. కంగ్రాట్స్ మీ బ్యాలెన్స్ షీట్లు చూస్తున్నాను. మీ ప్రోగ్రెస్ చూస్తూంటే మతిపోతూంది."

"థాంక్యూ వుంటాను" ఫోన్ పెట్టేశాడు.

వనజా-వా.....ళ్ళు.

అతడు తల విదిలించాడు.

ప్రియంవద అతడివైపే చూస్తూంది. అతడు బోయ్ ని పిలిచి 'నువ్వెళ్ళు' అని చెప్పాడు. "ఒక టాక్సీ పంపమని క్రింద టైమ్ ఆఫీసులో చెప్పి వెళ్ళు-"

"అలాగే సర్" అని బోయ్ సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. ఇద్దరే మిగిలారు. ఫోన్ లో అతఃది సంభాషణ, తరువాత

టాక్సీ పంపమని బోయ్ కి చెప్పటం విన్న ప్రియంవధ, విషయం అర్ధమైనట్టు మౌనంగా వుండిపోయింది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ రవి అన్నాడు.

"నువ్వు ఒక కార్డు ఇచ్చావు గుర్తుందా ప్రియంవాదా. ఏ వయసులో అమ్మాయిలు ఎవర్ని ఇష్టపడతారు అన్నది వ్రాసి! అందులో నువ్వు కేవలం పెళ్ళికాని ఆడవాళ్ళ గురించి మాత్రమే వ్రాసేవు. పెళ్ళయినవాళ్ళ గురించి నీకు బహుశ తెలిసి వుండదు-" అతడు పూర్తిచెయ్యబోయి ఆగాడు. అతడు అనదల్చుకున్నది - భర్త కష్టపడి సర్వసౌఖ్యాలు అమరుస్తూ వుంటే, ఇంట్లో ఏమీతోచని స్త్రీలు ముఖ్యంగా హై సొసైటీలో రకరకాల వ్యాపకాలకి ఆకర్షితులవుతారనీ - ఇంట్లో భర్త దగ్గిర దొరకని 'గుర్తింపు' బయటవారి దగ్గిర దొరికితే అది నిజమైన ఆప్యాయత అనుకుంటారనీ! కానీ అతడు పూర్తి చెయ్యలేదు. అతడికి తనస్థానం గుర్తుకువచ్చి ఆగిపోయాడు. వ్యాపార సంబంధమైన విషయాల్లో ఎంతో తూచి తూచి మాట్లాడే ఆ ఎగ్జిక్యూటివ్, ఒక సెక్రటరీ దగ్గిర ఆ మాత్రమైనా తొణికాడంటే - అతడు ఆ క్షణం ఎంత మానసిక సంచలనాన్ని అనుభవిస్తున్నాడో అర్ధం అవుతుంది. అతడు పూర్తిగా చెప్పకపోయినా ఆమె అర్ధం చేసుకున్నట్టు అంది-

"మీరు ఆడవాళ్ళ గురించే ఎందుకు చెపుతారు సార్. నిజానికి తొంభైశాతం మొగవాల్లే అంత, మా కుటుంబ విషయమే తీసుకుంటే..." ఆగింది. అతడు అభావంగా చూశాడు. ఆమె చెప్పటం కొనసాగించింది. "అమ్మ ఎంతో మంచిది. నాన్న తననెప్పుడూ అర్ధం చేసుకోలేదు. మేమందరం గాలికి పెరిగినట్టు పెరిగాం. పాతిక సంవత్సరాలు మా అమ్మ తన ఇష్టాలన్నీ పక్కకు పెట్టి ఒక చెట్టులా కాలం గడిపింది.....కేవలం స్త్రీగా పుట్టినందుకు!! నాన్నకి తన ప్రపంచమే తనది. అమ్మ నెప్పుడూ ఒక మనిషిగానే గుర్తించేవాడు కాదు." ఆమె మరి చెప్పలేదు. ఆ జ్ఞాపకాలవల్ల ఆమె మొహం మ్లానమైంది.

ఆ పరిస్థితి ఇంకా కొనసాగించడం ఇష్టం లేదన్నట్టుగా అతడు లేచి, "వెళ్దామా, క్రింద టాక్సీ వచ్చి వుంటుంది" అన్నాడు. ఆమె కూడా అర్ధం చేసుకున్నట్టు లేచి, బ్యాగ్ చేతిలోకి తీసుకుంది.

ఇద్దరూ హాల్లోకి వస్తూవుండగా, "శర్మగారు తనక్యాబిన్ లో వున్నారేమో" అంటూ ఆమె తన దగ్గిర ఇంటర్ కమ్ బటన్ నొక్కింది. అతడు నిలబడి చూశాడు. నిముషమైనా అట్నుంచి సమాధానం లేకపోవటంతో, "ఇంత రాత్రివరకూ ఆయనెందుకుంటారు? పద వెళ్దాం" అంటూ లిఫ్ట్ వైపు నడిచాడు.

ఇద్దరూ క్రిందికి లిఫ్ట్ లో దిగుతూ వుండగా అతనన్నాడు. "నువ్వు చెప్పింది నిజమే. భార్యాభర్తల్లో ఎవరిది తప్పు అనేది నిర్ణయించలేం. ఎవరి వాదనలు వారికి వుంటాయి. తప్పంతా మన పటిష్టమైన వైవాహిక వ్యవస్థది!" లిఫ్ట్ మూడో అంతస్తు దాటి, రెండో అంతస్తుకి దిగుతూ వుంది.

"ఈ వ్యవస్థలో భార్యాభర్తలు ఎన్ని మనస్పర్ధలున్నా కలిసే వుండాలి. పోనీ అది తప్పు అనుకుంటే - ఎప్పుడు కావాలంటే అప్పుడు విడిపోయే అవకాశం వున్న అమెరికాలో కూడా దంపతులు సుఖంగా వున్నారనుకోను. మరి తప్పు ఎక్కడుందో ఆ దేవుడే నిర్ణయించాలి."

అతడి మాటలకి ప్రియంవద నవ్వుతూ వుండగా లిఫ్ట్ ఆగిపోయింది.

మొదటి అంతస్థుకీ రెండో అంతస్థుకీ మధ్య - మొదటి అంతస్థులోకి సగం దిగింది. ఈ హఠాత్ సంఘటనకి అతడు నిర్విణ్ణుడై "మైగాడ్" అన్నాడు. ఈ కుర్రవాడు టైమ్ ఆఫీసులో ఏం చెప్పాడో! కారు లేకపోయేసరికి అందరూ వెళ్ళిపోయారనుకుని మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి వుంటారు - అది నిజమైతే -

ప్రియంవధ అయోమయంగా అతడివైపు చూసింది. మొదటి అంతస్థు వరండాలోంచి వచ్చే గాలి, లిఫ్ట్ ఇనుప వూచలగుండా రివ్వున లోపలికి వస్తూంది. వరండా వెలుతురు కాళ్ళమీద పడుతుంది.

"అదే నిజమైన పక్షంలో ప్రొద్దున్నవరకూ ఇది కదలదు-" పూర్తిచేశాడు రవితేజ బలంగా బెల్ నొక్కుతూ. లిఫ్ట్ కదల్లేదు!

"ఇప్పుడేమిచెయ్యటం?" అంది ప్రియంవద ఆందోళనగా.

"చెయ్యటానికేమీ లేదు. ఎవరికైనా పైకి వచ్చే అవసరం వుండి మళ్ళీ లిఫ్ట్ ఉపయోగిస్తే తప్ప లేకపోతే ప్రొద్దున్నవరకూ ఇంతే.... మీ ఇంట్లో ఎవరైనా కంగారుపడతారా?"

ఆమె జవాబు చెప్పలేదు.

"సినిమాహాలు నుంచి వచ్చిన మా డ్రైవరు కేదైనా అనుమానం వస్తే బహుశ పైకి రావొచ్చు. అసలీ ఆఫీస్ బోయ ఏం చెప్పాడో ఏమో-" విసుగ్గా వాచీ చూసుకుంటూ అన్నాడు.

## 17

**టైమ్** పదకొండున్నర కావొస్తూంది.

"ఎంతసేపలా నిల్చుంటావు కూర్చో" అన్నాడు. ఆమె మొహమాటంగా నవ్వింది. కళ్ళల్లో అలసట కనిపిస్తూంది.

అతడికి జాలేసింది. పాపం ప్రొద్దున్ననగా వచ్చింది. తన మూలాన ఇలా ఇరుక్కుపోయింది అనుకున్నాడు.

"కూర్చో" అన్నాడు.

"ఫర్వాలేదు సర్!"

తను కూర్చోకపోతే ఆమెకూడా ఆ పని చేయదని గ్రహించి అతడు ఒకవైపు ఆనుకుని కూర్చుంటూ, ఆమెవైపు సైగ చేశాడు. ఆమె బిడియపడుతూ ఒద్దికంగా కూర్చుంది ఒక మూలకి. ఆమెలో ముందున్న భయం, ఆందోళన తగ్గటం గమనించాడు.

"ఒకందుకు మనం అదృష్టవంతులం. మొదటి అంతస్తు సగంలో నిలబడిపోవటంవల్ల ఈ గాలి అయినా వస్తోంది. రెండు అంతస్తుల మధ్య ఆగిపోయి వుంటే ఊపిరాడక చచ్చిపోయి వుండే వాళ్ళం" అన్నాడు.

అతడికి మాధవి మీద చెప్పలేనంత కోపం వచ్చింది. ఏం చేస్తూ వుంటుందీపాటికి? సుధాకర్ పక్కన కూర్చుని వుంటుందా? మిసెస్ పాండే పక్కనా?

అంతలో అతడి దృష్టి, తనలో తనే నవ్వుకుంటున్న ప్రియంవద మీద పడింది. "ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగాడు. ఆమె ముందు చెప్పలేదు. రెట్టిస్తే "మనం ఇలా ఇరుక్కుపోవటం చూస్తూంటే మా ఫ్రెండ్ చెప్పిన కథ గుర్తొచ్చింది సార్" అంది. "....ఇలా టెక్స్ టైల్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం అంటే చీరెల మీద ఒక కథ చెప్పింది." "ఏమిటీ?"

"నలుగురు నిరుద్యోగా పట్టభద్రులు ఎంతకీ ఉద్యోగం దొరక్క చివరికి ఒక బ్యాంకు దొంగతనం చేద్దామనుకున్నారట. అందులో ఒక తెలివైన వాడున్నాడట. బ్యాంకు దొంగతనం అంటే మనకంత అనుభవం లేదు. నేనింకో ప్లాన్ చెపుతాను. ఫలితంగా నా షేరుకి నేను అడిగిందివ్వాలి. పైగా మీకు బ్యాంకుకన్నా ఎక్కువ దొరుకుతుంది. రిస్క్ కూడా తక్కువ అన్నాడట. అదేమిటో చూద్దామని మిగతావాళ్ళు సరేనని ఒప్పుకున్నారట.

కొన్ని రోజులకి ఆ ఊర్లో పెద సుబ్బయ్య చౌదరిగారి అమ్మాయి పెళ్ళి జరిగిందట. నగరంలో ప్రముఖులు, పట్టుచీరెలు రెపరెపలాడించుకుంటూ వారి భార్యలూ, కార్లూ, స్కూటర్లు అంతా హడావుడిగా, ఆర్భాటంగా వుందట అక్కడ. ధగధగా మెరిసి పోతున్నారట అందరూ. పెళ్ళికి రెండు గంటలముందు ఎవరిదో గాత్ర సంగీతం హాల్లో ఏర్పాటు చేశారట. మనవాళ్ళు నలుగురూ అన్ని తలుపులూ వేసేసి స్టేజిమీద మైకు దగ్గిరకొచ్చేసి బొమ్మ పిస్టల్ తో బెదిరించేసరికి అందరికీ ఏం చెయ్యాలో తోచలేదు. పెళ్ళికదా పోలీసు లెవరుంటారు?

ఆడవాళ్ళందర్నీ స్టేజి పక్కనున్న గ్రీన్ రూమ్ లోకి పంపించారట. అక్కడో రెండొందలు నూలు చీరలున్నాయట. వాటిని కట్టుకుని, సీతమ్మవారు అడవికి వెళ్ళేముందు తయారైనట్టు ఐదు నిముషాల్లో తయారై వారందరూ తిరిగి హాల్లోకి రావాలని బెదిరించారన్నమాట! వాళ్ళ చీరలూ నగలూ తీసుకొని ఆ నలుగురూ అక్కన్నుంచి జారుకున్నారు. మొత్తం అంతా పావుగంటలో అయిపోయింది. ఊరి చివరకు వెళ్ళాక తెలివైనవాడిని మిగతా ముగ్గురూ ప్రశంసించారట. 'ఇదే బ్యాంకయితే నాల్గయిదు లక్షలకన్నా ఎక్కువ దొరక్కపోవును. పెళ్ళిలో ఇంత పోగవుతుందని మాకు ఆలోచనే రాలేదు సుమా' అని....'ఇంత మంచి సలహా ఇచ్చినందుకు నీకేం కావాలో తీసుకో' అన్నారట.

"బంగారం మీరు పంచుకోండి చీరెలు నాకిచ్చెయ్యండి అన్నాడుట అతడు.." అంటూ ఆపింది ప్రియంవద.

"అదేమిటి" అన్నాడు రవితేజ. ".....బంగారం వదిలి చీరలు తీసుకోవటం ఏమిటి?"

ప్రియంవద - "వాళ్ళక్కూడా అదే అనుమానం వచ్చింది. కానీ అతడు పట్టుపట్టడంతో సరే నీ ఖర్మ అని చీరెల్ని అతడికి వదిలేసి తాము బంగారం పంచుకుని విడిపోయార్ట. ఒక్కొక్క చీర వెయ్యికి తక్కువకాదు కాబట్టి అతడి వాటా రెండు లక్షలు వచ్చింది. బంగారం అమ్మబోయిన వాళ్ళకి మాత్రం ఒక్కొక్కరికి అందులో సగం కూడా రాలేదట" అంది.

"అదేం?"

"అందులో సగం పైగా రోల్డుగోల్డు కాబట్టి-"

రవితేజ ఒక్కసారిగా బిగ్గరగా నవ్వేశాడు. అతడు అంత బిగ్గరగా నవ్వటం అదే ప్రథమం. ప్రియంవద కూడా చిరునవ్వుతో "మీ దగ్గిర ఉద్యోగం అనగానే మా ఫ్రెండు అదే చెప్పింది-బంగారంతో మోసం చెయ్యవచ్చేమోగానీ చీరల్లో చెయ్యలేమట. అంతేకాదు బంగారంకన్నా ఖరీదైన చీరలు వచ్చేరోజు తొందర్లోనే వుందట-"

"తొందర్లో ఏమిటి-వచ్చేస్తేనూ" అన్నాడు అతడు.

* * *

రాత్రి ఒంటిగంట దాటింది.

మాగన్నుగా పట్టిన నిద్రలోంచి హఠాత్తుగా అతనికి మెలకువ వచ్చింది. తను కూర్చున్న భంగిమ చూసుకుంటే నవ్వొచ్చింది. ఆమె ఆవులిస్తూ నెమ్మదిగా తల వెనక్కి వాల్చటం అతడికి తెలుసు. తనుకూడా నిద్రలోకి జారుకుంటానని మాత్రం అనుకోలేదు.

బయట వరండాలో ఎక్కడా అలికిడి లేదు. పగలంతా హడావుడిగా వుండే ఆఫీసు తనుకూడా రాత్రి విశ్రాంతి తీసుకుంటున్నట్టు వుంది.

బయటనుంచి వెలుతురు డైరెక్టుగా ఆమెమీద పడుతూంది. ముందు మోకాళ్ళమీద పడుకుని, నిద్రలోనే పక్కకి జారిపోయినట్టుంది ఆమె. తలక్రింద వున్న చేతిమీద ముంగురులు జీరాడుతున్నాయి. తెల్లటి చర్మంమీద నల్లటి కాంట్రాస్టు.

అతడు చేతిని ముందుకు సాచాడు.

ఆమె చిన్నపిల్లలా ముణగదీసుకుని పడుకుని వుంది. పెద్ద లిఫ్టే అయినా పొడుగు సరిపోవడం లేదు. ఒక చెయ్యి తలక్రింద వుంచుకుని, మరో చెయ్యి చెంపక్రింద పెట్టుకుని నిద్రపోతూ, నిద్రలోనే అట్నుంచి ఇటు వత్తిగిల్లింది.

అతడు ఆమెవైపే చూస్తున్నాడు. ఇంతకుముందు ఎప్పుడూ అలా చూడలేదు. తెల్లటి తెలుపు ఆమె. అలసిపోయిన మొహం నిద్రలో మరింత అందంగా కనపడుతుంది. చిత్రమేమిటంటే, తన భార్యను కూడా ఎప్పుడూ పరీక్షగా అతడు చూడలేదు. చూడటానికేమీ లేదు. కోర్కెకన్నా ఎత్తయిన భావం మనసు నిండినపుడు చూపు ఇంద్రధనస్సు అవుతుంది. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం అతడు చిన్న చిన్న కాగితాలమీద గేయాలు వ్రాసుకునేవాడు. ఎక్కువ పాండిత్యంలేదు. కానీ ఆలోచించే భావుకత్వం వుంది. గత కొన్ని సంవత్సరాలుగా అది కామర్సు వెనుక మరుగుపడింది. ఈ రోజు రాత్రి అది పురివిప్పటానికి సమాయత్తమవుతూంది.

ఆటోగ్రాఫ్ పుస్తకాలు తీసుకొచ్చి సంతకాలు పెట్టమనటం నుంచి అర్ధరాత్రి పన్నెండింటికి ఫోన్ చేసి గ్రీటింగ్స్ చెప్పటం వరకూ వరుసగా అన్నీ గుర్తొచ్చాయి.

**నీ చిరునవ్వు - నక్షత్రం చివరి వెలుగు**<br>
**ఇంటిముందు జూకా మల్లెతీగె**<br>
**నిన్నరాత్రి వర్షంలో తడిసిన నా గేయం**<br>
**బోగస్ విల్లా పందిరి మీద ప్రేమై పూసింది.**<br>
**సామాజిక కొమ్మల మధ్యనుంచి**<br>
**బెరుగ్గా చూస్తోంది.....**<br>
**నా పిరికితనాన్ని చూసి నవ్వే నీ మెడక్రింది లాకెట్టు.**<br>
**రెండు రాత్రుల్ళ మధ్య వెలుగుతూన్న పగలులా వుంది.**

ఆమె అట్నుంచి ఇటు తిరగడంతో పైట మెడమీదనుంచి క్రిందికి జారి నేలమీద జీరాడుతుంది. ఒక మోచెయ్యి రెండో అరచెయ్యి తలక్రిందే వుండటంవల్ల, మెడనుంచి క్రిందుగా వెళ్ళే గీత మరింత లోతై కారుమబ్బుల మధ్య కదిలే మెరుపుతీగలా వంపు తిరిగి జాకెట్టు లోపలి అదృశ్యమైంది. చేతి మలుపులో ఒక వక్షోజం సగం వరకూ కప్పబడిపోవటం వలన అర్థభాగం మాత్రమే గోచరమవుతుంది. రెండోది పూర్ణకుంభమవటంతో రెండొందల పేజీల కుమారసంభవం పుస్తకం మీద ఆరొందల పేజీల మనుచరిత్ర పుస్తకాన్ని ఆన్చినట్టుంది.

పూర్ణకుంభపు విశృంఖలత్వం కూడా మనుచరిత్రకు సరిపోయేట్టే వుంది. కుమారాసంభవంలో పార్వతి తండ్రిచాటు బిడ్డకదా పైట వెనుకే బుద్ధిగా వుంటుంది. వరూధిని అలాకాదు. అనుకున్నది సాధించగలదు.

అతడు బలవంతంగా కళ్ళు తిప్పుకుని గాలికి ఎగురుతున్న పైటను నిండుగా కప్పేడు. అలా కప్పుతూ వుండగా ఆమెకి సగం మెలుకువవచ్చి ఆ సగం నిద్రలోనే అతడి చెయ్యి గట్టిగా పట్టుకుని అలాగే మళ్ళీ నిద్రలోకి జారుకుంది. ఆమె స్పర్శ గుండెలోపలి కవాటాల్లో గంధం రాసినట్టుంది. చెయ్యి ఆమె మెడ దగ్గిరగా వుండటంవల్ల ఆమె ఉచ్ఛ్వసించేటపుడు చేతిమీదుగా వెళ్ళే హేమంతపవనం నిస్వసించేటప్పుడు గ్రీష్మమౌతూంది.

అతడికి తన భార్య గుర్తొచ్చింది. స్త్రీలో బేలతనాన్నీ, ఆధారపడే గుణాన్నీ ప్రేమించినంతగా మరేదాన్నీ ప్రేమించడు పురుషుడు. ఆమె పడుకున్న భంగిమలోనే ఆ తత్వం కనపడుతూంది. మాధవి ఏనాడైనా పడుకుందా?

**ఒకే దిండుమీద మన రెండు తలలు.**
**దగ్గరవలేని ఉత్తర-దక్షిణ ధృవాలు.....**

అతడు కళ్ళు మూసుకున్నాడు.

ఈపాటికి సినిమా వదిలి వుంటారు. ఇంటివరకూ వచ్చి దిగబెట్టటాలూ, చిరునవ్వు చెయ్యివూపులూ, నవ్వుకుంటూ మెట్లెక్కటాలూ......ఆలోచిస్తూ అతడు మగత నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో కల వచ్చింది. ఆమెవరో అతడికి తెలీదు. పదిహేను సంవత్సరాల క్రితం జ్ఞాపకమో, నిద్రలోకి వెళ్ళబోయే పదిహేను సెకన్ల ముందు అనుభవమో, ఒక ఆకృతిదాల్చి అతడివైపు పరుగెత్తుకు వస్తూంది. అతడు చేతులు సాచగానే అందులో ఒదిగిపోయింది. ముద్దుచప్పుడికి పెదవిమీది నిశ్శబ్దం పరేలున పగిలింది. చేతి వత్తిడికి శరీరం సర్వమై మెలికలు తిరిగింది. శిరోభాగపు చర్మం క్రింద తడి ఎప్పుడు చెమటై నుదుటిమీద నిలుద్దామా అని తొందరపడుతుంది. ద్వంద యుద్దానికి రణరంగ మక్కరలేదు. స్వంతమగ్గానికి ముహూర్తమవసరంలేదు.

అతడు కలలో మునిగి వుండగానే ఎప్పుడు తెల్లవారిందో తెలీదు. లిఫ్టు నెమ్మదిగా క్రిందికి జారటం ప్రారంభించింది. కలకీ నిజానికీ తేడా తెలియని పరిస్థితిలో వున్నారు వారిద్దరూ. క్రింద వాచ్ మెన్, మరో ముగ్గురు పైకి వెళ్ళటం కోసం నిల్చుని వున్నారు.

* * *

లిఫ్ట్ అకస్మాత్తుగా ఆగేసరికి ఒక స్వాప్నికావస్థ నుంచి బయటకొచ్చిన మెలకువ వచ్చింది రవితేజకి. ముందొక క్షణం ఏమీ అర్ధంకాలేదు. అకస్మాత్తుగా మబ్బులు విడినట్టు అనిపించి చూచుకుంటే, ఛాతీమీదనుంచి లేస్తున్న ప్రియంవద కనిపించింది.

ఆ తరువాత కనిపించారు-లిఫ్ట్ బయట శిలాప్రతిమల్లా నిలబడి చూస్తున్న ముగ్గురూ వాచ్ మెన్, గదులువూడ్చేవారు ఇంకొకరు. ఒక నిముషంపాటూ అయిదుగురూ అలాగే వుండి పోయారు. ఊహించని రీతిలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ని అంత తెల్లవారుజామునే లిఫ్టులో చూసినందుకు భయపడాలో, వేరే ఒక అమ్మాయితో కనిపించినందుకు (ఆ భంగిమలో) మొహం తిప్పుకోవాలో ఆ ముగ్గురికీ తెలియలేదు.

రవితేజకయితే, నిద్రలోకి ఎప్పుడు జారుకున్నాడో, తన వక్షాన్ని ఆమె ఎప్పుడు తల దిండుగా చేసుకుందో అర్థంకాలేదు.

అందరికన్నా ప్రియంవద స్థితి మరీ అన్యాయంగా వుంది.

సిగ్గుతోనూ, లజ్జాభావంతోనూ ఆమె చప్పున లేచి నిలుచుంది. అందరిలోకీ ముందుగా తేరుకున్నది రవితేజ!

తెరిచి వున్న తలుపులోంచి బయటికి అడుగుపెట్టాడు. క్షణాల్లో అతడు ఆ సంస్థ అధికారిగా మారాడు.

"టైమ్ ఆఫీసులో ఎవరున్నారో పిలువు" అని వాచ్ మెన్ ని ఆజ్ఞాపించాడు. మరు నిముషం సెక్యూరిటీ మొత్తం అతడిముందు గజగజా వణుకుతూ నిలబడ్డారు.

"లిఫ్ట్ ఆఫ్ చేసేముందు పైన ఇంకా ఎవరయినా వున్నారో లేదో చూసుకోనవసరం లేదా?"

ఎవరూ మాట్లాడలేదు. "బోయ్ ఏం చెప్పాడు మీకు?"

"టాక్సీ పంపమని చెప్పాడు సార్".

"మరి పంపారా?"

"పంపాము సార్."

"ఎక్కడికి?"

"ఇంటికి" అన్నాడు ఆ సర్దార్జీ. రవితేజకి నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు. ఇక వాళ్ళని తిట్టికూడా లాభంలేదు అనుకున్నాడు. "బయట ఏమైనా వెహికల్స్ వున్నాయా?" అని అడిగాడు.

"క్లాత్ వాన్ వుంది సార్."

"పంపించు-"

అంతా హడావుడిగా వుంది. వాన్ లో ప్రియంవదని దింపి, అతడి ఇంటికి బయలుదేరాడు. సగం కూర్చునీ, సగం పడుకునీ నిద్రపోవటం వల్ల వళ్ళంతా నొప్పులు. తల దిమ్ముగా వుంది. వాను వెళ్తూవుంటే తల వెనక్కి వాల్చి అలసటగా కళ్ళు మూసుకున్నాడు.

ఒక్కసారి ఎమ్.డి. వెళ్ళిపోగానే, అప్పటివరకూ క్రింది జనంలో వున్న టెన్షన్ పోయింది. టెన్షన్ పోగానే, ఈ వార్త అందమైన రెక్కలు తొడుక్కుని విహరించటానికి బయలుదేరింది.

రవితేజ టెక్స్ టైల్స్ ఎమ్.డి. తన సెక్రటరీతో రాత్రంతా లిఫ్ట్ లో గడిపాడంటే......ఏదో పొరపాటున మధ్యలో లిఫ్ట్ ఆగిపోయిందంటే-అందులో 'మసాలా' పూర్తిగా లేదు. మొదటి వ్యక్తినుంచి రెండో వ్యక్తి- రెండో మనిషినుంచి మూడో మనిషి - వరకూ అది సవ్యంగానే వెళ్ళింది. అవతలివాడికి ఈ కథ 'ఇలాగే' చెప్తే అందులో "వినే ఆసక్తి" వుండటం లేదని గ్రహించిన ఇవతలివాడు- ".....తెల్లవార్లూ గదిలో గడిపి, మూడోకంటికి తెలియకుండా బయటపడే ప్రయత్నంలో సెక్యూరిటీకి దొరికిపోయారు" అనే ఉప్పూకారం జల్లి, అవి వినేవాడి మొహంలో సంభ్రమాశ్చర్యాల్ని కలిగించాడు.

ఇలా పాకిన ఈ వార్త వాన్ కన్నా వేగంగా ప్రయాణంచేసి, రవికన్నా ముందే మాధవిని చేరుకుంది. అతడు వెళ్ళేసరికి ఆమె రణరంగానికి సిద్దమై వుంది.

"వచ్చారా? తెల్లవారిందా? అక్కడే వుండలేకపోయారా?" అని ప్రారంభించింది. అతడికి ముందు అర్థంకాలేదు.

"ఎందుకలా ఏమీ ఎరగనట్టు మొహం పెడతారు? మనం చూడకపోయినా మనని లక్ష కళ్ళు గమనిస్తూ వుంటాయని గ్రహిస్తే మంచిది. ఇంతకూ ఎవత్తె అది?"

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థం అవుతుందా?"

"ఎందుక్కాదూ? నాకు కాకపోయినా ప్రపంచానికి అర్థం అవుతుంది. మరీ ఇంత బరితెగిస్తారనుకోలేదు. మధ్యాహ్నాపూట ముసలి సెక్రటరీతో కళ్ళారా చూసి గడ్డిపెట్టినా మీకు బుద్ధి రాలేదన్నమాట."

"....మాధవీ!"

"ఇప్పుడు దాన్ని తీసేసి ఎవరో వగలాడిలా ఉద్యోగమిచ్చి ఇక రాత్రిళ్ళు కూడా అక్కడే మకాం పెట్టారన్నమాట. అయ్యో భగవంతుడా నేనేం చేతున్రా దేముడో" అంటూ గొంతెత్తి రాగం తీయటం ప్రారంభించింది.

"నీకేమన్నా మతిపోయిందా? ఆఫీసులో పని ఎక్కువుండి రాత్రి ఆలస్యంగా వస్తూంటే లిఫ్టు ఆగిపోయింది."

"చెప్పండి చెప్పండి. రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని వినేవాళ్ళుంటే ఎన్ని కథలైనా చెప్పుతారు. మా అమ్మా నాన్నలకి చెపుతూనే వున్నాను. నేను చేసుకోను మొర్రో అంటున్నా నిలువునా నా గొంతు కోశారు. ఇప్పుడిక ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే-"

ఆమేనా మాట్లాడుతూంది? తన భార్యేనా మాట్లాడుతూంది? అన్నంతగా నిర్విణ్ణుడై చూశాడామెని. ఈ లోపులో బయట అలికిడి వినిపించింది. అతడు స్వరం తగ్గించి, "మాధవీ బైట పనివాళ్ళు అందరూ వింటున్నారు కాస్త నెమ్మదిగా మాట్లాడు" అన్నాడు.

"ఏం? ఎందుకు మాట్లాడాలి? ఎవరికి తెలీని భాగోతం? రాత్రంతా ఆఫీసు రూమ్ లో ఆడితే లేదుగానీ, ఇంట్లోవాళ్ళకి తెలుస్తే వచ్చిందా ప్రమాదం. ఈ రోజు అటో ఇటో తేలిపోవాల్సిందే."

అతడి సహనం నశించింది. "ఏమిటి తేలిపోవల్సింది? ఏమిటి తేలుస్తావు చెప్పు" అని అరిచాడు. అతడు అలా ఎదురు తిరిగేసరికి ఆమె కొద్దిగా బెదిరినా, తను కూడా కంఠం హెచ్చిస్తూ, "అయ్యో అయ్యో - అంతవరకూ వచ్చిందా? అదెవత్తో మీకు మందు పెట్టింది. ఇంక ఈ కాపురాన్ని ఆ దేవుడే రక్షించాలి" అంటూ బిగ్గరగా రోదించింది.

"ఎవరూ నాకు మందు పెట్టలేదు. ఈ కాపురంలో విషంపోస్తూంది నువ్వే. ఏనాడైనా ఒక్కరోజైనా సుఖంగా కాపురం చేశావా?" "అనండి. అనండి. నన్నే అనండి."

అతడు వినిపించుకోకుండా కొనసాగించాడు. ఇద్దరూ కొద్దిసేపు ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ వినిపించలేదు. అతడు వున్నట్టుండి స్వరం హెచ్చించి-

"నువ్వు అనుకున్నట్టు నాకు ఏ సంబంధమూ లేదు. నేనెవరితోనూ డ్రాయింగ్ రూమ్ లో కూర్చొని చేతులు చూపించుకోలేదు. నేనెవరితోనూ సెకెండ్ షోలకి వెళ్ళలేదు" అని అరిచాడు.

మాధవి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "ఏమిటి? ఏమిటన్నారూ?" అంటూ ముందుకొచ్చింది.

"మానసిక వ్యభిచారంకన్నా వ్యభిచారం మంచిదంటున్నాను. ఏం తప్పా?" అతడూ రెట్టించాడు.

"పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనబడిందని, మీరు తిరుగుబోతులు కాబట్టి - తాగుబోతులు కాబట్టి- నన్నూ-"

ఆమె  మాట పూర్తికాలేదు. అతడు లాగి పెట్టి ఆమె చెంపమీద బలంగా కొట్టాడు. అంతే, ఆ గదిలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. ఆమె కనుగుడ్డు మెలిదిరిగినట్టు అయింది. ఎక్- ఎక్ - మన్న శబ్దం ఆమె నోటివెంట వచ్చింది.

వెనక్కి విరుచుకు పడిపోయింది.

అతడు నిరుత్తరుడయ్యాడు.

ఆమె మొహం అటూ ఇటూ కదులుతూంది. నాలుక పళ్ళ మధ్య నలుగుతూంది. ఏదో స్ఫురించిన వాడిలా అతడు తాళం చేతులు తీసుకొచ్చి గబగబా ఆమె చేతులమధ్య బలవంతంగా పెట్టాడు. అప్పుడే వచ్చినట్టు ఇద్దరు నౌఖర్లు లోపలికి వచ్చారు. అది పట్టించుకోకుండా వారిని పురమాయించి, ఆమెని పక్కమీదకు చేర్చి డాక్టరుకు ఫోన్ చేశాడు.

అయిదు నిముషాల్లో డాక్టరు వచ్చాడు. ఇంజెక్షన్ ఇచ్చి హిస్టీరియా లక్షణాలు కనపడుతున్నాయని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇల్లంతా శ్మశాన నిశ్శబ్దం అలుముకుంది. నౌఖర్లందరూ అక్కడక్కడా చేరి గుసగుసలాడుకుంటున్నారు. జరిగిన అసహ్యకరమైన సంఘటనతో అతడికి తల కొట్టేసినట్టయింది. తన గదిలోనే చాలాసేపు కూర్చున్నాడు కాని ఈ రోజు కాకపోయినా రేపయినా బయటి ప్రపంచంలోకి రావల్సిందే కదా అనుకుని కొంచెం సేపట్లో మానసికంగా సన్నద్ధుడై బయటకొచ్చాడు.

అతడు క్రుంగిపోతే చూద్దాం అనుకున్న నౌఖర్లకీ, పనివాళ్ళకీ, అయిదు నిముషాల్లో అతడు మామూలు మనిషిగా మారి ఆజ్ఞలివ్వడం చూసి మతిబోయింది. అసలేమీ జరగనట్టు, ఆ మాటకొస్తే మరింత కఠినంగా అతడు వ్యవహరించాడు.

ఆ రోజు ఆఫీసుకి కూడా మామూలుగానే వచ్చేసేడు. తన వెనకాల ఎవరేమనుకున్నారో గానీ, ముందైతె బయటపడలేదు. ఒక్క శర్మకి మాత్రం జరిగింది చెప్పాడు. ఆయన ఎగిరిపడి, మొత్తం టైమ్ ఆఫీసు స్టాఫునంతా మార్చేస్తానన్నాడు. ఆయనకి సర్దిచెప్పేసరికి ఎంతో కష్టమయింది.

ఆ తరువాత అరగంటకి పాండేనుంచి ఫోన్ వచ్చింది. ఆయన ఒక్కడే దీన్నంతా పెద్ద జోక్ గా తీసుకున్నాడు. "అందుకే నేను కారు పంపుతానన్నాను. వినలేదు నువ్వు. మంచి డ్రింకు మిస్సయ్యావు. మంచి నిద్ర మిస్సయ్యవు" అన్నాడు. రవి నవ్వి థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేశాడు.

అతడికొక్క విషయం స్ఫుటంగా అర్ధమయింది. ఈ ప్రపంచం కుక్కలాటిది. పరుగెడ్తే మొరుగుతూ వెంటపడుతుంది.

వేటాడితే పరుగెడుతుంది.

ఈ వార్త అందరికీ తెలిసిందనేసరికి క్రుంగిపోయాడు. ఏమవుతుందో ఏమో అనుకున్నాడు. కానీ తాను లేచి నిలబడి రొమ్ము విరుచుకునేసరికి....ఏమీ అవలేదు. ఇంత చిన్న విషయం కోసం సమాజం- సంఘం-లోకులు ప్రపంచం అనే పదాలు పెట్టుకుని మనుష్యులు నానాబాధలూ పడిపోతూ వుంటారు.

ఈ రకమైన ఆలోచన వచ్చేసరికి అతడికి కొత్త ఉత్సాహం కలిగినట్టయింది. ఇంతకాలం తనెందుకు ఇన్ని సుఖాల్ని వదిలేసుకున్నాడో అర్థంకాలేదు.

అంతలో మానేజర్ వచ్చి కొత్త ప్రపోజల్ తాలూకు ఫైల్ను చూపెట్టాడు. తన ఆలోచన్లని పక్కకునెట్టి ఫైల్ను చూడటం ప్రారంభించాడు. పోస్టుద్వారా చౌకధరలకి చీరలు అందించే ప్రపోజల్ అది. అది కార్యరూపం ధరిస్తే - దాదాపు నూరు రూపాయలకే మంచి చీరలు ఇవ్వొచ్చు.

"మళ్ళా ఈ ఫైలు నా దగ్గిరకి ఎందుకు వచ్చింది?" అని అడిగాడు.

"ఒక డైరెక్టరు- 'దీన్ని గురించి మళ్ళీ ఆలోచిద్దాం' అని వ్రాశారు.

"ఒకసారి మీటింగులో మెజారిటీ ఒప్పుకున్నాక మళ్ళీ చర్చించవలసిన పనిలేదని చెప్పండి" అన్నాడు. అదే క్రితంరోజయితే అంత దృఢంగా అనగలిగివుండేవాడు కాడు. అతడికే ఆశ్చర్యం వేసింది.

మానేజర్ వెళ్ళిపోయాక శర్మతో ఫోన్లో మాట్లాడాడు.

"రకరకాల వేస్టుఖర్చులు తగ్గించుకుంటే రెండొందల చీరెని వందకే అమ్మొచ్చు. ఇంతకాలం అనవసరంగా జనంమీద ఈ ఖర్చులన్నీ రుద్దాం. ఎందుకు ఎవరో డైరెక్టరు దీన్ని వ్యతిరేకిస్తున్నారట?" అని అడిగాడు.

"పుస్తకమైనా- చీరైనా అందంగా, ఎక్కువ వేలకి చూపిస్తేనే కొంటారనీ, చౌకగా ఇస్తామంటే నాసిరకమేమో అని అనుమానపడతారనీ మన డైరెక్టర్ల భయం-" అన్నాడు అట్నుంచి శర్మ.

"చూద్దాం ఏమవుతుందో. ఈ స్కీము ఫెయిలైతే అదే చీరని మూడొందలకి అమ్ముదాం. అప్పుడు కనీసం ఈ జనాల మూర్ఖత్వాన్ని మార్చలేం అన్న సంతృప్తి అయినా మనకు మిగులుతుంది."

శర్మ నవ్వేడు. "ఇంతకూ అడ్వర్టైయిజ్ మెంట్ బడ్జెట్ ఎంత వేశావు."

"డెబ్బై అయిదు లక్షలు".

"మైగాడ్ అంతా."

"అవును. అంత లేకపోతే ఈ స్కీము జనంలోకి వెళ్ళదు."

"సరే, బెస్టాఫ్ లక్-"

రవితేజ ఫోన్ పెట్టేసి, ట్రేలో కాగితం తీసుకున్నాడు. యధాలాపంగా చూసినవాడల్లా, మిగతాది చదువుతూ వులిక్కిపడ్డాడు. అది ప్రియంవధ రాజీనామా లేఖ. ఆమె ఆ రోజు ఆఫీసుకు రాలేదు.

చాలాసేపు దాన్నే చూస్తూ వుండిపోయాడు.

ఆ సాయంత్రం ఆఫీసు వదలి వెళ్ళబోతున్నప్పుడు మామూలుగా అడిగినట్టు అడిగి పెర్సనల్ ఫైలు తెప్పించుకున్నాడు. అందులో ఆమె అడ్రస్సు చూశాడు.

కార్లో అక్కడికి బయల్దేరాడు. ఎవరన్నా చూస్తారని అతడు ఈసారిభయపడలేదు. క్రితంరోజు జరిగిన సంఘటన అతడికి కొత్త ధైర్యాన్నిచ్చింది.

ప్రియంవద ఇల్లు మెడమీద.

మెట్లెక్కిబెల్ కొట్టాడు. ఆమెవచ్చి తలుపు తీసింది. ప్రొద్దున్నించి, ఏడుస్తున్నట్టు కళ్ళు వాచి వున్నాయి. అతడిని ఆ సమయంలో వూహించనట్టు ఆమె అడుగు వెనక్కి వేసింది.

అతడు లోపలికి ప్రవేశించాడు. ఇద్దరూ ఒకర్నొకరు చూసుకొన్నారు. ఆమె దగ్గరికి వచ్చిందో, అతడే తీసుకున్నాడో తెలీదు గానీ-క్షణం గడిచేసరికి అతడి ఛాతీమీద ఆమె తల వుంచి రోదిస్తూంది. అతడు నెమ్మదిగా ఆమె తల పైకెత్తి నీళ్ళు తుడిచాడు. అలా దగ్గిరైన మొహాలు వెంటనే.

ఊహ తెలిసిన తరువాత, భార్య తరువాత తనకు తానుగా స్పృశించిన మొదటి స్త్రీ శరీరం అది. ఆ స్పర్శ తరువాత, మెదడు ఆలోచించే స్థితికి చేరుకున్న తరువాత, అతడికీ ఆ తేడా తెలిసింది. చాలా తీవ్రమైన తేడా అది. పదిసార్లు ఉతికిన ఇస్త్రీ చొక్కాకీ, అప్పుడే షాపునుంచి కొన్న చొక్కా వేసుకోవటానికీ వున్నంత తేడా! ప్రెష్ నెస్.....ఉహూ

అదొక్కటేకాదు ఇంకా ఏదో వుంది. ఆమె దగ్గిరకి రావటంలోనూ, మెడచుట్టూ చేతులు వేయటంలోనూ!.....అంతకుముందు మాధవి సామీప్యంలో లేని పరిమళం ఏదో కనపడింది అతడికి. 'కళ్ళ'కి కనబడే పరిమళం అది.

జీవితంలో పోలిక తెలియనంతవరకు ఫర్వాలేదు. ఒకసారి పోలిక తెలిసిన తరువాత లభ్యమైనదానికన్నా అలభ్యమైనదే బావుంటుంది. అందీ అందకపోవటంలో వున్న అందమే ఆకర్షణ అయి, బలమైన తపనగా మారుతుంది.

ప్రపంచం అంతా వేలెత్తి చూపుతున్నప్పుడు, చివరికి భార్యకూడా అతడిని వెళ్ళగొట్టినప్పుడు, అతడొక్కసారిగా ఈ శృంఖలాలు తెగ్గొట్టుకున్నప్పుడు, ఆ ట్రాన్స్ లో ఈ కొత్త అనుభవం ప్రాప్తమైంది. రోజూ చూసే మాధవి- పుట్టినప్పటినుంచీ ఎత్తుకు తిరిగిన మాధవి- తనముందే గౌనుతో ముక్కు తుడుచుకున్న మాధవి- చివరికి భార్య అయి, భార్య అయిన రోజునుంచీ దూరమయి, ఇవ్వలేని సుఖాన్ని ఆమె ఒక్క ముద్దుతో యిచ్చింది. అంత పెద్ద టెక్స్ టైల్స్ ఎగ్జిక్యూటివ్ కీ, ముద్దులో అంత అందముందని అప్పుడే మొట్టమొదటిసారి తెలిసింది. దుఃఖం క్షణాల్లో ఆవేశంగా మారి అతడిని నిలువునా ముంచెత్తింది. అతడు భుజంమీద చెయ్యివేసి ముందు ఆమెని ఓదార్చాడు. అతడి ఛాతీమీద ఆమె తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్చింది. అతడి చెయ్యి అప్రయత్నంగా మొదట క్రిందికి దిగిందో, లేక ఆమె తలే ముందు పైకి లేచిందో తెలీదు. క్రిందికి దిగిన చెయ్యి నడుము మెలికలో చిక్కుపడి అక్కడే ఆగిపోయింది. క్రిందికి దిగిన తలకి పెదవి చెలమల్లో అమృతం దొరికింది. అయితే అదంతా క్షణంసేపే.

ఆమె చప్పున అడుగు వెనక్కివేసి, "వద్దండీ, ప్లీజ్ వెళ్ళిపోండి" అంది కంగారుగా. "... ఇప్పటికి జరిగింది చాలు."

అతడామెని వదలకుండా, "లేదు ప్రియంవదా! ఇన్నాళ్ళూ అవసరమైన వాటికి విలువనిస్తూ నేను చాలా పోగొట్టుకున్నాను. ఇక దేన్నీ వదులుకోదల్చుకోలేదు" అన్నాడు.

ఆమె సందిగ్ధంగా తల దించుకుంది. అతడు తిరిగి ఆమెని దగ్గిరకు తీసుకున్నాడు. ఈసారి ఆమె అతడిని ముద్దు పెట్టుకుంది.

టెక్నిక్!

అదీ ఆమెలో ప్రత్యేకత!! అది పుట్టుకతోనే స్వభావసిద్ధంగా వచ్చిందై వుండాలి. అనుభవంవల్ల రాదు. మనిషికి తినటానికి నోరు, పనిచేయటానికి చేతులు, నడవటానికి కాళ్ళు, వాటిని కలపటానికి నడుము ఇచ్చాడు దేముడు. కేవలం ఒక్క సమయంలో మాత్రమే వాటిని వేరే ఇంకొక పనికి వినియోగించుకునే అవకాశం మనిషికి ఇచ్చాడు. దురదృష్టవశాత్తు కొంతమంది మాత్రమే వాటిని సద్వినియోగపరుచుకునే కళ కలిగివున్నారు. అలాటి కళవున్నా కొద్దిమందిలో ఆమె ఒకత్తె! వైవాహిక జీవితంలో అంత అనుభవం వున్న అతడికే ఆమె క్షణకాలపు సామీప్యత మతిపోగొట్టింది. ఇరవై రెండేళ్ళ వయసులో స్త్రీ పురుషుడి స్పర్శ మొట్టమొదటిసారిగా తగలగానే అలా మైనంలా

వేడెక్కిపోతుందనీ, కరిగిపోతుందనీ అతడికి తెలీదు. మాధవిలో అటువంటి తీవ్రత అతడేనాడూ చూడలేదు. అసలామెను ఇటువంటి సామీప్యానికి తీసుకురావటానికే అతడికి ఆర్నెల్లు పట్టింది. మాధవి దృష్టిలో 'అది' అంటే, పురుషుడి ఆనందంకోసం స్త్రీ ప్రతిరోజు ఇష్టంలేకపోయినా చేసే త్యాగం! ఆమె అతడిని ఎంత ప్రభావితం చేసిందంటే- అతడు కూడా నిజంగా అది నిజమేనేమో, స్త్రీకి అది చాలా బాధాకరమైన చర్య ఏమో, కేవలం భర్తని సంతృప్తిపరచటానికే ఒప్పుకుంటుందేమో అని నమ్మే స్థితికి వచ్చాడు.

పొరలు పొరలుగా అతడి అనుమానాల్ని విడగొట్టింది ఆ ముద్దు. ఒక రంగంలో ఎంతో నిష్ణాతుడైన వ్యక్తి కూడా, మరొక విషయంలో ఎంత అంధకారంలో వుంటాడో చెప్పటానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

అంతలో అలికిడై అతడు ఆమెను చప్పున వదిలేసి వెను దిరిగాడు.ఆమెకూడా వెనక్కి అడుగువేసి సర్దుకుంది.

"ఏమ్మో ఎవరు వస్తిరి? ఏదో అలికిడి అయినట్టులా ఉంది" అంటూ ప్రవేశించాడు ఒక అరవాయన. ప్రియంవద ముందుకు రేగిన జుట్టును వెనక్కి తోసుకుంటూ, "రండి రండి" అంటూ పరిచయం చేసింది. ఇబ్బందికరమైన స్థితి లోంచి వెంటనే సర్దుకోవటం స్త్రీకి వచ్చినంత గొప్పగా పురుషుడికి రాదు. అతడింకా క్షణం క్రితపు మైకంలోనే వున్నాడు. "ఈయనా?" అన్నాడు - ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలాన్ని కళ్ళల్లో నింపుకుని సౌందరరాజన్.

"నేను పనిచేసే బట్టల ఫ్యాక్టరీలో నాతోపాటు పనిచేస్తారు. పేరు సుబ్బారావు" అంది ప్రియంవద- రవితేజ అసలు పేరు చెప్పకుండా అంతే దాదాపు అరగంటసేపు బట్టల గురించీ, పంపునీళ్ళ గురించీ బోరుకొట్టాడు. మధ్య మధ్యలో ప్రియంవద మంచితనం గురించీ, ఈ కాలం అమ్మాయిలు ఎలా చెడిపోతున్నారో కానీ వాళ్ళకి ప్రియవంద ఏ విధంగా భిన్నమో చెప్పాడు. అరగంట తరువాత ప్రియంవద యిచ్చిన కాఫీ తాగి వెళ్ళిపోయాడు.

"ఐ యామ్ సారీ" అందామె అతడు వెళ్ళిపోయాక.

"ఫర్వాలేదు ఒక రకంగా మనల్ని ఆ మూడ్ లోంచి బయటకు తీసుకువచ్చాడు" అన్నాడు రవి లేస్తూ. "ముఖ్యంగా నేను వచ్చింది దేనికంటే- నిన్ను రాజీనామా ఉపసంహరించుకొమ్మని చెప్పటానికి. ఎవరో ఏదో అనుకుంటారని మనం 'భయపడటం' అనవసరం ప్రియంవదా! రేపు నువ్వు ఆఫీసుకు వస్తున్నావు అంతే."

ఆమె ఏదో చెప్పబోయింది.

"నీ తరపునుంచీ, నా తరపునుంచీ నేనే ఆలోచించాను. నా మాటమీద ఏమాత్రం గౌరవంవున్నా, నా మీద ఏ కొద్దిగా ప్రేమ వున్నా, నువ్వు తిరిగి జాయిన్ అవుతున్నావు" అన్నాడు. ఆమె కొద్దిగా ఆగి, నెమ్మదిగా, 'సరే' అన్నట్టు తలూపింది.

## 18

**రవితేజ టెక్స్ టైల్స్** వారి సరికొత్త ఫాషన్ 'జనతా' చీరల తాలూకు మొట్టమొదటి దూరదర్శన్ ప్రకటన వచ్చి ఆ రోజుకి మూడు రోజులయింది. అంతకు పదిరోజుల ముందు నుంచీ కేవలం పత్రికల్లో మాత్రమే ప్రకటన ఇచ్చుకుంటూ వస్తున్నారు. ఈ అమ్మకాల్ని ప్రయోగ పథకంగా ముందు ఒక్క రాష్ట్రానికే కుదించారు. దానికి ఆంధ్రప్రదేశ్ ని ఎన్నుకున్నారు.

రకరకాల అందమైన మోడల్స్ ఈ జనతా చీరల్ని కట్టుకుని కెమేరా ముందు నడుస్తూ వుండగా ఆ చీరె కోడ్ నెంబరు చెప్పటం; రంగుల్ని విశ్లేషించటం-కామెంటరీలా నడిచినయ్. అదే చీర షాపులో కొంటే ఎంతవుతుంది? దానికి కారణాలేమిటి? సరాసరి ఫ్యాక్టరీనుంచి తెప్పించుకుంటే ఎంత చౌకగా లభిస్తుంది? అలా తెప్పించుకోవాలంటే పోస్టుద్వారా ఏం చెయ్యాలి?.....వగైరా వివరాలన్నీ పత్రికల్లోనే ప్రకటనల ద్వారా ఇచ్చారు, ఆ ప్రకటనల్లోనే ఫలానా ఫలానా రోజులలో దూరదర్సన్ చూడండి అని కూడా ప్రకటించారు.

ఆ రోజు రాత్రి దూరదర్శన్ లో వచ్చిన ఆ ప్రోగ్రాం ని రవితేజ దగ్గిరుండి నిర్వహించాడు. అతడు చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. పొట్టి-సన్నం-నలుపు, పొడుగు-సన్నం-నలుపు, పొడుగు-లావు-తెలుపు, మధ్యరకం- సన్నం-ఛామనఛాయ, పొడుగు-సన్నం-తెలుపు, ఇలా రకరకాల కాంబినేషన్స్ లలో మోడల్స్ ని ఎన్నుకుని తనకి చీరలమీద వున్న పరిజ్ఞానం అంతా ఉపయోగించి ఆయా రకాల చీరలు కట్టించి కెమేరాలో బంధింపచేశాడు. అతడు ఎక్కడ జాగ్రత్త తీసుకున్నాడంటే- 'ఈ చీర బావుంటుంది' అని చూసేవాళ్ళకి అనిపించనివ్వకుండా, 'ఈ చీర తను కట్టుకుంటే బావుంటుంది' అనిపించేలా అన్నిరకాల స్ట్రక్చర్స్ నీ ప్రెజెంట్ చేశాడు. వాళ్ళ సబ్ కాన్షస్ మైండ్ లో "ఓహో! నేనిలా వుంటాను కాబట్టి ఈ చీర నాకింత బావుంటుందన్నమాట" అనిపించేలా చేశాడు. ఇంతవరకూ ఈ ప్రయోగాన్ని ఎవరూ చేయలేదు. కదిలే బొమ్మల్లాటి అమ్మాయిలు చీరలకి అందాన్ని తెచ్చారు.

కాదు కాదు చీరలు కదిలే మనుష్యులకి అంత అందాన్ని తెచ్చాయనిపించాడు. దూరదర్సన్ లో అడ్వర్టైయిజ్ మెంట్స్ మీడియాని ఇంతకు ముందెవరూ వాడుకోలేనంతగా ఉపయోగించుకున్నాడు. రెండోరోజు గడిచేసరికి ఉత్తరాలు రావటం ప్రారంభమైనాయి. మూడోరోజు గడిచేసరికి రెండు గదులు నిండిపోయాయి. సామాన్యమైన రాబడి వున్నవారు, ఇంతకన్నా క్రింది తరగతి వారు కూడా వందరూపాయలకి ఆర్.టి. చీర అనేసరికి, వందకి పట్టుచీర దొరికినంత సంబరపడ్డారు.

సేల్స్ డైరెక్టర్ ఆ గదిలోకి వచ్చేసరికి రవితేజతోపాటు మరొక డైరెక్టర్ కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

"ఈ రెండు రోజుల్లో మన చీరలకి ఎన్నొచ్చినయ్ ఆర్డర్లు?" అని అడిగాడు రవితేజ.

"లక్షా యాభై వేలు సర్".

కాఫీ తాగుతున్న డైరెక్టర్ కి పొలమారి మీదపడింది కాఫీ. "ల....క్షా......యా.....భై ....వేలా?" అన్నాడు దగ్గుతూ. రవితేజ దీని గురించి ఆలోచించటం లేదు.

ఆంధ్రప్రదేశ్ లో ఆరుకోట్లమంది జనంలో టీ.వీ. చూసే వాళ్ళు, ప్రకటనలు చదివేవాళ్ళు, దీన్ని గురించి విన్నవాళ్ళు, ఒక కోటిమంది వున్నారనుకుంటే, అందులో చీరలు కట్టేవాళ్ళు యాభై లక్షలు అనుకుంటే, కనీసం మూడు శాతం మంది దీనికి స్పందించారు. ఇంత చిన్న పరిధిలో ఇంత పెద్ద రెస్పాన్సు అనూహ్యం. ఈ లెక్కన పూర్తి అడ్వర్టయిజ్ మెంట్ తో దాదాపు ప్రత్యర్థులందర్నీ పడగొట్టెయ్యొచ్చు.

కంగ్రాట్స్ రవితేజా! ఇన్నాళ్ళకి మళ్ళీ నీకు ఆయుధం దొరికింది!! తక్కువ ఆదాయం కలవాళ్ళకే కాక, రోజుకో చీర మార్చే వారికి కూడా ఈ ఫాషన్స్ నచ్చటం అదృష్టం.

-రవితేజ కంపెనీలో అతడు ఇలా విజయపు మొదటి కప్పురుచి చూస్తూ వుండగా, అదే సమయానికి అక్కడ చెంచురామయ్య కంపెనీలో డైరెక్టర్లు బారుగా కూర్చుని వున్నారు.

రవితేజ ప్రవేశపెట్టిన స్కీము తాలూకు ప్రచారాన్ని చర్చించటానికి వారు సమావేశమయ్యారు. సాధారణంగా ప్రతీ కంపెనీ తాలూకు "ఇన్ ఫార్మెంట్స్" అవతల కంపెనీలో కొందరు ప్లాంట్ చేయబడతారు. అక్కడ విషయాలు ఇక్కడ చేరవేయటం వారిపని. అయితే ఇక్కడ మరొక విషయం కూడా గుర్తించాలి. అవతలివాళ్ళ విజయాన్ని ఇవతలి గ్రూపు అంత తొందరగా ఒప్పుకోరు. ఒక సినిమా విడుదల అవుతే మిగతా సినిమా కంపెనీలన్నీ ఎలా దాన్ని "ఫ్లాప్" అనేస్తాయో, అదే మనస్తత్వం మిగతా అన్ని రంగాలకీ వర్తిస్తుంది. అటువంటి పరిస్థితుల్లోనే, రవితేజ సాధించిన ఈ విజయాన్ని చెంచురామయ్య వెంటనే ఒప్పుకోలేకపోయాడు. రెండురోజుల్లో లక్షా యాభైవేలకి ఆర్డర్లేమిటి, మరొకసారి సరిగ్గా కనుక్కొని రమ్మని పంపాడు. రవితేజ పూర్తిగా పడిపోవటానికి ఇంకెంతో సమయంలేదని అతడి నమ్మకం.

ఇటువైపు రవితేజ ఎవరికీ ఆలోచించటానికి టైమ్ యివ్వలేదు. ఈ కెరటపు తాకిడినుంచి ఇంకా తేరుకోకముందే వాళ్ళని వెల్లువలో ముంచెయ్యాలన్నది అతడి ఆలోచన.

ఆంధ్రదేశంలో సఫలమయిన ఈ ప్రయోగాన్ని దేశమంతా విస్తరించాలని అతడి కోర్కె అయితే అది ఎప్పుడో కాకుండా, అవతలివారికి ఊపిరి తిరిగే లోపులో జరగాలని అతడి వాంఛ. ముందు అనుకున్నట్టు దీనికోసం ఎనభై అయిదు లక్షలు కేటాయించటం జరిగింది. కేటాయించటమైతే జరిగింది కానీ, క్యాష్ ఇన్ ఫ్లో కావాలి. ఇంతకన్నా పెద్ద సమస్య మరొకటి వుంది. దేశం అన్ని వైపుల్నుంచీ ఒక్కసారిగా ఈ చీరలకోసం తాకిడి ఏర్పడితే దాదాపు కోటి చీరలను ఒకటి రెండు నెలలలోగా సప్లై చేయవలసి వుంటుంది. అన్ని వనరులు సమకూర్చుకోవాలంటే, యుద్ధ ప్రాతిపదిక మీద పనులు చేయవలసి వుంటుంది. దీనికోసం ఎంత లేదన్నా మరొక కోటి రూపాయలు కేటాయించాలి.

రవితేజ వెనక్కి తగ్గదల్చుకోలేదు.

పాలియెస్టర్ విభాగాన్ని సంవత్సరంపాటు లీజుకి ఇవ్వాలనుకున్నాడు. దానికి 'రాయల్టీ'గా రెండు కోట్ల రూపాయల్ని ఇవ్వటానికి అవతలి కంపెనీ సిద్ధంగా వుంది. ఒక చిన్న కంపెనీ అది. వీరికి ఏ విధంగానూ పోటీ కాదు.

రవితేజ అంచనా ప్రకారం ఈ జనతా చీరల తాకిడి ఇంత ఉధృతంగా మరో సంవత్సరంపాటు వుంటుంది. ఆ తరువాత ఆ వ్యాపారం కూడా మళ్ళీ మామూలు గాడిలో పడిపోతుంది. కాబట్టి సంవత్సరంపాటు పాలియెస్టర్ విభాగాన్ని ఇంకొకరికి లీజుకి ఇవ్వటంలో నష్టమేమీ లేదు.

ఈ జనతా చీరలవల్ల కొన్ని లక్షలమందికి పని దొరుకుతుంది. పైగా ప్రియంవద మాటలు అతడి మనసులో లోతుగా నాటుకుపోయాయి. ఎన్నో క్రింది తరగతి కుటుంబాలకి సహాయం చేసినట్టు అవుతుంది. మరింత అందమైన చీరలు చౌకధరకి!

ఎప్పుడూ లాభాలు..... వ్యాపారమూ ఇదేనా? కొన్ని లక్షల మందికి ఉపాధికల్పన-కొన్ని కోట్లమందికి ఆనందం- మనిషిగా పుట్టినందుకు ఆ మాత్రం బాధ్యత లేదా?

-దీనివల్ల కంపెనీకి కూడా నష్టం ఏమీలేదు. కేవలం ఒక లైనులో వ్యాపారం తగ్గించి, మరొక లైనులోకి వెళ్ళటమే!

అయితే రవితేజ టెక్స్ టైల్స్ డైరెక్టర్లు కొంతమంది అలా ఆలోచించలేదు. అన్ని విభాగాల్లోకి పాలియెస్టర్ లోనే ఎక్కువ లాభాలున్నాయి. ప్రజలు ఎంత ధరకైనా ఈ చీరలని కొంటారు. జనతా చీరల్లో, చీరకి అయిదు రూపాయలన్నా లాభం వుండదు. ఇంతమంది షాపులవాళ్ళని కాదని, ఇంత శ్రమపడి కోట్లకొద్దీ చీరలు తయారుచేసి, ఇంత పెట్టుబడి పెట్టి, జనతా చీరలు అమ్మటం దేనికి? కేవలం చీరకి అయిదు రూపాయలు లాభం కోసమా?

కొద్ది చీరలైనా ఖరీదైన చీరలు తయారుచేసుకుంటే చీరకి అయిదొందలు చొప్పున లాభం వుంటుంది. వంద జనతా చీరలు అమ్మటంకన్నా ఒక ఖరీదైన చీర అమ్మటం లాభదాయకం.

సాయంత్రానికి, ఒక డైరెక్టరు ఎక్స్ ట్రార్డనరీ మీటింగ్ కి నోటీసు యిచ్చాడు. యాభై సంవత్సరాల కంపెనీ చరిత్రలో అదే ఆ రకం మొట్టమొదటి మీటింగు.

రవితేజ మానసికంగా బాగా క్రుంగిపోయాడు. ఒక మంచి పనికి కూడా యిన్ని అడ్డంకులు, అదీ తనవారి నుంచి! డబ్బు సంపాదిస్తున్నంతకాలం ఎంతో ఆత్మీయంగా వున్నవారు- పరిస్థితి కాస్త ఎదురుతిరిగేసరికి ఎలా మారిపోతారో అతడికి స్పష్టమైంది.

పదిన్నరకి మీటింగు.

రాజీనామా ఉత్తరాన్ని జేబులో పెట్టుకుని అతడు ఇంటి నుంచి బయల్దేరాడు.

* * *

అరగంట తరువాత మీటింగు ప్రారంభమయింది.

నోటీసు ఇచ్చిన డైరెక్టరు తన అభ్యంతరాన్ని బోర్డుముందు వుంచాడు. రావితేజకి యింత డబ్బుని ఒక ప్రయోగం మీద ఖర్చుపెట్టె అధికారాలు లేవనీ, అతడు వాటిని దుర్వినియోగపరుస్తున్నాడనీ అతడి అభియోగం. ఇప్పుడు కంపెనీ చాలా లాభాల్లో నడుస్తూంది. అనవసరమైన రిస్కులు తీసుకోవటం అనవసరం. ముఖ్యంగా పోలియెస్టర్ విభాగం బంగారు బాతులాంటిది. దాన్ని బయటికి యివ్వటం శుద్ధ అవివేకం. ఒకసారి ఆ మార్కెట్టు కోల్పోతే తిరిగి సంపాదించటం చాలా కష్టం.

అతడు మాట్లాడుతున్నంతసేపూ బోర్డు సభ్యులందరూ శ్రద్ధగా విన్నారు. అతడు చెపుతున్నదంతా చాలా కరెక్టుగా వుంది. ముఖ్యంగా, లాభాల విషయంలోనూ, అనవసరమైన జనతా చీరల తయారీ విషయంలోనూ అతడు డైరెక్టర్స్ ని తన మాటల ద్వారా బాగా కన్విన్స్ చేశాడని అర్ధమవుతూంది. ఒకవేళ తన సూచన్లని వినకుండా, కంపెనీ గానీ యధావిధిగా ఈ జనతా చీరల తయారీని కొనసాగించే పక్షంలో తనతో సహా మరికొంతమంది డైరెక్టర్లు కంపెనీ నుంచి తప్పుకోవటానికి సిద్దంగా వున్నారని అన్యాపదేశంగా హెచ్చరించాడు.

అతడికి ఆ కంపెనీలో పెద్దగా వాటాలేదు. కానీ తన మాటల్తో మిగతావారిని బాగా ప్రభావితం చేశాడని అర్ధమవుతూ వుంది. తను కంపెనీ నుంచి వెళ్ళిపోతానని అనటం కూడా కేవలం బెదిరింపే! వెళ్ళిపోవటం వల్ల అతఃదికే నష్టంగానీ, కంపెనీకేమీ లేదు. కేవలం అవతలివారి సైకాలజీ మీద ఆడుకుంటున్నాడంతే.

రవితేజ అతడివైపు సూటిగా చూశాడు.

ఇలాటివాళ్ళు ప్రతీ గ్రూపులోనూ ఒకరో ఇద్దరో వుంటారు. సాధారణంగా ట్రేడ్ యూనియన్స్ లో రెండు వర్గాలుంటే అందులో మైనారిటీ గ్రూప్ లో, ఎక్కువ కనపడుతూ వుంటారు. ప్రతిపక్షంలోనూ, అసెంబలీలోనూ కూడా వుంటారు. వీరేమి ప్రొడక్టివ్ పనిచెయ్యరు. కేవలం తమ వాదనల ద్వారా అవతలివారిని ఆకర్షిస్తారు. సాధారణంగా వీరివి వితండవాదాల్లాగా వుంటాయి. అయినా చాలా బలంగా అవతలివారిని తమవైపు తిప్పుకుంటారు. ప్రస్తుతం బోర్డు డైరెక్టర్లందరూ ఆ ప్రభావంలో వున్నారు. కంపెనీ సజావుగా నడిచిపోతున్నప్పుడు నిజంగా ఎందుకు రిస్కు తీసుకోవటం అన్న ఆలోచన వారిలోనూ అంకురించింది.

మీటింగ్ లంచ్ కోసం వాయిదా వేయబడింది.

లంచ్ లో శర్మ రవి దూరంగా నిలబడి మాట్లాడుకుంటున్నారు.

"నేను ఎటువంటి పరిస్థితుల్లోనూ నా నిర్ణయాన్నుంచి దిగిరాను. ఈ పథకాన్ని మిగతా డైరెక్టర్లు ఒప్పుకోకపోతే నేను ఈ పదవిలో వుండనంతే-" రవితేజ అనధికారంగా శర్మకి తన మనసులో మాట చెప్పాడు. అతడు రాజీనామా ఉత్తరం.. జేబులో పెట్టుకునే వచ్చాడు.

"నా భార్యకి నాకు ప్రొద్దున్నంతా ఇదే చర్చ ఇంట్లో జరిగింది" అన్నాడు శర్మ. అకస్మాత్తుగా వచ్చిన ఆమె ప్రసక్తితో రవితేజ అప్రతిభుడయ్యాడు. శర్మ చెప్పుకుపోతున్నాడు. "....ఆవిడ నిన్నే సపోర్ట్ చేసింది. ఇక నా విషయమంటావా- అందరు డైరెక్టర్లూ ఏం చెపితే నా ఓటూ అటే".

రవితేజ అతడి మాటలు వినటంలేదు. 'ఆమె' గుర్తుకు రాగానే స్తబ్దమై వున్న నీటినుంచి తరంగాల్లా జ్ఞాపకాలు లేచినయ్.

"ఏమిటి నేను చెప్పేది వింటున్నావా?"

అతడు తేరుకుని "చెప్పండి" అన్నాడు.

"ఏమీలేదు నేనెటూ నిర్ణయించలేకపోతున్నాను. అందరూ ఏం చేస్తే నేనూ అదే-"

అంతలో ప్యూన్ వచ్చి రవికి ఫోన్ వచ్చిందని చెప్పాడు. అతడు వెళ్ళి ఫోన్ అందుకున్నాడు. మిగతా డైరెక్టర్లందరూ, తిరిగి సమావేశం అవడం కోసం బోర్డు రూమ్ లోకి వెళ్తున్నారు.

మాధవి దగ్గిర్నుంచి ఫోను "ఏమిటి ఏవో చౌకరకం చీరలని కంపెనీని ముంచేస్తున్నారట" అంది.

"అప్పుడే నీ కెవరు చెప్పారు?"

"పూర్ణచంద్రరావుగారి భార్య. "పూర్ణచంద్రరావంటే, ప్రొద్దున్న మీటింగ్ లో ఈ కొత్త స్కీమ్ కి వ్యతిరేకంగా మాట్లాడినాయన. అప్పుడే ఇది ఇంటి వరకూ పాకిందన్న మాట.

"ఏం మాట్లాడరేం?"

"ఏం మాట్లాడను?"

"ఎవరికీ లేనిది మీకెందుకు? మామూలుగా వుండరాదూ."

అందరూ మామూలుగా వుంటే ప్రపంచం ఇలా వుండదు- మనసులో అనుకున్నాడు.

"ఇప్పుడే చెపుతున్నాను. వాళ్ళతో గొడవలు పెట్టుకోకండి. ఉన్నదాంతో సరిపెట్టుకోవచ్చు. కానీ కొత్త కొత్త ఐడియాలు, పథకాలు మనకొద్దు."

రవితేజ కూడా అదే స్వరంతో, "నేనుకూడా ఇప్పుడే చెపుతున్నాను. ఇంకెప్పుడూ ఇలా ఆఫీసుకి ఫోన్ చెయ్యొద్దు. అంతేకాదు- ఆ పూర్ణచంద్రరావు భార్యకి కూడా చెప్పు-భర్తల వ్యవహారాల్లో భార్యలు జోక్యం చేసుకుని ఉచిత సలహాలివ్వటం అంత మంచిది కాదని-" అంటూ మాధవి ఇంకా ఏదో అట్నుంచి అనబోతూ వుండగా ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ పెట్టేస్తూ వుండగా కనిపించింది ఆఫీసు ఫైళ్ళ నడుమ- తన కుర్చీ ఎదురుగా బల్లమీద గులాబీరంగు కవరు. అతడికి అది గుర్తే. ఆ చేతివ్రాత కూడా తెలుసు. ఇప్పటికి తనని వెంటాడి వేటారుతూన్న ఉత్తరం తాలూకు చేతివ్రాత. తనని దాదాపు పిచ్చివాడిని చేసిన చేతివ్రాత.

గుండె వేగంగా కొట్టుకుంటూంటే చప్పున ఆ కవరు అందుకున్నాడు. అది అక్కడికి ఎవరు తెచ్చి పెట్టారు అని కూడా అడిగే ప్రయత్నం చేయలేదు. కవరు చింపుతూ వుంటే శర్మ మాటలు గుర్తొచ్చాయి. 'నా భార్యకీ నాకూ ప్రొద్దున్న ఇంట్లో ఇదే చర్చ జరిగింది' అన్న వాక్యాలు. ఈ లోపులో అతడు కవరులో కాగితం బయటికి తీశాడు. అయిదారు వాక్యాలున్నాయి అందులో- గుండ్రటి అక్షరాలు.

ఆమె మళ్ళీ ఎక్కడికైనా రమ్మంటుందేమో- మొదట కొద్దిగా బింకం చూపించాలి.....వగైరా ఆలోచనల్తో చదవటం మొదలు పెట్టిన అతడు అందులో వున్నది చూసి ఆశ్చర్యపోయాడు. "రిస్క్" అని హెడ్డింగ్ వుంది.

**'రిస్క్'**

**నవ్వటంలో మూర్ఖత్వాన్ని బయటపెట్టే రిస్కు వుంది.**
**ఏడవటంలో బలహీనత బయటపడే రిస్కు వుంది.**
**మరొకర్ని కలుసుకోవటంలో ఇన్ వాల్వ్ మెంట్ 'రిస్క్'.**
**సరదాగా కబుర్లు చెప్పటంలో మన మనసు బయట పెట్టే రిస్కు**
**ప్రేమించటంలో, తిరిగి ప్రేమింపబడకుండా వుండే రిస్కుంది.**

**బ్రతకటంలో చావు రిస్కు, ఆశలో నిరాశ రిస్కు.**

**ప్రయత్నంలోనే ఓటమి రిస్కు**

**అలా అని ఏమాత్రం రిస్కు చేయని, తీసుకోని, తీసుకోలేని మగవాడు ఏమీ**

**చేయడు,**

**చేయలేడు.**

**అతడికి బాధలు వుండకపోవచ్చు.**

**కానీ గెలుపుద్వారా లభించే ఆనందం కూడా వుండదు.**

దాదాపు మూడు నాలుగుసార్లు ఆ వాక్యాన్ని చదువుకున్నాడు రవి. అతడి పెదాలమీద చిరునవ్వు వెలిసింది. దాన్ని మడిచి జేబులో పెట్టుకుని, అలాగే బోర్డు రూమ్ లోకి నడిచాడు. లంచ్ తరవాయి భాగం కార్యక్రమంలో పాల్గొనటానికి జేబులో ఆ కాగితం పెట్టుకుంటూ వుండగా, అంతకు ముందున్న రాజీనామా ఉత్తరం చేతికి తగిలింది. దాన్ని బయటికి తీసి, చివర్లో మరో వాక్యం వ్రాశాడు. "....నేను మరో కంపెనీలో చేరటానికి దయచేసి అనుమతి ఇవ్వగలరు! రూల్స్ దృష్ట్యా నాకు ఈ అనుమతి అవసరం లేకపోయినా, ఇంతకాలం మీతో కలిసి పనిచేసినందుకు, నా భవిష్యత్ కార్యక్రమాన్ని మీకు తెలియపర్చటం నా విధిగా భావిస్తున్నాను."

అతఃడు బోర్డు రూమ్ లోకి ప్రవేశించబోతూ గుమ్మం దగ్గిర ఆగాడు. అప్పుడే వరండాలోంచి వస్తూ మరో డైరెక్టర్ కనపడ్డాడు. సేల్స్ మానేజర్ తన గదిలోకి వచ్చి లక్షా యాభైవేలకి చీరల ఆర్డర్లు వచ్చాయని చెప్పినప్పుడు మీద కాఫీ ఒలకబోసుకున్న డైరెక్టర్ ఆయన.

"ఏమిటి ఇక్కడ నిలబడ్డారు?" అని రవితేజని అడిగాడు.

ఆయన్ని దూరంనుంచి చూసే రవితేజ జేబులోంచి కాగితం తీసి చదువుతున్నట్టు నిలబడ్డారు. ఆయన ప్రశ్నకి అప్పుడే ఆయన్ని చూసినట్టు తలెత్తి "ఏమీలేదు. టైపిస్టు కిచ్చేముందు ఏమైనా తప్పులీ ఉత్తరంలో వున్నాయేమో అని చూస్తున్నాను" అన్నాడు.

"ఉత్తరం ఏమిటి"?

"చదవండి....." అంటూ రాజీనామా పత్రాన్ని ఆయన కిచ్చాడు. చదువుతూ ఆయన మొహంలో మారుతూన్న భావాల్ని గమనించాడు. చదవటం పూర్తిచేసి ఆయన తలెత్తగానే "ఇలా వ్రాయటంలో తప్పులేదుగా" అన్నాడు ఆయనకీ పెద్దరికాన్ని ఆపాదిస్తూ "ఇదేమిటి?" అన్నాడు ఆయన అయోమయంగా, "....దీనికి మేము ససేమిరా వప్పుకోము."

"నా మాట కంపెనీ వప్పుకోని పక్షంలో నేనిక డైరెక్టరుగా ఈ కంపెనీ వ్యవహారాలు నడపటం అనవసరం. ఈ రోజు

అవసరమొస్తే ఇచ్చేద్దామని దీన్ని తయారుచేసి వుంచాను. అఫ్ కోర్స్-దీన్ని అందజేసే అవసరం వస్తుందనుకోను. కానీ ఏమో-ఎవరు చెప్పగలరు? నేను చెప్పిన పథకం డైరెక్టర్లకి నచ్చకపోతే, తొలగిపోవటమే మంచిది కదా! మీరు వెళ్ళండి. దీన్ని టైప్ కిచ్చి వస్తాను" అని మరి ఆయన ఆలోచించుకోవటానికి సమయం ఇవ్వకుండా దాన్ని తీసుకుని, టైపింగ్ సెక్షన్ వరకూ వెళ్ళాడు.

అయితే దాన్ని అతడు అక్కడ ఎవరికీ ఇవ్వలేదు. కొంచెం సేపు అక్కడే నిలబడ్డాడు.

బోర్డ్ రూమ్ లోకి వెళ్ళిన డైరెక్టరు ఈ విషయాన్ని లోపల అందరికీ చెపుతాడని అతడికి తెలుసు. దానిమీద చర్చ జరుగుతుందని కూడా అతడికి తెలుసు. అతడికి కావలసింది అదే!

అందరూ తెలుసుకొనేలా చేశాడు, చాలు. బెదిరించటం వల్ల మొత్తం బెడిసి కొట్టవచ్చు.

తన ఉపన్యాసానికి రాజీనామా క్లైమాక్స్ కాదు. కేవలం పునాది మాత్రమే! ఆ విధంగా డైరెక్టర్స్ కి ముందు మానసికంగా ప్రిపేర్ చేసి, ఆ తరువాత తను చెప్పదల్చుకున్నది చెపుదామనుకున్నాడు అతడు. దానికోసమే అతడు ఈ 'ట్రిక్' ప్లే చేశాడు.

అది కరెక్టుగా జరిగింది!

అతడు ఆ గదిలో ప్రవేశించేసరికి అందరూ దాని గురించే మాట్లాడుకుంటున్నారు- అన్న విషయం, అతడు లోపలికి వెళ్ళగానే ఒక్కసారిగా ఆగిపోయిన సంభాషణ వల్ల తెలిసింది. అతడు ఏమీ ఎరగనట్టు వెళ్ళగానే కుర్చీలో కూర్చున్నాడు.

మీటింగ్ తిరిగి ప్రారంభమయింది.

అతడు తన వాదనని చెప్పటం మొదలుపెట్టాడు. ముందు చెప్పిందే కానీ ఈసారి అందరిముందు మందస్వరంతో, నాటకీయంగా, ఒక ఉత్తేజకరమైన ఫీలింగ్ తో దాదాపు పావుగంట మాట్లాడాడు.

"....మన కంపెనీ ఇప్పుడు బాగానే నడుస్తుంది. కానీ అద్భుతంగా నడవటం లేదు. బాగా నడవడమే కాదు కావల్సింది. కంపెనీకి- ప్రత్యర్థుల్ని దెబ్బతీయటం కూడా....! ఈ కొత్త స్కీమ్ జనంలోకి చొచ్చుకుపోతుందని భావిస్తున్నాను. దానికి తార్కాణం అప్పుడే మనకి కనపడింది కూడా. ఒక వేళ మనం ఈ స్కీమ్ ప్రారంభించకపోతే మన ప్రత్యర్థులు దీన్ని వెంటనే చేపడతారని నేను భావిస్తున్నాను. నా మిత్రుడు అన్నట్టు దీనివల్ల వచ్చే సంవత్సరం మన లాభాలు తగ్గవచ్చు. కానీ కంపెనీ అంటే కేవలం లాభాలు ఆర్జించటమే కాదు. మన పెట్టుబడి నాలుగు రెట్లు విస్తరిస్తుందని నా వుద్దేశ్యం. ఈ స్కీమ్ 'క్లిక్' అయిన పక్షంలో రెండేళ్ళల్లో దరిదాపుల్లోకి ఎవరూ రాలేనంతగా మన కంపెనీ ఎదిగిపోతుంది. దీనికోసం మనం రిస్క్ తీసుకోవడం చాలా అవసరం. "What would life be like-if you never took a risk." అని ఆగి

"You would never go out of your house, find Job-ask for a raise-" అని నెమ్మదిగా పూర్తిచేశాడు."...... fall in love".

రూమ్ లో సన్నగా నవ్వులు, తరువాత ఈ అంశం ఓటింగ్ కి పెట్టబడింది. రవితేజ టెన్షన్ తో చూస్తున్నాడు. ఛైర్మన్ శర్మ కాగితం కలం తీసుకున్నాడు.

## 19

**చెంచురామయ్య అండ్ కో** తాలూకు నలుగురు సభ్యులూ తమ బోర్డ్ రూమ్ లో కూర్చుని వున్నారు. చాలసేపట్నుంచీ వారి మధ్య సంభాషణ లేదు. మాట్లాడుకోవటానికి కూడా ఏమీలేదు. తమ ప్రత్యర్థి తాలూకు కంపెనీ మీటింగు అదే సమయానికి నాలుగు ఫర్లాంగుల దూరంలో ప్రస్తుతం జరుగుతూ వుందని వారికి తెలుసు. ఆ కంపెనీ ఏ నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురు చూస్తున్నారు. టెక్స్ టైల్స్ మార్కెట్ లో ఒక ఉప్పెనలా వచ్చి పడబోయే ఆ నిర్ణయం తాలూకు ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తున్నారు.

ఈ దెబ్బతో రవితేజ అండ్ కో అటో ఇటో అని వారికి తెలుసు. 'అటు' అయితే ఫర్వాలేదు. ఇటు అయితేనే కష్టం. కష్టమేమిటి అంటే-మిగతా కంపెనీలన్నీ తుఫానులో తెప్పలాగా వూగిపోవల్సిందే. ఇదే పద్ధతిని తరువాత ప్రవేశపెట్టినా, మొదటిసారి సిస్టమ్ ని పరిచయం చేసినవారికి వుండే లాభం, రెండోసారి చేసిన వారికి వుండదు. మారుతీకారు ఆలోచన తమ కొచ్చింది. తరువాత చాలామంది చాలా బహుమతులు పెట్టారు. కానీ తమ స్కీమ్ ఫలించినంతగా వారిని ప్రజలు గుర్తించలేదు.

తమ తాలూకు మనిషిని ఒకడిని రవితేజ కంపెనీలో ముసలం సృష్టించటానికి డైరెక్టరు రూపంలో ప్రతిష్టాపించాడు చెంచురామయ్య.

పైకి అమాయకుడిగా, ఏమీ తెలియని వాడిగా కనపడతాడు కానీ, చెంచురామయ్య గొప్ప స్కీమింగ్ వున్నవాడు. పంచె. ఖద్దరు చొక్కా, పైకి దువ్విన జుట్టు, రిమ్ లెస్ కళ్ళజోడు, ఆకు జోళ్ళు... అతడిని మామూలుగా చూసిన వాళ్ళెవరూ కోట్లతో వ్యాపారం చేస్తున్నవాడని అనుకోరు. చందూలాల్ పట్వారీ, బాబూలాల్ మిశ్రా లాటి వాళ్ళకి అతడు ఏ విధంగానూ తక్కువకాడు. ఆ కళ్ళవెనుక ఏముందో ఎవరికీ తెలీదు. పాతికేళ్ళ అతడు ఆ ప్రపంచాన్ని ఏలాడు. రవితేజ కాంపిటీషన్ రాకపోతే మరో పాతికేళ్ళు ఏలేవాడు. ముందు చెప్పినట్టుగా, అతడు గొప్ప స్కీమింగు వున్నవాడు. ఎత్తులూ, పైఎత్తులు, కాపిటల్ మార్కెట్టు, పంపిణీ వ్యవస్థ మొదలైనవన్నీ అతడికి వెన్నతో పెట్టిన విద్యలు. కేవలం డిజైనింగ్ ఫాషన్ లలో ఆమాత్రం అతడు కాస్త వెనుక బడ్డాడు. రవితేజ సరీగ్గా అక్కడే అతడిని దెబ్బకొట్టాడు. అతడికి పుట్టుకతోనే వచ్చిన కళ అది. అతడు ఎమ్.డి. అవగానే నాల్గయిదు సంవత్సరాల్లో మిగతా అన్ని విభాగాల్లో ప్రావీణ్యం సంపాదించాడు. చెంచురామయ్య మాత్రం ఆడవారి మారే ఫాషన్ల గురించీ, ఇష్టాల గురించీ, డిజైన్ల

గురించీ ఎంత కష్టపడినా తెలుసుకోలేకపోయాడు. "రవితేజకున్న ఆర్ట్ లో సగం వున్న వాడెవరైనా నా కంపెనీ డిజైన్ల విభాగంలో వుండి వుంటే, నా కంపెనీని ఎవరికీ అందనంత ఎత్తులో నిలబెట్టి వుండేవాడిని" అని అతడు చాలాసార్లు అన్నాడు.

ఇప్పుడు రవితేజ ఈ కొత్త స్కీమ్ తో వచ్చేసరికి చెంచురామయ్య పునాదులు కదులుతున్నట్టు అనిపించింది. పైకి మామూలుగా కనిపించినా, ఈ స్కీముగానీ విజయవంతం అవుతే అది ఎలా వేళ్ళతో సహా విస్తరిస్తుందో దేశమంతా పాకుతుందో కేవలం చెంచురామయ్య మాత్రమే వూహించగలడు. రవితేజ ఇక పులిలా విజృంభిస్తాడు. రోజు కొత్త డిజైను వూహిస్తాడు. కొత్త కొత్త కలర్ కాంబినేషన్ లు ఆలోచిస్తాడు.

స్నానం చేస్తున్నప్పుడో-సీతాకోకచిలుకని చూస్తున్నపుడో-నీలం కారులోంచి పచ్చచీర కట్టుకున్న అమ్మాయి దిగుతున్నప్పుడో అతడికి ఒక ఫ్లాష్ లాంటి ఆలోచన వస్తుంది. మూడు రోజులకల్లా ఒకవేపు కోట్ల రూపాయల విలువచేసే మిషన్లమీద లక్షల చీరలు తయారవుతూ వుంటాయి. మరోవేపు టీ.వీ.ల్లో రకరకాల అమ్మాయిలు ఆ చీరలు కట్టుకుని ఆడవాళ్ళ హృదయ కవాటాలు తెరుచుకుని నేరుగా లోపలి ప్రవేశిస్తూ వుంటారు. అయిదు రోజులకల్లా వంద రూపాయల నోటు వారినుంచి రవితేజవైపు ప్రయాణం చేస్తూ వుంటుంది. నెలరోజులు తిరిగేసరికల్లా మళ్ళీ ఇంకో డిజైను- మళ్ళీ టీ.వీ.ల్లో అమ్మాయిలు- ఈసారి మరింత అందంగా-

"అరెరె, ఇంత మంచి చీర వుందని తెలియక- అది కొనేసేమే-" అనుకుంటూ ఆడవాళ్ళు. "ఏమండీ ప్లీజ్, ఇది కొనుక్కుంటానండీ-" అని భర్తల్ని అడుగుతారు. "అదేమిటి-నెల రోజుల క్రితమేగా రెండు చీరెలు కొన్నావ్!"

"పోండి-పెద్ద వేలకు వేలుపెట్టి కొన్నట్టు మాట్లాడుతారు. రెండొందలేగా- ప్లీజ్ ప్లీజ్. ఈ రాత్రికి మీ కిష్టమైన వంకాయకూర వండి పెడతాగా- ఒక్క వందశాంక్షన్ చేయరూ?"

"సర్లే," మరో వంద వారినుంచి రవితేజ కంపెనీవేపు ప్రయాణం!

రవితేజా! నువ్వు సినిమా డైరెక్టర్ వై వుంటే నెంబర్ వన్ అయి వుండేవాడివి. రచయితవై వుంటే జ్ఞానపీఠం ఎక్కి వుండేవాడివి. ఈ బట్టల వ్యాపారంలోకి వచ్చి మమ్మల్ని చంపుతున్నావు కదయ్యా!

చెంచురామయ్య ఇరిటేటింగ్ గా గెడ్డం గోక్కున్నాడు. ఇంకా అవతలి కంపెనీ మీటింగ్ తాలూకు నిర్ణయాలు బైటకు రాలేదు. లంచ్ అయిన తరువాత తిరిగి సమావేశం అయ్యారన్న విషయం మాత్రం తెలిసింది. లంచ్ కి ముందు తమ మనిషి (గూఢచారి) ప్రవేశపెట్టిన తీర్మానంతో మిగతా డైరెక్టర్లందరూ దాదాపు ఏకీభవించారన్న సంగతి కూడా తెలిసింది. చాలా సంతోషకరమైన వార్త అది. చెంచురామయ్య కంపెనీ డైరెక్టర్లందరూ తమ చిరునవ్వుని అదిమిపెట్టి - చివరి వార్తకోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళకి వాళ్ళే ధైర్యం చెప్పుకుంటున్నారు- "వస్తున్న లాభాలు వదులుకుని కొత్త స్కీములు ఎవరు వప్పుకుంటారండీ? నేనేగాని ఆ కంపెనీ డైరెక్టర్ ని అయివుంటే అసలింతచర్చ లేకుండా అయిదు

నిముషాల్లో తేల్చేసి వుండేవాడిని" అంటున్నాడు ఒక డైరెక్టర్.

ఇలాటివాళ్ళు సాధారణంగా సినిమా కంపెనీల్లో తగుల్తారు. రెండు సినిమాలు ఒకేసారి రిలీజు అవుతాయి. ఒక ప్రొడ్యూసర్ చుట్టూచేరి వీళ్ళు అంటూ వుంటారు. "ఇప్పుడే రాష్ట్రం మొత్తం సెంటర్స్ అన్నిటినుంచి ఫోన్ లు వచ్చినయ్! మనది హౌస్ ఫుల్స్ అట."

"అదెలా వుందో?"

"నాలుగు వారాల పిక్చర్ అంటున్నారు."

-ఇలా సాగుతుంది ఆ సంభాషణ. నిజమైన వ్యాపారవేత్త ఎవడూ ఈ సంభాషణకి విలువ యివ్వడు. దీనివల్ల కాస్త తాత్కాలికంగా మనశ్శాంతి లభిస్తే లభించవచ్చుగానీ-అంతకన్నా పెద్ద లాభం వుండదు. అందువల్లే చెంచురామయ్య చుట్టూ వున్న డైరెక్టర్ల మాటలు పట్టించుకోకుండా కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు. సరిగ్గా అయిదు నిముషాల తరువాత చివరి వార్త వచ్చింది.

జనతా చీరల పథకానికి రవితేజ టెక్స్ టైల్స్ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదముద్ర తెలిపారు. తొమ్మిదిమంది డైరెక్టర్లు దీన్ని ఒప్పుకుంటూ ఓటువేస్తే కేవలం ఒక్కరు మాత్రం వ్యతిరేకంగా ఓటు వేశారు. అదీ న్యూస్.

అప్పటివరకూ ఊహాగానాలు చేస్తూ తమలో తామే సంతృప్తి పడుతున్న డైరెక్టర్లు ఒక్కసారిగా దెబ్బతిన్నట్లు మౌనం వహించారు.

చెంచురామయ్య లేచి తన గదిలోకి వెళ్ళాడు. అప్పటికే మానేజర్ ని పిలిచాడు.

"మన చేతిక్రింద ఎన్ని పేపర్లున్నాయి. ఎంతమంది రిపోర్టర్లు మన మాట వింటారు?" అని అడిగాడు.

"రెండు ఇంగ్లీషు దినపత్రికలు వున్నాయి. మిగతా రిపోర్టర్లు కూడ బాగానే తెలుసు. తెలుగులో అయితే ఒకరిద్దరు చీఫ్ ఏజంట్స్ కూడా తెలుసు."

"రేపు సాయంత్రం అందర్నీ తాజ్ కి డిన్నర్ కి పిలువు. మన కంపెనీ వారికి కాక్ టెయిల్స్ యివ్వబోతుంది. కారణం అడుగుతే-ఏదో ఒకటి చెప్పు రజితోత్సవం - వగైరా- ఏదైనా-"

కారణం అదికాదని మానేజర్ కి తెలుసు. కానీ ప్రశ్నించే ధైర్యంలేదు. 'అలాగే సార్' అని అక్కన్నుంచి వెళ్ళిపోయాడు.

చెంచురామయ్య అక్కన్నుంచి కార్లో బయల్దేరాడు. ఈ రెండో వ్యవహారాన్ని మాత్రం తానే స్వయంగా నిర్వహించాలి- చాలా రహస్యంగా చేయాలి. అతఃడికి బాగా కావల్సిన వ్యక్తి ఆ ఆఫీసులో వున్నాడు. అతడిని పట్టుకుని దేశం నలుమూలలా ఈ పని చేయించాలి, లక్ష ఖర్చయినా ఫర్వాలేదు. కానీ దీని వెనకాల చెంచురామయ్య కంపెనీ వుందని మాత్రం తెలియకూడదు. ఈ ప్లాను ఫలించిందంటే, కోట్ల ఖర్చుతో రవితేజ పరిచయం చేయబోతున్న స్కీము ఆదిలోనే కుప్పకూలిపోతుంది.

చెంచురామయ్య వెళుతూంది-పోస్ట్ మాస్టర్ జనరల్ ఆఫీసుకి!

* * *

చెంచురామయ్య కలుసుకున్నది ఆ ఆఫీసులో పెద్ద అధికారిని కాదు. ఇలాటి పనులకు పెద్ద అధికారులు లాభంలేదు. చిన్నవాళ్ళే అమోఘంగా పని చేస్తారు. ఇద్దరిమధ్యా రహస్య చర్చలు అరగంటసేపు జరిగాయి. పాతికవేళా రూపాయలు చేతులు మారేయి. ఒకే పోస్టాఫీసునుంచి పెద్ద ఎత్తులో, ఎక్కువ సంఖ్యలో ఏమైనా వస్తువులు పంపవలసి వచ్చినప్పుడు, ఆ ఆఫీసు తాలూకు పోస్టు మాస్టర్ ఆ కస్టమర్ కోసం విడిగా ఒక క్లర్క్ ని కేటాయిస్తాడు. ఇపుడు రవితేజ కంపెనీకి ఆవిధంగా దాదాపు వందమంది క్లర్కులని ఆ పనిమీద నియమించవలసి వస్తుంది. అయితే యిది ప్రభుత్వానికి కూడా లాభదాయకం కాబట్టి యిందులో ఇబ్బందేమీ లేదు. రవితేజ మొదటి విడతగా దాదాపు పదివేల చీరలని పంపదల్చుకున్నాడు- అయితే యిది శాంపిల్ మాత్రమే అతడి ఆలోచనలు అతడికున్నాయి. లక్షలమీద పంపకం జరిగేటప్పుడు పోస్టుమీద యింత ఖర్చుపెట్టటం అనవసరం ఉపాధి పథకం క్రింద వేలమంది నిరుద్యోగుల్ని స్వంత బాధ్యతలమీద నియమించవచ్చు. దేశాన్ని విభాగాల క్రింద విడగొట్టి ఇలా ఒక్కొక్క విభాగానికి కొంతమంది యువకుల్ని నియమిస్తే మరింత వేగంగా పంపకం జరుగుతుంది. ఈ రిప్రజెంటేటివ్స్ కి కోడ్ నెంబరు, కస్టమర్ అడ్రస్ పంపిస్తే చాలు, వాళ్ళే స్వయంగా చీరెని ఇంటికి అందజేస్తారు. వారి ఖర్చు చీర ఒక్కటికీ పది పైసలకన్నా ఎక్కువ పడదు.

ఇంతమందికి ఉద్యోగాలు ఇస్తున్నందుకు ఇది తప్పకుండా ప్రభుత్వాన్ని ఆకర్షిస్తుంది. దీని ప్రారంభోత్సవం ఏ ప్రధానమంత్రితోనో చేయిస్తే అన్ని పేపర్లూ, రేడియో, టీ.వీ. కవర్ చేస్తాయి. పదిలక్షల రూపాయల వ్యాపార ప్రకటనల ఖర్చులేకుండా రవితేజ టెక్స్ టైల్స్ కి ప్రచారం లభిస్తుంది. (పెద్ద పెద్ద కంపెనీలు ప్రముఖుల ఆసరా ఎందుకు తీసుకుంటాయో రవితేజకి బాగా తెలుసు.) అయితే తన మనసులో మాట ఎవరికీ చెప్పలేదు అతడు. సమయం వచ్చినప్పుడు చెపుదామనుకున్నాడు. బోర్డుకి మాత్రం అన్యాపదేశంగా మాత్రమే అర్థమయ్యేటట్టు ఒక పారాగ్రాపు ఎజెండాలో చేర్చి వుంచాడు.

అర్థం చేసుకోగలిగేవాళ్ళకి యిందులో కూడా వ్యాపార లక్షణం కనపడుతుంది. 'మిగతావారి అంగీకారం కోసం నువ్వొక ప్రపోజల్ పెట్టదల్చుకుంటే అందులో చిన్న లొసుగు వుందని నీ మనసులో ఏ మూలో కొద్దిగా అనుమానం

వుంటే, అదే ప్రపోజల్ లో మరి రెండు మూడు పెద్ద లొసుగుల్ని చేర్చు. అందరి దృష్టీ వాటిమీదకి వెళ్ళి, సమయమంతా వాటిని చర్చించటానికే సరిపోతుంది. ఉదారంగా ఆ లొసుగుల్ని తొలగించటం ద్వారా మిగతావారికి నువ్వు దిగివచ్చినట్టు కనపడుతుంది. నువ్వు చెయ్యదల్చుకున్న పనీ నెరవేరుతుంది' అన్న సూత్రాన్ని అక్కడ అన్వయించాడు. అతడి ఆలోచన ఫలించింది. డైరెక్టర్లందరూ ఈ స్కీమ్ గురించే ఆలోచించారు తప్ప, ఇన్ని లక్షల చీరలు పోస్ట్ ద్వారా ఎలా పంపటం అన్న విషయాన్ని చర్చించలేదు. డీలర్ల వ్యాపారం తగ్గించి కొత్తగా కమీషన్ ఏజంట్స్ ని నియమించడం అన్న విషయంగానీ చర్చకి వచ్చి వుంటే అందరూ ముక్తకంఠంతో దాన్ని తిరస్కరించి వుండేవారే! దాదాపు పది లక్షల చీరెలు తయారయ్యాక తన ఆలోచనని అప్పుడు బోర్డులో ప్రవేశపెడదామనుకున్నాడు. కానీ తనకన్నా ముందే చెంచురామయ్య తమ ప్రణాళికని దెబ్బకొడతాడని వూహించలేదు అతడు. అదృష్టవశాత్తు అది ముందే బయటపడింది.

....ఆ మరుసటిరోజు అతఃడు ఆఫీసులో వుండగా ఒక వ్యక్తి కల్సుకోవటానికి వచ్చాడు.

"ఎవరితను?" అడిగాడు రవితేజ.

"చెప్పటంలేదు. మీతోనే మాట్లాడతాడట....."

"సరే రమ్మను."

నిముషం తరువాత అతడు లోపలికి వచ్చాడు. కాలర్ దగ్గిర చొక్కా కాస్త చిరిగింది. గెడ్డం మాసి వుంది.

"ఏం కావాలి?"

అతఃడు తటపటాయించి, "ఒక అయిదు నిముషాలు మీతో మాట్లాడాలి" అన్నాడు. రవితేజ మొహం చిట్లించి, "ఏ విషయం?" అన్నాడు.

"చాలా ముఖ్య విషయం నేను కూర్చోవచ్చా!"

రవితేజ తలూపాడు. ఆ వ్యక్తి కూర్చుంటూ "నిన్న చెంచురామయ్య మా దగ్గరికి వచ్చాడు" అన్నాడు. 'చెంచురామయ్య' పేరు వినపడగానే రవి నిటారుగా అయ్యాడు. "మీ దగ్గిరకి అంటే ఎవరు? ఎవరి దగ్గిరికీ?" అడిగాడు.

"చెప్పను."

రవి ఆశ్చర్యంగా "చెప్పవా? మరెందుకు వచ్చినట్టు మా దగ్గరకి?" అన్నాడు.

"మా ఆఫీసులో ఒకరికి పాతికవేలు లంచం యిచ్చాడు. మేమందరం కలిసి ఒక పని చేయటానికి."

"ఏం పని?"

"చెప్పను."

రవితేజకి కోపం వచ్చింది. కానీ విషయం ఆసక్తికరంగా వుండటం, అందులో తన ప్రత్యర్ధి పేరు వుండటంతో తమాయించుకుని, "సరే-నీకేం కావాలి అది చెప్పు" అన్నాడు.

"ఇంతకుముందు మేము ఇలాంటి పనులు చిన్న ఎత్తులో చేసేవాళ్ళం. కాని పాతికవేలు చూసేసరికి మా వాడికి కళ్ళు బైర్లు కమ్మాయి. ఇంతకుముందు మా అందరికీ సమానంగా పంచెవాడు - యిప్పుడు ఇరవైవేలు తను వుంచుకుని మిగతాది మాత్రమే మాకు యిచ్చాడు."

"అసలు విషయమేమిటి? చెంచురామయ్య మీకు డబ్బు ఎందుకిచ్చాడు? మీరు పంచుకోవటం దేనికి? దీనికీ నాకూ సంబంధం ఏమిటి?"

"అతని పథకం అనుకున్నట్టు జరిగితే మీకు లక్షలమీద నష్టం వస్తుంది."

రవితేజ ఎదుటి వ్యక్తివైపు సూటిగా చూశాడు. బీదతనం అతడి మొహంలో దైన్యంతోపాటూ అదో రకమైన తెగింపుతనాన్ని కూడా చూపిస్తూంది. కానీ తెలివితేటలు అంతగా కనిపించటం లేదు.

"నా కర్ధమైంది సరే చెప్పు, నీకేం కావాలి?"

"..... పాతికవేలు."

"మైగాడ్ అంత డబ్బా?"

"నేనా విషయం చెప్పకపోతే మీరు అమితంగా నష్టపోతారు."

"కంపెనీ తరపున అంత డబ్బు ఇవ్వటానికి నాకు అధికారాలు లేవు."

"చివరిమాట. ఇరవై వేలు యివ్వండి."

రవితేజ తలవూపుతూ, "అంత కూడా ఇవ్వలేను. విషయం ఏమిటో చెపితే మా వాళ్ళకి దాని విలువ నచ్చజెప్పి ఇప్పించగలను. అసలు విషయం తెలియకుండా అంత డబ్బు ఇస్తే - తీరా నువ్వు చెప్పింది మాకు ఏ విధంగానూ లాభసాటి కాకపోతే నేను మాట పడవలసి వస్తుంది" అన్నాడు.

"నేను అది చెప్పేసిన తరువాత మీరు డబ్బు ఇవ్వకపోతే-"

"ఇటువంటి విషయాలు నమ్మకంమీద జరుగుతాయని నీకు బాగా తెలిసివుండాలే-" రవితేజ నవ్వాడు. "ఇప్పుడు నువ్వు చెప్పకపోతే పోలీసుల్ని పిలిపించాననుకో, అప్పుడైనా అసలు విషయం తెలుస్తుంది కదా!"

"మీరు పోలీసుల్ని పిలుస్తే బయట వాళ్ళందరికీ ఈ విషయం తెలుస్తుంది. మీ ఆఫీసులోనే చెంచురామయ్య మనుషులున్నారు. నన్ను పోలీసులు పట్టుకెళ్ళిన విషయం అతనికి తెలిస్తే, అతడు దీన్ని మానుకుని మరొకటి ఆలోచిస్తాడు. కొత్తదాన్ని కనుక్కోవటం కన్నా వున్న విషయం తెలుసుకోవటం మీకే మంచిది కదా."

"నువ్వు డిటెక్టివ్ నవలలు బాగా చదువుతావనుకుంటానే-"

"నాకు డబ్బు కావాలి చాలా అవసరం."

"నాకు రేపటివరకూ టైమివ్వు. అంత డబ్బు కంపెనీకి చెప్పకుండా ఇవ్వాలంటే కష్టం. ఆలోచించుకోనీ" అన్నాడు రవితేజ. అతను లేచాడు. "సరే రేపొస్తాను. ఉహు నేను రాను.రేపటికి మీరేదైనా ఆలోచన చేసి నన్ను బంధించే ఏర్పాట్లు చేస్తారు. రేపు ఫోన్ చేస్తాను. డబ్బు ఎలా అందజెయ్యాలో కూడా చెపుతాను" అని గుమ్మంవరకు వెళ్ళి ఆగి, "ఇదంతా అవటానికి వారం పడుతుందేమో. ఇప్పుడే డబ్బు ఇచ్చెయ్యకూడదూ. విషయం చెప్పేస్తాను" అన్నాడు ఆశగా.

"రేపు ఫోన్ చెయ్యి" అన్నాడు రవితేజ.

అతడు వెళ్ళిపోయిన రెండు నిముషాలకి తనూ బయల్దేరాడు. పదిహేను నిముషాల్లో వస్తానని సెక్రటరీకి చెప్పి, క్రిందికి దిగాడు. అప్పుడే ఆ వ్యక్తి రోడ్డు క్రాస్ చేసి సిటీబస్ ఎక్కుతున్నాడు. రవితేజ తన కార్లో అతడిని అనుసరించాడు.

అతడికీ వ్యవహారాల్లో బొత్తిగా అనుభవం లేదని అతడి ప్రవర్తన చూస్తుంటేనే తెలుస్తూంది. ఒక్కసారి కూడా వెనుదిరిగి చూడలేదు. పెద్ద మార్కెట్ దగ్గర దిగి, కొంతదూరం నడిచి ఒక సందులో ప్రవేశించాడు. రవితేజ తన కారుని ఒక పక్కగా ఆపి, తనుకూడా అటు నడిచాడు. చాలా చిన్న సందు అది. ముందుకు వంగిపోయినట్లున్న ఆ

యింట్లోకి అతడు వెళ్ళటాన్ని రవితేజ గమనించాడు. అది అతడి ఇల్లే అని నిర్ణయించుకుని వెనుదిరగబోతూ వుంటే, ఆ వ్యక్తి తిరిగి బయటకు రావటం గమనించి, పక్కకి తప్పుకున్నాడు. టైమ్ పదిన్నర అయింది. అతడి చేతిలో టిఫిన్ బాక్స్ బట్టి అతడు ఆఫీసుకి వెళుతున్నాడని తెలుస్తుంది.

రవితేజ అతడిని అనుసరించే ప్రయత్నమేమీ చెయ్యక, అతడు సందు తిరిగేవరకూ వేచివుండి, అతడు ఆఫీసుకి వెళ్ళిపోయాడని నిశ్చయించుకున్నాక ఆ ఇంట్లో ప్రవేశించాడు.

లోపల ఒకే గది. ఆ గదిలో ఒకమ్మాయి చీరకి ఫాల్ కుట్టుకుంటూ కూర్చుని వుంది. అతడిని చూసి తల పైకెత్తి "ఎవరు కావాలండీ" అంది. "నాన్నగారున్నారా?" అడిగాడు రవితేజ.

"లేరండీ" అందా అమ్మాయి. ".....ఇప్పుడే ఆఫీసుకి వెళ్ళారు. బహుశ మీకు ఎదురుపడే వుంటారే."

ఆ అమ్మాయిని చూసిన వారెవరూ ఒక బ్లాక్ మెయిలర్ కూతురనుకోరు. చదువుకున్నదాన్లా వుంది. ఒక తెలియని నమ్రత ఆ అమ్మాయిలో కనపడుతూంది. రవితేజ ఫుల్ సూట్ లో వున్నాడు. డబ్బు తెచ్చే అందంకన్నా అందమైన ఠీవి అతనిలో వుంది. అలాటివాడు తండ్రిని వెతుక్కుంటూ తమ ఇంటికి ఎందుకు వచ్చాడో తెలియక ఆ అమ్మాయి కంగారుపడుతూంది. కూర్చోమనటానికి కూడా సరయిన కుర్చీ ఆ ఇంట్లో లేదు. అందుకని ఇబ్బందిగా చూస్తోంది. తండ్రి లేడని ఆమె చెప్పగానే అతడు బయటకు వెళ్ళడానికి సిద్ధపడుతూ "ఎక్కడ దొరుకుతడు ఆయనిప్పుడు? ఆఫీసెక్కడ?" అని అడిగాడు- ఏమీ ఎరగనట్టు.

"జనరల్ పోస్టాఫీసు-"

రవితేజ ఉలిక్కిపడ్డాడు. జ.న.ర.ల్ - పోస్టాఫీసు!!! అక్కడ పనిచేసే మనిషి తనకేదో రహస్యం చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడూ అంటే చెంచురామయ్య అక్కడ ఏదో మతలబు చేసి వుండాలి. రవితేజ మనసు కీడు శంకించింది. ఇది తను అనుకున్నంత చిన్న విషయం కాదని తోస్తోంది.

అతను ఆలోచనలోపడటం చూసి ఆ అమ్మాయి "నాన్నగారికేమైనా చెప్పాలా అండీ?" అని అడిగింది.

"వద్దు. నే వెళ్ళి కలుసుకుంటాను. కాస్త పేరూ, సెక్షన్ అదీ వ్రాసిస్తారా" అన్నాడు. ఆ అమ్మాయి ఏదో అనబోయి, మనసు మార్చుకుని లోపలికి వెళ్ళి తండ్రిపేరూ, ఆఫీసు అడ్రసు వ్రాసి తీసుకొచ్చి ఇచ్చింది. ఆ అమ్మాయి అక్షరాలు ముత్యాల్లా వున్నాయి, పేరు చూశాడు రాఘవరావు అని వుంది. "కొంచెం కాఫీ త్రాగి వెళ్ళండి-" అందామె కాస్త సంకోచంగా అతను వెళ్ళబోతూ వుంటే అతడు కాగితం మడిచి జేబులో పెట్టుకుంటూ "థాంక్స్, వొద్దు వెళ్ళొస్తానండీ" అంటూ గుమ్మంవైపు నడిచి, వెనుదిరిగి "మీరు ఫాల్ తిరగేసి కుడుతున్నారు. చూసుకోండి" అని అక్కన్నుంచి కదిలాడు. ఆ అమ్మాయి స్తబ్దురాలైంది. పరుగెత్తుకెళ్ళి చీరని చూసుకుంది. అతడు చెప్పింది నిజమే. అంతదూరం

నుంచే ఆయనకీ విషయం ఎలా తెల్సిందబ్బా అనుకుంది. ఆమె గుమ్మం దగ్గర కొచ్చేసరికి అతడు వెళ్ళిపోయాడు.

## 20

**రవితేజ** ఆఫీసు కొచ్చేసరికి పదకొండు దాటింది. ఏం చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు.

అతడు దీర్ఘంగా ఆలోచిస్తూ వుండటం చూసి, "ఏమిటి అలా వున్నారు?" అని అడిగింది ప్రియంవద. అతడు జరిగినదంతా చెప్పాడు. "పోలీస్ రిపోర్టిస్తే వాళ్ళే అంతా చూసుకుంటారు కదా" అన్నది.

"ముందలాగే అనుకున్నాను. కావాలనుకుంటే అతడు మన ఆఫీసుకు వచ్చినప్పుడే అరెస్టు చేయించవచ్చు. కానీ ఆ విషయం చెంచురామయ్యకు తెలిస్తే జాగ్రత్తపడిపోతాడు. అందుకని అతడి ఆచూకీ తెలుసుకోవడానికి స్వయంగా ప్రయత్నించాను. ఇప్పుడిక అతడి అడ్రస్ తెలిసింది. మూడోకంటికి తెలియకుండా అతడిని పోలీసులకు పట్టివ్వొచ్చు. వాళ్ళే నిజం కక్కిస్తారు. కానీ...." అతడు ఆగాడు. "....ఆ ఇంటిని చూడనంతవరకూ నాకూ అదే అభిప్రాయం, ఆలోచనలో వుండేది. కానీ ఇప్పుడెందుకో అలా చేయబుద్ధి కావటంలేదు. ప్రియంవదా, అతడు స్వభావసిద్ధంగా రౌడీకానీ, బ్లాక్ మెయిలర్ గానీ కాదు. ఒక ముసలి గుమాస్తా రేపో ఎల్లుండో రిటైరవడానికి సిద్ధంగా వున్నాడు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంలా ఒకసారి మనం రిపోర్ట్ ఇస్తే అతడి అరెస్టు సస్పెన్షన్-ఇక జీవితం నరకమైపోతుంది. అదే ఆలోచిస్తున్నాను" అంటూ అతడి ఇంటి గురించి చెప్పాడు.

"మనం అతడిని బెదిరించి రహస్యం రాబట్టాలి. అంతేకదా?"

"అంతే!"

"నాకో చిన్న ఆలోచన వస్తూంది."

"ఏమిటి?"

"మా కజిన్ ఒకడున్నాడు. పోలీస్ ఇన్ స్పెక్టర్. వరుసకి అన్న అవుతాడు. వాడిద్వారా ఆయన్ని బెదిరించి, రహస్యం కక్కించవచ్చు." రవితేజ ఒక్కక్షణం ఆలోచించి, "ఈ ఆలోచన బాగానే వుంది. కానీ ఇది ఎంత తొందరగా జరిగితే అంత మంచిది" అన్నాడు.

"ఇప్పుడే ఒక గంటలో రమ్మని చెబుతాను." అని ఆమె లేచింది. అరగంట తరువాత ఇంటర్ కమ్ మ్రోగింది. ఇన్ స్పెక్టర్ వచ్చాడనీ, క్రింద ఎదురుచూస్తున్నాడని ఆమె చెప్పగానే అతడు క్రిందికి వెళ్ళాడు.

"ఈయన భాస్కర్ యస్సై....." అంటూ రవితేజకి పరిచయం చేసింది.

"నేను పైకి వస్తే అనవసరంగా అందరి కళ్ళూ పడతాయని రాలేదు. ప్రియంవద ఫోన్ చేసి అర్జంటుగా రావాలని చెప్పింది. ఏమిటి విషయం" అన్నాడు భాస్కర్.

రవితేజకి అతను చెప్పినదాన్లో నిజం వుందనిపించింది. ఇన్ స్పెక్టర్ తన దగ్గరికి వస్తే అందరిలోనూ ఆసక్తి రేకెత్తవచ్చు. చెంచురామయ్య మనుషులు తన ఆఫీసులోనే వున్నారు.

"రండి వెళ్తూ మాట్లాడుకుందాం" అన్నాడు. ముగ్గురూ కార్లో వెళుతూ వుంటే రవితేజ జరిగిన విషయం అంతా చెప్పాడు. చెప్పి "పోలీసు రికార్డుల్లోకి ఎక్కకుండా అసలు విషయం రాబట్టాలి-" అన్నాడు. "దానిదేముంది. వాడు ప్రొఫెషనల్ కాకపోతే రెండు నిముషాల్లో భయపడి అంతా చెప్పేస్తాడు. ఆ విషయం నాకు వదిలి పెట్టండి-" అన్నాడు.

కారు పోస్టాఫీసు ముందు ఆగింది. భాస్కర్, "ఏం చేద్దాం" అన్నట్టు రవివైపు చూసి, "మీరు ముందే చెప్పివుంటే మామూలు డ్రెస్ లో వచ్చి వుండేవాడిని" అన్నాడు.

"అలాగయితే అసలు చెప్పడు-"

"ఇప్పుడు ఈ డ్రెస్ లో నేను లోపలికి వెళ్తే మళ్ళీ అదే సమస్య. అక్కడినుంచి ఈ వార్త అంచెలంచెలుగా పాకిపోతుంది" అన్నాడు యస్సై.

"నన్ను చూస్తే మరీ బెదిరిపోతాడు" అన్నాడు రవి.

"నేను వెళ్ళి అతడిని బయటకు తీసుకురానా?" అంది ప్రియంవద.

"నువ్వా-"

"అవును ఏదో ఒక మిషమీద తీసుకొస్తాను. బయట మిమ్మల్ని చూసినా పెద్ద ప్రమాదమేమీ వుండదు. భాస్కర్ ఎలాగూ డ్రెస్ లో వున్నాడు కాబట్టి జనం కూడా ఏమీ అనుకోరు. అతడిని కారు ఎక్కించి మనం తీసుకుపోవచ్చు."

మిగతా ఇద్దరికీ ఈ ఆలోచన బాగానే వుందనిపించింది. ప్రియంవద లోపలికి వెళ్ళి రాఘవరావును వెతికిపట్టుకుని దగ్గరకు నడిచింది.

"నమస్తే!" పని చేసుకుంటున్న తను తలెత్తి "ఎవరు కావాలి?" అని అడిగాడు.

"మీ అమ్మాయి నేనూ స్నేహితులమండీ" అంది ప్రియంవద వినయంగా. "తను ఫోన్ చేసి వీలయితే ఈ రోజు ఓ రెండొందలు సర్దమంది. 'ఇంటివరకు వెళ్ళడమంటే-దూరం కదా! మీ నాన్నగారికి అందజేస్తాను' అన్నాను. సరేనంది. మరి మీకు ఇమ్మంటారా?" అంటూ పర్స్ కోసం వెతికింది.

"మా అమ్మాయి అడిగిందా?" అంటున్నాడు అతడు. అతడి మాటలు వినిపించుకోకుండా ప్రియంవద గాభరాగా "అరె-పర్స్" బయటే కార్లో మర్చిపోయినట్టున్నాను. మీరేమీ అనుకోకపోతే వస్తారా - ఇచ్చేసి వెళ్ళిపోతాను. నాకు చాలా అర్జెంట్ పనులున్నాయి" అంటూ బయటికి నడిచింది.

అతడు ఆమెను అనుసరించి, కారు దగ్గరకు వచ్చాడు.

అతడు కారు దగ్గరకు రాగానే చెరోవైపునుండి రవితేజ, ఇన్ స్పెక్టర్ డోర్లు తెరుచుకుని చటుక్కున దిగారు. రాఘవరావు వాళ్ళని చూసి బిత్తరపోయి వెనక్కు తిరగబోయాడు. భాస్కర్ చెయ్యి అతడి మెడమీద పడింది. బలంగా కారులోకి తోశాడు. వెనుకసీట్లో ముగ్గురూ కూర్చోగానే రవితేజ కారు స్టార్ట్ చేశాడు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

"ఏమిటిది? నాకేం తెలీదు. నన్నొదలండి" అంటూ గింజుకుంటున్నాడు అతడు. రవితేజ తాపీగా కారు నడుపుతూ, "ఎక్కడికి పోనీమ్మంటారు ఇన్ స్పెక్టర్?" అని అడిగాడు.

"మా పోలీస్ స్టేషన్ కి."

"వొద్దొద్దు నన్ను లాకప్ లో మాత్రం పెట్టకండి. నా ఉద్యోగం పోతుంది. పిల్లలు గలవాడిని."

"బ్లాక్ మెయిల్ చేస్తున్నప్పుడు అది గుర్తుకురాలేదా?" ఇన్ స్పెక్టర్ గద్దించాడు. అతడు మాట్లాడలేదు.

"నేను కావాలంటే ఒక ఛాన్సిస్తాను" అన్నాడు రవితేజ. "అసలు విషయం ఏమిటో వివరంగా చెప్పు. ఇందులో ఎవరెవరు వ్యక్తులు ఇన్ వాల్వ్ అయివున్నారో ఒక్కటి కూడా వదలకుండా చెప్పు. నువ్వు చెప్పిందంతా నిజమని తోస్తే కేసు ఉపసంహరించుకుంటాను."

"వాళ్ళు నన్ను చంపేస్తారు."

"చెప్పకపోతే మేమే చంపుతాము" ఇన్ స్పెక్టర్ గద్దించాడు. రవితేజ ఇన్ స్పెక్టర్ ని వారిస్తూ అతడివైపు తిరిగి

"నువ్వు ఈ విషయాలన్నీ నాకు చెప్పావని మూడవ వ్యక్తికి తెలిసే అవకాశం లేదు" అన్నాడు. "కావాలంటే ఈయన్ని కూడా దింపేస్తాను. నా ఒక్కడికే చెపుదూ గాని సరేనా-" అన్నాడు.

ఆ వ్యక్తి మౌనంగా వుండిపోయాడు.

"మిమ్మల్ని పోలీస్ స్టేషన్ దగ్గిర దింపనా?"

"వద్దు, ఇక్కడ దిగిపోతాను" అన్నాడు ఇన్ స్పెక్టర్.

ప్రియంవద "నేను కూడా దిగిపోతాను. ఇక్కడనుంచి ఆఫీసు దగ్గిరే కదా" అంది అతడు తెలుసుకోబోయే విషయం వినటం తనకీ ఇష్టం లేనట్టుగా రవితేజ కారు ఆపగానే వాళ్ళిద్దరూ దిగిపోయారు.

రవితేజ అతనిని తన ఇంటికి తీసుకువెళ్ళాడు. పై గదిలోకి తీసుకువెళ్ళి తలుపులు వేసి, "ఇక చెప్పు" అన్నాడు.

అతడు వెంటనే జవాబు చెప్పలేదు.

"నేను కావాలంటే ఇన్ స్పెక్టర్ కి ఫోన్ చేసి క్షణాల్లో రప్పించగలను. కేవలం నిన్నూ, నీ కుటుంబాన్ని నాశనంచేయటం ఇష్టం లేక ఇలా తీసుకొచ్చాను. ఇక్కడికి తీసుకొచ్చాక కూడా నువ్వు బెట్టుసరిచేస్తే నిన్నెవరూ రక్షించలేరిక-"

అతడు నెమ్మదిగా అన్నాడు- "మీరు పోస్ట్ ద్వారా పంపే చీరల్ని ప్యాకెట్లలోంచి తీసేసి దాని బదులు పాతగుడ్డలు పెట్టాలి."

రవితేజ షాక్ తిన్నాడు. "ఎలా సాధ్యం ఇది? ఎన్ని చీరెలు అలా తీయగలరు? మీ మీద పై అధికారుల నిఘా వుంటుంది కదా." అతడు తలవంచుకునే సమాధానాలు చెపుతున్నాడు. "ఇన్సూర్ చేసిన ప్యాకెట్లలోంచి కూడా వస్తువులు కొట్టేసి, చెత్తా చెదారం పెట్టి తిరిగి మామూలుగా వాటిని పంపటం పోస్టాఫీసుల్లో కొత్తకాదు. రిజిష్టర్ పోస్ట్ లో అయితే మరీ సులభం-"

"కానీ ఎన్ని చీరలని అలా కొట్టేస్తారు? ఎప్పటికయినా ఇది బైటపడుతుంది కదా."

"ఎన్నో కాదు మేము కొట్టెయ్యవలసింది కూడా పది- పదిహేను చీరలే. వాటి అడ్రసులు కూడా మాకిచ్చారు. ఆ అడ్రస్సులకి మీరు పంపే చీరలు మాత్రం తొలగించి, వేరేవి పెట్టి పంపాలి. దానికోసం మాకు వెయ్యి రూపాయలు లంచం ఇచ్చారు."

రవితేజ వినటంలేదు. మనసులో అంతకు కొన్ని రోజుల ముందు చెంచురామయ్య పాత్రికేయులకు ఇచ్చిన ఖరీదైన విందు ఫ్లాష్ లాగా గుర్తుకొచ్చింది.

ఈ పథకం వెనుక వున్న రహస్యం మంచులా విడిపోసాగింది.

-రవితేజ టెక్స్ టైల్స్ పోస్ట్ ద్వారా పంపే స్కీమ్ లో చెంచురామయ్య తాలూకు కస్టమర్లే పదిమంది దాకా "మాకు చీరలు కావాల"ని ఉత్తరాలు వ్రాస్తారు. వారికి పంపే పార్సిల్లో పోస్టాఫీసులోనే చీరెల మార్పిడి జరుగుతుంది.

పదిమందీ కోర్టుకి వెళతారు.

మా దగ్గిర వందా తీసుకొని చీరల బదులు పాత పేపర్లు పెట్టి పంపారని రవితేజ కంపెనీ మీద దావా వేస్తారు. రిజిస్టర్ పోస్టు కాబట్టి రవితేజ కంపెనీ పోస్టాఫీసుని నిలదీస్తుంది. కాని ఇదంతా ఒకవైపు. పత్రికల్లో ఈ విషయాన్ని తాటికాయంత అక్షరాలతో ప్రచురిస్తారు.

**పోస్టుద్వారా చీరలు అమ్మే పథకం వైఫల్యం.**

"రవితేజ కంపెనీ వారు కొత్తగా ప్రవేశపెట్టిన పథకం ద్వారా పంపే పార్సిల్స్ లో చీరలు మాయమైపోతున్నాయని కష్టమర్లు నిరాశ ప్రకటిస్తున్నారు. తమకు అందిన పార్సిల్స్ లో చీరలు లేని కారణంగా దాదాపు పదిమంది రవితేజ కంపెనీ మీద వేర్వేరు కోర్టుల్లో దావా వేశారు. కేసులు నడుస్తున్నాయి."

చాలు.

ఈ వార్త దావానలంలా పాకిపోతుంది.

దాదాపు లక్ష చీరలు పంపిస్తే అందులో కేవలం పది చీరలే ఈ విధంగా మిస్సయ్యాయని ఎవరూ అనుకోరు. తమ చీరకే ప్రమాదం వాటిల్లబోతుందని భావిస్తారు. జనం ఆలోచన్లు గుంపులో ఇలాగే వుంటాయి. "ఎందుకొచ్చిన బాధ ఇదంతా, షాపుకి వెళ్ళి కొనుక్కుంటే సరిపోదా" అనుకుంటారు.

ఈ విధంగా దెబ్బ కొట్టటమే చెంచురామయ్యకి కావలిసింది.

తను ఇంత కష్టపడి ఆలోచించిన పథకమూ మట్టి కరవబోతూంది. చాలా గొప్ప తెలివితేటల్తో చెంచురామయ్య తమ పునాదులు కదల్చబోతున్నాడు.

తిరిగి దీన్ని తిప్పి కొట్టాలంటే-పై ఎత్తు వేయాలి. ఇంత కింతా దెబ్బతీయాలి.

......రవితేజ ఆలోచనలో పడ్డాడు.

కొంచెంసేపటికి తలెత్తి "నాకా పదిమంది అడ్రసులూ కావాలి" అన్నాడు. అతడు అర్థంకానట్టు "ఎవరివి" అని అడిగాడు.

"చెంచురామయ్య మనుష్యులవి. కష్టమర్లుగా నాటకం ఆడుతున్న వాళ్ళవి."

"కష్టం అసాధ్యం."

"నా ఆఫీసు కొచ్చి పదిహేను వేలిమ్మని నన్ను బెదిరించేటంత ధైర్యం వున్నవాడివి నీకు అసాధ్యం ఏమిటి?ఏం చేస్తావో నాకు తెలీదు నాకు ఆ అడ్రసులు మాత్రం కావాలి."

"లేకపోతే".

రవితేజ నవ్వాడు. "ఇప్పటి మన సంభాషణంతా రికార్డయింది, వింటావా?" అంటూ అల్మైరా వేపు చూశాడు.

ఆ వ్యక్తి మొహం వాడిపోయింది. "ఇది అన్యాయం" అని అరిచాడు.

"బ్లాక్ మెయిల్ నేరానికి నీకు ఆరు సంవత్సరాలు శిక్షపడకుండా వుండాలంటే ఈ పని చేసి పెట్టక తప్పదు."

"ఆ లిస్టు నా దగ్గిర లేదు. మా పై ఆఫీసర్ దగ్గిర వుంటుంది" అన్నాడు రాఘవరావు.

"దాన్ని తీసుకురమ్మనే చెపుతున్నాను."

"నాకంత ధైర్యం లేదు."

"పదిహేను వేలు అడగటానికి ధైర్యం వచ్చిందా?" మళ్ళీ అన్నాడు. దాంతో రాఘవరావు మొహం కందగడ్డలా ఎర్రగా మారింది. అదొక రకమైన కళ అతడి మొహంమీద నడయాడింది. "అవును వచ్చింది" అని అరిచాడు హిస్టీరిక్ గా.

"......మా అమ్మాయి పెళ్ళి చెయ్యాలి. పదివేలు కట్నం అడిగారు. ముహూర్తం నాల్గురోజులు కూడా లేదు. ఏం చేసైనా సరే డబ్బు సంపాదించాలి...."

అతడు అరవటం ఆపుచేయగానే ఆ గదిలో గాఢమైన నిశ్శబ్దం పేరుకుంది. రవితేజలో మాత్రం పెద్ద మార్పులేదు. అతడి వేపు సూటిగా చూస్తూ "బీదరికం నీతో సాహసం చేయించింది. నిండు ఆఫీసులోనే నాతో మాట్లాడి బేరమాడించింది!......ఇప్పుడు నీ ఉద్యోగం పోతుంది. నీ కూతురికిక నాల్రోజుల్లో కాదు కదా, జన్మలో పెళ్ళికాదు. ఆలోచించుకో నాకు ఆ పేర్లు కావాలి. అతడిచ్చే డబ్బుకోసం అతడు చెయ్యమన్న పనికి వప్పుకున్నావు. ఆ రహస్యం నాకు బేరంపెట్టి మరింత డబ్బు సంపాదించాలనుకున్నావు. ఇప్పుడు ఆ బాణం నీ మీదకే తిరిగింది. నిన్ను సర్వనాశనం చేయబోతోంది. మా ఇద్దరిమధ్యా నువ్వు నలిగిపోక తప్పదు" అన్నాడు.

"మీరు మనుష్యులు కాదు రాక్షసులు" నిస్సహాయంగా అరిచాడు రాఘవరావు.

"కాదు, వ్యాపారస్తులం."

..................

రెండు రోజులు గడిచాయి. రవితేజ ఇంకా స్టాకు బట్వాడా చేయలేదు. గోడౌన్సులో పేరుస్తున్నాడు. అది కొంతకాలంపాటు పనిచేస్తుందని తెలుసు.

అతడికెందుకో రాఘవరావు ఆ పేర్లు పట్టుకు వస్తాడని బలంగా అనిపిస్తూంది. సరీగ్గా అదే సమయానికి అతడు ఒక సైన్సు మాగ్జయిన్ లో ఒక వార్త చదివాడు.

ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవటానికి, తద్వారా జీవితంలో ఒక పెద్ద మార్పు సంభవించటానికి చిన్న చిన్న సంఘటనలే చాలు. పత్రికలో చిన్న వార్త అది.

**మ్యాజిక్ మిర్రర్**

అన్న హెడ్డింగ్ క్రిందపడింది. పేటెంట్ నెం. 0296139. ఫాషన్స్ సిస్టమ్స్ కార్పోరేషన్, న్యూయార్క్ వారు పరిచయం చేస్తున్నారు దీన్ని.

అతడు ఆ వివరాలు చదివి నిటారుగా అయ్యాడు. పది నిముషాలపాటు ఏకాగ్రతతో దాని గురించే ఆలోచించాడు. భారతదేశంలో అదంటూ పరిచయం అవుతే, తమద్వారానే అవ్వాలి. ఈ విషయం మూడోకంటికి తెలియటానికి వీల్లేదు.

ఆ మరుసటిరోజు శర్మ కొక్కడికే చెప్పాడు ఈ విషయాన్ని ఆయన కూడా ఇటువంటి సిస్టమ్ వస్త్ర ప్రపంచంలోకి వస్తుందని తెలిసి ఆశ్చర్యపోయాడు.

"దీని తాలూకు మరిన్ని వివరాలు కనుక్కోలేకపోయావా?"

"నిన్న రాత్రే న్యూయార్క్ ఫోన్లో మాట్లాడాను. సంవత్సరం పాటు భారతదేశంలో కేవలం మనం ఒక్కరిమే ఉపయోగించుకునేటట్టు కాంట్రాక్టు ఇస్తామన్నారు. రేటుకూడా తక్కువగానే వుంది. మిగతా వివరాలు మాట్లాడటం కోసం స్వయంగా రమ్మన్నారు."

"ఎప్పుడు వెళుతున్నావు?"

"ఇదిగో ఈ చెంచురామయ్య గొడవ అయ్యాక."

"మన డైరెక్టర్లకి చెప్పాలేమో-మళ్ళీ ఇంకో యాభై-అరవై లక్షల పెట్టుబడి కదా."

"నేను వెళ్ళి వచ్చాక చెపుదాం. ఇప్పుడే చెప్పేస్తే 'లీక్' అయిపోతుంది."

"సరే-"

రవితేజ వీసా, పాస్ పోర్ట్ సిద్దం చేయించుకున్నాడు. ప్రియంవదకు కూడా ఈ విషయం చెప్పలేదు. అతడికి ఒక విషయం ఆశ్చర్యంగా వుంది. ఆ రోజు ప్రియంవద ఇంట్లో ఆమెను ముద్దు పెట్టుకున్నాక- తిరిగి మళ్ళీ ఆ కోర్కె కలగకపోవటం!

ఎన్నో నిశ్శబ్దపు అర్ధరాత్రులు, నిద్ర దూరమైనప్పుడు ఈ విషయాన్ని ఎనలైజ్ చేసి చూసుకున్నాడు. అతడికి ఒక విషయం అర్ధమైంది!

తను ప్రియంవదని ప్రేమించటం లేదు. తను ప్రేమింపబడటాన్ని ప్రేమిస్తున్నాడు!!! ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం తాండవిస్తూంది. తనకీ మాధవికీ యిక సంబంధం పూర్తిగా తెగిపోయినట్లే. జీవితాంతం ఒకే యింట్లో వున్నా తామిద్దరూ భార్యాభర్తల్లా మెలుగుతారన్నది సందేహమే! కేవలం సమాజం కోసం కలిసి వుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆప్యాయత కోసం తనలో వున్న దాహాన్ని మిస్ విజయవాడ మేల్కొలిపింది. ప్రియంవధ పానీయపు పాత్రతో దగ్గిరకొచ్చింది. 'ప్రేమ' అన్న పేరు అనవసరం. 'తోడ' అన్నది సరైన పదం. ఈ లోపులో ఈ చెంచురామయ్య గొడవ రావటంతో తాత్కాలికంగా ఆ "తోడు" అవసరం తొలగిపోయింది. ప్రేమ-పని రెండూ వేర్వేరు ధృవాలు. ఒక

పని చేసేవాడు రెండోది చేయలేడు. ప్రేమలో నిండా మునిగి వున్నవాడు ఏ పనీ చేయలేడు. అలా చేసుకోగలిగేవాడిది నిజమైన ప్రేమ కాదు. అతడికి తన ఆలోచనల్లకి తనకే నవ్వొచ్చింది. ఎంత కాదనుకున్నా ఆమె తన పుట్టినరోజు రాత్రి ఫోను చేయటం, లిఫ్ట్ లో రాత్రి గడపటం మధురమైన అనుభవాలులా మిగుల్తాయి.

అతడిలో వ్యాపారస్తుడు ప్రస్తుతం వున్న సమస్య గురించి కూడా మర్చిపోలేదు. ఒకవేళ రాఘవరావు ఆ లిస్ట్ తీసుకొచ్చి ఇవ్వకపోతే ఈ సమస్య నెలా ఎదుర్కోవటమా అన్నది అతడు ఆలోచిస్తూనే వున్నాడు. తను చీరల డిస్పాచ్ మొదలు పెట్టగానే పేపర్లలో చీరల అదృశ్యం సంగతి, కోర్టుకేసులు సిద్దంగా వుంటాయని అతడికి తెలుసు.

అతడు ఏం చేద్దామా అని ఆలోచిస్తూన్న సమయానికి రాఘవరావు అతడి దగ్గరికి వచ్చాడు. అతడి ఆకారం పూర్తిగా మారిపోయి వుంది. గెడ్డం పెరిగింది బుగ్గలు పీక్కుపోయాయి.

"ఇదిగోండి మీరడిగిన లిస్టు" అందించాడు. "రెండు రోజులు కష్టపడితే గాని దొరకలేదు."

ఆ కష్టం అతడి మొహంలో తెలుస్తూంది. రవితేజ ఆ కాగితాన్ని అందుకుంటూ 'థాంక్స్' అన్నాడు.

"దయచేసి నా మాటలు రికార్డు చేసిన క్యాసెట్టు ఇచ్చేస్తారా?"

"ఇంకా విషయం మర్చిపోండి. మీ ఉద్యోగానికి ఏ ప్రమాదమూ లేదు. పోతే నాదొక సలహా! దొంగతనం, బ్లాక్ మెయిలింగ్ కూడా ఒక కళ! అది అందరికీ చేతకాదు. బై ది బై మీ కూతురి పెళ్ళి ఏమైంది?"

అతడు తల వంచుకుని "ఆగిపోయింది" అన్నాడు. "....రేపే ముహూర్తం నిన్న సాయంత్రం వరకూ వాళ్ళడిగిన డబ్బు ఇవ్వలేకపోవటంతో సంబంధం వదిలేసుకున్నాను."

"ఇప్పుడా డబ్బు ఇస్తే వాళ్ళు ఒప్పుకుంటారా?"

యధాలాపంగా ఆ ప్రశ్న విన్న రాఘవరావు అది అర్ధమవగానే చప్పున తలెత్తాడు. "ఏ....ఏమిటీ?" అన్నాడు తటబడుతూ.

రవితేజ బీరువాలోంచి పదిహేనువేలు తీసి అతడి ముందుంచాడు. "తీసుకోండి. మీరు మా కంపెనీకి చేసిన సహాయానికి ఇది బహుమతి. రాఘవరావుకి కళ్ళ నీళ్ళు తిరిగాయి. అతడింకా ఇదంతా వాస్తవమని నమ్మలేక పోతున్నాడు. వణికే చేతుల్తో ఆ డబ్బు తీసుకున్నాడు. రవితేజ అన్నాడు- "మొన్న మీరొక మాట అన్నారు గుర్తుందా, మేము రాక్షసులమని! అవును రాక్షసులమే. వ్యాపారంలో నైతిక విలువలకు చోటు లేదు. మీ బలహీనతని ఎక్స్ ప్లాయిట్ చేయటానికి మా ప్రత్యర్ధి ప్రయత్నించాడు. మీరున్న పరిస్థితిని వాడుకోవటానికి నేను ప్రయత్నించాను. ఈ

చదరంగంలో మీరొక పావు. ఆఫీసర్లు, గుమాస్తాలు, ఓటర్లు అందరూ పావులే. మా అంత తెలివితేటలు మీకు లేవు. అందుకని దొరికిపోయారు. ఆ లెవల్లో ఆలోచిస్తే మీ తప్పు ఏదీ నాకు కనపడలేదు. బీదవాళ్ళకి చౌకధరలకి చీరలు ఇవ్వాలనే నా ఆశయాన్ని దారుణంగా పడగొట్టాలనే ప్రయత్నం చేసిన చెంచురామయ్యని ఏమీ చెయ్యలేని ప్రభుత్వానికి మీమీద లంచగొండితనం నేరాన్ని మోపే అధికారం కూడా ఏమీలేదు. మీ స్థాయిలో మీరు డబ్బు సంపాదించటానికి ప్రయత్నించారంతే. మాకన్నా మీకే డబ్బు అవసరం ఎక్కువుంది. అది తీసుకెళ్ళి మీ కూతురి పెళ్ళి నిర్విఘ్నంగా జరిపించండి."

రాఘవరావు రెండు చేతుల్తో నోట్లకట్టలు పట్టుకుని, ఆ చేతుల్తోనే నమస్కారం చేశాడు. ప్రభుత్వ యంత్రంలోంచి వూడిపోయిన బోల్టులా వున్నాడు అతడిప్పుడు.

"నా కూతురు జీవితాన్ని నిలబెట్టావు బాబూ ఇదంతా మా అమ్మాయికి చెప్తే..."

"ఇదేమీ చెప్పనవసరంలేదుగానీ-"రవితేజ నవ్వేడు. "చీరకి ఎటువైపు ఫాల్ కుట్టాలో పెళ్ళయ్యాకైనా సరీగ్గా తెలుసుకోమన్నానని చెప్పండి అర్ధమవుతుంది."

* * *

ఆ తరువాత జరగవలసిన కార్యక్రమాలన్నీ ఒక పద్ధతిలో జరిగిపోయాయి. పోస్ట్ పార్సెల్స్ వెళ్ళటం మొదలైంది.

బ్యాచీల ప్రకారం చీరలు వెళ్తున్నాయి.

చెంచురామయ్య ఈ విషయాలన్నీ ఎప్పటికప్పుడు కనుక్కుంటూనే వున్నాడు. చెయ్యవలసిన ఏర్పాట్లు చేసి రవితేజ అమెరికా వెళ్ళిపోయాడు. కేవలం విహారయాత్ర కోసం అతడు పర్యటనకు వెళ్ళినట్టుగా కలర్ ఇవ్వబడింది. చెంచురామయ్య కూడా దానికి అంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. అతడి దృష్టి అంతా- తమ వాళ్ళకి రవితేజ చీరలు ఎప్పుడొస్తాయో- ఎప్పుడు ఈ వార్త పేపర్లకిద్దామా అని వుంది. ఇంకో పదిహేను రోజులకి గానీ ఆ పేర్లున్న బ్యాచ్ కి రవాణా సాగదని తెలిసింది.

ఈ లోపులో అతడికి ఈ వార్త తెలిసింది. దాదాపు పది- పదిహేను ప్రదేశాల్లో కస్టమర్లకి (తన వాళ్ళు కాదు, మామూలుగానే) కేవలం ఖాళీ పాకెట్లు మాత్రమే అందాయని, వారు పోస్టల్ డిపార్ట్ మెంటుకి ఈ విషయమై ఫిర్యాదు చేశారని!

చెంచురామయ్య మనసులోనే సంతోషించాడు. తను ఏదైతే చెయ్యదల్చుకున్నాడో, తన ప్రమేయం లేకుండానే అది జరుగుతూంది. వెంటనే తనకి పరిచయమున్న పత్రికల వారినిద్దరిని ఆ కస్టమర్లు దగ్గరికి పంపాడు. వారు వాళ్ళని

ఇంటర్వ్యూ చేశారు. ఆ కస్టమర్లు రవితేజ కంపెనీవి తమకు పోస్ట్ లో చీరెలు అందలేదని సంజాయిషీ కోరుతూ ఇచ్చిన లీగల్ నోటీసుల కాపీలు చూపించారు. చెంచురామయ్య- రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు ఆనందించాడు. మరుసటిరోజు పేపర్లలో ఈ వార్త వచ్చేసింది, "రవితేజ టెక్స్ టైల్స్ పోస్టల్ స్కీమ్ వైఫల్యం" అన్న హెడ్డింగ్ తో.

పోస్టల్ చీరెలు మిస్సయిన దృష్ట్యా కస్టమర్లు కోర్టుకు వెళ్తున్నారనీ అసలీ స్కీమ్ లోనే లోపం వుందనీ ఆ రెండు పత్రికలూ ప్రముఖంగా ప్రచురించాయి. ఇద్దరు ముగ్గురు కస్టమర్ల ఫోటోలు కూడా ముచ్చటపడి ప్రచురించారు ఆ రిపోర్టర్లు

మరుసటిరోజు ఆ రెండు పత్రికలకి లాయరు నోటీసు వచ్చింది. దీన్ని పంపించింది రవితేజ కంపెనీ!

చీరలు అందలేదంటూ ఫిర్యాదు చేసిన కస్టమర్లని తమ కంపెనీ రిప్రజెంటేటివ్స్ కలుసుకున్నారనీ, ఆ కస్టమర్లు తాము ఆ విధంగా ఫిర్యాదేమీ చేయలేదన్నారనీ....పత్రికలో పడిన వార్త తమకు కూడా ఆశ్చర్యం కలిగించినట్టు ఆ కస్టమర్లు చెప్పారనీ, తమ ఫోటోలు ఆ పత్రికల వాళ్ళకి ఎలా దొరికాయో తమకీ అర్థంకావడం లేదని వాళ్ళు అన్నారనీ తమ వ్యాపారానికి ఈ విధంగా అబద్ధపు వార్తలతో నష్టం కలిగించినందుకు ఎందుకు సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోకూడదో తెలుపవలసిందని రవితేజ కంపెనీ ఆ పత్రికాధిపతులకు పంపిన నోటీసు అది.

పత్రికల యాజమాన్యం కదిలిపోయింది.

అసలీ అబద్ధపు వార్త తమ పత్రికల్లో ఎలా ప్రచురితమైందో వాళ్ళకీ అర్థం కాలేదు. ఈ కస్టమర్ల అడ్రసులు తమ రిపోర్టర్లకి ఎలా అందేయన్న ప్రశ్న ముందు కలిగింది. తీగెలాగితే డొంకకదిలినట్టు దీని వెనుక చెంచురామయ్య వున్నట్టు బైటపడింది. ఒక అబద్ధపు వార్తని సృష్టించి, ఒక ప్రముఖ కంపెనీకి పరువునష్టం కలిగించినందుకు ఆ రిపోర్టని సస్పెండు చేశారు. స్టేట్స్ నుంచి రవితేజ వచ్చేసరికి ఇక్కడున్న పరిస్థితి ఇది!

(ఆ కస్టమర్లు తమ మనుష్యులే అన్న విషయాన్ని అతడు మూడోకంటికి కూడా తెలియనివ్వలేదు.)

పత్రికల వాళ్ళతో బేరం పెట్టారు. తమ కేసు ఉపసంహరించుకొనేట్టు దానికి ప్రతిగా వాళ్ళు తమ కంపెనీకి 'కొంత' సహాయం చేసేటట్టు! అతడు అడిగింది చాలా చిన్న విషయాలు కాబట్టి వాళ్ళు వెంటనే ఒప్పుకున్నారు. పోస్టులో చీరెలు మిస్ అవుతున్నాయన్న వార్త అబద్ధం నాయి మరుసటిరోజు తాటికాయంత అక్షరాల్తో వ్రాస్తారు. ఆ తర్వాత ఈ చౌక చీరెల స్కీమ్ గురించి, రవితేజ టెక్స్ టైల్స్ ప్రాశస్త్యం గురించి, వగైరా వగైరా వరుసకి ఆర్టికల్స్ వచ్చాయి. చీరలమీద వ్యాసాలూ ప్రచురింపబడ్డాయి. పత్రికల వాళ్ళకీ, రవితేజకీ సంబంధాలు మెరుగుపడ్డాయి. ఒకసారి స్నేహం కలిశాక అల్లుకుపోవటం పెద్ద సమస్యకాదు. అదంతా వేరే సంగతి. మొత్తంమీద-మీదపడబోయిన అణ్వస్త్రాన్ని అణుశక్తిగా మార్చుకుని, రవితేజ చెంచురామయ్యని సరియైన చోట ఆ విధంగా దెబ్బకొట్టాడు. వ్యాపారంలో అటువంటి విజయాలు యిచ్చే ఆనందాలు మరేవీ ఇవ్వవు. సహజంగానే రవితేజ చాలా జుబిలియెంట్ మూడ్ లో

వున్నాడు. ప్రియంవదకి థాంక్స్ చెప్పాడు.

"ఆ రోజు నువ్వు ఇన్ స్పెక్టర్ ని తీసుకొచ్చి ఆ విధంగా సాయపడటంతో మనం ఇది సాధించగలిగాం. నా తరపున మీ అన్నయ్యకి కృతజ్ఞతలు చెప్పు" అన్నాడు.

ప్రియంవద నవ్వి "మీరు నన్ను క్షమించాలి" అంది.

అతడు ఆశ్చర్యంగా, "దేనికి?" అన్నాడు.

"మీరు తిట్టనంటే చెపుతాను."

"ఏమిటి విషయం?"

"భాస్కర్ మా అన్నయ్య కాదు."

అతడు మరింత విస్మయంతో "మరి?" అన్నాడు.

"మాతో కలిసి చదువుకున్నాడు అంతే. అంతకన్నా పెద్ద పరిచయం కూడా లేదు. మొన్న రెండు నెలల క్రితం కలిశాడు. ఉద్యోగం ఏమీ చేయటం లేదనీ, నాటకం ట్రూపు ఒకటి నిర్వహిస్తున్నాననీ చెప్పాడు. కాలేజీలో చదివే రోజుల్లో కూడా నాటకాలు వేసేవాడు లెండి.....మీరు 'ఇన్ స్పెక్టర్' అనగానే నాకు అతడు గుర్తొచ్చాడు. ఈ విషయం అతడికి చెప్తే 'తప్పకుండా' అన్నాడు. బట్టలు ఎరువిచ్చే నాటకాల కంపెనీనుంచి డ్రస్ తీసుకొచ్చాడు. మీకు ముందే చెప్తే తిడతారని....." నసుగుతూ ఆపింది.

రవితేజ క్షణంపాటు బిత్తరపోయి, ఆ తరువాత బిగ్గరగా నవ్వేశాడు. "అంతా సవ్యంగా జరగబట్టి సరిపోయింది. కానీ, ఆ రాఘవరావుగానీ పోలీసు స్టేషన్ కి తీసుకెళ్ళమని వుంటే ఏమైవుండేది" అన్నాడు. ఆమె జవాబు ఇవ్వలేదు.

"పోన్లే మొత్తంమీద అనుకున్నది సాధించాం."

.... సరిగా ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి ఆ భాస్కర్ అనబడే వ్యక్తి ఫోన్లో మాట్లాడుతున్నాడు. "అవును ప్రియంవదని కలుసుకున్నాను. మీరు చెప్పమన్నట్టే నాటకాల కంపెనీ వుందని చెప్పాను. అదే సమయానికి రవితేజకి ఏదో సాయం కావాల్సి వచ్చింది. నన్ను ఇన్ స్పెక్టరుగా రవితేజకి పరిచయం చేసింది. అతడికి కావల్సిన పని చేసి పెట్టాను. "మరి నేను ఇన్ స్పెక్టర్ ని కాను. కేవలం తనకి సహాయం చేశాను" అన్న విషయం రావితేజకి ఆమె చెప్పిందో లేదో నాకు తెలీదు. చాలా - ఇంకేమయినా చెయ్యాలా?"

"ప్రస్తుతానికి చాలు"

ఫోన్ కట్ అయింది.

## 21

**ఆ సాయంత్రం** బోర్డు ఆఫ్ డైరెక్టర్ల అత్యవసర సమావేశం జరిగింది. డైరెక్టర్లు వర్రీడ్ గా వున్నారు.

జరిగిన సంఘటనలో రవితేజ టెక్స్ టైల్స్ కీ పత్రికలవారికీ మధ్య సంబంధాలు గట్టిపడిన మాట వాస్తవమే. పరువునష్టం దావా విషయంలో చాలా ఉదారంగా ప్రవర్తించి, రవితేజ కంపెనీ యీ విధంగా లాభం పొందింది. చెంచురామయ్య తేలుకుట్టిన దొంగ లాగా ఊరుకుండి పోవాల్సి వచ్చింది.

అయినా డైరెక్టర్లు అంత సంతోషంగా లేకపోవటానికి కారణం-జరగవలసిన నష్టం జరిగిపోయిందని!

-పోస్టులో పార్సెల్లు మిస్సవుతున్నాయన్న వార్త ఒకసారి జనంలోకి వెళ్ళిపోయాక, అది తప్పుడు వార్త అని ప్రచురించినా మొదట దానంత ప్రభావం వుండదు. రూమరు పాకినంత వేగంగా వాస్తవం పాకదు. దాదాపు కోటి రూపాయల ఖర్చుతో మొదలుపెట్టిన ఈ పథకం, మొదట్లోనే యీ విధంగా వెనకడుగువేస్తే- తిరిగి వేగం పుంజుకునేది ఎప్పుడు? అసలే సగం వ్యతిరేకతతో ప్రారంభమైన ఈ స్కీము, ఈవిధంగా తలనొప్పి వ్యవహారంగా వాళ్ళకి తయారైంది.

రవితేజ మాత్రం ఉత్సహంగా వున్నాడు.

మీటింగు ప్రారంభమవగానే, తను స్టేట్స్ ఎందుకు వెళ్ళవలసి వచ్చిందీ చెప్తూ, తనతోపాటు తీసుకువచ్చిన పాంప్లెట్లు వారి ముందు పరిచాడు.

"ఏమిటవి?" డైరెక్టర్లలో ఎవరో అడిగారు.

"కంప్యూటరైజ్డ్ మిర్రర్స్ మరొకలా చెప్పాలంటే, మ్యాజిక్ మిర్రర్-వీటి తాలూకు వివరాలు తెలిపే పత్రాలు ఇవి. సమీప భవిష్యత్తులో వస్త్రాల షాపుల్లోనూ, ముఖ్యంగా రెడీమేడ్ దుస్తులు, చీరల దుకాణాల్లోనూ నెలకొల్పే ఒకే ఈ అద్దాల్ని మన కంపెనీ సంవత్సరంపాటు భారతదేశంలో గుత్తకు తీసుకుంది. అంటే మొదటి సంవత్సరమంతా కేవలం మన షాపుల్లోనే ఇవి ఉంటాయన్నమాట,"

"ఇంతకీ ఏమిటవి? మనం చేస్తున్నది అద్దాల వ్యాపారమా- బట్టల వ్యాపారమా?"

అతడు చెప్పటం ప్రారంభించాడు.

"మనం బట్టల షాపుల్లో నిత్యం గమనించేది ఏమిటి? నలుగురైదుగురు ఆడవాళ్ళు గంటల తరబడి షాపుల్లో కుర్రవాళ్ళని వందలకొద్దీ చీరల్ని బయటకి తీయించి, చివరికి ఎటూ సంతృప్తి చెందక వెళ్ళిపోవటం చాలా సర్వసాధారణమైన విషయం అవునా? ఒక్క చీర కొనటం కోసం ప్రొద్దున్నుంచీ సాయంత్రం వరకూ బజారంతా తిరిగే ఆడవాళ్ళు కూడా వున్నారు."

అతడు ఆగి, అన్నాడు - "మన చీర అమ్మకాల్లో పదోవంతు ఈ షాపు అద్దెలకీ, కరెంటు ఖర్చుకీ, ముఖ్యంగా అమంకాల కుర్రవాళ్ళ జీతాలకీ ఖర్చు పెడుతున్నాం. ఈ అమ్మే కుర్రవాళ్ళ పరిస్థితి మరీ దారుణం. చీరెల అంచులన్నీ విప్పి చూపించాలి. చివరికి మళ్ళీ ఈ వందచీరలూ యధాతధంగా మడతపెట్టి తిరిగి పెట్టెయ్యాలి. పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ యంత్రాల్లా పనిచేస్తూనే వుంటారు. ఒక్కచీర అమ్మటం కోసం వంద చీరెలు తీసి మళ్ళీ సర్దుతారు. అలాటి పనిని తొలగించే ఈ యంత్రమే హోమ్ కంప్యూటర్-మ్యాజిక్ మిర్రర్! ఈ పద్ధతి ద్వారా కస్టమర్లకి చీరెలు, రెడీమేడ్ వస్త్రాలు.....టేబిల్ మీద కాకుండా, తన శరీరాలకు కట్టుకుంటే ఎలా వుంటుందో అద్దంలో కనపడుతుంది."

యధాలాపంగా వింటున్న డైరెక్టర్లు ఆసక్తిగా ముందుకు వంగారు. "షోకేసుల్లోంచి చీరలు మాటిమాటికీ తీసి మడత విప్పడం, నచ్చకపోతే తిరిగి పెట్టేయటం ద్వారా మన్నిక కూడా తగ్గుతుంది. ఈ చిన్న అద్దంవల్ల ఆ పని తప్పుతుంది. ఇక యీ అద్దం ఎలా పనిచేస్తుందో వివరిస్తాను" అతను ఆగి అన్నాడు.

".....బట్టలు కావలసిన కస్టమరు షాపుకి రాగానే ఆమె ఎత్తు- లావుకి తగినట్టుగా అద్దాన్ని ఎడ్జస్టు చేస్తాం. దానిముందు ఆ కస్టమరు నిలబడగానే, కంప్యూటర్ కి యీ వివరాలు ఫీడ్ చేస్తాం. మొహమూ చేతులూ మామూలు అద్దంలోలాగే కనబడతాయి. కంప్యూటర్ స్టార్టు అవగానే అయిదు సెకన్లకొక చీర చొప్పున ఫోటో మారిపోతూ వుంటుంది. అంటే.....మరోలా చెప్పాలంటే, ఆ చీర కట్టుకుంటే తను యెలా వుంటుందో చకచకా ఫోటోలు ఆమెకే కనిపిస్తాయి. మన షాపులో వున్న అన్ని రకాల చీరల్నీ దాదాపు అరగంటలో ఆమె ఆ విధంగా చూసెయ్యగలదు."

"అసంభవం... ఇంపాజిబుల్-" అన్న మాటలు వినబడినయ్. రవితేజ నవ్వాడు.

"ఇంతకన్నా సైన్సులో మనం చాలా సాధించాం. ఇంత చిన్న విషయం ఇన్ని రోజులవరకూ మనకి ఇలా చెయ్యవచ్చని తట్టలేదంటేనే ఆశ్చర్యంగా వుంది. ఇందులో నిజానికి కష్టం ఏముంది? OUTER PART OF THE BODY మామూలు అద్దంలా ఎడ్జెస్టుచేసి, మన దగ్గిర వున్న చీరెలన్నిటినీ కోడ్స్ రూపంలో కంప్యూటర్ కి ఫీడ్ చెయ్యటమే" అన్నాడు.

"ఫాషన్స్ సిస్టమ్స్, న్యూయార్క్ వారు ఆర్నెల్లక్రితం ఈ కంప్యూటర్ మిర్రర్ ని రెండు షాపుల్లో పరిచయం చేశారు. ఆ షాపులో వున్నా రెడీమెడ్ దుస్తులు తాము ధరిస్తే ఎలా కనపడతాడో అద్దంముందు నిలబడి చూసుకోవచ్చు నన్నమాట. పది నిముషాల్లో ఎనభై రకాల పాంట్లనీ షర్టులనీ ఈ విధంగా చూసుకోవచ్చు. 2-డై మెన్షన్ లో ఇది కనపడుతుంది. ఆక్యూరసీ తొంభైతొమ్మిది శాతం! L.S. Ayres అన్న డిపార్ట్ మెంట్ లో ఈ అద్దం ప్రవేశపెట్టిన మొదటి నెలలో అమ్మకాలు 86.7 శాతం పెరిగాయని తేలింది. ఇంకొక అయిదు సంవత్సరాల్లో బట్టల షాపుల్లో చీరలు అద్దాల బీరువాల్లో వుండవు. షాపుల్లో కేవలం అద్దాలు వుంటాయి. దాన్ని రవితేజ టెక్స్ టైల్స్ ముందుగా ప్రవేశబెడ్తుంది." ఆ రూమ్ చప్పట్లతో మార్మోగింది.

(ఈ నవలలో ఇప్పటివరకూ పరిచయం చేయబడిన-పోస్టు ద్వారా అమ్మటం, మ్యాజిక్ మిర్రర్ అన్నవి అభూత కల్పనలు కావు. ఒక ప్రముఖ సంస్థ పోస్ట్ ద్వారా చీరల్ని అమ్మటాన్ని 1982లో ప్రారంభించింది. అయితే కొన్ని కారణాల వల్ల మనదేశంలో ఈ పథకం సక్సెస్ అవలేదు.)

"పోస్ట్ ద్వారా చౌకధరకి చీరలమ్మే మన పథకాన్ని చెంచురామయ్య దెబ్బకొట్టాడు. మనం అతడిని ఎదురుదెబ్బ తీసాము. అది వేరే సంగతి. ఇప్పుడు ఈ పోస్టల్ సిస్టమ్ ద్వారా పెట్టిన పెట్టుబడిని తిరిగి వెనక్కి తీసుకోవాలి అంటే మ్యాజిక్ మిర్రర్ ని ఈ పథకానికి కలపాలి. ఇప్పటికే మనం యాభైలక్షలు వ్యాపార ప్రకటనకి ఖర్చు పెట్టి ప్రజల మనస్సులో ఈ చౌక చీరలని గాఢంగా ముద్రించాం. ఇప్పుడు ప్రజల భయమల్లా ఈ చీరల కోసం తీరా ఎమ్.ఓ. చేశాక అవి పోస్ట్ లో మిస్సయితే ఎలా అని."

అందరూ రవితేజ మాటలు వింటున్నారు.

"....బొంబాయి, హైద్రాబాద్, మద్రాస్ లాంటి పెద్ద నగరాల్లో ఈ కౌంటర్లు ప్రారంభిస్తాం. పెద్ద పెద్ద బట్టల షాపుల్లా వుండవని. చిన్న చిన్న ఫోటో స్టూడియోల్లా, డార్క్ రూమ్' కంప్యూటరైజ్డ్ అద్దమూ వుంటాయంతే. ప్రవేశ రుసుముగా 5 రూపాయలు పెట్టి చీరె ధరలోంచి దాన్ని తగ్గిస్తాం. నా వూహ నిజమైతే, రకరకాల చీరల్లో తామెలా వుంటామో చూసుకోవటానికే ఆడవాళ్ళు వేలం వెర్రిగా ఎగబడతారు. మనం అద్దంమీద పెట్టిన పెట్టుబడి నెలరోజుల్లో వచ్చేస్తుంది." నవ్వులు.

"...... మనకి ఇప్పటికే లక్షాయాభై వేల చీరలకి ఆర్డర్లు వచ్చినయ్. ఈ నగరాల్లో కస్టమర్లకి పోస్టులో కూపన్లు పంపిస్తాం. మీరు అడిగిన చీరెలే కాదు మా దగ్గర ఇంకా వెరైటీలున్నాయి. మా కంప్యూటరైజ్డ్ విభాగాన్ని దర్శించండి అని ఆహ్వానం పంపుతాం. ఈ విధంగా వారంరోజుల్లో నగరమంతా ఈ వార్త పాకిపోతుంది. మనం చేయవలసిందల్లా మన గోడౌన్లు ఆయా నగరాల్లో విశాలం చేసుకోవటమే! తన లావుకీ, పొడుక్కీ శరీరఛాయకీ ఆ చీర కట్టుకుంటే ఎలా కనపడతానన్నది చూసుకుని అది బావుంది అని కస్టమరు అనుకోగానే, ఆ కోడ్ నెంబరు ప్రెస్ చేస్తే అందమైన పాకెట్ వచ్చేస్తుంది. మనకి పదిమంది మనుష్యులు, అద్దాల బీరువాలు, హడావుడి అక్కర్లేదు. వచ్చిన

కస్టమరు లావు పొడవుల్ని మిషనుకి ఫీడ్ చేసే మనిషి, డబ్బు తీసుకునే క్యాషియరు వుంటే చాలు. కస్టమరు ముట్టుకుని చూసి 'వాసి' పరిశీలించటానికి మాత్రం వెరైటీకొక్క చీర పక్కన పెడతాం. రకరకాల ధరలు కాకుండా మొత్తం అన్ని రకాల చీరల ధరల్నీ అయిదారు లెవల్స్ లో ఫిక్స్ చేస్తాం. ఇప్పటికే ఈ అద్దాల్ని ప్రవేశపెట్టిన షాపుల్లో అమ్మకాలు పదిరెట్లు పెరిగిన విషయం మనం మర్చిపోకూడదు.

"ఇంతకీ ఈ అద్దానికి ఎంతవుతుందో చెప్పలేదు!"

"విదేశాల్లో ఇప్పటివరకూ రెడీమేడ్ దుస్తులు వేసుకుంటే ఎలా కనపడతారో చూపించే అద్దాలే వున్నాయి తప్ప చీరెలకు లేవు. ఇవి మనం స్పెషల్ గా తయారు చేయించుకోవాలి. అదీగాక మన దగ్గిరున్న చీరెలన్నీ ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్లతో సహా వేర్వేరు ఎత్తు, లావు వున్న బొమ్మలకి కట్టి ఫోటోలు తీసి కంప్యూటర్ కి ఫీడ్ చేస్తూ వుండాలి. దీనికి వేరేగా మరొక డిపార్ట్ మెంట్ వుండాలి. ఈ మిషన్లకీ ఎస్టాబ్లిష్ మెంట్ కీ కలిపి 50 లక్షల దాకా అవుతుంది." ఒక్కసారిగా అందరూ 'ఆ' అన్నారు.

రవితేజ అందరివైపు పరికించి చూశాడు. ఇక అసలు విషయం చెప్పవలసిన సమయం వచ్చేసింది.

"నేను ఈ కాంట్రాక్టు కుదుర్చుకు వచ్చేశాను" అన్నాడు నెమ్మదిగా ఆ గది ఒక్కసారిగా నిశ్శబ్దమైంది. ".....మీకు తెల్పియకుమ్డా ఇంత పెద్ద నిర్ణయం నేనూ శర్మగారూ తీసుకోవటం పట్ల మీరు అసంతృప్తి చెందుతారని నాకు తెలుసు. కానీ దేశంలో మనమే ప్రధానంగా దీన్ని ప్రవేశపెట్టాలనుకున్నప్పుడు ఈ వార్త చివరి వరకూ బైటకు పొక్కకుండా వుండటం మంచిది. ఇది మీ పట్ల అపనమ్మకం కాదు. మనం ఏమనుకున్నా ఆ చెంచురామయ్యకి తెలుస్తున్నాయి. అందువల్ల ఈ నిర్ణయం తీసుకోవలసివచ్చింది."

"బోర్డు దీనికి ఒప్పుకోకపోతే...?" ఎవరో అడిగారు.

"ఆ విషయం కూడా మేము ఆలోచించాము. సంవత్సరం వరకూ భారతదేశంలో ఇంకెవరికీ ఈ అవకాశం ఇవ్వకూడదు అని మనం కండిషన్ పెట్టినప్పుడు, వాళ్ళు మన దగ్గర్నుంచి పెద్ద మొత్తం అడ్వాన్సుగా అడుగుతారు. అది వారంరోజుల్లో నేను వెళ్ళి అందజేయబోతున్నాను. మన కంపెనీ ఇన్ని లక్షలు తిరిగి ఇన్వెస్టు చేయడానికి ఒప్పుకోని పక్షంలో మరో కంపెనీ ప్రైవేట్ గా పెట్టి కేవలం అమ్మకాల వరకే పరిమితం చేయడానికి నిశ్చయించుకున్నాను. దానికి పెట్టుబడి, నన్ను నమ్మినవాళ్ళు నాతో కలిసి పెడతారు."

"లేదు లేదు. ఇది మనకే వుండాలి" ఎవరో ఒక మూలనుంచి అన్నారు.

"అవును వుండాలి. వుండాలి."

దాదాపు ఏకగ్రీవంగా ఈ తీర్మానం ఆమోదించబడింది. సభ్యులందరూ చాలా ఆశాభావం వెలిబుచ్చారు. కంప్యూటరైజ్డ్ మిర్రర్ సిస్టమ్ ని ఒక గొప్ప విప్లవాత్మకమైన మార్పుగా అభివర్ణించారు. తన డైరెక్టర్లు తను తీసుకున్న నిర్ణయం పట్ల, ఇలా స్టేట్స్ వెళ్ళటం పట్లా అలుగుతారేమో అనుకున్న రవితేజ వారంతా వెంటనే దీనికి ఒప్పుకోవటంతో ఆనందభరితుడయ్యాడు. ఇది బంపర్-సక్సెస్ అవుతుందని అతని కెందుకో అనిపిస్తూంది. మిగతా పోటీదార్లందరూ మట్టిగొట్టుకుపోతారు. ఇంకో పది లక్షలు ఎక్కువ ఖర్చయినా సరే, మరో సంవత్సరం ఎక్కువ కాంట్రాక్టు సంపాదించాలి. ఈ రకమైన షాపులు వీలైనన్ని ఎక్కువ పెట్టాలి. తాను చేసిన దానితో డైరెక్టర్లు ఇంత తొందరగా ఏకీభవించటంతో చాలా అపూర్వమైన విజయం సాధించాడు తను!

హుషారుగా ఇంటి కొచ్చాడు.

ఇటీవలి కాలంలో అతడు అంత ఆనందంగా వున్నది చాలా తక్కువసార్లు. మాధవి బాత్ రూమ్ లో స్నానం చేస్తూంది.

అతడు సన్నగా తనలో తనే పాట పాడుకుంటూ బెడ్ రూమ్ లోకి వచ్చాడు. అతడి దృష్టి.....

అప్రయత్నంగా మంచం పక్కనున్న టేబిల్ మీద పడింది.

అతడు ఆ సమయంలో వస్తాడనీ వూహించని మాధవి. మంచంమీదే విప్పిన చీర పడేసి లోపల స్నానం చేస్తూంది. పక్క నలిగి వుంది. మధ్యాహ్నం పూట రోజూ రెండు గంటలు నిద్రపోవటం ఆమె అలవాటు. ఆమెకీ అప్పుడప్పుడు సన్నబడాలన్న ఆలోచన హఠాత్తుగా వస్తూ వుంటుంది. ఓ నాల్గు రోజులపాటు రాత్రుళ్ళు డైటింగ్ చేస్తుంది. మధ్యాహ్నం పూట నిద్ర మానుకోదు. పెళ్ళయిన కొత్తలో అతడు చెప్పాడు. "నువ్వు లావు తగ్గాలంటే మధ్యాహ్నం నిద్ర మానెయ్యాలి మాధవీ" అని.

"మీకేం అలాగే చెపుతారు. ఇంటిడు చాకిరీ ఒక్కదాన్ని చేసుకోవాలి ఆ మాత్రం కునుకు తియ్యకపోతే ప్రాణం మిగలదు. ఇంటి పనంటే ఆఫీసుల్లో బల్లముందు కూర్చొని కబుర్లు చెప్పటం కాదు."

"అలాంటప్పుడు డైటింగ్ మానెయ్యి, మరింత నీరసం వస్తుంది దాని వల్ల."

"నా ఇష్టం నేను డైటింగ్ చేసుకునే హక్కు కూడా లేదా ఈ కొంపలో." అలా జరిగేది ఆ సంభాషణ. అప్పుడంటే ఇంటిపనితో అలసట. ఇప్పుడు నిద్ర మరొక గంట ఎందుకు ఎక్కువయింది?

అతడు టేబిల్ దగ్గరకు నడిచాడు. దానిమీద కవరు వుంది. మధ్యాహ్నం పోస్టులో వచ్చినట్టుంది. మీద మాధవి పేరుంది. నాలుగైదు కాగితాలున్నాయి. అంత పెద్ద ఉత్తరం మాధవి కెవరు వ్రాస్తారబ్బా అనుకుంటూ తీసి చదివాడు.

మాధవిగారూ,

నమస్తే మీరు బహుశ ఈ ఉత్తరం చూసి, ఆశ్చర్యపోతూ వుండి వుండవచ్చు. ఇంత ఉత్తరం వ్రాసిందెవరా అని నేనే సుధాకర్ ని అవును మాధవిగారు ఎంతసేపు కలిసివున్నా చెప్పుకోలేని కొన్ని విషయాలు ఉత్తరాల ద్వారానే మాట్లాడుకోవచ్చేమో ముఖ్యంగా మనలాగా ఈ సామాన్య ప్రపంచంలో ఇమడలేని మనుష్యులు ఈ ప్రకృతీ అదీ చూస్తుంటే మీతో చెప్పాలనిపిస్తుంది. ఇక్కడ కిటికీలోంచి చల్లటిగాలి, ట్యూబ్ లైట్ వెల్తుర్లో నాతోపాటు ఇంకా కొన్ని వస్తువులు ఈ గదిలో వున్నాయి సుమా అని తెలియటం నా కిష్టంలేదు. అందుకే ఫ్లోరోసెంట్ లైటు ఆర్పి టేబిల్ లైట్ వేసుకుని వ్రాస్తున్నాను. ఇదికాక నేను ఎప్పుడూ ఇటువంటి సమయంలో ఇష్టపడి పెట్టుకునే సంగీతం, హెడ్ ఫోన్స్ లో నుంచి చెవుల ద్వారా మెదడులోకి.

ఒక నిముషం ఉత్తరం ఆపి కిటికీలోంచి బయటకు చూస్తే సుకుమారంగా (మీలాగ) వూగుతున్న మల్లెతీగ, క్రింద క్రోటన్ మొక్కలు- మాధవిగారూ, ఈ వాతావరణం ఎంత బావుందో తెలుసా? చెప్తే చాలదు. అనుభవించాలి. స్పందించే హృదయం వున్నవాళ్ళెవరైనా ఈ టైములో చేసేపని ఒకటే. కవులైతే కవిత్వం, ప్రియుడైతె ప్రియురాలికి మూగబాసలు, నాలాగ స్నేహితురాలికి ఉత్తరం వ్రాయటం.....ఆకాశంలో ఎగిరే మేఘాలు ఉత్తరంకంటే ముందు నా భావాల్ని తెలియపర్చటానికి తొందరపడుతున్నాయి.

నిజం మాధవిగారూ, స్నేహంలో ఆడ-మగ అన్న తేడా తీసుకురావడం నాకసలు ఇష్టముండదు. ఆడ-మగ అన్నభేదాలు శరీరానికే కానీ అంతరంగానికి లేవన్న సత్యాన్ని గ్రహింపగలిగి, మానసికంగా పరిపక్వంచెంది, ఆచరించగలిగే మనోధైర్యం వున్న వారి విషయంలోనే ఆ స్నేహానికి 'పరిపూర్ణత' లభిస్తుంది. మన స్నేహం పవిత్రమైనప్పుడు లోకం గురించి పట్టించుకోనక్కర్లేదు. మొన్న మనం సెకండ్-షోకి వెళ్ళినప్పుడు ఆ విషయమే చెపుదామనుకున్నాను. మీలాగే నేనూ మానసికంగా ఒంటరిని. ఎంతమందిలో వున్నా ఒంటరిగానే వుంటాను. మీ చెయ్యి  నా చేతిలోకి తీసుకున్నప్పుడు నా వేళ్ళు ఎందుకో వణికాయి. ఎంతోమంది చేతులు పరిశీలించాను. కానీ ఎప్పుడూ నాకిలా అనుభవము లేదు. ఎంతో మృదువుగా వున్నాయి మీ చేతులు మాధవిగారూ 'స్నేహంలో' స్వార్ధానికి స్థానముండదట. నేను నమ్మిన పవిత్రమైన స్నేహంకోసం ప్రాణాలివ్వటానికి కూడా సిద్ధమే. మరి నా ప్రయత్నం విజయవంతం కావాలంటే- మీ సహకారంతో కూడిన చిరునవ్వే నాకు ఇన్స్ పిరేషన్ కావాలి. మీరు నవ్వుతుంటే ఎంతో బావుంటుంది. ఈ చెట్లన్నీ ఏమంటున్నాయో తెలుసా? మాలాగే నువ్వుకూడా నీ స్నేహితురాలితో మౌనంగా భాషించు-అని.

నాకు ఇష్టమైన విషయాలు ఏమిటో తెలుసా మాధవిగారూ-

1. వదులుగా వున్న పైజమా, లాల్చీ వేసుకుని గులాబీ చెట్లమధ్య కూర్చోవటం.
2. వెన్నెల వెలుగులో, నీలగిరి తోటల్లో నడుస్తూ మాట్లాడటం.

3. పున్నమిరాత్రి సముద్రపు ఒడ్డున స్నేహితురాలితో మాట్లాడుతూ కూర్చోవటం.

4. వెల్లకిలా పడుకుని నా కిష్టమైన డాన్సింగ్ డాల్ ని గుండెల మీద పెట్టుకుని దాన్ని కదిలిస్తూ చూస్తూ వుండటం. (అన్నట్టు మీరు డాన్స్ నేర్చుకుని వుంటే బావుండేది మాడమ్. మీ ఫిజిక్ దానికి చాల బావుంటుంది. మీ భర్తగారికి ఇలాంటి అభిరుచులు ఏమీ వున్నట్టు లేవు. ఆయన్ని చూస్తే ఎప్పుడూ బిజినెస్ అన్నట్టు వుంటారు.)

5. గుండెలవరకూ దుప్పటి కప్పుకుని సీలింగ్ వైపు చూస్తూ (ఈ మధ్య మీ గురించి) ఆలోచిస్తూ వుండటం.

ఇలాటి కోర్కెలు, అలవాట్లు ఎన్నో వున్నాయి. వీటిని పక్కకి నెట్టేస్తూ కమర్షియల్ గా బ్రతకాలి. తప్పదు. బావ తిడుతూ వుంటాడు. చదువు ఆపుచేసి మూడేళ్ళయింది. ఏదైనా పని చేయకూడదా అని. రవ్వంత ఆప్యాయత కూడా నేను ఇంట్లో నోచుకోలేదు మాధవిగారూ.

ఎందుకో మిమ్మల్ని చూస్తే మీరూ నా స్థితిలో వున్నారనిపిస్తుంది. ఎడారిలో ఒయాసిస్సులా మనిద్దరం ఒకరికొకరం ఈ పవిత్ర స్నేహ బంధంలో, పవిత్రమైన ఆలోచన్లని పంచుకుంటూ, ప్రాణ స్నేహితుల్లా మిగిలిపోదామా? మంచి స్నేహాన్ని మించే రిలీఫ్ లేదండీ మాధవిగారూ.

మొన్న మీ చెయ్యి చూసినప్పుడు, మీరెందుకో మానసికంగా బాధపడుతున్నారనీ, ఈ ప్రపంచంలో ఎవరూ మీ మంచితనాన్ని అర్థం చేసుకోలేరని అనిపించింది. ఆ చేతిని అలాగే చాలాసేపు పట్టుకుని వుండిపోవాలన్న కోర్కె కలిగింది గానీ, అంతలో మీ భర్త వచ్చారు. పవిత్రమైన స్నేహాన్ని ప్రపంచం అర్థం చేసుకోదు.

మీకు నాతో శాశ్వత స్నేహం ప్రమాదకరం అనిపిస్తే, పోనీ కొంతకాలం చేయండి. ప్రేమయొక్క రుచి చూపిస్తాను. లేవటం-పని, భర్త, విసుగు, ఒంటరిజీవితం- వీటితో అలిసిపోయిన మీకు ఈ రొటీన్ జీవితం నుంచి బోర్ కొట్టకుండా వుండాలి అంటే నాలాటి నిజమైన స్నేహితుడు వుండాలి. అలాటి స్నేహితుడు మీకు ఈ నెలలో దొరుకుతాడని మీ చేతిరేఖలు చెపుతున్నాయి. మన పరిచయం యాదృచ్ఛికం కాదని తోస్తోంది.

..... జీవితంలో నేను అధిక ప్రాధాన్యత ఇచ్చేది స్నేహానికి, స్నేహాన్ని అత్యుత్తమ పీఠంపై వుంచినందుకు ప్రతిఫలం మీరు నాకు స్నేహితురాలిగా లభ్యమవటం. నా రొటీన్ జీవితంలో మీ పరిచయం గొప్ప రిలీఫ్! నన్నొక మంచి స్నేహితుడిగా గుర్తుంచుకోండి. అంతకన్నా మీ నుంచి ఏమీ ఆశించను. నాకు కావాల్సింది కాస్త ఓదార్పు, బాధలో వున్నప్పుడు గుండెల్లోకి తీసుకుని నేనున్నాను సుమా అనే స్నేహం కావాలి నాకు. ఈ ప్రపంచంతో విసిగిపోయాను మాధవిగారూ నేను.

'గుండెల్లోకి తీసుకుని' అని వ్రాసినందుకు మీకు కోపం వచ్చిందా? లేక నవ్వొచ్చిందా? మీ గుం.....బాబోయ్ వద్దులెండి. మీకు కోపం వస్తుంది.

నిర్మలమైన మనసుతో చేసే నా ఈ స్నేహాన్ని మీరొప్పుకుంటారా మాధవిగారూ? I Like you always and expects always likings from you. మీ కళ్ళలో ఏదో తెలియని బాధ గూడు కట్టుకుని వుందని నాకు అనిపిస్తూంది మాధవీ! ఈ ఉత్తరం అంతా చదివి, అందంగా 'ప్లక్' చేసిన మీ కనుబొమ్మలు తీవ్రంగా ముడివేస్తే నేనేం చేయలేను. నా స్వచ్ఛమైన స్నేహహస్తాన్ని మీరు అందుకోలేకపోయారని అనుకుంటాను. మీకు ఇష్టం లేకపోతే, ఈ ఉత్తరాన్ని చించివేయండి. ఎందుకంటే ఈ ఉత్తరంలో ఏమీ తప్పు లేకపోయినా, ఒక వ్యక్తి ఇంకొకరికి ఉత్తరం వ్రాసినప్పుడు ఒక మాడ్యులేషన్, ఒక వేవ్ లెంగ్త్ లో తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తాడు. అది మరొకరికి మరొకలా అర్ధమౌతుంది. మొన్న నేను వచ్చినప్పుడు మీ ఆయన చెయ్యికూడా చూద్దామనుకున్నాను. కానీ నేను కేవలం నాకు అత్యంత ఆప్తులైన వారి చేతులు మాత్రమే చూస్తాను. అర్ధమైందనుకుంటాను. ఈ ప్రపంచంలో ఒక అబ్బాయి, ఒక అమ్మాయి కేవలం స్నేహితులుగా ఎందుకు వుండకూడదని నా ప్రశ్న. చూస్తాను. దీనికి మీ సమాధానం ఎలా వుంటుందో! నా నిర్మలమైన, స్వచ్ఛమైన స్నేహాన్ని మీరు అందుకోవాలని అనుకున్న పక్షంలో, మీ నిస్సార జీవితంలో నేనొక అందమైన పవిత్రమైన మలుపు అనుకుంటే, మిమ్మల్ని ఆరాధిస్తున్న వ్యక్తిగా నేనంటే మీకు ఇష్టముంటే ఈ ఉత్తరం మీకు 14వ తేదీ అందుతుంది. ఆ రోజు సాయంత్రం మీ ఇంటికి వస్తాను. తెల్లచీర కట్టుకోండి. (తెలుపు స్వచ్ఛదనానికి నిదర్శనం) గులాబీల్లాంటి మీ పెదవుల మీద మల్లెలాటి చిరునవ్వుతో ఈ స్నేహితుడికి స్వాగతం చెప్పాలి. ఇట్లు- మీ జి.యస్. సుధాకర్.

రవితేజ చేతిలోంచి కాగితాలు క్రిందికి జారిపోయాయి.

కొంచెంసేపు శిలా ప్రతిమలా అలాగే నిలబడిపోయాడు.

తరువాత వంగి, ఆ కాగితాలు తీసి మళ్ళీ కవర్లో పెట్టేసి, యధాస్థానంలో పెట్టేశాడు. ముందుగదిలోకి వచ్చి కూర్చున్నాడు. ఆఫీసులో పనితోనూ, ఇంటికి రాగానే ఈ ఉత్తరం ఇచ్చిన షాక్ తోనూ మనసంతా స్థబ్ధమై- నిస్త్రాణగా నిద్ర పట్టినట్టయింది.

"ఏమిటి ఎంత సేపయింది మీరొచ్చి" అంటూ మాధవి బెడ్ రూమ్ లోంచి బయటకొచ్చింది.

"ఇప్పుడే, ఏం?"

"మీరు తొందరగా రావటం మంచిదైంది. మీకో విషయం చెప్పాలి".

"ఏమిటి?"

"ఇదిగో ఈ ఉత్తరం చదవండి".

"సారీ మాధవి, ఇంకొకరి ఉత్తరాలు చదవటం తప్పని తెలిసినా చదివాను...ఇప్పుడే".

"మొత్తం అంతా పూర్తిగా చదివారా?"

"మొత్తం అంతా?"

"మీకేమైనా అర్థమైందా? కొంచెంసేపు పవిత్రమైన స్నేహం అంటాడు. ఇంకొంచెంసేపు గులాబిరేకుల్లాటి పెదాలు అంటాడు. ఒకవైపు తెల్లచీరంటాడు- మరొకవైపు స్వచ్ఛమైన మనసు అంటాడు".

"అర్థం చేసుకున్నావుగా, అదే చాలు మాధవీ".

"అర్థం చేసుకోకపోవటమేమిటండీ-వీడేమైనా శంకరాభరణం శంకరశాస్త్రీ నేను మంజుభార్గవి అనుకున్నాడా? కేవలం మంచి స్నేహితులుగా వుండటానికి! భరతనాట్యం నేర్చుకునే పెర్సనాలిటీనా నాది మీరే చెప్పండి. డైటింగ్ చేయలేక చస్తుంటే-"

"స్నేహంలో మొదటిమెట్టు ఆకర్షణ మాధవీ!! ఆకర్షణలో దగ్గరవటానికి మొదటి మెట్టు అవతలివారిని పొగడటం! రెండోది తాను మానసికంగా ఒంటరివాడిని అని ప్రకటించుకోవటం".

"అంత ఒంటరివాడైతే పెళ్ళిచేసుకొమ్మనండి అయినా ఇంగ్లీషు కూడా సరిగ్గారాదు. I Likes You అంటాడు- I expects అంటాడు. పైగా వదులుగా వున్న లాల్చీ పైజమా వేసుకోవటం ఇష్టమట. ఇంకో రెండు ఉత్తరాలు పోయాక, అవి కూడా వేసుకోకుండా స్నేహితురాల్తో మాట్లాడటం ఇష్టమని వ్రాస్తాడేమో......పవిత్రమైన స్నేహంలో".

"నువ్వు కాబట్టి అర్థం చేసుకున్నావు మాధవీ! అతగాడి ఉత్తరం చదువుతే, అందులో భావుకత్వం, సిన్సియారిటీ కన్నా "ట్రేకిష్ నెస్సే" ఎక్కువ కనపడింది. అలాటిదానికి పడిపోకుండా వుండగలిగేవాళ్ళు ఆడాళ్ళలో అయిదు శాతం కన్నా ఎక్కువ వుండరు".

"అవును పాపం కష్టాల్లో వున్నాడే అని తల్లిలాగా దగ్గరికి తీసుకుంటే మీ గుండెలు చాలా ఎత్తుగా వున్నాయి అనటానికి కూడా వెనుదీయడు. వెనుదీయటం ఏమిటి- వాడే అన్నాడుగా మీ గుండెల గురించి ఏమైనా అంటే మీక్కోపం వస్తుందేమో అని, రానివ్వండి సాయంత్రం వస్తానన్నాడుగా చెప్తాను...."

"ఎంతసేపైంది మీరొచ్చి- "సడెన్ గా ఆ మాటలకి కళ్ళు విప్పాడు రవితేజ. మాధవి బెడ్ రూమ్ లోంచి బైటకొస్తూ అడుగుతూంది. క్షణంపాటు రావితేజకి ఏం జరిగిందీ అర్థంకాలేదు. ఇప్పటివరకూ జరిగింది కల అని క్రమంగా అర్థమైంది. అయితే భార్యాభర్తల మధ్య సంభాషణ మాత్రమే కలా? లేక ఈ ఉత్తరం తను చదవటం కూడా కలేనా

అన్నది అర్ధంకాలేదు. కొంచెం తల పక్కకి వంచి చూస్తే బెడ్ రూమ్ లో కవరు లేదు. కానీ 'ఎంతసేపైంది మీరొచ్చి' అని అడిగే మాధవి ప్రశ్నలో తడబాటు చూస్తే ఆమె ఆ కవర్ని తీసి లోపల పెట్టిందేమో అన్న అనుమానం నిశ్చయంగా కలుగుతుంది. మొత్తంమీద తను ఉత్తరం చదవటం వరకూ యదార్ధమే తరువాత సంభాషణంతా కల. కనీసం తన మనసు వూహించిన పరిణామం అది!

..... ఉత్తరంలో ప్రతీ అక్షరం అతఃడికి గుర్తుంది. మనసు కుతకుతా ఉడుకుతూంది. అందులో ఆఖరి పేరా గుర్తొచ్చి, చప్పున తలెత్తి భార్య వంక చూశాడు. ఇంకా ఆమెలో పూర్తిగా అలజడి తగ్గినట్టు లేదు. టీ తీసుకురావటం కోసం లోపలి వెళ్తొంది. ఆమె అప్పుడే స్నానంచేసి నల్లబోర్డరున్న చీరకట్టుకుంది తెల్లచీర. నల్లంచు ...తె...ల్ల... చీ...ర.

## 22

**రవితేజ టెక్స్ టైల్స్** వారు తమ బోర్డు మీటింగులో కంప్యూటరైజ్డ్ అద్దాలు ప్రవేశపెట్టటానికి తీసుకున్న నిర్ణయం- సరీగ్గా అయిదు నిముషాల్లో చెంచురామయ్యకు తెలిసిపోయింది.

"ఇదేదో మనకి తెలియని కొత్తదిగా వుందే!" అన్నాడు డైరెక్టర్స్ లో ఒకరు తను చదివిన వివరాలు చెప్పాడు. చెంచు రామయ్య అంతా శ్రద్ధగా విని తల అడ్డంగా వూపుతూ, "ఇది ఫెయిల్ అవుతుంది" అన్నాడు.

"ఎందుకు?"

"ఆడాళ్ళని అద్దం ముందు నిలబెట్టి వరసగా మీటలు నొక్కేస్తూ, 'నువ్వీ' చీరలో' ఇలాగుంటావు' అని తొందర తొందరగా చెప్పేస్తూ పోతే వాళ్ళకి నచ్చదు. పదిమందితో కలిసిరావాలి. రెండొందలు చీరలు బైటకు తీయించాల. మన సేల్స్ మెన్ చేతులు పడిపోవాల. అప్పుడుగానీ వాళ్ళకి సంతృప్తి వుండదు. చేత్తో అంచులు ముట్టుకుని నలిపేస్తేగానీ నాణ్యత పరిశీలించినట్టు వుండదు వాళ్ళకి. అట్లాంటివి వంద చీరలు పట్టుకుని చూస్తే తప్ప ఒక చీర కొన్నట్టు వుండదు".

అక్కడున్న డైరెక్టర్ కి అతని వాదన తప్పనిపించింది. కస్టమర్లు కూడా మారారు. ఇంతకుముందున్నంత టైమ్ ఈ కాలంలో ఆడాళ్ళకి వుండడం లేదు. ముఖ్యంగా వందా నూటయాభై రూపాయల చీరకోసం గంటలకొద్దీ షాపుల్లో వెదికే ఓపిక ఇప్పుడు ఎవరికీ వుండడం లేదు. కానీ ఈ ఆలోచననీ తమ మేనేజింగ్ డైరెక్టర్స్ కి చెప్పే ధైర్యం అతడికి లేదు.

'కాలమే నిర్ణయిస్తుంది కదా' అని వూరుకున్నాడు.

ఒకే రంగంలో ఉన్నప్పుడు తనకన్నా అవతలివాడు తెలివైన ప్లాన్ వేశాడని ఒప్పుకోవటానికి చాలా బాలన్స్ ఆఫ్

మైండ్ వుండాలి. తమ మేనేజింగ్ డైరెక్టర్ కి అధిలేదని ఆ డైరెక్టర్ కి తెలుసు.

* * *

మసక చీకట్లు కమ్ముతున్న వేళ మనసులోకూడా ఆ చీకటి ముసురుతున్న వేళ-

నగరంలోకెల్లా ఖరీదైన బార్ లో, ఒకమూల టేబుల్ దగ్గర ఒంటరిగా కూర్చొని వున్నాడు రవితేజ. అప్పటికి అతడు నాలుగో పెగ్ లో వున్నాడు. బార్ నిర్మానుష్యంగా వుంది. ఇంకా ఆరున్నర కూడా కాకపోవటం చేత బార్ నిర్మానుష్యంగా వుంది.

మనిషి విజయానికీ-మనసులో ఆనందానికీ సంబంధంలేదు.

విజయంలో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఆ ఆనందాన్ని అనుభవించాలంటే, అన్ని పరిస్థితులూ అందుకు సహకరించాలి. ఒకరకంగా చెప్పాలంటే విజయం ఎక్కువయ్యేకొద్దీ, దానివల్ల వచ్చే టెన్షన్ తో విషాదం కూడా ఎక్కువవుతుందేమో! అయితే వ్యాపారపరంగా ఎన్ని చిక్కులు వచ్చినా, ప్రమాదాలు వాటిల్లినా దాన్ని ఎదుర్కోవటానికి అతడు సంసిద్ధుడయ్యే వున్నాడు. కానీ మానసికంగా అతి సున్నితమైన ఈ బాధ నరనరాల్లోనూ వ్యాపిస్తోంది.

అతడి 'ఈగో'కి దెబ్బ అది పురుషుడికి అంతకన్నా బాధ మరొకటి వుండదు. స్త్రీ పురుషుడిలో ఏమీ చూడదు. అతడి మేధస్సు, అతడి పెర్సనాలిటీ, జీవితంలో అతడు సాధించిన విజయాలు-ఇవేమీ ఆమెను ఆకట్టుకోలేవు. కేవలం తనని, 'అతడు గుర్తించాడా లేదా?' అన్నదే ఆమెకి కావలసింది. ఎప్పుడైతే తనని అతడు గుర్తించటం మానేశాడో, తన ఉనికికి ప్రాధాన్యత ఇవ్వటం మానేశాడో, అప్పట్నించి ఆమెకి కూడా అతడిమీద ఇంటరెస్ట్ పోతుంది. అతడు భర్తగానీ, మరెవ్వరైనా గానీ- అతడినుంచి ఆమె మానసికంగా దూరమై వేరే వ్యాపకంలో పడిపోతుంది. ఈ వ్యాపకం క్లబ్ కావచ్చు.. గుడికావొచ్చు... లేదా... సుధాకర్ లాంటివాళ్ళ స్నేహం కావచ్చు.

స్త్రీకి కావలసింది గుర్తింపు ఒక్కటే.

రవితేజ ఈ కోణంలోంచి ఆలోచించటం లేదు. అతఃడు మొగవాడు. ఆ పరిస్థితుల్లో లాజిక్ ఆలోచించగలగటం అందరికీ సాధ్యమవదు. చదువూ సంధ్యాలేక, పనీపాటల్లేక కేవలం ఆడవారిని ఆకర్షించే కళ, అందుకు సరిపడ టైమూ వున్న సుధాకర్ లాటివాడి మాటలకి మాధవి ఉత్తేజితమవటం అతడికి వ్యధని కలిగిస్తోంది. మళ్ళీ అక్కడ మరో ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సుధాకర్ లాటి ఎందుకూ పనికిరానివాడు కాకుండా ఒక ఉన్నత వ్యక్తి తన భార్యకి ఈ ఉత్తరం వ్రాసివుంటే అతడు సహించగలిగి వుండేవాడా? అదీ సాధ్యంకాదు. అప్పుడతడు ఇంకోరకంగా ఆలోచించేవాడు. మనిషి తను ఉన్న పరిస్థితులనుబట్టి, తన కెదురైన సమస్యల బట్టి తన ఆలోచనా విధానాన్ని పాటించడం అనాదిగా వస్తున్నదే. ఇప్పుడు ఈ ఉత్తరం వ్రాసింది సుధాకర్ కాబట్టి ఇలా ఆలోచిస్తున్నాడంతే. రవితేజ

మానవాతీత వ్యక్తిత్వం వున్న మహాత్ముడుకాదు. మరి అతడికి ఒక అమ్మాయి ఉత్తరం వ్రాసింది. లక్ష్మణరేఖ దాటి బయటికి రాలేక వెనక్కి తగ్గింది. మరి దాని గురించి అతడేమనుకున్నాడు? ఆ ఉత్తరంలో వున్న నిజాయితీ యిందులోలేదు- అనుకుని ఉంటాడు. అది నిజమే అయి ఉండవచ్చు.

తప్పుకర్థం ఏమిటి? నిజాయితీతో చేసిన తప్పు తప్పుకాదా? లేక బలమైన ఒక కారణం వుంటే అది తప్పుకాదా? ఆమె భర్త ఒక శాడిస్టో లేక తాగుబోతో లేక గుర్రప్పందాల పిచ్చి వున్నవాడో అయి వుండవచ్చు. ఆ దుఃఖం నుంచి స్వాంతన పొందటానికి ఆమె ఒక మార్గం ఎన్నుకొని వుండొచ్చు. మరి అది తనకి థ్రిల్ గానే అనిపించిందే! లావుపాటి అతని భార్యకి, మీకు భారతనాట్యం చేయతగిన శరీర లావణ్యం వుంది-అని ఒక పరాయి వ్యక్తి అంటే అది ఆమెకి అంతే థ్రిల్ కలగచేసి వుండవచ్చు. మన మానసిక స్థాయి బట్టి మనకి థ్రిల్ కలిగించే విషయాల స్థాయి కూడా మారుతుంది. కొందరు స్త్రీలకి చిత్రలేఖనం, వీణానాదం థ్రిల్ కలిగించవచ్చు. మరికొందరికి తను బీరువాలో వేయి చీరలు వుండడం థ్రిల్ కలిగించవచ్చు.

రవితేజ ఇవన్నీ ఆలోచించటంలేదు. ఆ మాటకొస్తే ఏ మగవాడూ అటువంటి పరిస్థితిలో పడితే ఇవన్నీ తీరిగ్గా ఆలోచించడు. అతడింకా నయం. తన వ్యథ పోగొట్టుకోవటానికి ఒంటరిగా కూర్చుని కుమిలిపోతున్నాడు. మరొకరైతే ఆ ఉత్తరం చూసి భార్యతో అటో ఇటో తేల్చుకోవచ్చు.

అతడు అప్పటికి ఆరు పెగ్గులు పూర్తిచేశాడు. అతడికి తాగుడు అలవాటులేదు, కంపెనీకోసం తప్ప అందువల్ల మనిషి తూలిపోతున్నాడు. తాగుడు మనిషి పై పొరల్ని తొలగించి అంతర్మధనాన్ని పైకి తెస్తుంది. అతడి మనసంతా ఎవరిమీదో తెలియని కసి నిండుకుని వుంది. ఆ క్రింది పొరల్లోంచి ఒక జ్ఞాపకం సముద్రంలో అగ్నిపర్వతం పేలినట్టు పైకి తన్నుకొస్తుంది. అందరూ సుఖంగా వున్నారు, నేనొక్కడ్నే ఈ నిరాశతో నిరుత్సాహంతో వున్నాను. అందరూ చేతికి దొరికిన ఆనందాన్ని-అవైలబిలిటి బట్టి జుర్రుకుంటున్నారు. నేనొక్కడ్నే ఏదో చెయ్యాలి.....ఏదో సాధించాలి- అన్నభావం ఉవ్వెత్తున లేస్తుంది. మనిషికి ఓదార్పు కావలసింది ఇక్కడే. ఆ ఓదార్పు పేరు...

మిస్ విజయవాడ!

అతడు లేచాడు. కారు దగ్గరికి తూలుకుంటూ వచ్చి కారు స్టార్టు చేశాడు. ఈ రోజు అటో ఇటో తేల్చేసుకోవాలనుకున్నాడు. అయితే అతడు తేల్చుకోవాలనుకున్నది వ్యక్తులతో కాదు- తన మనసుతో మనసుతో సత్సంబంధాలు లేని మనిషి, అనుభూతివల్ల కాని ఆచరణవల్ల సంతృప్తి చెందాలనుకుంటాడు. ఫలితాలు ఆలోచించడు. ఆ చర్య అతడిని శిఖరాగ్రానికైనా, అధఃపాతాళానికైనా తీసుకు వెళ్ళవచ్చు. ఇంట్లో సుఖం లేనివారే ఆయారంగాల్లో ప్రముఖులయ్యారన్న నానుడి- సోక్రటీస్ నుంచి ఇందిరాగాంధి వరకూ రుజువైంది. గొప్ప గొప్ప రాజకీయ నాయకుల, సినిమా దర్శకుల కళాకారుల జీవితాలు పరిశీలిస్తే ఫ్రస్ట్రేషన్ నుంచే వారిలో గుర్తింపు దాహం ఏదో సాధించాలన్న తపన బయల్దేరతయన్నది అర్ధమవుతుంది. ఇదంతా పైకి వచ్చినవారి సంగతి! ఇక ఇంట్లో సౌఖ్యం లేక అధఃపాతాళానికి వెళ్ళినవారి సంగతి మనకి తెలీదు. చరిత్రలో వారి పేర్లు లిఖింపబడి లేవు కనక.

వంద సంవత్సరాల క్రితం - స్త్రీ పురుషుల జీవితాల్లో... ముఖ్యంగా స్త్రీ జీవితంలో పెళ్ళి అనేది ఆమె పుస్తకంలో చివరిపేజీగా వుండేది. ఇప్పుడది మొదటి పేజీ అయింది.

కారణం మెచ్యూరిటీ.

పూర్వమయితే స్త్రీ, వివాహాన్ని ఒక వరంగా భావించేది. ఇప్పుడొక బాధ్యతగా స్వీకరిస్తూంది.

కాని విచారకరమైన సంగతేమిటంటే ఒక క్లర్కు ఉద్యోగం చేయాలంటే దానికెన్నో పరీక్షలు పాసవ్వాలి. చివరికి కారు డ్రైవింగ్ చెయ్యటానికి ముందుకూడా డ్రైవింగ్ టెస్ట్ పాసవ్వాలి. అటువంటిది అంతకన్నా బాధ్యతాయుతమైన ఒక సంసారం నడపటానికి భార్యగానో, భర్తగానో వుండటానికి ఏ అర్హత అక్కర్లేదు. ఏ పరీక్షా ప్యాసవనక్కర్లేదు. ఏ ట్రైనింగ్ ఎవరూ ఇవ్వరు. అవతలి పార్ట్నర్ కి మానసికంగా సుఖంగా ఇవ్వాలంటే రోదసీ యాత్రకన్నా నిజంగా ఎక్కువ అవగాహన అవసరం. దీని గురించి ఎవరూ పట్టించుకుపోవటం వల్లనే, దీనికి ఏ ప్రవేశపరీక్షా లేకపోవటంవల్లనే ఇన్ని ఇబ్బందులు. వివాహం అనే చిన్న బంధం ద్వారా ఇద్దరు ముక్కూ మొహం తెలియని వ్యక్తులు, రెండు వేర్వేరు స్థాయీభావాలున్నవారు మానసిక జీవితాంతం కలిసి వుండవలసి వస్తుంది. వారి మనసులు కలిస్తే ఫర్వాలేదు. లేకపోతే కేవలం సెక్సూ, సంతానం, ఇన్ సెక్యూరిటీ, అమాయకత్వం లాంటివే కారణాలు అవుతాయి తప్ప, విడదీయలేని అనుబంధం పునాది కావటంలేదు.

20-25 వయసులో వివాహం జరిగేనాటికి ఇద్దరి మానసిక స్థాయీ ఒకే లెవల్లో వున్నా, కాలం గడిచేకొద్దీ పురుషుడి ప్రపంచం విస్తీర్ణమవుతుంది. రకరకాల కిక్ లు, అవి పనిద్వారా కావొచ్చు, గుర్తింపుద్వారా కావొచ్చు, చివరికి వ్యసనాల ద్వారా కావొచ్చు. రకరకాలుగా అతడు ఆ కిక్ ని పొందుతడు. అందువల్ల అతడికి ఇంట్లోనుంచి తిండి, మంచి సెక్సు, మంచి వాతావరణం వుంటే చాలు సంతృప్తుడై పోతాడు. అయిదారు సంవత్సరాల్లో భార్య ఇచ్చే 'కిక్' తగ్గిపోతుంది. ఈ అయిదారు సంవత్సరాల్లోపుల్లో భర్త సెక్స్ ని శారీరక వాంఛ స్థాయినుంచి, ఎమోషన్ వెల్లడిచేసే చర్చ స్థాయికి తీసుకు వెళ్ళలేకపోతే స్త్రీ భార్యగా అనర్హురాలు. వివాహం అంటే ఇరవై ఏళ్ళుగా దాచిపెట్టిన ప్రేమని ప్రోపర్ ఛానెల్ ద్వారా వదిలిపెట్టటం అనుకుంటే, పురుషుడు దాన్ని జలపాతంలా ప్రవహింపచేసి ఎగ్జాస్ట్ అయిపోతే, స్త్రీ చిన్నకాల్వ ద్వారా జీవితాంతం ప్రవహింపచేస్తూనే వుంటుంది.

అందుకే స్త్రీకి ఇల్లే ప్రపంచం. ఆ ఇంటికి తానో అతిథిగానే వుంటూ వస్తున్నాడు పురుషుడు. గొడవ చెయ్యని భార్య దొరకటం అదృష్టంగా భావిస్తున్నాడు.

అయితే ఇదంతా పురుషుడి వేపునుంచే! ఇక స్త్రీ వేపునుంచి ఆలోచిస్తే ఆమె వాదన మరింత బలంగా వుంటుంది. ఈ మధ్య కాలంలో ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం, ఆర్థిక విప్లవం లాంటివి రకరకాలుగా వచ్చి వుండవచ్చు. కానీ అయిదు వందల సంవత్సారాలుగా లేని కొత్తరకం విప్లవాన్ని స్త్రీ గత పది సంవత్సరాలుగా చూస్తుంది. ఉద్యోగ

రూపేణా అయితేనేం, మరేరకంగా అయితేనేం, ఆమె ప్రపంచం కూడా విస్తీర్ణమవుతూంది. తన భర్తకి విసుగూ కోపం తక్కువగా వుండి, తనకొక మనిషిగా గుర్తించి, న్యాయబద్ధమైన కోర్కెల్ని వప్పుకుని, తనకో స్నేహితుడిగా వుండి, తమ స్థైర్యాన్ని కోల్పోయినప్పుడు ధైర్యం చెప్పి, అవసరమైనచోట తనమీద ఆధారపడే లక్షణాలన్నీ తన భర్తకుండాలని ఆశిస్తూంది.

భార్యాభర్తల మధ్య ఇది సాధ్యం కానప్పుడు ఆ బంధం ఈ సంక్లిష్టమైన వ్యవస్థలో ముప్ఫై చదరపుటడుగుల మంచానికే పరిమితమవక తప్పదు. సోషియాలజీ, సైకాలజీ శాస్త్రాల్లో ఎంత గొప్ప థియరీలైనా ఈ సమస్యకి పరిష్కారం చెప్పలేవు. ముఖ్యంగా పురుషుడికి ముప్ఫై అయిదు సంవత్సరాల వయసులో మెనోపాజ్ స్టేజి వస్తుంది. ఈ వయసులో అకస్మాత్తుగా విస్తరమవుతున్న తన ప్రపంచాన్ని అతడు గుర్తిస్తాడు. వివాహము, పిల్లలే కాకుండా, ఇంకా ఏదో వుందన్న ఆలోచన అతడిని తొలిచేస్తుంది. ఆ స్తబ్ధతని, క్రియాత్మకమైన రూపంలోకి మార్చి, 'మీతోపాటూ నేనూ వున్నాను. గో ఎ హెడ్' అన్న భావాన్ని భార్యే కలిగించాలి. అలా కలిగించే భార్యని భర్త అర్ధం చేసుకోవాలి. దురదృష్టవశాత్తు చేసుకోడు. అందుకే ఒక గణాంక శాఖ వారు నిర్వహించిన సర్వేలో, మిగతా అన్ని ప్రశ్నలకూ సరియైన సమాధానాలు ఇచ్చిన గృహిణులు, "మీ భర్త మిమ్మల్ని సరీగ్గా అర్ధం చేసుకుంటున్నట్టు మీరు భావిస్తున్నారా?" అన్న ప్రశ్నకు 92 శాతం "లేదు" అని జవాబిచ్చారు.

మరెందుకు కలిసి వుండటం? మనిషియొక్క ఎమోషనల్ విలువల్ని. సూటిగా ప్రశ్నించే ప్రశ్న ఇది. CAN TWO PEOPLE BE EVERY THING TO EACH OTHER? యాభై సంవత్సరాలు ఇద్దరు వ్యక్తులు కలిసి వుండటానికి పిల్లలు, నైతికబాధ్యత, వృద్ధాప్యంలో తోడు అన్నవి తప్ప ఇంకేమీ లేదా? లింగభేదం అవసరం కాబట్టి, మిగతా అన్ని భేదాల్ని వప్పుకుని తీరాలా? పనికోసం ఒకరు, ఇంటిపని కోసం మరొకరు కలిసి జాయింటుగా పెట్టిన గౌరవప్రదమైన వ్యాపారమేనా వివాహమంటే? ప్రేమ అనేది అసంకల్పితమైన చర్యగా గాకుండా అవసరార్ధం ఉత్పన్నమయ్యే వస్తువా? కేవలం ప్రేమించాలి కాబట్టి ఎన్ని మానసిక స్థాయీ భేదాలున్నా ప్రేమించక తప్పదా? రాముడు పొరపాటున ఊర్వశీ స్వయంవరానికి వెళ్ళి గెలిచి వుంటే సీతని ప్రేమించినంత గాఢంగా వివాహమయ్యాక ఊర్వశిని ప్రేమించి వుండేవాడా? స్త్రీ పురుషులు కూడా యూనిసెక్స్ సంతతిలాగా రెండు వేర్వేరు జంతురూపాలై వుంటే, సింహాల్నీ, పులుల్నీ చంపేసినట్టే యుద్ధాల్లో క్రీస్తుకు పూర్వమే స్త్రీ జాతి నంతటినీ పురుషులు నాశనం చేసి వుండేవారా? ఈ ప్రశ్నలన్నింటికీ ఒకటే జవాబు.

ప్రశ్నల్ని మర్చిపో- అనేది.

.....

"నేనీ రాత్రి నా బాధల్ని మర్చిపోవాలనుకుంటున్నాను. నువ్వు మిస్ వరల్డ్ వి. ఈ రాత్రి నేను అనుభవించాలి. మీ ఇంట్లో విస్కీ వుందా?"

ఇంటిముందు కారాపి, తూలుకుంటూ మెట్లెక్కి వచ్చి తలుపు తట్టిన రవిని చూసి ప్రియంవద అప్రయత్నంగా అడుగు వెనక్కి వేసింది.

"ప్రియంవదా! అన్ని విజయాల్లోకీ గొప్ప విజయం ఏమిటో తెలుసా? దాన్ని ఎక్కువమంది గుర్తించటం .... అంతే! అంత సింపుల్ అలాగే అన్ని అపజయాల్లోకి గొప్ప అపజయం ఏమిటో తెలుసా ప్రియంవదా? మనిషికి తనమీద నమ్మకం పోవటం".

"ఏమిటి? ఏం జరిగింది?"

"ఒకసారి ఇంతకుముందు చెప్పాను, మళ్ళీ చెపుతున్నాను. నేనింకెవర్నీ లెక్క చేయదల్చుకోలేదు. నేను అన్నీ అనుభవించాలి!" అంతలో క్రింది నుంచి ఎవరో పైకి వస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది. అతడు నెమ్మదిగా మామూలు మనిషయ్యాడు. ఆ వ్యక్తి పైకి వచ్చేసరికి పూర్తిగా సర్దుకున్నాడు. ఎంతయినా అతడు సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తి ఆ భావం ఎక్కడో వెన్నుతట్టి మైకాన్ని పోగొట్టింది.

"ఎవరో వచ్చినట్టు చప్పుడయింది. చూసి పోదామని వస్తిని" అన్నాడు సౌందరరాజన్.

"రవితేజగారు మొన్న పరిచయం చేశాను కదా".

"అవును గుడీవినింగ్ సారూ ఏమి ఇట్ల వస్తిరి".

రవి ఏదో చెప్పబోతూ వుంటే ప్రియంవద అందుకుని "రేపేదో ముఖ్యమైన మీటింగ్ వుందట. తొందరగా రమ్మనిచెప్పటానికి వచ్చారు" అంది.

"నిండదా సంతోషం స్వయంగా వచ్చి పిలిచినారంటే అది రొంబ అర్జెంటు పని అయివుంటది పోయిరామ్మా".

"అబ్బే అటువంటిదేమీ లేదు. ఇంటికెళ్తూ ఇదే దారని చెప్పి పోదామని వచ్చా. రేపు ఎనిమిదింటికల్లా వచ్చెయ్యి" అని మెట్లు దిగాడు. అతడు దిగుతూంటే వినిపించింది పైనుంచి ఇంటి యజమాని ప్రియంవదతో అంటున్నాడు-"రాత్రిపూట తలుపు తీసే ముందర జాగ్రత్తగా చూడాలమ్మా ఏదో పని పెట్టుకుని ఇట్టాగే వస్తుంటరు".

అతడి మొహం సిగ్గుతోనూ, రోషంతోనూ ఎర్రబడింది. కారు తలుపు ధడేలున వేసి ఇంటివైపు పోనిచ్చాడు.

* * *

"నన్ను క్షమించండి" అందామె తల వంచుకొని.

"ఆ మాట నేను అనాలి ప్రియంవదా! అన్నీ మర్చిపోయి అర్ధరాత్రి అలా వచ్చానంటే నాకే సిగ్గుగా వుంది".

"మీకెలా వుందోగాని నాకు మాత్రం....."

"ఆగిపోయావేం- చెప్పు".

".....ఎంతో థ్రిల్లింగ్ గా, ఆనందంగా అనిపించింది".

అతడు విస్మయంతో తలెత్తి "థ్రిల్లింగ్ గానా" అన్నాడు.

"అంటే..." అని ఆ అమ్మాయి తరువాత ఏం చెప్పాలో సరిగ్గా తెలియక తటపటాయించి "చూడండీ! మనకి కావాల్సిన వాళ్ళు ఎవరైనా కష్టాల్లో వున్నప్పుడు ఇంకెక్కడికీ వెళ్ళకుండా మననే కోరుకున్నారనుకోండి, అది ఎంత ఆనందంగా ఉంటుందో-మీకు తెలుసు కదా" అన్నది.

అతడు నవ్వి, అంతలోనే ఏదో అనుమానం వచ్చి "నేను కష్టాల్లో వున్నానని నీకెవరు చెప్పారు ప్రియంవదా" అన్నాడు.

ఆమె మళ్ళీ తటపటాయించి, "ఆఫీసులో అందరూ అనుకుంటున్నారు" అంది.'

"ఏమని" బుల్లెట్ లా దూసుకువచ్చింది అతడి నోటివెంట ప్రశ్న.

......

"ఏమని?" రెట్టించాడు.

"మీకూ మాధవిగారికీ పడదని".

అతడు స్థబ్దుడయ్యాడు. కానీ ఆ విషయమై మరింత ముందుకు సాగకుండా "మరి నువ్వేమనుకుంటున్నావ్ ప్రియంవదా?" అన్నాడు.

"మీ కోసం నేనేమైనా చేయగల్గితే బావుణ్ణు అనుకుంటున్నాను".

అతడు ఆశ్చర్యంగా తలెత్తి "ప్రియంవదా" అన్నాడు.

"అవును-" అందామె అదో ట్రాన్స్ లో వున్నట్టు. "మీకిదంతా చిన్నపిల్ల వ్యవహారంలా వుండొచ్చు సార్. కాని నేను మీ గురించి ఎంత ఆలోచిస్తావో తెలుసా! మీ కొకసారి చెప్పాను. రవితేజ టెక్స్ టైల్స్ లో ఉద్యోగం అంటే నేనెలా ఫీలయ్యానో అందులోనూ మీ దగ్గిర! ఇంతవరకూ వచ్చాక ఇక దాస్తే అది ఆత్మవంచన మీ కోసం నేను దేనికైనా సిద్ధంగా వున్నాను మీ సంతోషం కోసం దేన్నైనా వదులుకుంటాను. ఇంతకన్నా ఎలా చెప్పను".

"కానీ రేప్రొద్దున్న నీ భవిష్యత్తు".

"భవిష్యత్తుకేం? అదలా నడుస్తూ వుంటుంది".

"పెళ్ళి?"

"ఎవరైనా కుర్రాడు దొరికితే కదా" అని ఆగి, "మీరేం అడగదల్చుకున్నారో నాకు అర్థమైంది. ఇష్టానికి సంబంధించినంత వరకూ మానసికం, శారీరకం అని వేర్వేరుగా వుంటాయని నేను అనుకోను సార్. ఎప్పుడైతే ఒకరు తన మనసుని కంట్రోలు చేసుకోలేదో, అపుడిక శారీరకంగా దూరంగా వుండి, స్వచ్ఛంగా వున్నానని అనుకుంటే అది ఆత్మవంచన ఇది నేను మీ గురించి వప్పుకోవటంలేదు సార్ నా గురించి అడుగు ముందుకేస్తున్నాను. మీ తెలివితేటలు, మీ విజయాలు, ఎప్పుడూ వీటి గురించే ఆలోచిస్తాను నేను. రవి ఇప్పుడు ఏం చేస్తూ వుండి వుంటారు?

'ఫలానా డిజైను ఫలానా రకంగా మార్కెట్ లోకి ప్రవేశపెడితే ఎలా వుంటుంది? అని ఆలోచిస్తూ వుంటారనుకుంటా' అని నేను తరచు ఆలోచిస్తానన్న మాట నవ్వింది.

అతడు కదిలిపోయి "ప్రియంవదా" అన్నాడు.

"కానీ ఒక్క విషయం! ఇప్పటికే మనమీద లక్ష కళ్ళున్నాయని నా అనుమానం. నాకు ఫర్వాలేదు సార్. మీరు జాగ్రత్తగా వుండండి. నేను లెక్క చేయను" ఆమె ఆగి అన్నది- "ఆవేశంలో అలా అనిపిస్తుంది. ఇది ఒక తీయని అనుభూతిగా మిగిలిపోవాలి తప్ప 'ఎందుకిలా చేశామురా భగవంతుడా' అనిపించేలా అనకూడదు".

"నువ్వు చెప్పిందీ నిజమే ప్రియంవదా! కానీ నాకు కొంత మానసిక స్వాంతన కావాలి. ఒక పదిరోజులు ఇద్దరం ఎక్కడికైనా వెళ్ళిపోదాం".

"అప్పుడుగానీ మన గురించి వాల్ పోస్టర్లు వెయ్యరు" నవ్వింది.

"పది కాకపోతే అయిదు- నాలుగు- రెండు".

"అప్పుడయినా మీ శ్రీమతికి అనుమానం వస్తుందనుకుంటాను. ఆమె ఇటువంటి విషయాలు చాలా సులభంగా పట్టేస్తుందని మీరే ఒకసారి అన్నారు".

"అవును మన ఆఫీసులోనే తనకీ విషయాలు చేరవేసే వాళ్ళు కొందరున్నారు".

"అటువంటప్పుడు మీరు ఊళ్ళో లేకపోవటం, నేను శలవు పెట్టడంతో వెంటనే తనకి అనుమానం వస్తుంది".

"నాకో ఆలోచన వస్తూంది".

"ఏమిటి?"

"ఈ కంప్యూటరైజ్డ్ మిర్రర్ కొనటానికి నేనెలాగూ అమెరికా వెళ్తున్నాను. నేను తిరిగి వచ్చేటప్పుడు ముంబాయిలో ఆగుతాను. నువ్వు అక్కడికొచ్చెయ్యి".

"మైగాడ్-"

'అవును. ఇది ఎక్స్ లెంట్ అయిడియా...." ఒక నిర్ణయానికి వచ్చినట్టు అన్నాడు. "ఇలా ఒక గంట, రెండు గంటలు కలుసుకోవటం, ఎవరైనా చూస్తారేమో అని భయపడటం-ఇదంతా వద్దు. నాల్రోజులపాటు ఇదంతా మర్చిపోవాలంటే అసలిక్కడ వుండకూడదు. ఈ ప్రపంచానికి దూరంగా...మరో ప్రపంచంలోనే నాల్గురోజులు వుండిపోవాలి".

ఆమె మాట్లాడలేదు.

"కాదనకు ప్రియంవదా! ఐ యామ్ బాడ్లీ ఇన్ నీడ్ ఆఫ్ ఇట్" అభ్యర్థిస్తున్నట్టు అన్నాడు.

"లేదు లేదు నేనది అనటంలేదు".

"మరి?"

"ఇక్కడినుంచి నేను ఒంటరిగా ముంబాయి రావటం, మళ్ళీ అక్కడినుంచి మనిద్దరం కలిసి రావటం-అంతా కష్టం. పైగా మీరు అమెరికా నుంచి అనుకున్న తేదీకి రాలేకపోయినా, ఆలస్యం అయినా ముక్కు మొహం తెలియని ఆ ఊళ్ళో నేనేం చెయ్యను? అందుకని నాకో ఆలోచన వస్తూంది".

"ఏమిటది?"

"మనం ముంబాయిలో కాదు. ఇక్కడే కలుసుకుందాం".

"అంటే-" అనబోయి ఆగిపోయాడు. ఆమె చెప్పిన దాన్లో లాజిక్ కనబడింది. ఒక క్షణం ఆలోచించి, "నిజమే నేను స్టేట్స్ నుంచి ఎప్పుడొచ్చానో ఇక్కడ తెలిసే అవకాశం లేదు. రెండ్రోజులు ఆలస్యంగా వచ్చాననుకుంటారు లేదా ముంబాయిలో ఆగి పోయాననుకుంటారు. మననెవరూ పట్టించుకోరు".

ఆమె లేచి నిలబడి, "మీరెప్పుడు వస్తున్నారు స్టేట్స్ నుంచి?" అని అడిగింది. అతడు చెప్పాడు.

"దానికి నాల్గు రోజుల ముందునుంచే సెలవు పెడతాను".

"అవును అది మంచి ఆలోచన. నేను రాగానే నిన్ను పికప్ చేసుకుంటాను".

"మీరు రావటం మన వాళ్ళెవరైనా చూస్తే మరీ ప్రమాదం" నవ్వుతూ అంది.

"ఆ విషయం నేను చూసుకుంటాను".

సంభాషణ పూర్తికాగానే ఆమె లేచి వెళ్ళిపోబోయింది. 'ప్రియంవదా' అన్నాడు. ఆమె ఆగింది.

"థాంక్స్ అనేది రెండక్షరాల మాట. అంతకన్నా ఇంకెలా చెప్పాలో నాకు తెలియటంలేదు."

ఆమె నవ్వేసి, "ఆ నాల్గురోజులూ అయ్యాక నాతో అనిపించాల్సిన మాట ఇది" అని వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన నిమిషానిగ్గానీ అర్ధంకాలేదు. అర్ధమవగానే మొహం నవ్వుతో విచ్చుకుంది. అతడి హృదయమంతా ఏదో తెలియని ఉత్సాహంతో గంతులేస్తోంది.

బయట వర్షం కురిసేలా వుంది.

అయిదు నిముషాల్లో అక్కడ కుండపోతగా వర్షం ప్రారంభమయింది.

**ఇది** జరిగిన వారం రోజులకి అతడు స్టేట్స్ వెళ్ళాడు. మిగతా వ్యవహారాలన్నీ నాలుగురోజుల్లో చక్కబెట్టాడు. రెండు కంపెనీలూ కాంట్రాక్టు ఫారాలుమీద సంతకం పెట్టాయి. అంతకు ముందే అగ్రిమెంటు జరిగిపోయింది కాబట్టి కేవలం ఎల్.సి. విడుదల చేయడమే మిగిలింది.

అప్పటివరకూ రెడీమేడ్ దుస్తుల్నే చూపించే దర్పణంలో చీరకట్టు రిఫ్లెక్షన్స్ వచ్చేలా డిజైను చేశారు కంపెనీవారు మొదటి దఫా వెళ్ళినప్పుడే ఈ చీరకట్టు స్కెచ్ లు వేసి యిచ్చారు. ఆ డిమాన్ స్ట్రేషన్ లతో అతడు సంతృప్తుడయ్యాడు.

ఆ దర్పణాలు భారతదేశంలో మరే కంపెనీకి సంవత్సరంపాటు ఇవ్వకుండా ఏర్పాటు జరిగింది.

న్యూయార్క్ లో ఈ దర్పణాలున్న షాపుల్లో రద్దీని చూసి అతడు విస్మయం చెందాడు. ఎంతో వేగంగా జరిగిపోతున్నాయి అమ్మకాలు. శ్రమకూడా లేదు. నాలుగు రోజుల్లో పని విజయవంతంగా పూర్తయింది.

అతడి మనసు ఎప్పుడు వెళ్దామా అని వువ్విళ్ళూరుతోంది.

అయిపోవడం వేరు. దానికోసం ఎదురుచూడటం వేరు. ఆ రెండోదాన్లో వున్న థ్రిల్ మొదటిదానిలో వుండదు. ఏ పని చేస్తున్నా అతడి మనసంతా జరగబోయేదానిమీదే వుండేది. ఏదో తెలియని ఉద్వేగం.

కోటి రూపాయల టెండరు పాడేటప్పుడు కూడా ఎపుడూ అతడింత టెన్షన్ ఫీలవలేదు. ఎందుకో అప్రయత్నంగా పెదాల మీద చిరునవ్వు దానంతట అదే వచ్చేది. అవతల అమెరికన్ డైరెక్టర్లతో మాట్లాడుతున్నప్పుడు కూడా ఈ ఆలోచన వదలిపెట్టేది కాదు. అతడి కిదంతా వింతగా కూడా అనిపించింది. ఇది సవ్యమైన థ్రిల్లేనా అంటే చెప్పలేడేమో కానీ ఇందులో ఇంత థ్రిల్ వుంటుందని అతడికీనాడే తెలిసింది. ఒకరికోసం ఎదురు చూడటంలో వుండే థ్రిల్లు....! మాధవితో వివాహం చిన్న వయసులో అయిపోయింది. కాబట్టి ఆ తరువాత అతడికి అటువంటి థ్రిల్సేమీ ఇచ్చే ప్రయత్నం ఆమె చేయలేదు కాబట్టి ఇంతకాలమూ ఆ ఆనందం తెలియలేదు.

పని ముగించుకుని అతడు స్వదేశానికి బయల్దేరాడు. అనుకున్న రోజే పని పూర్తయింది.

ముంబాయిలో దిగేసరికి రాత్రి పదయింది. ఆ రాత్రి అక్కడే వుండి మరుసటిరోజు ప్రొద్దున్న పదకొండింటికి హైదరాబాద్ బయల్దేరాడు ముంబాయి విమానాశ్రయంలో టిక్కెట్టు కొనేటప్పుడు పూర్తి చేయవలసిన ఫారంలో మామూలుగానే "రవితేజ" అనే పూర్తిచేశాడు. మరీ అంత భయపడవలసిన అవసరం అతడికేమీ కనపడలేదు. విషయం అంతవరకూ వస్తే "అవును చేశాను ఏం?" అని ఎదురుతిరిగే ధైర్యం అతడికెప్పుడూ వుంది. కేవలం ప్రియంవద కోసమే అతడీ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు.

విమానంలో మాత్రం తెలిసిన వాళ్ళెవరయినా కనపడతారేమోనని మాత్రం చూశాడు. అలాటి వారెవరూ

కనపడలేదు.

ఎయిర్ పోర్ట్ లో దిగి, అతడు టాక్సీ వేసుకుని, ప్రియంవద ఇంటికి బయల్దేరాడు. అదృష్టవశాత్తూ క్రింద ఇల్లు తాళంవేసి వుంది. పైన అతడికోసం ప్రియంవద ఎదురు చూస్తూంది. అతడిని చూడగానే ఆమె మొహం విప్పారింది. "అనుకున్న టైమ్ కే వచ్చేశారే" అంది.

అతడు నవ్వి, "బయల్దేరదామా?" అన్నాడు.

సర్ది వుంచిన చిన్న బ్రీఫ్ కేసుతో ఆమె బైటకి వచ్చింది.

ఇద్దరూ కూర్చున్నాక టాక్సీ బయల్దేరింది. అరగంట తరువాత నగరంలోకెల్లా ఖరీదైన హోటల్ గదిముందు ఆగింది.

అక్కడ ఫారం పూర్తిచేసేటప్పుడు మాత్రం చంద్రప్రియ అని వ్రాసేడు ముంబాయినుంచి వస్తున్నట్టు. ఈ లోపులో బెల్ బోయ సామాన్లు పట్టుకున్నాడు.

ఇద్దరూ మూడో అంతస్తులో గదిలోకి ప్రవేశించారు. ఆమె ఆ గదిచూసి అవాక్కయి, 'మైగాడ్' అంది అప్రయత్నంగా.

విశాలమైన గది నీలం రంగు కార్పెట్. ఒక మూల ఫ్రిజ్ బల్లమీద గులాబిపూలు. కిటికీ తెరల్లోంచి సన్నటి వెలుతురు కిరణం తప్ప మిగతా గదంతా లైటింగ్... ఛానెల్ మ్యూజిక్ లో సితారు ప్రకంపనం- అడ్డంగా విశాలమైన అద్దం- ఒక మూల టీ.వీ., ఎత్తయిన మంచం, వాటర్ జగ్, స్టెరిలైజ్డ్ నీళ్ళగ్లాసులు, మందంగా సువాసన చల్లటి గాలితో కలిసి శరీరాన్ని వణికించే కొత్తదనం...

బెల్ బోయ్ వెళ్ళగానే చిన్నచప్పుడుతో తలుపు మూసుకు పోయింది. వెనక్కి తిరుగుతూ వుండగా అనిపించింది రవితేజకి- తాను వేసిన బోల్టు ప్రపంచాన్ని చూడదల్చుకోలేక తలుపులు వేయడానికా? లోకం కళ్ళు కప్పడానికా? తన మనసు తలుపు దేనినో తెరుచుకోవడానికా?

ఈ మీమాంస చాలా చిత్రంగా అనిపించింది. 'చిత్రంగా' అన్న పదం సరైంది కాదేమో! ఉద్వేగం, ఉత్సాహం, అన్న సయించని ఆకలి తీరిపోవడాన్ని ఒప్పుకోని కోరిక అన్నీ తమాషాగా కలగలసిన ఒక భావం!

బోల్టు వేసి వెనక్కి తిరిగాడు. ఎదురుగా వున్న ప్రియంవద కళ్ళలోకి చూడగానే...ఆ క్షణాన అతను సెక్సువల్ ఆర్జ్ కీ ఎమోషనల్ సర్జ్ కీ అతీతంగా ఒక స్త్రీ దేహాన్ని గాక, తనను తాను హత్తుకుంటూ-

రావితేజకి ప్రియంవద కనిపించడం లేదు. మాధవీ కనిపించలేదు. ఆ మాటకొస్తే ఆ క్షణాన అతనికి తను తప్ప

మరేమీ కనిపించడంలేదు. కానీ అది ఒంటరితనం కాదు.

కవినై, కవితనై, వేసవి వేడిలో...వెన్నెల వాడిలో, పన్నీటి జలజాతాల, కన్నీటి జలపాతాల...నాతో నేనే అనుగమిస్తూ నాతో నేనే రమిస్తూ...

స్తంభించకుండా అంతరంగంలో తరంగిస్తోన్న ఈ వాక్యాల మేలుకొలుపుతో ఒళ్ళు విరుచుకొని లేస్తున్నాడు. రవితేజలోని 'రవితేజ'. ఇన్నాళ్ళూ రవితేజలోని భావుకుడు చీరల్లోని గళ్ళల్లో, పువ్వుల్లో, రంగుల్లో, అంచుల్లో, అల్లికల్లో ఆదమరచిపోయి, కూనిరాగాల నలపించే ఒకనాటి రొమాంటిస్టు ఈ క్షణాన నిద్రలేచాడు... మార్కెట్ జయించడం కోసం మేధస్సుతో చీరల్ని అల్లే రవితేజని....

ఈ క్షణంలోని జలతారు అల్లికల జరీ కల జయించింది.

అతనంత మోటుగా ఏ వస్తువునైనా పట్టుకోగలడని యింత వరకూ అతనికే తెలియదు- అతని కౌగిలిలో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రియంవదకు కూడా తెలీదు. అయితే ఆమెకి మరో సంగతి కూడా తెలియదు.

అతని కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయని.
నాతి తోనె కాదు
రాతితో కూడా
సురతం సాధ్యమె
హృదయానికి రస స్పందనా
ఊహలకి ఉలి కదలికే వుంటే.....!
థాంక్స్ నాట్ టు ప్రియంవద....
థాంక్స్ టు మాధవి...

అర్ధనారీశ్వర చిత్రంలో చూడటానికి కనిపించే తేడా భావించడానికి కనిపించదు. ఆ అల్లికలో ఎక్కడ ఏది మొదలు, ఎక్కడ ఏది విభుజ్యరేఖ? తర్కిస్తోంది వేడెక్కుతున్న గదిలో గాలి.

ఉచ్ఛ్వాసానికి, నిశ్వాసానికి మధ్య నిశ్శబ్దం, అలసిపోయిన పాదాలతో నాట్యంచేస్తూ ఆ క్షణాన్ని నిశ్చలంచేసే ప్రయత్నం చేస్తుంది. శరద్వలువలను హేమంత శిశిర నిశిలోకి వలిచి విసురుతూ, కోరికతో వణుకుతున్న శృంగార వాసంతి గ్రీష్మ తాపాన్ని వర్షిస్తోంది. తనని తాను మరచిపోయే ప్రయత్నంలో అతడు తనను తాను తెలుసుకుంటున్నాడు.

పెదవి అంచుని నాలుక కొన మీటితే వినిపించే ఊర్పుల మోహనరాగం.

పృథ్వి అంచున నించుని నింగినందుకోవాలనే ఆరాటం.

ఆకసపు విల్లు వంచి, సూర్యచంద్రుల కొసల్ని కిరణాల నారితో సంధించి రేబవళ్ళ సరాల్ని విసురుతున్న వసుధ, పురుషున్ని రగిలిస్తూ, చల్లారుస్తూ ఆ కేళిలో కాలాన్ని కంటున్నది.

బుగ్గమీద నీతి చుక్క అతడి కంటినుంచి జాలువారిందో, ఆమె ముంగురులు నుంచి జారి చేరిందోకాని, విజయ కేతనపు రెపరెపల్ని విశ్లేషిస్తోంది.

ప్రత్యూషం మధ్యాహ్నానికి స్వాగతం చెప్పి, వెళ్ళిపోతున్న సమయానికి మెలకువ వచ్చింది రవితేజకి. ప్రియంవద ఇంకా నిద్రపోతూ వుంది. కిటికీ తెరలు తొలగించగానే సూర్యకిరణాలు గదిని ప్రకాశవంతం చేశాయి. బయట వెచ్చటి సూర్యుడి ఉనికి, లోపలి చల్లటిగాలికి కాంట్రాక్టుగా వుంది.

టీ.వీ. ఆన్ చేశాడు. టెన్నిస్ మాచ్ వస్తోంది. రమేష్ కృష్ణన్ ఆడుతున్నాడు. స్నేహితుల బలవంతం మీద ఓ పదిరోజులు టెన్నిస్ ప్రాక్టీసుకి వెళ్ళినప్పుడు కూడా ఇలాంటి వళ్ళు నొప్పే! అతడు షవర్ ఆన్ చేశాడు. వెచ్చటి నీరు వంటిమీద ప్రవహిస్తూనే అలసిపోవడంలో ఆనందాన్ని తెలుపుతూంది.

దాదాపు అయిదు నిముషాలు అలాగే బాత్ టబ్ లో కళ్ళు మూసుకొని పడుకున్నాడు. గదంతా తెల్లటి ఆవిరి మేఘాల్లో తేలిపోతున్న శరీరం ఛానల్ లో "లవ్ బిట్వీన్ రెయిన్ డ్రాప్స్" అన్న పాట సన్నగా వస్తూంది. బయట ఫోన్ చేస్తున్న శబ్దం అతడిని మేలుకొలిపింది. అతడికి అర్థంకాలేదు. ప్రియంవద ఎవరికి డయల్ చేస్తుంది? ఆమెమీద కాస్త కోపం కూడా వచ్చింది. ఈ హోటల్ లో తామిద్దరూ వున్నట్టు బయటవాళ్ళకి  ఏ మాత్రం అనుమానం వచ్చినా ప్రమాదం కదా! ఆ సంగతి తను మరచి పోయిందా? అతడు బాత్ టబ్ లోంచి లేచి టవల్ చుట్టుకొని గదిలోకి వచ్చాడు. అప్పటికే ఆమె సంభాషణ ప్రారంభించింది.

"అవునే, ఈ రోజే వచ్చాను. ఎల్లుండి జాయిన్ అవుతాను. ఏమిటి ఆఫీసు విశేషాలు?"

అట్నుంచి ఏమన్నదీ వినిపించలేదు.

"ఎం.డి. ఎప్పుడొస్తారట?"

రవితేజ వచ్చి మంచం మీద కూర్చుంటూ వుండగా ఆమె అతడిని చూసి నవ్వింది. "మన ఆఫీసు వాళ్ళతో మాట్లాడుతున్నావా?" అనబోయి మళ్ళీ తన కంఠం అవతలివాళ్ళకి వినిపిస్తుందేమో అని వూరుకున్నాడు.

"ఎక్కడ....? ఇంకా స్టేట్స్ లోనే వున్నారటా?" చిలిపిగా అడిగింది. కానీ అంతలో ఆమె మొహంమీద నవ్వు మాయమైంది. అట్నుంచి వినపడేదాన్ని వింటోన్నప్పుడు ఆమె మొహంలో మారుతున్న భావాల్ని అతడు గమనించాడు.

"ఎవరు శర్మగారా?"

........

"ఏమిటంత అర్జెంటు పని?"

.....

........

రవితేజ ఆందోళనగా ఆమెవైపు చూశాడు. ఏదో అనుకోనిది జరిగిందని ఆమె మాటలబట్టి తెలుస్తుంది.

"ఇప్పుడు ట్రై చేస్తున్నారా?"

రవితేజ వెళ్ళి టీ.వీ. తగ్గించాడు. మళ్ళీ వచ్చి కూర్చున్నాడు.

"సరే, నేను ఎల్లుండి వస్తాను. అప్పటివరకూ శెలవుంది" అంటూ ఫోన్ పెట్టేసింది.

"ఎవరికి - మన ఆఫీసుకి ఫోన్ చేశావా? ఎందుకిక్కడ్నించి చేశావు?" రవితేజ అడిగాడు.

"చెయ్యటమే మంచిదైంది. మీ కోసం డైరెక్టర్లు అమెరికాకి ఫోన్ లో ప్రయత్నం చేస్తున్నారట".

రవితేజ ఉలిక్కిపడ్డాడు. అంత అర్జంటుగా తన అవసరం వారికేమొచ్చిందా అని ఆలోచించడం లేదతడు. ఇప్పుడు అమెరికా నుంచి తను బయల్దేరి మూడు రోజులు అయిపోయిందన్న విషయం వాళ్ళకి తెలిస్తే ఎలాగా అని మధనపడుతున్నాడు. అతడి మనసులో గిల్టీ ఫీలింగ్ ఈ కంగారుని ఎక్కువ చేసింది.

"ఇప్పుడేం చెయ్యాలి?" మనసులో అనుకున్నట్టు పైకే అన్నాడు. ఇద్దరూ ఆలోచనలో కొంచెంసేపు మౌనంగా గడిపారు.

"నా కొకటి తోస్తూంది" అంది ప్రియంవద నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఏమిటన్నట్టు చూశాడు.

"వాళ్ళకన్న ముందే మీరే వాళ్ళకి ఫోన్ చేయండి, ఇంకో రెండురోజుల పని వున్నట్టు మాట్లాడండి. ఈలోపులో వాళ్ళే మీకు తామెందుకు ఫోన్ చెయ్యాలనుకున్నారో ఆ విషయం చెపుతారుగా".

అతడు అర్ధంకానట్టు, "నేను అమెరికానుంచి మాట్లాడుతున్నట్టుగానా?" అన్నాడు. అవునన్నట్టు తలూపింది.

అతనో క్షణం ఆలోచించాడు. ఈ అయిడియా బావున్నట్టే అనిపించింది. ఇంటర్నేషనల్ కాల్, లోకల్ కాల్ లాగానే స్పష్టంగా వినిపిస్తూంది. కాబట్టి వాళ్ళకి అనుమానం రాదు. అసలు వాళ్ళెందుకు తనకోసం ప్రయత్నం చేస్తున్నారో ముందు తెలుసుకోవాలి.

లేకపోతే మనశ్శాంతి వుండదు.

అతడు ఫోన్ అందుకోబోయాడు.

అబద్ధం చెప్పటం అంత సులభం కాదు.

అతడి చెయ్యి కాస్త కంపించింది.

ప్రియంవద అతడివైపే, పోనీ ఇంతకన్నా మంచి ఆలోచన ఇంకోటి ఏదైనా వుందా- అన్నట్టు చూస్తోంది. మరుక్షణం ఆలోచించింది....చివరికెలాగైతేనేం అతడు ఫోన్ డయల్ చేశాడు.

రిసెప్షనిస్టు "హలో... రవితేజా టెక్స్ టైల్స్" అంది.

"నేను.... రవిని....శర్మగారున్నారా?"

అటునుంచి మాట్లాడుతున్నది 'బాస్' అని తెలియగానే రిసెప్షనిస్టు కంగారుపడి "....సర్" అంది. ఈ కొద్ది టైమ్ లో అతడు సర్దుకున్నాడు.

"నేను రవితేజని, శర్మగారున్నారా?" మళ్ళీ అడిగాడు.

"ఉన్నారు సర్. ఇప్పటివరకు మీ కోసమే స్టేట్స్ కి ప్రయత్నించాం సర్. ఇప్పుడే దొరికింది ఆ కాల్. మీరక్కన్నించి బయల్దేరి రెండ్రోజులై పోయిందన్నారు. ఎక్కడున్నారో తెలియలేదు". రవితేజ ఉలిక్కిపడ్డాడు. ఫోన్ తో పాటు ఆ

గదిలో వస్తువులు గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది.

టీ.వీ.లో రమేష్ కృష్ణన్ కొట్టిన బంతి గీత అవతల కెళ్ళిపడింది. "ఇప్పుడే శర్మగారికి కనెక్షన్ ఇస్తాను. లైన్లో వుండండి" అట్నుంచి వినిపించింది.

"ఏమైంది?" ప్రియంవధ ముందుకు వంగి సన్నటి స్వరంతో అడిగింది. అతడు మౌత్ పీస్ ని చేత్తో మూసి, "నేను అమెరికా నుంచి బయల్దేరి వచ్చేసినట్టు వాళ్ళకు తెలిసిపోయింది" అన్నాడు.

"దాందేముంది? ముంబాయి నుంచి చేస్తున్నట్టు చెప్పండి"- ఈలోపులో శర్మ లైన్లోకి వచ్చాడు.

"రవీ..."

"అవును, నేను మాట్లాడుతున్నాను ముంబాయినుంచి".

"ముంబాయి వచ్చేశావా? మేమింకా స్టేట్స్ ప్రయత్నం చేస్తున్నాము. అక్కడ ఎంక్వయిరీ చేస్తే, నువ్వు అప్పుడే బయల్దేరి పోయావన్నారు".

"అవును, నిన్నే ముంబాయి వచ్చాను. ఇక్కడ కొంచం పర్సనల్ పనుంది, వుండిపోయాను. ఏమిటీ, అర్జెంట్ పని అట?"

"అర్జెంటేమీ లేదు. మనకు ఈ సంవత్సరం  ఉత్తమ కంపెనీగా రాష్ట్రపతి అవార్డు వచ్చింది. అది చెబ్దామని".

రవితేజ తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. బరువంతా ఒక్కసారిగా తీసినట్టయింది. 'కంగ్రాట్స్' అన్నాడు.

"నీకు మేము చెప్పాలి.....ఎప్పుడొస్తున్నావు?"

టెన్షన్ పోగానే చాలా రిలీఫ్ ఫీలయ్యాడు. ఆ ఉత్సాహంతో, "ఎప్పుడు రమ్మంటారు?" అనడిగాడు.

"నీ యిష్టం పని చూసుకునేరా ఇక్కడేమీ అర్జెంటు లేదు ముంబాయిలో ఎక్కడ దిగావు?"

"ఎల్లుండి వస్తాను. ఇక్కడ సీ-రాక్ లో వున్నాను".

"ఓ.కే. వుంటాను".

అతడు ఫోన్ పెట్టేసి, ప్రక్కనే వింటున్న ప్రియంవదని అలాగే వెనక్కి దిండుమీదకు తోసి పెదాలమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. ఉత్సాహంతో, "ఏమైంది?" అని అడిగిందామె. ప్రెసిడెంట్ అవార్డుగురించి చెప్పాడు. 'ఓహ్' అందామె. మెరుస్తున్న కళ్ళతో, "కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్స్!"

"మైగాడ్, నాకు ఊపిరి సలపడంలేదు".

అతడు కదిలే ప్రయత్నం చెయ్యకుండానే, "నేను నీకు ఇంకొకందుకు కూడా థాంక్స్ చెప్పాలి" అన్నాడు.

"దేనికి?"

"నువ్వెవరికో ఫోన్ చేస్తున్నట్టు బాత్రూమ్ లోంచి వినిపించగానే నీ మీద కోపం వచ్చింది. కానీ నువ్వు ఫోన్ చేయడమే మంచిదయింది. లేకపోతే వీళ్ళు నా గురించి అమెరికాకు ప్రయత్నం చేస్తున్నారన్న విషయం మనకు తెలిసి వుండేదికాదు. ఎల్లుండి కలుసుకోగానే వాళ్ళు విషయం చెప్పి వుంటే అప్పటికప్పుడు సర్దుకోలేక కంగారుపడి వుండేవాడ్ని అందుకు థాంక్స్".

"థాంక్స్ కన్నా ముందు మరొక పని చెయ్యాలి. బరువంతా నా మీద వేయకుండా కాస్త పక్కకి జరగడం".

అతడు కదలకుండా, "ఇంకొకదానికి కూడా థాంక్స్ చెప్పాలి. అది చెప్పి అప్పుడు పక్కకి వెడతాను" అన్నాడు. "ముంబాయినుంచి అన్న ఆలోచనగాని నువ్వు నాకు ఇచ్చి వుండకపోతే వెంటనే ఇక్కడినుంచి బిచాణా ఎత్తేసి మనం వెళ్ళిపోవలసి వచ్చేది. ఈ రెండు రోజులూ ఇలా కలిసి వుండే ఆలోచన చెప్పినందుకు రెండో థాంక్స్" ప్రక్కకు జరుగుతూ అన్నాడు. ఆమె గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

"ఏం నీకు సంతోషంలేదూ?"

"చాలా రిలీఫ్ గా వుంది!"

"నీ ఆలోచనేగా!"

"దానిక్కాదు, మీదనుంచి లేచినందుకు!" నవ్వింది. గుడి ప్రాంగణంలో గన్నేరు పువ్వు విచ్చుకున్నంత అందంగా వుందా నవ్వు. అతడామె మెడ వంపులో ముద్దు పెట్టుకున్నాడు.

మొదటి సెట్ లో రమేష్ కృష్ణన్ 6-2 తో గెలిచి, రెండో సెట్ మొదలు పెట్టాడు టీ.వీ.లో.

వెళ్ళిపోతున్నానని వీడ్కోలు చెప్పి, మధ్యాహ్నం - సాయంత్రం దగ్గర సెలవు తీసుకుంది. మూడున్నర కావస్తోంది టైమ్. "మీరూ కనీసం స్నానం అయినా చేశారు! నేను అదీ చేయలేదు. కాస్త ఓపిక పడితే స్నానం చేసి వస్తాను".

"సారీ, మనం బ్రేక్ ఫాస్ట్ కూడా చెయ్యలేదు. ఆ విషయం మర్చిపోయాను".

ఆమె టవల్ తీసుకొని వెళుతూ, "బ్రేక్ ఫాస్ట్, లంచ్ అయిపోయాయి. కనీసం డిన్నర్ అయినా కాస్త ఆలస్యంగా చేద్దాం" అని నవ్వేసి లోపల బోల్టు వేసుకుంది.

ఆడాళ్ళు మొగవాడితో సమానంగా మాట్లాడతారని తెలియదు. ఈ వయసులో ఆ నుభవం కొత్తగా వుంది. ముఖ్యంగా నిన్నరాత్రికి- ఈ రోజు మధ్యాహ్నానికి తేడా మరింత స్పష్టంగా కనిపిస్తూంది. నిన్నరాత్రి ఆమె సిగ్గుతెరల్ని తొలగించుకొని బయటకు రావడానికి చేసిన తొలి ప్రయత్నాలు అతడికెంతో ముచ్చటగా అనిపించాయి. మొదట్లో తన చేతుల్ని నిరోధించే పరికరాలుగా మాత్రమే పని చేసిన ఆమె చేతులు, క్రమక్రమంగా బెరుకు పోగొట్టుకొని తన శరీరం మీద తీసుకున్న చొరవ అతడి సంతృప్తిని ఏకాక్షరంలో బహిరంగ పరచేలా చేసింది.

లోపల నీళ్ళ చప్పుడు వింటూ అతడు ఆలోచనల్లోకి జారుకున్నాడు. నేను చేస్తున్నది తప్పుకానీ, కాకపోనీ - నేనెవ్వరికైనా ద్రోహం చేస్తున్నానని కానీ, లేదని కాని ఎవరైనా అనుకోనీ, అనుకోకపోనీ- జీవితంలో ఇంత ఆనందం వుందని నాకీరోజే అర్థమైంది. ఈమెతో పరిచయం కాకపోయివుంటే, నా జీవితం పుస్తకంలో ఒక పూట శాశ్వతంగా తెరుచుకోకుండా జీవితాంతం అలాగే వుండిపోయేది. ఇంతకాలం నేననుకునేవాడిని- రాజకీయాల్లోను, వ్యాపారంలోను, చదరంగం ఆటలోను తెలివితేటలు కావాలని! వీటికన్నా ఎక్కువ తెలివితేటలు అవతలి పార్టనర్ ను సంతృప్తి పరచడానికి కావాలని ఇప్పుడర్థమయింది. ఇది జెనిటిక్స్ వల్ల రాదు. శాస్త్రాలు చదవడంవల్ల రాదు. ఒక నిజమైన సంతృప్తికోసం లక్షల ఆస్థిని వదిలిపెట్టేవాళ్ళని చూసి మూర్ఖులనుకునేవాడిని ఇప్పుడు వాళ్ళని చూస్తే ఈర్ష్యగా వుంది. ఇలా వెల్లకిలా పడుకుని చూస్తూంది- తిరిగే ఫాన్, ఊగే కిటికీ తెర, కదిలే కాగితం కూడా ఆనందంగా కనిపించగలిగేటంత తృప్తి ఇందులో వుందంటే-ఓ మాధవిల్లారా, ఎంతమంది పురుషుల్ని మీరు చీకట్లో వుంచుతున్నారు?

ఎన్ని రకాలైన మానసిక విభేదాలైనా ఈ ఒక్క కళతో పోగొట్టుకోవచ్చని మీరెప్పుడు తెలుసుకుంటారు? తెలుసుకోవలసింది పురుషుడే అన్నది మీ ఎదురు ప్రశ్న అయితే, నా వద్ద పూర్తి సమాధానం లేదు కాని కిరణం పడగానే అల్లుకోవాలని తెలుసుకోవలసింది సూర్యుడా? కలువా? పందిరి కనపడగానే అల్లుకోవాలని మల్లెతీగలకి ఎవరు చెప్పారు?

ఇంత స్వభావసిద్ధమైన ఆనందాన్ని కూడా ఈ ప్రిజిడిటీలో, అహంభావంతో ఎందుకు పోగొట్టుకుంటారు?

.....అతడు ఆ స్వాప్నిక వాస్తవాల్లో అలా వున్నప్పుడు, ఆమె వచ్చి అతడి పక్కన చేరింది. ఆమె చర్మం మీద నుంచి వచ్చే ఫ్రెష్ నెస్ ని అనుభవిస్తూ అతడు తన భార్యని గుర్తుతెచ్చుకున్నాడు. "ఇప్పుడే స్నానం చేసి వచ్చాను. పాడు చెయ్యకండి-" అని, తనకన్నా... కట్టుకున్న చీరకే ప్రాముఖ్యత ఇచ్చే భార్యనీ, ఇంతకాలం దీన్ని-స్నానంతో పునీతమైన చర్యగా భావించినందుకు సిగ్గుపడుతూ, ఇన్నాళ్ళ లేమిని పూరించుకుంటున్న సమయాన-

అక్కడ సీ-రాక్ హోటల్ (ముంబాయి)లో ఒక చిత్రమైన సంఘటన జరిగింది.

అంతకుముందు ఇన్ స్పెక్టర్ లా నటించి రవితేజకి సహాయపడిన వ్యక్తి భాస్కర్...ఇప్పుడు ఫుల్ సూట్ లో వున్నాడు. జుట్టు కాస్త ముందుకు పడేలా దువ్వుకున్నాడు. మునుపటి మీసకట్టుకి ఇప్పటి దానికి తేడా వుంది. మేక్ అప్ బాగా చేతనైనవాడు అతడి మొహాన్ని బాగా మార్చివేశాడు. పదిరోజులు పోయాక, రవితేజ ఫోటోని చూపించి, అప్పుడు అతడిని చూసింది మీరేనా అంటే అవుననేలా వున్నాడు.

అతడు రిసెప్షన్ దగ్గరకొచ్చి "401 ప్లీస్" అన్నాడు రిసెప్షనిస్ట్ ఆ రూము తాళాలు అతడికిచ్చింది. అతడు ఆమెవైపు పరీక్షగా చూస్తూ "మీ చీర మీకు చాలా బాగా నప్పింది" అన్నాడు.

"థ్యాంక్ యు సర్" అందామె.

"మీకు తెలుసా, ఇది మేము తయారు చేసిన చీర".

ఆమె అర్థంకానట్టు అప్రయత్నంగా బల్లమీద కార్డ్ మీద పడింది. అక్కడున్న పేరు చూసి "ర..వి...తే ...జ" అంది. అతడు చిరునవ్వుతో తలూపాడు.

"యు మీన్ రవితేజ టెక్స్ టైల్స్".

"అవును".

"మీరే కదు రవితేజ".

"ఏం-అందులో ఏమైనా అనుమానం వుందా?"

"అదికాదు సారీ సర్, అయామ్ జస్ట్ థ్రిల్ అంతే-"

"ఇట్స్ ఆల్ రైట్- మీ పేరు?"

"చంద్రికా ప్రియదర్శిని".

"పేరు కూడా చీరంతా అందంగా వుంది" అని అతడు లిఫ్ట్ వైపు నడిచాడు. లిఫ్ట్ తలుపులు మూసుకుంటున్నప్పుడు ఆమెవైపు చూశాడు. ఆమె ఇటే చూస్తూవుండటం గమనించి, బొటన వేలు పైకెత్తాడు. ఆమె నవ్వుకుంటూ; ఏదో పనున్నట్టు పక్కకి తిరిగిపోయింది. నాలుగో అంతస్థులో లిఫ్టు ఆగగానే అతడు తన గదిలోకి వెళ్ళాడు.

"హలో" అని వినిపించింది.

"చంద్రికా ప్రియదర్శిని?"

"స్పీకింగ్".

"నేను రవితేజ".

"చెప్పండి".

"నేను ఎనిమిది గంటలు డిస్టర్బ్ చెయ్యబడకుండా కొంచెం ఆపరేటర్ కి చెబుతారా? ఫోన్లు ఏమొచ్చినా గదిలో లేడని చెప్పండి".

అతడు వెంటనే ఫోన్ పెట్టెయ్యలేదు. ఆమె కూడా.

"మీరు కొత్తగా చేరారా?"

"అవును సర్!"

"అందుకనే నన్ను గుర్తుపట్టలేదు. నేనెప్పుడొచ్చినా ఈ హోటల్ లోనే దిగుతాను. ఇక్కడందరు నాకు దాదాపు తెలుసు. ఆపరేటర్ కూడా కొత్తగా వచ్చినట్టుంది. ఆ విషయం ఆమెకి చెబితే ఇంకో రెండు గంటల్లో తన డ్యూటీ అయిపోయి వెళ్ళిపోతుంది. నెక్స్ట్ డ్యూటీ ఆపరేటర్ కి ఈ విషయం చెబుతుందో లేదో అని అనుమానం వచ్చి మీకు శ్రమ యిస్తున్నాను".

"అటువంటిదేమీ లేదు. ఇట్స్ ప్లెషర్. వచ్చే ఆపరేటర్ కి కూడా చెబుతాను లెండి".

"థాంక్స్ ఇంకేమిటి విశేషాలు?"

"ఏమీలేవు...సర్-"

"ఏమీ లేవా? ఉంటే ఫోన్ చెయ్యండి. మీ ఒక్కరికి మాత్రం ఈ ఫోన్ నిబంధన వర్తించదు".

చిరునవ్వు-

"అలాగే" ఫోన్ పెట్టేసింది.

సంభాషణంతా అంతర్వాహిని లాంటి కోడ్ అతడు నవ్వుకుంటూ ఫోన్ పెట్టేశాడు. రెండు నిముషాల తరువాత లేచి బయటకు వచ్చాడు తాళం వేసి కోటుజేబులో వేసుకున్నాడు-మామూలు లిఫ్టులో కాకుండా సర్వీసు లిఫ్ట్ లో క్రిందికి దిగాడు.

చంద్రికా ప్రియదర్శిని అటుతిరిగి ఏదో పని చేసుకుంటోంది. ఆమె గమనించకుండా బయటకు వచ్చాడు. టాక్సీ ఎక్కి "ప్రెసిడెంట్ హోటల్" అన్నాడు-

టాక్సీ దిగి "304" అన్నాడు.

"మిస్టర్ భాస్కర్?"

"అవును".

రిసెప్షనిస్టు అందించిన తాళాలు అందుకొని తన రూమ్ కి వెళ్ళాడు. ఆపరేటర్ కి ఫోన్ చేసి, "హైదరాబాద్ నుంచి ప్రొద్దున్న వచ్చే విమానం కనుక్కొని, అది వచ్చే సమయానికి సరిగ్గా అరగంట ముందు నన్ను లేపండి వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి" అన్నాడు.

"ష్యూర్ సర్!"

అతడు ఫోన్ పెట్టేసి తాగుతూ కూర్చున్నాడు. బాటిల్ పూర్తిచేసి నిద్రలోకి జారుకున్నాడు. బాంబే మహానగరం కూడా లైట్ వెలుగులో నిద్ర కుపక్రమించింది.

ఇక్కడ హోటల్ సీ-రాక్ లో-

చంద్రికా ప్రియదర్శిని ఫోన్ పెట్టేసిన అయిదు నిముషాలకు అనుమానం వచ్చింది. పెద్ద పెద్ద బిజినెస్ ఎక్స్ క్యూటీవ్స్ తమనెవ్వరూ డిస్టర్బ్ చెయ్యకూడదని సూచనలు ఇవ్వడం మామూలే. కానీ అర్జెంట్ పనిమీద ఏవైనా ట్రంక్ కాల్స్ వస్తే ఇవ్వాలా వద్దా అని అడగడం తాను మర్చిపోయింది.

ఆమె అతడి గదికి ఫోన్ చేసింది. అటునుంచి ఎవ్వరూ ఫోన్ ఎత్తలేదు-అతడు బాత్ రూమ్ లో వున్నాడేమో అనుకుని అరగంట తర్వాత తిరిగి ఫోన్ చేసింది. రెస్పాన్స్ లేదు. ఆ తరువాత పని ఒత్తిడిలో పడి ఆ విషయం మర్చిపోయింది.

రాత్రి ఎనిమిదింటికి ఆమెకి తీరిక దొరికింది. చెయ్యడానికి పనేమీ లేదు. "మీ ఒక్కరికి మాత్రం ఈ ఫోన్ నిబంధన వర్తించదు" అన్న మాటలు గుర్తొచ్చాయి. నవ్వుకుంటూ అతనికి ఫోన్ చేసింది. మాట్లాడడానికి విశేషాలే వుండనవసరంలేదు. విషయాలు వాటంతటవే వస్తాయి. ఫోన్ ఎవ్వరూ ఎత్తలేదు. ఆమె ఫోన్ పెట్టేసింది. ఆమె పెద్దగా నీరసం చెందలేదు. మూడొందల గదులున్న ఆ హోటల్ లో నెలకి నాలుగు వేలమంది కస్టమర్లు మారుతూ వుంటారు. అందులో కనీసం పది శాతం విశేషాలు అడుగుతారు. విశేషాలుంటే మాట్లాడమని ఆఫర్ చేస్తారు. అందులో సగంమంది అందగాళ్ళు, పెద్ద పొజిషన్ తో వున్నవాళ్ళు వుంటారు. అక్కడ ప్రేమ ఒక టైం పాస్...

మరుసటి రోజున ప్రొద్దున భాస్కర్ తిరిగి సీ-రాక్ హోటల్ కి వచ్చాడు. రిసెప్షన్ లో చంద్రికా ప్రియదర్శిని లేదు అతడు తన గదికి చేరుకున్నాడు. తను లేని సమయంలో ఆమె కనీసం రెండుసార్లయినా తన గదికి ఫోన్ చేసి వుంటుందని అతనికి తెలుసు.

## 24

**అక్కడ** భాస్కర్ సీ-రాక్ హోటల్ నుంచి ప్రెసిడెంట్ హోటల్ వైపు వెళ్తున్న సమయానికి, ఇక్కడ హైద్రాబాద్ లో సుధాకర్, రవితేజ ఇంట్లో డైనింగ్ టేబుల్ ముందు భోజనం పూర్తి చేసి చెయ్యి కడుక్కుంటున్నాడు.

"మీరేమీ అనుకోనంటే ఒక మాట చెప్పనా?"

ఏమిటన్నట్టు చూసింది మాధవి.

"నా జీవితంలో ఇంత మంచి భోజనం- భోజనం కాదు- ఇంత ఆప్యాయంగా ఎవరైనా వడ్డిస్తూంటే తినటం ఇదే మొదటిసారి".

"అబద్ధం కేవలం నా సంతోషం కోసం చెపుతున్నారు".

"నాకు ప్రియమైన వాళ్ళంటూ ఎవరూ లేరు మీరు తప్ప మీ మీద ఒట్టేసి చెపుతున్నాను నిజం..."

"సుధాకర్ బాబూ మీరెందుకు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టు వుంటారు?"

"నాకే తెలీదు మాధవిగారూ. కానీ ఒకటి మాత్రం చెప్పగలను. మీతో పరిచయమయ్యాక నా మనసుకి కొత్త ద్వారాలు తెరుచుకున్నట్టు అయింది. ఏదో తెలియని కొత్త ఉత్సాహం నాలో ప్రవహిస్తూంది. ఇంత మంచి స్నేహితురాల్ని నా కిచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మీ రొప్పుకుంటే నెలకొకసారైనా మీ చేతి వంట తినాలనిపిస్తుంది".

"నిజంగా వంట అంత బావుందా? మా ఆయన ఒక్కసారి కూడా మెచ్చుకోలుగా ఒక్కమాట అనరు..."

"పెరటి చెట్టు మందుకు పనికిరాదంటారు. నాకేగానీ మీలాటి భార్య వుంటే ఇరవై నాలుగ్గంటలూ మీ దగ్గరే కూర్చునేవాణ్ణి. ఈ వ్యాపారాలు, డబ్బు సంపాదన ఇవన్నీ చిటికెన వేలితో పక్కకి తోసేసేవాణ్ణి" అని ఆగి, "క్షమించండి. మరీ చనువు తీసుకున్నట్టున్నాను-" అన్నాడు.

"అబ్బే, అటువంటిదేమీ లేదు".

"ఇంతకీ మీరు చెప్పలేదు. మీ వంట మళ్ళీ ఎప్పుడు రుచి చూపిస్తారు?"

"మీరెప్పుడు కావాలంటే అప్పుడే-"

"అలా అయితే రేప్రొద్దున్నే వచ్చేస్తాను".

"రండి ఏం బెదిరిపోతామనుకున్నారా?"

"ఇంక నేను వెళ్ళిరానా? చాలా రాత్రయింది".

"మంచిది".

అతడు లేవకుండా- "కొంచెంసేపు వుండాలనే వుంది కానీ నౌఖర్లు, గూర్ఖా వాళ్ళు ఏమన్నా అనుకుంటారు"

అన్నాడు.

"వాళ్ళమొహం వాళ్ళేం చేస్తారు".

"పవిత్రమైన స్నేహాన్ని లోకం అర్థం చేసుకోలేదు మాధవిగారూ- నాకైతే రాత్రంతా మీతో కబుర్లు చెప్పాలనే వుంది. కానీ మనం అలా- చెయ్యలేం కదా. అందుకే ఈ దేశమంటే నాకు పడదు. తొందర్లో అమెరికా వెళ్ళిపోవాలనుకున్నాను".

మల్లెతీగ అతడివైపు సానుభూతితో చూస్తుంది. చంద్రకిరణం నిస్తేజంగా అద్దాలమీద పరుచుకుని వుంది. చీకటి - మనిషి మనసులా వుంది. నిశ్శబ్దం మనిషి అజ్ఞానంలా వుంది.

గడియారం పదికొట్టింది.

"నేను వెళ్ళిరానా?" అన్నాడు. ఈసారి ఆమె మాట్లాడలేదు. అతడు లేవకుండా, "మీరెన్ని గంటలకు నిద్రపోతారు?" అని అడిగాడు.

"పదిన్నరా- పదకొండు".

"అయితే ఇంకా ఒక గంట టైముందన్న మాట ఏవండీ! ఒక్క విషయం అడుగుతాను. నిజం చెప్పండి. పడుకున్నాక నేనొక్కసారైనా గుర్తొస్తానా?"

"లేదే-"

"అబద్దం చెపుతున్నారు ఒక్కరాత్రయినా గుర్తు రాలేదూ? ముఖ్యంగా నేను కట్టుకొమ్మన్న చీర కట్టుకున్నరోజు..."

"అప్పుడు అడుగుదామనుకుని మర్చిపోయాను. ఉత్తరం అలా వ్రాశారేమిటి? కొద్దిగా వుంటే ఆయన చేతిలో పడి వుండేది".

"పడనివ్వండి, నిర్మలమైన స్నేహాన్ని అర్థం చేసుకోలేక పోవటం ఆయన తప్పు".

"ఇంకా నయం. నాకైతే ఎంత భయమేసిందో".

"ఈసారినుంచి చేతికి అందజేస్తాను లెండి. ఇంతకీ ఆయనెప్పుడొస్తున్నారు?"

"అమెరికా వెళ్ళారుకదా ఇంక ఇల్లెందుకు గుర్తుంటుంది? రెండు మూడు రోజుల్లో రావొచ్చు".

"నేను కోరినట్టు మీరా తెల్లచీర కట్టుకున్నప్పుడు చూడగానే నాకేమనిపించిందో తెలుసా? అలాగే పరుగెత్తుకు వచ్చి మీ చేతుల్ని నా చేతుల్లోకి తీసుకోవాలనిపించింది. మీరేమీ అనుకోకపోతే నా కోసం ఒక్కసారి మళ్ళీ ఆ చీర కట్టుకోరూ-"

"ఇప్పుడా?"

"అవును ఇప్పుడే. అది చూసేసి వెళ్ళిపోతాను. ఈ రాత్రంతా అలా ఆలోచిస్తూ నిద్రపోతాను. జీవితంలో నాకు ఆనందాలంటూ ఏమీలేవు. ఇంత చిన్న ఆనందం ఈ స్నేహితుడి కోసం కలిగించరూ..."

"కానీ..."

"వద్దు మాధవిగారు. అభ్యంతరం చెప్పకండి. ప్లీజ్.... నా కోసం-"

కాస్త తటపటాయించి... ఆమె లేచి లోపలికి వెళ్ళింది. సుధాకర్ గుమ్మం దగ్గిరకొచ్చి బైట లాన్ వైపు చూశాడు. గూర్ఖా కునికిపాట్లు పడుతున్నాడు. ఔట్ హోస్ లో దీపం తప్ప మిగతా అంతా చీకటిగా వుంది. నౌఖర్లు అలికిడి లేదు.

వెనుక శబ్దమైతే తిరిగి చూశాడు.

మాధవి నిలబడి వుంది. ఆ క్షణం ఆమెని రవితేజ చూస్తే, 'గంజిపెట్టిన చీర లావుగా వున్నవాళ్ళు కట్టుకుంటే బావోదు' అని వుండేవాడు! సుధాకర్ ఆమెని చూసి, దగ్గిరగా వెళ్ళి "మాధవిగారూ, ఈ చీర మీకెంత బావుందో తెలుసా?"

"ఇక చాలు వెళ్ళిరండి" అందామె బెరుగ్గా.

"ఎందుకో తెలీదు నా కళ్ళ వెంబడి నీళ్ళొస్తున్నాయి. మీ చేతుల్తో తుడవండి" అంటూ ఆమె చేతుల్ని తీసుకుని తన పొడి కళ్ళకి తుడుచుకున్నాడు. ఆమె అడుగు వెనక్కి వేసి "ఇక వెళ్ళిరండి" అన్నది.

"మీరూ అనవసరంగా భయపడుతున్నట్టున్నారు".

"భయంలేదు ఏం లేదుగానీ చాలా రాత్రయింది వెళ్ళండి. ఎవరైనా చూస్తే బావోదు".

"ఓహ్, ఎవరైనా చూస్తారని భయమా?"

"అదేంలేదు గానీ ఇక వెళ్ళిరండి".

"వెళ్తానుగానీ సరీగ్గా ఇంకోగంట పోయాక వెనుకనుంచి వస్తాను. వెనుక తలుపు తీసి వుంచండి. అప్పుడైతే రాత్రి మనం ఎంతసేపు మాట్లాడుకున్నా ఎవరికీ తెలీదు-" ఊహించని ఈ ప్రపోజల్ కి ఆమె బిత్తరపోయి వెంటనే తేరుకుని, నిష్కర్షగా- "ఏం వద్దు, కావాలంటే రేప్రొద్దున రండి" అంది బయటికి నడుస్తూ! ఇక తప్పనిసరి పరిస్థితుల్లో వున్నట్టు ఆమెతోపాటూ బయటకువచ్చి, "నిజంగా నా నిజాయితీమీద మీకు నమ్మకం వుంటే, మన ప్లెటానిక్ లవ్ మీద విశ్వాసం వుంటే మీరు నాకోసం ఎదురు చూస్తూ వుంటారు. అలా లేని పక్షంలో నన్ను మీరు నమ్మటం లేదన్నమాట. నా జీవితంలో నేనెవర్నీ ఏదీ అభ్యర్ధించలేదు. నేనెవర్నీ ఇంత దగ్గిరగా అనుకోలేదు. మీరు ఈ రాత్రి తలుపు తీసి వుంచకపోతే-" అని ఆగి,"రేప్రొద్దున్న నా శవాన్ని చూస్తారు. నిజమైన స్నేహానికి అర్ధం తెలుసుకుంటారు" అనేసి వెళ్ళిపోయాడు. ఆమె చిత్తరువులా నిలబడిపోయింది.

రాత్రి పదకొండు అయింది.

## 25

**రాత్రి** పదకొండింటికి రవితేజ టెక్స్ టైల్స్ బోర్డ్ రూమ్ లో శర్మ మిగతా నలుగురు డైరెక్టర్లతో కూర్చుని వున్నాడు. తాము తెప్పిస్తూన్న మ్యాజిక్ మిర్రర్ లాటిదే చెంచురామయ్య కంపెనీ జపాన్ లో తయారుచేయించి తెప్పించటానికి ప్రయత్నిస్తున్నట్టు వార్త అందగానే శర్మ ఈ మీటింగ్ ఏర్పాటు చేశాడు. జపాన్ కంపెనీ ద్వారా ఈ మిషన్ చెంచురామయ్యకు రావటానికి ఆరేడు నెలలు పట్టవచ్చు. అప్పటిలోగా రవితేజ కంపెనీ ప్రారంభ లాభాలుంటాయి. అంతవరకూ ఫర్వాలేదు.

కానీ భారతదేశంలో ఆ మిర్రర్ ఇంకెవరికీ అమ్మకుండా అమెరికన్ కంపెనీకి హెచ్చు మొత్తంలో రవితేజ డబ్బు యిచ్చి అగ్రిమెంటు కుదుర్చుకోబోతున్నాడు. ఎలాగూ ఆర్నెల్లు పోయాక జపాను సప్లయి చేస్తుంది కాబట్టి ఇప్పుడిక ఆ అగ్రిమెంటూ అనవసరం.

రవితేజ ఈపాటికే కాంట్రాక్టు కుదుర్చుకుని వుంటే చేసేదేమీ లేదు. కుదుర్చుకోకపోయి వుంటే మాత్రం వెంటనే దాన్ని నిలిపివేసి, "మీరు మా దేశంలో మరెవరి కిచ్చినా మా కభ్యంతరం లేదు" అని చెప్పాలి. అందువల్ల వారికిప్పుడు అదనంగా ఇవ్వబోయే లక్ష డాలర్ల ఖర్చు తప్పుతుంది.

అందుకనే ఈ అత్యవసర సమావేశం.

"మనకి ఇక్కడ రాత్రయింది కాబట్టి అమెరికాలో పగలు. అక్కడ ఏజెంటుకి ఫోన్ చేసి ఈ కాంట్రాక్టు రద్దు గురించి చెప్పాలి!" అన్నాడు శర్మ.

"కానీ ఆ ఏజెంటు వివరాలూ అవీ రవితేజకి తెలుసు. అతడి కోసం ప్రయత్నిస్తే మంచిది" అన్నాడొక డైరెక్టరు. "బోంబే ఫోన్ లో ప్రయత్నించండి".

"గంటనుంచి ప్రయత్నిస్తూనే వున్నాను. హోటల్ లో అయితే గది వుంది గానీ అతడు లేడు రామ్ లో-"

"ఏదైనా పార్టీకి వెళ్ళాడేమో....."

"మరీ పన్నెండింటి వరకూ పార్టీ ఏమిటి?" ఎవరో విసుగ్గా అన్నారు.

"ఒక్క రోజులో ఏం పోయింది? రేప్రొద్దున మాట్లాడదాం..."

"కాంట్రాక్టు మీద సంతకాలు ఈ రోజేగానీ అమెరికాలో అవుతూ వుండి వుంటే, ఈ రాత్రి మనం దాన్ని ఆపుచేయనందుకు తరువాతంతా బాధపడాలి- అనవసరంగా అంత డబ్బు పోగొట్టుకున్నామే అని-"

-తలా ఒకరూ తమ తమ అభిప్రాయాలు చెపుతున్నారు.

చివరికి ఒక డైరెక్టర్ అన్నాడు- "రవితేజ అక్కడ లేకుండా, అమెరికాలో కాంట్రాక్టు ఎలా పూర్తవుతుంది? ఒకవేళ ఈపాటికే పూర్తయి వుంటే మనం ఇక చేసేది ఏంలేదు. అందువల్ల ఈ అర్ధరాత్రి మనం ఇలా ఫోన్ దగ్గిర కూర్చోవటం అనవసరం".

దీనితో అందరూ ఏకీభవించారు. శర్మ చివరిసారిగా సీ-రాక్ హోటల్ కి ఫోన్ చేసి రిసెప్షన్ తో "రవితేజ తన గదికి ఈ రాత్రి చేరుకోగానే, మమ్మల్ని కాంటాక్టు చేయమనండి" అన్న కబురు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ఆ తరువాత ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోయారు.

టైమ్ పన్నెండు గంటలా ఒక్క నిమిషం అయింది.

దూరంగా వినిపించాయి చర్చి గంటలు పన్నెండుసార్లు.

రవితేజ వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్నాడు. పక్కమీద ప్రియంవధ గాఢనిద్రలో వుంది. రమేష్ కృష్ణన్ రివర్స్

సింగిల్స్ లో నాలుగో సెట్ లో గెల్చాడు.

రవితేజకి నిద్ర పట్టటంలేదు. అతడికెందుకో అనీజీగా వుంది. ఒకే ఊర్లో వుంటూ బాంబేనుంచి... అని అబద్ధం చెప్పటం, ఆ తరువాత వరసగా అబద్దాలు, ఇవికాక అతడిని ఇబ్బందిలో పెడుతున్నది అతడి మనసు-

వర్షం కురుస్తూంటే చూస్తున్న ఆనందం, అది వెలిశాక బురదనీ, చిత్తడి నేలనీ చూస్తుంటే వుండదు. భార్యతో తప్ప మరెవరితో రొమాన్స్ అయినా, ఆ కొద్దిసేపు తరువాత, ఆ అవతలి వ్యక్తి ఎంతో ప్రేమించిన మనిషి అయితే తప్ప! ఎప్పుడెప్పుడు ఆ నాల్గు గోడలమధ్య నుంచి బయటపడదామా అనిపిస్తుంది. ప్రియంవద నింతలా అతడెప్పుడూ ప్రేమించిన వ్యక్తికాదు. అతఃది ఒంటరితనపు ఎడారిలో ఒయాసిస్ కనిపించిందంతె ఒయాసిస్ కనపడింది కదా అని అక్కడే ఎడారిలో వుండిపోరెవరూ శక్తి కూడగట్టుకుని అక్కడనుంచి తిరిగి ప్రయాణం కొనసాగిస్తారు. ఇప్పుడు అతడి పరిస్థితి అలాగే వుంది. మూడు దినాలపాటు ఈ ప్రపంచానికి దూరంగా ప్రణయ సామ్రాజ్యంలో మునిగిపోవాలనుకున్నాడు. కానీ రెండురోజులకే ఇది బోరు కొట్టింది. తనకి కావాల్సింది ఇదికాదు అని అర్ధమైంది. ప్రొద్దున్నించి సాయంత్రం వరకూ తన దినచర్యలో పాలు పంచుకుని, ఉత్సాహపూరిత మైన పగటి కథకి రాత్రి క్లైమాక్స్ కావాలి. అంతేకానీ ఈ విధమైన శృంగారం కాదు అని తెలిసిపోయింది.

ఎప్పుడెప్పుడు వెళ్ళి తన వ్యాపార కలాపాల్లో మునిగి పోదామా అనిపిస్తోంది. అతడు ఆలోచనలతోనే నిద్రలోకి జారుకున్నాడు. అతడికి మెలకువ వచ్చేసరికి ఎనిమిదయింది. బాగా అలసిపోయి వుండటం వల్ల గాఢంగా నిద్రపట్టింది. లేవగానే కొద్దిసేపు అతఃడికి తనెక్కడ వున్నాడో మొదట అర్ధంకాలేదు. హోటల్ గది చూశాక అర్ధమైంది. ప్రక్కన ప్రియంవద లేదు.

అతడు తిరిగి కళ్ళు మూసుకున్నాడు. లేవగానే వెంటనే అతడికి అనిపించిన భావం- 'ఇంకొక రోజు ఇక్కడ ఉండాలి" అని అతడికి అది ఆశ్చర్యంగా కూడా అనిపించింది. మొన్నటి వరకూ ఈ అనుభవం కోసం తహతహ లాడిపోయాడు. ఈ రోజు 'ఇక చాలు' అనిపిస్తూంది.

అయిదు నిముషాలు గడిచాయి.

బాత్ రూమ్ లో కూడా అలికిడి లేదు.

అతడికేదో అనుమానం వచ్చి అక్కడికి వెళ్ళి చూశాడు.

తలుపు తీసే వుంది. లోపల ఆమె లేదు.

గదిలోకి వచ్చాడు. అతడికి షాక్ తగిలినట్లయింది.

ఆమె తనతోపాటు తీసుకువచ్చిన సూట్ కేస్ లేదు. వార్డ్ రోబ్ దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి చూశాడు. విప్పిన బట్టలు లేవు.

అద్దం దగ్గర లిప్ స్టిక్ సీసా, ఆమె హాండ్ బ్యాగ్ కూడా లేవు. ఆమె ఆ గదిలో అతడితో గడిపిన రెండు రోజులు తాలూకు ఆనవాళ్ళు ఏమీలేవు.

అతఃడికి మొదట ఏమీ అర్థంకాలేదు. అయోమయంగా అనిపించింది. ప్రియంవద ఏమైంది?

సమయం గడుస్తున్నకొద్దీ అతడికి టెన్షన్ ఎక్కువయింది. తనకి చెప్పకుండా ఆమె మాయమైంది అంటే అతడికి నమ్మబుద్ధి కావడంలేదు. కానీ జరిగింది అది. తను గాఢనిద్రలో వుండగా ఆమె తన వస్తువులన్నీ తీసుకు వెళ్ళిపోయింది- అన్నది తిరుగులేని నిజం.

ఏం చెయ్యాలో అతడికి పాలుపోవడం లేదు. అరణ్యంలో నడుస్తూ వుండగా పొదచాటునుంచి ఏదో జరజరా పాకిన భావన. ఐదు నిముషాలు గడిచాయి... అరగంట... గంట....

అతడలాగే స్తబ్దంగా కూర్చుని వున్నాడు. ఆఫీసుకి ఫోన్ చేద్దామని చెయ్యి అక్కడివరకూ వెళ్ళింది కానీ ఆ ఆలోచన మానుకున్నాడు.

మరోగంట గడిచేసరికి అతడికి ఆ టెన్షన్ భరించలేక పోయాడు. గది.....ఆ గదిలో ఒంటరితనం అతడిని పిచ్చివాడిని చేశాయి.

ఏమైతే అదయిందని క్రిందికి వచ్చాడు.

టాక్సీ వేసుకుని ప్రియంవద ఇంటికి బయల్దేరాడు. ఆమె ఎందుకు చెప్పాపెట్టకుండా వచ్చేసిందో తెలుసుకుంటే గానీ మనసు స్థిమితపడదు. అనిపించింది. ఐదు నిమిషాల్లో అతడి టాక్సీ ఆమె ఇంటి ముందు ఆగింది. రవితేజ తలెత్తి చూశాడు.

పై పోర్షన్ కి "టు లెట్" బోర్డు వేలాడుతూంది.

## 26

**టూ టౌన్** పోలీస్టేషన్ యస్సై రాజశేఖర్ కుర్చీలో అలాగే పడుకుని నిద్రపోతున్నాడు. రాత్రంతా ఏదో కేసువల్ల

నిద్రలేదు అతడికి. ఆ స్టేషన్ పరిధిలో అన్నీ ఖరీదయిన కాలనీలు అవటంవల్ల పెద్ద పని వుండదు అక్కడ.

అంతా నిశ్శబ్దంగా వుంది. పక్క గదిలోంచి వైర్ లెస్ లో మాత్రం మాటలు వినిపిస్తున్నాయి. వరండాలో సెంట్రీ నిలబడి వున్నాడు. దూరంగా ఇద్దరు పోలీసులు, లైటుమీద నల్లరంగు పూయని స్కూటరిస్టుని పట్టుకుని బేరమాడుతున్నారు. యస్సై రాజశేఖర్ కి ఇటువంటి విషయాలు నచ్చవు. కాబట్టి కంఠం తగ్గించి మాట్లాడు కుంటున్నారు.

అంతలో ఫోన్ మ్రోగింది. రాజశేఖర్ ఫోన్ అందుకుని "హల్లో" అన్నాడు. అవతల్నించి వినిపించిన మాటలు వింటూ నిటారుగా అయ్యాడు.

"అడ్రస్సు?" అని అవతలివాళ్ళు చెప్పింది వ్రాసుకుని, ఫోన్ పెట్టేశాడు. లేచి, టోపీ చేతుల్లోకి తీసుకుని ఇద్దరు పోలీసులు వెంటరాగా జీపెక్కి సాగిపోయాడు.

జీపు రవితేజ ఇంటివేపు వెళ్తూ వుంది.

టాక్సీలో ఆ టైమ్ కి రవితేజ తిరిగి హోటల్ కి బయల్దేరాడు.

టాక్సీ వచ్చి హోటల్ ముందు ఆగింది. దిగి డబ్బులు చెల్లించి, రిసెప్షన్ వద్దకు వచ్చాడు. రిసెప్షనిస్టు తాళం చెవికోసం చూసి, అది అక్కడ లేకపోవడంతో "గదిలో ఎవరో వున్నారు సార్" అంది.

రవితేజ మనసు ఒక్కసారిగా తేలికపడింది.

ప్రియంవద వచ్చేసి వుంటుంది.

అనవసరంగా టెన్షన్ తో తను ఆమె కోసం బయటంతా వెతికాడు.

ఆమె మీద అతడికి కోపం కూడా వచ్చింది. అలా చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయినందుకు బాగా మందలించాలనుకున్నాడు.

లిఫ్ట్ లోంచి బయటకు వచ్చాడు. పొడవాటి వరండా నిర్మానుష్యంగా వుంది. వరుసగా గదులున్నాయి. తన గది దగ్గిర నిలబడి బెల్ కొట్టబోయి అది తీసే వుండటంతో, తోసుకుని లోపల ప్రవేశించాడు.

అయితే అతడు భావించినట్టు లోపలున్నది ప్రియంవద కాదు, భాస్కర్.

*  *  *

ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ జీపు రవితేజ ఇంటి కాంపౌండ్ లోకి ప్రవేశించింది. పది పదిహేను మందిదాకా జనం వున్నారక్కడ. అందులో ఒకాయన అతడికి తెలుసు. రవితేజ టెక్స్ టైల్స్ డైరెక్టర్ లలో ఒకరు. ఆయన ముందుకొస్తూ "ఈయన శర్మగారు. ఛైర్మన్' అని మరొక వ్యక్తిని పరిచయం చేశాడు. రాజశేఖర్ ఆయనతో కరచాలనం చేశాడు.

"రవితేజగారు రాలేదా?" అని అడిగాడు.

"లేదు. ముంబాయినుంచి బయల్దేరారు ప్రొద్దున్నే ఎయిర్ పోర్టుకి కారు పంపించాం. బహుశ ఇంకో అయిదూ పది నిముషాల్లో రావొచ్చు".

రాజశేఖర్ వాచీ చూసుకున్నాడు. అయిదు నిముషాలయి ఉంటుంది ముంబాయి నుంచి వచ్చే విమానం ఇక్కడ 'లాండ్' అయి, అతఃడు రావటానికి మరో పది నిముషాలు పట్టవచ్చు.

"ఆయనకీ విషయం తెలుసా?" ఇన్ స్పెక్టర్ అడిగాడు.

"తెలీదు. నాకూ అరగంట క్రితమే తెలిసింది. వెంటనే ముంబాయి ఫోన్ చేశాను. అప్పటికే రూమ్ ఖాళీ చేశారన్నారు. బహుశ ఎయిర్ పోర్టుకి బయలుదేరి వుంటారు అనుకున్నాను".

"లోపలికి వెళ్ళి చూద్దామా?"

"ష్యూర్!"

ఇన్ స్పెక్టర్ వెనుక శర్మ లోపలికి నడుస్తూ వుండగా మిగతావాళ్ళు ప్రక్కకు తప్పుకున్నారు. ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ మెడమీద గదిలోకి వెళ్ళాడు. క్రింద అందరూ, ముంబాయినుంచి రాబోయే రవితేజ కోసం చూస్తున్నారు.

*  *  *

"మీరా" అన్నాడు రవితేజ భాస్కర్ ని చూసి అమితాశ్చర్యంతో "నేనిక్కడున్నట్టు ఎలా తెలిసింది?"

"ప్రియంవద చెప్పింది!"

రవితేజ మరింత చకితుడై "ప్రియంవదా?" అన్నాడు.

"ప్రొద్దున్న తను లేచేసరికి మీరు నిద్రపోతూ వున్నారట. మిమ్మల్ని డిస్టర్బ్ చేయటమెందుకని క్రిందికి వచ్చి రిసెప్షన్ నుంచి ఫోన్ చేయబోయిందట, అక్కడ మాధవి గారున్నారట..."

రవితేజ తడారిన గొంతుతో "మా....ధ.....వా" అన్నాడు.

"అవును ఆవిడకి అనుమానం వచ్చినట్టు ప్రియంవద గ్రహించింది. ఆమె ఏమాత్రం ఎంక్వయిరీ చేసినా మీ ఇద్దరి గురించీ తెలిసిపోతుందని, గబగబా పైకి వచ్చి తన సామాన్లు తీసుకుని వెళ్ళిపోయింది".

రవితేజ విసుగ్గా భాస్కర్ వైపు చూశాడు. తన భార్య ఈ హోటల్ కి ఎందుకొచ్చిందో తెలీదు. పోనీ ఎందుకో వచ్చిందనుకుంటే, ఇక్కడ ప్రియంవదని చూస్తే మాత్రం తప్పేమిటి? గుమ్మడికాయల దొంగలా ప్రియంవద అనవసరంగా భయపడి, తనని నిద్రలేపకుండా అంత హడావుడిగా వెళ్ళిపోవటం దేనికి?

భాస్కర్ చెపుతున్నాడు- "వెళ్తూ ప్రియంవద నాకు చెప్పింది. మీకిదంతా చెప్పమని, తను చాలా భయపడిపోయింది. మాధవిగారికి బాగా అనుమానం వచ్చినట్టు ఆమె భావిస్తూంది".

"అనుమానం రావటానికి వీల్లేదు. నేను బోంబేలో వున్నానని అనుకుంటున్నారు అంతా-" రవితేజ విసుగ్గా అన్నాడు. "-ప్రియంవద స్టార్ హోటల్ కి రాకూడదా ఏమిటి? ఎవరో చూసినంత మాత్రాన నాతోనే అనుకుంటారా?"

"ఆమెవైపు నుంచి ఆలోచించండి".

"ఇప్పుడెక్కడుంది ఆమె?"

"తెలీదు ఈ విషయం మాత్రం మీకు చెప్పమంది. మిమ్మల్ని డిస్సపాయింట్ చేసినందుకు క్షమించమని కోరింది".

"అయితే ఇక రాదా?"

భాస్కర్ మాట్లాడలేదు.

రవితేజ డిస్సపాయింటెడ్ గా ఏమీ ఫీలవలేదు. ఒక రకంగా చెప్పాలంటే ఇంటికి వెళ్ళిపోదామని అతడు తొందరపడుతున్నాడు. రిసెప్షన్ కి ఫోన్ చేసి, బిల్లు తీసుకురమ్మని చెప్పాడు.

ఈ లోపులో బేరర్ కాఫీ తెచ్చాడు.

"మీరు నన్ను క్షమించాలి" అన్నాడు భాస్కర్. "చొరవ తీసుకుని వచ్చి గదిలో కూర్చున్నాను. పైగా కాఫీ కూడా ఆర్డర్ చేశాను".

"దానికేం ఫర్వాలేదు".

"మీరొకసారి ఇంటికి ఫోన్ చేస్తే బావుంటుందేమో! ముంబాయి నుంచి విమానం వచ్చి అరగంట కావొస్తూంది. మీ శ్రీమతిగరు మీరింకా రాలేదేమని అనుమానపడుతూ వుంటారు".

"దాన్దేముంది. బిల్లు రాగానే గది ఖాళీచేసి వెళ్ళిపోదాం..." అతడికి గిల్టీగా వుంది. ప్రియంవద తమ విషయాలన్నీ ఇతడికి అనవసరంగా చెప్పిందని.

"మీరు ఎయిర్ పోర్ట్ నుంచి ఫోన్ చేస్తున్నట్టు ఒకసారి ఇంటికి చేస్తేనే మంచిదని నా అభిప్రాయం".

రవితేజ ఇంటికి ఫోన్ చేస్తూ వుండగా, భాస్కర్ కాఫీ కలిపి అతడికిచ్చాడు. ఈ లోపులో బిల్ వచ్చింది. అది ఇచ్చేసి, రవితేజ ఇంటికి ఫోన్ చేశాడు.

చాలాసేపు రింగ్ అయిన తరువాత ఎవరో ఫోన్ ఎత్తారు.

"హల్లో".

ఆ స్వరం గుర్తు పట్టాడు రవితేజ. శర్మది!

అతడు ఆశ్చర్యపోయాడు. శర్మ తమ ఇంట్లో వుండడం-

"నేనూ రవిని ఎయిర్ ఫోర్టునుంచి మాట్లాడుతున్నాను".

"అరె! నీ కోసమే కారు పంపించాము. ఇంకా రాలేదేమిటా అని అందరం చూస్తున్నాము...."

"అం....ద...రం!"

"ఏం జరిగింది?"

శర్మ తటపటాయించి, "వస్తావుగా, తొందరగా వచ్చెయ్".

"ఏం జరిగింది?" రవితేజ రెట్టించాడు.

"తొందరగా రా".

"శర్మగారూ అసలేం జరిగింది? అది చెప్పండి ముందు".

క్షణం నిశ్శబ్దం. "రవితేజా! ఐ యామ్ సారీ. నిన్న రాత్రి మాధవిని ఎవరో హత్య చేశారు..."

## 27

**మాధవిని** హత్య చేశారు.

మాధవి హత్య....

మాధవి....

కలలో కూడా వూహించని విషయాన్ని హఠాత్తుగా వింటే, ఆ వార్త ఇచ్చే ఆనందంగానీ విషాదంగానీ వెంటనే అవగాహనకు రాదు. జ్ఞానచక్షువు తాత్కాలికంగా మూసుకుపోయి, అదోరకమైన స్తబ్దత ఆవరిస్తుంది. అతఃది పరిస్థితి లాగే వుంది, శర్మ చెపుతూంది ముందు అర్థంకాలేదు. చాలాసేపు అలాగే వుండి పోయాడు. అవతల్నుంచి శర్మ 'హలో హలో' అంటున్నాడు. చివరికి ఎలా గైతేనేం సత్తువ కూడగట్టుకుని హీనమైన స్వరంతో...."హల్లో" అన్నాడు.

"వెంటనే వస్తున్నావుగా?"

"వస్తున్నాను".

ఫోన్ పెట్టేసి కుర్చీలో అలాగే కూలబడిపోయాడు. పక్కనే వున్న భాస్కర్ "ఏం జరిగింది" అని అడిగాడు. రవితేజ జవాబు చెప్పలేదు. అతడు కొంచెంసేపు ఒంటరిగా వుండాలని కోరుకుంటున్నాడు. "ఏమైంది" భాస్కర్ తిరిగి అడిగాడు. అతడికి చెప్పక తప్పలేదు.

"మైగాడ్...." అని ఆగి, "ఐ యామ్ సారీ" అన్నాడు నెమ్మదిగా రవితేజ కళ్ళు మూసుకున్నాడు. ఈ లోపులో భాస్కర్

మిగిలిన కాఫీ కలిపి అతడికి ఇచ్చాడు- రావితేజకి ఎంతో నిస్సత్తువుగా అనిపించింది. వద్దనకుండా తాగేశాడు.

"మనం వెళ్దామా? అక్కడ మీ కోసం అందరూ చూస్తూ వుంటారు" ప్రశ్నించాడు భాస్కర్. రవి ఏదేదో మైకంలో వున్న వాడిలా లేచాడు. అతఃది పాక్ చేయబడివున్న సామాన్లని భాస్కర్ టాక్సీలో పెట్టించాడు. ఇద్దరూ టాక్సీ ఎక్కుతూ వుంటే "నేను మధ్య దారిలో దిగిపోతాను" అన్నాడు భాస్కర్. రవితేజ పట్టించుకోలేదు. సీటు వెనక్కివాలి, తిరిగి కళ్ళు మూసుకున్నాడు. కారు కదిలింది.

ఎంతో ఆనందంగా గడుస్తాయనుకున్న ఈ మూడు రోజులు, ఒక ఆహ్లాదకరమైన అనుభవంగా మిగిలిపోతుందనుకున్నవి- ఇలా మలుపు తిరగటంతో అతడికి తన బ్రతుకు మీదే అయిష్టత పుట్టింది. ఇలా ఎందుకు జరిగింది. ఇలా ఎందుకు జరిగింది- అని మాటి మాటికి అనుకున్నాడు. దగ్గిర వారి మరణం వ్యధని కలగజేస్తుంది. తప్పదు. కానీ అతడక్కడ వేరే అమ్మాయితో కులుకుతూ వుండగా, ఇక్కడ భార్య మరణించటం అతడిలో విపరీతమైన గిల్టీ ఫీలింగ్ ని కలుగజేస్తుంది.

ఇలా ఆలోచిస్తూ వుండగా అతడి మనసులో చిన్న అనుమానం మెరుపులా మెరిసింది. నిన్న రాత్రి మాధవిని ఎవరో హత్యా చేశారని శర్మ చెప్పాడు. మరి ప్రొద్దున్న హోటల్ దగ్గిర ప్రియంవద ఆమెనెలా చూసింది?....అంటే అబద్ధం చెప్పింది.

అతడు ఏదో అడగటానికి తల ఎత్తాడు. అంతలో క్రమక్రమంగా అతడిని మత్తు ఆవరించింది. హోటల్ రూమ్ లో కాఫీ తాగినప్పటినుంచీ 'అనీజీ'గా వున్న అతడి శరీరం నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

ముందు సీట్లో కూర్చున్న భాస్కర్ తల తిప్పి, వాలిపోతున్న అతడికేసి చూశాడు.

టాక్సీ ముందుకు సాగిపోతూనే వుంది.

* * *

కారు వచ్చి ఆగగానే అందరూ పోర్టికోలోకి వచ్చారు. అయితే ఖాళీ కారులోంచి డ్రైవరు దిగాడు.

"విమానం గంట ఆలస్యమట సార్" అన్నాడు. ఇన్ స్పెక్టర్ రాజశేఖర్, శర్మ మొహమొహాలు చూసుకున్నారు.

"ఆలస్యమా? ఇప్పుడేగా ఎయిర్ పోర్ట్ నుంచి రవితేజ మాతో మాట్లాడాడు" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా. డ్రైవరు కన్ఫ్యూజ్ అయి, "నేను కనుక్కున్నాను సార్. గంట ఆలస్యం అన్నారు" అన్నాడు. శర్మ తిరిగి ఎయిర్ పోర్ట్ కి ఫోన్ చేశాడు. డ్రైవర్ చెప్పిన మాటలు నిజమే అని తేలింది.

రాజశేఖర్ శర్మవేపు తిరిగి, "అతడు ఏ ఎయిర్ పోర్ట్ నించి చేశాడు? ఇక్కడ నించా? ముంబాయి నుంచా?" అని అడిగాడు.

"అది చెప్పలేదు. 'వెంటనే వస్తున్నావుగా' అని అంటే, 'వస్తున్నాను' అని అన్నాడంతే".

రాజశేఖర్ సాలోచనగా "అతడు మనకి ఫోన్ చేసి అయిదు నిముషాలు అయింది. మరి ఇతడు ఎక్కడినుంచి చేసి వుంటాడు?" అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు. చాలా ఇబ్బందికరమైన నిశ్శబ్దం అక్కడ అలుముకుంది.

రాజశేఖర్ లోపలికి నడిచాడు. ఇంకా ఫోటోలు తీస్తూనే వున్నారు. కానిస్టేబుల్ అతడి దగ్గరకొచ్చి "శవాన్ని ఎక్కించమంటారా సార్?" అని అడిగాడు.

"వద్దు, ఆమె భర్త రానీ-"

మరో పది నిముషాలు గడిచాయి. ఈ లోపులో శర్మ వచ్చి "నేను ఎయిర్ పోర్ట్ కి వెళ్తాను" అన్నాడు. రాజశేఖర్ తలూపాడు. శర్మతోపాటు మిగతా డైరెక్టర్లు కూడా వెళ్ళారు. ఇంట్లో పని చేసే వారితో మాట్లాడడానికి ఇన్ స్పెక్టర్ కి టైమ్ దొరికింది.

"అమ్మగార్ని ఆఖరిసారి ఎవరు చూశారు?" అని అడిగాడు.

"పని మనిషి ప్రొద్దున్న తలుపు తడితే లోపల తీయలేదు అమ్మగారు. ఇంకా నిద్రపోతున్నారేమో అనుకుని వెళ్ళిపోయింది".

"ఆఖరిసారి ఎవరు మాట్లాడారు?"

"సుధాకర్ బాబు- రాత్రి పదకొండింటివరకూ ఇక్కడే వున్నాడు, భోజన మయ్యాకే ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు" నౌఖర్లకుండే సహజమైన "దాచాలనే ప్రయత్నాన్ని- బయట పెట్టేట్టు" చేస్తూ వాళ్ళు చెప్పారు.

"సుధాకర్ ఎవరు?"

"అప్పుడప్పుడు వస్తూ వుంటాడు".

ఇంకో నాలుగైదు ప్రశ్నలు వేసి, విషయాన్ని కొంతవరకూ రాబట్టాడు.

ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ మిగతా పోలీస్ డిపార్ట్ మెంట్ మనుష్యుల్లాగా తాగుడుతో మెదడుని కప్పెట్టినవాడు కాదు. చురుగ్గా పనిచేసే యువకుడు.

నౌఖర్లతో మాట్లాడాక అతడు సుధాకర్ కోసం కబురు పంపించాడు. ఆ తరువాత లోపలికి వెళ్ళాడు! లోపల పక్కమీద మాధవి శరీరం అలాగే నిద్రపోతున్నట్టు వుంది. జాగ్రత్తగా చూస్తేనే గానీ తెలీదు. నల్లంచు తెల్లచీర గుండెల దగ్గిర ఎర్రబడింది.

తలదిండు దగ్గిర బీరువా తాళాలున్నాయి. అతడు కొద్దిగా తటపటాయించి, ఆ తాళాల్తో బీరువా తెరిచాడు. దాదాపు అయిదొందల దాకా చీరెలు వరుసగా హేంగర్ కి తగిలించి వున్నాయి. ముఖ్యమైన విషయాలు కనబడతాయేమో అని అతడు చూశాడు. చీరలక్రింద సుధాకర్ ఉత్తరం దొరికింది. ఇంకేమీలేవు. అతడు ముందుగదిలోకి వచ్చి ఆ ఉత్తరాన్ని ఆసాంతం చదివాడు. పెద్ద పెద్ద కుటుంబాల్లో ఇలాటివి మామూలే అని తెలుసు. కానీ ఈ సుధాకర్ వ్రాసిన ఉత్తరం గమ్మత్తుగా అనిపించింది. ఇది ప్రేమ లేఖ కాదు గానీ ఎదుటివారి గుండెల్లోకి సూటిగా దూసుకుపోతుంది. ప్రేమంటే ఇంత గొప్పదేమో అన్న భావాన్ని కలుగజేసి ఇలాటి ప్రేమ అనుభవించకపోతే జీవితం వృధా అనిపించేలా చేస్తుంది. తమ చివరి గమ్యం చివరివరకూ తెలియకుండా ఈ టైపు మొగవాళ్ళు జాగ్రత్త పడతారు.

అతడు ఉత్తరం మీద తారీఖు చూశాడు. వచ్చి పదిరోజులు కూడా కాలేదు. అంటే ఈ పరిచయం కొత్తగా అయిందన్నమాట.

అతడికి నౌఖర్లు చెప్పింది కూడా గుర్తుంది. నిన్న రాత్రి సుధాకర్ భోజనానికి వచ్చి పదకొండింటివరకూ మాట్లాడి వెళ్ళిపోయాడు. అంటే ఈ పరిచయాన్ని ఇంకా ముందుకు సాగించలేదు అతడు. అతడికి మాధవి మీద జాలేసింది.

అతడు ఆలోచనల్లో వుండగా సుధాకర్ వచ్చాడు.

మనిషి వణికిపోతున్నాడు.

రాజశేఖర్ అతడివైపు సానుభూతితో చూశాడు. అసహ్యం కన్నా పైమెట్టు...సానుభూతి.

మామూలు సమయాల్లో ఎంతో గొప్ప గొప్ప కబుర్లు చెప్పే ఇలాటివాళ్ళు, రద్దీ తక్కువున్న సినిమా మోర్నింగ్ షోల్లో పక్క భుజం మీద తల ఆన్చి కబుర్లు చెప్పటానికి తప్ప, నిజంగా సమస్య వస్తే ఆడాళ్ళకన్నా ఎక్కువ బెదిరిపోతారు.

"మాధవిగారి గురించి మీకేం తెలుసు?" మామూలు ప్రశ్నలయ్యాక అడిగాడు.

"ఆ కుటుంబానికీ నాకూ మొన్నే పరిచయం అయింది. నన్ను స్వంత తమ్ముడి కన్నా ఎక్కువగా చూసుకునేది".

ఇన్ స్పెక్టర్ అతడివేపు చిరునవ్వుతో చూశాడు. సానుభూతి కన్నా పై మెట్టు చిరునవ్వు. "...స్వంత అక్కతో కూడా రాత్రి పన్నెండింటివరకూ ఎవరూ కబుర్లు చెప్పరనుకుంటా" అన్నాడు. సుధాకర్ ఏదో అనబోతూ వుంటే, చెయ్యి ముందుకు సాచి, "మీకు జ్యోతిష్యం బాగా వచ్చనుకుంటాను" అన్నాడు. "....ఏదీ నాకు కాస్త చెప్పండి. ఈ హత్య కేసులో నేను ముద్దాయిని పట్టుకోగలనో లేనో-"

సుధాకర్ మొహం పాలిపోయింది. "నాకు జ్యోతిష్కం...." అంటూ ఏదో అనబోయాడు. ఇన్ స్పెక్టర్ అతడి మాటలు మధ్యలో ఆపుచేస్తూ "మాధవికి రోజూ డైరీ వ్రాయటం అలవాటు. నిన్న రాత్రి మీరు వెళ్ళిపోయాక మీ మధ్య జరిగిన సంభాషణ గురించి పూర్తిగా వ్రాసింది. మీ తెల్లచీర విషయం కూడా-" అన్నాడు ఉత్తరంలో వాక్యాలు గుర్తు తెచ్చుకుంటూ.

అతడు చీకట్లో వేసిన బాణం సరిగ్గా వెళ్ళి తగిలింది. సుధాకర్ కి ఏడుపొక్కటే తరువాయి. ఆ భావకుడు ఎప్పుడూ లాల్చీ పైజమా వేసుకునే అలవాటున్నవాడు. అమెరికా వెళ్ళేంత చదువూ డబ్బూ వున్నవాడు. ఆ క్షణం ఇన్ స్పెక్టర్ కాళ్ళదగ్గర దాదాపు వాలి, "నిన్న రాత్రి నేను కట్టుకోమన్నది ఆ ఉద్దేశ్యంతో కాదండీ. అక్కయ్య నన్ను అపార్థం చేసుకుంది-" అన్నాడు.

'అయితే నిన్నరాత్రి కూడా ఈ నిర్మల హృదయుడు తన అక్కయ్యని తెల్లచీర కట్టుకొమ్మని అడిగాడన్నమాట' అనుకున్నాడు ఇన్ స్పెక్టర్. "నిన్ను నేను రక్షించలేను. అరెస్టు చేయక తప్పదు" అన్నాడు గంభీరంగా అంతే సుధాకర్ ఒక్కసారిగా బావురుమన్నాడు. "ఒక్కలా అయితేనే నేను నిన్ను రక్షించలేను. అరెస్టు చేయక తప్పదు" అన్నాడు గంభీరంగా అంతే సుధాకర్ ఒక్కసారిగా బావురుమన్నాడు. "ఒక్కలా అయితేనే నేను నిన్ను రక్షించగలను."

"ఎలా సార్?"

"జరిగింది జరిగినట్టు చెప్పు. కానీ ఒక్క విషయం వదిలి పెట్టినా నిన్ను నేను వదిలిపెట్టలేను. నిన్న రాత్రి జరిగింది మాధవిగారు వున్నది వున్నట్టు డైరీలో వ్రాసుకున్నారు. దానికీ నువ్వు చెప్పిన దానికీ ఏమాత్రం తేడా వున్నా నిన్ను అరెస్టు చేయక తప్పదు".

సుధాకర్ మొత్తం అంతా చెప్పేశాడు. "అక్కయ్య నన్ను అపార్థం చేసుకుంది. రాత్రి ఒక్కదానివే పడుకోలేవేమో బైట హాల్లో నేను పడుకుంటాను అన్నాను. దాంతో తనకీ కోపం వచ్చినట్టుంది సార్. ఆ కోపంతో డైరీలో నా గురించి వ్యతిరేకంగా ఏమైనా వ్రాసుకుని వుంటే వుండొచ్చు. అంతే తప్ప నేను మంచివాణ్ణి. నన్ను నమ్మండి".

"ఇదంతా ఎన్ని గంటలకి జరిగింది?"

"పదకొండింటికి".

"వెంటనే నువ్వు వెళ్ళిపోయావా?"

"వెళ్ళిపోయాను".

"అబద్ధం" అన్నాడు రాజశేఖర్. సుధాకర్ లాటివాళ్ళు అంత సులభంగా వెళ్ళిపోరని అతడికి తెలుసు. "మాధవిగారు వెళ్ళిపో అనగానే నువ్వు వెళ్ళలేదు అవునా".

"అదికూడా వ్రాసుకున్నారా సార్ ఆవిడ" రుద్ధ కంఠంతో అడిగాడు సుధాకర్.

"వ్రాసుకున్నారు".

"తనకేమైనా భయంగా వుంటే, మళ్ళీ ఇంకో గంటలో వస్తాను. తలుపు తీసి వుంచమన్నాను. ఒట్టుసార్! అంతకన్నా ఒక్కమాట ఎకువ మాట్లాడలేదు".

"కానీ నువ్వు గంటసేపు మాత్రమే లేవు. చాలాసేపు వున్నావు. మాధవిగారు ఆ విషయమే వ్రాసుకున్నారు". ఇలాటి కుర్రాళ్ళు ప్రేతాత్మలా ఆడాళ్ళ చుట్టూ తిరుగుతారని అతడికి తెలుసు.

".....వ్రాసుకున్నారా?"

"అవును వ్రాసుకున్నారు".

"నేననుకుంటూనే వున్నాను సార్. ఆవిడ కిటికీలోంచి రెండు మూడుసార్లు చూసింది. కానీ తలుపు తీయలేదు. నేను బయటే వున్నాను. కావాలంటే గూర్ఖాని అడగండి".

బూటుకాలుతో అలాగే లాగిపెట్టి కొడదామనిపించింది. కష్టంమీద తమాయించుకున్నాడు. స్త్రీని ఎలా ఇరుకున పెట్టాలో అతడికి బాగా తెలుసు. కానీ ఇతడు హత్య చేయలేదు. ఆ విషయం మాత్రం నిర్ధారణగా అనుకున్నాడు.

"ఎన్నింటివరకూ నువ్వీ ఇంటిచుట్టూ  తిరిగావు?"

"రాత్రి రెండింటి వరకూ".

మాధవిగారు రెండూ మూడూ మధ్య చనిపోయిందని ప్రాథమిక పరీక్షలో డాక్టర్ తెలిపాడు.

ఇన్ స్పెక్టర్ ముందుకు వంగి "జాగ్రత్తగా ఆలోచించి చెప్పు, ఆ టైమ్ లో ఎవరైనా ఇంట్లోకి ప్రవేశించారా?" అన్నాడు. సుధాకర్ ఆలోచనలో పడ్డాడు. ఇది మంచి అవకాశం. ఈ ప్రశ్నల వెల్లువలోంచి తప్పించుకోవాలనుకుంటే ఇప్పుడే 'మంచి' సమాధానం చెప్పాలి. ఆ మాధవి డైరీవల్లే ఇప్పటికే ఇందులో ఇరుక్కుపోయాడు. ఇప్పుడది పేపర్లో వస్తే తన మంచితనం లోకులు దృష్టిలో దెబ్బతింటుంది.

"నేను వెళ్ళిపోదామనుకున్నాను సార్. కానీ ఆ టైమ్ లోనే ఎవరో ఇంట్లోకి వెనుకవైపు నుంచి ప్రవేశిస్తున్నారు. అది చూసి ఆగిపోయాను".

"దొంగలా వున్నాడా?"

సుధాకర్ ఆలోచన మెరుపుకన్నా వేగంగా సాగింది. దొంగలా వున్నాడంటే, మరి ఆ విషయం అందరికీ ఎందుకు వెల్లడి చేయలేదు అంటాడు. అందుకని అన్నాడు-

"-లేదు సార్. పరిచయం వున్న వాడిలాగే వున్నాడు."

"అర్ధరాత్రి రెండింటికి పరిచయం వున్నవాడు వెనుకవైపు నుంచి వెళ్ళాడూ నాటే బహుశా నీలాగే అతడు కూడా ఆవిడ తమ్ముడో - అన్నయ్యో అయి వుండాలి. అవునా?"

"అవును సార్".

(ప్రియమైన పాఠకుల్లారా! సుధాకర్ లాటివాళ్ళు మీకెప్పుడూ తారసపడలేదా? పడకపోతే మీరు అదృష్టవంతులు. అప్పటివరకూ ఆమె అతడి ఎడారి జీవితంలో ఒయాసిస్సు ఇప్పుడు ఆ మరణించినామె కారెక్టరుని దారుణంగా దెబ్బతీయతానికి కూడా అతడు వెనుకాడటం లేదు. తమకి నయాపైసా అంత లాభం వస్తుందంటే అవతలి వారికి రూపాయంత నష్టం కల్గించటానికి కూడా వీళ్ళు వెనుదీయరు.)

గొంతు అడ్డుపడింది సుధాకర్ కి గుర్తుపట్టగలవంటే రేపట్నుంచి పోలీస్ స్టేషన్ కి తిరగాలి.

"లేదు వెనుకనుంచి చూశాను. కోటుతో వున్నాడు".

"ఎత్తు?"

"అయిదున్నర అడుగులుంటాడు".

"వెనుక నుంచి తప్ప సరీగ్గా చూడలేదంటావు".

"అవును సార్".

"మళ్ళీ ఎంతసేపటికి బయటకు వచ్చాడు".

"నేను చూడలేదు. నేను మనస్ఫూర్తిగా ప్రేమించిన అక్కయ్య ఇలాటిదని తెలిసి మనసు విరిగిపోయి వెళ్ళిపోయాను".

ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ లోపలికి వెళ్ళి, రెండు నిముషాలు తరువాత తన డిపార్ట్ మెంట్ మనిషితో వచ్చాడు. అతడు అయిదున్నర అడుగులు వున్నాడు. అతడు వేసుకున్న కోటు సరిగ్గా సరిపోయింది. అతడిని గోడవైపు నిలబెట్టి, సుధాకర్ తో, "సరీగ్గా చూడు ఈ పోలికలు కనిపిస్తున్నాయా?" అని అడిగాడు.

కాదంటే మరింకెలా వున్నాడు? అని అడుగుతాడు. సుధాకర్ కి ఈ ప్రశ్నా వర్షం నుంచి ఎప్పుడు తప్పించుకుందామా అని వుంది. "అవును సార్ వెనుకనుంచి చూస్తే అచ్చు అలాగే వున్నాడు" అన్నాడు.

ఇన్ స్పెక్టర్ తన మనిషివేపు చూసి, " ఆ కోటు తీసుకెళ్ళి తీసిన చోట పెట్టెయ్యి" అన్నాడు. ఆ డిపార్ట్ మెంట్ మనిషికి, ఇన్ స్పెక్టర్ తనని రవితేజ కోటు ఎందుకు తొడుక్కోమన్నాడో అర్థం కాలేదు. తీసుకెళ్ళి బీరువాలో పెట్టేసేడు.

రవితేజ ఎత్తు అయిదున్నర అడుగులు.

* * *

సుధాకర్ వెళ్ళిపోయిన అయిదు నిముషాలకి శర్మ మిగతా డైరెక్టర్ల తో కారు దిగాడు.

"బోంబే విమానం వచ్చింది. రవితేజ అందులో లేడు" అన్నాడు అయోమయంగా.

"ఉండడు. నాకు తెలుసు" అన్నాడు ఇన్ స్పెక్టర్ క్లుప్తంగా.

"ఎందుకు?" శర్మ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. ఇన్ స్పెక్టర్ జవాబు చెప్పలేదు. లోపలికి వెళ్ళాడు. జేబులోంచి మాధవికి సుధాకర్ వ్రాసిన ఉత్తరం బయటకు తీశాడు. అయితే ఈసారి తీసేటప్పుడు జాగ్రత్తగా చేతిరుమాలుతో పట్టుకుని దాన్ని తీశాడు. వేలి ముద్రల నిపుణుడికి దాన్ని ఇస్తూ, "దీనిమీద ఏయే వేలిముద్రలున్నాయో చూడు. జాగ్రత్త" అని చెప్పి యిచ్చాడు.

ముందు హాల్లో శర్మా వాళ్ళు కూర్చుని వున్నారు.

ఇన్ స్పెక్టర్ ఫోన్ ఎత్తి ఎయిర్ లైన్స్ ఆఫీసుకి ఫోన్ చేశాడు. తనెవరో పరిచయం చేసుకుని "ఇక్కన్నుంచి ముంబాయి వెళ్ళే విమానం ప్రొద్దున్న ఎన్ని గంటలకి వెళ్ళింది?" అని అడిగాడు.

"ప్రొద్దున ఎనిమిదింటికి-" అవతల్నుంచి సమాధానం వచ్చింది.

"అక్కణ్ణుంచి వచ్చే విమానం ఎన్నింటికి బయల్దేరుతుంది?"

"పదకొండింటికి-"

రాజశేఖర్ ఫోన్ పెట్టేశాడు. డైరెక్టర్లందరూ అతడీ విషయం ఎందుకు అడిగాడో అర్థంకాక ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఈ లోపులే వేలిముద్ర నిపుణుడు వచ్చి "ఆ ఉత్తరం మీద నాలుగు రకాల ముద్రలున్నా" యని చెప్పాడు.

రాజశేఖర్ అతడితో కలిసి రవితేజ ఆఫీసు గదిలోకి వెళ్ళి "ఇక్కడ పరిశీలించు, రవితేజ వేలిముద్రలు చాలా దొరుకుతాయి. నీకు ఆ ఉత్తరం మీద దొరికిన నాలుగిట్లో నాదీ, సుధాకర్ దీ, మాధవిగారిదీ గాక ఆ నాలుగోది ఎవరిదో కనుక్కొని చెప్పు" అన్నాడు.

పావుగంట తరువాత నిపుణుడు వచ్చి "ఆ నాలుగోది రవితేజది" అని చెప్పాడు.

అంటే-

తన భార్యకి సుధాకర్ వ్రాసిన ఉత్తరాన్ని రవితేజ చదివేడన్నమాట.

* * *

చెంచురామయ్య ముందుకు వంగి "అలాగా" అన్నాడు.

"వాళ్ళు చాలా కంగారుపడుతున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి బయల్దేరినట్టు ఫోన్ చేశాడట. కానీ ఇక్కడ మాత్రం దిగలేదు".

చెంచురామయ్య నవ్వి "భార్య పోయిన షాక్ లో విమానం నుంచి దూకేసెడేమో" అన్నాడు. ఏదైనా ఒక గేమ్ లో అవతలివాడి కాలు విరిగి, తనను విజేతగా ప్రకటిస్తే ఒక శాడిస్టు ఆటగాడు పొందే కృత్రిమ ఆనందాన్ని అతడు పొందుతున్నాడు.

ఇన్ స్పెక్టర్ శర్మవైపు తిరిగి, "మీరు ముంబాయిలో రవితేజతో నిన్నగానీ మొన్నగానీ మాట్లాడారా?" అని అడిగాడు.

"మొన్న మాట్లాడాను. మాకు రాష్ట్రపతి బహుమతి వచ్చింది. ఆ విషయం చెప్పాము".

"నిన్న మాట్లాడలేదా?"

ఈ సంభాషణ వింటూన్న మరో డైరెక్టరు కల్పించుకుని "నిన్న అర్ధరాత్రి వరకూ అతడికోసం ప్రయత్నిస్తూనే వున్నాము. అర్జెంటుగా ఒక కాంట్రాక్టు విషయం మాట్లాడవలసి వచ్చింది. అతడు రూమ్ లో దొరకలేదు. తెల్లవారుజామున కూడా అతడి దగ్గిర్నుంచి ఫోన్ వస్తుందేమో అని చూశాము. రాలేదు. ఈ లోపులో అతడినుంచే ఫోన్ వచ్చింది. ఎయిర్ పోర్ట్ నుంచి అన్నాడు" అని వివరించాడు.

"ముంబాయిలో రవితేజకి తెలిసినవాళ్ళు ఎవరయినా వున్నారా?".

"తెలీదు".

"నేను శవాన్ని మార్చురీకి పంపిస్తాను".

ఎవరూ మాట్లాడలేదు.

మరో పదినిముషాల్లో మాధవి శరీరం పోస్టుమార్టమ్ కి పంపబడింది. శర్మ వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇన్ స్పెక్టరు వెళ్ళలేదు. రవితేజ వచ్చేలోపులో ఆఫీషియల్ గా కొన్ని పన్లు చేయదల్చుకున్నాడు. రవితేజ డ్రాయరు తాళాలు తెరవటం అతడికి పెద్ద కష్టం కాలేదు. కొంచెం సేపట్లోనే అతడికి కావల్సింది దొరికింది.

అయితే దాని చివర "మిస్ విజయవాడ" అని వుండటంతో కాస్త అయోమయంలో పడ్డాడు. ఎవరీ మిస్ విజయవాడ?

అతడు ఆ సాయంత్రం వరకూ చూసి మరుసటిరోజు ముంబాయి బయల్దేరాడు. టైమ్ వేస్టు చేయదల్చుకోలేదు. మాధవిని హత్య చేసినవాడు అపురూపమైన తెలివితేటలు కలవాడని అతడికి అర్థమైంది. ఆ హత్యా రహస్యాన్ని చేదించటం ఒక ఛాలెంజీగా తీసుకున్నాడు.

హంతకుడెవరో అతడికి చూచాయగా తెలుస్తూంది.

విమానం ఆలస్యం అవడంతో అతడు చిన్న పొరపాటు చేశాడని కూడా అర్థమైంది.

అతడు దాన్ని సర్దుకునే లోపులోనే నాలుగుదార్లూ మూసెయ్యాలి. అందుకే అతడు అంత అర్జెంటుగా ముంబాయి వెళ్ళాడు. ఊళ్ళో దిగ్గానే అతడు సీ-రాక్ హోటల్ కి వెళ్ళాడు. రిసెప్షన్ లో ఒక అందమైన అమ్మాయి వుంది. "నమస్తే నేను ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఇన్ స్పెక్టర్ ని పేరు రాజశేఖర్ మీరూ?" అని అర్థోక్తిలో ఆపుచేసాడు.

"నా పేరు ప్రియదర్శని చంద్రికా ప్రియదర్శిని" అందామె చిరునవ్వుతో "చెప్పండి, మీకే సహాయం చెయ్యగలను?"

"రవితేజ అని ఒకాయన నిన్నటివరకూ మీ హోటల్లో వున్నాడా?"

"రవితేజ....మేనేజింగ్ డైరెక్టర్?"

"ఆయనే-"

"అవును వున్నారు. నిన్న ప్రొద్దున్న ఖాళీచేసి వెళ్ళిపోయాడే".

అతడు మరో రెండు నిముషాలు సంభాషణలో గడిపాడు. తనారోజు కట్టుకున్న చీర రవితేజ టెక్స్ టైల్స్ తయారైందే అన్న విషయం అతడు చెప్పినట్టు ఆమె అంది.

"మొన్న రాత్రి డ్యూటీలో ఎవరున్నారు?"

"నేనే".

"రవితేజ మొన్న రాత్రంతా గదిలో వున్నాడా?"

ఆమె తటపటాయించి "తెలీదు" అంది. ఆమె తటపటాయింపుని అతడు గుర్తించాడు. "మీ బిల్ బుక్సూ అవీ చూస్తే ఆ

విషయం తెలుస్తుంది కదా-రాత్రి డిన్నర్ తీసుకున్నదీ - ఫోన్ కాల్స్ చేసిందీ వగైరా-"

ఆమె ఏదో గుర్తొచ్చినదాన్లా "ఆయన గదిలో లేరా రాత్రి" అంది. "ఎలా చెప్పగలరు?"

"ఏ ఫోన్లొచ్చినా ఇవ్వొద్దని అన్నారు. తరువాత నాకు అనుమానం వచ్చింది ట్రంకాల్స్ కూడా యివ్వకుండా ఆపాలా అని తెలుసుకోవటం కోసం మళ్ళీ ఫోన్ చేశాను. ఆయన ఎత్తలేదు ఫోన్".

"బహుశా నిద్రపోతూ ఉండి ఉండవచ్చు కదా-"

"అయి వుండవచ్చు నాకు తెలీదు కానీ నాకు ఫోన్ చేసిన రెండు నిముషాల్లోనే నిద్రపోయారంటే.." ఆమె సగంలో ఆపుచేసింది. అతడు అర్థం చేసుకున్నట్టు తలూపి, "మీ హవుస్-కీపింగ్ రికార్డులో రవితేజ గది మరుసటిరోజు ప్రొద్దున్న ఎన్నింటికి శుభ్రం చేసిందీ వ్రాసి వుంటుంది కదా" అన్నాడు. ఆమె తలూపింది.

ఆ రికార్డులు పరీక్షించి చూశాడు.

"పదిన్నరకి" అని వుంది. అంటే-

రాత్రి తనని డిస్టర్బ్ చెయ్యొద్దని చెప్పి గది ముందు "DONOT DISTURB" బోర్డు పెట్టిన రవితేజ - ప్రొద్దున్న పదిన్నర వరకూ ఆ బోర్డు తీయలేదు.

అప్పటివరకూ రవితేజ గదిలోపల ఏం చేస్తున్నాడు?

అతడు తలెత్తి - "రాత్రి ఎన్నింటికి మీకు రవితేజ తన గదినుంచి ఫోన్ చేశాడు?" అని అడిగాడు.

"రాత్రి ఎనిమిదింటికి-" ఆమె సమాధానం ఇచ్చింది. అతడు ఆలోచనలో పడ్డాడు.

.....ముంబాయి నుంచి హైద్రాబాద్ వెళ్ళే విమానం రాత్రి తొమ్మిదింటికి వుంది. అందులో వెళ్ళి-

ప.....ని....ము....గిం.....చు.....కు....ని

ప్రొద్దున్న ఆరింటికి బయల్దేరి తిరిగి ముంబాయి వచ్చేసి....

గది ముందున్న 'నో.....డిస్టర్బెన్స్' బోర్డు తీసేసి-

తీరిగ్గా గది ఖాళీచేసి-

మళ్ళీ పదకొండింటికి విమానంలో, అప్పుడే ముంబాయి నుంచి దిగినట్టు హైద్రాబాద్ లో దిగి...

అద్భుతమైనా ప్లాన్ చేశాడు హంతకుడు! అతడు వేసిన ఈ అత్యంత అపురూపమైనా ప్లాన్ తో మూడోవాడికి అనుమానం వచ్చి వుండేది కాదు...విమానం ఆలస్యం అవకపోయి వుంటే-

ఇన్స్ పెక్టర్ తన టేబిల్ ముందు కూర్చొని రిపోర్ట్ వ్రాయటం ప్రారంభించాడు. చాలా డిటెయిల్డ్ రిపోర్టు అది-

"రవితేజ టెక్స్ టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ రవితేజకీ, అతడి భార్యకీ ఒక్కక్షణం పడదు. ఇంట్లో పనిచేసే వారందరికీ ఈ విషయం తెలుసు. అతడికి తన ఆఫీసులో పనిచేసే స్త్రీలతో కూడా సంబంధాలున్నాయి. అతడి భార్యకి సుధాకర్ అనే కుర్రవాడు వ్రాసిన ఉత్తరాన్ని అతడు చదివాడు. అప్పటినుంచీ ఆమె మీద కక్ష పెంచుకున్నాడు. అతడి డైరీ ఇందుకు తార్కాణం. రవితేజ భార్యకీ, అతడికీ తరచూ జరిగే గొడవల వల్ల ఆమెకి హిస్టీరియా కూడా వచ్చే లక్షణాలు కనబడ్డాయని డాక్టరు చెప్పాడు.

రవితేజ కూడా ఎవర్నో అమ్మాయిని ప్రేమించాడు. ఈ అమ్మాయి ఒకప్పుడు మిస్ విజయవాడగా ఎన్నికైనట్టు తోస్తుంది. ఆ తరువాత ఆమె అతడిని తిరస్కరించింది. దాంతో అతనిలో నిరాశ నిస్పృహలు బాగా చోటు చేసుకున్నాయి. అతడి ఆఫీసులో ప్రియంవద అని తాత్కాలిక భృతిమీద పనిచేసే అమ్మాయిపట్ల అతడు చొరవ తీసుకోవటం ప్రారంభించాడు. అతడు తన బాస్ అవటంవల్ల, తనది టెంపరరీ ఉద్యోగం అవటంవల్లా ఆమె ఈ విషయాన్ని పై అధికారులకి చెప్పటానికి భయపడింది. తోటి ఉద్యోగులతో చెప్పుకొని 'ఏం చెయ్యాలా' అని సలహా అడిగింది. అదే ఆఫీసులో పనిచేసే ఇద్దరమ్మాయిలు ఈ విషయం సాక్ష్యం చెప్పారు- ఈ బాధ భరించలేక ప్రియంవద ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోయింది.

తన హిస్టీరియా భార్యని వదిలించుకోవటానికి రవితేజ పెద్ద ప్లాన్ వేశాడు. విదేశాల్నుంచి అప్పుడే దిగినట్టు, మూడురోజుల తర్వాత దిగి ఈ లోపులో భార్యని హత్య చేద్దామనుకున్నాడు. అంతా సవ్యంగా జరిగి వుంటే, ఎవరికీ ఇతడిమీద అనుమానం రాకపోవును. అందరూ ఇతడు ఆ హత్య జరిగిన సమయానికి విదేశాల్లో వున్నాడని అనుకునేవారు. కానీ దురదృష్టం ఇతడిని వెన్నాడింది. అదే సమయానికి రాష్ట్రపతి బహుమతి రావటంతో డైరెక్టర్లు అతడికోసం అమెరికా ఫోన్ చేశారు. అప్పటికే ముంబాయి చేరుకున్న అతడు, ఈ విషయం గుర్తించి ప్లేటు మార్చాడు- ఏదో పని వున్నట్టు సీ-రాక్ హోటల్ లో ఆగిపోయాడు. రాత్రి హైద్రాబాద్ వచ్చి ప్రొద్దున్నే బొంబే వెళ్ళిపోయాడు. హంతకుడిని దురదృష్టం వదిలిపెట్టలేదు. మరేదో అర్జెంటు పని మీద డైరెక్టర్లు సీ-రాక్ హోటల్ కి ఫోన్ చేస్తే రాత్రంతహ అతడు ఆ గదిలో లేడన్న విషయం బైటపడింది...

....రవితేజ హైద్రాబాద్ నుంచి ఇంటికి ఏమీ ఎరగనట్టు ఫోన్ చేశాడు. ఎయిర్ పోర్టుకి కారు వెళ్ళింది అని తెలుసుకుని, కంగారుపడ్డాడు. ఆ రోజు విమానం ఆలస్యంగా వచ్చిందన్న విషయం అతడు గుర్తించగానే అతడికి తను చేసిన తప్పు తెలిసిపోయింది. విమానంకన్నా ముందే తను హైద్రాబాద్ చేరుకున్నట్టు పోలీసులకి అనుమానం రాగానే వెనక్కి వెళ్ళి అంతా ఎంక్వయిరీ చేస్తారని అతడికి తెలుసు.

అప్పట్నుంచీ అతడు పరారీలో వున్నాడు.

అతడిమీద అరెస్ట్ వారెంట్ ఇష్యూ చేయటమైంది. అతడి ఫోటోలు అన్ని పోలీస్ స్టేషన్ లకి పంపబడ్డాయి. హంతకుడు చాలా పలుకుబడి వున్న వ్యక్తి. బయట వుంటే సాక్ష్యాలు తారుమారు చేయగలడు. అందువల్ల నాన్ బెయిలబుల్ వారెంట్ మాత్రమే సరియైనది. "రిపోర్టు వ్రాయటం పూర్తిచేసి రాజశేఖర్ భారంగా నిట్టూర్చాడు.

"ఎంతకాలం తప్పించుకుంటావు రవితేజా! ఎక్కడున్నా నిన్ను పట్టుకుంటాను-" అని మనసులో అనుకున్నాడు.

* * *

మరుసటి రోజు అన్ని పేపర్లలో ఈ వార్త ప్రముఖంగా వచ్చింది. "రవితేజ టెక్స్ టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ పరారీ-పోలీసుల వెతకులాట". "భార్యని హత్యచేసిన రవితేజ", "స్త్రీ వ్యామోహంతో నరరూప రాక్షసుడైన భర్త" వగైరా వగైరా.

ఈ పేపర్లు చూసి అందరికన్నా ఎక్కువ సంతోషించిన వాడు చెంచు రామయ్య!

ఈ రోజు ఆ ప్రత్యర్ధి కంపెనీలో గొప్ప పార్టీ జరిగింది.

## 28

**క్రమం** క్రమంగా మత్తు విడిపోతున్నట్టు అనిపించింది రవితేజకి. నెమ్మదిగా కళ్ళు విప్పాడు. కొంచెంసేపుపాటు తను ఎక్కడున్నదీ అర్ధంకాలేదు. తలపక్కకి తిప్పిచూశాడు.

పక్కనే స్టూలు మీద కూర్చుని తనవైపే చూస్తున్న భాస్కర్ కనపడ్డాడు. చప్పున పక్కమీద లేవబోయాడు. నిస్సత్తువగా అనిపించింది.

భాస్కర్ నవ్వేడు, "హల్లో సార్. హౌ ఆర్యూ".

"ఏమిటిది? ఏం జరుగుతూంది".

"నాటకానికి ఆఖరి అంకం" భాస్కర్ లేచి పక్కగదిలోకి వెళ్ళి కొన్ని పేపర్లు తీసుకొచ్చి రవితేజ ముందు పడేసాడు. గత వారంరోజులు వివిధ దినపత్రికలు అవి. రవితేజ అర్థంకానట్టు వాటిని తీసుకుని మొదటిపేజీ చూసి షాక్ అయ్యాడు.

కొన్ని పత్రికలు చనిపోయిన మాధవి ఫోటో వేస్తే మరి కొన్ని తన ఫోటో వేశాయి. **"రవితేజపై అరెస్టు వారెంట్", "రవితేజ పరారీ", "రవితేజ కోసం పోలీసుల వేట"** లాటి హెడ్డింగ్ లు, వివిధ వ్యాసాలు, వార్తలు అతడు చివరి దినపత్రిక మీద వున్న డేట్ చూసి స్థాణువయ్యాడు!

- అప్పటికి మాధవి చనిపోయి వారంరోజులు అయింది.

అంటే-

వారంరోజులు తను కోమాలో వున్నాడా?

రవితేజ మొహంలో మారుతున్న భావాలు గమనించి భాస్కర్ నవ్వేడు. మొత్తం కథంతా చెపుతున్నట్టు చెప్పసాగాడు.

"వ్యాపారపరంగా మిమ్మల్ని లా దెబ్బకొట్టాలో మాకు తెలియలేదు. ఈ పని ఎలాగైనా పూర్తిచేయాలని నన్ను నియమించారు. అయితే నేను వెంటనే రంగంలోకి దిగలేదు. ముందు మిమ్మల్ని మీ చుట్టూ వున్న పరిస్థితుల్ని గమనించాను. మీకూ మీ భార్యకి పడదని తెలుసుకున్నాను. మిమ్మల్ని వలలో ఇరికించాలంటే ఒక స్త్రీ మూలంగానే అది సాధ్యపడుతుందని పించింది. మీ పాత సెక్రటరీకి ఆక్సిడెంట్ చేయించి, ప్రియంవదని ఆ స్థానంలో ప్రవేశపెట్టాను. ఆ విధంగా ప్రియంవద మీ సెక్రటరీ అయింది".

రవితేజకి ఈ ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. సరస్వతి రోడ్డు దాటి వెళ్తూ వుండగా జరిగిన యాక్సిడెంట్ యాదృచ్ఛికం కాదన్నమాట. అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "రేయ్! మీ మీ స్వార్థాల కోసం అమాయకుల్ని బలిపెట్టార?" అని అరిచాడు. భాస్కర్ నవ్వేడు.

"వ్యాపారంలో అలాంటివేమీ వుండవని మీకు చెప్పనవసరం లేదుగా రవితేజా! సరే, ఎంతవరకూ వచ్చాను? మీ పాత సెక్రటరీ ఆస్పత్రిలో వున్నప్పుడు ఆ స్థానంలో ప్రియంవదని ప్రవేశపెట్టాము. అయితే మేము అనుకున్నంత తొందరగా మీరు ఆమెవైపు అట్రాక్ట్ అవలేదు. ఎన్ని రకాలుగానో ఆమె ప్రయత్నించింది. ఆటోగ్రాపులు, పుట్టినరోజునాడు అర్ధరాత్రి ఫోన్లు... పాపం ప్రియంవద మీ పట్ల తన ప్రేమ తెలపటానికి చాలా విధాలుగా కష్టపడింది.

మీరు కొద్దిగా మారుతున్నట్టు మాకు తోస్తున్న టైంలో కార్తీకమాసం పిక్నిక్ లో సుధాకర్ అనే కుర్రవాడెవరో మీ భార్యతో చనువుగా వుండటం మేము గమనించాము. మీకారోజు శ్రేయోభిలాషిగా ఫోన్ చేసింది నేనే. మా అదృష్టం బావుంది, ఆ సుధాకర్ మీ భార్యవెనుక జిడ్డులా పడ్డాడు. మీరు మానసికంగా బాగా డిస్టర్బ్ అయ్యారు". అతడు కొంచెం ఆగి, తిరిగి చెప్పటం ప్రారంభించాడు.

"ఒకరోజు రాత్రి చాలాసేపటివరకూ మీరు ఆఫీసులో డిక్టేషన్ ఇస్తూ వుండిపోయారు. బయల్దేరే ముందు ప్రియంవద అందించిన సైగద్వారా, లిఫ్ట్ రాత్రంతా మధ్యలో ఆగిపోయేలా చేశాము....ఒకవైపు ఇంట్లో సుఖం లేకపోవటం, మరొకవేపు అందమైన అమ్మాయి సామీప్యం. ఎవరు మాత్రం లొంగిపోకుండా వుంటారు? ఒక్కసారి దగ్గిరవగానే ప్రియంవద మిమ్మల్ని వరదలో ముంచేస్తుందని మాకు తెలుసు. సెక్స్ లో ఆమెకి ఎవరూ సాటి రారు...." ఎవరో సాచిపెట్టి కొట్టినట్లు రవితేజ మొహం పాలిపోయింది.

స్త్రీ జాణ అయితే మొగవాడిని ఎంతగా ఆడిస్తుందో అర్ధమైంది. సెక్స్ లో ఆమెకి ఎవరూ సాటిరారట. ఆమె మాటలు గుర్తొచ్చాయి. "ఎప్పుడూ నేను తెలివితేటలు, మీ విజయాలు వీటి గురించే ఆలోచిస్తాను సార్. శారీరకంగా దూరంగా వుండి స్వచ్ఛంగా వున్నానని అనుకుంటే అది ఆత్మవంచన మీ కోసం దేన్నైనా వదులుకుంటాను. ఇంతకన్నా ఎలా చెప్పను?...'

ఎంత అమాయకంగా మాట్లాడింది!

అదే తొలిముద్దులా ఎంత తమలపాకులా వణికిపోయింది.

ఆమెని కాదు! తనని అనాలి! తనో మూర్ఖుడు. ఆమె నాటకమంతా నిజమని నమ్మేసి, తన పురుషత్వం మీద అపారమైన గౌరవం పెంచేసుకున్నాడు. ఆమెతో అనుభవం తన విజయకేతనపు రెపరెప అనుకున్నాడు. తొలి ముద్దులోనే అంత ఆనందం ఇచ్చిందంటే - తనకే మాత్రం తెలివితేటలున్నా అది ఆమెకి తొలిముద్దు కాదని తనకి అర్థమై వుండాలి. మైకంలో మునిగిపోయిన వాడికి ఆలోచించే ఓపిక ఏది? అంత గొప్ప ప్రొఫెషనల్ గాబట్టే తనకి రవ్వంత అనుమానం రాలేదు.

కానీ ఆ కృత్రిమత్వాన్ని తన మనసు ఎక్కడో పసిగట్టింది. పైకి తెలియలేదు., అందుకే రెండోరోజు అవగానే అక్కణ్ణుంచి బయటపడాలని అనిపించింది. రవితేజ ఆలోచిస్తూ వుంటే భాస్కర్ అన్నాడు.

"సరే ఇక కథ చివరికొస్తాను" అన్నాడు భాస్కర్.... "మీరు తనతో కలిసి కొద్ది కాలం బయట గడపటం కోసం ఒత్తిడి చేస్తున్నారని ప్రియంవద మాకు చెప్పింది. మిమ్మల్ని ఇరికించటానికి సరయిన సమయం అదే అనిపించింది మాకు. ముగ్గురం కలిసి ఆలోచించాం-"

"ముగ్గురెవరు?"

"సారీ, చెప్పను. కాస్త మెదడు ఉపయోగిస్తే మీకే తెలుస్తుంది".

రవితేజ చివరి ప్రశ్న అడిగాడు. "ఎందుకు మీరిదంతా చేశారు? వ్యాపారంలో ప్రత్యర్థుల్ని దెబ్బకొట్టటం ఈ రకంగా కాదు. దమ్ముంటే ఆ రంగంలోనే తెలివితేటలు వుపయోగించాలి. మీక్కావల్సింది రవితేజ టెక్స్ టైల్స్ పతనమే అవుతే దానికింత పెద్దప్లాన్ వేసి, నా భార్యని చంపి అందులో నన్ను ఇరికించనవసరంలేదు. ఒక్క బుల్లెట్ తో నన్ను చంపేస్తే చాలు".

భాస్కర్ నవ్వి, "వ్యాపారంలో వున్నన్ని తెలివితేటలు మీకు మిగతా విషయాల్లో లేవు రవితేజా" అన్నాడు క్లుప్తంగా.

"నాకు అర్థం కావడంలేదు".

"కొన్ని విషయాలు అర్థం కాకపోవటమే మంచిది రవితేజా!"

భాస్కర్ లేచి గుమ్మం దగ్గరకి నడిచారు. వెనుకనుంచి రవితేజ అరిచాడు "ఇప్పుడు నేనేం చేయాలి?"

భాస్కర్ మొహంలో శాడిస్టిక్ గా నవ్వు కదలాడింది. "అది మీ ఇష్టం బయట పోలీసులు మీ కోసం కుక్కల్లా వెయిట్ చేస్తున్నారు. ఉరికంభం కూడా సిద్దంగా వున్నది".

రవితేజ పిడికిళ్ళు నిస్సహాయంగా బిగుసుకున్నాయి. భాస్కర్ వెళ్ళబోతూంటే ఆఖరుగా అడిగాడు. "ప్రియంవద ఎక్కడుంది?"

భాస్కర్ వెనుదిరిగి తాపీగా అన్నాడు. "ఆమెని కూడా చంపేసేం".

రవితేజ నిలువెల్లా వణికిపోయాడు. ఆమె అతడికి అనంతమైనా అన్యాయం చేసివుండవచ్చు. స్వర్గం చూపిస్తూ నరకంలోకి తోసి వుండవచ్చు. వలలోకి ఈడ్చి వుండవచ్చు. కాని ఎంత కాదనుకున్నా ఆమె సామీప్యం అతడికి ఒక అనుభూతి ఆమె మరణం విద్యుద్ఘాతం.

"మిమ్మల్నింత నమ్మి మీకు ఆయం చేసిన అమ్మాయిని పనితీరేక చంపేస్తారా?"

"అవును చాలా నమ్మకంగా పనిచేసింది మా గురించి. కానీ ఏమో ఎవరు చెప్పగలరు? రేపు కోర్టులో కేసు నడుస్తూ వుండగా ఆవిడ మీవైపు తిరిగిపోతే?......రేపు కోర్టులో, మాధవి చనిపోయిన రోజు రాత్రి నేను ప్రియంవదతో

వున్నానని మీరు అన్నారని అనుకోండి. దానికి ప్రియంవద సాక్ష్యం చెపుతే? అందుకే ఆమెని కూడా చంపేసి శవాన్ని పాతిపెట్టేసేం. మీరు ప్రియంవద సాక్ష్యం గురించి కోర్టులో చెప్పగానే ఆమె శవం బయలుపడేలా చేస్తాం. మీకూ ప్రియంవదకూ వున్న సంబంధం గురించి, తరచు మీరు ఆమె ఇంటికి వచ్చేవారని ఆ ఇంటిగలాయన సాక్ష్యం చెపుతాడు. మీ ఇద్దరూ కలిసి మాధవిని హత్య చేశారనీ, ఆ తరువాత ప్రియంవద తనని పెళ్ళిచేసుకొమ్మని మిమ్మల్ని బలవంతం చేసిందనీ, ఆమె పీడకూడా మీరు వదిలించుకున్నారని ప్రాసిక్యూషన్ వాదిస్తుంది. దాంతో జంట హత్యల హంతకుడిగా మీ అధ్యాయం సమాప్తమౌతుంది..."

రవితేజ స్థాణువై చూస్తున్నాడు.

భాస్కర్ అతడిని వదిలేసి బయటకు నడిచాడు.

ఏదో మైకంలోంచి అప్పుడే తేరుకున్నవాడిలా రవితేజ ఎలుగెత్తి అరిచాడు. "మీరు మనుష్యులు కాదు...రాక్షసులు" ఆ మాటలకి గది గోడలు ప్రతిధ్వనించాయి తప్ప సమాధానంలేదు. అప్పుడు ఆ మొండిగోడ మధ్య చాలాసేపు అలాగే కూర్చుండిపోయాడు. ఒళ్ళంతా నిస్సత్తువగా వుంది. వాచీలో తారీఖు చూసుకున్నాడు.

మాధవి మరణించి ఏడు రోజులు గడిచాయి. ఏడు రోజుల పాటు తనని మైకంలో, బయట ప్రపంచానికి దూరంగా వుంచారు. బయట జరుగుతున్నదేమిటో తను వూహించగలడు. సమాజం దృష్టిలో తను భార్యని చంపి, పారిపోయిన హంతకుడు. పోలీసులు తన కోసం వేట ప్రారంభించి వుంటారు.

అతడు లేచి నిలబడ్డాడు. కాళ్ళు తూలుతున్నాయి.

బయటకొచ్చాడు.

జనం లేరు. ఊరి చివర ఇల్లులా వుంది. పూర్తిగా ఇల్లుకూడా కాదు.

అతడికేం చేయాలో పాలుపోలేదు. అతడి మానసిక స్థితి ఎంత హీనంగా వుందంటే-తనంతట తనే పోలీస్ స్టేషన్ కి వెళ్ళి లొంగిపోదామా అనుకున్నాడు. ఈ టెన్షన్, కోర్టులో వాదోపవాదాలు-ఇవన్నీ భరించడం కంటే నేరం వప్పుకుంటేనే మంచిదని తోస్తూంది. ఆపద కాలంలో మనిషెంత ఒంటరో అతడికి తెలుస్తుంది.

జేబు తడిమి చూసుకున్నాడు. పర్సులో పది రూపాయలున్నాయి. అయిదు నిముషాలు నడిచి - ఒక కిరాణాకొట్టు చేరుకున్నాడు. ఫోన్ అడిగి తీసుకున్నాడు. పోలీస్ స్టేషన్ కి చేద్దామని అతడి ఉద్దేశ్యం. కానీ చేవారి క్షణంలో మనసు మార్చుకున్నాడు. శర్మకి ఫోన్ చేశాడు.

"హల్లో" అని అట్నుంచి శర్మగారి గొంతు వినపడింది.

"నేనూ రవిని"

"....ఎవరూ" అట్నుంచి శర్మ ఎగ్జయిటింగ్ గా అరిచాడు.

"ర...వి....రవితేజ?" కీచుగా ధ్వనించింది ఆయన కంఠం.

"నేనే".

"ఎక్కన్నుంచి?'

తనెక్కడున్నదీ చెప్పి, "ఏం చెయ్యాలో నాకు పాలుపోవటం లేదు" అన్నాడు.

"వెంటనే ఇక్కడికిరా..." అని ఆగి, "వద్దులే మా ఇంటి ముందు కూడా ఒక సి.ఐ.డి. నిల్చున్నట్టు అనుమానంగా వుంది. నేనే వస్తాను. అక్కడే వుండు-" హడావుడిగా అని ఫోన్ పెట్టేశాడు.

రవికూడా ఫోన్ పెట్టేసేడు. తను ఇంటికి వెళ్ళకపోవటమే మంచిదయింది. అక్కడ కూడా నిశ్చయంగా నిఘా వుండి వుంటుంది.

ఫోన్ కి డబ్బులిచ్చి, అక్కడే స్టూల్ మీద కూర్చున్నాడు. అప్రయత్నంగా అతడి దృష్టి పక్కనున్న పాత పేపర్ల మీద పడింది. అన్నిటికన్నా పైవాటిమీద మొదటి పేజీలో తన ఫోటో.... పెద్ద సైజులో.

అతడు చప్పున స్టూలుమీద నుంచి లేచాడు. కిరాణా కొట్టువాడు అప్పటికే అతడివైపు అనుమానంగా చూస్తున్నాడు.

అతడు దూరంగా వెళ్ళి నిలబడ్డాడు. అయిదు నిముషాల తరువాత శర్మ కారు వస్తూ కనిపించింది. చెట్టుచాటునుంచి బయటకొచ్చి చెయ్యి ఎత్తాడు. శర్మ కారాపి అతడిని ఎక్కించుకున్నాడు. మరో అయిదు నిముషాలు ప్రయాణం కొనసాగింది. ఎవరూ మాట్లాడుకోలేదు. రవి చాలా గిల్టీగా ఫీలయ్యాడు. అందరి దృష్టిలోనూ తన భార్యని చంపిన హంతకుడు.

తన మనసు నొప్పించకుండా వుండటానికే ఈయన ఏ ప్రసక్తి తీసుకురావటం లేదు. అలా అనుకోగానే శర్మపట్ల కృతజ్ఞతాభావం నిండింది.

"ఎక్కడికి వెళుతున్నాం?" అని అడిగాడు.

"మా ఇంటికి-"

"వొద్దు".

"ఏం?"

రవితేజ చెప్పలేదు. అతడి ఉద్దేశ్యం-రేపు తను ఆ ఇంట్లో పట్టుబడితే, ఒక హంతకుడికి ఆశ్రయం ఇచ్చినందుకు శర్మ కూడా ఇందులో ఇరుక్కోవచ్చు. అది ఇష్టంలేకపోయింది అతడికి.

"నువ్వు చెప్పిందీ నిజమే. మా ఇంటిమీద కూడా నిఘా వుండి వుండవచ్చు".

"నా ఉద్దేశ్యం అదికాదు..."

కారు సందులోకి తిరిగింది. ఫ్యాక్టరీ తాలూకు గెస్ట్ హౌస్ అది. ఇద్దరూ లోపలకి ప్రవేశించారు. శర్మే తాళాలు తీశాడు.

"కాఫీ తాగుతావా?"

వద్దనలేదు రవితేజ. శర్మ కారులో ఎప్పుడూ వుంచుకునే ప్లాస్క్ తీసి కాఫీ పోసి ఇచ్చాడు. చాలా ఆత్రంగా దాన్ని తాగాడు.

"స్నానం చెయ్యి, నేను కూర్చుంటాను".

రవితేజ తలూపి, లోపలికి వెళ్ళాడు. వారం పైగా అయినట్టుంది స్నానం చేసి పోయిన సత్తువ తిరిగి వచ్చినట్టు అయింది. ఈ లోపులో శర్మ అరటిపళ్ళూ అవీ తెచ్చాడు. అతడివైపు కృతజ్ఞతతో చూశాడు. "తిను-"

"వాచ్ మెన్ లేడా?"

"లేడు. శలవులో వెళ్ళాడు".

గెస్ట్ హౌస్ నిర్మానుష్యంగా వుంది. సాధారణంగా దాన్ని ఎక్కువగా వాడరు. రవితేజ సోఫాలో కూర్చున్నాడు. అతడి

కళ్ళమీదకి నిద్ర వెల్లువలా ముంచుకొస్తూంది. అది గ్రహించి, "నువ్వు నిద్రపో అసలేమీ ఆలోచించకు. సాయంత్రం నేను లాయర్ ని తీసుకొస్తాను. ఏమీ భయంలేదు" అన్నాడు. ఆ మాత్రం ఓదార్పుకే కదిలిపోయాడు. 'థాంక్స్' అన్నాడు స్పష్టంగా.

శర్మ మెట్లు దిగబోతూంటే రవితేజ "......మరి" అని ఆపుచేశాడు. శర్మ ఆగాడు.

"నేను మాధవిని హత్య చేయలేదు".

శర్మ ఏదో అనబోయి, మనసు మార్చుకుని, "నాకు తెలుసు" అన్నాడు. రవి మళ్ళీ మాట్లాడబోతూంటే "ఏమీ ఆలోచించవద్దన్నానుగా! ఇక్కడికి పోలీసులు ఎవరూ రారు. సాయంత్రం వరకూ హాయిగా నిద్రపో" అని వెళ్ళిపోయాడు.

రవి బెడ్ రూమ్ లోకి వెళ్ళాడు. వారంరోజులపాటు తనెక్కడ పడుకున్నాడో తెలీదు. వళ్ళు నొప్పులు, నీరసం, బాధా, భయం అన్నీ కలగా పులగమై నిద్రగా మారి, అతడు మరుక్షణం పక్కమీదకు జారిపోయాడు.

## 29

**ఇన్ స్పెక్టర్** రాజశేఖర్ బల్లమీద ఫోన్ మ్రోగింది.

"సార్, నేను 314ని".

"చెప్పు".

"శర్మగార్ని ఫాలో అయ్యాను. ఆయన పటేల్ నగర్ వెళ్ళి రవితేజని ఎక్కించుకున్నాడు".

రాజశేఖర్ కుర్చీలో ముందుకు వంగి, "రవితేజనా" అన్నాడు.

"అవును సార్".

రాజశేఖర్ సంతృప్తిగా నిట్టూర్చాడు. వారంరోజులపాటు శర్మగారింటిముందు నిఘా ఫలించిందన్నమాట.

"ఎక్కడికి వెళ్ళారు వాళ్ళిద్దరూ?"

"స్ట్రీట్ నెంబర్ 30వైపు వెళ్ళారు సార్. మధ్యలో ట్రాఫిక్ జామ్ అవటంతో నేను ఫాలో అవలేకపోయాను".

రాజశేఖర్ నిస్పృహ చెందలేదు. శర్మ, రవితేజ ప్రొఫెషనల్స్ కాదు. వారికి ఈ రంగంలో పెద్ద తెలివితేటలుగానీ, చొరవగానీ వుండవు. శర్మ తాలూకు తెలిసిన వాళ్ళ ఇళ్ళుగానీ, మరేమైనా ప్రదేశాలుగానీ స్ట్రీట్ నెంబర్ 30లో వున్నాయా అని తెలుసుకోవటానికి ప్రయత్నించాడు. దాదాపు నాలుగు గంటలు పట్టింది తెలుసు కోవటానికి కానీ చివరికి కరెక్టు విషయం తెలిసింది.

రవితేజ టెక్స్ టైల్స్ వారి గెస్ట్ హౌస్ ఆ వీధిలో వుంది. దాన్ని సాధారణంగా ఎక్కువగా వాడరెవరూ.

రాజశేఖర్ నలుగురు పోలీసుల్ని తీసుకుని జీపులో బయల్దేరాడు.

రవితేజ నిద్రలేచేసరికి బాగా చీకటి పడింది. ఆ గదిలో పేరుకున్న నిశ్శబ్దం, ఒంటరితనం ఆ చీకటికి తోడై అతడిని భయపెట్టినయ్. అతడు కిటికీలోంచి బయటకు చూశాడు. రోడ్డుమీద జనం తిరుగుతున్నారు. స్వేచ్ఛకున్న విలువ అది పోయినప్పుడే తెలుస్తుంది. మామూలు మనుష్యులందరూ యధావిధిగా తమ పనులు చేసుకుంటున్నారు. తనొక్కడేఈ చీకటిలో ఇలా దాక్కుని వున్నాడు.

అతడికి పారిపోవాలని వుంది. వీలైతే ఈ వీధినుంచి కూడా దూరంగా పారిపోవాలని వుంది. ప్రత్యర్థులు ఎంత తెలివిగా తనని ఇందులో ఇరికించారో తల్చుకుంటూంటే తనమీద తనకే కోపం వస్తుంది. అంతలో అతడి దృష్టి వస్తూన్న ఒక వాహనంమీద పడింది.

అతడి గుండె కొట్టుకోవడం క్షణం పాటు ఆగిపోయింది.

పోలీస్ వాన్!!!

వచ్చి ఆ ఇంటిముందే ఆగింది.

అందులోంచి రాజశేఖర్ దిగాడు. గేటు తీసి లోపలికి ప్రవేశిస్తున్నాడు. రవితేజకి ఏం చెయ్యాలో తోచలేదు. మెరుపు కన్నా వేగంగా వెనుక గదుల్లోకి పరుగెత్తాడు. ఆ తలుపు తీసుకొని పెరట్లోకి వెళ్ళాడు. గెస్ట్ హౌస్ అవటంవల్ల, తగిన సంస్కారం లేక చెట్లు అక్కడ బాగా వత్తుగా పెరిగినయ్. పెరటి గోడకూడా సరీగ్గా లేదు. అతడేమీ ఆలోచించకుండా అవతలి కాంపౌండ్ లోకి ప్రవేశించాడు. అవతలి వైపున్న ఇంటి వెనుక భాగం అది.

ఒక పోలీసు ఇంటి వెనుకవైపు రావటాన్ని అక్కడనుంచే చూశాడు. చుట్టూ వున్న చీకటి అతడికి సహాయపడింది. అదృష్టవశాత్తు ఆ ఇల్లు తాళం వేసి వుంది. అతడు చుట్టూ తిరిగి బయటకు వచ్చాడు. ఇంతలో అతడికి శర్మ కారు

కనపడింది. అది గెస్ట్ హౌస్ వైపు వెళుతూంది. రవితేజ చూసి చప్పున ఆపుచేసి "బయట తిరుగుతున్నావా?" అన్నాడు నిష్ఠూరంగా రవి జరిగినదంతా చెప్పాడు.

శర్మ కారుని సర్రున కుడివైపు తిప్పాడు. "పోలీసులు గెస్ట్ హౌస్ ని చుట్టుముట్టారు" అన్నాడు రవితేజ వగరుస్తూ.

"ఫర్వాలేదు అది ఆటోమాటిక్ లాక్ సిస్టమ్.వాళ్ళు తలుపులు పగలగొట్టినా అనుమానం రాదు".

రెండు నిముషాలు గడిచాక "మనం ఎక్కడికి వెళ్తున్నాం?" అని అడిగాడు రవితేజ.

"లాయర్ దగ్గరికి".

మరో అయిదు నిమిషాల్లో అతడి కారు లాయర్ ఇంటి కాంపౌండ్ లోకి ప్రవేశించింది. నగరంలోకెల్లా బెస్ట్ క్రిమినల్ లాయర్ రంగనాథం ఇల్లు అది. రావితేజకి ఆయనతో పరిచయం లేదు.

పక్కనున్న వరండా గుండా లోపల గదిలోకి ప్రవేశించారు ఇద్దరూ. మామూలు ఆఫీసు గది కాకుండా, లోపల వేరే డ్రాయింగ్ రూమ్ లో కూర్చుని వున్నాడు రంగనాథం. దీన్ని బట్టి శర్మ ముందు ఆయనకీ తమ రాక సంగతి చెప్పి వుంటాడని అనిపించింది. అతడి అభిప్రాయాన్ని దృవీకరిస్తూ "ఈయన రవితేజ, మా ఎమ్.డి." అన్నాడు శర్మ. మిగతా వివరాలు అంతకుముందే చెప్పినట్టు.

రంగనాథం రవితేజకి షేక్ హాండ్ యిచ్చి "కూర్చోండి" అన్నాడు. మామూలు సంభాషణ కొంచెం అయ్యాక సూటిగా విషయానికి వస్తూ "మీరేమీ భయపడనవసరం లేదు రవితేజా! వున్నదున్నట్టు చెప్పండి. క్రిమినల్ లా చిల్లుపడ్డ గిన్నెలాంటిది. ఎక్కడో మనకి తప్పకుండా లూప్ హోల్ దొరుకుతుంది. మిమ్మల్ని బయటపడేసే బాధ్యత నాది. మీరు మాత్రం జరిగింది జరిగినట్టు చెప్పండి. ఎక్కడెక్కడ ఎలా 'కవరప్' చెయ్యాలి? ఏ యే సాక్ష్యాలు సృష్టించుకోవాలి అన్నది తరువాత ఆలోచిద్దాం సరీగ్గా ఎన్ని గంటలకి మీరీ మర్డర్ చేశారు?" అని అడిగాడు.

రవితేజ తెల్లపోయి "నేనీ మర్డర్ చేయలేదు" అన్నాడు.

రంగనాథం నవ్వి "లాయర్ దగ్గిర అబద్దాలు చెప్పితే లాభంలేదు. మీరు చెప్పేదేదీ ఈ నాలుగు గోడలు దాటిపోదు. నిర్భయంగా చెప్పండి." అన్నాడు.

"నేను నిజమే చెపుతున్నాను. నేనీ హత్య చేయలేదు".

"మరెవరు చేశారు?"

"నన్ను ఇందులో ఇరికించడానికి చెంచురామయ్య గ్రూపు చేయించారు."

శర్మ, రంగనాథం ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. రంగనాథం రవితేజ వైపు తిరిగి, "ఆ రాత్రి హత్య జరిగే సమయానికి శర్మగారు చెప్పినట్టు మీరు ముంబాయిలోనే వున్నారా?" అని అడిగాడు.

రవితేజ ఆలోచించాడు. అతడు అంతకుముందే పేపర్లు చదివాడు. భాస్కర్ చెప్పింది కూడా గుర్తుంది. తన పేరుమీద ముంబాయిలో భాస్కర్ రూమ్ తీసుకున్నాడు. ఇప్పుడు తను అబద్ధం చెప్పి లాభంలేదు.

"హత్య జరిగే సమయానికి మీతోపాటు వున్నట్టు ఎవరైనా సాక్ష్యం వున్నారా?"

"ప్రియంవద వుంది".

"ఆమె ఇప్పుడెక్కడుంది?"

"ఆమెని కూడా వాళ్ళు చంపేశారు. సరియైన సమయం వచ్చినప్పుడు దాన్ని బయటపెడతారు".

"ఆ నేరం కూడా మీ మీదే పడుతుంది".

"అవును. అదే వాళ్ళ ప్లాను".

కాని నిజం చెప్తే!

రేపు పేపర్లో ఈ విషయాలన్నీ వస్తాయి. తనూ ప్రియంవాదా కలసి రెండు పగళ్ళూ రెండు రాత్రిళ్ళూ హోటల్లో వుండటంతో సహా... దానివల్ల శిక్షేమీ తగ్గదు. పైగా హంతకుడన్న పేరుతో పాటు వ్యభిచారి అన్న పేరుకూడా వస్తుంది.

రవితేజ మౌనం చూసి రంగనాథం నవ్వేడు. "వెంటనే సమాధానం చెప్పకుండా ఆలోచనలో పడ్డారూ అంటే ఎక్కడెక్కడ అబద్ధం చెప్పాలీ అని ఆలోచిస్తున్నారన్నమాట. అలాంటిదేమీ వద్దు రవితేజ! ఏదీ దాచొద్దు" అన్నాడు.

ఈ లోపులో శర్మ ఏదో పనున్నట్టు బయటకు వెళ్ళాడు. మూడో మనిషి వుండడం ఇష్టంలేక ఆయన అలా వెళ్ళిపోయాడని గ్రహించి, రవితేజ మనసులోనే 'థాంక్స్' చెప్పుకున్నాడు.

ఇంకేమీ అతడు దాచదల్చుకోలేదు.

ప్రియంవద పరిచయం అవటం దగ్గిర్నుంచి, ఆమెతో కలిసి తను హోటల్ లో గడపటం వరకు వివరంగా అంతా చెప్పాడు. వింటూన్న రంగనాథం మొహంలో భావాలు మారసాగాయి. "....మైగాడ్! చాలా కథ వుందే" అన్నాడు.

రవితేజ సమాధానం చెప్పలేదు.

"మీరే హోటల్లో దిగారు? ఏ పేరుమీద?"

రవితేజ హోటల్ పేరు చెప్పి, "నా పేరు వ్రాయలేదు. చంద్రప్రియ అని వ్రాశాను" అన్నాడు.

"మీరు ఆ హోటల్ లో రెండ్రోజులు వున్నట్టు ఎవరైనా గుర్తుపడతారా?"

"వెయిటర్స్ కూ్కడా కనిపించకుండా రహస్యంగా వున్నాము".

"అవును పరాయి స్త్రీతో అంటే తప్పదు. అందులోనూ మీరు పాపులర్ వ్యక్తి కదా! ఇప్పుడు అదే మీకు వ్యతిరేకమయింది. మీ భార్య మరణించిన సమయానికి మీరు ఈ ఊళ్ళోనే వున్నారు. పైగా దొంగ పేరుతో వున్నారు. మీ డైరెక్టర్లకి మాత్రం ముంబాయి నుంచి చేస్తున్నట్టు ఫోన్ చేశారు. మీరు ముంబాయిలో వున్నట్టు అభిప్రాయం కలగజేశారు. మీ ప్రత్యర్ధులు చాలా తెలివితేటలతో- అక్కడ ముంబాయిలో మీ పేరుమీద రూమ్ తీసుకుని మీరే ఇక్కడికి వచ్చి హత్యచేసి వెళ్ళిపోయినట్టు రంగం సృష్టించారు. మింగలేని కక్కలేని పరిస్థితి. మీరు ఆ రాత్రంతా తనతోనే వున్నట్టు సాక్ష్యం చెప్పే ఏకైక వ్యక్తి ప్రియంవద ఇకలేదు. రవితేజా! మీరు మెడలోతు వూబిలో కూరుకుపోయారు".

"నాకా విషయం తెలుసు" క్లుప్తంగా అన్నాడు రవితేజ.

ఇక్కడ ఈ సంభాషణ జరుగుతూన్న సమయానికి అక్కడ రాజశేఖర్ తన గదిలో విసుగ్గా పచార్లు చేస్తున్నాడు. రవితేజ ఆ గెస్ట్ హోస్ లోనే నిశ్చయంగా అప్పటివరకు వున్నాడని అతడికి అనిపిస్తుంది. దొరికాడు అనుకున్నవాడు ఆఖరి నిమిషంలో తప్పించుకున్నాడు. శర్మకారు అక్కడికి వచ్చిందని పక్కవాళ్ళు చెప్పారు.

అంతలో అతడికో ఆలోచన వచ్చింది. మరుక్షణమే దాన్ని ఆచరణలో పెట్టాడు.

ఆ రోజునుంచీ శర్మ ఫోన్ ట్రాప్ లో పెట్టబడింది. ఎక్కడున్నా రవితేజా, శర్మ ఒకర్నొకరు కాంటాక్టు చేసుకుంటారని అతడికి తెలుసు.

శర్మ టెలిఫోన్ ని ట్రాప్ లో పెట్టాక, శర్మమీద ఇద్దరు మనుష్యుల్ని నిఘా వుంచాక, ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ ఓపిగ్గా వేచి వుండటానికి నిశ్చయించుకున్నాడు. అతడికి పోలీస్ ట్రెయినింగ్ లో చెప్పారు- "ఎక్కడో ఒకచోట ఒక తప్పు చేసినవాడు మరొక తప్పు చేయకపోడు. చుట్టూ వలపన్ని వేచి వుంటే దొరక్కపోడు" అని.

హంతకుడు చాలా తెలివితేటల్తో ఈ హత్యచేశాడని అతడు గుర్తించాడు. ముంబాయినుంచి వచ్చే విమానం ఆలస్యమవకపోయి వుంటే అతడు అసలు బయట పడేవాడు కాదు.

రెండు రోజులవరకూ ఆచూకీ దొరకలేదు. శర్మకి వచ్చే ఫోన్ లన్నీ ట్రాప్ చేయబడుతున్నాయి. వాటిలో రవితేజ ఫోన్ లేదు. బహుశా శర్మకే అనుమానంవచ్చి తనింటికి ఫోన్ చేయవద్దని రవితేజకి చెప్పాడేమో అన్న అనుమానం కూడా అతడికి రాకపోలేదు.

మరో రోజు గడిచింది. రాజశేఖర్ అసహనం పెరగసాగింది. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండగా ఆ రోజు ఒక వూహించని సంఘటన జరిగింది.

శర్మకి వచ్చే ఫోన్ సంభాషణలన్నీ ఎప్పటికప్పుడు టేప్స్ ద్వారా అతడికి అందజేయబడుతున్నాయి. ఒక సంభాషణ దగ్గిర, ఆశ్చర్యంతో అతడు పొంగిపోయాడు. మాట్లాడుతున్నది రవితేజే! కానీ శర్మతో కాదు.

మిస్ విజయవాడతో...

అతడు తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు.....రవితేజ మాట్లాడుతున్నది శర్మ భార్యతో.

శర్మ భార్యే మిస్ విజయవాడ. రవితేజకి ఉత్తరం వ్రాసింది ఆమె!

రవితేజకీ, ఆమెకీ ఎప్పటినుంచో పరిచయం వుందన్నమాట!!

**అతడికి మరొక క్లూ దొరికింది.**

అతడు టేప్ ని మరింత ఆసక్తితో వినసాగాడు.

"నేను- రవితేజని.... ఆగండి ఫోన్ పెట్టెయ్యకండి...." అంటూ ఆ సంభాషణ మొదలైంది.

**ఇది** జరగటానికి సరిగ్గా నాలుగు రోజుల ముందర-

"నేనూ మొత్తం కేసు వివరాలన్నీ పరిశీలించాను" అన్నాడు రంగనాధం ఫైల్ మూస్తూ. రవితేజ అతడివైపు ఆత్రంగా చూస్తున్నాడు. పక్కనే శర్మ కూర్చుని వున్నాడు. తనకి రెండు రోజులు టైమ్ ఇమ్మని, తను అన్నీ చూసి ఏం చెయ్యాలో చెపుతాననీ రంగనాధం కోరాడు. శర్మ రవిని ఇంకో ప్రదేశంలో దాచాడు. ముందుచూపుతో రవిని తనింటికి ఫోన్ చెయ్యవద్దని కోరాడు. రంగనాధం చెప్పిన టైమ్ అయ్యాక రవిని తీసుకుని అతడి దగ్గరికి వెళ్ళాడు. అప్పటికి మాధవి మరణించి పదిరోజులు గడిచాయి. పేపర్లిక ఈ విషయం వ్రాయటం మానేశాయి. జనం కూడా మర్చిపోతున్నారు...

"మనం రెండు విధాలుగా వాదించవచ్చు. ఈ కేసుని" అంటూ కొనసాగించాడు రంగనాధం. విదేశాల్నుంచి రాగానే ముంబాయిలో దిగాననీ, మాధవి మరణంతో ఏ సంబంధమూ లేదని మనం అనొచ్చు. కానీ అలా అయితే రెండ్రోజులపాటు ముంబాయిలో ఏం చేశారన్న ప్రశ్న వస్తుంది సీ-రాక్ హోటల్ రిసెప్షనిస్టు చంద్రికా ప్రియదర్శిని మనకి వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తుంది. పైగా మీ డైరెక్టర్లే ఇక్కన్నుంచి ఫోన్ చేసినప్పుడు మీరు ఆ రాత్రి గదిలో లేరన్న విషయం రూఢి అయింది. పోలీసులకి ఆ విషయం కూడా తెలుసు. ఆ రాత్రంతా ముంబాయిలో తనతోబాటు వున్నట్టు మరెవరైనా సాక్ష్యం ఇవ్వవలసి వుంటుంది. ఏ బ్రోతల్ కైనా డబ్బిచ్చి సాక్ష్యానికి కురుర్చుకోవచ్చుగానీ రేపు-క్రాస్-ఎగ్జామినేషన్ లో ఆమె నిజం చెప్పేస్తే కష్టం-"

రవితేజ లాయర్ వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఈ సాక్ష్యాలని 'కుదుర్చుకోవడం' అతడికి తెలియని రంగం!

"అలా వద్దు. మనం జరిగింది జరిగినట్టు నిజం చెపుదాం" అన్నాడు రవితేజ. రంగనాధం శర్మవైపు చూశాడు. శర్మ లేచి వెళ్ళిపోబోయాడు. "శర్మగారు కూడా విననివ్వండి- ఫర్వాలేదు" అన్నాడు రవి. ఇంతవరకూ వచ్చాక ప్రియంవద విషయం దాచడం ఇష్టం లేకపోయింది అతడికి.

"నేనది కూడా ఆలోచించాను. విదేశాల్నుంచి మీరు సరాసరి హైద్రాబాద్ వచ్చేశారు. మారు పేరుతో రూమ్ తీసుకుని మీ ఆఫీసు అమ్మాయితో మూడురోజులు గడిపారు. మీ ఆఫీసువాళ్ళకి అనుమానం రాకుండా వుండడం కోసం, ఒకే ఊళ్ళో వుంటూ ముంబాయి నుంచి మాట్లాడినట్టు మాట్లాడారు. మీ భార్యగారు మరణించిన రోజు కూడా మీరు హోటల్లోనే వున్నారు. ఇదేనా జరిగింది-"

"అవును. అదే..."

"ఈ వాదనలో చాలా లొసుగులు కనపడుతున్నాయి. మీతోపాటు వున్నా ప్రియంవద ఏమైంది? మూడురోజులూ అయిపోగానే ఇంటికి రాకుండా మీరు ఏమయ్యారు? వారంరోజులపాటు ఎందుకు పరారీ అయ్యారు? మరీ "ఎయిర్ పోర్ట్ నుంచి" అని వచ్చే ముందు ఫోన్ చెయ్యవలసిన ఆగత్యం మీకేమొచ్చింది? ఒక అమ్మాయితో ఏకాంతంగా గడపడం తప్పుకాదే! దానికింత మూడు రోజులపాటు ఆమెని తీసుకుని నాగార్జునసాగరో వెళ్తే మిమ్మల్ని కాదనే

వారెవరు?.... ఇన్ని ప్రశ్నలొస్తాయి రేపు కోర్టులో..."

రవితేజ తలదించుకున్నాడు. ఇప్పుడీ లాయర్ అడుగుతూంటే నిజమే ననిపిస్తూంది కానీ, అప్పుడు అసలు తోచలేదు. ఆ 'వేడి'లో తనసలు పరిణామాలు ఆలోచించలేదు. ప్రియంవద ఏం చెప్పితే దానికి వప్పుకున్నాడు. నిజంగానే ఇన్ని అబద్ధాలు ఆడవలసిన ఆగత్యం ఏముంది?

-ఈ లోపులో రంగనాథం అన్నాడు-"అన్నిటికన్నా ముఖ్యమైనది ముంబాయిలో మీ పేరుమీద గది తీసుకున్నదెవరు అని...?"

"నాకు తెలీదు, భాస్కర్ అట ఎవరో-"

"అని మీరంటారు కాని ఇంత భయపడి ఇన్ని ఏర్పాట్లు చేసుకున్నవారు అది కూడా మీరే అరేంజ్ చేసుకున్నారని అనుకుంటారు ఎవరైనా! కనీసం అతడి సాక్ష్యమైనా మనం సంపాదించగలగాలి..."

శర్మ మధ్యలో కల్పించుకుని, "పోనీ, ప్రియంవదా, రవితేజ దిగిన హోటల్ లో వాళ్ళు సాక్ష్యం ఇస్తారు కదా".

రవి అన్నాడు- "ఎవరూ ఇవ్వరు ఎవరికీ నేను కనపడలేదు. పైగా రిజిష్టర్ లో చేతివ్రాత కూడా మార్చి వ్రాశాను".

"ఇవన్నీ గాక సుధాకర్ సాక్ష్యం ఒకటుంది. అర్ధరాత్రి మీలాటి వాడిని ఇంటివెనుక చూశానని అతను అంటున్నాడు".

"అబద్ధం".

"అని మీరంటే లాభంలేదు. సరే- ఇక అసలు విషయానికొచ్చి, నేను చెప్పదల్చుకున్నది చెపుతాను. మనకి రెండు మార్గాలున్నాయి. రెండింటిలో మీకేది బావుంటే అది నిర్ణయించుకోండి-" ఫైనల్ గా అన్నాడు లాయర్. రవితేజ ముందుకు వంగాడు.

"మనకున్న సాక్ష్యాలతో మీరు హంతకుడు కాదని మనం నిరూపించలేం" అన్నాడు రంగనాథం. "పోలీసులు కూడా అలాగే మీరు హంతకుడు అని నూటికి నూరుపాళ్ళు నిరూపించలేరు." వింటున్న ఇద్దరూ మాట్లాడలేదు.

"సాధారణంగా లాయర్లెవరూ వచ్చిన కేసుని వదిలిపెట్టరు. కానీ నేను అలాటివాడిని కాదు. నాకు డబ్బొక్కటే కాదు ముఖ్యం. మనం వున్న విషయం వున్నట్లు చర్చిద్దాం.... రవితేజ భార్య హిస్టీరియా పేషెంటు. ఆమె నోట్లోంచి నురగలు కూడా వస్తూవుంటాయని డాక్టరు చెపుతాడు. రవితేజ అన్నట్టు మనం కోర్టులో వున్నదున్నట్టు చెపుతాం. అంటే ప్రియంవదకీ, రవికీ సంబంధం వున్నదన్న విషయం కూడా ఒప్పుకుంటాం. ప్రియంవద చెంచురామయ్య మనిషనీ,

కేవలం ఈ కేసులో రవిని ఇరికించడానికి మాధవిని చంపారనీ మనం వాదిస్తాం. కానీ కోర్టు నమ్మదు. ఈ కేసులో రవితేజ మీద ద్వేషం వుంటే దానికి మాధవిని చంపవలసిన అవసరం చెంచురామయ్యకి లేదు. పోనీ రవిని మానసికంగా చిత్రహింస పెట్టటానికి చెంచురామయ్య ఈ ప్లాన్ వేశాడని అనడానికైనా, దానికంటే మంచి ప్లాన్ వెయ్యొచ్చు.....అన్నిటికన్నా ముఖ్యంగా, మీరీ ఊళ్ళో లేరని ఎస్టాబ్లిష్ చెయ్యటానికి చేసిన ప్రయత్నాలన్నీ మీకు వ్యతిరేకంగా పనిచేస్తాయి. మనకి "బెనిఫిట్ ఆఫ్ డవుట్" లభిస్తుంది అనికూడా నేను అనుకోవడం లేదు. మీ డైరీ, ఆఫీసులో ప్రియంవద పట్ల మీ అప్రవర్తన, ఇంట్లో విసుగు- ఇవన్నీ పోలీసులకి తెలుసు. రేపు ఇవన్నీ కోర్టులో వస్తాయి. పేపర్లో పడతాయి. చివరికి అంతో ఇంతో శిక్షకూసా తప్పదు. మనం పై కోర్టుకి వెళ్ళినా లాభం వుంటుందని నేను అనుకోను".

"అయితే ఏం చేద్దాం" అన్నాడు రవితేజ లాయర్ ఏం చెబుతున్నాడో అర్ధంకాక.

"మీకు బాగా డబ్బుంది. పరపతి వుంది. కొంతకాలం పాటు చీకట్లోకి వెళ్ళిపోండి-"

రవితేజ ఉలిక్కిపడ్డాడు. అమాయకంగా రంగనాథం వైపు చూశాడు. అతడు చెప్పేది మనసుకి పట్టటానికి రెండు నిమిషాలు కావలసి వచ్చింది. రవితేజ మొహంలో మారుతున్న భావాల్ని రంగనాథం గ్రహించి నవ్వేడు.

"మీకిదంతా షాకింగ్ గా వుండవచ్చు. ఇంటికి వెళ్ళి తీరిగ్గా ఆలోచించండి. పేపర్లు.... కోర్టులు....చివరికి శిక్ష.... దీనంతటి బదులు ఈ కేసు మూతపడేవరకూ అండర్ గ్రౌండ్ లో వుండటం మంచిదని నా సలహా... మనం మళ్ళీ రేపు కలుసుకుందాం" లేచాడు.

శర్మ, రవితేజ కూడా లేచారు. రంగనాథం అన్నట్టు అతడు డీప్ షాక్ లో వున్నాడు. ఇద్దరూ బయటకు నడిచి, కార్లో కూర్చున్నాక రవి ఏదో అనబోయాడు.

"వద్దు రవీ! ఇప్పుడేమీ చర్చించుకోవద్దు. కొంచెం ఆలోచిద్దాం" అన్నాడు శర్మ.

తన గదిలో కూర్చుని నాలుగుగంటలు ఆలోచించాక రంగనాథం మాటల్లోని చేదు వాస్తవం నెమ్మది నెమ్మదిగా అర్ధమవసాగింది. అతడు చెప్పింది నిజమే అనిపించసాగింది. తనిక ఎమ్.డి.గా ఎలాగూ కొనసాగలేదు. బెయిల్ తీసుకున్నా బయట ప్రపంచంలో తిరగలేడు. కేసు పూర్తవగానే జైలుకి వెళ్ళాలి ఇదీ తన భవిష్యత్తు.

చిన్న వెలుగు రేఖకూడా కనపడని అంధకారం తన భవిష్యత్తు శాశ్వతంగా మూతపడిపోయే సూచన...

కానీ అండర్ గ్రౌండంటే.

ఎంతకాలం తను పోలీసులకి దొరక్కుండా వుండగలడు? క్షణం క్షణం భయపడుతూ ఎంతకాలం బ్రతగ్గలడు?

దానికి సమాధానం అతడికి సాయంత్రం దొరికింది. దాదాపు గ్రౌండ్ వర్క్ అంతా పూర్తిచేసుకుని వచ్చాడు శర్మ. రవితేజ ఎంతో భయపడిన విషయాలన్నీ చాలా సులువుగా నెరవేరాయి. భారతదేశంలో డబ్బు చేయలేనిది ఏదీ లేదని మరోసారి నిరూపణ అయ్యింది. కొంతకాలం పాటు సింగపూర్ లో వుంటాడు రవితేజ..... మరో పేరుతో..... పాస్ పోర్ట్ రెండు రోజుల్లో తయారవుతుంది. విదేశాల్లో కొత్త జీవితం ప్రారంభిస్తాడు. పోలీసు రికార్డుల్లో కేసు సాధ్యమైనంత తొందర్లో మూతపడేలా లాయర్ రంగనాథం చూస్తాడు. దానికి కూడా ఖర్చవుతుంది.

అంత విషాదంలో కూడా రవితేజకి నవ్వొచ్చింది. ఎక్కడ ప్రారంభమైన జీవితం ఎటు వెళ్ళి ఎక్కడ సమాప్తమవుతుంది? ఎత్తులూ-పల్లాలూ ఆనందపు టంచులు.... విషాదపు లోయలు...

తన జీవితంలో పరిపూర్ణమైన ఆనందం ఎప్పుడయినా లభించిందా అని అతను అనుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుదల- మిస్ విజయవాడ దగ్గర్నుంచి ఉత్తరం-ప్రియంవదతో రెండు రోజులు- అన్నీ తాత్కాలికంగా ఆనందం యిచ్చి చివర్లో వేదనగా మిగిలిపోయేవే. ఆనందం ఇచ్చే ప్రతీ విషయం వెనుక విషాదం వుంటుంది కాబోలు. అతడు విరక్తిగా నవ్వుకొన్నాడు.

మరో రెండ్రోజులు గడిచేసరికి మొత్తం రంగం సిద్ధమైంది. రవి ప్రమేయం లేకుండానే అతడి జీవితాన్ని విధి తన చేతుల్లోకి తీసుకుంది. అతడికిప్పుడు భయం కూడా వెయ్యడంలేదు. నిండా మునిగినవాడి పరిస్థితి పాస్ పోర్టులో తన మారుపేరు ఏమిటో, తన భవిష్యత్తు జీవితమంతా ఏ పేరుతో గడపాలి అన్నది కూడా తెలుసుకోవాలని ఉత్సాహం లేనంత నిరాసక్తత అతడిని ఆవరించింది.

అతడి ప్రయాణమంతా ఒక ఏజెన్సీకి అప్పగించబడింది. ఇటువంటి విషయాలలో ఆ ఏజెన్సీకి చాలా అనుభవం వుంది. ఈ ప్రయాణం సంగతి తెలిసినవాళ్ళు లాయర్ రంగనాథం, శర్మ.... ఇద్దరే.

ఇన్ని కష్టాల్లో కూడా రవి మనసు తన శ్రేయోభిలాషుల పట్ల కృతజ్ఞత నిండిపోయింది. ఎన్నో పనులు అతి జాగ్రత్తగా చెయ్యబడుతున్నాయి ఎవరికీ అనుమానం రాకుండా.....

## 31

**అతడు** దేశాన్ని వదిలి వెళ్ళాల్సిన సమయం దగ్గిరయ్యే కొద్దీ ఆందోళన కూడా ఎక్కువ అవసాగింది. బయట ప్రపంచంతో సంబంధం లేకపోయినా, అతడు రోజూ దినపత్రికలు చదువుతూ వుండటం మాత్రం కొనసాగింది. అతడి గురించిగానీ, మాధవి మరణం గురించిగానీ పేపర్లలో ఇంకేమీ రావటం లేదు. అతఃడు చూసేది షేర్ మార్కెట్లు.

అతడికి ఆశ్చర్యం గొలిపేలా, షేర్ ధర బాగా పడిపోయింది. ప్రస్తుతం తనున్న స్థితికి జాలిపడాలో, లేక తను లేక పోగానే తన కంపెనీ భవిష్యత్తులో ఎలా మారుతున్నదో ఇప్పుడే కనపడుతున్న ఉదాహరణగా చూసి గర్వపడాలో అతడికి అర్థంకాలేదు. అతడు లేకపోతే 'రవితేజ టెక్స్ టైల్స్' లేదు అని ప్రజలు అనుకొంటున్నారన్న విషయం మాత్రం స్పష్టమైంది. షేర్ ధర పడిపోవటానికి అదే కారణం.

మిగతా కార్యక్రమాలన్నీ కూడా జాగ్రత్తగా పూర్తయ్యాయి. అసలలాంటి ఏజెన్సీ కూడా ఒకటున్నదని తెలియని రవితేజ, ఆ ఏజెన్సీ చేస్తున్న ఏర్పాట్లు చూసి ఆశ్చర్యంతో తలమునకలయ్యాడు. దొంగ పాస్ పోర్టు ఏర్పాటు చేయటమే కాదు. అతను వెళ్ళే దేశంలో కొంతకాలం నివసించటానికి డాలర్లు, మిగతా విషయాలు కూడా ఆ ఏజెన్సీయే చూసుకొంది. దీనికయ్యే ఖర్చు మాత్రం రూపాయల్లో వాళ్ళ దగ్గిర తీసుకుంది. పాత తారీఖు వేసి తన షేర్లు అమ్మేసినట్టు రవితేజ వ్రాసిచ్చాడు. అలాగే పదిసంవత్సరాల క్రితం శర్మతో చేసుకున్న అగ్రిమెంటు కాగితాలన్నీ చింపివేయబడ్డాయి. లావాదేవీలన్నీ రహస్యంగా పూర్తయ్యాయి. అతడికున్న స్థిరాస్తుల విషయంలో మాత్రం ఏమీ చెయ్యలేకపోయాడు. మరి రెండు-మూడు సంవత్సరాలు పోయాక వాటి విషయం చూసుకోవచ్చని ఏజెన్సీ వాళ్ళు సలహా యిచ్చారు.

వెళ్ళవలసిన రోజు వచ్చింది.

అంతకుముందు రోజు రాత్రి... అతడికి నిద్రపట్టలేదు.

అతడు ఒక చిన్న బంగ్లాలో ఒంటరిగా వుంటున్నాడు. వాచ్ మెన్ కూడా లేడు. చివరి క్షణం వరకూ అతడి విషయం మూడోకంటికి తెలియనివ్వకుండా జాగ్రత్తపడాలని ఏజెన్సీవాళ్ళు సలహా ఇచ్చారు. అందుకే వాచ్ మెన్ ని నియమించలేదు.

రాత్రి పదయింది.

అతడికి పిచ్చి పిచ్చిగా వుంది.

మొన్న మొన్నటివరకూ అనుభవించిన పొజిషను, సమాజంలో గౌరవం, అంతస్థు... అన్నీ పోయాయన్నది ఇప్పుడిప్పుడే అర్థమై, దొంగ బ్రతుకులో ఎంత మానసిక క్షోభ వుంటుందో తెలుస్తోంది. తను మెంబరుగా వున్న ప్రతి క్లబ్ లో తనకు తెలిసిన ప్రతి పరిచయస్తుని కంపెనీలో ఇదంతా టాపిక్ గా చర్చించబడిందని, చర్చించబడుతోందని అతడికి తెలుసు. 'మన మధ్య మొన్న మొన్నటివరకూ పెద్దమనిషిలా తిరిగిన రవితేజ ఇలాటివాడా? ఏమో! ఇంత ప్రమాదకరమైన వ్యక్తిని మేము అనుకోలేదు సుమా!' అని ప్రతి ఒక్కరు భయం, తనపట్ల అసహ్యంగా ప్రకటించి వుంటారనికూడా అతడికి తెలుసు. తన హీనస్థితికి తనమీద తనకే జాలివేసింది. తన నిర్దోషిత్వాన్ని కనీసం ఒక్కసారి కూడా చెప్పుకోలేని పరిస్థితి ఇది. తనకింత సాయం చేస్తున్న శర్మ కూడా తను చెప్పిందంతా నిజమని నమ్మాడో లేదో

తెలీదు. పైకి మాత్రం ఆ టాపిక్ మరి తేలేదు. బహుశా తనను హర్ట్ చెయ్యటం ఇష్టం లేకేమో!

తనకంటూ ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. కొన్నాళ్ళకి తన గురించి అందరూ మరిచిపోతారు కూడా. అందరి మనసుల్లోనూ తనో పారిపోయిన హంతకుడిగా శాశ్వతంగా ముద్ర వుండిపోతుంది. భవిష్యత్తులో ఇంత ఆస్తి హోదా లేకపోయినా తనకున్న ఆర్ట్ కి, విదేశాల్లో ఏదో ఒక చిన్న ఉద్యోగం దొరికి జీవితం సాగిపోకపోదు.

అతడు ఒక్కడు- కనీసం ఒక్కరికి తన నిర్దోషిత్వం గురించి చెప్పాలను కున్నాడు. ఆ ఒక్కరు- మిస్ విజయవాడ!

ప్రపంచమంతా తన గురించి చెడ్డగా అనుకొన్నా ఫర్వాలేదు, ఆమె ఒక్కరూ నిజాన్ని తెలుసుకోగలిగితే చాలు.

ఆమె అతడికి ఏమీకాదు. ఆమె ఎలా వుంటుందో కూడా అతడికి తెలీదు. ఒక అద్భుతమైన ఉత్తరంతో అతడి మనసులో నిద్రాణమై వున్న ప్రేమ దాహాన్ని మేల్కొలిపి, పెద్ద వృక్షంగా మార్చింది ఆమె. ఆమె ఇప్పుడు తన గురించి ఏమనుకుంటూ వుంటుంది? స్వంత భార్యనే హత్య చేసిన హంతకుడినా తను ప్రేమించానని అనుకుని బాధపడుతుందా? తనపట్ల అసహ్యాన్ని పెంచుకుంటుందా?

అతడి కోర్కె క్షణక్షణానికి వృద్ధి కాసాగింది. ఆ రాత్రి అతడికి నిద్ర దూరమైంది. పదకొండు అయ్యేసరికి మరి ఆగలేకపోయాడు. శర్మగారున్నారేమో ఆయన ఫోన్ ఎత్తుతారేమో అని కూడా ఆలోచించలేదు.

బంగ్లానుంచి బయటకొచ్చాడు. వీధి నిర్మానుష్యంగా వుంది. రోడ్డు చివర ఒక ఇరానీ హోటల్లో ఫోన్ కనపడింది. డయల్ చేస్తుంటే అతడి వేళ్ళు వణికాయి. "హల్లో" అని అట్నుంచి వినిపించింది. వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

"హల్లో.... మిసెస్ శర్మా హియర్!"

'నేను రవితేజని....ఆగండి, ఫోన్ పెట్టేయకండి, ప్లీజ్!" అన్నాడు తొందర తొందరగా.

ఆ మాటలు చెప్పగానే అటునుంచి సంచలనం అతడు ఊహించగలిగినాడు.

"ఫోన్ పెట్టేయకండి. ఇదే ఆఖరిసారి నేను మాట్లాడటం. ముందు ముందు మిమ్మల్ని విసిగించను. రేపే నేనీ దేశంనుంచి వెళ్ళిపోతున్నాను. వెళ్ళిపోయే ముందు కనీసం మీ ఒక్కరికయినా నేను మర్డరర్ ని కానని చెప్పుకోవాలని ఇలా ఫోన్ చేస్తున్నాను. అంతే తప్ప ఇంకేమీ కాదు". అటునుంచి సమాధానం లేదు. "హల్లో" అన్నాడు.

"చెప్పండి, వింటున్నాను". అదే స్వరం నెమ్మదిగా వినిపించింది. ఆ కంఠంలో కంపనాన్నిబట్టి, ఈ అర్ధరాత్రి

తననుంచి వచ్చిన ఫోన్ కాల్ ఆమెను ఎటువంటి స్థితిలో పెట్టిందో అతడు ఊహించుకున్నాడు. అయినా కూడా ఏదో తెలియని నిబ్బరం ఆ కంఠంలో కనపడుతోంది. ఉత్తరంలో కనపడిన ప్రేమ ఆ కంఠంలో ధ్వనిస్తూ వుండగా, "నా కెందుకో మీరు హత్య చెయ్యలేదనే అనిపించింది. రవీ" అంది మృదువుగా అతడికి ఒక్కసారి మనసులో దిగులంతా తొలగిపోయినట్టు అనిపించింది.

'చాలు, చాలు!' అనుకున్నాడు. "నా కంటూ ఎవరూ మిగల్లేదు నా గురించి మీరొక్కరూ మంచిగా అనుకుంటే చాలు. నా మంచితనం మీద నమ్మకం వున్నవాళ్ళు ఒకరైనా వున్నారు".

అతడికి వెయ్యి ఏనుగుల ధైర్యం వచ్చింది. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ జరిగింది జరిగినట్లు చెప్పాడు. ఎక్కడ ఏదీ వదల్లేదు.

అంతా చెప్పి, "ఇదీ జరిగింది. మీరు వ్రాసిన ఉత్తరంతో మొదలైన అలజడి, ప్రియంవద మీద ప్రేమలాటి భ్రమతో ఉధృతమై తుఫానుగా మారింది. దానిలో ఇలా కొట్టుకుపోతున్నాను". పేలవమైన నవ్వు మిళితం చేసి అన్నాడు.

ఆమెకిది షాక్. దానినుంచి తేరుకోవడానికి కొంచెం సేపు పట్టింది. ఆమె తన మనసులో ఇలా అనుకుంది..... "అయామ్ సారీ- అన్న అయిదక్షరాలతో జరిగిన దాన్నలా కొట్టిపడెయ్యలేను రవీ! కానీ నేనెటువంటి పరిస్థితుల్లో ఆ ఉత్తరం వ్రాశానో మళ్ళీ ఆ ప్రభావం నుంచి బయటకు వచ్చి మనసు కంట్రోలు చేసుకోవటానికి ఎంత కష్టపడ్డానో ఈ అర్ధరాత్రి ఈ ఫోన్ లో ఎలా వివరించను? ఎంత వివరించినా మీకు జరిగిపోయిన నష్టం పూడదుకదా!"

"ఎక్కడున్నావ్ రవీ, నువ్వు?"

"ఎందుకు?"

"నేను వస్తున్నాను".

"ఇప్పుడా?"

"అవును. ఇప్పుడే!"

"వద్దు, వద్దు" అన్నాడతడు.

"అదేమిటి రవీ?"

అతడు సమాధానం చెప్పటానికి తటపటాయించాడు. ఆమెని కూడా ప్రమాదంలోకి లాగటం అతఃడికి ఇష్టంలేదు. అయినా ముఖ్య కారణం అదికాదు. ఆ ఊరు. ఈ దేశం, ఈ మనుష్యులు అన్నీ వదిలేస్తూ అతడు దూరంగా వెళ్ళిపోవటానికి మానసికంగా తయారవుతున్నాడు. అటువంటి పరిస్థితుల్లో ఆమెను చూడటం అతడికి ఇష్టంలేదు.

అతడికి WHOSE LIFE IS IT ANY WAY అన్న ఆంగ్ల చిత్రం గుర్తొచ్చింది. అందులో కథానాయకుడు మంచి చిత్రకారుడు. ప్రకృతిని ఆరాధించే యువకుడు అతడికి జీవితం పూలపాన్పు అటువంటి సమయంలో ఒక ఆక్సిడెంట్ జరిగి, మెడనుంచి క్రింది భాగమంతా పూర్తిగా చచ్చుబడిపోతుంది. కేవలం తల ఒకటే కదలగల స్థితిలో వుంటుంది. అతడి ప్రియురాలు మరొక కుర్రవాడి ప్రేమలో పడి అతడిని వదిలేసి వెళ్ళిపోతుంది. అతడు తను చనిపోవటానికి అనుమతి నివ్వమని కోర్టుని కోరుకుంటాడు. జడ్జి హాస్పటల్ కి వచ్చి అతని వాదన వింటాడు. తనెందుకు చనిపోవాలనుకుంటున్నాడో అతడు కరుణాపూరితంగా వాదిస్తాడు. అతడీ మెర్సీకిల్లింగ్ కి కోర్టు ఒప్పుకుంటుంది. అతడిని ట్రీట్ చేస్తున్న డాక్టరు ఆర్ధ్రతతో కదిలిపోతుంది. నీళ్ళు నిండిన కళ్ళతో అతడిని ముద్దు పెట్టుకోవటానికి ముందుకు వంగుతుంది. అతడు వద్దంటాడు. "ఈ ప్రకృతీ-ఈ పూలు- ఈ వర్షం రాత్రులు- నా కిష్టమైన చిత్రాలు.... అన్నిటినుంచీ శలవు తీసుకుంటున్నాను. జీవితం అంటే ఏమీలేదు అన్న వైరాగ్యభావాన్ని బలవంతంగా పెంచుకుంటూ మరణాన్ని ఆహ్వానిస్తున్న నన్ను, మీ యీ ముద్దు తిరిగి జీవితంలోకి లాగుతుంది. జీవించాలనే ఆశ పెంచుతుంది. వద్దు...." అని అంటాడు.

రావితేజకి అలాటి భావమే కలిగింది. ఈ పరిసరాల్నుంచే దూరంగా పారిపోతున్నప్పుడు తిరిగి 'బెంగ' కలిగించే అనుభవాలు ఎందుకు? తన మనసులో భావాలు ఆమెకి చెప్పలేదు. క్లుప్తంగా 'వద్దు' అన్నాడు. "మనం ఇంతవరకూ ఒక్కసారి కూడా కలుసుకోలేదు. నాకు మీ పేరుకూడా తెలీదు. ఇదేదో తెలియని బంధం నేను హత్యా చేయలేదన్న సంగతి మీ రొక్కరూ నమ్మితే చాలని ఫోన్ చేయించింది. ఉంటాను...."

"రవీ...."

"చెప్పండి".

"మరొక్కసారి ఆలోచించండి. ఇలా పారిపోవటం కన్నా కోర్టుకి వెళ్ళి తేల్చుకోవటం మంచిదేమో...."

"ఆ విషయం చాలా ఆలోచించాను. ఈ మనుష్యుల తిరస్కారాన్నీ, కోర్టునీ నేను ఫేస్ చేయలేను. ఉంటాను-" ఫోన్ పెట్టేశాడు.

ఇన్ స్పెక్టర్ విన్నది ఈ ఫోన్ కాల్ నే!

శర్మ ఇంటికొచ్చే ఫోన్ కాల్స్ అన్నీ ట్రేస్ చేసి, ఎప్పటి కప్పుడు టేపులతో సహా అతడికి పంపబడుతున్నాయి.

మొదట శర్మ భార్యే 'మిస్ విజయవాడ' అని తెలియగానే అతడికి షాక్ తగిలినట్టు అయింది. వీళ్ళిద్దరికీ మధ్య చాలాకాలం నుంచి అఫైర్ వుందన్నమాట అనుకున్నాడు. కానీ ఆమె సంభాషణ పూర్తిగా విన్న తరువాత, వాళ్ళు ఒక్కసారి కూడా కలుసుకోలేదని అర్థమైంది.

ఇక అతడు దాని గురించి ఆలోచించటం మానేశాడు.

అతడు ఆలోచిస్తున్నది రవితేజ ఆమెకి చెప్పిన కథ గురించి! అతడు చెప్పినదంతా వాస్తవమైతే నిజంగానే రవితేజ మెడలోతు 'ఊబి' లో కూరుకుపోయాడు. ఇన్ స్పెక్టర్ కి జాలేసింది. ఎంతో తెలివైన వాళ్ళు అనుకునే వాళ్ళు, వాళ్ళ వాళ్ళ రంగాల్లో నిష్ణాతులైన వాళ్ళు కొన్ని కొన్ని విషయాల్లో ఎంతో గొప్పగా, గొప్ప తెలివితేటల్తో ప్లాన్ చేశామనుకుంటూనే గోతిలో పడుతూ వుంటారు.

రవితేజ చెప్పినదాన్లో ఎంతవరకూ నిజముందో తెలుసుకోవడం కోసం అతడు వెంటనే ప్రయత్నాలు ప్రారంభించాడు. రాత్రి పన్నెండయింది అప్పుడు. అయినా అతడు రేపటివరకూ ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయలేదు. ఆ ఊళ్ళో వున్న పన్నెండు పెద్ద హోటల్స్ కీ వెళ్ళాడు. ఓపిగ్గా పాత రిజిస్టర్లు తీయించాడు.....ఆ డిపార్టుమెంట్ లో చాలా తక్కువగా వుండే నిజాయితీపరుల్లో అతనొక్కడు. డ్యూటీ అంటే గౌరవం వున్నవాడు. మొత్తం 12 హోటల్స్ లోనూ జంటగా దిగి, ఆ మూడురోజులు వున్నవాళ్ళు ఎంతమంది అని చూశాడు. మూడు జంటలు కనపడ్డాయి. మాధవి చనిపోయిన రోజు మధ్యాహ్నం ఖాళీచేసిన జంటలు అందులో రెండు తేలాయి. రెండూ తప్పు అడ్రసులు ఇచ్చినవే.

అతడు హోటల్ బుక్స్ చూశాడు. ఒక జంట రాత్రిపూట డిన్నర్ కి బయటికి వెళ్ళింది. రవితేజ, ప్రియంవద అలా వెళ్ళి వుండరు- అని అతడు వూహించాడు. కాబట్టి ఆ జంట కాదు.

అలా చివరికి ఒక జంట మిగిలింది.

.... ఆ గదినుంచి బయటకు వెళ్ళిన ఫోన్ లు ఎన్ని? అని చూశాడు.

.....రూమ్ ఖాళీ చేయటానికి అయిదు నిముషాలు ముందు ఆ గదినుంచి బయటకు ఒక ఫోన్ వెళ్ళింది.

....దాని నెంబరు చూశాడు.

రవితేజ ఇంటి నెంబరు అది!

అంటే- తనూ ప్రియంవదా ఇక్కడే గడిపామని రవితేజ చెప్పిన విషయం వాస్తవమే! కనీసం అక్కడివరకూ అతడు నిజం చెప్పాడు. ఇంకా తెలవవలసింది అతడు తన భార్యని హత్య చేశాడా లేదా అన్నది!

## 32

**ఇక్కడ** ఇన్ స్పెక్టర్ ఎంక్వయిరీ చేస్తున్న సమయానికి అక్కడ రవితేజ ఆమెతో సంభాషణ ముగించి బయట రోడ్డు మీద తిరుగుతున్నాడు. అర్ధరాత్రి దాటింది. ఈ దేశంలో అతడికి అది ఆఖరి రాత్రి. విదేశాల్లో తన ఆచూకీ తెలుసుకుని పోలీసులు పట్టుకుంటే మళ్ళీ ఈ దేశం వస్తాడు. ఇలా స్వేచ్ఛగా తిరగటానికి కాదు. లాకప్పు, కోర్టు, జైలు- వీటిలో గడపటానికి.

అతడు తన భవంతి ముందు నిలబడ్డాడు.

చీకట్లో ఎత్తుగా, నీడలా మధ్య నల్లగా పోయిన తన పరువులా వుంది ఆ భవంతి. నేలమీద నిద్రస్థాయినుంచి ఎయిర్ కండిషన్ బెడ్ రూమ్ స్థాయికి వెళ్ళిన తన జీవితం, పరమపద సోపానంలో క్రిందికి దిగిపోయింది. అతడికిప్పుడు ప్రియంవద మీద కూడా కోపంలేదు. ఆమె కూడా ఆ ఆటలో ఒక పావుగా ప్రాణం పోగొట్టుకుంది. అతడికి తనమీద తనకే కోపంగా వుంది.

తన భవంతి నుంచి, తను ఇప్పటివరకూ గడిపిన గెస్ట్ హౌస్ కి ఆ ఆఖరి రాత్రి గడపటానికి వెళ్తూ వుంటే- ఎడమ పక్కన కనబడింది -శ్మశానం.

అక్కడే మాధవిని దహనం చేసింది అతడికి శర్మ చెప్పాడు.

అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని ఆ శ్మశానానికి పరదాలా కప్పేసి, సమాధుల మధ్యనుంచి వీచే గాలి వెదురు బొంగుల్లో చేరి ఈలాగా మారి, కీచురాళ్ళ లయకి పాటగా నాట్యం చేస్తూంది చీకటి! అతడికి భయం వేయలేదు. అతడే ఒక ప్రేతంలా వున్నాడు. దూరంగా కుక్క ఏడుస్తోంది. కాటికాపరి లేడు.

అతడు లోపలికి ప్రవేశించాడు. పాతిక సంవత్సరాలు కలిసి పెరిగి తనతోపాటు పది సంవత్సరాలు కాపురం చేసిన మాధవి ఇక్కడే ఎక్కడో బూడిదగా మారి వుంటుంది. ఈ మట్టిలోనే ఎక్కడో ఆమె తాలూకు చితాభస్మం కలిసిపోయి వుంటుంది. ఇన్ని సమాధుల మధ్య ఎక్కడని వెతుకుతాడు? బ్రతికి వుండగా మనసులో ఏముందో వెతికి పట్టుకోలేకపోయాడు! ఇప్పుడు మరణించాక ఎలా తెలుసుకుంటాడు?

అదే వాక్యం-

ఒకే దిండుమీద నిద్రించిన మన రెండు తలలు.....ఉత్తర దక్షిణ ధృవాలు! నువ్వు చనిపోయి నన్ను నాకు వదిలిపెట్టి వెళ్ళాక తీరిగ్గా నన్ను నేను పరిశీలించుకునే వీలు దొరికింది. నీ మీద కోపం పోయాక నీ వైపునుంచి ఆలోచించే విశాలత్వం అలవడింది. ఆదిలో నేను- అంతంలో నువ్వు- మధ్యలో నీ సమాధిమీద వెలుగుతున్న దీపం. నా మనసులో చీకటిని పరిహసిస్తూ అది పారద్రోలుతుంది. మన వైవాహిక జీవితంలో నువ్వు నాకేమిచ్చావు అన్న ప్రశ్న సరే. అది అటుంచు నేను నీకేమీ చేశాను అన్న ప్రశ్న విశ్వరూపం దాల్చి నన్ను చీల్చి చెండాడుతూ వుంది. నువ్వు మూఢురాలివన్న నా మూర్ఖత్వంనుంచి నేను బయటపడుతున్నాను. నా కష్టాన్ని నువ్వు అర్థం చేసుకోలేదనే నేను చితించాను తప్ప నీ స్థాయికి దిగివచ్చి (చూశావా! 'దిగిరావటం' అన్న పద ప్రయోగం మళ్ళీ నా అహాన్ని సూచిస్తుంది.) నిన్ను నాతోపాటు తీసుకువెళ్ళే ప్రయత్నం ఏదీ చేయలేకపోయాను. నిద్రపోతున్న అంధకారాన్ని ఉషస్సు మేల్కొలిపే దాకా వెలుగు రేఖ యెలా విచ్చుకోదో, అలాగే మరణం చివరి అంచువరకూ నడిచేదాకా నాకు బ్రతుకులో సమన్వయం అర్థంకాలేదు. అర్ధరాత్రి అరవై మంది అతిథుల మధ్య అరపెగ్గు తాగుతూ, 'ఆహా' డబ్బు ఆర్జిస్తున్నానని అహంతో ఆత్మవంచన చేసుకునే నేను.....అదే రాత్రి ఆత్మీయత కరువైన పక్కమీద, బెడ్ లాంప్ ఓదార్పుతో ఒంటరిగా పడుకుని, నేను రాగానే, ఆ చిరాకుని అసంతృప్తిగా ప్రకటించే నీ మీద విసుక్కునే హక్కుని ఎలా కలిగివున్నాను? పక్క డైరెక్టరు కొన్న కొత్త కారు బావుందని ఒకసారి డ్రైవ్ చేసి  చూసి అభినందించే నేను, పక్కింటావిడ కొన్న కొత్త నగ బావుందని నువ్వు మెళ్ళో వేసుకుంటే చీదరించుకుంటానెందుకు? మీరు కట్టుకున్న టై బావుందని ఒకమ్మాయి అంటే గర్వంగా నవ్వుకునే నేను- మీరీ చీరెలో బావున్నారని నిన్నెవరైనా అంటే ఉడుక్కున్నానెందుకు? మాయమైన గతం నుంచి నాకు సంకేతం వస్తుంది. వాస్తవం బీడుమీద నా కన్నీరుపడి హృదయాన్ని చీల్చుకుని పశ్చాత్తాపం మొలకవెల్వడుతూంది. జీవితయాత్ర, మృత్యుద్వారం గుండా వెళుతూన్న సమయాన మాత్రమే శాశ్వత నిత్యసత్యాలు గోచరమవుతాయి. నీ స్నేహితుడు నీకు ప్రేమ గురించి వ్రాసిన ఉత్తరం చదివి, ఇద్దరు అజ్ఞానులు చేరి జ్ఞానం గురించి మాట్లాడుకున్నట్టుంది అని నవ్వుకున్నాను. నా ప్రియురాలు నాకు వ్రాసిన ఉత్తరం చదివి ఎంత అదృష్టవంతుడిని అని పొంగిపోయాను. ఒకే తప్పు ఇద్దరు చేసినప్పుడు ఆ ఉత్తరం కృష్ణశాస్త్రిలా వ్రాసినా కృష్ణారెడ్డిలా వ్రాసినా, తప్పు తప్పేకదా అన్న సత్యాన్ని మర్చిపోయాను. నువ్వు దక్షిణ ప్రాంగణంలో కూర్చున్నప్పుడు నేను ఉత్తర శ్మశానంలో వెతికాను. ఎవరో కవి అన్నట్టు-

"నీకు సత్యం అర్థవంతం.
నాకు నిజం భయంకరం...
ఏ కేంద్రంలో మనిద్దరం కలుసుకోవటం?
ఓ ప్రత్యూష పవనంలోని మందార లతాంతమా!
నేను ప్రదోషవేళా తమాల శాఖాగ్ర ఘూకాన్ని
అటు-ఆనంద సుధర్మవైపు నువ్వు వెళ్ళు.
నక్షత్రధూళిని జల్లుతూ....
ఇటు-కలల బూడిద రాసులమీదనే
కూలబడతా నే కన్నీళ్ళు చిమ్ముతూ"

ఎన్నివేల సమాధులు ఇక్కడ, ఎన్ని వందల చితులు ఇక్కడ ఎంతమంది విభిన్న మనస్కులు అవతలివారితో రాజీ పడలేక, మృత్యువుతో రాజీపడ్డారో, ఎంతమంది ప్రేమార్తులు చితిమంటలో చల్లారిపోయారో, ఓ నా ప్రియబాంధవీ నన్నుక్షమించు. నాతి చరామి అన్న మాటకు నేను న్యాయం చేకూర్చలేకపోయాను. పెళ్ళయిన రోజునుంచీ నిన్నొక మనిషిగా చూడలేకపోయాను. నీకూ ఒక మనసు వుంటుందనీ, దానికీ కొన్ని కోర్కెలుంటాయనీ తెలుసుకోలేకపోయాను. నా అజ్ఞాతపు నేత్రాలతో నీలోని మూర్ఖత్వాన్నే చూశాను తప్ప, నా జ్ఞాన చక్షువుతో నీ అంతరంగాన్ని గ్రహించలేకపోయాను. కన్నీళ్ళతో విమానాశ్రయంలో తన భర్తకి వీడ్కోలు ఇస్తున్న ఇల్లాలైన్ చూశాను తప్ప- నా ఎడబాటులో నా భార్య కళ్ళలో కనీసం ఒక చుక్క నీటిని కూడా తెప్పించలేకపోయిన నా ప్రేమ రాహిత్యాన్ని గుర్తించలేకపోయాను. కాలిన చేతుల్తో, ఆకులకోసం వెతక్కుండా, దోసిలిబట్టి గుర్తు తెలియని నీ సమాధిముందు నిలబడి క్షమాపణ వేడుకుంటున్నాను. నన్ను క్షమించు నన్ను అసహ్యించుకోకు. జాలిపడు.....వెళ్ళొస్తాను" అతడు లేచి తూలుకుంటూ శ్మశానం నుంచి బయటకు వచ్చాడు.

* * *

అతడు ఆ సందులోంచి మెయిన్ రోడ్డుకొచ్చి అక్కడి వాతావరణం చూసి ఆశ్చర్యపోయాడు. అప్పటివరకూ నిర్మానుష్యంగా వున్న వీధులు ఒక్కసారిగా రద్దీగా కనపడినయ్. స్కూటర్లు, కారుహారన్లు, జనం....అర్ధరాత్రి అకస్మాత్తుగా అంతమంది జనం బయటికి ఎందుకు వచ్చారో అతడికి అర్ధంకాలేదు. వాళ్ళ అరుపులు విన్నాడు.

"హాపీ న్యూ ఇయర్...." అని పరస్పరం అభినందించుకుంటూ అరుచుకుంటూ జనం సాగిపోతున్నారు. ఆరోజు కొత్త సంవత్సరం అడుగిడబోతూ వుందని అతడికి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. జనవరి ఒకటో తారీఖునే తన ప్రయాణం ఎందుకు నిర్ణయింపబడిందో కూడా అతడికి అర్ధమైంది. ఆ రోజు ప్రభుత్వాధికారులు ఎక్కువమంది నిషా వుండరు. "హాలీడే మూడ్" లో వుంటారు. ఒక స్కూటరిస్టు పక్కనుంచి సాగిపోతూ ఒంటరిగా నడిచి వెళుతూన్న అతడిని చూసి "హాపీ న్యూ ఇయర్" అన్నాడు. రావితేజకి నవ్వొచ్చింది. "హాపీ-హాపీ" అన్నాడు- నాకెలాగూ లేదు. నువ్వైనా ఆనందంగా వుండు బ్రదర్- అన్న ధోరణిలో.

అంతలో అతడి పక్కనుంచి ఒక కారువేగంగా దూసుకు పోయింది. ఫుల్ మందులో వున్నట్టున్నారు లోపలివాళ్ళు. స్టీరింగు అస్తవ్యస్తంగా తిప్పుతూ నడుపుతున్నారు. కారు లోపల్నుంచి నవ్వులు బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఎలక్ట్రికల్ పోల్ పక్కనుంచి వెంట్రుక వాసిలో తప్పించుకుని ముందుకు వెళ్ళింది. నడిపే వాళ్ళకే కాదు. ఆ కారుకే ఆనందం ఎక్కువైనట్టుంది.

అతడికి మిస్ విజయవాడ పంపిన కాగితం గుర్తొచ్చింది. ఆ కొటేషన్ ను కొద్దిగా మార్చి అనుకున్నాడు.

"బిగ్గరగా నవ్వటంలో పొలమారే రిస్క్ వుంది.
మందు ఎక్కువైతే ఆక్సిడెంట్ రిస్క్ వుంది.

భార్యని కాదని బయటకు పోవటంలో నిలువు
లోతు బురదలో నడుము విరిగే రిస్క్ వుంది".

మరో రెండు నిముషాలు నడిచి మలుపు తిరిగాడు. అక్కడ రోడ్డు పక్క జనం గుంపుగా చేరి చూస్తున్నారు. అంతకుముందు అతడి పక్కనుంచి తూలుకుంటూ వెళ్ళిన కారు ఎదురుగా వచ్చే మరో కారుని ఢీకొంది అదీ గొడవ.

పెద్దగా ఎవరికి దెబ్బలు తగల్లేదు. అతడు ఆ స్పాట్ కి చేరుకునే సరికి రెండు కార్లవాళ్ళూ ఒకళ్ళ నొకళ్ళు తిట్టుకుంటూ కస్త రివర్సు చేసుకొని ముందుకు వెళ్ళటానికి ఆయత్తమవుతున్నారు. రెండు కార్లు ముందు భాగాలూ బాగా చొట్టలు పడ్డాయి. మామూలు పరిస్థితుల్లో అయితే పోలీసు కేసులూ గొడవా అయ్యేవేమోగానీ, న్యూ ఇయర్ డే అవటం వల్ల, అందరూ మత్తులో వుండటం వల్లా జరిగిన నష్టాన్ని ఎవరూ పట్టించుకోలేదు.

ఎదురుగా వచ్చి గుద్దుకున్న కారు అతడి పక్కనుంచి సాగిపోయింది.

అప్పుడు చూశాడు అతడు.

కుడిపక్క- ముందు సీట్లో-

ఒక చెయ్యి కిటికీ బయటకు ఆన్చి-

గాలికి ఎగిరే ముంగురుల్ని సర్దుకుంటూ-

స్టీరింగ్ దగ్గిరున్న వ్యక్తి అప్పుడే వేసిన జోకుకి నవ్వుకుంటూ తల తిప్పి-

తన ప్రక్కనుంచి కారులో వెళ్ళిన మనిషి-

-ప్రియంవద.

## 33

**హోటల్ లో** ఎంక్వయిరీ పూర్తిచేసి బయటకు వచ్చిన రాజశేఖర్ వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్ళలేదు. ఒకటే ప్రశ్న అతడిలోకదలాడుతూంది. రవితేజ ఫోన్ లో మాట్లాడినట్టు- అతడు హత్యా చేయకపోతే ఏ కారణంవల్ల అతడు ఇంతకాలం దాక్కున్నాడు?

ప్రియంవద మరణం పట్ల భయపడ్డాడా?

అతడిని ఇంత ఊబిలో ఇరికించి చెంచురామయ్య ఏం సాధిద్దామనుకుంటున్నాడు? పోటీదార్ల వ్యాపారం పూర్తిగా పడగొట్టాలనా అతడి ఉద్దేశ్యం. అదే నిజమైతే మధ్యలో ఈ భాస్కర్ ఎవరు? రాజశేఖర్ రిసీవర్ ఎత్తి చెంచురామయ్యకి ఫోన్ చేశాడు. "హల్లో రామయ్యా హియర్" అని వినిపించగానే, "నేనూ భాస్కర్ ని" అన్నాడు.

"భాస్కరా? ఏ భాస్కర్?" అట్నుంచి అడిగాడు చెంచురామయ్య.

"రవితేజ దగ్గిర భాస్కర్ పేరు పెట్టుకున్నవాణ్ని. పోలీసులు నన్ను చుట్టు ముడుతున్నారు. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే..."

లైను కట్ అయింది.

రాజశేఖర్ ఆలోచనలో పడ్డాడు. చెంచురామయ్య ఎందుకు ఫోన్ కట్ చేశాడు? తను మాట్లాడుతున్నప్పుడు భాస్కర్ అక్కడే వున్నాడా? అందుకే చీకట్లో వేసిన బాణం సరీగ్గా తగల్లేదా? అతడు నిరాశ చెందలేదు. డిపార్ట్ మెంట్ లో ఇలాంటివి మామూలే.

* * *

రవి తన కళ్ళని తానే నమ్మలేకపోయాడు.

కొద్దిసేపు తను భ్రమపడుతున్నానా అనుకున్నాడు. కాదు. ఆమె ప్రియంవదే. తన పక్కనుంచే కార్లో వెళ్ళింది.

అతడి రక్తం సలసలా కాగిపోయింది. ఇంతకాలం వున్న నిస్పృహ ఆవేశంగా మారింది. తననో ఫూల్ ని చేసి ఆడుకున్న ఈ మనుష్యుల మీద పగతీర్చుకోకుండా ఎందుకు వెళ్ళిపోవడం?

ఎలాగో తనకి హంతకుడిగా ముద్రపడిపోయింది.

వెళ్ళబోయేముందు, తనని అధఃపాతాళానికి తోసేసి హాయిగా నవ్వుకుంటున్న ఆ చెంచురామయ్యకీ, ప్రియంవదకీ బుద్ధి చెప్పితే మాత్రం నష్టం ఏముంది. కనీసం ఆ తృప్తి అయినా దక్కుతుంది.

అతడు తల త్రిప్పి చూశాడు.

అప్పటికే ప్రియంవద వున్న కారు దూరంగా మలుపు తిరుగుతూ కనిపించింది.

ఆక్సిడెంట్ జరిగిన గుంపు నుంచి జనం నెమ్మదిగా వెళ్ళిపోతున్నారు.

రవితేజ ఒక మోటరిస్ట్ దగ్గరికి వెళ్ళి "లిఫ్ట్ ప్లీజ్" అన్నాడు.

"ష్యూర్" అన్నాడు మోటార్ సైకిలిస్ట్, "కొత్త సంవత్సరం ఎవరేమడిగినా కాదనకూడదు. ఎటు వెళ్ళాలి?" మందు వాసన గుప్పున కొట్టింది అతడి దగ్గిర్నుంచి.

"నా గర్ల్ ఫ్రెండ్ ఎవరితోనో కార్లో వెళుతూంది. ఆవిడని ఫాలో అవ్వాలి".

కళ్ళు చిట్లించాడు- మోటార్ సైకిల్ మీద హిప్పీలా కూర్చున్న ఆ కుర్రవాడు రవి చెపుతున్నది అతడికి మొదట అర్ధంకాలేదు. అర్ధంకాగానే "హుర్రే" అని గట్టిగా అరిచి, "ఎక్కండి" అన్నాడు తనలో తనే జేమ్స్ బాండ్ ని వూహించుకుంటూ.

మరుక్షణం ఆకారు వెళ్ళినవైపు మోటారు సైకిల్ రాకెట్ లా దూసుకుపోయింది. క్రమక్రమంగా కారుకీ మోటార్ సైకిలిస్ట్ కీ మధ్య దూరం తగ్గుతోంది.

"దాన్ని ఆపి లోపలున్న వాళ్ళని చితక బాదుదామా బ్రదర్" అడిగాడు ఆ యువకుడు.

"వద్దు వద్దు మీ కభ్యంతరం లేకపోతే వాళ్ళు ఎక్కడికి వెళ్తున్నారో ఫాలో అవుదాం" అన్నాడు రవి. అతడి ఉద్దేశ్యం కారులో భాస్కరో, చెంచురామయ్యో వుంటారు. మొత్తం ముగ్గుర్నీ కలిపి పట్టుకోవాలి. పట్టుకొని ఒక్కసారి చంపెయ్యాలి. అంతేగానీ ఇలా నడిరోడ్డు మీద గొడవ పెట్టుకుంటే తననే అరెస్టు చేయిస్తారు.

అతడి మనసులో, తను ఈ రాత్రి ఏం చెయ్యాలో ఒక ప్లాను సిద్దమైంది. ప్రియంవధ ఏ ఇంటికి వెళుతూందో ముందు చూస్తాడు. తరువాత తనూ లోపలి ప్రవేశించి ఒక్కరొక్కర్నే విడివిడిగా చంపి- విదేశాలకి పారిపోతాడు. కనీసం కసి తీర్చుకున్నానన్న సంతృప్తి అయినా మిగులుతుంది!

"మీ పేరేమిటి బ్రదర్?"

"రవి"

"కొత్త సంవత్సరం ప్రారంభంలోనే నీ గర్ల్ ఫ్రెండ్ ని వేరే ఇంకొకరితో చూడవలసి వచ్చినందుకు....సారీ బ్రదర్. నేనైతే

నరికి పోగులు పెడతాను".

"నేను చేయబోతున్నదీ అదే"- మనసులో అనుకున్నాడు. కారు ఒక ఇంటిముందు ఆగింది. రవి మోటార్ సైకిల్ దిగి, "థాంక్స్" అన్నాడు.

"హాపీ న్యూ ఇయర్? పాత గర్ల్ ఫ్రెండ్ గురించి మర్చిపోండి. 'కో' అంటే కోటిమంది అమ్మాయిలు. కొత్త సంవత్సరంలో...."

"....కొత్త జీవితం థాంక్యూ" పూర్తి చేశాడు రవితేజ. "....నేను అడగ్గానే వచ్చినందుకు కృతజ్ఞతలు. మీక్కూడా హాపీ న్యూ ఇయర్".

"వెళ్ళొస్తా బ్రదర్. అదిగో మీ పిట్ట ఇంట్లోకి వెళ్తోంది. ఆ నడక చూస్తూంటే కాస్త మందుమీద వున్నట్టుంది. సారీ బ్రదర్ బ్యాడ్ సెలక్షన్!" స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు అతడు షేక్ హాండిచ్చి.

-రవితేజ రెండు నిముషాలు చీకట్లో నిలబడ్డాడు. కార్లోంచి దిగిన ఆకారాల పోలికలు తెలియటం లేదు. ఒక స్త్రీ, ఒక పురుషుడు అని మాత్రం తెలుస్తూంది. "తను సరీగ్గా చూశాడా? అది ప్రియంవదేనా-" అన్న అనుమానం వచ్చింది. నిశ్చయంగా ప్రియంవదే అనుకున్నాడు. పక్కనున్నది భాస్కరా? అతడిని 'అన్నయ్య' గా పరిచయం చేసినట్టు గుర్తు. అతడు శుష్కంగా నవ్వుకున్నాడు. ప్రేమ పేరిట ఇంత మోసం చేసిన స్త్రీ అన్నయ్యగా ప్రియుడిని పరిచయం చేయటంలో ఆశ్చర్యం లేదు.

వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళారు.

అతడు మరికొంచెంసేపు అక్కడే నిలబడి ఆ ఇంటి దగ్గరగా వెళ్ళాడు. మిగతా ఇళ్ళకి దూరంగా విసిరేసినట్టుంది ఆ యిల్లు. సంసారులు వుండే ఇల్లులా లేదు అది. ఇటువంటి కార్యకలాపాలకి, వుంచుకున్నదాన్ని వుంచటానికి సరిపోయే ఇల్లులా వుంది అది. వీధి దీపాలు కూడా లేవు.

అతడు దగ్గిరగా వెళ్ళి ఆ ఇంటిని పరిశీలించాడు. తలుపు వేసి వుంది. లోపల లైటు వెలుగుతూ వుండటం బట్టి కొత్త సంవత్సరాన్ని 'ఇంకా' వాళ్ళు జరుపుకోవటం కొనసాగిస్తున్నారని తెలుస్తూంది. చాలా ఆనందంగా వుండి వుంటారు వాళ్ళు.

అవును మరి. అనుకున్నది దిగ్విజయంగా సాధించారు. వుండకేం చేస్తారు? వాళ్ళ దృష్టిలో తన ఓటమి సంపూర్తి అయింది. రవితేజ టెక్స్ టైల్స్ మూలస్తంభం నిలువునా కూలిపోయింది. ఆ ఆనందోత్సాహాలని ఈ కొత్త సంవత్సరం సంరంభంతో కలుపుకుని ఎంజాయ్ చేస్తూ వుండి వుంటారు.

ప్రహరీ గేటువేసి వుంది. అతడు వెనుగ్గా వెళ్ళాడు. అక్కడ అలికిడి లేదు. శబ్దం చేయకుండా గోడదూకి లోపలికి ప్రవేశించాడు. వెనుకవైపు పిచ్చిమొక్కలు ఇష్టం వచ్చినట్టు పెరిగివున్నాయి. అతడు శబ్దం చేయకుండా ముందువైపు వచ్చాడు. వీధి లైటు లేకపోవటం వల్ల అక్కడంతా చీకటిగా వుంది.

లోపల ఎంతమంది వున్నారో తెలీదు. ముందు అది తెలుసుకోవాలి. ప్రియంవదతో ఫర్వాలేదు. లోపల ఇద్దరికన్నా ఎక్కువ మంది మొగవాళ్ళు వున్న పక్షంలో తన పని కష్టమవుతుంది. లోపలికి ప్రవేశించగానే ఒకరిని స్పృహ తప్పించి లోబర్చుకోవాలి. అది చూసి రెండో వ్యక్తి ఎంత ధైర్యవంతుడయినా బెదిరిపోతాడు.

అతడు చుట్టూ చూశాడు. తీగెకు కట్టివున్న ఇనుప వూచ కనపడింది. దాన్ని భూమిలోంచి బయటకు లాగాడు. లావుగా, రెండు అడుగుల పొడవుతో బలంగా వుంది. ఒక దెబ్బ చాలు మనిషిని స్పృహ తప్పించటానికి. దాన్ని భూమిలోంచి లాగి చేత్తో పట్టుకున్నాడు. ముందు కాలింగ్ బెల్ కొడదామనుకున్నాడు. కానీ తనని చూడగానే ప్రియంవద గట్టిగా అరిచే ప్రమాదం వుంది. అదీగాక, ఇంత అర్ధరాత్రి బెల్ కొట్టేది ఎవరా అన్న అనుమానంకూడా లోపలి వాళ్ళకి రావొచ్చు. కిటికీలోంచి బయటకు చూస్తే ప్రమాదం.

అతడు మళ్ళీ వెనక్కి వెళ్ళాడు. లోపల గదిలోంచి వెలుతురు బాత్ రూమ్ వెంటిలేటర్ గుండా బయటకు పడ్తూంది. చిన్న చిన్న ప్లేట్లలా అద్దాలు అమర్చబడి వున్నాయి వెంటిలేటర్ కి.

సన్నగా విరగ్గొడుతూ, అతడు శబ్దం కాకుండా ఒక్కొక్క అద్దాన్నే బయటకు తీశాడు. దాదాపు పదిహేను నిముషాలు పట్టింది క్లియర్ చేయటానికి. అడ్డుగా వున్న ఇనుపవూచని తొలగించటానికి మరో పది నిముషాలు.....

అతికష్టం మీద తడు లోపలికి ప్రవేశించాడు. శరీరం అక్కడక్కడా రక్కుకుపోయి రక్తం వస్తూంది. అతడు పట్టించుకోలేదు.

బయట గదిలోంచి శబ్దం ఏమీలేదు. లైటు వేసుకునే నిద్రకుపక్రమించారా అనుకున్నాడు. అంతలో అతడి అనుమానం నివృత్తిచేస్తూ స్త్రీ కంఠం వినిపించింది. "థాంక్స్, నా కోర్కె తీర్చినందుకు" అని.

ఉద్వేగం ఒక కెరటంలా కొట్టుకుంది అతడిలో.

అది ప్రియంవద కంఠమే.

అతడి చూపు తనని మోసం చేయలేదు.

అతడి చేతిలో ఇనుప వూచ బిగుసుకుంది.

"రేపటివరకూ బయటకు వెళ్ళకూడదన్నారు. కాని న్యూ ఇయర్ కోసం వదిలినందుకు.... ఇప్పుడే వస్తాను. ఒక్క నిముషం-" అడుగుల చప్పుడు బాత్ రూమ్ వేపు రావటంతో రవితేజ కంగారుపడ్డాడు. చప్పున బాత్ టబ్ వెనక్కి వెళ్ళి ప్లాస్టిక్ తెరని ముందుకు లాక్కున్నాడు. క్షణం ఆలస్యం అయివుంటే ఆమె చూసేది. అతడు తెర వెనక్కి వెళ్ళటం, ఆమె లోపలికి రావటం ఒకేసారి జరిగాయి.

ఆమె ఒంటిమీద ఒక్క నూలుపోగు లేదు. వాష్ బేసిన్ వేపు వంగి మొహం కడుక్కుంటూంది. వెనుకనుంచి స్పష్టంగా కనపడుతూంది. ఫ్లోరోసెంట్ దీపం కాంతి వీపు మీదనుంచి జఘనభాగం మీదుగా క్రిందికి జారుతూంది. ముందుకు పడిన వెంట్రుకల్ని చెవి వెనక్కు తోసుకుంటూ అద్దంలో తన శరీరాన్ని చూసుకుని, బద్ధకంగా ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకుంది.

అంత వెలుగులో నగ్న శరీరాన్ని అలా చూడటం అదే మొదటిసారి. ఈ శరీరాన్ని చూసేనా పోతపోసిన బంగారం అనుకుంది? రెండు నిదురలేని రాత్రులు. అదే ప్రేమ అనుకుని భ్రమపడి, నిదుర విడిచి, కలల నడిచి, మనసు వనమల్లీ వల్లీ విచలిత పల్లవపాళీ అయినది? ఈ స్థనద్వయం మధ్యేనా మోము, రెక్కల మధ్య దాచుకున్న వివాగాళి అయినది. ఈ పొత్తికడుపు మీద తల ఆన్చినప్పుడే నా మందపవనుడు మందాకిని తిన్నెలమీద మన్మధుడైనట్టు తోచింది? ఎంత మూర్ఖుడు మగవాడు. తొలిసిగ్గు తెరలకూ, నలిగిన పక్కకూ మధ్య తేడా తెలుసుకోలేడు. అనాఘ్రాత పెదవులకు, విస్కీ రుచి చూసిన ఆధారాలకు భేదం తెలుసుకోలేదు. ప్రేమకూ కామానికీ మధ్య గీత గీయలేడు.

....బరువెక్కిన నిశ్శబ్దం మధ్యనుంచి ఆమె వెళ్ళిపోయింది.

అతడు మామూలు మనిషి అయ్యాడు.

....కర్తవ్యం గుర్తొచ్చింది.

....ఆమె వెళుతూ తలుపు వెయ్యలేదు. అది కలిసొచ్చింది.

అతడు తలుపు సందులోంచి నెమ్మదిగా ముందుకు జరిగాడు.

సోఫాలో కూర్చుని వున్న వ్యక్తికూడా ప్రియంవదలాగే నగ్నంగా వున్నాడు. ఆ గదిలో వాతావరణం మూర్తీభవించిన పెర్వర్షన్ కి ప్రతీకలా వుంది. కొత్త సంవత్సరం ప్రారంభాన్ని వాళ్ళింకా సెలబ్రేట్ చేసుకుంటూనే వున్నారు. మధ్య సగం సీసా ఖాళీగా వుంది. సిగరెట్ పొగ గదంతా నిండి వుంది. ఆమె వెళ్ళి అతడి ఒళ్ళో కూర్చుంది. 'కమాన్ డార్లింగ్' అంటూ అతడు వంగి, ఆమె నోటికి గ్లాసు అందించటం కోసం ఇటువేపు తిరిగినప్పుడు రవితేజకి లైటు వెల్తురులో అతడు

స్పష్టంగా కనిపించాడు.

భూమి కంపించినట్టయింది రవితేజకి.

కరాళ కంకాళాల్ని ఆకాశంలోకి విసురుతూ ప్రధమగణంచేసే ప్రళయ నృత్యానికి- పత్రతృణ శరత్ సశ్యాలు కదిలిపోయి, నక్షత్రాలు ఆకాశపు లోయల్లోకి జారిపోయి, భయంకర పారావారం తన వేయిపడగల్ని సాచి ఒక్కసారిగా ఒళ్ళంతా కాటువేసినట్టు అతడు వణికిపోయాడు.

ఆమె శరీరం చుట్టూ చేతులువేసి, ఆమె వక్షం మీద సిగరెట్ వుంచుతానని బెదిరిస్తూ- ఆమె జారిపోబోతుంటే చూస్తూ ఆనందిస్తూ మధ్య మధ్యలో ఆమె నోట్లో బలవంతంగా మధువుపోస్తూ సాడిస్టిక్ గా ఆనందిస్తూంది.....

.....రవితేజ టెక్స్ టైల్స్ చైర్మన్ శర్మ!!!

ప్రియంవదతో కలిసివున్న వ్యక్తి శర్మ అయ్యేసరికి అతడు అప్పటివరకూ అనుకున్నది, చెయ్యాలనుకున్నది అంతా మర్చిపోయాడు. అతడి చేతిలో ఇనుప ఊచ అప్రయత్నంగా జారి శబ్దంచేసింది. ఆ శబ్దానికి బాత్ రూమ్ వైపు చూసిన ప్రియంవధ కెవ్వున అరిచింది. రవితేజ చప్పున స్పృహలోకి వచ్చి, ఒంగి నేలమీదున్న రాడ్ తీసుకోబోయాడు. ఆ అరుపుకీ, బయట గదిలో వున్న మరో వ్యక్తి లోపలికి వచ్చాడు. శర్మ దుప్పటి చుట్టుకుని తలుపు తీశాడు. రవితేజ బాత్ రూంలోంచి ఆ గదిలోకి వెళ్ళేసరికి బయటవ్యక్తి లోపలికి రావడం, జేబులోంచి పిస్టల్ తీయటం అంతా క్షణాల్లో జరిగిపోయింది. శర్మ సర్దుకుని నవ్వుతూ, "వెల్ కమ్ రవితేజా! చివరి క్షణంలో అంతా కనుక్కోగలిగావన్నమాట. కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు. లోపలికి వచ్చిన వ్యక్తి చేతిలో పిస్టల్ తను తీసుకుంటూ బయటనుంచి వచ్చిన ఆ వ్యక్తి భాస్కర్.

## 34

**చెంచురామయ్య తో** మాట్లాడి ఫోన్ పెట్టేశాక ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ కి ఏం చెయ్యాలో తోచలేదు.

పోలీస్ స్టేషన్ దాదాపు నిర్మానుష్యంగా వుంది. కొత్త సంవత్సరం సందర్భంగా అందరూ డ్యూటీలో తిరుగుతున్నారు.

ఇక ఈ రాత్రికి ఈ కేసు విషయంలో తను చేసేది ఏమీ లేదు అని అతడు నిశ్చయించుకుని బయటకు వెళ్ళబోతున్న సమయంలో ఫోన్ మ్రోగింది.

"హల్లో, పోలీస్ స్టేషన్" అన్నాడు తన ఏరియా చెప్తూ.

"మాధవిగారి హత్యకేసులో ఇన్వెస్టిగేట్ చేస్తున్న ఆఫీసర్ తో మాట్లాడాలి" అని అట్నుంచి ఒక కోమల కంఠం వినిపించింది.

"ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ హియర్, నేనే ఆ కేసు చూస్తున్నది. చెప్పండి" మీరెవరు?"

"దానికంత ప్రాముఖ్యత లేదు ఇన్ స్పెక్టర్ గారూ! నేనొక ముఖ్యవిషయం మీతో చెప్పాలి".

"చెప్పండి".

"మాధవిని హత్య చేసింది రవితేజ కాదు".

"మరి?"

"ఆయన ఆ సమయంలో ముంబాయిలో లేడు. ఈ ఊర్లోనే వున్నాడు".

"మీకెలా తెలుసు?"

అట్నుంచి మాట్లాడుతున్న ఆమె దానికి సమాధానం చెప్పకుండా "నేను చాలా రిస్క్ తీసుకుని ఈ ఫోన్ చేస్తున్నాను ఇన్ స్పెక్టర్ గారూ! రవితేజ ఈ దేశంనుంచి వెళ్ళిపోవటానికి ఏర్పాట్లు జరిగాయి. రేపే అతడి ప్రయాణం. దురదృష్టం ఏమిటంటే, హంతకుడు కాకపోయినా అతడిమీద ఈ నేరం మోపబడింది. ఆ ముద్రతోనే అతడీ దేశం వదిలి వెడుతున్నాడు".

"అతడు హంతకుడు కాకపోతే ఆ విషయం పోలీసులకి లొంగిపోయి చెప్పవచ్చుగా".

"భయపడుతున్నాడు. భయంలో మనిషికి తనేం చేస్తున్నాడో తెలీదు. ఇందులో పూర్తిగా ఇరుక్కుపోయాననీ, బయటకు రాలేనన్న నిరాశా నిస్పృహల్లో మునిగివున్నాడు. స్వతహాగా రవి ధైర్యవంతుడే! ఇంతకన్నా పెద్ద ప్రోబ్లమ్స్ ని చాలా ఎదుర్కొన్నాడు. కానీ ప్రియంవద ఎఫైర్ లో అతడి మనసు తప్పు చేశానన్న భావం బాగా పెరిగిపోయింది. ఎప్పుడైతే గిల్టీ ఫీలింగ్ ఏర్పడిందో అప్పుడే మనిషిలో భయం కూడా ప్రవేశిస్తుంది. అదే కారణం ఇన్ స్పెక్టర్ గారూ, ఏ కోర్టులోనూ నిరూపించలేని కారణం..."

"మీకు అతని గురించి బాగా తెలిసినట్టుందే....."

"ఏమీ తెలీదు. కానీ అతడు నిజం చెపుతున్నాడన్న నమ్మకం వుంది. మీరు ఎంక్వయిరీ చేయండి. అతడు ఈ ఊర్లోనే

వున్నాడని సాక్ష్యం దొరుకుతుంది".

"ఈ ఊర్లో వుండి హత్యచేసి వుండవచ్చుగా-"

"అది చెయ్యటానికి ఇంత ప్లాన్ అనవసరం".

"అతడు మాకు దొరుకుతేగానీ ఏ విషయమూ బయట పడదు-"

"రవితేజ రేపే ఈ దేశంనుంచి వెళ్ళిపోతున్నాడు. దాన్ని మీరు ఆపాలి! మీమీద నమ్మకంతో ఈ విషయం చెపుతున్నాను. అతన్ని ఉరికంబం ఎక్కించటం కోసం కాదు. అతడిద్వారా అసలు హంతకుడిని పట్టుకోవటానికి. రేపతను ఈ దేశం వదిలి వెళ్ళిపోతే శాశ్వతంగా అతడి కోసమే వెతుకుతారు పోలీసులు అసలు వాళ్ళని వదిలేసి-"

"అసలు వాళ్ళెవరో మీకేమైనా అనుమానం వుందా?"

"తనకి వ్యాపారంలో అడ్డువెళ్ళేవాళ్ళు ఈ పని చేయించి వుంటారని నమ్ముతున్నాడు రవితేజ".

"పోనీ అతడు ఈ దేశంనుంచి పారిపోవటానికి సాయపడుతున్న వాళ్ళు ఎవరో మీకేమైనా తెలుసా?"

"తెలీదు ఇన్ స్పెక్టర్ గారూ-"

"మీ భర్తగారే-" తాపీగా అన్నాడు రాజశేఖర్. అతడా మాట అనగానే, ఒక్కసారిగా ఏర్పడిన అవతలివైపు సంచలనం ఫోన్ లో తెలిసింది. "నేను....నేను...." ఆ అమ్మాయి కంఠం తడబడింది. "మీరు శర్మగారి భార్య అని నాకు తెలుసు. అరగంట క్రితమే రవితేజ మీతో మాట్లాడాడని కూడా తెలుసు".

అవతలివైపు నుంచి చాలాసేపు నిశ్శబ్దం.

"మీరు మా సంభాషణ పూర్తిగా విని వుంటే- మా యిద్దరి బాంధవ్యం సంగతి కూడా మీకు బాగా తెలిసివుండాలి".

"తెలుసు రవితేజ కోసం మీరింత ధైర్యంతో నాకు ఫోన్ చేయటం మెచ్చుకోదగ్గ విషయం. మీకు అతడు ఫోన్ చేయగానే నేను హోటల్స్ అన్నీ వెతికాను. రవితేజ ప్రియంవదతో కలిసి ఈ ఊర్లో వున్నాడన్న విషయం యదార్థమే. కానీ అది ఏ విధంగానూ అతడి నిర్దోషిత్వాన్ని నిరూపించదు....."

"అంటే అతడు పట్టుబడితే శిక్ష అనుభవించవలసిందేనా" ఆ అమ్మాయి అంది. "అనవసరంగా ఫోన్ చేశానా?"

"మీరు ఫోన్ చేయకపోయినా ఈ విషయం మీకు తెలిసేది. మీ ఫోన్ ట్రాప్ చేసినట్టే మీ భర్త వెనుక మా మనుష్యులు వున్నారు. ఆయన రవితేజని కలుసుకోగానే అతడ్ని పట్టుకుంటారు....."

"కష్టం".

"ఎందుకు?"

"ఆయన వెనుక సి.ఐ.డి. లున్నారని ఆయనకి తెలుసు-"

"అవును. మొన్నెవరితోనో ఫోన్ లో మాట్లాడుతూ, 'మా ఇంటిముందు కూడా సి.ఐ.డి. నిల్చున్నట్టు అనుమానంగా వుంది' అంటూండగా విన్నాను" అన్నదామె.

"ఓ.కే. మాడమ్. రేపు మీతో డిటెయిల్డ్ గా మాట్లాడుతాను....."

"నేనిలా ఫోన్ చేసిన విషయం ఎవరికీ చెప్పకండి. రవితేజకి కూడా.....ప్లీజ్...."

"ష్యూర్" నాయి ఫోన్ పెట్టేసేడు రాజశేఖర్. అతడికి కాస్త కన్ ఫ్యూజన్ గా వుంది. రవితేజ ఎప్పటికయినా శర్మని కలుసుకుంటాడన్న నమ్మకంతో శర్మ ఇంటిముందు పోలీసుని నిలబెట్టాడు. అతడి వూహ ఫలించి, అదే జరిగింది. కానీ పోలీసు అసమర్ధత వల్ల గెస్ట్ హౌస్ నించి రవి తప్పించుకున్నాడు. ఆ తరువాత శర్మ ఫోన్ కూడా ట్రాప్ చేయబడింది.

కానీ శర్మ ఫోన్ లో మాట్లాడిన ఏ సంభాషణల్లోనూ "మా ఇంటిముందు కూడా పెట్టారోయ్" అన్న వాక్యం రాలేదు. అంటే ఈ సంభాషణ ఫోన్ ట్రాప్ చేయబడటానికి ముందే జరిగి వుండాలి.

అంటే.....రవితేజని గెస్ట్ హౌస్ కి తీసుకువెళ్తున్న సమయానికే శర్మకి తన వెనుక పోలీసులు ఫాలో అవుతున్నారని తెలుసు.

....కాబట్టి ఇక రేపు అసలతడు రవితేజని కలుసుకోడు. తనిప్పటివరకూ శర్మ ఎలాగూ రవితేజని కలుసుకుంటాడు కదా, అప్పుడు రవిని అరెస్ట్ చేయవచ్చుకదా- అన్న భ్రమలో వున్నాడు.

తను వెంటనే శర్మని కలుసుకుని మొత్తం అంతా వెల్లడిచేసి నయానో భయానో బెదిరిస్తే తప్ప రవితేజ ఆచూకీ దొరకదు. ఆ తరువాత రవి విదేశాలకు పారిపోకముందే ఈ పని జరగాలి. అంటే రేప్రొద్దున్న లోపలే జరగాలి. శర్మ ఎక్కడున్నాడో అతడికి తెలుసు.

అతడు మోటార్ సైకిల్ వేసుకుని క్లబ్ కి బయల్దేరాడు. క్లబ్ ముందు పోలీసు మఫ్టీలో నిలబడి వున్నాడు. "శర్మగారు లోపలున్నారు సార్. రవితేజ టెక్స్ టైల్స్ డైరెక్టర్లందరూ వున్నారు లోపల" అన్నాడు.

రాజశేఖర్ లోపలికి ప్రవేశించాడు. సరీగ్గా అప్పుడే కొత్త సంవత్సరం ప్రవేశించింది. అందరూ లేచి "హాపీ న్యూ ఇయర్- హాపీ న్యూ ఇయర్" అని పరస్పరం విష్ చేసుకుంటున్నారు. అంతా గోలగోలగా వుంది.

బోర్డు డైరెక్టర్స్ కూర్చున్న చోటుకి రాజశేఖర్ వెళ్ళాడు.

అక్కడ వాళ్ళమధ్య శర్మ లేడు.

రాజశేఖర్ కి తన డిపార్టుమెంటు మనుష్యుల అసమర్థత మీద విపరీతమైన కోపం వచ్చింది. రాజశేఖర్ బయటకొచ్చాడు. బయట నిలబడ్డ పోలీసు అతడివైపు బెదిరిపోతూ చూశాడు.

రాజశేఖర్ అతడితో, "శర్మ లోపలలేడు. వెళ్ళటం నువ్వేమైనా చూశావా?" అన్నాడు.

"కారు ఇక్కడే వుంది సార్".

"నీ మొహం నేను అడుగుతున్నది కారు గురించి కాదు మనిషి గురించి". పోలీసు బిక్కమొహం వేశాడు.

లోపల్నుంచి కేకలు కేరింతలు వినపడుతున్నాయి. దూరంగా టపాకాయలు పేలుతున్నాయి. అంతా గోల గోలగా వుంది. వెయిటర్ వచ్చి డ్రింకు అందిస్తూ "హేపీ న్యూ ఇయర్ సార్" అన్నాడు. "హెక్టిక్ న్యూ ఇయర్" అనుకున్నాడు మనసులో. ఈ సంవత్సరం ప్రారంభమవటమే ఉక్కిరిబిక్కిరి అయ్యేటంత పనితో మొదలైంది. ఇలాంటి కేసులు ఇంకా ఎన్ని వచ్చి చుట్టుకుంటాయో ఈ సంవత్సరం...."

అతడు తిరిగి లోపలికి వెళ్ళాడు.

డైరెక్టర్లందరూ పూర్తి కిక్ లో వున్నారు. అతఃడికి ఆశ్చర్యమేసింది. వాళ్ళ మేనేజింగ్ డైరెక్టరు హత్యకేసులో ఇరుక్కుని పదిరోజులు కాలేదు- వీళ్ళు ఇక్కడ ఆ విషయం విస్మరించినట్టు ఆనందిస్తున్నారు. వ్యాపారస్తుల మధ్య స్నేహాలు, ఆప్యాయతలు కూడా ఆ విధంగానే వ్యాపారపరంగా వుంటాయేమో అనుకున్నాడు. పోయినవాళ్ళు పోతూ వుంటారు. వాళ్ళ వల్ల వచ్చిన నష్టం ఎంత? దాన్ని పూడ్చుకోవటానికి ఇంకా ఏం చెయ్యాలి?.....ఇదే ఆలోచనతో ప్రపంచం సాగిపోతూ వుంటుంది.

ఒక డైరెక్టర్ దగ్గిరాకీ వెళ్ళి, "శర్మగారు ఎక్కడికి వెళ్ళారో మీకేమైనా తెలుసా?" అని అడిగాడు.

"లేదు. ఏదో ఫోన్ వచ్చిందంటే వెళ్ళారు".

రాజశేఖర్ ఉలిక్కిపడ్డాడు.

అర్ధరాత్రి పన్నెండింటికి ఫోన్ వస్తే అంత అర్ధంతరంగా పార్టీ మధ్యలో వెళ్ళిపోయడంటే....?

బహుశ ఈ రాత్రికే రవితేజ ఈ ఊరి పొలిమేరలు దాటించే ప్రయత్నం జరుగుతూ వుండవచ్చు. బయట పెట్టిన కాపలావాడిని నమ్ముకుని తను పొరపాటు చేశాడు.

ఒక్కసారి రవితేజ తప్పించుకుంటే ఇక తను ఏమీ చేయలేడు. శర్మ హనకేం తెలీదని దబాయించినా ఏమీ చేయలేడు.

అతడు క్లబ్ లోపల ఇంకో గదిలోకి వెళ్ళాడు.

అక్కడ టెలిఫోన్ ఆపరేటర్ కూర్చుని వున్నాడు.

ఆ సమయంలో ఫోన్ లు రావటం గానీ, ఇక్కడివాళ్ళు చేయటంగానీ లేకపోవటంతో, పి.బి.ఎక్స్ ముందు ఖాళీగా వున్నాడు. డ్రెస్ లో వున్న ఇన్ స్పెక్టర్ ని చూసి లేచి నిలబడ్డాడు.

"ఎన్ని ఎక్స్ టెన్షన్స్ వున్నాయి ఇక్కడ?" అడిగాడు.

"ఎనిమిది సార్".

"పది నిమిషాల క్రితం శర్మగారికి ఫోన్ ఇచ్చింది నువ్వేనా?"

"నేనే సార్".

"ఎవరు ఫోన్ చేసింది?"

"తెలీదు సార్".

"తెలీదా? మర్చిపోయావా?"

"మ.....మర్చిపోయాను సార్".

రాజశేఖర్ అతడివైపు సూటిగా చూశాడు. అతడు తల దించుకున్నాడు ఆ చూపు మలుపువాలు పట్టుకోవటానికి.

"పద" అన్నాడు.

ఆపరేటర్ బెదిరిపోయి "ఎక్కడికి సార్?" అన్నాడు.

"పోలీస్ స్టేషన్ కి".

"ఏం....ఎందుకు సార్?"

"శర్మగారికి ఎవరు ఫోన్ చేశారో గుర్తుతెచ్చుకోవటానికి...."

ఏడుపొక్కటే తరువాయిగా, "గుర్తొచ్చింది సార్" అన్నాడు ఆపరేటరు.

"ఎవరు?"

"ఒకామె".

"పేరు?" ఆశ్చర్యంగా అడిగాడు రాజశేఖర్. ఆ సమయంలో ఆయనకి స్త్రీ ఫోన్ చేస్తుందని అతడు ఊహించలేదు. ఆమె నిశ్చయంగా శర్మ భార్య అయివుండదు.

"చె....చెప్పలేదు సార్?"

"అబద్ధం చెప్పవలసి వచ్చినప్పుడల్లా తడబడటం నీ దురలవాటులా వుంది. దీన్ని బట్టి చూస్తుంటే నువ్వు మొత్తం సంభాషణ అంతా విన్నట్టు తోస్తుంది". ఆపరేటర్ మరింత కంగారుగా "లేద్సార్ అంతా వినలేదు" అన్నాడు.

"అంతా విన్లేదంటే కొంత విన్నావన్న మాట".

అతడు తెల్లమొహం వేశాడు.

"అర్ధరాత్రి పూట ఆడగొంతు మొగాయనకి ఫోన్ చేసిందంటే వినకుండా వున్నావా? అందులోనూ యింత ఖాళీగా కూర్చొని....తొందరగా చెప్పేస్తే మంచిది. ఇక్కడ చెప్తావా పోలీస్ స్టేషన్ కి వచ్చి చెప్తావా?"

"ఇక్కడే చెప్తాను సార్".

"చెప్పు".

అతడు పాఠం ఒప్పచెప్పినట్టు గడగడా చెప్పేసేడు.

"....నన్నిక్కడ గెస్ట్ హౌస్ లో ఒక్కదాన్నే పెట్టి మీరు అక్కడ న్యూ ఇయర్ హాయిగా సెలబ్రేటు చేసుకుంటున్నారా? అదేం కుదర్దు. నేనొక్కదాన్నే ఇక్కడ వుండలేను. నాకు బోరుకొడుతూంది. మీరు వచ్చెయ్యండి. ఇద్దరం కలిసి బయట కెళ్దాం" అందామె. "ఇప్పుడా..." అన్నారు శర్మగారు. "ఆఁ ఇప్పుడే మీరు రాకపోతే వూరుకోను. రావల్సిందే" అంది ఆవిడ. శర్మగారు విసుక్కుని "సరే వస్తున్నాను" అన్నారు. అంతే సార్ జరిగింది. "ఆవిడ పేరు?"

"నాకు జ్ఞాపకం లేదు సార్. ఏదో చెప్పింది".

"నిజంగా లేదా?"

"నిజంగా లేదు సార్. ఈసారి నా మాటలు తడబడటం కూడా లేదు మీరే చూశారుగా సార్...."

"... కొద్దిగా గుర్తు తెచ్చుకో....రాధ....సావిత్రి....పద్మ....కమల.....సుప్రియ ..."

"అ....అదే...."

"ఏది? సుప్రియా?"

"కాదు సార్....కానీ...ఆ...ప్రియ....అదే...."

చప్పున ఏదో స్ఫురించేట్టు అయి- "ప్రియంవదా?" అని అడిగాడు "కరెక్ట్ సార్. ప్రియంవదే...." అరిచాడు ఆపరేటరు.

తన పదిహేనేళ్ళ జీవితంలో అంత దిగ్భ్రమ ఎన్నడూ చెందలేదు ఇన్ స్పెక్టర్! రాజశేఖర్.

టెలిఫోన్ ఆపరేటరు చెప్పిన పేరువల్ల వచ్చిన షాక్ నుంచి క్రమంగా అతడు తేరుకున్నాడు. పోలీస్ ట్రైనింగ్ లో చెప్పిన వాక్యం తిరిగి గుర్తొచ్చింది. 'ఒక తప్పు చేసినవాడు మరొక తప్పు చేయకపోడు.....తన తప్పుని ప్రపంచం గుర్తించలేదన్న నమ్మకం కుదరగానే మరింత ధైర్యంగా రెండో తప్పుచేసి దొరికిపోతాడు....' అదే జరిగింది ఇప్పుడు.

రవితేజని విదేశాలకు పంపే వరకూ ప్రియంవద బయట ప్రపంచంలోకి రావద్దని అడిగివుంటాడు శర్మ. అలాగేనని ఒప్పుకుని వుంటుంది ఆమె. కానీ ఈ కొత్త సంవత్సరం సంబరాల్ని చూసి, అందరూ అనుభవిస్తున్నారు. తనెందుకు అనుభవించకూడదు అన్న ఉక్రోషంతో శర్మకి ఫోన్ చేసి వుంటుంది. శర్మకున్న జాగ్రత్త ఆమెకి వుండవలసిన అవసరం లేదు. అందుకే ఎవరు వినవచ్చార్లే అన్న ధైర్యంతో అసలు పేరు చెప్పింది.

అతను వాచీ చూసుకున్నాడు 12-10.

ఇప్పటివరకూ శర్మ రవితేజని రక్షించటానికి ఇదంతా చేస్తున్నాడు అనుకున్నాడు. ఇప్పుడు అసలు విషయం తెలుసుకున్నాడు కాబట్టి శర్మ రవితేజని విదేశాలకు పంపించే ఏర్లాట్లేవీ చేసి వుండడనిపిస్తూంది. మరేం చేస్తారు?

హత్యా? ?

దానివల్ల అతడికేమిటి లాభం?

ఇన్ స్పెక్టర్ అసహనంగా తల విదిలించాడు. ఎక్కువ టైమ్ లేదు. రవితేజ ప్రాణం రిస్కులో వుందని తెలుస్తూనే వుంది. కానీ అంత అర్ధరాత్రి అతనికోసం ఎక్కడని వెతుకుతాడు?

అసలు శర్మ రవిమీద ఎందుకింత కక్షగట్టాడు?

## 35

"ప్రేమమంజరి- అన్న గుర్రం నా జీవితాన్ని పూర్తిగా నీ చేతుల్లో పెట్టేసింది" అన్నాడు శర్మ... "ఆ రోజే కదూ నా షేర్లు అన్నీ నీ పేరు మీద మార్చింది?"

"అన్నీ కాదు. మెజారిటీ శాతం".

"అవును అప్పట్నించే అన్ని నిర్ణయాలూ నువ్వే తీస్కునే వీలు నీకు దొరికింది. ఎమ్.డి. వయ్యావు".

"ఈ కారణం వల్లనా నన్నింత ఉచ్చులో ఇరికించింది? ఇంత చిన్న కారణంగానా నా భార్యని మీరు చంపింది?"

"మరి నిన్ను ఏదో విధంగా ఇరుకులో పెట్టకపోతే షేర్లు తిరిగి నాకు ట్రాన్స్ ఫర్ చెయ్యవుగా. ఇప్పుడు చూడు విదేశాలకు వెళ్ళిపోయే తొందర్లో అన్ని కాగితాలమీదా పాత తారీఖువేసి సంతకం పెట్టావు...."

"మనుషుల్లో రాక్షసులుంటారని తెలుసు. కానీ మనసుల్లో యింత విషం పెట్టుకుని పైకి నటిస్తారని మాత్రం యిప్పుడే తెలుసుకున్నాను. మీకు నేను దేంట్లో తక్కువ చేశాను? అనుకున్న ప్రకారం లాభాలు పంచుతూనే వున్నానుగా...."

"తాగుడూ, గుర్రప్పందేలూ నా బలహీనత. వాటిని ఆధారం చేసుకుని నా దగ్గర్నుంచి యాజమాన్యాన్ని నీ చేతుల్లోకి తీసుకున్నావు- కానీ అవి ఏ మూలకి? ఒక గుర్రంమీద కాయటానికి కూడా సరిపోయేది కాదు. డబ్బుకోసం విలవిల లాడిపోయేవాడిని. కంపెనీ నా చేతుల్లో వున్న రోజుల్లో...." అతడి మాటల్ని మధ్యలో కట్ చేసి, రవితేజ కసిగా, "కంపెనీ మీ చేతుల్లో వున్నరోజుల్లో దాన్ని పీల్చి పిప్పిచేసి జీవచ్ఛవంలా మార్చారు. మీమీద నమ్మకం వుంచి డబ్బు పెట్టిన డైరెక్టర్లందరికీ విండో-షో చేసి చూపించారు" అన్నాడు.

"అవును కరెక్టు" నవ్వేడు శర్మ.

"కానీ నేనొచ్చి దానికి జీవం పోశాను. ఈ స్థాయికి తీసుకొచ్చాను".

"ఏం లాభం? కంపెనీ పెరగసాగింది. లాభాలు మాకు తక్కువ యిచ్చి, మిగతా డబ్బు అంతా కంపెనీలోనే తిరిగి పెట్టసాగావు. చీరె కొన్నవారికి పెటల్స్ బ్రా, ఫాల్స్ కుట్టి ఇవ్వడం ఉచితం అన్నావు. మేకప్ బాక్స్ బ్లౌజుపీసు ఉచితం అన్నావు. అన్నిటికన్నా ముఖ్యంగా పాపులర్ చీరలు అని పేరుపెట్టి - రెండొందలు ఖరీదుచేసే చీరలు వందకే పోస్టుద్వారా పంపించే స్కీము ఏర్పాటు చేశావు. దానికి అడ్వర్టయిజ్ మెంటు డెబ్బై అయిదు లక్షలు అన్నావు. ఈ లోపులో చెంచురామయ్య పోస్టల్ దొంగతనాలు ఏర్పాటు చేయించి ఈ స్కీమ్ ని దెబ్బకొట్టాడు. దాంతో మ్యాజిక్ మిర్రర్ అన్నావు. మరో కోటి రూపాయలు అందులో వుంచటానికి డైరెక్టర్లని ఒప్పించావు. డబ్బు-డబ్బు-డబ్బు ఎక్కడ చూసినా పెట్టుబడే తప్ప రాబడి లేదు. నాకు వళ్ళు మండిపోసాగింది. నిన్ను ఎలా ఈ పదవినుంచి తప్పించాలా అని ఆలోచించసాగాను. కానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ లో చాలామంది నీ పక్షమే నీ వన్నట్టు కంపెనీ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. విమల్, వెరైటీ చీరలలో పోటీపడి, ఒక స్థాయిలో వాటిని దాటిపోయింది. డైరెక్టర్లందరికీ నువ్వు దేవుడివి. కానీ నాకు? చేతి దగ్గర స్వర్గాన్ని బలవంతంగా లాక్కున్న దుర్మార్గుడివి. నా చేతికి నయాపైసా రానివ్వకుండా వచ్చింది, వచ్చినట్లు తిరిగి పెట్టుబడి పెట్టే రాక్షసుడివి. నా చేతులు కట్టేసినట్టు అయింది. మామూలుగా అడిగితే ఇవ్వవని, నిన్ను ఇరుకున పెట్టే పరిస్థితులు సృష్టించాను..."

"నేను మీ దగ్గర్నుంచి కంపెనీ నా స్వాధీనంలోకి తీసుకున్నప్పుడు నాలిక గీసుకోవటానికి కూడా పనికిరాణి కంపెనీ ఇది- దీన్ని బంగారుబాతు చేశాను".

"నిజమే. కానీ నాకు రోజుకొక బంగారుగుడ్డు అవసరం లేదు. నా జీవితపు చివరి రోజుల్లో మొత్తం బంగారు బాతునే చంపి తినెయ్యాలనుకున్నాను. దానికి నువ్వు, నీ డైరెక్టర్లూ ఒప్పుకోరు.... ఎప్పుడో భవిష్యత్తులో కంపెనీ నెంబర్ వన్ అయితే నాకేమిటి లాభం? నాకున్న అప్పులకీ ఈ లోపులో నేను దివాలా తీస్తాను. నా మిగిలిన షేర్లు కూడా నీకే అమ్మేసి బికారిని అయిపోతాను..."

రవి అతడివైపు పెర్ ప్లెక్స్ డ్ గా చూశాడు. "మీ మనసులో ఇంత ఆలోచన వుందని చెప్తే నేనే ఇంకేదైనా మార్గం వుందేమో ఆలోచించేవాణ్ని. నేను మీకేం ద్రోహం చేశానని నన్ను ఇంత హీనస్థితికి తీసుకొచ్చారు? మీ స్వంత మనిషికన్నా ఎక్కువగా..."

"స్వంత మనిషా?" బిగ్గరగా నవ్వేడు శర్మ-"నా భార్య కూడా అలా స్వంత మనిషనుకుని నీకు ప్రేమలేఖ వ్రాసిందనుకుంటాను.."

మొహంమీద బలంగా కొట్టినట్టు అయింది రవితేజకి.

"ప్రేమలేఖా?" అన్నాడు.

"అవును నా భార్య నీకు వ్రాసిన సుదీర్ఘమైన ఉత్తరాన్ని నేనూ చదివాను. అసలప్పుడే దానిని నరికి పోగులు పెట్టాలనుకున్నాను. కానీ నెమ్మదిగా ఆలోచిస్తే నాకో ప్లాన్ స్ఫురించింది. ఒకే దెబ్బకి రెండు పక్షులు. స్వంత పెళ్ళాం ఇంకో కుర్రాడిని చూసి ముచ్చటపడితే ఏ భర్త వూరుకుంటాడు? నువ్వు వూరుకున్నావేమోగానీ నాకంత శాంతీ సహనాలు లేవు. ఆ రోజునుంచీ నువ్వంటే మరింత కోపం పెరిగింది. అందరికీ నువ్వంటే గ్లామరే. ఆటోగ్రాఫులు తీసుకునే అమ్మాయిలు...... నువ్వంటే పడిచచ్చే డైరెక్టర్లు..... ఇంతవరకూ ఏ కంపెనీ ఎగ్జిక్యూటివ్ కీ లేని పరపతి నీ కొచ్చింది. గతంలో ఈ రంగంలో ఎవరికీ లేదు ఇంత పాపులారిటీ! ఒక కంపెనీ ఎగ్జిక్యూటివ్ కి జనంలో ఇంత పాపులారిటీనా? ఎన్నో సంవత్సరాల్నుంచీ ఈ రంగంలో పాతుకుపోయిన మా కేవరికీ లేని పేరు నీకు రావటం చూసి నా మనసు కుతకుతా ఉడికిపోసాగింది. చీరెల్తో నువ్వు ఆడుకున్నావు. చీర కట్టిన ప్రతి స్త్రీ నాలుకమీదా నీ పేరు ఆడసాగింది. మీ జీవితకాలం మొత్తంలో మేము సాధించలేనిది, ముఫ్పై ఏళ్ల వయసులో నువ్వు సాధించావు. చివరకు నా భార్యకూడా నీకు వ్రాయటం ఆ మండే అగ్నికి పరాకాష్ట. ఆ ఉత్తరంతో అగ్నిపర్వతం బ్రద్దలైంది. నిన్ను చంపకూడదు. నిన్ను కుమిలి కుమిలి పోయేలా చేయాలి. సరీగ్గా ఆ సమయంలో సుధాకర్ పిక్నిక్ లో నీ భార్యతో చనువుగా ప్రవర్తించటం నా కళ్ళపడింది. ఆ విషయం ఆకాశరామన్నగా నీకు ఫోన్ చేయించింది నేనే-"

రవితేజ తెల్లబోయి అతడివైపు చూశాడు.

శర్మ తనని ఒక కోణంలో నుంచే చూశాడు. ఈ స్థితికి రావటం కోసం తను ఎన్ని సుఖాలు వదులుకున్నాడో చూడలేదు. స్వంత ఇంటిని, భార్యని కూడా నిర్లక్ష్యంచేసి ఈ యజ్ఞాన్ని నిర్వహించాడు. ఈ స్థానానికి రావటం

కోసం జీవితమంతా ధారపోశాడు. ఈ రంగానికే ఒక గౌరవం కలిగించాడు. ఉప్పెన సృష్టించాడు. ఒక విజయం వెనుక ఇంత కష్టం వుంటుందని తెలియని వీళ్ళు, కేవలం విజయాన్ని చూసి ఈర్ష్య పడుతున్నారు. తనకున్నది ఒకే ప్రపంచం టెక్స్ టైల్స్ బయట ప్రపంచంలో ఇంత అసూయాద్వేషాలు వుంటాయని తెలియనంతగా తన ప్రపంచంలో మునిగిపోయాడు. చివరికి  కట్టుకున్న దానికి కూడా న్యాయం చేయలేకపోయాడు. అదీ తప్పేనా? ఇదంతా దేనికోసం చేశాడు? పేరు కోసమా? ఒక్కసారిగా అదీ పోయింది. డబ్బుకోసమా? అదెంత పాపిష్టిదో ఎదురుగా వున్న శర్మ రూపంలో కనపడుతూనే వుంది.

"నీ భార్య విషయం తెలియగానే నువ్వు మండిపడతావనుకున్నాను. పెద్ద గొడవ జరుగుతుందనుకున్నాను. కానీ నీ బాధని నువ్వు నీలోనే దాచుకున్నావు. అలా, అక్కడ నా ప్లాను ఫెయిలయింది. కానీ నీ అసంతృప్తిని ప్రియంవదతో గడపటం ద్వారా తీర్చుకోవాలనుకున్నావు. మూడు రోజులపాటు హోటల్ లో గడపటం అన్న ఆలోచన ప్రియంవదకి నేనిచ్చిందే. నువ్వు ముంబాయిలో లేవని మిగతా డైరెక్టర్లకి తెలిసేలా అందుకే ముంబాయి ఫోన్ లు చేసాను. నీతో ఇంటికి ప్రియంవదా, భాస్కర్ లు పోన్ లు చేయించారు. అలా నీ చుట్టూ ఉచ్చు బిగించాను".

రవి మాట్లాడలేదు. శర్మవైపే చూస్తున్నాడు.

"ఇదంతా చెంచురామయ్య చేయిస్తున్నాడని నువ్వు అనుకుంటావని నాకు తెలుసు. అందుకే నీకు ఆలోచించుకునే టైము ఇవ్వలేదు. లాయర్ తో ఈ కేసు లాభంలేదు అని నేనే చెప్పాను. కన్విన్స్ చేశాను. కాలు కాలిన పిల్లిలా నువ్వు తిరుగుతూ వుంటే నాలో నేనే పొంగిపోతూ నవ్వుకున్నాను. అంతకుముంచు నువ్వు కొన్ని నెలలక్రితం ఇలానే కంగారుగా తిరిగావు. జ్ఞాపకం వుందా? నా భార్య తాజ్ లో నిన్ను కలుసుకోమన్నప్పుడు...."

"మేమిద్దరం ఇంతవరకు కలుసుకోలేదు. మీరనవసరంగా అపోహ పడుతున్నారు".

"తొందరలో కలుసుకుందురు గానీ" నవ్వేడు శర్మ "స్వర్గంలో...."

రవి అతడివైపు సూటిగా చూశాడు.

ఈ లోపులో ప్రియంవద చీర కట్టుకు వచ్చింది. శర్మ ఆమెతో, "నువ్వు యిక్కడే వుండు. మేమిద్దరం ఇతడితో వెళ్ళి మిగిలిన పనికూడా పూర్తిచేసుకుని వచ్చేస్తాం" అన్నాడు. ప్రియంవద రవివైపు చూసి నవ్వింది.

"పద" అన్నాడు భాస్కర్ రవి వెంటనే కదలకుండా, ప్రియంవదతో అన్నాడు. "అర్ధరాత్రి పుట్టినరోజు నాడు ఫోన్ చేయటం నుంచి, అదే మొదటిసారి మొగాడ్ని ముద్దుపెట్టుకోవటం- అనేదాకా అద్భుతంగా నటించావు ప్రియంవదా! నువ్వు నాకిచ్చిన కాగితం గుర్తుందా! పదహారేళ్ళ అమ్మాయి మాటకారి అబ్బాయంటే ముచ్చట పడుతుంది.....నిజమైన అమ్మాయెప్పుడూ తెలివితేటలకే పడిపోతుంది.... వగైరా!... అందులో చివరి వాక్యంగా ఇంకొకటి

చేర్చు....'బరితెగించిన అమ్మాయి డబ్బుకోసం ఏమైనా చేస్తుంది' అని - నాకు నిన్ను చూస్తుంటే కోపంగా లేదు ప్రియంవాదా, జాలివేస్తూంది. కేవలం నటనలోనే ప్రేమని ఇంత అద్భుతంగా చూపించగలిగిన నువ్వు, నిజంగా ప్రేమించడం నేర్చుకుని వుంటే, ఒక పురుషుడి జీవితానికి ఎంతో తృప్తిని ఇచ్చి వుండేదానివి. ఇలా శర్మలాటి నక్కల దగ్గర ఎముకలు ఎరుకుంటూ, డబ్బు ఇచ్చే సుఖాల కోసం కక్కుర్తి పడేదానివి కాదు. నా జీవితం ఏమైనా కానీ, నేను మాత్రం నేర్చుకున్న పాఠాన్ని నీకు చెపుతాను- ఆనందం అనేది పనిలో, డబ్బులో, చివరికి సెక్సులో....దేనిలోనూ లేదు. అర్ధరాత్రి దాటాక నిద్రలో మెడచుట్టూ పరుచుకునే రెండు చేతుల మధ్య నిశ్చింతలో వుంది.....నీ జీవితంలో ఏ స్టేజిలోనూ అది నీకు లభించదు శర్మ ద్వారా!"

* * *

ఆమె కిటికీ దగ్గిర నిలబడి చీకట్లోకి చూస్తూ వుంది.

ఆమె మొహం రక్తం ఇంకిపోయినట్టు పాలిపోయి వుంది. ఇన్ స్పెక్టర్ చెప్పిన ఒక వాక్యం ఆమెని కలవర పెడుతూంది.

"రవితేజ విదేశాలకి పారిపోవడానికి సాయపడుతున్నది మీ భర్తగారే" అన్న వాక్యం అది.

ఇన్నేళ్ళ వైవాహిక జీవితంలో ఆమెకి భర్త గురించి బాగా తెలుసు స్త్రీకోసం, తాగుడు కోసం, గుర్రాల కోసం ఏమైనా చేస్తాడు. తాగుడు లేకపోతే మతిభ్రమిస్తుంది. గుర్రం ఓడిపోతే పిచ్చెక్కుతుంది. తన చర్మం మీద మచ్చలే దానికి సాక్షి, బట్టల కంపెనీని దాదాపు నిర్వీర్యం చేశాడు. రవి రాకపోతే ఎప్పుడో మూతపడి వుండేది. రవి వ్యవహారాన్ని చేపట్టాక కొంతకాలం బాగానే వున్నాడు. కాని మనిషి రక్తానికి అలవాటు పడ్డ పులిలాటివాడు అతడు. రవి అన్ని ద్వారాల్ని మూసివేయటంతో అతడు ఎంత ఫ్రస్టేషన్ అయ్యాడో, తాగిన తరువాత అతడు మాట్లాడే మాటలే ఆమెకి చెప్పాయి. ఆమె ఒక ప్రేక్షకురాలిలా గమనిస్తూనే వుంది. వచ్చిన డబ్బంతా రవి తిరిగి ఆ కంపెనీలోనే ఇన్వెస్టు చేయటం, దానినే ఒక సుస్థిరత్వం కల్పించటం, ఆ capital Budget ....ఇదంతా అతఃదిని ఎంత ఇరుకున పెట్టాయో ఆమెకు తెలుసు. అతడిలోని రాక్షసుడు రోజు రోజుకి విజ్రుంభించటం భార్యగా గుర్తించింది. అటువంటిది..... తన భర్త అతడిని రక్షించటం ఏమిటి?

ఆమెలో ఏదో అనుమానం పెరిగి పెద్దదవుతూంది. అందులోనూ ఇన్ స్పెక్టర్ చెప్పినదాన్ని బట్టి ఈ రోజు ఆఖరి రాత్రి. తనేం చెయ్యగలదు? అసలు-వాళ్ళిద్దరూ ఎక్కడున్నారో కూడా తెలీదు. తన భర్త తెలివితేటలు గురించీ, క్రిమినల్ బ్రెయిన్ గురించి తన వివాహ సమయంలోనే ఆమె గుర్తించింది. రాజకీయాల్లో సర్వం పోగొట్టుకున్న తన తండ్రిని ఎలా మర్చిపోయేలా చేశాడో ఆమెకు ఇంకా గుర్తుంది. అంత క్రిమినల్ తెలివితేటలున్న తన భర్త ఈ రోజు రవిని రక్షించాడంటే-

రవి దగ్గరున్న షేర్ సర్టిఫికెట్లు...

అవును తెలివిగా వాటిని తన పేరుమీద మార్చుకోవటానికే రవిమీద ప్రేమ నటించి వుంటాడు.

కంపెనీ వ్యవహారాలన్నీ తిరిగి తన చేతుల్లోకి తీసుకోవటానికే ఇలా రక్షిస్తున్నట్లు నాటకం ఆడి వుంటాడు.

ఎలాగో విదేశాలకు వెళ్ళిపోతున్నాను అన్న భ్రమలో రవి ఆ కాగితాలన్నిటి మీద సంతకం పెట్టి వుంటాడు.

ఏం చేయాలి? ఏం చేయాలి?

ఆమె ఆలోచనల్ని చెదురుస్తూ రోడ్డుమీద దూరంగా ఒక కారు ఆగింది. ఆమె కళ్ళు చిట్లించి చీకట్లో చూసింది. అది తమ కారే. కాని అందులోంచి దిగింది తన భర్త కాదు.

ఎవరో ఇద్దరు వ్యక్తులు....

అందులో ఒక వ్యక్తి రవి.... కారు మళ్ళీ కదిలింది.

ఆమె కెందుకో భయం వేసింది. ఏదో అదృశ్యశక్తి మృత్యువుని సూచిస్తూ ఆమెకు సంకేతం పంపుతూంది.

కారు గేట్లోంచి లోపలకు వస్తూంది.

కిటికీ తెర మూసేసి ఆమె కిందకి పరుగెత్తింది.

కాని అప్పటికే ఆలస్యం అయింది.

భర్త లోపలికి వస్తూండటం చూసి ఆమె సోఫా వెనక్కు తప్పుకుంది. శర్మ మెట్లెక్కి లోపలి మేడమీదకు వెళ్తున్నాడు. ఆమెని చూడలేదు. ఆమెకి క్షణం టెన్షన్ పెరిగిపోతోంది. బయట రోడ్డు మీద రవి, మరో వ్యక్తి వున్నారు.

రవిని కలుసుకుని అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలి. ఇప్పుడు కలుసుకోలేకపోతే ఇక జీవితంలో ఎప్పటికీ అతడిని కలుసుకోలేకపోవచ్చు. తన భర్త అతడిని విదేశాలకి పంపించవచ్చు లేదా....ఆమె మరి ఆలోచించలేకపోయింది.

ఆమె కిటికీ తెర కాస్త తొలగించి చూసింది.

దూరంగా చీకట్లో రెండు ఆకారాలు అక్కడే నిలబడి వున్నాయి. అందులో ఒకరు రవి. ఆమెకి అతడు ఇంకా ఎందుకు అక్కడే నిలబడి వున్నాడో అర్ధంకాలేదు. తన భర్త ఏమైనా డబ్బు ఇస్తానన్నాడా?.... విదేశాల్లో కొంతకాలం గడపటానికి సరిపోయే డాలర్లు అందజేస్తానన్నాడా?

క్షణం క్రితం తన భర్త గురించి చెడుగా ఆలోచించినందుకు ఆమె బాధపడి సోఫా వెనుకనుంచి రాబోయింది. అదే సమయానికి శర్మ మెట్లు దిగుతూ కనిపించాడు.

అతడి చేతిలో పిస్టల్" వుంది. ఆమె కోసం వెతుకుతోంది అది.

* * *

భాస్కర్ రవితేజవేపు చూసి నవ్వేడు. రవితేజకి అర్థం కాలేదు. శర్మ తామిద్దరినీ ఇలా ఇంటిముందు వదిలేసి, కార్లో లోపలికి ఎందుకు వెళ్ళిపోయాడో?

అతడి అనుమానం గ్రహించినట్టుగా భాస్కర్ అన్నాడు.

"నీ కథకి ఇది చివరి అధ్యాయం రవితేజా! శర్మగారు తన భార్యని చంపటానికి లోపలికి వెళ్ళారు".

రవి ఉలిక్కిపడ్డాడు.

"లోపలినుంచి పిస్టల్ శబ్దం వినపడగానే నిన్ను ఇలా రోడ్డు మీద వదిలేసి వెళ్ళిపోతాను.... శర్మగారు అరుచుకుంటూ బయటకు వస్తారు.... మాధవిని చంపిన పిస్టల్ కాంపౌండ్ తుప్పలో దొరుకుతుంది..... రెండు హత్యల హంతకుడిగా నీ గురించి పోలీసులు వెతుకుతారు. నా చెల్లెలు - అదే ప్రియంవదకి, చిన్న ఇల్లు, నాకు రెండు లక్షలు..... చిన్నిల్లు అంటే అర్థం తెలుసుగా...." నవ్వేడు భాస్కర్ "తాను పార్టీనుంచి ఇంటికి వచ్చేసరికి పిస్టల్ శబ్దం వినిపించిందని, నువ్వు కిటికీలోంచి దూకి పారిపోతుండగా చూశానని శర్మగారు కోర్టులో చెప్తారు. ఎలా వుంది?"

రవి వినటంలేదు. అతడి రక్తం కుతకుత ఉడికిపోతుంది. ఆమె మరణానికి కొన్ని క్షణాల దూరంలో వుంది- అన్న ఆలోచన అతడిని నిలువునా వూపేసింది. భాస్కర్ పిస్టల్ తో నిలబడి వున్నాడు.

రక్షించాలి!
రక్షించాలి!

ఆమెని రక్షించాలి!!
తన ప్రాణం పోయినా సరే!!!

అతడు భాస్కర్ వైపు చూశాడు. తను పరుగెట్టి లోపలికి వెళితే? భాస్కర్ పిస్టల్ పేలుస్తాడు. పేల్చనీ.. తను మరణిస్తే నష్టం ఏముంది? పరువు పోయింది. ప్రతిష్ట పోయింది. హంతకుడిగా ఎలాగూ ముద్రపడింది. ఉరికంబం ఎదురు చూస్తుంది. ఇటువంటి పరిస్థితిలో ఛస్తే నష్టం ఏముంది?

తన చావు ఆమెని బ్రతికిస్తే అంతకన్నా ఏమి కావాలి? అతడు చురుగ్గా ఆలోచించాడు.

పిస్టల్ శబ్దం వినిపించగానే నతా హడావుడిగా అవుతుంది. ముఖ్యంగా శర్మ కంగారుపడి బయటకొస్తాడు. అది చాలు. తన చుట్టూ జనం మూగుతారు. తన ప్రాణాలు పోవటానికి రెండు క్షణాలు ఆలస్యమయితే చాలు. గొంతులో గాలి రెండు క్షణాలు చాలు. ఈ ఊపిరి శబ్దంగా మారి, గొంతులోంచి మాటలుగా బయటకొచ్చి, శర్మ ఘాతకాన్ని బయట పెడతాయి. ప్రపంచం నమ్మకపోయినా ఆమె నమ్ముతుంది. శేషజీవితం ఆ రక్షసుడికి దూరంగా గడుపుతుంది.

అన్నిటికన్నా ముఖ్యంగా - ఆమె బ్రతుకుతుంది.

దానికన్నా ముఖ్యంగా-

ఈ ప్రయోజనం లేని తన జీవితానికి కనీసం చివర్లోనైనా ఒక సార్ధకత ఏర్పడుతుంది.

తన శరీరాన్ని చీల్చే పిస్టల్ గుండు ఆమె మరణాన్ని ఆపే సంకేతం అయితే చాలు.

రెప్పపాటు కాలంలో అతడు ఇంత ఆలోచించాడు.

ఇక టైమ్ లేదు.

శర్మ అప్పుడే యింటి లోపలికి వెళ్ళాడు. ఇక సమయం ఎక్కువ లేదు.

అతడొకసారి గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని చటుక్కున వెనుదిరిగి, మెరుపుకన్నా వేగంగా శర్మ ఇంటివైపు పరుగెత్తసాగాడు. ఈ హఠాత్ పరిణామానికి భాస్కర్ నివ్వెరపోయినా, వెంటనే తేరుకొని, పరుగెడుతున్న రవిని వెనుకనుంచి గురిచూశాడు. ఇటువంటి విషయంలో ఎంతో అనుభవమున్నవాడిలా ఏ మాత్రం తొణక్కుండా గురి సరిగ్గా చూసి ట్రిగ్గర్ నొక్కాడు.

ఒకటి..

రెండు....

మూడు...

మూడుసార్లు నొక్కినా పిస్టల్ పేలలేదు. అతడికి సేఫ్టీక్యాచ్ గురించి గుర్తొచ్చింది. దాన్ని రిలీజ్ చేసే లోపలే రవితేజ గేట్ లోపలికి ప్రవేశించబోతున్నాడు. ఇద్దరికీ మధ్య పదిహేను గజాల దూరం వుంది. భాస్కర్ కి తను చేయబోయిన తప్పు, రవి ఆలోచన అర్ధమైంది. పిస్టల్ శబ్దం బయటకు వినిపించడానికి వీల్లేదు.

రవితేజ వెనుకే పరుగెత్తడం ప్రారంభించాడు.

అతడు ఇటువంటి విషయాల్లో ప్రొఫెషనల్. సరిగ్గా నాలుగు గజాల దూరంలో వుండగా పిస్టల్ విసిరేడు. అది రవితేజ తలకి తగిలి, గేటు ముందు పడింది.

రవికి కళ్ళు బైర్లు కమ్మాయి. అలాగే తల పట్టుకొని కూలబడి పోయాడు. శర్మ లోపల్నుంచి పరుగెత్తుకు వచ్చాడు. "ఆవిడ లోపల లేదు" అన్నాడు.

ఇద్దరిమధ్యా సూదిపడితే వినపడే అంత నిశ్శబ్ధంలోంచి.....సోఫావెనుక చప్పుడు వినిపించింది.

ఇద్దరూ చప్పున చూశారు.

వెనుకనుంచి పులి పరుగెత్తుకు వస్తుంటే ప్రాణాలకి తెగించి పరిగెత్తే జింకపిల్లలా ఆమె వాళ్ళిద్దరి మధ్యనుంచి దూసుకుపోయింది.

గాలికన్నా వేగంగా....

తుఫానుకన్నా తీవ్రంగా...

"షూట్ హర్" శర్మ అరిచాడు.

భాస్కర్ చేతిలో ఆయుధం లేదు.

"షూట్" పిస్టల్ అతడివైపు విసురుతూ అరిచాడు.

ఆ లోపులే రవి మోకాళ్ళమీద లేచాడు. అతడు కళ్ళు విప్పేసరికి ఒకవైపు భాస్కర్, కొద్దిదూరంలో శర్మ కనిపించారు. అతడు నెమ్మదిగా లేస్తూ వుండగా భాస్కర్ ఆమెవైపు పిస్తోలు గురిపెట్టడం కనిపించింది. రవి అతడివైపు దూకబోతుంటే అంత కన్నా వేగంగా భాస్కర్ అతడివైపు తిరిగాడు.

"నో..... నాట్ హిమ్!" శర్మ అరిచాడు. ఆ మాటలు అర్ధమవగానే ఆమె వెనుదిరిగింది. భాస్కర్ శర్మ మాటలు వినిపించుకోకుండా రవిని కాల్చబోతున్నాడు.

ఆమె దృష్టి తన కాళ్ళపక్క పడివున్న పిస్టల్ మీద పడింది. వంగి దాన్ని తీసుకొని, ఒక ఉన్మాదావస్థలో వున్న దానిలా వరుసగా బుల్లెట్స్ పేల్చింది.

ప్లాప్.....ప్లాప్.....ప్లాప్..

భాస్కర్ శరీరం తూట్లుపడి రక్తం కాలువలు కట్టింది. గిలగిలా కొట్టుకొని, శరీరం క్షణం తరువాత అచేతనం అయింది.

శర్మ, రవి ప్రేక్షకులు అయ్యారు.

ఆమె అలాగే నిలబడి వుంది.

పిస్టల్ నుంచి పొగలు ఇంకా వస్తూనే వున్నాయి.

ముందు మోటార్ సైకిలు వెలుతురు ఆమె మీద పడింది. తరువాత ఇన్ స్పెక్టర్ తాలూకు మోటార్ సైకిల్ ఆ ఇంటిముందు ఆగింది.

—* * * *—

## ఉపసంహారం

**"హౌ ఈజ్ ది షేర్ మార్కెట్".**

ఆమె సీట్లో కూర్చోగానే అతడు అడిగిన మొదటి ప్రశ్న అది.

"స్టేబుల్ సార్" అతడి సెక్రటరీ అంది.

సమయం పదిన్నర కావొస్తుంది.

"టర్నోవర్ ఫిగర్స్ ఇవ్వండి".

ఆమె కాగితాలు అందించింది. అతడు రెండు నిముషాలు చూసి 'గుడ్' అన్నాడు. "అమ్మకాలు ఏవీ తగ్గలేదు". ఆమె జవాబు చెప్పలేదు కానీ, మనస్సులో అనుకుంది- "ఆడవాళ్ళు ఆర్జీ చీరలు కొనటానికీ, ఆ కంపెనీ యజమాని మీద హత్యానేరపు అభియోగానికి ఏ సంబంధమూ లేదు" అని.

"షేరు మార్కెట్ ఇంకా పికప్ కాకపోవటమే ఆశ్చర్యంగా వుంది" అతనన్నాడు.

"విషయమంతా ఇంకా పేపర్లలో రాలేదు సార్. బహుశా రేపు రావొచ్చు. రేపట్నుంచీ ధర పెరగవచ్చు".

అతడు తలూపాడు.... "మీ కాలు ఎలా వుంది?"

"ఇపుడు బాగానే వుంది సార్. నో ట్రబుల్".

"ఆ రోజు నేను కిటికీలోంచి చూశాను. మీరు ఎటూ చూడకుండా రోడ్డు దాటుతున్నారు. లేకపోతే మీ మీదకు వచ్చే ఆ వెహికల్ ని చూసే వుండేవారు"

"అవును సార్".

"రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా వుండాలి".

ఆమె మాటల్లో శ్లేష ఏమీలేదు. కానీ అతడు మాత్రం ఆ మాటల్ని మనసులో మరొకసారి మననం చేసుకున్నాడు.

"నేనొక గంటలో తిరిగి వస్తాను" కుర్చీకి తగిలించిన కోటు చేతిలోకి తీసుకుంటూ అతనన్నాడు..... "నిన్నరాత్రి - కొత్తసంవత్సరం ఎలా గడిపారు?"

ఆమె నవ్వింది. "పెద్దోడికి దగ్గు, చిన్నవాడికి జ్వరం మేము పడుకునేసరికి నాలుగయింది. కొత్తయినా, పాతయినా సంవత్సరంలో ప్రతిరోజూ మాకు ఒకేలా వుంటుంది".

"అదృష్టవంతులు" మనసులో అనుకున్నాడు. అతను తన ఛాంబర్ బయటకొచ్చి చుట్టూ చూశాడు. ఎవరి పనిలో వారున్నారు. టైప్ మిషన్ శబ్దం తప్ప మరేమీ వినపడడం లేదు-అతడు క్రిందికి వస్తూంటే రిసెప్షన్ దగ్గర "ఫోన్ వచ్చింది" అని అందించింది రిసెప్షనిస్టు.

అతడు రిసీవర్ తీసుకుని "హల్లో" అన్నాడు విసుగ్గా. రాత్రంతా నిద్రలేకపోవడం వల్ల కళ్ళు మండుతున్నాయి.

"నేను.... లాయర్ రంగనాథాన్ని"

"చెప్పండి"

"కంగ్రాచ్యులేషన్స్ రవితేజ".

"చెప్పండి" క్లుప్తంగా అన్నాడు. అసలు విషయం త్వరగా చెప్పమన్నట్టు!

అవతలి వైపు నుంచి ఇబ్బందికరమైన మౌనం తటపటాయిస్తున్నట్టు రంగనాథం స్వరం వినిపించింది. "ఐ యామ్ సారీ. శర్మ మాటల్తో నేను తప్పు నిర్ణయం తీసుకోవలసి వచ్చింది".

"దట్సాల్ రైట్..."

మళ్ళీ తటపటాయింపు.

"కోయంబత్తూరు చీరల కంపెనీ ఫైలు వేరే ఇంకో లాయర్ కి యిచ్చారట".

"అవును మీరు చాలా బిజీ అయిపోతున్నారు. కొన్ని ఫైల్స్ ఇంకో లాయర్ కి ట్రాన్స్ ఫర్ చేయమని చెప్పాను...."

"కానీ...."

"నేనిప్పుడు బయటకు వెళ్తున్నాను. ఏమైనా ముఖ్య విషయాలుంటే తరువాత మాట్లాడండి. అర్జెంటేమీ లేదు. నేను విదేశాలకు పారిపోవడం లేదు. ఫోను పెట్టేశాడు.

వచ్చి కార్లో కూర్చున్నాడు.

"ఎక్కడికి సార్".

"పోలీస్ స్టేషన్ కి".

కారు అయిదు నిముషాల్లో పోలీస్ స్టేషన్ కి చేరుకుంది ఇన్ స్పెక్టర్ రాజశేఖర్ కుర్చీలో వెనక్కి తలవాల్చి నిద్రపోతున్నాడు.

"హల్లో"

రాజశేఖర్ కళ్ళు తెరచి రవితేజని చూసి "హల్లో!' అన్నాడు. ఎదురుకుర్చీలో రవి కూర్చుంటూ "హాపీ న్యూ ఇయర్!" అన్నాడు.

"మీ కోసం ఇంటికి ఫోన్ చేశాను. ఆఫీసుకి వెళ్ళిపోయారన్నారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత తొందరగా మీరు ఎడ్జెస్ట్ అయిపోతారనుకోలేదు. ఇట్సెవండర్".

రవితేజ నవ్వి వూరుకున్నాడు.

"ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే మీరింత తొందరగా పరిస్థితుల్ని కంట్రోల్ లోకి తెచ్చుకుని నిర్వహించడం...." ఇంగ్లీషులో అన్నాడు- "మిమ్మల్ని ఇపుడు చూస్తుంటే అసలు మీరేనా ఈ పదిరోజులూ అంత భయపడి అండర్ గ్రౌండ్ లోకి వెళ్ళింది- అన్న అనుమానం కలుగుతూంది. అప్పుడే లాయర్ని నియమించటం, అతడు వకాలత్ ఫైల్ చేయడం. అంతా అరగంటలో అయిపోయాయి...."

"ఆమెకేం ఫర్వాలేదుగా...."

"నో-నో-ఏమీ కేసు లేదు. ఒక మనిషిని రక్షించడం కోసం ఇంకొక మనిషిని చంపడం నేరం కాదు. మామూలు ప్రొసీజర్స్ తప్పవనుకోండి. ఆమె ప్రస్తుతం ఇంట్లోనే వున్నారు".

"ఏమంటున్నారు శర్మగారు".

"కన్ఫెషన్ స్టేట్ మెంట్ ఇచ్చాడు నేరం వప్పుకుంటూ-"

"ప్రియంవద?"

"జరిగిన హత్యకీ, ఆమెకూ ఏ సంబంధమూ లేదు. ఆమె అక్సెసరీ టూ మర్డర్ కూడా కాదు. హత్యా జరిగిన సమయంలో ఆమె అక్కడ లేదు. మామూలు పరిస్థితుల్లో అయితే ఆమె మీద కేసు అసలు నిలబడదు. కానీ శర్మ యిచ్చిన స్టేట్ మెంట్ లో తామిద్దరూ కలిసి దీన్ని ప్లాన్ చేసినట్టు చెప్పాడు. తను జైల్లో గడపవలసి వస్తోంది. ఉరికంబం ఎక్కుతున్నప్పుడు ఆమె మాత్రం ఎందుకు బయట ప్రపంచంలో వుండాలి అన్న సాడిజం" అన్నాడు.

"సాడిస్ట్" మనసులో అనుకున్నాడు రవి. అతడికి మొట్టమొదటిసారి ప్రియంవద మీద జాలేసింది. ఇంతలో ఇన్ స్పెక్టర్ అన్నాడు- "ఈ కేసులో మీరు నిర్దోషి అన్న అనుమానం నాకు ఎప్పుడు వచ్చిందో తెలుసా రవితేజా?"

"నేను మిసెస్ శర్మకి ఫోన్ చేసినప్పుడా?"

"కాదు."

"మరి?" ఆశ్చర్యంగా అడిగాడు రవితేజ.

"ముంబాయినుంచి విమానం ఆరోజు ఆలస్యంగా వచ్చింది. మీరిక్కడ హత్యచేసి తిరిగి ముంబాయి వెళ్ళి అక్కడ నుంచి రావడం అసంభవం. మీరు ఫోన్ చేసిన సమయానికి ఆ విమానం గాలిలో వుంది. పాపం భాస్కర్ కి ఆ విషయం తెలీదు. అంతకుముందు విమానంలో అతడు వచ్చేసి, మీతో ఎయిర్ పోర్టు నుంచి చేసినట్టు చేయించాడు. అప్పటినుంచీ నా ఆలోచనల్లో హంతకుడు ఎవరు అన్న ప్రశ్నే కదలాడింది తప్ప- మీరని ఎందుకో అనిపించలేదు. పేపర్లు - అరెస్టు వారంట్లూ వీటి సంగతి వదిలెయ్యండి. నా ఇన్వెస్టిగేషన్ కొనసాగింది. కానీ అది మీరెక్కడున్నారో తెలుసుకోవడం కోసం ఒక్కటే! ఒకరకంగా చెప్పాలంటే మీరు అనవసరంగా భయపడి దాక్కున్నారు".

"గిల్టీ ఫీలింగ్...దానికి లాజిక్ వుండదు".

ఇన్ స్పెక్టర్ అర్థం చేసుకున్నట్టు తలూపాడు. "నేను మీ స్టేట్ మెంట్ రికార్డు చేసుకోవడానికి రేపొస్తున్నాను. ఇంటికి వెళ్ళి పది గంటలపాటు నిద్రపోవాలి ముందు".

"ష్యూర్ ఇన్ స్పెక్టర్" అని పక్కనే అప్పటివరకు వుంచిన పాకెట్ తీసి రాజశేఖర్ అందిస్తూ, "మా కంపెనీ చీర! తీసుకోండి" అన్నాడు.

"నేను లంచాలు తీసుకోను- రవితేజా!"

"లంచం కాదు, కాంప్లిమెంటరీ".

"పదాలు వేరేగానీ, రెండింటి అర్థమూ ఒకటే".

"కాదు. నాకు మీతో ఏదైనా అవసరం వుండి యిస్తే అది లంచం. నా సంతోషంతో ఇస్తే అది కాంప్లిమెంటరీ. తీసుకోండి ప్లీజ్!" అతడు దాన్ని తీసుకుంటూ, "కొత్త సంవత్సరం రాత్రంతా ఇంటికి రానందుకు మా ఆవిడ కారాలూ, మిరియాలూ నూరుతూ ఉండి వుంటుంది".

"ఈ చీర ఆ కోపాన్ని కాస్త తగ్గిస్తుంది".

"థాంక్స్" అన్నాడు.

"మీకూ వున్నదన్నమాట ఆ ప్రాబ్లమ్?"

"ఏదీ? ఇంట్లో పోరా?"

"కాదు. తప్పుచేసి దాన్ని కప్పిపుచ్చుకోవడం....కోసం పెళ్ళానికి నగలూ, చీరలూ తీసుకెళ్ళడం-" రవితేజ నవ్వేడు.

"తప్పదు రవితేజా! ఈ ఉద్యోగంలో ఇంతే! నా మొదటి భార్య ఈ పోలీస్ స్టేషనే....రెండోది కట్టుకున్న భార్య రాత్రి పదింటికి ముందు ఇంటికి వెళితే అదృష్టమే".

"మీకెంత జీతం వస్తుంది?"

"కట్స్ పోనూ వెయ్యి".

"రెండు వేలిస్తాను. మా కంపెనీలో వచ్చి చేరండి. నేను నవ్వులాటగా అనడం లేదు. మీలాంటి సిన్సియర్ మనుషులు మాకు చాలా ఉపయోగం జీతం ఒక లెక్కకాదు. అన్నిటికన్నా ముఖ్యంగా మీకు నేను చేసే వాగ్దానం ఏమిటంటే-మా కంపెనీలో పనిచేస్తే ఏ రోజూ అయిదు దాటి పని చెయ్యనవసరం లేదు".

"నిజంగా అంటున్నారా?"

"నిజంగానే అంటున్నాను".

రాజశేఖర్ ఒక్కక్షణం ఆలోచించి, ఇబ్బందిగా "వద్దులేండి, ఇలా అలవాటయిపోయింది. రేపట్నుంచి తొందరగా వెళితే ఇంటిలో ఏం చెయ్యాలో తోచక నాకు పిచ్చెక్కే ప్రమాదం వుంది" అన్నాడు... "ఒకసారెప్పుడో తొందరగా ఇంటికి వెళితే వచ్చింది నేనేనా, ఇంకెవరైనానా అన్న అనుమానం మా వాళ్ళకు గంట వరకు వదల్లేదు".

"మనింట్లో మనం అతిధులుగా వుండడం దురదృష్టం. ప్రమాదకరం కూడా".

"నాకు ప్రమాదకరం కాదనుకుంటున్నాను".

"అదేం?"

"మా డిపార్ట్ మెంట్ లో ఆడవాళ్ళు చాలా తక్కువ. పర్సనల్ సెక్రటరీలు అసలుండరు. ఎంత గొప్ప కేసు పరిశోధించి పట్టుకున్నా అమ్మాయిలు ఆటోగ్రాఫులు తీసుకోరు".

రవితేజ మొట్టమొదటిసారిగా బిగ్గరగా నవ్వేడు.

"హాపీ న్యూ ఇయర్".

"సేమ్ టూ యూ".

కారు నెమ్మదిగా వెళుతుంది.

కూలింగ్ గ్లాసెస్ లోంచి రోడ్డు నీలంగా కనబడుతుంది. ఎయిర్ కండిషన్ కారు అవటం వల్ల చల్లటిగాలి వస్తోంది. పోలీస్ స్టేషన్ నుంచి కారు బయటకు వచ్చిన తరువాత డ్రైవర్ వెనక్కి చూసి "ఆఫీసుకా? ఇంటికా సార్" అని నమ్రతగా అడిగాడు.

అతడికి తన కనీస బాధ్యత తెలుసు......ఎక్కడికో చెప్పాడు.

**అయిపోయింది**

__****__